ఆత్మపురాణము

(ద్వితీయ భాగము)

శ్రీ శంకరానంద మునివర విరచితము

★

ఆంధ్రానువాదకులు :

శ్రీ వాసుదేవసూను జనార్దనస్వామి చైతన్యగారు

ప్రకాశకులు:

శ్రీ వ్యాసాశ్రమము

వ్యాసాశ్రమము - పోస్టు, మార్గము - యేర్పేడు,

చిత్తూరుజిల్లా. (ఆం. ప్ర.)

1971

ప్రథమ ముద్రణ 1949 సం॥ 550 ప్రతులు.
ద్వితీయ ముద్రణ 1971 సం॥ 1000 ప్రతులు.

వెల రు: 6—00

ప్రకాశకులు:—

శ్రీ వ్యాసాశ్రమము వారు

ప్రతులకు:—

మేనేజరు, శ్రీ వ్యాసాశ్రమము,
వ్యాసాశ్రమం పోస్టు - ఏర్పేడు - మార్గము,
చిత్తూరుజిల్లా. (ఆం. ప్ర.)

ముద్రణ:—

శ్రీ వేదవ్యాస ముద్రాక్షరశాల, చిత్తూరు.

ఓం

ఆత్మ పురాణము

ద్వితీయ భాగము

దశమాధ్యాయము

విషయసూచిక

ఏకాదశాధ్యాయము

ద్వాదశాఽధ్యాయము

త్రయోదశాధ్యాయము

చతుర్దశాధ్యాయము

పంచదశాధ్యాయము

షోడశాధ్యాయము

సప్తదశాధ్యాయము

అష్టాదశాధ్యాయము

సమాప్తము.

ఓమ్

శ్రీ గురుశ్శరణమ్

ద్వితీయ ముద్రణ — వక్తవ్యము.

పరిశుద్ధాత్మస్వరూపులైన ప్రియాత్మసోదరీ సోదరులారా!

జనన మరణ ప్రవాహరూప సంసారనిర్మూలనము, తత్కారణభూతమైన అజ్ఞానముయొక్క నివృత్తి బ్రహ్మాత్మజ్ఞానముచేతనే సంభవించునని సకలశాస్త్రములు ఉద్ఘోషించుచున్నవి. "జ్ఞానాదేవతు కైవల్యం, తరతి శోకమాత్మవిత్" యిత్యాది శ్రుతి స్మృతి వాక్యములు ప్రమాణములు. కాన అట్టి బ్రహ్మాత్మజ్ఞానమును సంపాదించుట సకలమానవుల కర్తవ్యము. ఆత్మజ్ఞానమును సంపాదించుటకు ఎన్నియో సాధనములు, ఉపాయములు గలవు. అన్నిటికంటెను వేదాన్తశాస్త్ర శ్రవణ మనన, నిదిధ్యాసాదులు ముఖ్యకర్తవ్యములు. జిజ్ఞాసువులైన ముముక్షువులు గురుముఖతః వేదాంత శ్రవణాది సాధనముల ననుష్ఠించి తద్ద్వారా సంసారదుఃఖమునుండి విముక్తులై ఆత్మసాక్షాత్కారమును పొందవలసియుందురు. "ఆసుప్తేరామృతేః కాలం నయేద్వేదాన్తచిన్తయా" లేచినది మొదలు నిద్రించువఱకు, పుట్టినది మొదలు మరణించువఱకు వేదాంతశ్రవణాదులతో కాలము గడుపవలయునని శ్రుతి వాక్యము చెప్పుచున్నది. నిరంతర శ్రవణాదులచేతనే ఆత్మ జ్ఞానప్రాప్తి కల్గును. వ్యవధానము సంభవించెనేని కామాదివిషయవాసనలు అంతఃకరణములో ప్రవేశించి అవిచ్ఛిన్న బ్రహ్మాకారవృత్తికి భంగము కలుగును. కాన నిరంతరము శ్రవణ మననాదులు చేయవలయునని విధింపబడినది.

వేదాంతములనగా ఉపనిషత్తులు. బ్రహ్మస్వరూపమును, బ్రహ్మజ్ఞానమును, తజ్జ్ఞానప్రాప్త్యుపాయములను గుఱించి బోధింప ఉపనిషత్తులే సమర్థములు. శ్రుతి శిరోభూతములగు ఉపనిషత్తులు బ్రహ్మతత్త్వమును గుఱించి వేనోళ్ల వర్ణించుచున్నవి. కాన ముముక్షువులు, జిజ్ఞాసువులు ఆత్మజ్ఞానప్రాప్తికై ఉపనిషత్తుల పఠింపవలసియున్నది. కాని అవి సంస్కృతభాషలో ఉన్నందున సామాన్య జను

లకు దుర్బోధ్యములు. సామాన్యజనులు దేశ భాషా గ్రంథముల ద్వారా మాత్రమే జ్ఞానమును సంపాదింప గల్గుదురు.

శ్రీ శంకరానంద మునివరులు సకల ఉపనిషత్తుల సారమును సంగ్రహించి 'ఆత్మ పురాణము'' అను పేరున 18 అధ్యాయముల గ్రంథమును సంస్కృతమున సులభ శైలిలో రచించిరి. అట్టి ఆత్మ పురాణము యిదివరలో హిందీభాషలో, తమిళములో అనువదింప బడియుండెను. దానిని శ్రీ వాసుదేవ సూను జనార్దనస్వామి చైతన్య గారు ఆంధ్ర జిజ్ఞాసువుల ఉపయోగార్థము తెలుగుభాషలో అనువదించిరి. దుర్లభమగు యీ అపూర్వ ఉద్గ్రంథము రెండు భాగములుగా శ్రీ గురుదేవులచే శ్రీ వ్యాసాశ్రమము తరపున 1946 సం॥మున ముద్రింపబడినది. అందు ద్వితీయ భాగ ప్రతులు చాలకాలమునుంచి దుర్లభముగా నున్నవి. ముముక్షువులగు భక్తులు బహుకాలమునుంచి అభ్యర్థించుచున్నారు. శ్రీ గురుదేవునియొక్క దివ్యసంకల్పముతో, తదనుగ్రహముతో తిరిగి పునర్ముద్రణమొనర్చి యిపుడు భక్తుల కందివ్వ గల్గుచున్నందులకు ఎంతయో సంతోషము.

ఈ ద్వితీయ ముద్రణమున పాఠకులకు పఠన యోగ్యముగా పద వాక్య సంస్కరణలు పెక్కు గావింపబడినవి. మఱియు విషయ పరిజ్ఞానముకొఱకై విశేషశ్రమతో ముందుగనే విస్తృతమగు విషయానుక్రమణికగూడ నిందు పూర్వముకన్న విశేషముగా చేర్చబడినది. పాఠకులకియ్యది మిక్కిలి ఉపయోగించగలదు. కాన చిర కాలమునుంచి నిరీక్షించుచున్న ఆత్మజ్ఞాన పిపాసులగు భక్తులు యీ ఆత్మపురాణ ద్వితీయ భాగమును ఆదరముతో పఠించి మననము చేసి ఆత్మానందము ననుభవించి పుణ్యజీవులగుదురుగాక!

''ఆత్మావాఽరే ద్రష్టవ్యశ్శ్రోతవ్యో మన్తవ్యో నిదిధ్యాసితవ్యః''

ఓం జయ్ గురుదేవ్

శ్రీ విరోధికృత్
శ్రావణ శు॥ పంచమి
27—7—1971.

విమలానందస్వామి.

శ్రీ

ఆత్మ పురాణము

అథ దశమాధ్యాయారంభః - దశమాధ్యాయము

నవమాధ్యాయాంతమందు తిత్తిరియను ఋషి బ్రహ్మవిద్యోపదేశమందు, విఘ్న నివృత్తికొఱకు శిష్యులకు శాంతిమంత్రపాఠము చెప్పెనను వార్తవిని. ఆ తిత్తిరిమునిచే నుపదేశింపబడిన వచనరూప బ్రహ్మవిద్యను వినవలయునని ఉత్కంఠగలవారైన శిష్యుడు, శ్రీ గురువును యిట్లు ప్రార్థన చేయుచున్నారు.

హే భగవన్! తిత్తిరియను ఋషి తన శిష్యులకు బ్రహ్మవిద్య నుపదేశించెనని చెప్పితిరి. ఆ తిత్తిరిపచించిన బ్రహ్మవిద్య వినుటకై నాకు చాల కుతూహలము గలిగె, తాము దయచేసి నా కోరికను పూర్ణముగ చేయవలయును. ఈ ప్రకారమగు శిష్యుని ప్రార్థనవిని కరుణాసాగరులైన శ్రీగురువు ఆ శిష్యునకు ఆ బ్రహ్మవిద్య చెప్పుటకు మొదలు ఆ తిత్తిరివిద్యకు ఉపోద్ఘాతముచెప్ప నారంభించెను.

పూర్వము వైశంపాయనగురువుయొక్క ఆజ్ఞచే యాజ్ఞవల్క్యముని గురుకథిత వేదవిద్యను వమనముద్వారా పారవైచి. శ్రీ సూర్యనారాయణుని శరణుబొందెనను సంగతి నీకు పూర్వము చెప్పితిని. యాజ్ఞవల్క్యముని వెడలిన తరువాత సూర్యునివలె ప్రకాశమానమైనట్టి యజుర్వేదమంత్రరూపమగు ఆ వేదవిద్య భూమిపై పతనమగుటను జూచి వైశంపాయనముని విస్మయావిష్టులై, శిష్యులగూర్చి యిట్లనియె.

ఓ శిష్యులారా! యాజ్ఞవల్క్య శిష్యునిచే శాస్త్రపద్ధతిగా ఈ యజుర్వేద మంత్రముల అధ్యయనము చేయబడియె. కావున, యీ మంత్రములు సూర్యునివలె ప్రతీత మగుచున్నవి. ఓ బ్రాహ్మణులారా! ఈ యజుర్వేదమంత్రములు బ్రాహ్మణములై అక్షయధనమైయున్నది. కాబట్టి భూమిమీద పతితమైన ఈ మంత్రములు ఎంతవఱకు

బ్రహ్మసభను పొందవో అంతవఱకు మీరందఱును [బ్రాహ్మణులు] త్వరగానే యీ మంత్రములను గ్రహణము చేయుడు. ఓ బ్రాహ్మణులారా! యాజ్ఞవల్క్యమునిచే అన్నము వలె వమనము చేయబడిన ఈ మంత్రములు మే మేలాగున గ్రహణము చేయవలయునను విచారముచే మీరు విలంబము చేయకుడు. చూడుడు - వమనము చేయబడిన ఈ మంత్రములు మనుష్యశరీరముచే భక్షణము చేయబడుటకు యోగ్యముకానివైనను, అన్యశరీరముచే భక్షణము చేయబడవచ్చును. గనుక మీ సమస్త బ్రాహ్మణులు తిత్తిరి పక్షిరూపమును ధరించి త్వరగానే మంత్రములను గ్రహణము జేయుడు.

హే శిష్య! వైశంపాయనముని యిట్లు చెప్పుటచే ఆ సమస్త బ్రాహ్మణులు, తిత్తిరిరూప ధారణముచేసి శీఘ్రముగనే ఆ మంత్రములను గ్రహణము చేసిరి. ఈ కారణమువలన వేదమందు బ్రాహ్మణులు తిత్తిరినామముచే కథనము చేయబడిరి. మఱియు, ఆ తిత్తిరిబ్రాహ్మణులచే శిష్యులకు కథనముచేయబడిన బ్రహ్మవిద్య తైత్తిరియోపనిషన్నామముచే కథనము చేయబడియె. ఆ మంత్రములకు కృష్ణ యజుర్నామము ప్రాప్తమాయెను.

హే శిష్య! వనమందు స్థితమై పఠనము చేయబడదగిన ఆ మంత్రములందు కథనము చేయబడిన బ్రహ్మవిద్యను సావధానులై శ్రవణము చేయుడు. ఆ బ్రహ్మవిద్య యందు, ఆనందవల్లి భృగువల్లియను రెండువల్లులుగలవు. మొదట ఆనందవల్లి చెప్పెదను. సూత్రము – "బ్రహ్మవిదాప్నోతిపరమ్" భావార్థము - బ్రహ్మము నెఱిగిన వాడైన పురుషుడు పరమపదము పొందుచున్నాడు. ఈ ఒక్క సూత్రవచనమందే సంపూర్ణ బ్రహ్మవిద్య స్థితమైనది. (అల్పాక్షరములుగల్గి బహ్వర్థసూచకమగు వచనము సూత్రమనబడును.) ఇప్పుడాగూఢార్థ స్పష్టీకరణముకొఱకు మొదట విషయ ప్రయోజన అధికారి సంబంధములను నీ యనుబంధచతుష్టయవర్ణనము గావింపబడును. (దేని యొక్క జ్ఞానముచే, అధికారికి ఆ శాస్త్రమందు ప్రవృత్తి యగుచున్నదో అది అను బంధము.)

ఎచ్చట ఏ శాస్త్రజన్యప్రమాణజ్ఞానముచే నివృత్తమగుటకు యోగ్యమైన ఏ యజ్ఞానముగలదో, ఆ యజ్ఞానముచే ఆవృతమైన పదార్థము ఆ శాస్త్రమునకు విషయము. ఈ ప్రసంగమందు ఈ తైత్తిరీయ శాస్త్రముచే జన్యమైన ప్రమాణజ్ఞానముచే నివృత్తమగుటకు యోగ్యమైన యే అజ్ఞానముగలదో, ఆ యజ్ఞానముచే బ్రహ్మము ఆవృతమైయున్నది. కనుక ఆ బ్రహ్మము, ఈ శాస్త్రమునకు విషయమగును. ఏలాగుననగా "బ్రహ్మవిదాప్నోతిపరమ్" అను నీ వాక్యమందు స్థితమైన బ్రహ్మశబ్దము వినుటచే సామాన్య

రూపముగ బ్రహ్మముయొక్క జ్ఞానమైనను, ఆ బ్రహ్మము జీవుల కాత్మరూపమై యున్నదా? అథవా, ఆత్మకన్న భిన్నమైయున్నదా? ఆ బ్రహ్మము చైతన్యరూపమా? జడరూపమా? ఈ మొదలగు అనేక ప్రకార సంశయములు బ్రహ్మమందగుచున్నవి. ఆ సంశయముల నివృత్తి ఉత్తరవాక్యములచే నగుచున్నది. కనుక సూత్రరూపవచనము ఉక్తప్రశ్నసంబంధ యుత్తరముకొఱకు అధికారికి జిజ్ఞాస పుట్టించుచున్నది. ఇప్పుడు ప్రయోజనము వచింపబడుచున్నది. ప్రయోజనము ద్వివిధము. ఒకటి గౌణము, ఒకటి ముఖ్యము. అట బ్రహ్మమును, విషయముచేయునట్టి ఏ అంతఃకరణ వృత్తి రూపజ్ఞానము గలదో, ఆ జ్ఞానము వేదాంత శాస్త్రమునకు గౌణప్రయోజనము. మఱియు, సంపూర్ణానర్థనివృత్తిపూర్వకముగ బ్రహ్మభావప్రాప్తి ముఖ్య ప్రయోజనము. ఇప్పుడు అధికారి వచింపబడుచున్నాడు. ఏ పురుషునకు ఉక్తమగు రెండు ప్రయోజనముల యిచ్ఛగలదో, మఱియు నెవరు వివేక వైరాగ్యాది సాధనములచే సంపన్నుడో, అత దధికారి యనబడును. ఇప్పుడు సంబంధము వచింపబడుచున్నది. వేదాంతశాస్త్రము నకు సంబంధము, యోగ్యతానుసారముగ అనేక ప్రకారమగుచున్నది, అట యధి కారికి, శాస్త్రమునకు పరస్పరబోధ్యబోధక భావసంబంధముగలదు. అధికారి బోధ్యము, శాస్త్రము బోధకము, బ్రహ్మజ్ఞానమునకు వేదాంత శాస్త్రమునకు పరస్పర జన్యజనకభావ సంబంధము కలదు. జ్ఞానము జన్యము. శాస్త్రము జనకము. బ్రహ్మము అభివ్యంగ్యము. శాస్త్రము అభివ్యంజకము. పూర్వసిద్ధమైన వస్తువుయొక్క ప్రతీతికి విషయము అభి వ్యంగ్యము. పూర్వసిద్ధవస్తువుయొక్క ప్రతీతిగావించునది అభివ్యంజకము. ఎట్లు హరీతకి ఆమలకాది భక్షణము పూర్వసిద్ధమైన జలసంబంధ మధురరసముయొక్క ప్రతీతిగావించుచున్నదో, అట్లే వేదాంతశాస్త్రమున్ను, పూర్వసిద్ధ బ్రహ్మముయొక్క సాక్షాత్కారము చేయించుచున్నది. అందువలన శాస్త్రము అభివ్యంజకము. అజ్ఞాన వేదాంతశాస్త్రములకు పరస్పర నివర్త్య నివర్తకభావ సంబంధముగలదు. అజ్ఞానము నివర్త్యము. శాస్త్రము నివర్తకము.

హే శిష్య! "బ్రహ్మవిదాప్నోతిపరమ్" అను వచనముచే కేవలము నాల్గు అనుబంధములు మాత్రము సూచనచేయబడలేదు. ఈ తైత్తిరీయోపనిషత్సమాప్తి పర్యంతము ఈ సూత్రవచనమునకే విస్తారవ్యాఖ్యానమైనది. ఇప్పుడా సూత్రవచనము నకు సంక్షిప్త వ్యాఖ్యానము గావింపబడుచున్నది. "బ్రహ్మవిదాప్నోతిపరమ్" అను నీ వచనమందు స్థితమైన బ్రహ్మపదముచే శ్రుతియందు తత్పదార్థ పరమాత్మదేవుని కథనము చేయబడియె. లక్షణము ప్రమాణములేక, ఏ వస్తువుయొక్కయు సిద్ధికాదు. గనుక బ్రహ్మమునకును ఏదో ఒక లక్షణము చెప్పవలసినది. అచ్చట లక్షణము

ద్వివిధము. ఒకటి స్వరూపలక్షణము. ఒకటి తటస్థలక్షణము. ఏ యసాధారణ ధర్మరూపలక్షణము తన లక్ష్యపదార్థముకన్న అభిన్నమై ఆ లక్ష్యపదార్థమును యితర పదార్థములకన్న భిన్నముగచేసి తెలిపించునో, ఆ యసాధారణ ధర్మము స్వరూప లక్షణమగును. మఱియు, ఏది తన లక్ష్యపదార్థమందు ఒకానొకప్పుడు విద్యమానమై ఆ లక్ష్యపదార్థమును యితర పదార్థములకన్న భిన్నముగచేసి తెలిపించునో, ఆ యసా ధారణధర్మము తటస్థలక్షణమగును. "సత్యం జ్ఞానమనన్తంబ్రహ్మ" యను శ్రుతి వచనము ఆ బ్రహ్మమునకు స్వరూపలక్షణముగ కథనము చేయుచున్నది. అభి ప్రాయము - ఏ బ్రహ్మముయొక్క సాక్షాత్కారముచే అధికారిపురుషులు మోక్షరూప పరమపదమును పొందుదురో, ఆ బ్రహ్మము సత్యజ్ఞానానంద స్వరూపమైయున్నది. ఈ లక్షణ వాక్యమందు కొందఱు వేదవేత్తలు శాస్త్రదృష్టి నంగీకరించి సత్యస్వరూప బ్రహ్మము, జ్ఞానస్వరూపబ్రహ్మము, అనంతస్వరూపబ్రహ్మము, అను ఈ మూడు లక్షణములచే బ్రహ్మమును నెఱుగుచున్నారు. మఱియు కొందఱు వేదవేత్తలు లోక దృష్టి నంగీకరించి, సత్యజ్ఞానానందరూపబ్రహ్మము గలదని ఒకే లక్షణముచే బ్రహ్మము నెఱుగుచున్నారు.

ఇప్పుడు ఈ రెండు పక్షములందు మొదట మూడు లక్షణములు గల పక్షము వచింపబడుచున్నది. హే శిష్య! 'సత్యం జ్ఞానమనన్తం బ్రహ్మ' అను శ్రుతియందు ఏ సత్యశబ్దము కలదో, ఆ సత్యశబ్దమునకు త్రికాలనాశరహితవస్తువే అర్థమైయున్నది. మఱియు, ఏ వస్తువు నాశరహితమగునో, ఆ వస్తువు జడరూపముగానేరదు. జ్ఞాన రూపమేయగును. గనుక సత్యశబ్దార్థము జ్ఞానశబ్దార్థముకన్న భిన్నముకాదు. ఎట్లు రజ్జువునందు సర్పదండాదులు కల్పితములో, అట్లే సంపూర్ణజడదృశ్యపదార్థములు చైతన్యజ్ఞానరూప ద్రష్టయందు కల్పితములగును. ఇటువంటి సర్వజడ ప్రపంచము నకు అధిష్ఠానమైన చైతన్యరూపజ్ఞానమందు పరిచ్ఛిన్నత సంభవింపదు. గనుక ఆ చైతన్యరూపజ్ఞానము అనంతరూపమేయగును. ఇట్లు చెప్పుటచే 'సత్యస్వరూప బ్రహ్మము' అను నీ లక్షణమందు సత్యశబ్దముచే సత్యజ్ఞానానంత వస్తువుయొక్కయు, బోధయగుటవలన, ఈ లక్షణమునకు జడపరిచ్ఛిన్నపదార్థములందు అతివ్యాప్తిగానేర దని సిద్ధించుచున్నది. అట్లే జ్ఞానస్వరూపబ్రహ్మము అను నీ లక్షణమునందును, జ్ఞాన శబ్దముచే, జ్ఞాన సత్యానంత వస్తువుయొక్కయు, అనంత స్వరూపబ్రహ్మము అను నీ లక్షణమునందు, అనంతశబ్దముచే అనంత సత్యజ్ఞానవస్తువుయొక్కయే బోధయగు చున్నది. గనుక వేరువేరైన త్రివిధలక్షణములకును అతివ్యాప్తిగానేరదు. కాని సత్య జ్ఞానమనంతమను నీ మూడు బ్రహ్మమునకు భిన్నభిన్న లక్షణములైయున్నవి. అభి

ప్రాయము - అతివ్యాప్తి, అవ్యాప్తి, అసంభవము ఈ మూడు దోషముల నివృత్తి కొఱకు ఈ లక్షణమందు మూడు పదములు నివేశము చేయబడినవి. ఆ అతి వ్యాప్త్యాదిదోషముల నివృత్తి ఒకానొకపుడొకే పదముచే నగుటకు శక్యమైనపక్షమందు, ఆ లక్షణమందు రెండవ పదమునకు నివేశము వ్యర్థమగును. గనుక శ్రుతివచనముచే బ్రహ్మమునకు వేరువేరుగానే మూడు లక్షణములంగీకరించుట యుచితము.

ఇప్పుడీ యర్థమే స్పష్టీకరింపబడుచున్నది. ఏ వస్తువు త్రికాలమందును, అన్యథాభావమును పొందదో, ఆ వస్తువునకుపేరు సత్యము. ఇటువంటి సత్యశబ్దార్థము ఆనంద స్వరూపాత్మయందే ఘటించుచున్నది. అనాత్మపదార్థమందు ఘటించదు. మఱియు జగదాత్మరూపుడైన ఈ యాత్మదేవుని నాశముచేయునట్టి యే కారణమున్ను లేదు. కనుక నాశరహితుడైన ఈ యాత్మదేవునియందే సత్యరూపత సంభవించు చున్నది. అథవా — ఏ వాది ఆత్మకు నాశముగలదనుచున్నారో, ఆ వాది నిట్లడుగ వలయును. ఆత్మయొక్క నాశము, జీవులకజ్ఞాతమా! జ్ఞాతమా! అజ్ఞాతమను ప్రథమపక్షము సంభవింపదు. ఏలాగుననగా "సా మే మాతావంధ్యా" ఆ నాతల్లి గొడ్రాలు యనినప్పుడు ఆ వచనము యెట్లు వ్యాఘాతదోషయుక్తమో అట్లే ఆత్మ నాశవంతమనినప్పుడు వాది వచనమున్ను వ్యాఘాతదోషయుక్తమే యగును. అథవా — ఏ పదార్థము యే జీవునకును జ్ఞానముకాదో, ఆ పదార్థమందు, సత్యరూపతసంభవింపదు. పైగా అసత్యరూపతయే సంభవించును. ఏ జీవునకును జ్ఞాతముగానివైన వంధ్యాపుత్రా దులవలె సర్వజీవులచే అజ్ఞాతమైన ఆత్మ నాశమున్ను అసత్యమే యగును. మఱియు, జ్ఞాతమను ద్వితీయపక్ష మంగీకరించిన వాది నిట్లడుగవలెను. ఆ యాత్మ నాశమునకు జ్ఞాత ఎవడు? ఆత్మయా? అనాత్మయా? అట అనాత్మయను ద్వితీయపక్షము సంభవింపదు. ఎందుకనగా, అనాత్మపదార్థములన్నియు జడములు గాన తమ్ము నెఱుగవు. ఇతరుని యెఱుగవు. కనుకనే వాటికి జడమనిపేరు. అట్టి వాటిని జ్ఞాత మనుట విరుద్ధము. మఱియు, జ్ఞాత ఆత్మయను ప్రథమపక్ష మంగీకరించిన వాది నిట్లడుగవలెను. ఆత్మయొక్క నాశమును విశిష్టాత్మ యెఱుగుచున్నదా? అథవా — అవిశిష్టాత్మ యెఱుగుచున్నదా? విశిష్టాత్మయో తన నాశము నెఱుగుటకు సమర్థముకాదు. లోకమందు ఒక పురుషుని నాశము అన్యపురుషుడే యెరుగుచున్నాడుగాని, తన నాశము తానెవడును యెఱుగడు. అవిశిష్టాత్మయను రెండవపక్షమున్ను సంభవింపదు. ఎందుకనగా, ఆత్మ విద్యమానమైయుండగా ఆత్మయొక్క నాశము సంభవింపదు. మఱియు ఏ యొక పదార్థమైనను, విద్యమానమైయుండిన పక్షమందే తద్జ్ఞానమగు చున్నది. కాన అవిద్యమానమైన తన్నాశముయొక్క జ్ఞానము ఆత్మకెట్లగును?

వాది — ఓ సిద్ధాంతీ! విద్యమానపదార్థమునకే జ్ఞానమగునను నియమము లేదు. అసత్యపదార్థజ్ఞానమున్ను గాంచబడుచున్నది. ఎట్లు శత్రువునందు మిత్రత అత్యంతా సత్యమైయున్నను, భ్రాంతపురుషునకయ్యది యెట్లు ప్రతీతమగుచున్నదో, అట్లే అత్యంతా సత్యమైన ఆత్మనాశమునకున్ను జ్ఞానము సంభవించును గదా!

సిద్ధాంతి — హే వాదిన్! అసత్యమైన ఆత్మనాశమును ఆత్మయెఱుగుచున్నాడు. అను నీ ప్రకారము నీవంగీకరించిన పక్షమందు, ఆ యాత్మనాశమునకు వంధ్యా పుత్రాదులతోటి తుల్యత ప్రాప్తమగును. అది మాకంగీకారమేయైయున్నది. అభిప్రాయము — ఏ స్థలమందు వస్తువుయొక్క అభావమున కభావము బోధనచేయబడినదో, ఆ స్థలమందావస్తువునకు విద్యమానత సిద్ధించుచున్నది. అట్లే ఆత్మనాశము సత్యమనుటచే ఆత్మకు సత్యరూపతయే సిద్ధించుచున్నది. ఆ యాత్మసత్యత మాకిష్టమేయైయున్నది.

హే శిష్య! ఈలాగున ఈ యాత్మదేవుడు వినాశరహితుడు గనుక ప్రియతముడుగాను, ప్రియతముడగుటవలన పరమానందస్వరూపుడుగా నున్నాడు. మఱియు, ఈ యానందస్వరూపాత్మ కన్న భిన్నమైన స్త్రీపుత్రధనాది ఎన్నిపదార్థములు జీవులకు సుఖకారణములైయున్నవో, తత్ప్రాప్తిచే నుత్పన్నమైన ఏ యంతఃకరణ పరిణామ రూపసుఖముకలదో, ఆ సుఖసహితముగా పుత్రాదిపదార్థములు జీవులకు ప్రియములైనను అవి ఆత్మకొఱకే ప్రియమగుచున్నవిగాని, స్వభావముగ పుత్రాదులందు ప్రియరూపతలేదు. ఒకచో పుత్రాదులందు స్వభావసిద్ధ ప్రియరూపతయుండిన పక్షమందు, ఏకాలమందు పుత్రాదులు ప్రతికూలమగుదురో, ఆ కాలమందును ఆ పుత్రాదులందు ప్రియరూపత గావలసియుండెను! అట్లగుటచే దీనివలన, పుత్రాదులందు, స్వభావసిద్ధ ప్రియరూపతలేదని తెలియుచున్నది. మఱియు తన ఆత్మయందు జీవులకే ప్రియత గలదో, అది ఎవనికొఱకును లేదు. ఏ నిమిత్తముచేతనులేదు. మఱి యేమనిన, తమ ఆత్మదేవుడు స్వభావసిద్ధముగనే ప్రియతముడుగా నున్నాడు.

శిష్యుడు — హే భగవన్! ఆత్మభిన్నమగు ఏ యొక పదార్థమందును ప్రియరూపతలేనపుడు ఆత్మయందు ప్రియతమరూపతయు సంభవింపదు. ఎందుకనగ, ప్రియ ప్రియతరములను నీ రెంటియొక్క అపేక్షచేతనే ప్రియతమరూపత సిద్ధించుచున్నదిగదా?

గురువు — హే శిష్య! వాస్తవ విచారముచే చూచినపుడు ఏ యొక అనాత్మ పదార్థమందును ప్రియరూపత ప్రియతరరూపత లేదు. అట్లైనను లోకదృష్టి ననుసరించి

ప్రియ, ప్రియతరరూపత చెప్పబడియె. అప్పుడు ప్రియమైన పుత్రాదులు, ప్రియతరమైన విషయసుఖము యివి యెవరికొఱకుగలవో, ఆ యాత్మ ప్రియతమరూపమని చెప్పబడియె. ఈలాగున వినాశరహితమైన ఆత్మ పరమానందరూపుడుగా నున్నాడు.

శిష్యుడు — హే భగవన్! "సత్యం జ్ఞానమనన్తం బ్రహ్మ" శ్రుతియందు, బ్రహ్మము సత్యజ్ఞానానంతరూపముగ చెప్పబడియె. మీరు నానాయుక్తులచే ఆత్మయందు సచ్చిదానందరూపతను సిద్ధింపచేయుచున్నారు.

గురువు — హే శిష్య! వ్యాకరణరీతిగా ఆత్మశబ్దమున కర్థము బ్రహ్మశబ్దమున కర్థము ఒకే వ్యాపక చైతన్యమైయున్నది. ఈ విషయము చతుర్థాధ్యాయమందు చెప్పబడియె. కనుక "సత్యం జ్ఞానమనన్తం బ్రహ్మ" అను నీ శ్రుతియందు, స్థితమైన బ్రహ్మశబ్దముచే ఆనందస్వరూపాత్మయే లక్ష్యరూపముగా కథనము చేయబడియున్నది. ఆ యానందస్వరూపాత్మ వినాశరహితుడగుటవలన, ఆ యవినాశాత్మయొక్క సత్యాదిలక్షణములు బ్రహ్మమునకు, బ్రహ్మ సంబంధ సత్యాదిలక్షణములు ఆత్మకును సిద్ధించుచున్నవి.

శిష్యుడు :— హే భగవన్! బ్రహ్మస్వరూపభూతసత్యాదిపదార్థములందు బ్రహ్మలక్షణరూపత సంభవింపదు. ఎందుకనగా, లోకమందు పరస్పరభేదముగల పదార్థములందే పరస్పరలక్ష్యలక్షణభావమగును, భేదములేక గానేరదు.

గురువు :— హే శిష్య! ఆ లక్ష్యలక్షణభావము తన సిద్ధికొఱకు కల్పితభేదమునపేక్షచేయుచున్నదా? అథవా, వాస్తవభేదమునపేక్షచేయుచున్నదా? అట కల్పితభేదమునపేక్షించువను ప్రథమపక్షము నంగీకరించినపుడు, మా సిద్ధాంతమునకు హాని కాన మేము కల్పితభేదమునే యంగీకరించెదము. మఱియు వాస్తవభేదాపేక్షయను ద్వితీయపక్షమంగీకరించిన మాత్రమున నది సంభవింపదు. ఎందుకనగా, లోకమందు లక్ష్యలక్షణపదార్థము లెన్నిగలవో, వాటికి పరస్పర భేదము వాస్తవముగలేదు. కల్పితముగ గలదు. ఎపుడు లోకప్రసిద్ధ లక్ష్యలక్షణ పదారములయందే భేదము కల్పితమైనదో, అపుడద్వితీయ బ్రహ్మరూప లక్ష్యమందు, సత్యాదిలక్షణముల భేదము కల్పితమని వేరు చెప్పనేల!

ఇప్పుడు లోకప్రసిద్ధ కల్పితపదార్థములు వచింపబడుచున్నవి. గంధముగలది పృథ్వి. మఱియు పృథ్వీత్వజాతిగలది పృథ్వి. ఈ మొదలుకొని అనేక ప్రకారలక్షణములు పృథివ్యాదిపదార్థములకు నైయాయికాది వాదులచే కల్పింపబడియె. అట గుణరూపలక్షణము, జాతిరూపలక్షణము, వాస్తవముగ ఆ పృథ్వీరూపలక్ష్యముకన్న

భిన్నములుకావు. ఏలననగా. అవి భిన్నమైన పక్షమందు గోవునకును, అశ్వమునకును వాస్తవభేదము గలదు. కాన, అప్పుడెట్లు గోవు అశ్వమునకు ధర్మముకాదో, అశ్వము గోవునకు ధర్మముకాదో, అట్లే జాతిగుణ రూపలక్షణమునకు పృధ్వీరూపలక్ష్యమునకు పరస్పర ధర్మధర్మిభావము సిద్ధింపదు. మఱియు వేటి పరస్పర ధర్మధర్మిభావ సంబంధమగునో ఆ పదార్థములకే పరస్పరలక్షణ లక్ష్యభావ సంబంధమగును. దీని వలన పృధివ్యాదిలక్ష్యపదార్థములందు గుణజాత్యాదిలక్షణభేదములు వాస్తవముగ లేవని సిద్ధించుచున్నది. అవి నైయాయికాదివాదులచే స్వబుద్ధిచే కల్పింపబడి యున్నవి. అథవా, ఒకచో గంధగుణాదిలక్షణములు పృథివ్యాదిలక్ష్యపదార్థముల కన్న వాస్తవముగ భిన్నమైనపుడు ఎట్లు ఘటమునకు పటముతోటి వాస్తవభేద మగుటవలన, ఘటము పటముకన్న భిన్నమై ప్రతీతమగుచున్నదో, అట్లే పృథివ్యాది లక్ష్యపదార్థములకన్న గుణాదిలక్షణములున్ను భిన్నముగా ప్రతీతముగావలసియుండె, అట్లు ప్రతీతమగుటలేదు. కనుక వాటికి వాస్తవభేదము సిద్ధింపదు. ఆ భేదము కల్పితమే యగును, ఆ కల్పితభేదము నంగీకరించియే వాటికి పరస్పరలక్ష్యలక్షణ భావము సంభవించుచున్నది, అట్లే అద్వితీయబ్రహ్మమందు సత్యాదిలక్షణములకు కల్పితభేదమంగీకరించి, శాస్త్రవేత్త వాటికి పరస్పరలక్ష్యలక్షణభావము కథనము చేయుచున్నారు.

హే శిష్య! ఎట్లు అద్వితీయబ్రహ్మమందు కల్పితభేదమంగీకరించి బ్రహ్మ రూపతగలదో, కల్పితభేదమంగీకరించియే బ్రహ్మమునందు ఆత్మరూపత, ఆనంద రూపత, సత్యరూపత, జ్ఞానరూపత, ప్రకాశరూపత ఈ యైదు ధర్మములు లక్షణము లైయున్నవి. ఈ కారణమువలన వేదవేత్త ఆ యధిష్ఠానరూపసాక్షియగు ఆత్మకు బ్రహ్మ మొదలగు షణ్ణామములు కథనము చేయుచున్నారు.

హే శిష్య! ఎట్లు వాస్తవముగ గంధర్వరహితమైన ఆకాశమందు గంధర్వ నగరము కల్పితమై యున్నదో, అట్లే వాస్తవముగ జగద్భావరహితమైన ఆత్మయందు సంపూర్ణ జగత్తు కల్పితమైయున్నది. ఆ జగత్తు అవివేకులకు నిత్యరూపమై, త్రికాల యుక్తమై నామరూపక్రియాస్వరూపమై సదసద్రూపమైయున్నది. ఇంద్రియ జన్య జ్ఞానమునకు విషయమైనది సత్తు, అవిషయమైనది అసత్తు, ఇటువంటి కల్పిత జగత్తు నకు అధిష్ఠానరూపుడైన ఆత్మదేవునే విద్వాంసులు సత్యాదిషణ్ణామములచే కథనము చేయుచున్నారు. ఈ ప్రకారముగ బ్రహ్మవేత్తలు శాస్త్రదృష్టి నంగీకరించి ఆ అద్వి తీయబ్రహ్మసంబంధ సత్యజ్ఞానానంతములను నీ మూడు లక్షణముల నంగీకరించు చున్నారు.

"సత్యంజ్ఞానమనన్తం బ్రహ్మ" అను నీ శ్రుతివచనమందు లోకదృష్టి నంగీకరించి ఏ విద్వాంసులు లొకేలక్షణ మంగీకరించుచున్నారో, ఆ విద్వాంసు లిట్లందురు. "సత్యం జ్ఞానమనన్తం బ్రహ్మ" అను నీతియందు స్థితములైన మూడు పదములు చేరి అద్వితీయబ్రహ్మమున కొకే లక్షణము సిద్ధించుచున్నది. అభిప్రాయము- 'సత్యం బ్రహ్మ' ఇదియే బ్రహ్మలక్షణమనిన పక్షమందు, నైయాయికులు సత్తాజాతిగల ద్రవ్యగుణకర్మములను సత్యమనుచున్నారు గాన వాటియందాలక్షణముయొక్క అతి వ్యాప్తియగును. అథవా, బ్రహ్మమునకు పరమార్థ సత్త, ఆకాశాదిప్రపంచమునకు వ్యావహారికసత్త, శుక్తిరజతాదులకు ప్రాతిభాసిక సత్త. ఈ మూడు సత్తల నంగీక రించిన వేదాంతమతమందును దానికి అతివ్యాప్తియగును. మఱియు జ్ఞానరూపము బ్రహ్మము. యింతమాత్రమే బ్రహ్మలక్షణము నంగీకరించిన, నైయాయికులు జ్ఞాన మాత్ర గుణమని యంగీకరించుచున్నారు. గాన దానియందును అతివ్యాప్తియగును, సిద్ధాంతి అంతఃకరణవృత్తిని జ్ఞానమనుచున్నారు గాన దానియందును అతివ్యాప్తి యగును. మఱియు, అనంతరూపము బ్రహ్మము, ఇంతమాత్రమే బ్రహ్మలక్షణ మంగీకరించిన నైయాయికులు ఆకాశాదిపదార్థములను నిత్యమని అనంతమని అంగీక రించుచున్నారు. గాన దానియందు అతివ్యాప్తియగును. కనుక సత్యజ్ఞానానంతము లను నీ మూడు పదములందు ఒక్కొక్కపదమును లక్షణముగగైకొనక మూడు పదములచేర్చి అద్వితీయబ్రహ్మమునకు ఒకేలక్షణము వచించుచున్నారు.

హే శిష్య! అద్వితీయ బ్రహ్మము మనోవాక్కుల కవిషయము, ఈ యద్వైత పక్షము నెఱిగినవారైన సిద్ధాంతులమగు మా మతమందేలాగైనను ఆ బ్రహ్మసంబంధ అద్వైతరూపతకు హాని గానేరదు.

హే శిష్య! వేదాంతతాత్పర్యమెఱిగినవారైన నృసింహాశ్రమాది విద్వాంసుల అభిప్రాయమును వినుము. ఆ బ్రహ్మరూపాత్మయందు ఒకచో సహస్రప్రకారములగు, అభావములుండిన పక్షమందు నిశ్శంకముగానుండుగాక! దానినంగీకరించుటయందు కించిన్మాత్రమును మాకు హానిలేదు. ఎందుకనగా అద్వైతప్రపంచముయొక్క అభావము వంధ్యాపుత్రునివలె తుచ్ఛమైయున్నది. అది అద్వైతమునకు హానిచేయుట యందు సమర్థముకాదు.

హే శిష్య! ఏ వాది అభావములవలన అద్వైతమునకు హానియగుననుచున్నాడో, ఆ వాదినిట్లడుగవలయును. ఆయభావములు తమ స్వరూపమునుండియే భేదమును

బొంది అద్వైతమునకు హాని చేయుచున్నవా? అథవా, తమ ప్రతియోగియొక్క భేదముచే భేదముబొంది చేయుచున్నవా? అథవా, ఆయభావములను విషయము చేయునట్టి ఏ శబ్దరూపజ్ఞానరూపమగు వ్యవహారముగలదో. ఆ వ్యవహారభేదముచే భేదముబొంది హానిచేయుచున్నవా! అట ప్రథమపక్షము సంభవించదు. ఎందుకనగా లోకమందెన్ని యభావములుగలవో, ఆ యభావములకు, ప్రతియోగి భేదము లేక స్వరూపముగ భేదముగలదని ఏ వాదియు అంగీకరింపదు. మఱియు, ప్రతియోగి భేదముచే నను ద్వితీయ పక్షమును సంభవించదు. ఎందుకనగా ఏకాలమందు జగత్కారణరూపావిద్య విద్యమానమైయున్నదో ఆ కాలమందు ప్రతియోగిపదార్థభేదముచే అభావమునకు భేదము సంభవించినను ఏ కాలమందు అధికారిపురుషులకు ఆత్మసాక్షాత్కారమగునో, ఆ కాలమందు ''నేహ నానాఽస్తి కించన'' అనునట్లు అద్వైత ప్రపంచములేదు. ఈ శ్రుతిరూపనృసింహము కార్యసహితావిద్యను భక్షణము చేయుచున్నది. ఈలాగున జ్ఞానావస్థయందు నాశమును పొందిన ప్రతియోగి పదార్థములందు ఆ యభావములను భేదసంబంధకారణత సంభవింపదు. ఏలాగుననగా, లోకమందు విద్యమాన పదార్థమే అభావములభేదమును పుట్టించుచున్నది. ఎట్లనగా, విద్యమానమైన ఘటపటాదిప్రతియోగియే ఘటాభావ పటాభావాదులకు భేదమును గలుగజేయుచున్నది. మఱియు తన వ్యవహారభేదముచేత భేదమను తృతీయపక్షమున్ను సంభవింపదు, ఎందుకనగా,

అభావసిద్ధిచేయునట్టి జ్ఞానము, మఱియు అభావబోధనచేయునట్టి శబ్దము, ఈ రెండింటికి నామము వ్యవహారము, ఆ వ్యవహారమందు భేదము స్వరూపముగ లేదు. ఆ యభావసంబంధ ప్రతియోగిపదార్థభేదాపేక్షచేతనే భేదమగుచున్నది. ఎట్లనగా ఘటపటరూపప్రతియోగిభేదాపేక్షచేతనే ఘటాభావము, పటాభావము, ఈ ప్రకారజ్ఞానరూపవ్యవహారములకును, శబ్దరూపవ్యవహారములకును పరస్పర భేదమగుచున్నది. ఆ వ్యవహారముల భేదమును విషయముచేయునట్టి వ్యవహారము అజ్ఞానావస్థయందు సంభవించుచున్నను, జ్ఞానకాలమందు అధికారునిబుద్ధి సకలానాత్మ వ్యవహారముల పరిత్యాగముచేసి కేవలానందస్వరూపాద్వితీయాత్మయందు ఏకాగ్రతను పొందుచున్నది. సమస్త ప్రతియోగిపదార్థములు ఆత్మసాక్షాత్కారమగుట తోడనే నాశమును పొందుచున్నవి. కనుక జ్ఞానావస్థలో అద్వితీయాత్మయందు, నానా ప్రకార యభావములుండవు. కారణ సహిత సకల ప్రపంచమున కొకే యభావముండును.

శిష్యుడు — హే భగవన్! ఆయొక్క యభావమే ఆత్మసంబంధ అద్వితీయతకు హానిచేయునుగదా! — శ్రీ గురువు హే శిష్యా! వాస్తవవిచారముచే చూచినపుడు

ఆయొక్క యభావమున్ను, అధిష్ఠానాత్మతో భిన్నమై స్థితముకాదు. ఆత్మరూపమే యగును. (కల్పిత సర్పాభావము, రజ్జురూపమువలె.) ఈలాగున లౌకికదృష్టి యంగీకరించిన గూడ, అధిష్ఠానముచే భిన్నమైన ప్రసిద్ధాభావమునకును, సత్తప్రతీతము కాదు. మఱల అప్రసిద్ధమైన ఆ యొకే అభావముయొక్కసత్త అద్వైతమునకు నాశమెట్లు చేయును. ఎప్పటికిని చేయదు. ఒకచో అప్రసిద్ధ పదార్థమున్ను యేదో ఒక వస్తువునకు నాశముచేసిన పక్షమందు అప్రసిద్ధమైన వంధ్యాపుత్రుడున్ను, మా శత్రువు యొక్క నాశమును చేయవలెను. అట్లు చేయదు. మఱియు, వాది ఘటాదిపదార్థముల వలె అభావమునకు అధిష్ఠానముకన్న భిన్నసత్తనంగీకారముచేసిన పక్షమందు ఘటాదిభావ పదార్థములకును అభావములకును పరస్పరభేదసిద్ధి గానేరదు. అథవా అభావస్వరూపము, విశేషసత్త మొదలగు సర్వధర్మములచే రహితమగుటవలన, ఆ యభావమును అస్తిరూపముచే కథనము చేయుటయందే జీవుడును సమర్థుడుకాడు. ఎట్లు వంధ్యాపుత్ర శశశృంగాది అసత్యపదార్థములు వికల్పజ్ఞానమునకు విషయము లైనవో, అట్లే ఆయభావమున్ను వికల్పజ్ఞానమునకు విషయమగును. ఏదో ఒక ప్రమాణజన్యజ్ఞానమునకు విషయము గాదు. (ఏ శబ్దమునకర్థము ఏ దేశమందును, ఏ కాలమందును, ఏ జీవునకును, ప్రసిద్ధముకాదో, ఆ శబ్దముయొక్క శ్రవణముచే మనుజునకు ఆ శబ్దార్థముయొక్క జ్ఞానమేదిగలదో, దానికి వికల్పకజ్ఞానమనిపేరు. వంధ్యాపుత్ర శబ్దజనిత వంధ్యాపుత్రుని జ్ఞానమువలె, ఇటువంటి వికల్పరూప జ్ఞానమునకు, విషయమగుటవలన, ఆ వంధ్యాపుత్రాదిఅసత్యపదార్థములు తుచ్ఛములై యున్నవి. అట్లే వికల్పరూపజ్ఞానమునకు విషయమగుటవలన ఆ యభావమున్ను తుచ్ఛరూపమైయున్నది. ఆ తుచ్ఛరూపాభావము అద్వితీయాత్మయొక్క హానియెట్లు చేయును? చేయనేరదు. అథవా ఆ యభావముయొక్క వికల్పరూపజ్ఞానమున్ను ఎంతవఱకు అధికారిపురుషులకు అద్వితీయాత్మసాక్షాత్కారముగాలేదో, అంతవఱకే యుండును. ఆత్మసాక్షాత్కారమగుటచే నిక ఆ వికల్పజ్ఞానమెక్కడ?

ఇప్పుడు అనంతపదనిరూపణము గావింపబడుచున్నది. హే శిష్య! ఆత్మకన్న భిన్నములైన అనాత్మపదార్థములెన్నిగలవో, అవి దేశకాలవస్తురూప త్రివిధపరిచ్ఛేదముచే, యుక్తములైయున్నవి. దేశకాలములందును వస్తుపరిచ్ఛేదమేగలదు. కనుక ఆదేశకాలములున్ను, పరిచ్ఛిన్నములేయైయున్నవి.

శిష్యుడు — హే భగవన్! పరస్పర భేదరూపమగు వస్తుపరిచ్ఛేదమెట్లు దేశకాలము లందుగలదో, అట్లు ఘటపటాదిపదార్థములందు యుండును. కనుక ఒకే పరిచ్ఛేదముచేతనే సకల జగత్తునందును, పరిచ్ఛిన్నత సిద్ధించుటకు శక్యమగును.

అట్టిచో మఱల దేశపరిచ్ఛేదమును, కాలపరిచ్ఛేదమును, అంగీకరించుట నిష్ఫలము గదా?

శ్రీ గురువు — హే శిష్య! వాస్తవముగ విచారముచేసిన పక్షమందు, ఏక వస్తుపరిచ్ఛేదాంగీకారము చాలును. కాని మందబుద్ధులగు పురుషుల అనుగ్రహము కొఱకు శాస్త్రముచే పరిచ్ఛేదత్రయనిరూపణము చేయబడియె.

హే శిష్య! కొందఱు నైయాయికులు, పరమాణువులను నిత్యమని యంగీక రించుట వలన, వాటిలో కాలపరిచ్ఛేదములేదు, వస్తుపరిచ్ఛేదముండినను, వారంగీక రింపరు. పరమాణువులందు దేశపరిచ్ఛేదమునే వారంగీకరించెదరు.

శిష్యుడు! — హే భగవన్! ప్రత్యక్షాదిప్రమాణములకవిషయమైన, పర మాణువులు నైయాయికమతమందు ఏ రీతిగా సత్యరూపమగును?

శ్రీ గురువు — హే శిష్య! ఎట్లు మూఢబాలకుని మతమందు అసత్యమైన వంధ్యాపుత్రుడుకూడ సత్యరూపమగునో అట్లే నైయాయికమతమందు అసత్యపరమాణు వులు కూడ సత్యరూపములగును. చూడుము. లోకమందు భ్రాంతిజ్ఞానమునకు విష యము కానిదగు ఒక పదార్థమున్ను లేదు. అన్ని పదార్థములు భ్రాంతిజ్ఞానమునకు విషయములే.

శిష్యుడు — హే భగవన్! కొందఱు సాంఖ్యమతస్థులు మహత్తత్త్వమును విభువుగా నంగీకరించెదరు. మఱియు, సకల వికారములకు కారణమనుచున్నారు. కనుక ఆ సాంఖ్యమతమందు మహత్తత్త్వము దేశపరిచ్ఛేదముచేతను వస్తుపరిచ్ఛేదము చేతను రహితమైయున్నను, ఆ మహత్తత్త్వము ప్రళయకాలమందు లయమగుటవలన కేవల కాలపరిచ్ఛేదము గలదిగానున్నది గదా!

శ్రీ గురువు — హే శిష్య! కొందఱు వాదులు ఆకాశము, కాలము, దిక్కు, ఆత్మ, ఈ నాల్గింటిని విభువుగాను, నిత్యముగా నంగీకరించెదరు. గనుక వారి మత మందును దేశకాలపరిచ్ఛేదములులేవు. ఒక వస్తుపరిచ్ఛేదమే గలదు. ఈ ప్రకారముగ భ్రాంతులైన వాదులకు బోధచేయుటకొఱకు వాది మతానుసారముగ శాస్త్రమందు మూడు పరిచ్ఛేదముల కథనము గలదు. వాస్తవముగ ఒక్క వస్తుపరిచ్ఛేదముచేతనే సంపూర్ణజగత్తునందు పరిచ్ఛిన్నత సంభవించుచున్నది.

హే శిష్య! ఆ వస్తుపరిచ్ఛేదమున్ను, సజాతీయ, విజాతీయ, స్వగతభేదములచే, త్రివిధము. "వృక్షస్య స్వగతోభేదః పత్రపుష్పఫలాదితః, వృక్షాన్తరాత్సజాతీయో విజాతీయశ్శిలాదితః"

హే శిష్య! ఈ సమస్త నామముల పరిచ్ఛిన్నత బ్రహ్మమునందు వాస్తవముగ లేకున్నను భ్రాంతిచే కల్పితమైయున్నది. ఆ భ్రాంతిసిద్ధ పరిచ్ఛిన్నతను "అనన్త" శబ్దము నివారణచేయుచున్నది.

హే శిష్య! ఏ బ్రహ్మమందు అనంతశబ్దము పరిచ్ఛిన్నతను నివారణచేయుచున్నదో ఆ బ్రహ్మము పూర్వోక్తసకలపరిచ్ఛేదరహితమై సకలాభావరహితమై స్వతః సిద్ధస్వయంప్రకాశముగ నున్నది ఆ బ్రహ్మమందు నొకచో అభావము భిన్నరూపముగ స్థితమైన పక్షమందు ఆ యనంతశబ్దమునకు మఱల క్రోధమువచ్చును కనుక అనంతశబ్దభయముచే పరిచ్ఛేదములును, అభావములును పోయినవి

ఈలాగున, అనంతపదమునకర్థఫలనిరూపణము గావింపబడి యిప్పుడు జ్ఞానపదమున కర్థఫలములు వచింపబడుచున్నవి.

హే శిష్య! 'సత్యం జ్ఞానమనన్తం బ్రహ్మ' అను శ్రుతియందు కథనము చేయబడిన బ్రహ్మమును కొందఱు నైయాయికులు జడమనుచున్నారు, కనుక ఆ వాదులకు భ్రాంతిచే సిద్ధించిన బ్రహ్మమందలి ఆ జడరూపతను ఈ జ్ఞానశబ్దము నివారణచేయుచున్నది.

హే శిష్య! ఆ జ్ఞానశబ్దమునకు నైయాయికులు యీ యర్థము వచించుచున్నారు; జ్ఞానగుణము దేనియందుండునో దాని పేరు జ్ఞానము. ఈ ప్రకారముగ జ్ఞానశబ్దమునకు అర్థముచేసి బ్రహ్మమును జ్ఞానగుణవిశిష్టముగ నెఱుగుచున్నారు జ్ఞానస్వరూపముగ నెఱుగరు. ఈ ప్రకారముగ జ్ఞానశబ్దార్థముచేసినప్పుడు ఆ జ్ఞానశబ్దము బ్రహ్మమందు జడతను వ్యావృత్తిచేయుటకు శక్యముగాదు. ఏలాగుననగా 'మనుష్యులుగల భూమి గలదు' ఈ ప్రకారవచనము భూమిపై మనుష్యులకంటె వేఱైనవాటియొక్క నివృత్తిని చేయదు. అట్లే జ్ఞానగుణముగల బ్రహ్మము అను నీ వచనమున్ను ఆ బ్రహ్మమందు జ్ఞానముకన్న భిన్నమైన జడతను నివృత్తిచేయదు. ఈలాగున జూచినపుడు జ్ఞానశబ్దము జ్ఞానగుణముగల బ్రహ్మమును బోధనచేయదు ఆ బ్రహ్మమందు జడతను నివృత్తిచేయుటకొఱకు ఆ జ్ఞానశబ్దము కేవల జ్ఞానరూపతనే బోధనచేయుచున్నది.

హే శిష్య! ఈ జ్ఞానశబ్దము బ్రహ్మమందు ఎట్లు జడరూపతను వ్యావృత్తిచేయుచున్నదో, అట్లే అప్రకాశరూపతను, పరప్రకాశరూపతను వ్యావృత్తిచేయుచున్నది. ఏలాగుననగా - ఆ బ్రహ్మమొకచో అప్రకాశరూపమైన పక్షమందు ఎట్లు అప్రకాశరూపమగుటవలన ఘటాదిపదార్థములు జడరూపములో, అట్లే అప్రకాశరూపమగుటవలన బ్రహ్మమున్ను జడరూపమగును. ఈ లాగున ఆ బ్రహ్మము అప్రకాశరూపముగాదు.

ప్రకాశరూపమే హే శిష్య! బ్రహ్మమునకు ప్రకాశరూపతాసిద్ధియైనను ఆ బ్రహ్మ మొకచో పరప్రకాశరూపమైన పక్షమందు ఎట్లు సూర్యచంద్రాదిప్రకాశములు పర ప్రకాశములగుటవలన జడరూపములో అట్లే పరప్రకాశమగుటవలన ఆ బ్రహ్మమునకు మఱల జడరూపత ప్రాప్తమగును ఆ జడతాదోషనివారణముకొఱకు ఆ జ్ఞానశబ్దము బ్రహ్మమందు కేవల స్వయంప్రకాశరూపతను బోధనజేయుచున్నది.

ఇపుడు సత్యశబ్దార్థనిరూపణము గావింపబడుచున్నది. హే శిష్య! ఎట్లు రజ్జు సర్పము శుక్తిరజతము అసత్యములైయున్నవో, అట్లు సత్యపదముచే స్వయంజ్యోతి బ్రహ్మము అసత్యము కాగూడదు, గనుక బ్రహ్మమందు ప్రాప్తమైన భ్రాంతిసిద్ధ అసత్యతను ఈ సత్యశబ్దము నివారణజేయుచున్నది. శిష్యుడు :– హే భగవన్! శుక్తి రజతాదులందును భ్రాంతికాలమువఱకు సత్యతగలదు. ఈ సత్యశబ్దము ఆ బ్రహ్మము నందుగల అసత్యతయొక్క వ్యావృత్తినే రీతిగా చేయును? శ్రీ గురువు — హే శిష్య! జ్ఞానశబ్దమునకును, అనంతశబ్దమునకును సమీపతనొనర్చి ఆ సత్యశబ్దము బ్రహ్మ మందు అసత్యతను వ్యావృత్తిజేయుచున్నది. ఎందుకనగా లోకమందు యే పదార్థము పరిచ్ఛిన్నమో ఆ యా పదార్థము జడము. నాశవంతము రజ్జుసర్పాదిపదార్థములు పరిచ్ఛిన్నములుగాన, అవి జడములై నాశవంతములగును. బ్రహ్మమో పరిచ్ఛిన్నత చేతను జడతచేతను రహితమగుటవలన ఆ బ్రహ్మమును ఏ యొక కారణమున్ను నాశముచేయదు దీనివలన "సత్యం జ్ఞాన మనన్తం బ్రహ్మ" అను శ్రుతియందు స్థితమైన సత్య, జ్ఞాన, అనంతములను మూడు పదములు క్రమముగా అసత్యత, జడత పరిచ్ఛిన్నతలను నివృత్తిచేసి అద్వితీయ బ్రహ్మమును బోధన చేయుచున్నవి.

హే శిష్య! ఆ లక్ష్యస్వరూపబ్రహ్మము సర్వత్ర పూర్ణమైయున్నను బుద్ధి రూప గుహయందే సాక్షిరూపముచే స్పష్టముగా ప్రతీతమగుచున్నది. ఇటువంటి సాక్షిరూప బ్రహ్మమును ఏ యధికారులు "నేను బ్రహ్మరూపుడ" నను నీ ప్రకార ముగ తమ ఆత్మరూపముగ నెఱుగుచున్నారో ఆ అధికారిపురుషులు ఆ బ్రహ్మమువలె సర్వజగత్తును తమ అస్తిభాతిప్రియరూపముచే వ్యాప్తముగచేసి ఒకే కాలమందు సర్వవాంఛిత పదార్థములను పొందుచున్నారు.

హే శిష్య! "సత్యంజ్ఞాన మనన్తం బ్రహ్మ" అను శ్రుతియందు కథనము చేయబడిన బ్రహ్మద్వితీయతయందు విద్వాంసుని యుక్తిని శ్రవణము చేయుము — లోకమందు ఏ యే పదార్థము కార్యరూపమగునో అయాపదార్థము తన కారణముకన్న భిన్నసత్తగలదికాదు ఎట్లు ఘటశరావాది కార్యములు మృత్తికారూప కారణముకన్న

భిన్నములుకావో, మృత్తికారూపములో అట్లే కార్యమైన ఆకాశాది ప్రపంచమున్ను, ఆత్మరూపకారణముకన్న భిన్నముకాదు. ఆత్మరూపమే. ఈ ప్రకారముగ జగదుత్పత్తిబోధకవాక్యములందును ఆత్మకు అద్వితీయబ్రహ్మరూపతయే కథనము చేయబడియె.

ఇప్పుడు జగదుత్పత్తినిరూపణము గావింపబడుచున్నది — హే శిష్య! బ్రహ్మాత్మనుండి మొదట శబ్దగుణముగల ఆకాశము, దానినుండి స్పర్శగుణముగల వాయువు, దానినుండి రూపగుణముగల అగ్ని, దానినుండి రసగుణముగల జలము, అందుండి గంధగుణముగల పృథ్వి, పుట్టుచున్నవి. హే శిష్య! సమస్తకార్యములందు తత్తత్కారణము తాదాత్మ్యసంబంధముచే గలదు. అట్లే సత్యరూపాత్మ ఆకాశాదికార్యములందు తాదాత్మ్యసంబంధముచే గలదు. (కల్పితభేదముచే యుక్తమైన వాస్తవాభేదమునకు తాదాత్మ్యమని పేరు.) హే శిష్య! ఎట్లు ఆకాశాది భూతములందు శబ్దస్పర్శాది గుణములుగలవో అట్లు ఆత్మయందు జ్ఞానానందాదిగుణములు లేవు. జ్ఞానానందాదులు ఆత్మకు స్వరూపభూతములుగానున్నవి. ఎందుకనగా:— ఒకచో జ్ఞానానందాదులు ఆత్మకు గుణములైన పక్షమునందు, ఆత్మరూపకారణ సంబంధములగు ఆ గుణములు ఆకాశాదికార్యములందును ప్రతీతము గావలసియుండె. అట్లు ప్రతీతమగుటలేదు.

అథవా, లోకమందేది పరిణామకారణమై యున్నదో, ఆ యాకారణముయొక్క గుణములు కార్యమందు ప్రతీతమగుచున్నవి. ఎట్లు ఆకాశాది పరిణామికారణములయొక్క శబ్దాది గుణములు వాయ్వాది కార్యములందు ప్రతీతమగుచున్నవో, అట్లు ఈ సచ్చిదానందరూపాత్మ ఒకచో ఆకాశాదులకు పరిణామ్యుపాదానకారణమైన యెడల సచ్చిదానందాది ధర్మములు ఆకాశాదులయందును ప్రతీతము గావలసియుండె. అట్లగుటలేదు. దీనివలన ఆత్మదేవుడాకాశాది జడప్రపంచమునకు పరిణామికారణము కాదని తెలియుచున్నది. అతడు వివర్తోపాదానకారణమేయగును. ఎట్లు పరిణామ భావరహితమైన రజ్జువు మాయచే సర్పమునకు వివర్తోపాదానకారణమో, అట్లే పరిణామభావరహితుడైన ఆత్మదేవుడు మాయచే జగత్తునకు వివర్తోపాదానకారణమై యున్నాడు ఆత్మభిన్నములైన ఆకాశాదిభూతములు వాయ్వాదులకు పరిణామ్యుపాదానకారణములై యున్నవి. హే శిష్య! వాస్తవవిచారముచే చూచిన యెడల పరిణామరహితబ్రహ్మాత్మయే సర్వత్ర కారణమై యున్నాడు. ఆ బ్రహ్మాత్మకన్న భిన్నములైన ఆకాశాది సమస్తపదార్థములు బ్రహ్మమునకు కార్యములైయున్నవి. ఆకాశాదులందు వాయ్వాదులకారణత సంభవింపదు. ఒకచో ఆకాశమును వాయ్వాదులకారణ

మనిన బ్రహ్మజ్ఞానముచే సకల జగత్తుయొక్క జ్ఞానము శ్రుతిచే కథనము చేయబడిన సంగతి అసంగతమగును ఎందుకనగా కారణజ్ఞానములేక కార్యజ్ఞానము కాదు. ఈలాగున శ్రుతినిబట్టి బ్రహ్మమునందే సకలజగత్కారణత సిద్ధించుచున్నది.

శిష్యుడు.— హే భగవన్! ఆకాశాది సర్వకార్యములకు బ్రహ్మమందే కారణత యైనపుడు, ఆకాశాదులందు చెప్పబడిన వాయ్వాదుల కారణత అసంగతమగునుకదా?
శ్రీగురువు — హే శిష్య! వాస్తవవిచారముచే చూచినపుడు సమస్తకార్యములయందు బ్రహ్మమునకే కారణతయున్నను లోకులకు ఆకాశాదులయందు వాయ్వాదుల కారణత యేది ప్రతీతమగుచున్నదో దానికి హేతువేమనగా — ఉపాధిరహిత శుద్ధ బ్రహ్మమునందో యేయొకపదార్థమునకు కారణతలేదు మాయాయుక్త బ్రహ్మమునకే జగత్కారణతగలదు. అట్లు ఆకాశవిశిష్టబ్రహ్మము వాయువునకు కారణముకాగలదు. తుదకు పృథ్వీవిశిష్టబ్రహ్మము ఘటపటాదులకు కారణముకాగలదు. ఈ ప్రకారము పూర్వపూర్వవిశిష్టబ్రహ్మము ఉత్తరోత్తరకార్యమునకు కారణమైనది. అట్లే ఆకాశాదికారణములయొక్క శబ్దాదిగుణములు ఉత్తరోత్తరకార్యములయందు వచ్చుచున్నవని లోకుల కభిమానరూపభ్రమయైనది, ఈలాగున నొక బ్రహ్మమే సకలజగత్తునకు కారణమైనదని సిద్ధించినది.

ఇపుడు పూర్వప్రసంగము నిరూపణము గావింపబడుచున్నది. — జలముచే పుట్టినదై శబ్దాదిపంచగుణములుగలదై బ్రహ్మాండమునకు జననియై స్థావరజంగమ సకలజగత్తును ధారణము జేయునదైన యే పృథ్వి గలదో దానిచే అనేక ప్రకార ఓషధులు పుట్టుచున్నవి. ఆ యోషధులలో ముఖ్యముగా గ్రామ్య ఆరణ్యములను రెండుప్రకారములు గలవు. పురుషప్రయత్నముచే పుట్టినవైన వ్రీహియవమాషాదులకు పేరు గ్రామ్యోషధులు. పురుషప్రయత్నము లేకనే వనమందు పుట్టినవైన శాకాదులు ఆరణ్యౌషధులు ఆ ద్వివిధౌషధులును, మనుష్యాదిజంగమప్రాణులకు భక్షణయోగ్యములై యున్నవి. ఆ యోషధులచే నానాప్రకారమగు అన్నము పుట్టుచున్నది ఆ అన్నభక్షణచే వీర్యము పుట్టుచున్నది. ఆ వీర్యము యోషిద్రూపపంచమాగ్నికి ఆహుతియై యున్నది (స్వర్గమేఘ భూపురుషస్త్రీరూప పంచాగ్ని షష్ఠాధ్యాయమందు చెప్పబడియె) ఈలాగున అన్నముచే పురుషుడు పుట్టుచున్నాడు కనుక ఈ స్థూలశరీరరూపపురుషుని (పురుషశబ్దమందు — గో, అశ్వాది జరాయుజప్రాణులును అంతర్భూతములై యున్నవి.) శ్రుతిభగవతి 'అన్నరసమయ' నామముచే కథనము చేయుచున్నది. హే శిష్య! ఎట్లుమాతాపితరులచే భక్షణముచేయబడిన యన్నముచే గలుగు శుక్లశోణిత

మూలద్వారా పుట్టుటవలనను, దినదినము అన్నముచే వృద్ధిపొందుటవలనను, అన్నమయ పృథ్వియందు లయముపొందుటవలనను శ్రుతిభగవతి పురుషుని అన్నరసమయ మనుచున్నది

ఇపుడు పంచకోశ నిరూపణము గావింపబడుచున్నది — హే శిష్య! జగత్కారణరూపముగ ఏ బ్రహ్మరూపాత్మను కథనముచేయుచున్నానో, ఆ యాత్మదేవునకు స్థూలసూక్ష్మకారణములను మూడు శరీరములుగలవు. ఈ మూడు శరీరములందే తిత్తిరి బ్రాహ్మణులు అన్నమయ ప్రాణమయ మనోమయ విజ్ఞానమయ ఆనందమయము లని అయిదు కోశములను కల్పనచేయుచున్నారు. ఎట్లు ఖడ్గము నావరణముచేయు నట్టి కాష్ఠవిశేషమును కోశమనుచున్నారో, అట్లీ అన్నమయాదులును ఆత్మను ఆవరణము చేయుటవలన శాస్త్రమందు వాటిని కోశములనుచున్నారు. అసంగబుద్ధిరూప శస్త్రముచే రహితులైన యజ్ఞానిజీవులు అన్నమయాదికోశముల భేదించుట కశక్యులు. ఈ కారణమువలన నీ కోశములభేద్యములనబడియె హే శిష్య! ఈ స్థూలశరీరమో, ఒక అన్నమయకోశరూపమైయున్నది. సూక్ష్మశరీరమైననో, ప్రాణమయ మనోమయ విజ్ఞానమయములను నీ మూడు కోశముల రూపమైయున్నది. కారణశరీరము ఒక ఆనందమయకోశరూపమైయున్నది. ఈ ప్రకారముగ మూడు శరీరములందే పంచకోశములు గలవు. హే శిష్య! ఆ తిత్తిరి బ్రాహ్మణులు ఆ పంచకోశములను పక్షిరూపముచే కథనము చేయుచున్నారు ఎట్లు లోకప్రసిద్ధ పక్షులకు శిరస్సు, వామ దక్షిణ పక్షములు, ఉదరము, పుచ్ఛము, అను నీ పంచావయవములుగలవో, అట్లే ఆ బ్రాహ్మణులు కోశరూప పక్షులకును పంచావయవములను కల్పించుచున్నారు.

హే శిష్య! స్థూలశరీరరూప అన్నమయకోశ పక్షికి ప్రసిద్ధమైన మస్తకము శిరస్సుగాను, దక్షిణభుజము దక్షిణపక్షముగాను, వామభుజము ఉత్తరపక్షముగాను, ప్రసిద్ధమైన ఉదరము ఉదరముగాను, రెండుపాదములు పుచ్ఛముగానున్నవి. పాదములు శరీరస్థితికి ఆధారమగుటవలన పాదరూపపుచ్ఛము ప్రతిష్ఠానామముచే కథనము చేయబడియె. ఈ స్థావరజంగమ సమస్తశరీరములు తమనాశకాలమందు, అన్నమయ పృథ్విలో అభిన్నమగుటవలన, సకలశరీరములందు అన్నరూపతకలదు. ఈ సమష్టిరూప అన్నము సర్వప్రజల యుత్పత్తిస్థితిలయములకు, కారణమగుటవలన ఆ అన్నమును శ్రుతిభగవతి "జ్యేష్ఠ" నామముచే కథనము చేయుచున్నది. సకలరోగరూపమైన క్షుధను అన్నము నాశనము చేయుటవలన, అన్నమును శ్రుతిభగవతి "సర్వౌషధ" నామముచే కథనము చేయుచున్నది. హే శిష్య! ఆ అన్నమందు సకలభూతముల యుత్పత్తి

స్థితి లయకారణతారూప బ్రహ్మలక్షణమును నిశ్చయముజేసి యే యధికారి పురుషులు ఆ యన్నమును బ్రహ్మరూపముగా, నుపాసనముచేయుచున్నారో. వారు మనోవాంఛిత అన్నప్రాప్తి రూప ఫలమును పొందుచున్నారు. ఇట అన్నశబ్దమునకు రెండర్థములు గలవు. వ్యష్టిరూపముగా, ఏ వస్తువు భూతములకు భక్షణప్రాయమగుచున్నదో దాని పేరు అన్నము. అథవా సమష్టిరూపముచే ఏ వస్తువు సర్వభూతముల భక్షణము చేయునో దానిపేరు అన్నము. హే శిష్య! అన్నమయాది పంచకోశములందు ప్రతి కోశమునకు ఐదైదు అవయవములు చెప్పబడినవి. ఆ యవయవములందు పుచ్ఛశబ్దము చేతను, ప్రతిష్ఠాశబ్దముచేతను కథనముచేయబడిన అవయవములను, ఆ కోశమందు ప్రధానరూపముగాను, కారణరూపముగాను యెఱుగవలయును. ఉత్తరోత్తరకోశము పూర్వకోశమునకు కారణమనియు యెఱుగవలయును.

ఒకే సూక్ష్మశరీరమందు మూడు కోశముల కల్పనకు నిమిత్తము వచింపబడుచున్నది. — హే శిష్య! సూక్ష్మశరీరమునందు క్రియ, నామము, రూపము యివి మూడును భిన్నభిన్నములుగా గలవు. అట క్రియాప్రధానాంశమునకు పేరు ప్రాణమయ కోశము, ప్రమాణరూపమను ప్రధానాంశమునకుపేరు మనోమయకోశము, ప్రమేయ స్వరూప ప్రధానాంశమునకు పేరు విజ్ఞానమయకోశము.

ఇప్పుడు ప్రాణమయకోశము వచింపబడుచున్నది. — హే శిష్య! ఎట్లు మూసయందు ద్రవీభూతమైన తామ్రాదిధాతువులు ఆ మూసయందు పరిపూర్ణమైయున్నవో, అట్లే ఉత్తరోత్తర కోశముచే పూర్వపూర్వకోశము పరిపూర్ణమైయున్నది. ప్రాణమయకోశ పక్షి కవయవములు — ప్రాణవాయువు శిరస్సు. వ్యానవాయువు దక్షిణపక్షము, అపానవాయువు ఉత్తరపక్షము, సమానవాయువు ఉదరము, ఉదానవాయువు పుచ్ఛము, అదే ప్రతిష్ఠ — హే శిష్య! శరీరత్యాగానంతరము లోకాంతరమునకు బోవుటకొఱకు ఈ యుదానవాయువు బయలుదేరుట తోడనే, సకల ప్రాణములు బయటకు వచ్చుచున్నవి. కనుక ఉదానవాయురూప పుచ్ఛము ప్రతిష్ఠయని చెప్పబడియె. సమష్టి రూపముచే ధ్యానముచేయబడిన ఈ ప్రాణమయకోశము దీర్ఘాయువును గలుగజేయుచున్నది ఇటువంటి ప్రాణమయకోశము నే యధికారిపురుషులు బ్రహ్మరూపముగ నుపాసనము చేయుచున్నారో, ఆ అధికారి పురుషులు శత సహస్ర వర్షాది సంపూర్ణ ఆయుష్యమును పొందుచున్నారు.

మనోమయకోశము — మనోమయ కోశపక్షికి యజుర్వేదము శిరస్సు, ఋగ్వేదము దక్షిణపక్షము, సామవేదముత్తరపక్షము, వేదమందుగల బ్రాహ్మణభాగము ఉదరము, అథర్వణవేదము పుచ్ఛము, అదే ప్రతిష్ఠ — శిష్యుడు — హే భగవన్!

ఋగాది వేదములు శబ్దరూపములు, అవి మనోమయకోశమునకు అవయవము లెట్లగును? శ్రీ గురువు — హే శిష్య! వేదములు శబ్దరూపములైనను వాటికి ప్రమాణ రూపత ఘటింపజేయునట్టి మానవవృత్తులు మనస్సునందే కలవు కనుక ఋగాది శబ్దములు లక్షణావృత్తిచే, ఆ మనోమయవృత్తులయొక్కయే బోధనచేయుచున్నవి. ఈలాగున వేదముల కవయవరూపత విరుద్ధము కాదు.

హే శిష్య! బ్రహ్మరూపాత్మ యే ప్రమాణజన్యజ్ఞానమునకును విషయము కాదు కనుక ఆ మనస్సున్ను వేదరూపప్రమాణముచే బ్రహ్మాత్మను సాక్షాత్తుగా విషయము చేయదు తటస్థరూపముగను విషయము చేయదు. ఇట తిత్తిరిబ్రాహ్మణ మంత్రార్థము వచింపబడుచున్నది — ఏ బ్రహ్మమును ప్రాప్తముగాక వాక్కుతో సహా మనస్సు నివృత్తమై వచ్చుచున్నదో, ఆ బ్రహ్మస్వరూపభూత ఆనందము నెఱిగి విద్వాంసుడు దేనిచేతను భయమును పొందడు. హే శిష్య! ఋగాది వేదవాణీరూప ప్రమాణమున్నూ, మనోరూపప్రమాణమున్ను ఆనందస్వరూపాత్మను విషయము చేయుటయందు సమర్థముకాకున్నను, శాస్త్రసంస్కారసహిత అంతర్ముఖమైన శుద్ధ మనస్సుచే అధికారిపురుషులు మనోమయకోశమున కంతస్థితమైన ఆత్మస్వరూపానంద మును పొందుచున్నారు.

విజ్ఞానమయకోశపక్షి కవయవములు — సకలకర్మములకు మూలమై గురుశాస్త్రవచనములందు విశ్వాసరూపమగు శ్రద్ధ శిరస్సు. మీమాంసాశాస్త్రజన్య మానస బుద్ధిరూప ఋతము దక్షిణపక్షము. యజ్ఞాదికర్మముల విషయముజేయునట్టి బుద్ధి రూపసత్యము ఉత్తరపక్షము, అధ్యాత్మశాస్త్రార్థనిశ్చయరూపయోగముదరము, ప్రపంచ కారణమైన హిరణ్యగర్భుని సమష్టిబుద్ధి పుచ్ఛము, అదే ప్రతిష్ఠ. ఏ యధికారిపురుషులు విజ్ఞానమయాత్మను బ్రహ్మరూపముగా నెఱిగి యితర పదార్థాత్మబుద్ధిని పరిత్యాగము చేయుదురో, ఆ అధికారిపురుషులు దేహాభిమాన జన్యపాపకర్మలను పరిహరించి; సకల వాంఛితపదార్థములను పొందుదురు

ఇప్పుడానందమయకోశము నిరూపింపబడు చున్నది — ఇష్టపదార్థదర్శనముచే పుట్టినదైన సుఖరూపప్రియము శిరస్సు, యిష్ట పదార్థప్రాప్తిచే పుట్టినదైన సుఖరూప మోదము దక్షిణపక్షము, ఇష్టపదార్థభోగ జన్యసుఖరూపప్రమోదము ఉత్తరపక్షము, ఆ ప్రియమోదాది విశేషములందు సామాన్యరూపముగ ననుగతమైన సుఖము ఉదరము, సకల జగత్కారణరూప ఆనంద స్వరూపాధిష్ఠాన బ్రహ్మము పుచ్ఛము. అదే ప్రతిష్ఠ.

పంచకోశనిరూపణమునకభిప్రాయము — హే శిష్య! సర్వదేహధారి జీవుల యొక్క శ్రోత్రాది జ్ఞానేంద్రియములు, వాగాదికర్మేంద్రియములు నిత్యము బహిర్ముఖ

ములై యున్నవి. ఈ కారణమువలన అవి బాహ్యపదార్థములనే యెఱుగుచున్నవి. శరీరాంతస్థితుడైన ఆనంద సముద్రుడైన ఆత్మదేవుని యే దేహధారి జీవుడు నెఱుగడు; ఆనందరూపాత్మను పరిత్యజించి సమస్త జీవులు బయట భ్రమణము చేయుచున్నారు. బయట భ్రమణముచే కించిన్మాత్రమును సుఖము దొరకదు పైగా మహాదుఃఖసముద్రమును పొందుదురు. ఆ బహిర్ముఖజీవులను మోక్షరూపపురుషార్థభ్రష్టులుగను, అత్యంతదుఃఖితులుగను జూచి తల్లివలె అత్యంత స్నేహయుక్తయై, అత్యంతదుఃఖియై బహిర్ముఖ ప్రవృత్తినుండి ఆ జీవులను సాక్షాత్తుగా నివృత్తము చేయుటకు అసమర్థయై శ్రుతిభగవతి పంచకోశరూప విచారణజేసి, మొదట అధికారి బ్రాహ్మణులను ఆ బహిర్ముఖప్రవృత్తినుండి నివృత్తము చేయుచున్నది. శిష్యుడు — హే భగవన్! తల్లివలె సర్వజీవుల హితముకొఱకు ప్రవృత్తయైన శ్రుతిభగవతి మొదట బ్రాహ్మణులకే యెందుకుపదేశము చేయుచున్నది? — గురువు — హే శిష్య! ఈ అధికారి బ్రాహ్మణులను మొదట బహిర్ముఖ వృత్తినుండి నివృత్తముచేసిన, అప్పుడా బ్రాహ్మణులు క్షత్రియాదులకు అపౌరుషేయవేదవచనముల నుపదేశముచేసి, శూద్రాదులకు పురుష వచనములచే నుపదేశముచేసి వారినిన్ని బహిర్ముఖప్రవృత్తినుండి నివృత్తిచేయుదురు. ఈలాగున విచారముచేసి శ్రుతిభగవతి మొదట బ్రాహ్మణుల కుపదేశము చేసెను.

శిష్యుడు – హే భగవన్! అన్నమయాదికోశవిచారముచే బాహ్యప్రవృత్తి యేరీతిగా నివృత్తమగుచున్నది?

గురువు — హే శిష్య! లోకమందు రూప యౌవనాది గుణములచే యుక్తులైన పురుషులు, స్త్రీలు, తమ తమ శరీరములచే ప్రసన్నత పొందనేరరు ఆ పురుషులును స్త్రీలును సుఖప్రాప్తికొఱకు పిశాచమువలె తమకన్న భిన్నమైన ఏదో ఒక శరీరమును సేవనము చేయుచున్నారు. ఆ యన్యశరీరమున్ను స్థూలసూక్ష్మకారణ భేదముచే త్రివిధమగుచున్నది అట స్థూలశరీరము అన్నమయ వికారరూపము, సూక్ష్మశరీరము ప్రాణమనోవిజ్ఞానముల రూపము, కారణశరీరమజ్ఞానరూపము, హే శిష్య! కేవలము మనుష్యశరీరము మాత్రమే అన్నప్రాణాదుల రూపముకాదు త్రైలోక్యమందెంత ప్రపంచము కలదో ఆ సంపూర్ణప్రపంచము అన్న ప్రాణ మనోబుద్ధ్య జ్ఞానములనే పంచకోశరూపమై యున్నది ఆ పంచకోశరూప సంపూర్ణప్రపంచము ఈ జీవుల శరీరమునందు విరాజమానమైయున్నది. కనుక ఆ యంతరపదార్థములను పరిత్యాగము చేసి, బాహ్యపదార్థసంపాదనేచ్ఛగావించుట జీవుల కుచితముకాదు. మధువుయొక్కయిచ్ఛగల పురుషునకు తనయింటికి సమీపముననే మధుప్రాప్తియైనపుడు పర్వతము మీద కెక్కుట ఉచితము కాదు కదా! ఈ అభిప్రాయముచే శ్రుతిభగవతి తల్లివలె కృప

గల్గి అధికారి పురుషులగూర్చి యిట్లనియె — ఓ పుత్రులారా! వాస్తవవిచారముచే చూచినపుడు ఈ ఆనందరూపాత్మకన్న భిన్నమగు యే యొక వస్తువందు సుఖములేదు. ఐనను ఒకచో మీరు ఆత్మభిన్నవస్తువు సుఖకారణమని పట్టుబట్టిన దానికి నేను నివారణ చేయను. కాని ఆత్మభిన్నములైన యే యన్నమయాదిపదార్థములను మీరు సుఖసాధనములని యెంచుచున్నారో, ఆ యన్నమయాది పదార్థములు మీ శరీరములందే విద్యమానములైయున్నవి. యేల వాటిని మీరు సేవనముచేయరు? స్వశరీరస్థితపదార్థములను పరిత్యజించి వాటికొఱకు బయట వనములందు యేల తిరుగుచున్నారు?— హే శిష్య! లోకమందు క్షుధచేతను, కామముచేతను, పీడితుడైన ఒకపుత్రుడు స్వగృహపరిత్యాగముచేసి దేశాంతరమునకు బోవుటకుద్యమముచేసిన వాని మాత వాని చేయిపట్టుకొని యిట్లనియె, అన్నప్రాప్తికొఱకును, స్త్రీప్రాప్తికొఱకును నీవు గృహమును వదలి బయటకు పోవలదు. అట్లు చేయుటచే నీకు చాల కష్టమగును. నీకొఱకన్నమును, స్త్రీని యింటిలోనే సంపాదనము చేసి యొసంగెదను. హే శిష్య! ఈ ప్రకారమగు తల్లివాక్యము విని పుత్రుడు బయటకుపోడు. అట్లే తన శరీరముకన్న బయటివగు పరశరీరములను సుఖసాధనములనియెఱిగి, ఆ సుఖప్రాప్తికొఱకు బాహ్యభ్రమణము చేయువారైన బహిర్ముఖపురుషుల నంతర్ముఖులుగా జేయుటకొఱకు శ్రుతిభగవతిచే మొదట అన్నమయకోశము కథనముచేయబడియె. బాహ్యభ్రమణమును పరిత్యాగముచేసి అన్నమయ కోశమందే అధికారికి స్థితిచూపి శ్రుతిమాత మఱల క్రమముగ ప్రాణమయాది ఒక్కొక్కకోశము నుపదేశము చేయుచున్నది. కడపట ఆనంద కోశమందా అధికారిపురుషులు యిష్టవస్తుదర్శనజన్య సుఖమును పొంది అనంతరమిష్ట వస్తుప్రాప్తిజన్యసుఖమును జెంది తదనంతర మిష్టవస్తుభోగజన్యసుఖము ననుభవించుచున్నారు. ఇట్లు సామాన్యసుఖరూపానందమును పొంది కడపట నాయధికారిపురుషులు ఆనందస్వరూపబ్రహ్మమును పొందుదురు. ఏ బ్రహ్మము శ్రుతిచే పుచ్ఛరూపముచేతను ప్రతిష్ఠారూపముచేతను, కథనము చేయబడినదో ఆ బ్రహ్మమును వారు పొందుచున్నారు. ఈ ప్రకారముగ సర్వాధిష్ఠానబ్రహ్మము నెఱింగించుటకొఱకు శ్రుతిభగవతిచే స్థూలారుంధతీన్యాయమున అన్నమయాది పంచకోశములు ఆత్మరూపముగ వర్ణనము చేయబడియె.

హే శిష్యా! ఏ యధికారిపురుషులు శ్రుతిభగవతిచే కృపాదృష్టితో చేయబడిన యుపదేశము నెఱుగరో, అట్టివారు జీవించియుండినన్యు వంధ్యాపుత్రసమానముగ అసత్యభావమును పొందుచున్నారు. హే శిష్యా! యీవిషయము తిత్తిరి బ్రాహ్మణమందు మంత్రరూపముగ జెప్పబడియె — ఏపురుషుడు బ్రహ్మములేదని

యెఱుగుచున్నారో అతని ఆత్మ అసత్యమే యగుచున్నది. ఎవడు బ్రహ్మము కలదని యెరుగుచున్నాడో వానిని విద్వాంసులు సత్యమనుచున్నారు

హే శిష్య! సర్వకాలములందును సర్వదేశములందును సర్వులకు ఆత్మరూపముగ విద్యమానమైన ఆ ఆనందస్వరూపబ్రహ్మము నేపురుషుడు నాస్తిరూపమున నెఱుగుచున్నాడో, మఱియు నట్లు నాస్తిరూపముచే కథనము చేయుచున్నాడో, ఆ పురుషునకా మిథ్యాజ్ఞానముచేతను, మిథ్యావచనముచేతను మహాపాపముగల్గి ఆ పాపప్రభావముచే బ్రహ్మానందవిముఖులై, బాహ్యవిషయములందు రాత్రిందివములు భ్రమణము చేయుచున్నారు; మఱల మఱల జననమరణములను పొందుచున్నారు. మఱల మఱల యమరాజునకు వశమై నరకవాసాది అనేక దుఃఖముల నుపభోగించుచున్నారు. అల్పాయువుగలవారగుచున్నారు. సకల జనులచే నిరాదరమును పొందుచున్నారు ఈ లాగున ఆ నాస్తికపురుషుడు అసత్యరూపుడుగనే యెఱుగుచున్నారు. హే శిష్య! వేదశాస్త్ర వచనములందు విశ్వాసము గలవారైన ఆస్తికుడు బ్రహ్మవేత్తయగు గురుముఖమున ఆత్మజ్ఞానమును సంపాదించి దాని ప్రభావముచే సకల దుఃఖరహితులై సర్వదా ఆనందస్వరూపబ్రహ్మరూపముగనే స్థితుడగుచున్నారు. ఇటువంటి యాస్తికపురుషుని వేదవేత్తలగు మహాత్ములు సత్యరూపముచే కథనము చేయుచున్నారు. కొందఱు వృత్తికారులు యేకదేశియగు ఆనందమయకోశమునే బ్రహ్మరూపముగ నెఱుగుచున్నారు వారి మతము ఖండనము యీ క్రింద వ్రాయబడిన ప్రకరణముచే సహజముగనే యగుచున్నది. హే శిష్య! అన్నమయాది పంచకోశములందు ఒక్కొక్క కోశమునకు పంచ పంచావయవములు కథనముచేయబడియె. ఆ యవయవరూప భూమిక బహిర్ముఖుని చిత్తస్థిరతకు కారణమగుచున్నది. ధ్యానప్రకారము — హే శిష్యా! అధికారిపురుషులు బహిర్ముఖతానివృత్తికొఱకు మొదట అన్నమయకోశసంబంధ శిరస్సును తరువాత దక్షిణపక్షమును ఈ ప్రకారముగ సకలావయవములను ధ్యానముచేసి కడపట పాదరూపపుచ్ఛమును ధ్యానము చేయవలయును. పుచ్ఛముకన్న పరముగ యింకొక యవయవములేదు అన్నమయధ్యానప్రకారముగానే తక్కిన నాలుగుకోశముల అవయవముల ధ్యానముచేయవలయును. ఈ ప్రకారముగ పంచకోశముల శిరాదిపంచవింశతి అవయవములందు అంత్యావయవమైన పుచ్ఛ ప్రతిష్ఠారూపముచే కథనము చేయబడినదైన యే అధిష్ఠానరూపబ్రహ్మము గలదో ఆ యధిష్ఠానబ్రహ్మమునందు చతుర్వింశతిభూమికలు స్థిరములైయున్నవి అటువంటి యధిష్ఠానబ్రహ్మమును బోధనచేయుటకొఱకు శ్రుతిభగవతి పంచవింశతి అవయవములుగల పంచకోశముల కథనము-చేయుచున్నది. కోశనిరూపణమందు

శ్రుతి కింకొక తాత్పర్యము లేదు. ఇట్లు చెప్పుటచే శ్రవణరీతిగా ఆత్మస్వరూప నిరూపణ మైనది. ఇపుడు మననప్రకారము వచింపబడుచున్నది.

హే శిష్యా ! బ్రహ్మజ్ఞానమందు సంశయముల నివృత్తికొఱకు తిత్తిరి బ్రాహ్మణులు యీ ప్రకారము విచారముచేసిరి. — ప్రమేయరూపబ్రహ్మమునందు సంశయములు మూడు — ఆ బ్రహ్మము విద్యమానమైయున్నదా ? ఆ బ్రహ్మము విద్వాంసులకు ప్రాప్తముగుటకు యోగ్యమా ? కాదా ? అట ప్రథమ సంశయమునందు 'బ్రహ్మము లేదు' అను విషయమున కొందఱు వాదుల పూర్వపక్షము — ఏ వేదాంత మతమందు బ్రహ్మము సత్యజ్ఞానానంతమై యున్నదో ఆ వేదాంతియొక్క మతమందు ఆ బ్రహ్మమునకు జ్ఞానము వ్యర్థమైయున్నది. ఎందుకనగా — యిటువంటి సత్య జ్ఞానానంద బ్రహ్మము యే జీవునకును ప్రతీతముకాదు. కనుక ఆ బ్రహ్మమెక్కడనులేదు. ఒకానొకప్పుడెక్కడైననుండిన పక్షమందు జీవులగు మాకు పృథివ్యాది పదార్థములవలె యది ప్రతీతము కావలసియుండె. అట్లు ప్రతీతమగుటలేదు. కనుక లేదు. యిప్పుడు రెండవసంశయమునందు 'ఆ బ్రహ్మము విద్వాంసులకు ప్రాప్తమగుట యోగ్యమ'ను నీ ప్రథమవిషయనిరూపణము గావింపబడుచున్నది. కొందఱు వాదులిట్లందురు. వేదాంతమందే బ్రహ్మరూపమంగీకరింపబడినదో, ఆ బ్రహ్మరూపాత్మ విద్వాంసులకును అవిద్వాంసులకును సమానమైయున్నది. ఆ బ్రహ్మరూపాత్మకు విద్వాంసులందు పక్షపాతము లేదు. కనుక యెట్లు విద్వాంసులాయాత్మను పొందుచున్నారో, అట్లవిద్వాంసులును యెందుకు పొందరు ? పొందవలసియుండె, విద్వాంసులు పొందుచున్నారు. అవిద్వాంసులు పొందరు అనిన ఈ విషయమునందు వేదాంతులగు మీరే కారణము చెప్పవలెను. విద్వాంసులాత్మస్మరణము చేయుచున్నారు. అవిద్వాంసులు చేయరు. వేదాంతి యిట్లనినను సంభవింపదు. ఎందుకనగా — మీ వేదాంతులచే యద్వితీయ బ్రహ్మము సర్వజీవులకాత్మయని యెంచబడినది. కనుక అదెట్లు విద్వాంసుల కాత్మయై యున్నదో, అట్లు అవిద్వాంసులకు నాత్మయై యున్నది. కనుక విద్వాంసులవలె యవిద్వాంసులకును ఆ బ్రహ్మరూపాత్మయొక్క స్మరణ కావలసియుండె. ప్రాప్తియును కావలసియుండె. ఇప్పుడు తృతీయ సంశయసంబంధమగు 'ఆ బ్రహ్మము విద్వాంసులకును ప్రాప్తమగుటకు యోగ్యముకాద'ను ద్వితీయ విషయమునకు పూర్వపక్షము వచింపబడుచున్నది. వేదాంతులైన మీచే నంగీకరింపబడిన బ్రహ్మము ఒకచో విద్వాంసునకును ప్రాప్తముకానియెడల మీ బ్రహ్మము సత్యమేయగును. ఎందుకనగా — మీ బ్రహ్మము సర్వజీవులకాత్మరూపమైయున్నది. తమ ఆత్మయో సర్వజీవులకు నిత్య ప్రాప్తమేయైయున్నది, కనుక బ్రహ్మమును సర్వాత్మయనుట అది ఒకనికిమాత్రము

ప్రాప్తమగుట, ఒకనికి ప్రాప్తముకాదనుట అత్యంత విరుద్ధమే. మఱియు ఆ బ్రహ్మము విద్వాంసుల కప్రాప్తమగుటవలన యెప్పుడసత్యమగునో, అప్పుడెట్లు వంధ్యాపుత్రాది యసత్యపదార్థము లెవనికిని ప్రతీతముకావో, అట్లాయసత్యబ్రహ్మము అవిద్వాంసుల వలె విద్వాంసులకును ప్రతీతము కానేరదు ఇట్లుండగా "సత్యం జ్ఞాన మనన్తం బ్రహ్మ" అను శ్రుతివచనము నంగీకారముజేసి మీరు బ్రహ్మమును సత్యమనినప్పుడు ఒకనికి ప్రాప్తమగుట ఒకని కప్రాప్తమగుట అసంగతము. ఎట్లనగా — ఒకే వ్యాపకమైన ఆకాశము సర్వజ్ఞపురుషునకు ప్రాప్తమగునని మూఢబాలునికప్రాప్తమగుననియు అనుట అసంగతముకదా.

ఇప్పుడు మూడు ప్రశ్నలకు త్తరము సులభముగా బోధయగుటకొఱకు మొదట తిత్తిరి బ్రాహ్మణులు ఆబ్రహ్మమునకు ప్రాప్తి అప్రాప్తి సంబంధ వ్యవస్థ చేయుచున్నారు. ఇద్దఱు పురుషులుగల యింటిలో ధనము నిక్షిప్తమైయున్నది. దానినొక డెఱుగు చున్నారు. ఒకడెఱుగలేదు. యెఱిగినవానికి ధనము ప్రాప్తమగుచున్నది. యెఱుగని వానికి ప్రాప్తముకాదు. అట్లే విద్వాంసులకును అవిద్వాంసులకును బ్రహ్మము సమా నముగానేనుండినను విద్వాంసులద్దాని నెఱుంగుటవలన వారికి ప్రాప్తమై అవిద్వాంసు లెఱుగకుండుటవలన వారికప్రాప్తమైయున్నది. దీనివలన తన సత్య స్వభావబలముచే, అసత్యమును పరిత్యాగముచేసినదైన ఏ బ్రహ్మము గలదో ఆ బ్రహ్మముయొక్క జ్ఞానమే విద్వాంసులకు బ్రహ్మప్రాప్తిరూపమై యున్నదని సిద్ధించుచున్నది. అవిద్వాంసులకో బ్రహ్మముయొక్క యజ్ఞానము కలదు. అదియే వారికి బ్రహ్మప్రాప్తిరూపమైయున్నది.

ఇపుడు కామన, విచారము, జగదుత్పత్తి, జగత్ప్రవేశము భోగ్యపదార్థరూపత ఈపంచ హేతువులచే బ్రహ్మమందు సత్యతాసిద్ధి నిరూపింపబడుచున్నది — హే శిష్యా! ఆకాశాది పంచభూతములను, తత్కార్యమైన సంపూర్ణజగత్తున్ను, ఏ బ్రహ్మముచే పుట్టు చున్నదో, ఆ బ్రహ్మమసత్యమని సంశయముచేయుటకు ఏ వాదియు సమర్థుడుకాడు. సంశయించుటకే అసమర్థుడైనపుడు అసత్యమని సిద్ధింపజేయుట కెవడు సమర్థుడగును? ఎవడును సమర్థుడుకాడు. హే శిష్యా! జీవుల అనాదికర్మవాసనచే విచిత్రభావమును పొందిన యే మాయగలదో, ఆ మాయారూపకంచుకముచే యుక్తమైన యా పరమాత్మ దేవుడు జగదుత్పత్తికి పూర్వము అద్వితీయరూపముగ స్థితుడాయెను. ఆతడే సృష్ట్యాది కాలమందు జీవుల పుణ్యాపాపకర్మములచే ప్రేరితుడై, భూతభౌతిక జగత్తును సృష్టిం చుటకొఱకు యిట్లు కామన చేయుచున్నాడు — పరమాత్మదేవుడనగు నేను జన్మించి బహురూపుడ నగుదును. — ఈప్రకారముగ భవిష్యత్కాలమున పుట్టుటకు యోగ్యమైన నామరూప క్రియాస్వరూప జడచైతన్యరూప జగత్తును విషయముచేయునట్టి చింతనచేసి,

ఆ పరమాత్మదేవుడు యీ జగత్తునకు విశేషనామరూపాదుల గావించుటకొఱకు మఱల యిట్లు విచారముచేయుచున్నారు. — పూర్వకల్పమందు జగత్సంబంధమగు ఏ యే పదార్థముల కే యే ప్రకారనామరూప క్రియగలదో. యీ కల్పమందును ఆ క్రియనే చేసెదను — యిట్లు విచారించి ఆ పరమాత్మదేవుడు పూర్వకల్పమందువలె భిన్నభిన్న నామరూప క్రియాసహిత స్థావరజంగమరూప సమస్తజగత్తును సృజించుచున్నారు. పూర్వకల్పమందు సూర్యచంద్రాదులను, స్వర్గపృథ్వి అంతరిక్షాదులను, పుట్టించినట్లే యీ కల్పమందును పుట్టించుచున్నారు. ఇట్లు జగత్తును సృజించిన పిమ్మట ఆ పరమాత్మదేవుడు తానే జీవరూపముగా నందు ప్రవేశించుచున్నారు. — హే శిష్యా! "బ్రహ్మవిదాప్నోతిపరమ్" అను శ్రుతిచే బ్రహ్మజ్ఞానమువలన మోక్షప్రాప్తి చెప్పబడియె మఱియు "సత్యంజ్ఞానమనన్తం బ్రహ్మ" అను శ్రుతిచే బ్రహ్మలక్షణము చెప్పబడియె. ఆ బ్రహ్మమే యీ సంపూర్ణజగత్తును సృజించి అందు జీవరూపముగ ప్రవేశము చేయుచున్నది. ఇపుడు నానారూప నిరూపణముగావింపఁబడుచున్నది

హే శిష్యా! ఆ పరమాత్మదేవుడు సద్రూపమును త్యద్రూపమునగుచున్నారు. (నేత్రాదింద్రియముల విషయమైన పృథ్వీజలతేజములను సత్తనియు, ఇంద్రియముల కవిషయమైన వాయ్వాకాశములను త్యత్తనియుననుచున్నారు.) ఆ పరమాత్మదేవుడే నిరుక్త అనిరుక్తరూపుడగుచున్నారు (ఏ పదార్థములకు నామరూపక్రియలచే నిరూపణమగుచున్నదో అది నిరుక్తము, అట్లు నిరూపణముకాదో అది అనిరుక్తము) ఆ పరమాత్మదేవుడే నిలయనానిలయన రూపుడగుచున్నారు. (పృథివ్యాదులను ఆశ్రయించిన ఘటాదిపదార్థములు నిలయములు, నిరాధారమైన ఆకాశాదులు అనిలయములు) ఆ పరమాత్మదేవుడే విజ్ఞానా విజ్ఞానరూపుడగుచున్నారు. (లోకమందు చైతన్యరూపములచే ప్రసిద్ధములైన నేత్రాదింద్రియములును అంతఃకరణమున్ను విజ్ఞానములు, జడరూపముచే ప్రసిద్ధమైన ఘటపటాదిపదార్థములు అవిజ్ఞానములు) ఆ పరమాత్మదేవుడే సత్యాసత్యరూపుడగుచున్నారు. (వ్యవహారకాలమందు బాధారహితమగు ఘటపటాది పదార్థములు సత్యములు వ్యవహారకాలమందు బాధాయుతములగు రజ్జుసర్పాది పదార్థములు అసత్యములు.)

హే శిష్యా! యీ ప్రకారము అస్తిరూపముచేతను నాస్తిరూపముచేతను ప్రసిద్ధమైన ఏ విచిత్రజగత్తుగలదో, ఆ జగద్రూపమునొక్కడే పరమాత్మదేవుడు పొందుచున్నారు. ఎట్లు ఒకే ఆకాశము గంధర్వనగరరూపముగ నానా భావమును పొందుచున్నదో, అట్లు, ఒకే అద్వితీయబ్రహ్మము జగద్రూపముగ నానాభావమును పొందు

చున్నది. హే శిష్యా ! అసత్యరూప బ్రహ్మమే జగద్రూపముగ పుట్టుటవలన వాస్తవముగ సత్యతాహీన అసత్యరూపమైన యీ జగత్తు యాచితమండనన్యాయముగ సత్యరూపమై ప్రతీతమగుచున్నది (నిర్ధనపురుషుడు యాచనచే ధనవంతునినుండి వస్త్రభూషణాది పదార్థములను తెచ్చి తన గృహమును శోభితముగ చేయుచున్నాడు. దానికి పేరు యాచనమండనన్యాయము)

శిష్యుడు హేభగవన్ ! జగత్తునందు స్వభావసిద్ధ సత్త యెందుకుండకూడదు ? గురువు — హేశిష్యా ! ఏ పదార్థము త్రికాలమునందును ఏకరసముగానుండునో, ఎప్పటికిని అన్యథాభావమును పొందదో, ఆ పదార్థమే సత్యరూపమగును. ఇటువంటి సత్యరూపత ఒక్కబ్రహ్మమునందే సంభవించుచున్నది. మఱియు హే శిష్యా ! యేపదార్థ మాదికాలమందు లేదో, ఆ పదార్థము మధ్యకాలమందును లేక పోవుచున్నది. యెట్లన రజ్జుసర్పము ఆదికాలమందు లేదు. అంత్యకాలమందులేదు. అందువలన మధ్యకాలమందునులేదు. అట్లే అధిష్ఠాన బ్రహ్మమందు జగత్తున్ను త్రికాలమందును లేదు. ఇటువంటి అసత్య జగత్తు, సత్యరూపాధిష్ఠానమైన బ్రహ్మసత్తనంగీకరించియే సత్యరూపముగ ప్రతీతమగుచున్నది. ఎట్లు లోహపిండము అగ్ని సంబంధముచే అగ్నిరూపతను పొందుచున్నదో, అట్లే అధిష్ఠానమైన సత్యబ్రహ్మముయొక్క తాదాత్మ్యసంబంధముచే యీ మిథ్యాజగత్తున్ను సత్యరూపముగ ప్రతీతమగుచున్నది. హే శిష్యా ! ఈ విషయమందు తైత్తిరిబ్రాహ్మణశ్రుతి " అసద్వా ఇద మగ్ర ఆసీత్ తతోవై సదజాయత తదాత్మానం స్వయమకురుత తస్మాత్తత్సుకృతముచ్యతే'' భావార్థము — దృశ్యమానమైన ఈ జగత్తు స్వోత్పత్తికి పూర్వము అసద్రూపముగనుండెను. ఆ అసత్తచే ఈ సద్రూపజగత్తు పుట్టినది. మఱియు నా కారణబ్రహ్మము, ఆత్మను ప్రపంచరూపముగ నొనర్చుచున్నది. ఈ కారణమువలన నది "సుకృత" మనబడియె. హే శిష్య ! యిట అసత్ శబ్దముచే నీవు అత్యంతాభావరూపశూన్యమును గ్రహణము చేయకుము అస్పష్టనామరూపములు గల జగత్తును గ్రహణముచేయుము. ఆ యస్పష్టజగత్తు సృష్టికాలమందు స్పష్టనామరూపము గలదగుచున్నది. మఱియు ఈ సంపూర్ణజగత్తు కారణరూప బ్రహ్మసత్తచేతనే సత్యరూపమున ప్రతీతమగుచున్నది. స్వభావముగా సత్యరూపముకాదు యీ లాగున బ్రహ్మసత్తచేతనే జగత్తు సత్యరూపమగుటవలన ఆ బ్రహ్మమును శ్రుతి భగవతి 'సుకృత' నామముచే కథనము చేయుచున్నది

హే శిష్యా ! ఈ జగదుత్పత్తి ప్రకరణము బ్రహ్మరూపాత్మయొక్క సత్యరూపతను స్పష్టీకరించుటకొఱకు ప్రవృత్తమైనను, తదభిప్రాయమెఱుగక కొందఱు మందబుద్ధులగు పురుషులు 'అసద్వా' యను శ్రుతివచనముచే కారణమునకు సత్యరూపత

కథనముచేసి దానికి దృష్టాంతమును జీవప్రధ్వంసాభావముచే అంకురోత్పత్తియను దాని నంగీకరించుచున్నారు మఱికొందఱు అర్ధవైనాశిక నైయాయికులు 'అసద్వా' శ్రుతియందు స్థితమైన కార్య ప్రపంచమునకు వాచకమగు ఇదం శబ్దమునకు అసత్ శబ్దముతోటి సమానాధికరణమును కల్పనచేసి, కార్యకారణసకలజగత్తును శూన్యరూప మనుచున్నారు. హే శిష్య ! యీ ప్రకారముగ మందబుద్ధులగు కొందఱు కార్యమును, కొందఱు కారణమును, కొందఱు రెంటిని అసత్తనుచున్నారు. ఆ మందబుద్ధులగు పురుషుల నిట్లడుగవలయును — కారణాదుల నసత్తనుట కేవలము యుక్తిబలము చేతనా ? అథవా శ్రుతిబలముచేతనా ? యుక్తిబలముచే నను ప్రథమ పక్షము సిద్ధింపదు. ఏలాగుననగా — అష్టమాధ్యాయములో ప్రాగభావకారణతకు ఖండనము చేయుచువచ్చియున్నాము. శ్రుతిబలముచే నను ద్వితీయపక్షమున్ను సంభవింపదు. ఏలాగుననగా "సత్యంజ్ఞానమనన్తంబ్రహ్మ" యను శ్రుతియందు బ్రహ్మరూపతచెప్పి ఆ సత్యబ్రహ్మముచే జగదుత్పత్తిని కథనముచేయువాడైన వేదభగవంతుడు "అసద్వా" వచనముచే, ఆ కారణరూపసత్యబ్రహ్మమున కసత్యరూప మెట్లు చెప్పును ? చెప్పడు అట్లు చెప్పినప్పుడు నా ముఖమందు జిహ్వలేదని భాషణముజేయువానివలె వేదభగ వంతుడును వదతోవ్యాఘాతదోషముగలవాడగును. ఈలాగున "అసద్వా" శ్రుతికి కారణ సంబంధ అసత్యతయందు తాత్పర్యములేదు.

హే శిష్య ! ఆశ్రుతి యొక్క యథార్థ మెఱుగక. ఏ యర్ధవైనాశిక నైయాయికులు ఉత్పత్తికి పూర్వము జగద్రూపకార్యమును అసత్తనుచున్నారో వారి మతమందు వర్తమానకాలమందును జగద్రూపకార్యమునకు సత్యరూపత కాకుండవలసియుండె. మృత్తికా సంబంధఘటశరావాదికార్యములందును సర్వజీవులకు అసత్యబుద్ధి కావలసి యుండె, అట్లైవనికిని కాదు ఘటోఽస్తి పటోఽస్తి — యీ ప్రకారముగల సత్య బుద్ధియే అగుచున్నది. అథవా — ఒకచో అసత్యతయందే శ్రుతికి తాత్పర్యమైన పక్ష మందు "అసద్వా ఇదమగ్ర ఆసీత్" అను శ్రుతి కనంతరము జగత్సత్యతాప్రతిపాదక మైన 'తతోవైసదజాయత" అని గల శ్రుతివచనము అసంగతమగును. వాది — హే సిద్ధాంతీ ! ఈ కార్యరూప జగత్తు స్వభావముగ సత్యరూపముగానిదైనను కారణ రూప బ్రహ్మసత్తచే సత్యరూప మెందుకు కాకూడదు ? సిద్ధాంతి - ఓ వాదీ ! సత్య బ్రహ్మము యొక్క తాదాత్మ్య సంబంధముచే ఈ కార్యరూపజగత్తు సత్యరూపమైనదను విషయమును నీవంగీకరించినప్పుడు అది మాకు యిష్టమే అయియున్నది. బ్రహ్మ సత్తచే జగత్సత్యతను మేము నివారణముచేయము ఇవ్విషయమును బోధనచేయుట కొఱకే "అసద్వా" యిత్యాదులు కథనము చేయబడియె.

శిష్యుడు — హేభగవన్! ఒక గృహమునుండి ఒకవస్తువును ఒక గృహస్థుడు తీసికొనిపోవుచున్నాడు — అట్లే బ్రహ్మసత్తను ప్రపంచమునం దెవరు తీసికొని వచ్చుచున్నారు? గురువు — హేశిష్యా! అనాది మాయచే గావింపబడినదైనట్టి, ఆత్మయందనాత్మాధ్యాసమేదికలదో, ఆ యధ్యాసమే బ్రహ్మసత్తను జగత్తునందు దీసు కొని వచ్చుచున్నది.

శిష్యుడు — హే భగవన్! బ్రహ్మభిన్నమగు వేదైన నొక పదార్థము తన సత్తచే జగత్తునకు సత్యరూప మెందుకు కలుగజేయదు? గురువు — హేశిష్యా? ధనవంతుడగు పురుషుడే నిర్ధనుని ధనవంతునిగా చేయునుగాని స్వయముగా నిర్ధనుడు యింకొక నిర్ధనుని ధనవంతునిగా జేయజాలడు. అట్లే సత్యబ్రహ్మమునుండి భిన్న రూపతనుపొంది తానే అసత్యభావమును పొందిన పదార్థము, అసత్య జగత్తును సత్య రూపముగా జేయుటకు శక్యముకాదు

హే శిష్యా! బ్రహ్మభిన్నమగు ఏ పదార్థము జగత్తును సత్యముజేయుటకు ప్రవృత్తమగునో, ఆ పదార్థమున కిట్లుచెప్పవలయును — ఓ పదార్థమా! నీవు అసత్య రూపముగా నున్నావు గనుక మొదట నీ సత్తను సిద్ధింపజేసికొనుము, తర్వాత జగత్సత్తా సిద్ధికై పొమ్ము. నీ సత్తయొక్క సిద్ధికానిచో యిక రెండవదానిసత్తను సిద్ధింప చేయుట సంభవింపదు అథవా శ్రుతిచేతనో, సంపూర్ణ ప్రపంచము బ్రహ్మరూపమని చెప్పబడియె. "సర్వం ఖల్విదంబ్రహ్మ" అను శ్రుతివచనముచే మహాత్ములట్లనే చెప్పిరి. కాన బ్రహ్మభిన్నపదార్థమే లేదు కదా! అథవా ఒకచో యేదైన స్థూల పదార్థము బ్రహ్మముకన్న భిన్నమని అంగీకరించినపుడు "సత్యం జ్ఞానమనన్తం బ్రహ్మ" అను శ్రుతిచే చెప్పబడిన బ్రహ్మమునకు అనంతరూపత సిద్ధింపదు. ఎందు కనగా — ఆకాశాది పదార్థములు పృథివ్యాదులకంటె భిన్నమగుటవలన అవి వస్తు పరిచ్ఛేదముగలవేగాని అనంతరూపములు కావు. అట్లు భేదరూప వస్తుపరిచ్ఛేదము గలదగుటవలన ఆ బ్రహ్మము అనంతరూపము గాకపోవును. మఱియు అనంత రూపముయొక్క అభావమగుటచే బ్రహ్మమునకును యభావమగును. ఎట్లనగా — అగ్నియందుగల ఉష్ణతప్రకాశముల యభావముచే అగ్నియొక్కయే అభావమగు చున్నదిగదా మఱియు బ్రహ్మమున కభావమగుటచే బ్రహ్మబోధనచేయునట్టి యుపని షద్రూపజ్ఞానకాండమప్రమాణమగును; ఆ జ్ఞానసాధనమైన కర్మకాండమున్ను ఉపాసనాకాండమున్నూ, అప్రమాణమగును. సర్వప్రమాణములందు రాజై భ్రమాది దోషరహితమైన వేదభగవంతుడే అప్రమాణమగుటవలన, లోకవచనములును ప్రత్య క్షాదిప్రమాణములును, అప్రమాణములగును. ఈ ప్రకారముగ సకల ప్రమాణము

లప్రమాణమగుటచే దానివలన యే యొక వస్తువునకు సిద్ధికాదు. దీనివలన సిద్ధించు చున్నదేమనగా — లోకమందే యొక యసత్యపదార్థము బ్రహ్మరూపాత్మకన్న భిన్నముకాదు. ఎప్పుడసత్యపదార్థమే భిన్నముకాదో, అప్పుడిక సత్యపదారము భిన్న మగునా? ఎప్పటికినికాదు

హే శిష్యా! "అసద్వా" అను శ్రుతివచనము కారణసంబంధ అసత్యతను బోధన చేయుచున్నదా? కార్యసంబంధ యసత్యతను బోధనచేయుచున్నదా? అథవా రెంటికిని అసత్యతను బోధన చేయుచున్నదా? అను నీప్రకారముగ మూడు వికల్ప ములు మందబుద్ధులగు పురుషులచే చేయబడినవి; ఆ మూడు వికల్పములును సంభ వించవు. ఎందుకనగా — లోకమందు ప్రత్యక్షాదిప్రమాణములచేతనే, ఏ వస్తువు యొక్కయైన సిద్ధియగుచున్నది, ప్రమాణములేక వస్తుసిద్ధి కాదు. ఆ ప్రత్యక్షాది ప్రమాణములు జగత్సంబంధ అసత్యతను సిద్ధింపచేయవు; పైగా 'ఘటోఽస్తిపటోఽస్తి' యిత్యాది ప్రతీతులు జగత్సత్యతను సిద్ధింపచేయుచున్నవి. అథవా — కార్యకారణ మందసత్యతయే ప్రతీతమైనపక్షమందు "అసద్వా ఇద మగ్ర ఆసీత్" అను శ్రుతి యొక్క ఇదం శబ్దముచే కార్యకారణమునుగూర్చి గావింపబడిన కథనము అసంగత మగును. ఏలాగుననగా — ప్రత్యక్షజ్ఞానమునకు విషయమైన సమీపవస్తువును ఇదం శబ్దము కథనము చేయుచున్నది. ఆ ప్రత్యక్షజ్ఞానవిషయత అసత్యవస్తువునందు సంభ వింపదు. అథవా జగద్రూప కార్యకారణమందును ప్రత్యక్షజ్ఞానమునకు విషయత అంగీకరించి మందబుద్ధులగు పురుషులు ఆ కార్యకారణమందు అసత్యరూపత యేది చెప్పుచున్నారో, అది అత్యంత విరుద్ధమైయున్నది.

ఎందుకనగా — అసత్యవస్తువుయొక్క ప్రత్యక్షజ్ఞానము కానేరదు. ఐనప్పుడు అతీతపదార్థముయొక్కయు భావిపదార్థముయొక్కయు ప్రత్యక్షజ్ఞానము కావలసి యుండె, అట్లగుటలేదు. ఉక్త శ్రుతి అసత్యతను ప్రతిపాదనముచేయదు. అస్పష్టతను బోధనచేయుచున్నది; దీనివలన సిద్ధించుచున్నదేమనగా — ఏ బ్రహ్మరూపాత్మ యొక్క సత్తను పొంది అసత్యమైన జగత్తున్ను సత్యభావము పొందుచున్నదో, ఆబ్రహ్మ రూపాత్మయే నిజమైనసత్యము. ఇట్లు చెప్పుటచే బ్రహ్మరూపాత్మకు సత్యరూపత వచింపబడియె.

ఇపుడా బ్రహ్మరూపాత్మకు ఆనందరూపతానిరూపణము గావింపబడుచున్నది. హే శిష్య! ఏబ్రహ్మరూపాత్మ తన ఆనందరూపతచే జగత్తు నానందరూపముగ జేయు చున్నాడో, ఆ బ్రహ్మరూపాత్మ ఆనందస్వరూపుడగుటవలన సర్వజగత్తునకు సారమై

యున్నారు శిష్యుడు — హే భగవన్! యీ బ్రహ్మరూపాత్మ ఆనంద స్వరూపుడనుటకు ప్రమాణమేమి? గురువు — హే శిష్య! బ్రహ్మరూపాత్మ యొక్క ఆనందరూపతయందు బ్రహ్మవేత్తలగు విద్వాంసుల అనుభవమే ప్రమాణము ఏలాగుననగా లోకప్రసిద్ధవిషయానందప్రాప్తిచేయునట్టి ఏ స్త్రీపుత్రధనాదిపదార్థములు గలవో, వాటిచే రహితులై ఈ విద్వాంసులు నేను బ్రహ్మరూపుడనను నీప్రకార జ్ఞానముచే ఆ యానందస్వరూపాత్మను పొంది సర్వదా ఆనందభరితులై ప్రతీతులగుచున్నారు. దీనివలన నీయాత్మదేవుడే ఆనందస్వరూపుడైయున్నాడని తెలియుచున్నది. హే శిష్య! ఈ దేహధారులగు జీవులకు జీవనానుకూలములైన ప్రాణాదులను, తత్క్రియలను ఆనందరూపాత్మగాక యింకెవరు వర్తింపజేయును? ఎవరునుకారు. ఈ ఆనందరూపాత్మదేవుడే వర్తింపజేయుచున్నాడు. హే శిష్య! ఆత్మదేవుని ఆనందస్వరూపతయందు నీవు కొంచెమైనను సంశయము చేయకుము ఎందుకనగా — సకలజీవులు ఈ ఆత్మదేవుని చేతనే సుఖరూపులగుచున్నారు అనాత్మపదార్థములందు సుఖరూపత యెక్కడిది! శిష్యుడు — హే భగవన్! ఆత్మయే ఆనందరూపుడైన పక్షమందు నాకు విషయముచే ఆనందమైనదనిలోకుల కనుభవముకాకుండ వలసియుండె-గురువు హే శిష్య! ఈ యాత్మదేవుడే జీవులకానందప్రాప్తి జేయుచున్నాడు; ఏ జీవులకు ఆత్మానందము అజ్ఞాతమైయుండునో ఆ జీవులకు ఈ యాత్మ పరిచ్ఛిన్నమైన విషయజన్యానందప్రాప్తి జేయుచున్నాడు. మఱియు విద్వాంసులచే జ్ఞాతుడైనాడు. కాన వారికీయాత్మదేవుడు పరిపూర్ణానందప్రాప్తి చేయుచున్నాడు హే శిష్య! ఇటువంటి యానందస్వరూపాత్మ ఒక బ్రహ్మవిద్యచేతనే ప్రాప్తమగుచున్నాడు. అన్యోపాయముచే ప్రాప్తముకాదు ఆ బ్రహ్మవిద్యగలవారైన విద్వాంసులు జీవన్ముక్త్యవస్థయందును విదేహముక్త్యవస్థయందును, ఆ యాత్మస్వరూపానందమును పొందుచున్నారు. బ్రహ్మవిద్యారహితులైన అజ్ఞానులగు జీవులు ఆయానందమును శబ్దస్పర్శాది విషయజన్యమని యెంచుచున్నారు గాన వారికి ఆత్మస్వరూపానందము ప్రాప్తముకాదు

ఇప్పుడు బ్రహ్మవిద్యానిరూపణము గావింపబడుచున్నది. హే శిష్య! అధికారి పురుషుడెప్పుడు త్వంపదార్థమగు ఆత్మయొక్క విచారముచే అభయబ్రహ్మభావమునకు యోగ్యుడగుచున్నాడో మఱియు గురూపదిష్ట 'తత్త్వమసి' మహావాక్యముచే పుట్టినదైన 'నేను బ్రహ్మరూపుడను' అను యీ ప్రకారముగల యభేదజ్ఞానముచే తత్పదార్థబ్రహ్మరూపముతో నభేదభావమును పొందుచున్నాడో, అపుడా యధికారి పురుషుడు అభయబ్రహ్మానందమును పొందుచున్నాడు. ఇటువంటి 'అద్వితీయబ్రహ్మము నేను' అను నీప్రకార యభేదజ్ఞానమునకు బ్రహ్మవిద్య యని పేరు. — హే శిష్య! ఈ బ్రహ్మవిద్య గలవారైన విద్వాంసులే బ్రహ్మమును పొందుదురు. భేదదర్శులగు యవిద్వాంసులు

భయమునే పొందుదురు. విద్వాంసులు భేదమును చూడరు. ఒకచో బహిర్ముఖతచే. అథవా-పండితాభిమానముచే, జీవబ్రహ్మములందు వ్యవహారికభేదమును చూచినపక్ష మందు అవిద్వాంసులు అభేదరూపపర్వత సమీపతచే పరమభయమును పొందు చున్నారు. వ్యావహారికభేదదర్శనము యింత భయదాయకమైనపుడు, వాస్తవభేదము నంగీకరించువారైన అవిద్వాంసులో సాక్షాత్ భేదరూప పర్వతమందే నివాసముచేయు వారు. గాన వారు పరమ భయమును పొందుదురని వేఱుచెప్పనేల! శాస్త్రము నెఱిగి గూడ శాస్త్రార్థమందు నిష్ఠలేని వారైన ప్రమాదపురుషులును, శాస్త్రమెఱుంగనివారైన యజ్ఞానపురుషులును, జన్మమరణాదిభయమునుపొందుదురు కనుక భయనివృత్తిని కోరినవారైన యధికారులు బ్రహ్మవేత్తయగు గురుముఖమున ఆనందరూపాత్మకై శ్రవణమననముల చేయవలయును. అట్లుగాకున్న భేదవాసనల నాశముకానేరదు. హే శిష్య! ఆత్మసాక్షాత్కారము లేనిచో అమాయా విశిష్టపరమేశ్వరుడు విద్వద్దేవతల కును భయప్రాప్తి గావించుచున్నాడు. ఇక అజ్ఞానికి గావించుటనుగూర్చి వేరుచెప్పనేల!

శ్రుతి "యదాహ్యేవైష ఏతస్మిన్నుదరమంతరం కురుతే అథతస్యభయంభవతి"

భావార్థము — ఏ కాలమందే మనుజుడు అద్వితీయాత్మయందు కించిన్మాత్ర భేదకల్పనచేయుచున్నాడో, ఆ కాలమందే ఆభేదదర్శియగు పురుషుడు పరమభయ మును పొందుచున్నాడు.

హే శిష్య! అద్వితీయాత్మయొక్క జ్ఞానములేనిచో ఆ పరమేశ్వరుడు సకల జీవులకు భయప్రాప్తిచేయుచున్నాడు. ఈ విషయమందు తిత్తిరి బ్రాహ్మణ శ్రుతి "భీషాస్మాద్వాతః పవతే భీషోదేతిసూర్యః, భీషాదగ్నిశ్చేంద్రశ్చ మృత్యుర్ధావతిపంచమః"

భావార్థము — ఈ పరమాత్మయొక్క భయముచేతనే వాయువు చరించు చున్నది. సూర్యుడుదయించుచున్నాడు. అగ్ని ప్రజ్వలితమగుచున్నది ఇంద్రుడు వృష్టిగావించుచున్నాడు మృత్యువెక్కడెక్కడనో తిరిగితిరిగి ప్రాణులహననముచేయు చున్నది. హే శిష్యా! సర్వజగద్వ్యవహారము సిద్ధింపజేయువారైన వాయుసూర్యాది ఐదుగురుదేవతలకును, ఆ పరమేశ్వరునిచే భయప్రాప్తమగుచున్నదన, ఇక యితర జీవుల విషయమై వేఱుచెప్పనేల! ఇప్పుడానందముయొక్క న్యూనాధికతలు వచింప బడుచున్నవి. - సకలగుణసంపన్నుడును రూపతారుణ్యములుగలవాడుననగు సార్వ భౌమ చక్రవర్తి రాజుయొక్క సుఖము మనుష్యసుఖమున కవధిగానున్నది. దానికన్న మనుష్య గంధర్వ, దేవగంధర్వ, పితర, ఆజానదేవ, కర్మదేవ, వసురుద్రాదిముఖ్య దేవ, ఇంద్ర, బృహస్పతి, ప్రజాపతి, హిరణ్యగర్భులకు అధికానందము కలదు.

అందు పూర్వపువాని కంటె ఉత్తరపువానికి నూరు నూరు రెట్లు అధికానందముకలదు. ఈ ప్రకారముగ హిరణ్యగర్భుని యానందము విషయానందమున కవధిగానున్నది. ఇటువంటి హిరణ్యగర్భుని యానందము ఆత్మానందరూపసముద్రమునకు ఒకబిందు మాత్రముగానున్నది. ఆత్మస్వరూపానందము అనంతముగానున్నది. ఆ ఆనందమును నిష్కాములైన యధికారి పురుషులు సులభరీతిగా పొందుచున్నారు. వ్యష్ట్యుపాధిగల త్వంపదార్థ పురుషునియందు ఏ యాత్మస్వరూపానందముండునో ఆ యాత్మస్వరూపానందమే సమష్ట్యుపాధిగల ఈశ్వరునియందుండును అందు కించిన్మాత్రము భేదము లేదు ఇటువంటి అద్వితీయాత్మయందు జీవులకు అధిదైవ, అధ్యాత్మ, అధిభూతరూపమేది ప్రతీతమగుచున్నదో, ఆ భేదమాత్మయొక్క అజ్ఞానముచేతనే ప్రతీతమైనది. హే శిష్య వస్తువుయొక్క పరోక్షజ్ఞానమైనను ఎంతవఱకపరోక్షజ్ఞానము కాలేదో, అంతవఱకావస్తుసంబంధభ్రమనివృత్తి కానేరదు అపరోక్షజ్ఞానముచేతనే నివృత్తియగును అట్లు బ్రహ్మాత్మయొక్క పరోక్షజ్ఞానమైనను అపరోక్షజ్ఞానమగువఱకు జీవులకధ్యాత్మాదిభ్రమనివృత్తి కానేరదు అపరోక్షజ్ఞానముచేతనే నివృత్తియగును. హే శిష్య! ఏ యధికారిపురుషులు భ్రమనెఱిగి ఆత్మసాక్షాత్కారముకొఱకు ప్రయత్నముచేసి, అన్నమయాదికోశములందంత్యమైన ఆనందమయకోశ సంబంధపుచ్ఛరూప బ్రహ్మమును సాక్షాత్కారము చేసికొనుచున్నారో, ఆ విద్వాంసులేపదార్థమువలనను భయమును పొందరు తిత్తిరి శ్రుతి "యతోవాచో నివర్తన్తే అప్రాప్యమనసాసహ", "ఆనందం బ్రహ్మణో విద్వాన్ నబిభేతి కుతశ్చన" భావార్థము — శబ్దమునందు వాక్కునకు ప్రవర్తియగుట శబ్దార్థములందు మనస్సునకు ప్రవృత్తియగుట యిది ప్రపంచ వ్యవహారము. అద్వితీయబ్రహ్మమో శబ్దరూప అర్థరూప ప్రపంచముకన్నను వేరుగనున్నది. కనుక ఈ అద్వితీయబ్రహ్మమునందు వాక్కునకును, మనస్సునకును, ప్రవృత్తిగానేరదు. ఇటువంటి ఆనందస్వరూపబ్రహ్మమును ఏ విద్వాంసుడు తన ఆత్మరూపముగా నెఱుగుచున్నాడో, ఆ యభేదదర్శియగు విద్వాంసుడు ఎవనివలనను భయమును పొందడు. అజ్ఞానియైన భేదదర్శినో పాపపుణ్యములు రెండును తపింపజేయుచున్నవి (పాపము చేయుచున్నాడు గాన దానికి తాపరూపఫలము, పుణ్యము చేయలేదు గాన పశ్చాత్తాపము) హే శిష్య! ఈ ప్రకారముగ తిత్తిరి బ్రాహ్మణులు తమ శిష్యులకు బ్రహ్మవిద్యోపదేశముచేసిరి. ఆ బ్రహ్మవిద్య అధికారిజనులైన మనకు ఆత్మరూపానందప్రాప్తికి కారణమైయున్నది ఇప్పుడు భృగువల్లీనిరూపణము గావింపబడుచున్నది.

హే శిష్యా, పూర్వము ఆనందవల్లియందు, అధికారిపురుషులు తమ ఆత్మ నెఱుగుచున్నారు ఈ విషయమై ఆ తిత్తిరిబ్రాహ్మణులు పితాపుత్రుల యితిహాసరూప

ముగ నుపదేశముచేయుచున్నారు. శ్రవణముచేయుము. పూర్వకాలమందు వరుణుడను ఋషికి భృగువను పుత్రుడుండెను. ఆ భృగుఋషి ఒకకాలమందు పితృసమీపమునకువచ్చి యిట్లు ప్రార్థనచేసెను. హే భగవన్! ఏ బ్రహ్మమును నీ వెఱింగితివో ఆ బ్రహ్మమును నాకుపదేశముచేయుము అప్పుడా వరుణపిత తన మనస్సులో విచారముచేయుచున్నారు ఇప్పుడు భృగువునకు నేను త్వంపదార్థమైన ఆత్మయొక్కయు తత్పదార్థమైన బ్రహ్మముయొక్కయు ఉపలక్షణము కథనముచేసెదను. బుద్ధిమంతుడైన పక్షమందు నాతడు ఆ ఉపలక్షణపదార్థములచే నుపలక్షితమైన చైతన్యాత్మను తానే యని యెఱుగును హే శిష్య! ఈ ప్రకారముగ పుత్రునిబుద్ధియొక్క పరీక్షకొఱకు ఆవరుణపిత మొదట త్వంపదార్థనిరూపణము చేయుచున్నాడు. హే భృగో! యీ స్థూలశరీరము పంచప్రాణములు, పంచకర్మేంద్రియములు, పంచజ్ఞానేంద్రియములు మనస్సు చిత్తము అహంకారము మొదలగు ఏ వ్యష్టి సమష్టిరూప పదార్థములు భోగ్యరూపముచే సకల జగత్తునందు స్థితములైయున్నవో ఆశరీరాదిపదార్థములకన్న అధికమగు ఏ యొక్క పదార్థమును లోకమునందు లేదు. అభిప్రాయము — స్థూలశరీరాది భోగ్యపదార్థములెన్నిగలవో, వాటికి భోక్తరూపసాక్షిలేనిచో సిద్ధముకానేరదు. కనుక భోగ్యపదార్థములకు భోక్తయైన సాక్షియుగలదు మఱియు ఓ భృగూ! తత్పదార్థమైన బ్రహ్మముయొక్క ప్రాదుర్భావమునకు సాధనము లోకమందు ప్రసిద్ధమైయుండ లేదు. ఇటువంటి బ్రహ్మప్రాదుర్భావముకొఱకు నేను నీకు ఆ బ్రహ్మముయొక్క లక్షణము చెప్పెదను. ఆ లక్షణమును విచారించి నీవు నీ బుద్ధిచే పూర్వము చెప్పబడిన శరీరాదిపదార్థములందు ఏదో యొకపదార్థమును బ్రహ్మరూపముగా నెఱుంగుము. అథవా ఆ శరీరాదిపదార్థములకన్న భిన్నమైన ఏదో యొక్క పదార్థమును బ్రహ్మరూపముగ నెఱుంగుము అట్లెఱుగుట నీ బుద్ధి కధీనమయ్యేయున్నది. ఇప్పుడా బ్రహ్మలక్షణము నిరూపింపబడుచున్నది — ఏ యుపాదానకారణముచే, యీ భూతభౌతికజగత్తు పుట్టుచున్నదో, దేనియందు ఈ సంపూర్ణజగత్తు స్థితమైనదో, మఱియు దేనియందు లయమును పొందుచున్నదో, ఆ యుపాదానకారణమే బ్రహ్మమై యున్నది.

హే శిష్య! ఎట్లు పూర్వము "సత్యం జ్ఞానమనన్తం బ్రహ్మ" అని శ్రుతియందు లౌకికదృష్టి నంగీకరించి సత్యము, జ్ఞానము, అనంతము అను నీమూడు లక్షణములును శాస్త్రదృష్టి నంగీకరించి, 'సత్యజ్ఞానమనన్తం' అను ఒకలక్షణముగాచెప్పబడినదో, అట్లే యిచ్చటను వరుణఋషిచే భృగుపుత్రునకు శాస్త్రదృష్టి నంగీకరించి, జగదుత్పత్తిస్థితిలయములకు కారణమని ఒకే లక్షణముచెప్పబడియె. ఈ ప్రకారముగ ఆ వరుణ

ఋషి తటస్థలక్షణమును కథనముచేసి మఱల భృగువునుగూర్చి యిట్లనియె — ఓ భృగూ ఆ బ్రహ్మమునకు రెండులక్షణములుగలవు. ఒకటి స్వరూపలక్షణము, మఱియొకటి తటస్థలక్షణము, అట బ్రహ్మసంబంధస్వరూపలక్షణము యెఱుంగుటయందు యిప్పుడు నీ బుద్ధి సమర్థము కాదు కనుక యిప్పుడు నీకు స్వరూపలక్షణము చెప్పను. తటస్థలక్షణమునే కథనము చేసెదను. ఆ తటస్థలక్షణము నీ బుద్ధియందు శీఘ్రముగ జొచ్చును.

తటస్థలక్షణనిరూపణము — సోమశర్మయొక్క గృహము స్థూలమై సుందరమై మనోహరమైయున్నది. ఆ గృహమందు శుకసారికపక్షులు గలవు. పరదేశియగు ఒక పురుషుడువచ్చి సోమశర్మ గృహమెద్దియని గ్రామస్థుని అడుగుచున్నాడు. అప్పుడా గ్రామస్థుడు శుకసారికలయొక్క విచిత్రశబ్దముగలది సోమశర్మగృహమని చెప్పెను. ఇటుశుకసారికలు సోమశర్మగృహమునకుపలక్షణములై యున్నవి. లక్షకపదార్థమున కభావమైనను లక్ష్యపదార్థమునకభావముకాదు. అది తటస్థలక్షణము ఇట శుకసారికాది లక్షకపదార్థమునకభావమైనను గృహరూప లక్ష్యపదార్థమునకభావముకాలేదు. కనుక ఆ శుకసారికలు గృహమునకు తటస్థలక్షణము. మఱియు లక్షకపదార్థమున కభావమగుటచే లక్ష్యపదార్థమునకును అభావమగుచున్నది. అది స్వరూపలక్షణము. శిష్యుడు — హే భగవన్! వస్తువుయొక్క స్వరూపభూతమగు యే పదార్థముకలదో ఆ పదార్థమందు లక్షణరూపత సంభవింపదు. ఎందుకనగా లోకమందు ఏ పదార్థము లక్ష్యముకన్న భిన్నమగునో, దానియందే లక్షణరూపత యగునుకదా?

గురువు — హే శిష్య! ఎచ్చట స్వరూపలక్షణమగునో అచ్చట ఆ స్వరూప లక్షణమునకు లక్ష్యపదార్థముతోటి వాస్తవభేదములేదు. ఆ లక్షణమునకు వక్తయగు పురుషుడు తనబుద్ధిచే భేదకల్పన చేయుచున్నాడు. ఈలాగున కల్పితభేదము నంగీకరించి స్వరూపభూత పదార్థమందును లక్షణరూపత సంభవించుచున్నది. మఱియు ఎచ్చట తటస్థలక్షణమగునో అచ్చట గో అశ్వములకువలె వాస్తవభేదమే యగును. వాస్తవభేదముకలదై యితర పదార్థములకన్న వేఱుచేసి లక్ష్యపదార్థమును జూపునది తటస్థలక్షణము; ఓ భృగూ! జడత్వ పరిచ్ఛిన్నత్వాది ధర్మములచే జగత్తునందు బ్రహ్మమునకు భేదము ప్రసిద్ధము. ఆ జగద్ధర్మములైన ఉత్పత్త్యాది ధర్మములందు బ్రహ్మమునకు తటస్థలక్షణము సంభవించును. ఆ తటస్థలక్షణముచే లక్ష్యపదార్థము యొక్క వాస్తవస్వరూపము శీఘ్రముగా ప్రతీతముకాదు. సామాన్యముగ ప్రతీతమగును. తదనంతరము అధికారిపురుషుడు యెపుడు ఆ తటస్థబోధకు వచనమును, అనేకయుక్తులచే విచారముచేయునో, అప్పుడాతనికి లక్ష్యపదార్థముయొక్క వాస్తవ

స్వరూపము సాక్షాత్కారమగును. కాబట్టి హే భృగూ! నీవు బ్రహ్మసంబంధవచనమును విచారముచేసి బ్రహ్మసంబంధ వాస్తవ స్వరూప మెఱుగుము. భృగువు — హే భగవన్! స్వభావసిద్ధ ప్రమాణరూపమగు ఏ వేదవచనముగలదో, దానిని స్వబోధ చేయుటయందు విచారరూపమన నాపేక్షసంభవింపదుకదా? వరుణుడు - హే భృగూ! వేదవచనమునకు స్వబోధవిషయకమననాపేక్ష లేకుండినను, శ్రోతలకు అజ్ఞానమువలన ఏ యసంభావనాది దోషములుగలవో, తన్నివృత్తికొఱకు మననాపేక్షకలదు. చక్షురింద్రియమునకు ఘటదర్శనమందు అంజనాదుల అపేక్షలేకున్నను. చక్షువందలి మలినతానివృత్తికొఱకు అంజనాపేక్షకలదు మఱియు నెట్లు గృహస్థితనిధిని గృహస్థ పురుషుడు అంజనములేక చూడజాలడో అట్లే సర్వప్రాణుల హృదయమందు విరాజమానమగు ఏ బ్రహ్మము గలదో, ఆ బ్రహ్మము నీ యధికారిపురుషుడు విచారరూప మననములేక సాక్షాత్కారము గావించుకొనజాలడు.

ఓ భృగూ ఆ బ్రహ్మలక్షణసంబంధవాక్యజ్ఞానము బ్రహ్మసాక్షాత్కారమునకు శ్రేష్ఠమైన యుపాయమైయున్నది. మఱియు ఎట్లు రూపాదిపదార్థజ్ఞానమందు చక్షువునకు అంజనాదులు సహకారులైయున్నవో, అట్లే బ్రహ్మసాక్షాత్కారమందు మననాది విచారమున్ను సహకారియైయున్నది భూనిక్షిప్త ధనమునుచూపునట్టి అంజనము సర్వలోకప్రసిద్ధముకాదు. ఎవడో ఒకానొకడే దానినెఱుగుచున్నాడు. అట్లే బ్రహ్మసాక్షాత్కారమందును లోకప్రసిద్ధ ఉపాయములేదు శ్రుత్యనుకూలములగు అనేక యుక్తులచే ఆ లక్షణవాక్యముయొక్క విచారరూపమననమే ఒక ఉపాయమైయున్నది. ఓ భృగూ! యిటువంటి బ్రహ్మలక్షణ వాక్యముయొక్క జ్ఞానమను ఉపాయము గురుశాస్త్రోపదేశముచే ప్రాప్తమైనను, అది అశుద్ధాంతఃకరణముగలవానికి కించిన్మాత్రమైన ఫలమివ్వదు కనుక అధికారిపురుషులు తమ అంతఃకరణశుద్ధిని అవశ్యముగ జేయవలసినది, ఓ భృగూ! అశుద్ధాంతఃకరణము విషయసంబంధరాగముచే నైనది. ఆ విషయరాగము శరీరేంద్రియగర్వముచే నైనది ఆ గర్వము విషయసంబంధముచేనైనది. ఈలాగున పరంపరగా విషయసంబంధమే అంతఃకరణశుద్ధికి కారణమై యున్నది. కనుక అధికారిపురుషులు విషయసంబంధమును పరిత్యాగము చేయవలయును.

భృగువు — హే భగవన్! అన్నపానాది సకలవిషయ పరిత్యాగముచేయుట వలన అధికారిపురుషుని శరీరమే నాశనమగునుకదా! వరుణుడు — ఓ భృగూ! అన్నపానాది రహితమైనచో శరీరనాశమగును. అధిక అన్నపానమైన గర్వమగును కనుక శరీరనాశమున్ను గర్వమున్ను రాకుండ నంతమాత్రమే అధికారిపురుషులు అన్నపానాదులను గ్రహణముచేయవలయును. అధికవిషయగ్రహణము చేయకపోవుటకే తపస్సని

పేరు ఇటువంటి సంయమరూపతపస్సుచే శరీరేంద్రియగర్వనాశమగుచున్నది ఈ తపముచే అంతఃకరణము రాగద్వేషాదిరహితమగును గురూపదిష్టవచనములను విచారము చేయుటచే బ్రహ్మనిశ్చయమగును ఓ భృగూ! నీవుకూడ ఆ సంయమరూప తపముచే చిత్తశుద్ధి గావించుకొని పూర్వోక్త బ్రహ్మలక్షణములను విచారముజేసి బ్రహ్మ నిశ్చయము చేయుము. హే శిష్య! ఈ ప్రకారము భృగుఋషి వరుణగురుముఖమున బ్రహ్మయొక్క తటస్థలక్షణసంబంధ విచారరూప తపముచేసెను. ఆ తపముచే భృగు ఋషి మొదట అధ్యాత్మాది సమష్టి వ్యష్టి స్థూలశరీరరూప అన్నమయకోశమందు బ్రహ్మలక్షణమెఱిగి ఆ అన్నమయకోశమునే బ్రహ్మరూపముగా నెఱుగుచున్నాడు. అనంతరమా అన్నమయకోశమందును దోషముచూచి మఱల పితృసమీపమునకు పోయి యిట్లనియె.

భృగువు — హే భగవన్! నాకు బ్రహ్మోపదేశముచేయుము వరుణుడు — హే భృగో! నీకు చెప్పబడిన విచారరూపతపమే బ్రహ్మసాక్షాత్కారమునకు ముఖ్య సాధనమైయున్నది. కనుక ఆ తపముచేతనే నీవు బ్రహ్మనిశ్చయముచేయుము. ఇట్లు తండ్రిచెప్పిన ప్రకారముగ విచారరూప తపముచేసి ప్రాణమయకోశమును బ్రహ్మ రూపముగ నెఱిగి దానియందును దోషమునుచూచి మఱల భృగువు పితృసముఖము నకు వచ్చినప్పుడు, తండ్రి పూర్వమువలెనే ఉత్తరమిచ్చెను. ఈ ప్రకారముగ అన్న మయమునుండి ఆనందమయమువఱకు ఐదుమార్లు నిశ్చయముచేసి ఐదుమార్లు విచారముచేసి, ఐదుమార్లు పితృసమ్ముఖమునకువచ్చెను. పితయు ఐదుమార్లు అదే ఉపదేశముచేసెను. కడపట ఆ భృగుమహాఋషి ఆనందమయకోశమునకు పుచ్ఛ ప్రతిష్ఠారూపమగు ఆనందస్వరూపాత్మనే బ్రహ్మరూపముగ నిశ్చయముచేసెను. ఎందుకనగా ఆనందములేక ఏ పదార్థమున్ను కార్యమును పుట్టించదు. ఎట్లనగా స్త్రీ పురుషులు మొదట ఆనందమును పొందియే ప్రజోత్పత్తి చేయుచున్నారు. సకల విషయసుఖమున్ను, బ్రహ్మముతోటి అభేదమైయ్యే ఆనందమగుచున్నది. మరణకాల మందును సకల ప్రాణులు స్థూలసూక్ష్మశరీరాభిమానమును పరిత్యాగముజేసియే ఆనందస్వరూపబ్రహ్మముతోటి అభేదమును పొందుచున్నారు. శిష్యుడు హే భగవన్! అధికారిపురుషులు బ్రహ్మముతోటి అభేదమును పొందిన తర్వాత వారికి మఱల జన్మము కలుగదు సమస్తజీవులు మరణకాలమందు బ్రహ్మముతోటి అభేదమును పొందుచున్నారు. గనుక వారికి మఱల జన్మముగాకుండవలసియుండె. జీవులలో మఱల జన్మమగుచున్నది

గురువు — హే శిష్యా! ఆత్మజ్ఞానముచే అజ్ఞానరహితులై విద్వాంసులు బ్రహ్మభావమును పొందుదురు. ఇతర జీవులో అజ్ఞాన సహితముగానే బ్రహ్మముతో

అభేదమును పొందుచున్నారు కనుక మఱలజన్మమునకు వచ్చుచున్నారు హే శిష్య! ఈ ప్రకారము ఆ భృగుమహాఋషి విచారరూపమననముచేసి ఆత్మసాక్షాత్కారమును పొందెను హే శిష్యా! వరుణమహర్షిచే భృగువునకుపదేశముచేయబడిన ఈ బ్రహ్మవిద్య, ఆనందస్వరూపాత్మనే బోధనచేయుచున్నది. ఈ బ్రహ్మవిద్యచే భృగుమహర్షి సర్వాత్మభావమును పొందెను ఇటువంటి బ్రహ్మవిద్యను ఏ అధికారిపురుషులు గురుముఖమున శ్రవణముచేసి విచారరూపమనన మొనర్చెదరో ఆ అధికారిపురుషులు సర్వాత్మభావరూపఫలమును పొందుచున్నారు. హే శిష్య! సమష్టిరూప అన్నమయాది కోశములను ఏ పురుషులు తమ ఆత్మగ నెఱుగుచున్నారో, వారికి శ్రుత్యుక్త సకల అన్నప్రాప్త్యాది ఫలమెట్లు ప్రాప్తమగుచున్నదో, అట్లే యే పురుషులు బ్రహ్మాత్మ నెఱుగుదురో, వారికానందస్వరూపబ్రహ్మప్రాప్తి అవశ్యముగా నగుచున్నది. హేశిష్యా! యీ ప్రకార విచారరూప మననముయొక్క బలముచే విద్వత్పురుషులు అన్నమయాది పంచకోశముల పరిత్యజించి జీవన్ముక్తరూపులై స్థితులగుచున్నారు. మఱియు ఆయాత్మ జ్ఞానప్రభావముచే ఆ విద్వాంసులు సర్వాత్మ భావరూపఫలమును అనుభవముచేయుచున్నారు. ఇది బహు ఆశ్చర్యము గనున్నది. పరమాత్మదేవుడిట్లనుచున్నాడు — నేనొకడనే ఆత్మదేవుడను. అన్నాదిభోగ్యరూపములచే మఱియు పురుషాదిభోక్తల రూపములచే నేను స్థితుడనైయున్నాను. ఏ కృపణులు దేవతలు అతిథులు మొదలగు వారికి అన్నముపెట్టక తమ ఉదరభరణమే చేయుచున్నారో, ఆకృపణులను పరమాత్మదేవుడనగు నేను మృత్యురూపుడనై భక్షణముచేసెదను. మఱియు నేను ఋగాది వేదములను మంత్రరూపముగజేయుచున్నాను. ఋషిరూపంబులచే యా వేదములకు ద్రష్టరూపుడనై స్మరణముచేయుచున్నాను. కర్మోపాసనలకు స్వర్గాదిఫలరూపముచే స్థితుడనైనాను మఱియు నేను సమష్టిసూక్ష్మ హిరణ్యగర్భరూపముచే సమష్టి స్థూలవిరాడ్రూపముచే సమస్తవ్యష్టి దేవతలకన్నను మొదటనేయుంటిని. నేను బ్రహ్మానంద స్వరూప మోక్షమునకును, దుఃఖరూపసంసారచక్రమునకును మధ్యమందు నాభివలె నున్నాను. అభిప్రాయము — పరమాత్మదేవుడనగు నేనే జీవులకు మోక్షప్రాప్తి చేసెదను. సంసారప్రాప్తిజేసెదను. మఱియు నేనే ధర్మార్థకామమోక్షములను నాల్గు పురుషార్థముల రూపముగనున్నాను. నేనే అన్నాదిపదార్థరూపముగనున్నాను. నేనే అన్నాదుల దాతరూపముగనున్నాను. కనుక యిటువంటి అన్నాదిరూపమైన పరమాత్మనగునన్ను అతిథ్యాదులకిచ్చి మృత్యువునుండి ఎవడు రక్షణముచేయుచున్నాడో, ఆ అధికారి పురుషుడు పరమాత్మయైన నా యొక్కయే రక్షణముచేయుచున్నాడు. వానికి నేను ప్రసన్నుడనగుచున్నాను. ఏ కృపణ పురుషుడు అతిథ్యాదులకు అన్నదానముచేయక కేవలము తన యుదరభరణము స్త్రీ పుత్రాదుల యుదరభరణము

చేయుచున్నారో, అటువంటి కృపణపురుషుని పరమాత్మదేవుడనగు నేను దినమాస వర్షాదికాలరూపముచేతను, మృత్యురూపములచేతను భక్షణముజేసెదను. సువర్ణమువలె ప్రకాశమానమగు సూర్యమండలస్థిత స్వయంజ్యోతిపురుషుడైన ఆత్మదేవుడనగునేను సకల జగత్తుకన్న నుత్కృష్టముగానున్నాను. — హే శిష్య! ఈ ప్రకారముగ విద్వత్పురుషులు సామగానరూపముగ సర్వాత్మభావప్రాప్తిరూపమగు ఏ తమ అనుభవమును ప్రకటితమొనర్చుదురో, అది తమ స్వార్థముకొఱకుకాదు. అధికారులైన మనపై కృపగల్గి ఆ విద్వాంసులు శ్రుతిభగవతివలె తమ అనుభవప్రకటన చేయుచున్నారు.

ఇపుడు యజుర్వేదసంబంధ నారాయణోపనిషదర్థ నిరూపణము గావింపబడుచున్నది.

హే శిష్య! అవిద్యాజలముచే పూర్ణమైన ఏ సంసారసముద్రముకలదో, ఆ సముద్రమునందు స్థితములైన చతుర్దశభువనములందు యీ ఆనందరూప పరమాత్మదేవుడు ఆకాశమువలె వ్యాపకమైయున్నాడు. కనుక యీ లోకముకంటె పైనమన్న స్వర్గలోకముకన్నను ఈ పరమాత్మదేవుడు పైగానున్నాడు. మఱియు మహత్తర స్వరూపములైన ఆకాశాదులకన్నను మహత్తరముగానున్నాడు. సూర్యాది అధిదైవ రూపములచే స్థితములైన నేత్రాదీంద్రియములందు ఈ పరమాత్మదేవుడు తన స్వయంజ్యోతి చైతన్యరూపముచే ప్రవేశము చేయుచున్నాడు. స్థూలసూక్ష్మకారణరూప ఉపాధిత్రయి సంబంధముచే క్రమముగ విరాట్ హిరణ్యగర్భ ఈశ్వరరూప సంజ్ఞాత్రయమును పొందుచున్నాడు. ఈ పరమాత్మదేవుడు సర్వాత్మతారూపముచే సృష్టిపరంపరను ప్రవర్తింప చేయుచున్నాడు ఈ కారణమువలన యీ పరమాత్మదేవుని శ్రుతిభగవతి "ప్రజాపతి" నామముచే కథనము చేయుచున్నది. మఱియు అధ్యాత్మాదిరూపత్రయముచే స్థితమైన సంపూర్ణస్థావరజంగమప్రాణులహృదయాకాశమందు పరమాత్మదేవుడు సాక్షిరూపముగ విచరించుచున్నాడు. ఈ సంపూర్ణజగత్తు తన ఉత్పత్తిస్థితిలయ కాలములందు పరమాత్మదేవునకే అధీనమైయున్నది. సకల దేవతలును పరమాత్మదేవునకే అధీనులైయున్నారు హే శిష్య! జగత్తు పరమాత్మకధీనమగుటచే నీవు జగత్పరమాత్మలకు భేదమంగీకరింపకుము సంపూర్ణజగత్తు పరమాత్మరూపమనియే యెఱుగుము — శిష్యుడు — హే భగవన్! యిటువంటి పరమాత్మదేవుడు యే వస్తువునందు స్థితమైయున్నాడు?

గురువు — హే శిష్య! పరమాత్మదేవుడు చిదాకాశస్వరూపమగు తనమహిమయందు స్థితమైయున్నాడు. మఱియు ఆకాశభూమి స్వర్గాదులందు సర్వత్ర వ్యాపకమైయున్నాడు. సూర్యమండలస్థితసూర్యభగవంతునిన్ని ఈ పరమాత్మదేవుడే ప్రకాశింప-

జేయుచున్నారు. హే శిష్య! యెట్లు సాలెవారు పటభావప్రాప్తికొఱకు తంతువులను ప్రసరించుచున్నారో, అట్లే సంపూర్ణపదార్థరూపపటమునకాపరమాత్మదేవుడు సూత్ర రూపమని వాల్మీకి మొదలగు కవీశ్వరులు వర్ణనముచేయుచు, ఆ పరమాత్మను జగద్రూప పటముచే నిరూపణ చేయుచున్నారు. అభిప్రాయము— సూత్రముకన్న పటముభిన్నము కానట్లు జగద్రూపపటమున్ను పరమాత్మ సూత్రము కన్న భిన్నముకాదు. కనుక వాల్మీ కాదులచే జగత్సూత్రరూపముగ భగవద్వర్ణనము చేయబడియె. శ్రుతి "య ఇమే వీణాయాం గాయన్తి ఏతమేవ తే గాయన్తి" భావార్థము — లౌకిక పురుషులు వీణపై యేగానముచేయుచున్నారో, అది పరమాత్మయొక్క యే గానమైయున్నది. హే శిష్య! సర్వముకన్న నుత్కృష్టమైన యే పరమాత్మదేవుడు కలడో, ఆ పరమాత్మదేవుడు హిరణ్యగర్భుని ద్వారా సకలజగత్తును సృజించి జీవరూపముగ నందుప్రవేశము జేయు చున్నారు. ఆ పరమాత్మకన్న సూక్ష్మమగు పదార్థము ఏయొకటియు స్థూలపదార్థము ఏయొకటిన్నిలేదు. శ్రుతి "అణోరణీయాన్ మహతో మహీయాన్" (యిచ్చట అణు శబ్దముచే దుర్విజ్ఞేయమని గ్రహింపవలెను) ఈ పరమాత్మదేవుడు భేదరహితమగుట వలన అనంతమైయున్నారు. జగత్కారణమగుటవలన పురాణమైయున్నారు అజ్ఞాన రూప తమస్సుకన్న పరమగుటవలన స్వయంజ్యోతియైయున్నారు. హే శిష్య! శాస్త్ర విహితమైన మనోవ్యాపారమునకు పేరు ఋతము. శాస్త్రవిహితశరీరవ్యాపారమునకు సత్యమనిపేరు. ఆ ఋతసత్యపుణ్యకర్మములు జీవులకు సుఖరూపఫలప్రాప్తి చేయు చున్నవి. ఈ ద్వివిధకర్మలును పరమాత్మరూపమేయైయున్నవి. మఱియు ఈపరమాత్మ దేవుడే అగ్నిహోత్రాది యిష్టి కర్మరూపమైయున్నారు. ఈతడే వాపీకూప తటాకాది పూర్తకర్మరూపమైయున్నారు. మఱియు సంపూర్ణజగత్తు పరమాత్మదేవునియందే స్థితమై యున్నది ఈ కారణమువలన బ్రహ్మవేత్తలు ఆ పరమాత్మదేవుని సంసారచక్రము నకు నాభిరూపముగ కథనముచేయుచున్నారు. ఈ పరమాత్మదేవుడే సకల దేవతా రూపమైయున్నారు. మఱియు ఈతని చేతనే నిమిష ముహూర్తరాత్రిదిన సంవత్స రాది రూపకాలము పుట్టుచున్నది

హే శిష్య! ఈ పరమాత్మదేవుడే పంచభూతమయ త్రిలోకిరూప గోవునుండి నానాప్రకార భోగ్యరూపదుగ్ధమును దోహనము చేయుచున్నారు. ఆదుగ్ధము జీవులగు మనకు సుఖకారకముగ ప్రతీతమగుచున్నది. హే శిష్య! ఈ పరమాత్మదేవుడు సకల జీవులకు నిరతిశయ ప్రీతికి విషయమైయున్నారు. ఈ కారణమువలన శ్రుతిభగవతి యీ పరమాత్మదేవుని "మహద్యశః" అనునామముచే కథనముచేయుచున్నది. ఈ పరమాత్మదేవుడు అంతర్ముఖమైన శుద్ధబుద్ధిచేతనే యెఱుగబడుచున్నారు. మఱియు సూర్యమండలమందు స్థితుడై తన అస్తిభాతి ప్రియరూపముచే ఈ జగత్తును అస్తిభాతి

ప్రియరూపముగ జేయుచున్నారు. ఈ పరమాత్మదేవుని అధికారపురుషులు బ్రహ్మ విద్యచే పొందుదురు. ఏ పరమాత్మదేవుడు అనంత నిర్గుణ చిద్ఘన ఇత్యాదిరూపములచే స్థితుడైయున్నాడో, ఆ పరమాత్మదేవుడే హిరణ్యగర్భునియొక్క వాస్తవస్వరూపమై యున్నాడు. ఇటువంటి స్వయంజ్యోతియగు పరమాత్మదేవుని మంత్రద్రష్టనైన ఋషి నగునేను నాయాత్మ స్వరూపముగ నెఱుగుచున్నాను. నావలెనే యింక నెవడైనను అధికారి పురుషుడు ఆ స్వయంజ్యోతియగు పరమాత్మదేవుని "నేను బ్రహ్మరూపుడ" నను ఈ ప్రకారముగ తన ఆత్మరూపముగ నెఱుగుచున్నాడో, ఆ అధికారి పురుషు డున్ను వర్తమానకాలమందే బ్రహ్మరూపుడై మరణానంతరము శుద్ధబ్రహ్మమునే పొందుచున్నాడు. ఇటువంటి అద్వితీయబ్రహ్మప్రాప్తి కొఱకు, బ్రహ్మజ్ఞానము తప్ప యింకొక మార్గములేదు.

ఇప్పుడు బ్రహ్మజ్ఞానప్రాప్తికొఱకు మొదట త్వంపదార్థశోధనము గావింపబడు చున్నది. హే శిష్య! జననీ జఠరమందు స్థితమైన బాలకునివలె ఆదిత్యమండలమందు స్థితుడైన ఈ స్వయంజ్యోతియగు పురుషుడే, విరాడ్రూపమున సర్వజీవుల యంతః స్థితుడై నానాప్రకారసృష్టిని గలుగజేసి విచరించుచున్నాడు శరీరాద్యుపాధులకు జన్మమరణములు గలిగినను ఆ పరమాత్మదేవుడు జన్మమరణ రహితుడైయున్నాడు. శాస్త్రవేత్తలెట్లు సూర్యకిరణములకు సూర్యమండలము కారణమనుచున్నారో, అట్లు విరాట్టునకు ఆ పరమాత్మదేవుడే కారణమని యనుచున్నారు.

ఇప్పుడు త్వంపదార్థ శోధనముచేయుచు చిత్తశుద్ధికొఱకు మొదట ఆ పరమాత్మ దేవుని ఆరాధన ప్రకారము నిరూపింపబడుచున్నది. హే శిష్య! అగ్న్యాది అధిదైవ ములు, వాగాది అధ్యాత్మములు ఆసమస్తముయొక్క ఉపకారము కొఱకు ఆ పర మాత్మ దేవుడు ఆదిత్యమండలమందు స్థితమై సర్వత్ర ప్రకాశము చేయుచున్నాడు. మఱియు యింద్రాది దేవతలు, పురోహితుడైన బృహస్పతియు ఏ పరమాత్మ దేవుని విభూతిమై యున్నారో ఆ పరమాత్మ దేవుడు విభూతిరూప సకల దేవతలకన్న పూర్వము ఆదిత్యరూపముచే ప్రాదుర్భావమగుచున్నాడు ఇటువంటి స్వప్రకాశ చైతన్యరూప పరమాత్మదేవునకు అధికారులమైన మాయొక్క పలుమారు నమస్కారములు.

హే శిష్య! యిటువంటి నారాయణరూప పరమాత్మదేవునిచే అగ్న్యాది దేవత లకు ఈ ప్రకారమగు వరము యివ్వబడినది. ఓ దేవతలారా! ఆదిత్యరూపుడనైన యానందస్వరూప పరమాత్మదేవుడనగు నేను నాయొక్క ప్రసన్నత కొఱకు ఏ అధి కారి పురుషులు శ్రద్ధాభక్తిపూర్వకముగ నాకు నమస్కారము చేయుచున్నారో, ఆ అధికారి పురుషుల సర్వపాపనివృత్తియగుగాక! వారి అంతఃకరణశుద్ధి యగుగాక!

ఆ శుద్ధాంతఃకరణమందు పరమాత్మదేవుడనైన నా యొక్క సాక్షాత్కారముకూడ వారికగుగాక !

శిష్యుడు-హేభగవన్ ! దేవతలకు పరమాత్మచే యెప్పుడు వరమివ్వబడినది !

గురువు - హేశిష్య ! పూర్వమగ్న్యాది దేవతలు ప్రకాశమానుడైన ఆదిత్య రూప పరమాత్మదేవునకు నానాప్రకార నమస్కారములుచేసి పరప్రాప్తి కొఱకిట్లు ప్రార్థన చేసిరి. హేభగవన్ ! జగదాత్మరూపుడైన పరమానందస్వరూపుడవగు ఓ భగవంతుడా ! యే అధికారి పురుషులు శ్రద్ధాభక్తి పూర్వకముగ నీకు నమస్కారము చేయుదురో ఆ అధికారిపురుషుల హృదయదేశమందు నీవు సర్వదా ప్రకటమగుము ! అభిప్రాయము - అధికారి పురుషులగు మాకు ఆత్మసాక్షాత్కారమగునట్లు వరమిమ్ము ! హే శిష్య దేవతల యాప్రార్థనచేత సంతుష్టుడైన పరమాత్మదేవుడు అట్లనే దేవతలకావరమిచ్చెను కాబట్టి ఏ అధికారి పురుషులు ఆపరమాత్మదేవునకు శ్రద్ధాభక్తిపూర్వకముగ నమస్కారము చేయుదురో, ఆ యధికారిపురుషులకు పరమాత్మ వరప్రభావముచే ఆత్మసాక్షాత్కారము అవశ్యముగనగును. హే శిష్య ! ఆత్మసాక్షాత్కారము కొఱకు ఆ పరమాత్మదేవునకు నమస్కారము చేయుచు ఆ యధికారిపురుషులిట్లు స్తోత్రము చేయుచున్నారు

ఓ పరమాత్మదేవుడా ! ఐశ్వర్యాభిమానిదేవతారూపమగు ఏ శ్రీ గలదో, మఱియు సౌందర్యాభిమానిదేవతారూపమగు ఏ లక్ష్మిగలదో, ఆ శ్రీలక్ష్ము లిద్దరును నీకు భార్యలై యున్నారు మఱియు సర్వపదార్థములచే యుక్తమైన దినరాత్రిరూపమగు కాలము నీకు పార్శ్వస్థానమై యున్నది. సమస్తతారాగణము నీయొక్క ప్రకాశమానరూపమై యున్నది ద్వంద్వరూపముచే ప్రసిద్ధమైన స్వర్గపృథ్వులు రెండును నీకు ప్రసృతముఖములై యున్నవి. ఓ దేవతల ఈశ్వరుడా ! అధికారి జనులైన మాకు మోక్షప్రాప్తి గావించుటకొఱకు నీ స్వయంజ్యోతియైన ఆనందస్వరూపమును ప్రకటనచేయుమా ! ఓ భగవంతుడా ! అధికారిజనులమైన మేము నీకు మఱలమఱల నమస్కారము చేయుచున్నాము.

ఇప్పుడు హిరణ్యగర్భుడను అంతర్యామి రూపముచే ఆ నారాయణ దేవుని నిరూపణ గావింపబడుచున్నది. ఏ హిరణ్యగర్భదేవుడు సర్వజగత్తుకన్న మొదటనే ప్రకటమై సర్వజగత్తునకు మహేశ్వరుడాయెనో, మఱియు గృహమునకు స్తంభమువలె త్రిలోకరూపగృహమును ధారణ చేయుచున్నాడో, అటువంటి హిరణ్యగర్భదేవుని ప్రసన్నతకొఱకు అధికారి జనులమగు మేము మా వర్ణాశ్రమానుసారముగ, ఘృతాది హవిష్యపదార్థములచే అర్పనము చేయుచున్నాము. సకలచేతనప్రాణులకు హిరణ్య

గర్భదేవుడధిపతియైయున్నాడు. ఈ కారణమువలన ఆ హిరణ్యగర్భదేవుడు రెండు పాదములు గల మనుష్యులయొక్కయు, నాలుగు పాదములు గల అశ్వాదుల యొక్కయు నియంత యగు ఈశ్వరుడుగా నున్నాడు. ఇటువంటి హిరణ్య గర్భదేవుని అధికారి జనులమగు మేము శరణాగతులమగుచున్నాము. అథవా! ఏ హిరణ్యగర్భదేవుడు ఆత్మసాక్షాత్కారమొందిన యధికారి జనులకు తన స్వరూప ప్రాప్తిచేయుచున్నాడో, మఱియు బలప్రాప్తి చేయుచున్నాడో, ఏ హిరణ్యగర్భదేవుని సర్వదేవతలు ఆరాధనము చేయుచున్నారో, ఏ హిరణ్యగర్భ దేవునకు సర్వదేవతలు శిష్యరూపులుగా నున్నారో, ఏ హిరణ్యగర్భదేవునివలన సర్వదేవతలు ఆశీర్వాదములు పొందుచున్నారో, మోక్షమృత్యువు లెవని కధీనములుగా నున్నవో, అటువంటి హిరణ్యగర్భదేవుని అధికారిజనుల మగు మేము శరణాగతి నొందుచున్నాము. అథవా, హిమాచలాది సమస్త పర్వతములు, ఏ హిరణ్యగర్భుని విభూతిరూప మహిమగలవో ఎట్లు సరోవరాదులు బాలకులకు క్రీడాస్థానములై యున్నవో, అట్లు హిమాచలాది తటములుగల సప్తసముద్రములు, పాతాళము, ఏ హిరణ్య గర్భునకు క్రీడాస్థానములై యున్నవో, పూర్వపశ్చిమాది సకలదిశలు ఏ హిరణ్య గర్భునకు భుజములైయున్నవో, అటువంటి హిరణ్యగర్భదేవుని చరణములకు అధికారి జనులమగు మేము శరణాగతులమగుచున్నాము. అథవా, ఏ హిరణ్యగర్భదేవుని సత్తచే పృథ్వి జలముపై స్థితమైయున్నదో, ఏ హిరణ్యగర్భుని సత్తచే స్వర్గమాకాశమందు స్థితమైయున్నదో, ఏ హిరణ్యగర్భుని వాస్తవస్వరూపమును పృథ్వీస్వర్గములు తమ మనస్సులో సదా ధ్యానము చేయుచున్నవో, మఱియు ఆధ్యానముచే నవి సర్వదా శోభాయ మానమగుచున్నవో ఏ హిరణ్యగర్భుని భయముచే సూర్యచంద్రులు రాత్రిందివములు భ్రమణము చేయుచున్నారో, అటువంటి హిరణ్యగర్భదేవుని అధికారిజనులమగు మేము శరణాగతులమగుచున్నాము. అథవా! ఏ హిరణ్యగర్భదేవుని విభూతిరూప క్షత్రధర్మమునందు ప్రీతిగలవారై యింద్రాది మహాశూరవీరులు ఉగ్రతచే ప్రసిద్ధులగు దురో, యెవని అనుగ్రహమువలన పృథ్వి అత్యంత బలవతియైనదో, ఎవని ప్రభావ ముచే పృథ్వి బ్రహ్మాండభారముచే యుక్తమైనను నౌకవలె జలమందు మునుగదో, మఱియు స్తంభముచే ధరింపబడినదైన గృహమువలె క్రిందికి పడదో, ఎవనిచే ధారణ చేయబడుటవలన స్వర్గలోకము, అంతరిక్షలోకము, బ్రహ్మలోకము క్రిందికి పడక యున్నవో, అటువంటి హిరణ్యగర్భదేవుడు అగ్న్యాదిదేవతలు నిలుచుటకై మందిరమైనట్టి వైశ్వానరరూపమును ధారణచేయుచున్నాడు. కనుక ఆ హిరణ్యగర్భదేవుడు పరిమాణ రహితుడుగానున్నాడు ఇటువంటి హిరణ్యగర్భదేవుని అధికారి జనులమగు మేము శరణాగతులమగుచున్నాము. అథవా — గంగానదీజలమెట్లు సముద్రరూపపతికి

ఆశ్రితమైయున్నదో, అట్లే అవ్యాకృతప్రకృతిమాయానామములచే ప్రసిద్ధమైన అవిద్యారూపజలము ఏ హిరణ్యగర్భపతిని ఆశ్రయముచేయుచున్నదో అటువంటి హిరణ్యగర్భదేవుని శరణాగతిని అధికారిజనులమగు మేము పొందుచున్నాము. అధవా — ఏ హిరణ్యగర్భదేవుడు తన ప్రకాశముచే అవిద్యారూపజలమును ప్రకాశముచేయుచున్నాడో, ఏ హిరణ్యగర్భదేవుడు సకల జీవుల కాత్మరూపముగనున్నాడో, ఏ హిరణ్యగర్భదేవుడు యింద్రాదిదేవతలకధిపతిగా నున్నాడో, అటువంటి హిరణ్యగర్భదేవుని ప్రసన్నము జేయుటకొఱకు ఘృతాది హవిష్య పదార్థములచే అర్చనముచేయుచు అధికారి జనులమగు మేము యాతనికి శరణాగతులమగుచున్నాము. మఱియు, సాధన రహితులకు అయోగ్యమై సర్వత్ర వ్యాపకమైనట్టి చైతన్యస్వరూపహిరణ్యగర్భదేవునకు, అధికారి జనులమగు మేము మఱల మఱల నమస్కారము చేసెదము. సర్వధర్మ రహితుడై సకలాత్మస్వరూపుడైన ఆ హిరణ్యగర్భదేవుడు ముముక్షులమగు మాకు బ్రహ్మసాక్షాత్కారము గలుగచేయుగాక !

హే శిష్య ! ఈ ప్రకారముగ ఏ అధికారిపురుషులాపరమాత్మయగు నారాయణ దేవుని హిరణ్యగర్భరూపముచే వైశ్వానరరూపముచే, నమస్కారము చేయుచున్నారో, స్తుతి చేయుచున్నారో. ఆ యధికారిపురుషులకు ఆ పరమాత్మయగు నారాయణదేవుడు అవశ్యముగ బ్రహ్మసాక్షాత్కారము గావింప చేయుచున్నాడు. ఆ పరమాత్మయగు నారాయణదేవుడు స్థూలజగదుత్పత్తికి పూర్వము హిరణ్యగర్భరూపముచే జనించుచున్నాడు. కనుక పూర్వాది సకలదిశలును, త్రైలోక్యమును, విరాట్ భగవంతుడును, నారాయణరూపుడేయగును జరాయుజాది చతుర్విధ శరీరములును, నారాయణ రూపములే యైయున్నవి.

హే శిష్య! అంతర్ముఖులైన ఏ యధికారి పురుషులు యీ నారాయణదేవుని బుద్ధ్యాదిసకల పదార్థములకన్నను అత్యంత సమీపముగ జూచుచున్నారో, ఆ యధికారి పురుషులకా నారాయణదేవుడు స్వాత్మరూపముగ ప్రతీతమగుచున్నాడు

శిష్యుడు — హే భగవన్! ఈ ప్రకారముగ పరమాత్మదేవుని స్తుతిచేయ ఎవనికైన సాక్షాత్కారమైనదా? లేదా? గురువు — హే శిష్య! పూర్వము వేనుడను నొక గంధర్వునకాయెను. ఆ వేనగంధర్వుడు పూర్వోక్తప్రకారముగ పరమాత్మ దేవుని స్తుతిచేసి నమస్కారముచేసి అంతఃకరణశుద్ధిద్వారమున నారాయణదేవుని సాక్షాత్కారమును పొందెను. ఆసాక్షాత్కారమునుపొంది ఆవేనగంధర్వుడు వామదేవునివలె అధికారిజనులయెడ కృపగల్గి వారికి తన స్వానుభవమును కథనము చేయుచున్నాడు — ఏపరమాత్మ దేవునియందు నానా ప్రకార జగత్తు పుట్టుచున్నదో, స్థితమగుచున్నదో,

లయమును పొందుచున్నదో, ఏ పరమాత్మ దేవుడు జననమరణరహితుడో, అటువంటి ఆనందస్వరూపదేవునివేనగంధర్వుడనగునేను స్వాత్మరూపముగ సాక్షాత్కరించు కొనుచున్నాను. ఆపరమాత్మదేవుడు నాలుగు పాదములుగల్గియున్నారు అందు నొక పాదముచే భూతభౌతిక సంపూర్ణజగద్రూపముగను మూడుపాదములచే తన స్వప్రకాశ సాక్షిరూపముగను స్థితుడైయున్నాడు

శిష్యుడు — హే భగవన్! నాల్గుపాదములుగల యావు పరిచ్ఛిన్నపరిమాణము గలది అట్లే నాలుగుపాదములుగల పరమాత్మయు పరిచ్ఛిన్నుడగునుగదా? — గురువు — హే శిష్య! "పాదోఽస్యవిశ్వాభూతాని త్రిపాదస్యామృతందివి" అను శ్రుతికి పరమాత్మయొక్క పరిచ్ఛిన్నత యందు తాత్పర్యము లేదు పరమాత్మయొక్క అనంతరూపతయందే తాత్పర్యము కలదు. హే శిష్య! సూర్య మండల స్థితమైన నారాయణరూప పరమాత్మదేవునకు స్వప్రకాశ సాక్షిరూపమైన ఏ మూడు పాదములు గలవో, ఆ మూడు పాదముల నేవిద్వాంసులు గురు శాస్త్రోపదేశమున ఆత్మరూపముచే సాక్షాత్కరించుకొనుచున్నారో, ఆ విద్వాంసులే అధికారులగు మనకు బంధువులుగాను, మాతాపితరులుగాను, ఆత్మరూపముగాను, బ్రహ్మరూపముగానున్నారు. వారికన్న భిన్నమైన మరియెవరును మాకు బంధువులుకారు. ఈ ప్రకారముగ వేనగంధర్వుడు తన స్వానుభవమును కథనముచేయుచున్నాడు. హే శిష్య! సూర్య చంద్రాదుల తేజఃస్థితికే స్థానములు గలవో, ఆ సమస్తస్థానములను, ఆ విద్వాంసులు బ్రహ్మరూపముగ నెఱుగుచున్నారు ఈ కారణమువలన ఆ విద్వాంసులు మనకు బంధువులుగను, మాతాపితరులుగానున్నారు. హే శిష్య! అజ్ఞానరూపావ్యాకృతమునకు అధిపతియైన ఏ శుద్ధబ్రహ్మముకలదో, ఆ బ్రహ్మమును "నేను బ్రహ్మరూపుడ" నను నీ ప్రకారముగ తన ఆత్మరూపముగ నెఱిగి ఆ విద్వాంసులు జన్మమరణరహితమైన మోక్షమును పొందుచున్నారు అట్లే పూర్వము అగ్న్యాది దేవతలున్ను, తమ్ము ఆత్మరూపముగ నెఱిగి మోక్షమును పొందియుండిరి.

హే శిష్య! ఆ పరమాత్మదేవుడు అగ్న్యాదులైన తన శిష్యజనులకు అనేక ప్రకారములగు వరములనిచ్చెను. అగ్న్యాది దేవతలున్ను తాము భక్తులై అనేక ప్రకార వరప్రదానమును పొందిరి మఱియు బ్రహ్మజ్ఞానప్రభావముచే ఆ యగ్న్యాది దేవతలు స్వర్గాది సకలలోకములందును పూర్వాది సకలదిశలయందును స్వేచ్ఛాచారముగ విహరించుచున్నారు. హే శిష్య! ఎట్లు కార్పాసవృక్షముచే కార్పాసఫలమున్ను, దానిచే తంతురూప సూత్రమున్ను జనింప ఆ సూత్రముచే పటము జనించుచున్నదో, మఱియు ఆ పటరూప కార్యమందు ఆ సూత్రరూపకారణము అనుగతమైయున్నదో,

అట్లే యజ్ఞయాగాది కర్మరూప కార్పాసవృక్షమునకు ధర్మాధర్మరూపఫలమున్ను. ఆ ఫలమునకు స్థూలసూక్ష్మభూతరూపసూత్రము గలదు. ఆ స్థూలసూక్ష్మభూతముల శరీరముగలవారైన ఈశ్వరుడు సూత్రరూపుడై యున్నాడు ఆ ఈశ్వరరూపసూత్రముచే జగద్రూపపటము పుట్టుచున్నది ఆ జగద్రూపపటమునం దీశ్వరరూప సూత్రము అనుగతముగా నెఱిగి అధికారి జనులమగు మనము మన యాత్మను సూత్రరూపముగ సాక్షాత్కరించుకొనుచున్నాము. అభిప్రాయము-ఆ పరమాత్మదేవుడు ఉపాధి సంబంధముచే జగత్కారణ సూత్రాత్మయాయెను. ఆ పరమాత్మ దేవుడే విచారము చేసిన పిదప ఉపాధికృత సూత్రాత్మరూపతను పరిత్యాగముచేసి నిర్గుణబ్రహ్మరూపుడగుచున్నాడు. ఇటువంటి నిర్గుణబ్రహ్మమే మన కాత్మరూపమైయున్నది. హే శిష్య! ఈ విచారముచే కేవల మధికారిజనులమైన మనకు మాత్రమే బ్రహ్మాత్మప్రాప్తి యగు న వి కా దు. పూర్వము హిరణ్యగర్భ భగవంతునకును, ఈ విచారముచేతనే బ్రహ్మాత్మప్రాప్తియైనది. ఏలాగుననగా — హిరణ్యగర్భభగవంతుడు పూర్వము ఉత్కృష్టకర్మోపాసనలచే స్వర్గాదిలోకములకును, జరాయుజాది చతుర్విధ ప్రాణులకును, ఆకాశాది పంచభూతములకును, పూర్వాది దశదిశలకును స్వప్రభువాయెను. అట్టి ప్రభుభావముపొందినను సంతోషమును పొందలేదు. తరువాత యెప్పుడు అంతర్యామిదేవుని విచారముచేసెనో, అప్పుడే, ఆ హిరణ్యగర్భుడు, ఆనందస్వరూప బ్రహ్మభావమును పొందెను. దానివలన, అంతర్యామియగు ఆత్మదేవునిగూర్చిన విచారమే బ్రహ్మభావమునకు సాధనమై యున్నదని తెలియుచున్నది. ఆత్మవిచారముచే తప్ప నానాప్రకారబాహ్యైశ్వర్యములచేతను, బ్రహ్మభావప్రాప్తికానేరదు. హే శిష్య! "సర్వేవేదాయత్పదమామనన్తి" సమస్తవేదములు సాక్షాత్తుగాగాని పరంపరగా గాని అద్వితీయబ్రహ్మమునే కథనము చేయుచున్నవి. కనుక "సత్ సంపత్తి" మొదలగు ఏ నారాయణోపనిషత్సంబంధ మంత్రములు గలవో, ఆ మంత్రములు అంతర్యామి యగు పరమాత్మదేవుడే ఆత్మయని కథనముచేయుచున్నవి. ఆ పరమాత్మదేవుడే విద్వత్పురుషుల ఆత్మయైయున్నారు. మఱియును, హే శిష్య! ఏ పరమాత్మదేవునినుండి ఋతసత్యములను ద్వివిధ కర్మఫలము పుట్టుచున్నదో, ఆ పరమాత్మదేవునే విద్వాంసులు తమ ఆత్మరూపముగ పొందుదురు. (మానసిక శుభ కర్మఫలము ఋతము, శారీరక శుభకర్మఫలము సత్యము) కొందఱు శాస్త్రకారులు ఋత సత్యశబ్దములచే చంద్రసూర్యులని గ్రహించుచున్నారు. అట్లు చెప్పుట పునరుక్తిదోషము కలది యగును. ఎందుకనగా — దానిచే సూర్యచంద్రుల యుత్పత్తిముందుగనే యేర్పడినట్లయినది హే శిష్య! సృష్ట్యాది కాలమందు ఋతసత్యముల ఫలము సముఖమైనపుడు, తత్సిద్ధికొఱకు పరమాత్మదేవునిచే తమోరూపాంధకారము జనింపజేయబడె ఆ తర్వాత ఆకాశాది భూతములు పుట్టినవి.

తర్వాత స్వకీయ భ్రమణముచే రాత్రిందినములు సిద్ధింపజేయునట్టి సూర్యరూప సంవత్సరకాలము పుట్టినది ఈ ప్రకారముగ పూర్వకల్పానుసారమే స్థావరజంగమ రూప సంపూర్ణజగత్తునున్ను, శ్రోత్రాది ఏకాదశేంద్రియములను, పంచప్రాణములను, సూర్యచంద్రులను స్వర్గాదిత్రిలోకములను పరమాత్మదేవుడు సృజించుచున్నాడు హే శిష్య! జలమయశరీరముగలవాడైన వరుణదేవుడును, హిరణ్యగర్భునివలె నా పరమాత్మదేవుని తాదాత్మ్యసంబంధమును పొంది తనకార్యమందు సమర్థుడాయెను హే శిష్య! ఆ జగత్కర్తయగు పరమాత్మదేవుడే సర్వలోకులకంతస్థితుడై జగత్పాలనముచేయుచున్నాడు అతడే పుణ్యవంతులకు స్వర్గాదులను, పాపికి నరకాదులను ప్రాప్తింపజేయుచున్నాడు ఈ పరమాత్మదేవుడే స్వర్గపృథ్వుల ధారణముచేసి వాటికి భయప్రాప్తియు గావించుచున్నాడు ఈ పరమాత్మదేవుడే సాధన సంపన్నులగు అధికారిజనులకు మోక్షప్రాప్తి యొనర్చుచున్నాడు హే శిష్య! ఇటువంటి అద్వితీయబ్రహ్మము అహంశబ్దమునకు లక్ష్యార్థమైన ఆత్మకన్న భిన్నముకాదు. ఆత్మబ్రహ్మరూపమే యగును అలాగున నా యిద్దరికిని పరస్పరాభేదములేదు ఒకచో పరస్పరభేదమైన పక్షమందు యిద్దరియొక్క స్వరూపమునకే హానియగును.

హే శిష్య! ఇటువంటి అద్వితీయ బ్రహ్మరూపాత్మయొక్క జ్ఞానముచే అధికారి పురుషులు, అవిద్యాది పంచక్లేశకర్మవాసనేత్యాది కర్మబంధమునుండి ముక్తులగుదురు. ఎలాగుననగా — ఏ చిదాభాసమునకు బంధప్రాప్తియైనదో, ఆ చిదాభాసము నీ విద్వాంసులు బ్రహ్మాకారవృత్తియందారూఢమైన బ్రహ్మరూపాగ్నియందు పడవేయుచున్నారు. కనుక విద్వాంసులకు బంధప్రాప్తికానేరదు. యీ ప్రకారముగ యే అధికారులు, వేదార్థవిచారముచేతను, వేదోక్తశుభకర్మానుష్ఠానముచేతను, వేద వచన జపముచేతను, యోగులగుదురో, అప్పుడే యా శుద్ధమనస్సుగల యధికారులు ఆత్మసాక్షాత్కారమును పొందుదురు. హే శిష్య! సుగంధపుష్పయుక్తములగు ఏ చంపకాది వృక్షములు గలవో ఆ వృక్షసంబంధముచే సుగంధవిశిష్టవాయువు దశదిశలందు జని సకలజీవులకు ఆనందప్రాప్తి యెట్లు చేయుచున్నదో, అట్లే పుణ్యాత్ముల కీర్తియు, దశదిశలందు జని శాస్త్రవేత్తలగు సజ్జనులకు ఆనందప్రాప్తి చేయుచున్నది.

హే శిష్య ఏ పురుషుడు తన మరణముచేతను భయమునుపొందడో, ఎవడు ధన స్త్రీ పుత్రాదులవియోగముచేతగూడ భయమును పొందడో, ఒక పాపకర్మముచేతనే భయమును పొందుచున్నాడో, ఆ పురుషునకు పుణ్యాత్ముడనిపేరు హే శిష్య! ఒక గోతియందు అనేకముండ్లు తీక్ష్ణధారగల ఖడ్గములును యుంచబడినవి కోమల పాదముగల పురుషుడు దానిపై పాదముంచుటకు ఎట్లు భయపడుచున్నాడో, అట్టే

విద్వాంసులున్ను పాపకర్మములకంత భయపడుచున్నారు. హే శిష్య! ఏ పరమాత్మ దేవుని భయముచే విద్వాంసులు పాపకర్మములనుండి నివృత్తులగుదురో, ఆ పరమాత్మ దేవుని ఆ విద్వాంసులు తమ ఆత్మగనెఱుగుచున్నారు. ఆ పరమాత్మదేవుడు నారాయణ దేవునికన్న భిన్నుడుకాడు. అతడు సూక్ష్మముకన్నను సూక్ష్మముగాను, మహత్తు కన్నను మహత్తుగానున్నాడు. ఆ పరమాత్మదేవుడు జీవుల హృదయరూప గుహయం దున్నాడు. ఇటువంటి శుద్ధపరమాత్మదేవునే అధికారిపురుషులు గురుశాస్త్రప్రసాద ముచే తమ ఆత్మగ సాక్షాత్కరించుకొని సకల శోకరహితులగుచున్నారు. ఆ పర మాత్మదేవునియందు జగత్కారణతా నిరూపణముగావింపబడుచున్నది. జగత్కర్తయైన పరమాత్మదేవునిచే సప్తలోకములును, సప్తప్రకారశరీరములును, సప్తప్రకారప్రాణము లును పుట్టింపబడుచున్నవి. ఆ పరమాత్మదేవునిచేతనే భౌమ జాఠర, సూర్య, చంద్ర, విద్యుత్, వాడవ, చక్షువులను నీ సప్తప్రకారాగ్నులును సృజింపబడినవి, (కాష్ఠస్థితాగ్ని భౌమము, ఉదరస్థితాగ్ని జాఠరము, సముద్రస్థితాగ్ని వాడవము) అట్లే ఆ సప్త ప్రకారాగ్నులకు సప్తప్రకారసమిధలు పుట్టింపబడినవి. మఱియును స్వర్గ మేఘ, భూ, పురుష, యోషిత్తులను, పంచాగ్నులకు, ఆదిత్య, వాయువు, సంవత్సర వాక్, ఉపస్థలను నీ పంచసమిధలు పుట్టింపబడినవి. శ్రుతిప్రసిద్ధ ఆహవనీయ గార్హ పత్యాది అగ్నులకు స్మృతిప్రసిద్ధ ఆవసథ్యనామాగ్నికిని కాష్ఠాది సమిధలు పుట్టింప బడినవి. ఆ పరమాత్మదేవునిచేతనే భూః, భువః, స్వః, మహః, జనః, తపః, సత్యమ్ అను నీ సప్తలోకములు పుట్టింపబడినవి. మఱియు, కాళి, కరాళి, మనోజవ, సులహిత, ధూమ్రవర్ణ, స్ఫులింగిని, విశ్వరూపి అను అగ్నికి సప్తజిహ్వలు పుట్టింపబడినవి. భూరాది సప్తలోకములందు విచరించువారైన సకలజీవులను, బాహ్యప్రాణములైన నలభైతొమ్మిది మరుద్గణములను, హిమాచలాది పర్వతములను, ఆ పరమాత్మదేవుడే పుట్టించెను. మఱియు ఆ యగ్న్యాదిదేవతలు హిరణ్యగర్భాదిదేవతలు, పరమాత్మ దేవుని ముఖ్యవిభూతులైయున్నారు. ఏ పరమాత్మదేవుని బుద్ధిమంతులు వేదవిచారముచే నెఱుగుదురో, నే దేవుని బుద్ధిమంతులు ఘృతాది ద్రవ్యములచే, యజ్ఞాదిరూపములచే, యజనముచేయుదురో, ఏ పరమాత్మదేవుడు ఇంద్రాదిసకలదేవతలచే పూజ్యుడుగా నున్నాడో, అటువంటి ఆ నారాయణరూప పరమాత్మదేవుడు అధికారులైన మీకు శుద్ధబుద్ధిని కలుగజేయుగాక! హే శిష్య! ఈ ప్రకారముగ నెప్పుడధికారిపురుషులు ఆ పరమాత్మదేవుని స్తుతిచేయుదురో, అప్పుడా పరమాత్మదేవుడు ప్రసన్నుడై ఆ యధి కారి పురుషులకు తన వాస్తవస్వరూపమును చూపుచున్నాడు.

హే శిష్య! ఇటువంటి నారాయణదేవుని ప్రాప్తి జీవులకగ్నిహోత్రాదులచేకాదు. పుత్రపౌత్రాది అనేక ప్రజలచేకాదు. సువర్ణాదిధనములచేతనుకాదు. ఆ సర్వపదార్థముల

త్యాగముచేతనే అగుచున్నది. 'నకర్మణా న ప్రజయా ధనేన త్యాగేనైకే అమృతత్వ మానశుః' – హే శిష్య! స్వర్గాది సుఖములకన్న నుత్కృష్టమైన ఏ ఆనందరూప పరమాత్మగలదో, ఆ పరమాత్మరూపమోక్షమును ఎట్లు పూర్వము అధికారిజనులు సర్వ పరిత్యాగముచేతనే పొందిరో, అట్లే యీ కాలమందును ఏ అధికారిజనులు ఈషణా త్రయపరిత్యాగము చేసి సంన్యాసాశ్రమగ్రహణము చేయుదురో, ఆ యధికారిజనులే గురుశాస్త్రోపదేశముచే మోక్షమును పొందుదురు. శిష్యుడు – హే భగవన్! లోకమం దెందఱో సంన్యాసులందు ఆత్మసాక్షాత్కారము కనబడదు గురువు - హే శిష్య! సంన్యా సముచే చిత్తనిరోధరూప యోగముచే, ఎవని యంతఃకరణము శుద్ధమైనదో, ఎవని చిత్తము శమదమాదిసాధనములచే యుక్తమైనదో, మఱియు ఏ సంన్యాసులచే వేదాంతవచనము విచారపూర్వకముగ తత్వంపదార్థశోధనము గావింపబడినదో, అటు వంటి సాధనసంపన్నులగు సంన్యాసులకే ఆత్మసాక్షాత్కారమగును. ఒకచో యేదో ఒక ప్రతిబంధవశమున సాక్షాత్కారము గాకపోయినను, ఆ సంన్యాసులు శరీరత్యాగా నంతరము అర్చిరాదిమార్గమున బ్రహ్మలోకమునుపొంది అచ్చట ఆత్మసాక్షాత్కా రమునొంది మఱల బ్రహ్మదేవునితోసహా విదేహముక్తి పొందుదురు. హే శిష్య! ఏకాదశద్వారయుక్త శరీరరూప నగరమును సృజించి ఆ నగరమందు అంగుష్ఠ పరిమాణహృదయరూప గుహయందు. ఏ పరమాత్మదేవుడు విరాజమానుడగు చున్నాడో, ఆ పరమాత్మదేవుని తమ ఆత్మగా నెఱిగి ఆ సంన్యాసులు ఈ లోక మందుగాని బ్రహ్మలోకమందుగాని మోక్షమును పొందుదురు ఆత్మసాక్షాత్కారము గాకున్న యే లోకమందును మోక్షప్రాప్తిగాదు. కనుక ఓ సంన్యాసులారా! బ్రహ్మ లోకమందైన సంన్యాసులకు ఆత్మసాక్షాత్కారమగునను వచనమును విని మీరు ఆత్మ సాక్షాత్కారప్రయత్నమును విరమింపకుడు. ఈ మనుష్యశరీరమునందే ఆత్మసాక్షా త్కారమును సంపాదన చేయుడు. బ్రహ్మలోకాశచే యీ జన్మమందు ప్రయత్నశిథి లతను గావింపకుడు. హే శిష్య! ఏ అధికారిపురుషులకు మహావాక్యవిచారముచే ఆత్మసాక్షాత్కారము కాలేదో, ఆ అధికారిపురుషులకు ప్రణవవిచారముచే ఆత్మసాక్షా త్కారమగును. ఆ ప్రణవవిచారమిది — ఆనందస్వరూపాత్మయందు ఓంకారరూప ప్రణవమే వర్తించుచున్నది ఈ కారణమువలన శ్రుతిభగవతి ఓంకారరూప ప్రణవ మును స్వరనామముచే కథనముచేయుచున్నది. ఓంకారరూపస్వరము వేదముయొక్క అంతమందు కథనము చేయబడినది. అది తన లయావస్థయందు ఏ 'పర' యను కారణమందు లయమగుచున్నదో, ఆ 'పర'కన్నను పరమైనట్టి ఆ శుద్ధచైతన్యమే మన వాస్తవస్వరూపమైయున్నది. ఈ ప్రకారముగా యే అధికారిపురుషులు సర్వదా చింతనము చేయుదురో, ఆ అధికారిపురుషుల కవశ్యముగ ఆత్మసాక్షాత్కారమగును

హే శిష్య! హృదయస్థిత పరమాత్మదేవుడు పూర్వము అణువుకన్నను. అణువని. మహత్తుకన్న మహత్తని చెప్పబడియె. గనుక లోకమందు జీవులకు ఎన్నిమస్తకములు గలవో, ఎన్నిశరీరములుగలవో, ఎన్నియింద్రియములుగలవో. ఎన్నిప్రాణములుగలవో, అవన్నియు ఆ పరమాత్మదేవునియొక్కయేయని యెఱుగుము. ఇటువంటి స్వయం జ్యోతియగు పరమాత్మదేవుని శ్రుతిభగవతి నారాయణనామముచే కథనము చేయుచున్నది.

ఇప్పుడు నారాయణశబ్దమునకు ఏకాదశప్రకారార్థముల చెప్పుచున్నాను. — (1) తన సద్రూపతామాత్రముచే ఏ చైతన్యము సర్వపదార్థములను తమతమ కార్యములందు ప్రవృత్తము చేయుచున్నదో. ఆచేతనదేవునకు నరమనిపేరు ఇటువంటి చేతనాత్మయగు నరమును ఈ మాయా దృశ్యరూపము సంబంధముచేయుచున్నది. ఈ కారణమువలన ఆ మాయ నారా నామముచే కథనము చేయబడియె. మఱియు ఈ సూక్ష్మప్రపంచము ఆ మాయయొక్క కార్యమగుటవలన 'నార' నామముచే కథనము చేయబడియె. ఆ సూక్ష్మ ప్రపంచరూపనారమందు ఈ పరమాత్మదేవుడు ప్రతిబింబరూపముచే వర్తించుచున్నాడు. ఈ కారణమువలన, ఆ మాయావిశిష్ట పరమాత్మ దేవుని సూక్ష్మప్రపంచ విశిష్టహిరణ్యగర్భదేవుని శ్రుతిభగవతి 'నారాయణ' నామముచే కథనము చేయుచున్నది. (2) ఆ పరమాత్మచే నుత్పన్నము కాబడిన జలమునకు నారమనిపేరు ఆ నారరూపజలము విరాట్టునకు ఆధారమైయున్నది. గనుక శ్రుతిభగవతి, ఆవిరాడ్భగవంతుని 'నారాయణ' నామముచే కథనముచేయుచున్నది. (3) నదీజలము నౌక కాధారమైయున్నది. ఆ జలము పరమాత్మదేవునివలన పుట్టుచున్నది. గనుక, ఆ జలమునకు నార యనిపేరు ఇటువంటి నారరూపజలమును, ఈ పరమాత్మదేవుడే సూత్రాత్మ ప్రాణరూపముచే ధారణముచేయుచున్నాడు, ఈ కారణమువలన శ్రుతిభగవతి ఆ పరమాత్మదేవుని 'నారాయణ' రూపముచే కథనము చేయుచున్నది (4) స్థూలప్రపంచశరీరముగలవాడు విరాట్, సూక్ష్మప్రపంచశరీరము గలవాడు హిరణ్యగర్భుడు. ఈ యిద్దరికిని నరమనిపేరు. ఆ యిద్ధరినరములస్థితికి కారణము పరమాత్మ, యీ కారణమువలన శ్రుతిభగవతి ఆ పరమాత్మదేవుని 'నారాయణ' రూపముచే కథనము చేయుచున్నది. (5) పరమాత్మదేవుని ప్రతిబింబరూప జీవులకు పేరు నరము. ఆ ప్రతిబింబ భూతనరులయొక్క నిరూపణము పరమాత్మ దేవునిచేతనే యగుచున్నది. ఈ కారణమువలన శ్రుతిభగవతి ఆ పరమాత్మదేవుని 'నారాయణ' రూపముచే కథనము చేయుచున్నది. (6) జీవులందు స్వభావసిద్ధమైన, ఏ కామక్రోధాదిదోషములుగలవో, ఆ దోషములకు పేరు. అరము. ఆ అరముచే

పుట్టినదైన దుఃఖమునకు నామము అరము, ఆ దుఃఖరూప అరమున కాశ్రయమైన, ఏ యజ్ఞానాదిరూప జడప్రపంచము గలదో, దానికి అరాయణమనిపేరు. ఆ యా రాయణము స్వయంజ్యోతియగు పరమాత్మయందు త్రికాలముననులేదు. ఈ కారణము వలన శ్రుతిభగవతి ఆ పరమాత్మదేవుని 'నారాయణ' నామముచే కథనము చేయు చున్నది. (7) అవిద్యాది పంచక్లేశములు పుణ్యపాపకర్మములు, సుఖదుఃఖరూప ఫలములు తద్వాసనలు, ఈ సమస్తము సంసారరూపచక్రమునకు అరలైయున్నవి. ఆ అరలకు ఈ మాయ ఉపాదానకారణరూపముచే ఆశ్రయమైయున్నది కనుక ఆ మాయకు పేరు అరాయణము ఆ యారాయణరూపమాయకంటె, కూటస్థపరమాత్మ దేవుడు భిన్నమైయున్నాడు ఈ కారణమువలన శ్రుతిభగవతి ఆ పరమాత్మదేవుని నారాయణనామముచే కథనము చేయుచున్నది. (8) అథవా కల్పితమైన తాదాత్మ్యాధ్యాసరూపసంబంధముచే ఆ మాయారూపనారయొక్కస్థితి ఆ పరమాత్మదేవునియందు గలదు. ఈ కారణముచే శ్రుతిభగవతి ఆ పరమాత్మదేవుని 'నారాయణ' నామముచే కథనము చేయుచున్నది. (9) సకల దేహధారులగు జీవులకు ప్రియమైన అనేక కలాకౌశల్యముచే యుక్తమై అనేకరూపములుగలదై, అత్యంతమనోహరమై, పుణ్య పురుషులకు సర్వదా సుఖమిచ్చునదై పాపులగు జీవులకు సర్వదా దుఃఖమిచ్చునదైన ఏ లక్ష్మీరూపనారిగలదో, ఆనారి పరమాత్మయందే నిశ్చలమగుచున్నది. ఈ కారణ ముచే శ్రుతిభగవతి ఆ పరమాత్మదేవుని 'నారాయణ' నామముచే కథనము చేయు చున్నది. (10) ఆనందరూపుడై ద్రష్టయైన ఆత్మకు నానా పదార్థములను చూపునట్టి జీవులబుద్ధికి నారియనిపేరు ఆ నారీరూప జడబుద్ధియొక్క ప్రకాశము స్వయంజ్యోతి యగు ఆత్మదేవునిచేతనే యగుచున్నది. ఈ కారణముచే శ్రుతిభగవతి ఆ పరమాత్మ దేవుని 'నారాయణ' నామముచే కథనము చేయుచున్నది. (11) అథవా పరమాత్మ దేవునికన్న భిన్నమగు కించిన్మాత్ర వస్తువైనను లేదు. ఈ కారణముచే శ్రుతిభగవతి ఆ పరమాత్మదేవుని 'నారాయణ' నామముచే కథనము చేయుచున్నది. ఈ ప్రకార ముగ నారాయణ శబ్దమునకు ఏకాదశ ప్రకారార్థములు శాస్త్రవేత్తలు కథనము చేయు చున్నారు. నారాయణదేవుడే స్వయంజ్యోతిరూపుడుగాను, అక్షరరూపుడుగాను, పరమ పదరూపుడుగాను నున్నాడు. మఱియు సకలవిశ్వముకన్న పరుడై విశ్వరూపుడుగా నున్నాడు. సనాతనుడుగా నున్నాడు. ఏ అధికారి జనులిటువంటి నారాయణదేవుని, శ్రద్ధాభక్తి పూర్వకముగ స్మరణము చేయుచున్నారో, కీర్తనము చేయుచున్నారో, ఆ యధికారిజనుల పంచక్లేశములను, సకలపాపములను, ఆ పరమాత్మదేవుడు నాశనము చేయుచున్నాడు. ఈ కారణమువలన శ్రుతిభగవతి ఆ పరమాత్మదేవుని 'హరి' నామ ముచే కథనము చేయుచున్నది. ఈ పరమాత్మదేవుడే సకల జగత్తును సృజించి

పాలనము చేయుచున్నారు. ఈ కారణమువలన శ్రుతిభగవతి యా పరమాత్మదేవుని "పతి" నామముచే కథనము చేయుచున్నది. మఱియు ఆ పరమాత్మదేవుడు తన యుత్పత్తిస్థితిలయరూపముచే సకల విశ్వమును వ్యాప్తముగ జేయుచున్నారు. ఈ కారణమువలన శ్రుతిభగవతి ఆ పరమాత్మదేవుని "ఆత్మ" నామముచే కథనము చేయుచున్నది. ఆ పరమాత్మదేవుడే సర్వమంగళములకు మంగళముగాను, పరమ కళ్యాణరూపుడుగనున్నారు. ఈ కారణమువలన ఆ శ్రుతిభగవతి పరమాత్మదేవుని "శివ" నామముచే కథనము చేయుచున్నది. మఱియు ఈ పరమాత్మరూప ఆనంద సముద్రసంబంధ బిందుమాత్ర ఆనందమును గ్రహణముచేసి, హిరణ్యగర్భదేవుడును ఆనందభరితుడగుచున్నారు ఈ కారణమువలన శ్రుతి భగవతి ఆ పరమాత్మ దేవుని "ఆనంద" నామముచే కథనము చేయుచున్నది కాలముచే ఘటాదిపదార్థములకగు నాశమేదికలదో, దానికి చ్యుతి యనిపేరు. ఆ చ్యుతి పరమాత్మదేవునియందు లేదు. ఈ కారణమువలన శ్రుతిభగవతి ఆ పరమాత్మదేవుని "అచ్యుత" నామముచే కథనము చేయుచున్నది ఈ పరమాత్మదేవుడు సూర్యాగ్న్యాది సకల దేవతలకు నియంతయై యున్నారు ఈ కారణమువలన శ్రుతి భగవతి ఆ పరమాత్మదేవుని 'ఈశ్వర' నామముచే కథనము చేయుచున్నది. మఱియు పరమాత్మదేవుడు ఏ కాలమందును. ఏ దేశమందును అన్యథాభావమును పొందడు. ఈ కారణమువలన శ్రుతిభగవతి ఆ పరమాత్మదేవుని 'శాశ్వత' నామముచే కథనము చేయుచున్నది. ఈ పరమాత్మ దేవుడు బ్రహ్మాది మహాపురుషులచే నెఱుగుటకు యోగ్యమై యున్నారు ఈ కారణము వలన శ్రుతిభగవతి ఆ పరమాత్మదేవుని "మహాజ్ఞేయ" నామముచే కథనము చేయు చున్నది. ఈ పరమాత్మదేవుడు సర్వభూతములకు పరాగతియైయున్నారు. ఈ కార ణమువలన శ్రుతిభగవతి ఆపరమాత్మదేవుని "పరాయణ" నామముచే కథనము చేయుచున్నది. ఈ పరమాత్మదేవుడు అగ్న్యాది జడజ్యోతులకంటె, చిదాభాసాది చేతన జ్యోతులకంటె అత్యంత యుత్కృష్టమైయున్నారు ఈ కారణముచే శ్రుతి భగవతి ఆ పరమాత్మదేవుని "పరంజ్యోతి" నామముచే కథనము చేయుచున్నది మఱియు "పరతత్త్వ" నామముచేతను కథనము చేయుచున్నది.

హే శిష్య! ధ్యాత ధ్యానము, ధ్యేయము ఈ మొదలగు సంపూర్ణజగత్తు నారాయణరూపమే యైయున్నది. మఱియు, ఎంతజగత్తు చూడబడినదో, వినబడినదో, ఆ సంపూర్ణజగత్తుయొక్క అంతర్బాహ్యముల ఈ నారాయణదేవుడే వ్యాప్తమైయున్నాడు. ఈ సంసారసముద్రమునకు కారణమైన యే మాయగలదో, ఆ మాయకు నియంతయై వాస్తవముగా ఆ మాయాది వికారములచే రహితుడుగానున్నాడు. హే శిష్య! పరమాత్మ దేవుడు సర్వత్రవ్యాపకుడైయున్నను, హృదయకమలమున కంతస్స్థితమైన సూక్ష్మ

బుద్ధిచేతనే యెఱుగబడుచున్నారు. ఈ కారణమువలన ఆ పరమాత్మదేవుడు పూర్వము అణువని చెప్పబడెను. — హే శిష్య! అష్టదళములుగల్గి, ఆరక్తవర్ణముగలదై కించిద్వికాసమును పొందిన కమలమువలెనున్నదై, హృదయదేశ సంబంధ శిరోభాగమునుండి వ్రేలాడుచు అత్యంతరమణీయముగాను, పంచఛిద్రయుక్తముగాను, అధోముఖముగా నున్నదై, నాభికి ద్వాదశాంగుళముల యుపరిదేశమందొక కమలముకలదు. ఆ కమలమునకు పూర్వఛిద్రము చక్షువు, దక్షిణఛిద్రము శ్రోత్రము, పశ్చిమఛిద్రము వాక్కు. ఉత్తరఛిద్రము మనస్సు, మధ్యఛిద్రము, ఘ్రాణము లైయున్నది. మఱియు, జిహ్వ ఆ కమలమునకు మూలస్థానమైయున్నది. వక్షస్థలమునుండి కంఠమువరకు యెంత అంతర్దేశముకలదో, అంతప్రదేశము ఆ కమలమునకు భూమియై యున్నది ఆ హృదయకమలము మనస్సునకు నివాసస్థానమైయున్నది ఈ కారణమువలన శాస్త్రవేత్తలు ఆహృదయకమలమును మానసమని వచించుచున్నారు. సూర్యచంద్రాగ్ని నక్షత్రవిద్యుత్తులకు సమానముగ హృదయకమలమునకు తేజముకలదు. ఆ హృదయకమలము అల్పపరిమాణముకలదైనను. సర్వవిశ్వమున కాధారమైయున్నది. ఈ కారణమువలన యోగులు ఆహృదయకమలమును "మహః' అనుచున్నారు. ఆ హృదయకమలము రజతశిలాసమానముగ ఉజ్జ్వలవర్ణముగలదిగాను, రుధిర మాంసాది ధాతువులచే లిప్తమైన యస్థులచే నాల్గుప్రక్కల వేష్టితమైయున్నది. మఱియును మహారాజునకు క్రీడించుటకెట్లు సరోవరముగలదో, అట్లు ఆ హృదయకమలముయొక్క మధ్యఛిద్రము సరోవరరూపమైయున్నది. ఇటువంటి హృదయకమలమందు, ఆ పరమాత్మదేవుడు నివాసము చేయుచున్నారు. ఆ పరమాత్మదేవుడు బుద్ధ్యాది సకల సంఘాతమునకన్న సమీపముగనున్నారు. అతడు బుద్ధిరూపోపాధి నంగీకరించి విషయజన్య సుఖోపభోగము చేయుచున్నారు మఱియు ఆ పరమాత్మదేవుడు ప్రాణజఠరాగ్నిరూపముచే భోజనము చేయబడిన అన్నమునకు స్థూల, మధ్యమ సూక్ష్మవిభాగములుచేయుచు ఉదరమందు స్థితుడగుచున్నారు. ఆ జఠరాగ్నిరూప పరమాత్మదేవునియొక్క క్షుధాతృషాది కిరణరూప తేజము, ఆపాదమస్తకము సంపూర్ణశరీరమును తపింపజేయుచున్నది. హే శిష్య! యిటువంటి పరమాత్మదేవుని యే అధికారిపురుషులు హృదయకమలమునందు ధ్యానము చేయుదురో, వారికి పరమాత్మదేవుని సాక్షాత్కారమగుచున్నది. ఈ ప్రకారముగ ధ్యానముచేసినకూడ, పరమాత్మదేవుని సాక్షాత్కారము గానియెడల యింకొకప్రకారముగ ఆత్మదేవుని ధ్యానము చెప్పెదను. హృదయకమలమందు దీపజ్యోతివంటి యొకజ్యోతి అతి సూక్ష్మముగా నూర్ధ్వదేశమందు ప్రజ్వలితమై నిశ్చలముగాను, నీలమేఘమందు విద్యుల్లేఖా సమానముగను, ప్రకాశమైయున్నది. మఱియు కేశముకన్నను అత్యంత సూక్ష్మమైయున్నది. సువర్ణసమానము, పీతవర్ణము గలిగి

యున్నది. అది సూక్ష్మమై, ప్రకాశమానమైయున్నది. అటువంటి దీపశిఖా మధ్యమందు ఆ పరమాత్మదేవుడు స్థితుడైయున్నాడు. ఆ పరమాత్మదేవుడు బ్రహ్మరూపముగాను, శివ, హరి రూపములుగాను సర్వముకన్న సనాతనముగాను, యింద్రరూపుడుగాను. అక్షరరూపుడుగాను, సకల జగత్తునకు ప్రభువుగానున్నాడు. ఆతడు ప్రకాశరూపముచే విరాజమానుడుగా నున్నాడు. హే శిష్య! యిటువంటి పరమాత్మదేవుని ఏ అధికారిపురుషులు, ఆ దీపశిఖయందు ధ్యానముచేయుదురో. వారా ఆత్మదేవుని సాక్షాత్కారమును పొందుదురు.

హే శిష్య! యిటువంటి ఆత్మయొక్క సాక్షాత్కారము, విక్షేపముగలవానికి కానేరదు. విక్షేపరహితుడగు అంతర్ముఖునకే యగుచున్నది. యీ కారణమువలన శ్రుతి భగవతి, ధర్మ, సత్య, తప, దమ, శమ దాన, ప్రజనన, అహితాగ్ని, అగ్నిహోత్ర, యజ్ఞ, మానసములను ఏకాదశసాధనమును స్తుతిచేసి, సంన్యాస ప్రధానమునందు తాత్పర్యమును చూపుచున్నది. ఇప్పుడు సాధనములందు మొదటి ధర్మము నిరూపింపబడుచున్నది — బ్రాహ్మణాది నాలుగువర్ణములు గలవారికిని, బ్రహ్మచర్యాది నాలుగు ఆశ్రమములు గలవారికిని యీ ధర్మమే ధర్మార్థాదిచతుర్విధ పురుషార్థముల సిద్ధిని చేయుచున్నది. ఏ గహనకార్యమునైనను, ధర్మమే సిద్ధింపజేయుచున్నది. ఈ ధర్మమే జగత్పాలనము చేయువాడైన పరమేశ్వరునియొక్క సాత్వికమూర్తియైయున్నది. ఎట్లు పాంథులు ఫల పత్ర పుష్పాదులచే సంపన్నములగు వృక్షములను సేవనము చేయుదురో అట్లే ధర్మాత్ముని సమస్తజనులు ఆశ్రయింతురు. జీవులు జ్ఞాతాజ్ఞాతముగ ఏయే పాపకర్మములు చేయుదురో. ఆ పాపకర్మములను ధర్మమే నాశనము చేయుచున్నది. కనుక ధర్మమే ఈ ధర్మజీవులకు శ్రేష్ఠసాధనమైయున్నది. హే శిష్య! యెట్లు ఆవునకు నాలుగు పాదములుగలవో, అట్లే యీ ధర్మమునకున్ను, సత్య, తప, దయా దానములను నాలుగుపాదములుగలవు వాటిలో సత్యనిరూపణము చేయబడుచున్నది. ఎట్లు వృత్తాంతము స్వనేత్రముచే చూడబడినదో శ్రోత్రముచే వినబడినదో, అట్లే దానిని కథనముచేయుటకు పేరు సత్యము. అథవా — స్వముఖముచే నేది ప్రతిజ్ఞ చేయబడినదో, ఆప్రతిజ్ఞను చలింపచేయకుండుటకు పేరు సత్యము. ఆ సత్యము వాగింద్రియముచే సిద్ధించుచున్నది గనుక నది వాచకధర్మ మనబడినది. యజ్ఞాది కర్మములందును, వాణిజ్యాది వ్యవహారములందును, జీవులు సత్యవచనము చేతనే ప్రవృత్తులగుట యోగ్యము. (యుధిష్ఠిరమహారాజు స్థూలశరీరముచే స్వర్గలోకమునకు జనుటయు సత్యవచనముచేతనే), సత్యధర్మముచేతనే వాయువు తన హద్దునందు వీచుచున్నది. సత్యధర్మముచేతనే సూర్యభగవంతుడు దినదినము ప్రకాశించుచు గమనము చేయుచున్నాడు. సత్యధర్మముచేతనే పృధ్వి జలముపై స్థితమైయున్నది.

సత్యధర్మముచేతనే సకలదేవతలు తమతమ అధికారములందు ప్రవర్తనము చేయుచున్నారు ఇటువంటి సత్యధర్మమును అధికారిజనులవశ్యముగ సంపాదించవలసినది.

తపోనిరూపణము — మనస్సునందు దృఢసంకల్పము ధరించి శీతోష్ణ క్షుధాతృష్ణలను సహించుకొనుటకు పేరు తపము. ఈ తపముయొక్క ప్రభావముచే యింద్రాది దేవతలు వాంఛితమైన స్వర్గసుఖాదుల పొందుచున్నారు. తపః ప్రభావముచేతనే మనుష్యులు శత్రువిజయమును పొందుదురు. తపః ప్రభావముచేతనే పటరూపకార్యము తంతురూపకారణమందు స్థితమైయున్నది తపః ప్రభావముచేతనే జగద్రూపకార్యము అజ్ఞానరూపకారణమందు స్థితమైయున్నది. తపః ప్రభావముచేతనే దూర్వాసాదిమునులు శాపానుగ్రహములందు సమర్థులైరి. తపః ప్రభావముచేతనే విశ్వామిత్రునిచే నూతనసృష్టి గావింపబడినది. ఇటువంటి తపమును అధికారిజనులవశ్యముగ సంపాదింపవలసినది

దయానిరూపణము — దమము. శమము ఈ రెండును దయకు కారణములైయున్నవి. కనుక శాస్త్రవేత్తలు శమదమములను శ్రేష్ఠసాధనము లనుచున్నారు. దమనిరూపణము — హే శిష్య! ఎట్లు లోకమందు ప్రమత్తవృషభము రజ్జ్వాదిబంధనములచే కట్టబడునో అట్లే శబ్దాది విషయములయందలి దోషదృష్టిచే శ్రోత్రాదీంద్రియములను నిరోధముచేయుట దమమనబడును ఈ దమముచే బ్రహ్మచారులకు పాపము నిరోధమై. మరణానంతరము వారు స్వర్గలోకమునకు, బ్రహ్మలోకమునకు పోవుచున్నారు. ఇటువంటి దమమును అధికారిజనులవశ్యము సంపాదించవలసినది — శమనిరూపణము — స్త్రీయాది విషయములు సమీపముగానుండినను, జ్వరయుక్తపురుషునివలె దోషదృష్టిచే, ఆ స్త్రీయాది విషయేచ్ఛ కాకపోవుటకు పేరు శమము ఈ శమముచే మునిజనులు మహారణ్యములందు స్థితులైయున్నను, సింహసర్పాదులకు భయపడరు. వెయ్యేల ఆ మునిజనుల శమప్రభావముచే, తామసికజంతువులగు సింహసర్పాదులును, హింసాది పాపకర్మములనుండి తొలగును ఇటువంటి శమమును అధికారిజనులవశ్యముగ సంపాదింపవలసినది. ఈ దమశమములచేతనే సర్వభూతములందు దయ పుట్టుచున్నది భూతదయవంటి యింకొక శ్రేష్ఠధర్మములేదు. కనుక శాస్త్రవేత్తలు దయను పరమధర్మమనుచున్నారు.

దాననిరూపణము — వాగ్దానము బుద్ధిదానము, ధనదానము శరీరదానము యీ విధముగ దానములు అనేక విధములుగా నున్నవి. అధికారులగు పురుషులకు విద్య నొసంగుట వాగ్దానము ఎవనికైనను మంచిబుద్ధిచెప్పుట బుద్ధిదానము సుపాత్రమందు సువర్ణాది పదార్థముల నర్పించుట ధనదానము శరణాగతజీవుని శత్రువునుండి

రక్షించుట శరీరదానము. హే శిష్య! దాతలను సకలజనులు స్తుతిచేయుచున్నారు. కర్ణమహారాజు యింద్రునకు త్వగ్దానము బలిమహారాజు వామనభగవంతునకు భూమి దానము శిబిమహారాజు కపోతపక్షియొక్క రక్షణకొఱకు తనశరీర సంబంధమాంసమును దానముచేసెను. ఇంకను యెందరో ధర్మాత్ములచే నానా ప్రకారదానములు చేయబడియె, ఆ ధర్మాత్ములు ఈ లోకమందు సత్కీర్తినిపొంది మరణానంతరము ఉత్తమ లోకములను పొందుదురు. ఎట్లు పుత్రుడు పితనాశ్రయించునో, అట్లే దాతయగువానిని సకలజనులు ఆశ్రయించుచున్నారు. దానముచే శత్రువున్ను వశమగుచున్నాడు. ఇటువంటి దానమును అధికారిజనులవశ్యముగా సంపాదింపవలసినది.

హే శిష్య! సత్య తప, దయ దానమను నాలుపాదములచే యుక్తమైన యే ధర్మముగలదో అది సకల దేహధారిజీవులకు సాధారణమైయున్నది ఆ ధర్మమందు బ్రాహ్మణాదివర్ణములయొక్కయు, బ్రహ్మచర్యాది ఆశ్రమములయొక్కయు, బాల్యాద్యవస్థలయొక్కయు అపేక్షలేదు. అయిదు వత్సరముల వయస్సుగల ధ్రువబాలకుడు తపోరూప ధర్మముచే పరమమగు పదమును పొందెను. కపోతపక్షి అతిథికి తన శరీర దానముచేసి ఉత్తమగతిని పొందెను. ఇంతవఱకు ధర్మమునుండి దానమువఱకు నిరూపించడమైనది. ఇప్పుడు ప్రజననరూప సప్తమసాధనము నిరూపింపబడుచున్నది— ఎట్లు ధర్మము వర్ణాశ్రమాదుల అపేక్షలేకయే సిద్ధమగుచున్నదో, అట్లే ప్రజననసాధనము, వర్ణము, ఆశ్రమము, అవస్థ ఈ మూడింటి అపేక్షలేక సిద్ధింపదు. గృహస్థాశ్రమముయొక్కయు, యౌవనావస్థయొక్కయు, అపేక్షచే పుత్రాదిప్రజ పుట్టుచున్నది. స్త్రీలేక యే ప్రాణియు పుత్రోత్పత్తి చేయజాలదు. ఇక మనుష్యాదులగూర్చి వేఱుచెప్పనేల? ప్రజాపతికూడ యౌవనావస్థలేక, స్త్రీలేక, పుత్రోత్పత్తియందు సమర్థుడుకాడు హే శిష్య! పుత్రపౌత్రాదులుగల పురుషుడీలోకమందు కీర్తిని సుఖమును పొందుచున్నారు. శత్రువులనుండి జయమును పొందుచున్నారు. పితృఋణముచే ముక్తులగుచున్నారు, మరణానంతరము స్వర్గమును పొందుచున్నారు. ఈ పుత్ర పౌత్రాది ప్రజ జీవులకు సంసారసుఖమునకు కారణమగునుగాని, మోక్షసుఖమునకు కారణము కాదు. హే శిష్య! కామజ్వరముచే ఆర్తులై కొందరవివేకపురుషులు, పుత్రపౌత్రాది ప్రజ మోక్షకారణమని యెంచి దానికై నానా యుక్తుల చెప్పుచున్నారు. అట్టి విషయాసక్తుల మతమిట నిరూపింపబడుచున్నది. మిద్దెపైకి పోవలెననిన క్రమముగ నొక్కొక్క మెట్టుదాటిపోవలెను. అట్లే మోక్షరూప సౌధముపైకి పోవలెననిన, మొదట క్రమముగ ధర్మ, అర్థ, కామములను నీ మూడుమెట్లు దాటవలయును. క్రమములేక ఒకేసారి మోక్షరూపసౌధము పైకిపోవుటకు వీలుపడదు. వాటిలో ప్రథమసోపానమగు ధర్మము అర్థమునకు కారణము. ఎలాగుననగా — లోకమందు, దుఃఖియు,

దరిద్రుడును నగు పురుషుని పాపాత్ముడనుచున్నారు. సుఖియు, ధనికుడును అగు పురుషుని ధర్మాత్ముడనుచున్నారు. ఆక్షేపము — ఎందరో ధనికులు పుణ్యకర్మము చేయరు కనుక ధనికునియందు పుణ్యాత్ముని వ్యవహారము సంభవింపదు. సమాధానము — దృష్ట ఫలహేతువు అదృష్ట ఫలహేతువుయొక్క భేదముచే ధర్మము ద్వివిధము. — 'కారీ'యను యాగముచే ఈ శరీరము విద్యమానమైయుండగనే పర్జన్యవృష్టియగుటవలనను, పుత్రేష్టిమఖముచే పుత్రుడుకలుగుటవలన, యిటువంటి ధర్మములు దృష్టఫలహేతువులు. మఱియు జన్మాంతరమందు ఫలమిచ్చునట్టి చాంద్రాయణవ్రతాది ధర్మములు, అదృష్టఫలహేతువులు, అట్లే ధనికుడు పుణ్యాత్ముడనుటచే వాని పూర్వజన్మకృతపుణ్యమును అంగీకరించవలెను. ఏలాగుననగా — కారణము లేక కార్యోత్పత్తికాదు. శ్వానాదిపశువులకును స్త్రీసంభోగాదులచే, యేసుఖోపభోగమగునో, అదియును వాటి పూర్వపుణ్యముచేతనే యగును. (పాపకర్మముయొక్క వ్యవస్థయు ఇటువంటిదే) దీనిచే జీవులకెంత విషయజన్యసుఖముకల్గునో, అది ధర్మముచేతనే కలుగునని సిద్ధించినది ఆ ధర్మాత్ముడును స్త్రీ లేక విషయసుఖమును పొందనేరడు పుత్రధనాదిపదార్థములులేక గృహస్థాశ్రమమును పొందనేరడు. అన్నములేక క్షుధానివృత్తిచేయడు నిర్ధనుడైన, దరిద్రుడైననో స్త్రీయన్నాదిపదార్థములు విద్యమానమైయుండినను, తల్లాభమును పొందజాలడు. నిర్ధనుడగుపతిని పతివ్రతయగు భార్యకూడ పరిత్యాగము చేయుచున్నది. మిత్రబాంధవాదులును, పరిత్యాగము చేయుదురు. సకలలోకులచేతను నిర్ధనునకు నిరాదరమగును. ఎట్లు మృతశరీరము ఏయొక కార్యమందును సమర్థముకాదో, అట్లే నిర్ధనపురుషుడును, ఏయొక కార్యమునకు సమర్థుడుకాడు. ధనికుడు నానాప్రకార విషయభోగమును పొందును. కీర్తియును పొందును స్వర్గమును పొందును. సకల శుభగుణములను పొందును.

'యస్యాస్తి విత్తం స నరః కులీనః, స పండిత స్సశ్రుతిమాన్గుణజ్ఞః।
స ఏవ వక్తా స చ దర్శనీయ స్సర్వేగుణాః కాంచన మాశ్రయన్తి॥'

దీనిచే ఈ మనుజుడు ధనరూపార్థముచే స్వయముగనే కామమును పొందునని సిద్ధించుచున్నది. కాన అర్థము కామమునకు కారణమైయున్నది.

అథవా — విషయసుఖేచ్ఛలేనివాడు దేహధారి జీవులందు ఒకడైననులేడు. మనుష్య పశుపక్షులందఱును విషయసుఖేచ్ఛగలవారే. కనుక విషయ సుఖములేక యెవరికిని వైరాగ్య ప్రాప్తికాదు. కాబట్టి, విషయభోగమునకు పూర్వము బ్రహ్మచర్యాశ్రమమందు, ఏ జీవుడును మోక్షాధికారికాడు. గృహస్థాశ్రమానంతరమే మోక్షాధికారియగుచున్నాడు. అథవా — వైరాగ్యముగలవాడే మోక్షాధికారియని వేదాంత

సిద్ధాంతము, అట రాగప్రధ్వంసాభావమునకు నామము వైరాగ్యము ఆ రాగ ప్రధ్వంసాభావరూప వైరాగ్యము రాగోత్పత్తికి పూర్వమే యగునా? అనంతర మగునా? అటపూర్వమను ప్రథమ పక్షము సంభవింపదు. ఏలాగుననగా ప్రధ్వంసా భావమందు ప్రతియోగికిని కారణము గలదు ఘటములేక ఘటప్రధ్వంసా భావము గాదు. అట్లే రాగములేక రాగమునకు ప్రధ్వంసా భావమూగాదు. రాగోత్పత్తికి అనంతరమను ద్వితీయ పక్షమున్ను సంభవింపదు. ఏలాగుననగా, ఎట్లు జీవులకు కలుగు క్షుధ అన్నములేక నివృత్తముగాదో, అట్లే జీవులకు ప్రాప్తమగు విషయ సంబంధ రాగమున్ను విషయసుఖప్రాప్తిగాక నివృత్తముకాదు. విషయసుఖమో, బ్రహ్మచర్యాశ్రమమందుగాదు. ఇవ్విధమున బ్రహ్మచర్యాశ్రమమందు జీవులకు రాగ ప్రధ్వంసా భావరూపమైన వైరాగ్యాభాసముండుటచే మోక్షప్రాప్తికొఱకు ఉద్యమము, నిష్ఫలమగును.

ఆక్షేపము — బ్రహ్మచర్యాశ్రమమందు విషయమందు రాగమున్నను అధికారు లగు జీవులు శాస్త్రవిచారముచే విషయములందు నానా ప్రకారదోషములను జూచి విషయరాగమును నివృత్తము చేయుచున్నారు అపుడా బ్రహ్మచర్యావస్థయందు వైరాగ్యమున్ను, ముముక్షుతయు సంభవించుచునే యున్నదిగదా! సమాధానము — జీవుల చిత్తమందు జనించినరాగము, ఎంతవఱకు విషయ ప్రాప్తిగాలేదో అంతవఱకు ఆ జీవుల చిత్తమును యితరవిషయములందు ప్రవేశింపజేయనివ్వదు. ఎట్లనగా, గర్భిణీ స్త్రీయొక్క ఉదరమందు ఒక గర్భముండువఱకు అది యింకొక గర్భప్రవేశ మునకు ప్రతిబంధము చేయుచున్నది. అభిప్రాయము — లోకప్రసిద్ధమగు రాగ మున్ను, ఒక రాగము పూర్వముండువఱకు చిత్తమందు ప్రవేశింపదు. అట్టిచో నిక అలౌకికమగు వైరాగ్యజనిత మోక్షేచ్ఛ ప్రవేశించదని, వేఱు చెప్పనేల? మోక్షేచ్ఛ ప్రవేశింపనే ప్రవేశింపదు చూడుము — సుందరులైన అనేక స్త్రీలున్నను మండోదరీ పతియగు రావణుడు యెపుడు సీతారాగముచే యుక్తుడాయెనో, అపుడు ఒక సీత తప్ప త్రైలోక్యమందింకొక పద్మినికూడ వాని చిత్తమందు రాలేదు నలరాజుయందు సంలగ్నచిత్తముగలదైన దమయంతి యింద్రాది దేవతలనుగూడ చూడకుండెను. ఈ ప్రకారముగ రాగముచే అంధమైన బుద్ధిగలవారైన యెవరును, భూతభవిష్యద్వర్త మానములందును, ఆ విషయేచ్ఛగాక యింకొక విషయేచ్ఛ చేయరు. అటువంటి చిత్తమందు వైరాగ్యము, మోక్షేచ్ఛ యేరీతిగా సంభవించును.

ఆక్షేపము — ఎవనికి పూర్వము విషయసంబంధరాగము జనింపలేదో, అనగా యెవనికి మొట్టమొదటనే మోక్ష సుఖమందు రాగము జనించుచున్నదో ఆతడు సన్యాస

ధారణమునకును, ఆత్మజ్ఞానమునకును మోక్షమునకును అధికారియగును గదా ? సమాధానము — ఎవనికి లోకప్రసిద్ధమగు విషయసుఖమందు రాగము పుట్టలేదో, అతనికి మొదటనే అలౌకికమైన మోక్ష సుఖమందు రాగమెట్లుపుట్టును ? పుట్టనే పుట్టదు. అభిప్రాయము — ఎవనికి ఈ లోకమున విషయజన్యసుఖమునందు యిష్టము గలిగినదో, అతనికే స్వర్గవిషయజన్యసుఖమందును యిచ్ఛ పుట్టును. ఇష్టములేక స్వర్గసుఖమందును యిచ్ఛ పుట్టదు. అలాగువనే ఎవనికి లోకప్రసిద్ధ విషయసుఖమైనదో, అతనికే మోక్షసుఖేచ్ఛ యగును. విషయసుఖముగాకున్న మొదటనే మోక్షేచ్ఛ సంభవింపదు. కాన తన హృదయమందుగల విషయసుఖకామన పూర్ణముగాకుండ మొదటనే మోక్షప్రాప్తికొఱకు సన్యాసగ్రహణము చేయగూడదు. ఈ విషయమును భగవంతుడున్ను చెప్పెను —

'అనధీత్య ద్విజో వేదాన్ అనుత్పాద్య తథాసుతాన్
అనిష్ట్వా చైవ యజ్ఞైశ్చ మోక్షమిచ్ఛన్ వ్రజత్యధః ॥'

భావార్థము — బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్యులను నీ త్రివర్ణులగు ద్విజులు వేదాధ్యయనము చేయక, పుత్రోత్పత్తిగావింపక, యజ్ఞకర్మము నాచరింపక మొదటనే మోక్షేచ్ఛ యొనర్చినపుడు అతనికి మోక్ష ప్రాప్తిగాక పైగా అధోగతియగును. కనుక మొదట బ్రహ్మచర్యాశ్రమమందు వేదాధ్యయనముజేసి, ఋషిఋణమునుండి ముక్తుడై పిదప గృహస్థాశ్రమమందు పుత్రుల జనింపజేసి పితృఋణమునుండి ముక్తుడై యజ్ఞాది కర్మలజేసి దేవ ఋణమునుండి ముక్తుడై అనంతరము మోక్షప్రాప్తికొఱకు సంన్యాస ధారణమును చేయవలసినది. ఈ ప్రకారముగ రాగప్రభావ మెఱింగినవారైన మన్వాది సర్వజ్ఞులచే నీ వ్యవస్థ చేయబడియున్నది.

ఇంతవఱకు విషయాసక్తుల మతము నిరూపింపబడినది. ఇపుడు తత్ఖండనము గావింపబడుచున్నది — శ్రీ గురువు — హే శిష్య ! ఆ బహిర్ముఖ పురుషులచే వచింపబడిన పూర్వపుణ్య పాపకర్మములందలి సుఖదుఃఖహేతువును మేమును అంగీకరించెదము. కాని వారిచే పూర్వము ధనాది రూపార్థమంతు చెప్పబడిన సుఖకారణతను మేమంగీకరింపము ఎందుకనగా లోకమునందు ధనాదిరూపార్థములేని యెందఱో జీవులు సుఖులుగను, ధనవంతులైన యెందఱొ జీవులు దుఃఖులుగను గాన్పించుచున్నారు. కనుక ధనాదిరూపార్థమందు దుఃఖకారణత సంభవింపదు. ధనాదిరూపార్థము లేకనే జీవులకు సుఖప్రాప్తియగునను విషయము సప్తమాధ్యాయమందు చెప్పబడియె. ఇదియుఁగాక,

అర్థానామర్జనే క్లేశ స్తథైవ పరిపాలనే
నాశే దుఃఖం వ్యయే దుఃఖం ధిగర్థాన్ క్లేశకారిణః ॥

ఇట్లు ధనాదిరూపార్థమందు సర్వప్రకార దుఃఖప్రాప్తియే బుద్ధిమంతులచే చెప్పబడియె హే శిష్య! అర్థహీనుడగు దరిద్రుని స్త్రీ పుత్రాదులు పరిత్యాగము చేయుచున్నారను వారి వచనమున్ను సంభవింపదు. ఎందుకనగా, సకల దరిద్రులను స్త్రీ పుత్రాదులు పరిత్యాగము చేయుదురను నియమము కన్పించదు. దుష్టస్వభావము గల స్త్రీ పుత్రాదులే నిర్ధనపురుషుని పరిత్యాగము చేయుదురుగాని, సాధుస్వభావము గలవారట్లు చేయరు. (దుష్టస్త్రీ యుండినపక్షమందు ధనవంతునికూడ పరిత్యాగము చేయుచున్నది. దానికేమి!) హే శిష్య! సర్వజీవులకు సుఖేచ్ఛ కలుగుటవలన సర్వ జగత్తు కామముచే వ్యాప్తమైయున్నదను నీ వాది వచనమున్ను మిథ్యయైయున్నది. ఎందుకనగా, సర్వులకు సుఖేచ్ఛగలదనుమాట నిజమైనను, తత్సుఖేచ్ఛామాత్రముచే సర్వులకు కామలక్షణము సిద్ధింపదు. మఱేమనిన, "శిశ్నోదరపరాయణాః" శిశ్నేంద్రియ విషయమందును, రసనేంద్రియ విషయమందును ఆసక్తిగలవారే కాములనంబడుదురు. కేవల సుఖేచ్ఛామాత్రముచే సర్వజగత్తునందు కామలక్షణము సంభవింపదు.

హే శిష్య! ఒక విషయముచే నిరుద్ధమైన మనస్సు యితరవిషయమును గ్రహణము చేయదను వాదివచనము మాకు ప్రతికూలముగాదు. ఎందుకనగా, ఏదో యొక పుణ్యకర్మప్రభావముచే అధికారియొక్క చిత్తమందు మోక్షరాగ ముదయించినపుడు ఆ మోక్షరాగము చిత్తమందు ఏయొక విషయరాగమును ప్రవేశింపనీయక ప్రతిబంధము చేయును. ఈ కారణమువలననే నచికేతాది మహాపురుషులున్ను మోక్షేచ్ఛాకాలమందు ఏయొక విషయరాగమును గ్రహింపకయుండిరి హే శిష్య! వేదాధ్యయన పుత్రోత్పత్తి యజ్ఞకర్మముల చేయనివాడైన మోక్షేచ్ఛగల పురుషున కధోగతియగునను మనుభగవంతుని వచనము మోక్షనింద చేయుచున్నదను వారి యొక్క వచనమున్ను సంభవింపదు. ఎలాగుననగా వేదమందును, స్మృతులందును, ఇతిహాసపురాణములందును యెన్ని నిందావచనములు గలవో, ఆ వచనములకు దేనిని నిందించుటయందును తాత్పర్యములేదు. మఱేమనిన, ప్రకృత ప్రసంగమునందుగల విషయముయొక్క స్తుతియందే తాత్పర్యముగలదు. ఎట్లనగా, విష్ణుపురాణమందిట్లు గలదు —

వాసుదేవం పరిత్యజ్య య ఉపాస్తేఽన్యదైవతమ్
తృషితో జాహ్నవీతీరే కూపం ఖనతి దుర్మతిః ॥

శివపురాణమందిట్లుగలదు —

మహాదేవం పరిత్యజ్య య ఉపాస్తేఽన్యదైవతమ్।
సమూఢో విషముష్నాతి సుధాం త్యక్త్వా క్షుధాతురః॥

ఈ రెండు ప్రకారములగు వచనములలో విష్ణుపురాణమునందు విష్ణుస్తుతియెడ తాత్పర్యమేగాని శివాది యితరుల నిందయెడ తాత్పర్యములేదు. శివపురాణమందును అట్లే. అట్లనే మనుభగవంతుని వచనమందును మోక్షనిందయెడ తాత్పర్యములేదు. అజ్ఞానులగు జనులచే కర్మముచేయించుటయందే తాత్పర్యముగలదు. మోక్షేచ్ఛా నింద యందే దానికి తాత్పర్యమనిన, మనుస్మృతి షష్ఠాధ్యాయమందు మోక్షధర్మము కథనము చేయబడకయే యుండెడిది. కాని యిట విస్తారముగ మోక్షధర్మ కథనము గలదు. ఒకచో మనుభగవంతుడు భ్రమచే మోక్షధర్మము కథనము చేసెననిన, అది సంభవింపదు. ఎందుకనగా సాక్షాచ్ఛ్రుతిభగవతి మనుభగవంతుని సర్వజ్ఞుడను చున్నది. కాన నట్టివానియందు భ్రమాదిదోషములు సంభవింపవు శ్రుతి — 'యద్వై వచనం మనురవదత్తద్భేషజమ్' భావార్థము — మనువుచే వచింపబడిన ధర్మము జీవుల కౌషధతుల్యమైయున్నది అని వచించుచున్నది.

వాది — ఓ సిద్ధాంతీ! మనుభగవంతుడు మోక్షము నంగీకరించినను, వేదాధ్యయన పుత్రోత్పత్తి యజ్ఞకర్మానంతరమే అంగీకరించెను. సిద్ధాంతి — ఓ వాదీ! మనుభగవంతుని వచనమును యుక్తిచే విచారించినపుడు వేదాధ్యయనాదిత్రయమున కనంతరమే మోక్షము నంగీకరించెనని సిద్ధింపదు. ఏలాగుననగా పూర్వము మనుభగవంతుని వచనమందు బహు వేదాధ్యయనము, బహు పుత్రోత్పత్తి, బహుయజ్ఞకర్మము చెప్పబడియె అట 'బహుళ' పదముచే ఒకటి రెండు పదార్థములనియే అర్థమా! లేక నాలుగైదాబు ఈలాగున అనేక పదార్థములని యర్థమా? అనేక మనియే యర్థము కాన అనేకశాఖాభేదములచే విస్తృతములైన ఋగాదివేదములన్నిటిని అధ్యయనము చేయుటయందు మహా ఆయుష్యముగలవారున్ను సమర్థులుకారు. అట్టిచో ఈలోకమందుగల అల్పాయుష్కులగు మనుజులెట్లు సమర్థులగుదురు? కానేరరు. ఇవ్విధమున సర్వవేదాధ్యయనము సంభవింపదు అట్లే బహుపుత్రోత్పత్తి యందును జీవులు సమర్థులుకారు. సమర్థులైనపక్షమందు పుత్రేచ్ఛగలవారిలో నొకడైనను అపుత్రుడు గాకుండవలసియుండె. అట్లే బహుయజ్ఞములందును మనుజుడు స్వతంత్రుడుకాడు. ఎందుకనగా, స్త్రీ పుత్ర ధనాద్యనేక పదార్థములచే నొక యజ్ఞము సిద్ధించుచున్నది. కాన బహుయజ్ఞములును సంభవింపవు. ఇట్టుండ మను భగవంతుని వచనమిటువంటి అశక్యార్థమును బోధించిన పక్షమందు అది అప్రమాణమగును. ఏలన జీవులకు సుఖసాధ్యము, ప్రయత్నసాధ్యము, ఇతర ప్రమాణ

ముచే అబాధితమునగు విషయమును బోధించునట్టి శాస్త్రమే ప్రమాణరూపమగును ఈ లాగున జూచినపక్షమందు మనుభగవంతుని వచనమునకు బహువేదాధ్యయనాదు లందు తాత్పర్యములేదు.

వాది — ఓ సిద్ధాంతీ! ఆ మనుభగవంతుని వచనమందు వేదాధ్యయనాదుల అపూర్వవిధియొక్క అంగీకారములేదు. లోకమందు వేదాధ్యయన పుత్రోత్పత్త్యాదుల గావించువారియందే అన్వయవ్యతిరేకముగ మోక్షేచ్ఛకనఁబడుచున్నది. అట్టి లోక ప్రసిద్ధకారణమునే మనుభగవంతుని వచనము అనువాదముచేయుచున్నది. సిద్ధాంతి— ఓ వాదీ! జనులకు వేదాధ్యయనాదులందు మోక్షేచ్ఛావిషయక అన్వయవ్యతిరేకమేది వచించితివో, అది వ్యభిచారియైయున్నది ఏలాగుననగా వేదాధ్యయనము పుత్రోత్పత్తి గావించువారైన అనేకజనులు మోక్షేచ్ఛారహితులుగ కనఁబడుచున్నారు, పైగా అటు వంటి యెందఱోజనులు విషయాసక్తిగలవారుగను బహిర్ముఖులుగను గనఁబడు చున్నారు. కనుక మనుభగవంతుని వచనము అనువాదరూపమనుట సంభవింపదు.

వాది — ఓ సిద్ధాంతీ! మనుభగవంతునిచే నియమవిధి చెప్పబడినదా? అథవా పరిసంఖ్యావిధి చెప్పబడినదా?

సిద్ధాంతి — ఓ వాదీ! మనుభగవంతుని వచనమందీరెండు విధులును సంభ వింపవు. ఏలాగుననగా ఎచ్చట రెండు పదార్థములందు ఒక పదార్థమును నివృత్తము జేయబడి ఒక పదార్థము విధానముచేయబడినదో అచ్చట నియమవిధి యగును. ఎట్లనగా — యజ్ఞమునకు నిస్తోషతండులములు కావలసియున్నవి. ఆ తండులములు నఖముచేతను, ముసలము (రోకలి) చేతను నిస్తోషమగుచున్నవి కాని అట 'వ్రీహీ- నవహన్యాత్' — అని శ్రుతి ముసలముచేతనే వడ్లుదంచుటను విధానముచేయుచున్నది. నఖముచే గావింపబడు తుషానివృత్తిని నిషేధించుచున్నది. కనుక యిది నియమ విధి. మనుభగవంతుని వచనమును నియమరూపముగ యంగీకరించినపుడు, ఒక పక్షమందు మోక్షేచ్ఛ, రెండవపక్షమందు వేదాధ్యయనాదులు ప్రాప్తించినవి. అట వేదాధ్యయనాదులకంటె పూర్వము ప్రాప్తమైన మోక్షేచ్ఛను విరోధించి, అధికారి వేదాధ్యయనాదుల చేయవలెనని పై మనువచనమున కర్థము సిద్ధించుచున్నది. అది యెపుడు మోక్షేచ్ఛానివృత్తియందు మనుజునకు స్వాతంత్ర్యము సిద్ధించునో అపుడు మాత్రమే సిద్ధించును. మోక్షేచ్ఛానివృత్తియందో మనుజునకు స్వాతంత్ర్యములేదు. అట్లే బహువేదాధ్యయన, బహుపుత్ర, బహు యజ్ఞములందును స్వాతంత్ర్యములేదు. ఇవ్విధమున మనుభగవంతుని వచనములందు నియమవిధి సిద్ధింపదు.

ఒకేదేశమందు, ఒకేకాలమందు రెండుపదార్థము లుండినపుడు అందొక పదార్థముయొక్క నివృత్తిని బోధించు వచనము 'పరిసంఖ్య యనబడినది. వేదాధ్యయనాదిత్రయము మోక్షేచ్ఛ ఈ రెండును యెపుడు మనుజునియెదుట ప్రాప్తమగునో, అపుడు వేదాధ్యయనమునే చేయవలెనని మనుభగవంతుని వచనమున కర్థముచేసి మోక్షేచ్ఛను నివారించిన పక్షమందే యామనుభగవంతుని వచనము పరిసంఖ్యావిధి యనుట సంభవించును అట్లైనపక్షమందు మోక్షప్రాప్తికొఱకు యెవనిచేతను ప్రయత్నము గాకుండవలసియుండె మోక్షేచ్ఛ యొనట్టి అధికారులో అనేకులుగా కనబడుచున్నారు. మఱియు ఆ మనుభగవంతునిచేతనే షష్ఠాధ్యాయమందు మోక్షధర్మము ప్రతిపాదింపబడియె. ఇవ్విధమున ఆ వచనము పరిసంఖ్యావిధియుకాదు. అథవా మనుభగవంతుని వచనము మోక్షేచ్ఛను నివారించిన పక్షమందు వేదాధ్యయనాదుల పిమ్మట గావింపబడిన మోక్షేచ్ఛాకథనము అసంగతమగును. ఈ లాగునను, ఆవచనము పరిసంఖ్యావిధికాదని స్పష్టమగుచున్నది అథవా! వేదాధ్యయనాదులకు పూర్వము మోక్షేచ్ఛగావించువానికి అధోగతియగునను అర్థము, ఆ మనుభగవంతుని వాక్యములకు గలదని పూర్వము వాదిచే జెప్పబడెను. ఆ యర్థము శ్రుతిచే బాధితమగును శ్రుతి – "యది వేతరథా బ్రహ్మచర్యాదేవ ప్రవ్రజేత్" భావార్థము - ఎవనికి విషయములందు తీవ్రవైరాగ్యములేదో, అతడు క్రమముగ వానప్రస్థాశ్రమానంతరమును, ఎవనికి తీవ్రవైరాగ్యముగలదో, అతడు బ్రహ్మచర్యాశ్రమానంతరమే సంన్యాసాశ్రమమును గ్రహింపవలెను – ఇత్యాది శ్రుతివచనములచే పైమనువచనార్థము బాధితమగును. ఇవ్విధమును మనువచనము ఏ విధిరూపమును కాదని తేలుచున్నది. ఆ వచనము కర్మస్తుతియందు అర్థవాదరూపమే యైయున్నది

వాది – ఓ సిద్ధాంతీ మనువచనము మోక్షేచ్ఛను నిషేధముచేయదు. అది మోక్షేచ్ఛాభావమును విధానముచేయుచున్నది. "న కలంజం భక్షయేత్" అను వచనము ప్రాభాకరమీమాంసామతమందు కలంజభక్షణాభావమును విధానముచేయుచున్నది (విషయుక్తబాణముచే చంపబడిన మృగముయొక్క మాంసము కలంజమనబడును.) సిద్ధాంతి — ఓ వాదీ! మోక్షేచ్ఛాభావమును విధించుట యోగ్యముకాదు. ఎందుకనగా 'స్వర్గకామో యజేత' – ఇత్యాది వేదవచనములు యజ్ఞాది భావపదార్థముల విధించుచున్నవి. అభావమును ఏ వచనము విధింపలేదు మఱియు వాదిఅభావమునే విధించెననిన, వాని నిట్లడుగవలెను – ఏ యభావమును విధించుచున్నది? ప్రాగభావమునా? అత్యంతాభావమునా? అన్యోన్యాభావమునా? ఈ మూడుపక్షములును సంభవింపవు. ఎందుకనగా, ఏ పదార్థము ఏ ప్రమాణముచేతను,

సిద్ధింపలేదోదానినే శాస్త్రము విధానము చేయుచున్నది. పూర్వసిద్ధపదార్థమును విధానము చేయదు. మఱియు నైయాయికమతమందు ప్రాగభావము ఉత్పత్తిరహితమై అనాదియై యున్నది ప్రతియోగియొక్క ఉత్పత్తియగుటచే ప్రాగభావమునకు నాశమగుచున్నది. ఆ యనాది ప్రాగభావముయొక్క విధి సంభవింపదు అత్యంతాభావ అన్యోన్యాభావ ములు రెండును ఉత్పత్తినాశరహితములైయున్నవి. కనుక వాటియొక్కయు విధానము సంభవింపదు.

వాది — ఓ సిద్ధాంతీ! ప్రాగభావమునకు ఉత్పత్తిగాకుండినను నాశము గలదు. కనుక ఎట్లు 'బ్రాహ్మణో న హన్తవ్యః' అను శ్రుతివచనము బ్రహ్మహత్య యొక్క ప్రాగభావమును రక్షించుటకై విధించుచున్నదో, అట్లే మను భగవంతుని వచనమున్ను, మోక్షేచ్ఛాసంబంధ ప్రాగభావమును రక్షించుటకై విధానము చేయు చున్నది. సిద్ధాంతి — ఓ వాదీ! ఎట్లు శాస్త్రముచే బ్రహ్మహత్యయొక్క నిషేధము చేయబడినదో, అట్లు ఏదైన శాస్త్రము మోక్షేచ్ఛను నిషేధించినపక్షమందు మను భగవంతుని వచనము మోక్షేచ్ఛ ప్రాగభావమును విధించును. మోక్షేచ్ఛా నిషేధము చేసిన ఏ శాస్త్రమున్ను గనబడదు. పైగా మోక్షేచ్ఛగలవానికి ఈ ఫలప్రాప్తిని కథనము చేయుచున్నది. శ్రుతి— 'క్షణమేకం క్రతుశతస్య' ఎవడు మోక్షేచ్ఛచే క్షణమాత్రమైన ఆత్మవిచారముచేయునో, అతనికి శతాశ్వమేధఫలప్రాప్తి యగును. ఈ మొదలుగాగల అనేక శ్రుతివచనములు మోక్షేచ్ఛకు మహాఫలమును కథనము చేయుచున్నవి.

మఱియు మనుభగవంతుని వచనము మోక్షేచ్ఛా ప్రధ్వంసాభావమును విధించు చున్నదను చతుర్థపక్షమున్ను సంభవింపదు. ఏలాగుననగా, ఏ పదార్థము స్వతస్సిద్ధముకాదో దానినే శాస్త్రము విధానముచేయుచున్నది. స్వతస్సిద్ధపదార్థమును విధానము చేయదు ఎట్లన అన్నభక్షణముచే క్షుధానివృత్తి స్వతస్సిద్ధము గాన దానిని శాస్త్రమువిధానముచేయదు అట్లే మోక్షేచ్ఛయు క్షణభంగురము కనుక అచ్చట ప్రధ్వంసాభావమున్ను స్వతస్సిద్ధమే. తద్విధానమును మనువచనముగావించిన పక్షమందు ఆ వచన మప్రమాణమగును, అథవావ్యర్థమగును. ఏలాగుననగా, ఎవనికి ఏవస్తువునందెంతవఱకు సౌందర్యజ్ఞానముగలిగియుండునో, అంతవఱకు అతని కా వస్తువునందు ఒక యిచ్ఛ నశించినను, మఱల రెండవ ఇచ్ఛ పుట్టుచుండును. అట్లే మోక్షరూప నిత్యసుఖముయొక్క సౌందర్యము లోకమందును, వేదమందును ప్రసిద్ధముగనున్నది అందువలన, ఒక మోక్షేచ్ఛ నశించినను, మఱల రెండవ మోక్షేచ్ఛకలుగును. కనుక ఆమోక్షేచ్ఛాప్రధ్వంసాభావమందును మనుభగవంతునకు తాత్పర్యములేదు మఱేమనిన, విషయాసక్తులగు జనులకు కర్మమందు ప్రవృత్తిని కలుగజేయుటకొఱకు మోక్షనింద ద్వారా కర్మస్తుతి మనుభగవంతునిచే జేయబడియె.

వాది — ఓ సిద్ధాంతీ! ఆ మనుభగవంతుని వచనమునకు మోక్షేచ్ఛానివృత్తి యందు తాత్పర్యములేదని మీ కెట్లు తెలియుచున్నది? సిద్ధాంతి — ఓ వాదీ! ఆ మనుభగవంతుని వచనముచేతనే ఆ యర్థమును మేము నిర్ణయించుచున్నాము. మనుస్మృతి యొక్క ద్వాదశాధ్యాయమందీ శ్లోకముగలదు

శ్లో॥ సర్వభూతేషు చాత్మానం సర్వభూతాని చాత్మని।
పశ్యన్నాత్మతయా జీవస్స్వారాజ్యమధిగచ్ఛతి॥

ఈ పై వచనముల వక్తయైన సర్వ వేదాంతజ్ఞుడగు మనుభగవంతుడు ముముక్షువులను మోక్షేచ్ఛనుండి యెట్లు నివారించును? నివారింపడు. ఆ భగవంతుని యభిప్రాయమెఱుఁగక విషయాసక్త జనులు మనువచనమును మోక్షనిందయందు యోజన చేయుచున్నారు. దానిచే ఆ బహిర్ముఖపురుషులు తమ మూఢతనే జూపుచున్నారు అథవా మనుజుడెపుడు సకలవిషయభోగములనుండి వైరాగ్యమును పొందునో అపుడే మోక్షము నొందునను యీ మూఢవాదుల వచనము, సన్నిపాత రోగగ్రస్తుని ప్రలాపమువలెనున్నది, ఆ ప్రలాపము బుద్ధిమంతులకు గ్రహణయోగముకాదు. అథవా సర్వవిషయభోగానంతరము మోక్షము కలిగినపక్షమందు యెవనికిని మోక్షప్రాప్తి గాకుండవలసియుండె ఏలాగుననగా, ప్రాణిమాత్రులందు యెనుబదినాలుగు లక్షల తరగతులుగలవు. ఒక్కొక్క తరగతియందు అనేకవ్యక్తులుగలవు వాటిలో ఒక్కొక్క వ్యక్తికి రుచిభేదముచే అనేకవిషయప్రాప్తియగుచున్నది. ఆ సర్వవిషయములు ఒక మనుష్యశరీరమందే ప్రాప్తించుట అత్యంతదుర్లభము. అథవా, సకలవిషయభోగానంతరము మోక్షప్రాప్తియగుననినపుడు, నరకమందును అనేక ప్రకార విషయములుగలవు. కనుక మోక్షేచ్ఛగలవాడు ఆ విషయముల ననుభవించుటకు మొదట నరకమునకు పోవలసినది మఱియు కంటకభక్షణముచే ఉష్ట్రమునకు చాలరుచి కలుగుచున్నది. అరుచికొఱకు ముముక్షువు ఉష్ట్రజన్మనెత్తవలసినది. ఈ ప్రకారముగ సకలయోనులందు జన్మించవలసినది అథవా. స్వర్గాదిలోకములందును దుర్లభమగు ఏ విషయములుగలవో, అవి యజ్ఞములచేతను శక్యములుగావు. ఆ సకల విషయములను జీవుడెపుడు పొందును? సారాంశము సర్వవిషయముల ననుభవించుటయందెవడును సమర్థుడుకాడు.

వాది — ఓ సిద్ధాంతీ! సకల విషయభోగప్రాప్తికొఱకు మేము హిరణ్యగర్భోపాసన చేసెదము. అపుడు మా కావిషయములన్నియు ప్రాప్తించును. సిద్ధాంతి — ఓ వాదీ! ఆ హిరణ్యగర్భప్రాప్తియందనేక విఘ్నములుగలవు. నానాయుపాయంబుల చేసినను ఆ హిరణ్యగర్భప్రాప్తి దుర్లభమై యున్నది. అటువంటి దుర్లభమైన హిరణ్యా

గర్భప్రాప్తికై ప్రతీక్షచేసి ఏ యధికారులు అధికారశరీరమగు ఈ మనుష్యదేహమందు మోక్షప్రయత్నరహితులగుదురో, అట్టివారు బుద్ధిమంతులకు ఉపహాసాస్పదు లగుదురు అథవా ఏ పురుషులు అహంగ్రహోపాసనచే బ్రహ్మలోకమునకేగుదురో, వారికి మోక్షప్రాప్తియో అవశ్యమచట యగును కనుక అట్టి మోక్షాధికారియొక్క వర్ణనచేయుచు, ఈ మోక్షశాస్త్రము నిష్ప్రయోజనమనుట అత్యంతాద్భుతముగనున్నది. ఇవ్విధమున సర్వభోగానంతరము మోక్షప్రాప్తియగునను వాదియొక్క కథన మత్యంత విరుద్ధమైయున్నది. అథవా - విషయభోగముచే కామశాంతియగునను వాది యొక్క కథనము యితిహాసపురాణశాస్త్రాదులెఱుఁగక వచించినదగును. ఏ లాగుననగా, బహువిషయభోగముచే కామశాంతికాదు. పైగా, ఘృతకాష్ఠములచే అగ్నివృద్ధి నొందునటుల విషయసేవనముచే కామవృద్ధియగునని పురాణములందు చెప్పబడియె. అథవా - పృథివిపై ఎంత అన్నము, ఎంత సువర్ణము ఎన్ని గోఅశ్వాది పశువులు, ఎందఱు స్త్రీలుగలరో, అవన్నియు కామికి ప్రాప్తించినను వానినవి తృప్తిచేయుటయందు సమర్థములుకావు అట్టిచో, అల్పవిషయసేవనముచే కామికి శాంతియెట్లగును? విషయభోగరూపకామశాన్త్యనంతరము వైరాగ్యము ప్రాప్తింప, ఆపిదప మోక్షము లభించునని కామియగు మనుజునిచే నేది చెప్పబడెనో, అది ఏ శాస్త్రప్రమాణమున బట్టియును కాదు. తాను కామాంధుడై యట్లు చెప్పెను. కనుక ఆ విషయాసక్త పురుషుని వచనమును బుద్ధిమంతులు వినగూడదు.

శిష్యుడు – హే భగవన్! విషయభోగము రాగనివృత్తికి కారణము గానపుడు యింకేది దానికి కారణమగును? గురువు - హే శిష్య! స్త్రీపుత్రరాగనివృత్తికి ధనాది పదార్థములందు పలుమారు దోషదర్శనముగావించుట యొకటితప్ప రాగనివృత్తికి వేరొకయుపాయములేదు. (ఈ యాత్మపురాణ ప్రథమాధ్యాయమందు వామదేవాది అధికారుల సంవాదమునందును, చతుర్థాధ్యాయమందు దధ్యంగ ఇంద్రసంవాదమునను విషయదోషదర్శనము విస్తారముగ తెలుపబడియున్నది).

హేశిష్య! ఎట్లు ఈ లోకమందలి శ్వానశరీరము పంచభూతరచితమైయున్నదో అట్లే యింద్రుని శరీరమున్ను పంచభూతరచితమైయేయున్నది. మఱియు, శ్వానమున కెట్లు జననమరణములు కలుగుచున్నవో, అట్లే ఇంద్రునకును అవి కలుగుచున్నవి శరీరసంబంధముచే శ్వానమునకెట్లు దుఃఖప్రాప్తియగుచున్నదో, అట్లనే యింద్రునకును తచ్ఛరీరసంబంధముచే దుఃఖప్రాప్తియగుచున్నది. హే శిష్య! సమస్త విషయభోగ ములు జీవులకు దుఃఖకారణమని కేవలము నేనే చెప్పుటలేదు. బ్రహ్మవేత్తలందఱికివి

ఈ యభిప్రాయమే గలదు. ఈ కారణమువలననే యాజ్ఞవల్క్యాది బ్రహ్మవేత్తల విషయములందు అనేక ప్రకారదోషముల విచారముచేసి, తత్త్యాగ మొనర్చుచున్నారు.

హే శిష్య! పుత్రాదిరూప ప్రజోత్పత్తి రాగముద్వారా సంసారహేతువగుట వలన నది బ్రహ్మసాక్షాత్కారమునకు హేతువుకాదు అయినను శ్రుతిభగవతిచే బ్రహ్మసాక్షాత్కార సాధనములందు తత్కథనమేది చేయబడినదో, అది సకామపురుషులకు స్వర్గాదిసుఖములకొఱకు కథనము చేయబడినదగును. అభిప్రాయము — ఎట్లు పుత్రాది ప్రజ సంసారసుఖమునకు కారణమో, అట్లే సత్యాదిసాధనములు బ్రహ్మసాక్షాత్కారమునకు కారణమని దృష్టాంతము కొఱకు శ్రుతిభగవతిచే అసత్యాది సాధనములందు పుత్రోత్పత్తియు చెప్పబడియె అథవా లోకమందేపదార్థము జీవులకు రాగముచే ప్రాప్తముకాదో, దానినే శాస్త్రము విధానముచేయుచున్నది. రాగముచే ప్రాప్తమైన భోజనాది పదార్థములనది విధానముచేయదు. మనుష్య పశ్వాదులకో ప్రజోత్పత్తి రాగముచేతనే యగుచున్నది కనుక అటువంటి పుత్రోత్పత్తిని శాస్త్రము విధింపదు

శిష్యుడు — హే భగవన్! మోక్షప్రాప్తికొఱకు వచింపబడిన సత్యాది ధర్మముల మధ్యమందే మోక్షమునకనుపయోగమైన పుత్రోత్పత్తిరూప ప్రజననరూప ధర్మము చెప్పబడెనో అది అత్యంతాసంగతమగునుగదా? గురువు — హే శిష్య! మోక్షప్రాప్తికొఱకు సత్యాది సాధనములను విధానముచేసినదైన శ్రుతియందు 'ప్రజనన' శబ్దమేదిగలదో అది సత్యాదిశబ్దములవలె తన యర్థమును విధానము చేయుచున్నదను నీ యభిప్రాయమును మేమంగీకరించెదము కాని ఆ ప్రజననశబ్దమునకు పుత్రాదిరూప ప్రజోత్పత్తియను అర్థము లేకపోవుచున్నది. విద్యాధ్యయనమే దాని కర్థమగుచున్నది. ఎలాగుననగా లోకమందు ద్వివిధవంశములుగలవు. ఒకటి శిష్యవంశము మఱియొకటి పుత్రవంశము. ఆ రెంటియందును లోకప్రసిద్ధ విద్యాధ్యయనమునే గ్రహించవలెను.

శిష్యుడు — హే గురో! ఆ ప్రజననశబ్దము పుత్రాది ప్రజ నెట్లువిధానము చేయదో, విద్యాధ్యయనమునున్ను అట్లు చేయదు. ఎందుకనగా, ఏ పదార్థమురాగముచే, అథవా ప్రత్యక్షాదిప్రమాణములచే ప్రాప్తముకాదో, అదియే శాస్త్రముచే విధానము చేయబడుటకు యోగ్యమగును. విద్యాధ్యయనమో జీవికకొఱకు బ్రాహ్మణులకు రాగముచే ప్రాప్తమైయున్నది. "యాజనాధ్యాపనప్రతిగ్రహైర్బ్రాహ్మణో ధనమార్జయేత్" అను వచనమునుబట్టి ధనప్రాప్తికొఱకు అధ్యాపనము పూర్వమే ప్రాప్తమైయున్నది. కనుక ప్రజనన శబ్దముచే విద్యాధ్యాపనమను అర్థము ఘటిల్లదు. గురువు హే శిష్య! ప్రజనన శబ్దముచే కేవల విద్యాధ్యాపనమను ఒకే యర్థమునే నేను గ్రహించినచో, ఈ నీ అక్షేపము సంభవించును నేనో, ప్రజననశబ్దమునకు కేవల విద్యాధ్యాపనార్థమునే గ్రహించను. ఎందుకనగా, అద్వితీయాత్మస్వరూపబోధకమగు నిది

బ్రహ్మవిద్యా ప్రకరణమైయున్నది. ఈ ప్రకరణమందు యెట్లు సత్యాది సాధనముల కుపయోగముగలదో అట్లు విద్యాధ్యాపనమున కుపయోగములేకున్నను, విద్యాధ్యాపనమునకు ఫలభూతమైన అద్వితీయబ్రహ్మమునందు వేదాంతతాత్పర్యనిశ్చయరూప శ్రవణమునకుపయోగమైయున్నది. ఈ కారణమువలన ఆ ప్రజననశబ్దము లక్షణావృత్తిచే శ్రవణమునే బోధించుచున్నది. ఆశ్రవణము రాగాది ప్రతిబంధములచే పూర్వము ప్రాప్తముగాలేదు. కనుక ఈ పక్షమందు పూర్వోక్తదోషము సంభవింపదు. హే శిష్య! పూర్వము నేను ప్రజననశబ్దమునకు పుత్రోత్పత్త్యాదుల యర్థమును దేనిని వచించి యుంటినో, అట పుత్రోత్పత్త్యాదులకై యౌవనావస్థ స్త్రీయాదుల యపేక్షగలదు. ఈ పక్షమందో కేవల సన్న్యాసముయొక్కయే అపేక్షగలదు. 'సన్న్యస్య శ్రవణం కుర్యాత్'- అధికారిజనులు సన్న్యాసధారణముజేసి శ్రోత్రియుడును, బ్రహ్మనిష్ఠుడునగు గురుముఖమున వేదాంతశ్రవణము చేయవలెను.

ఇపుడు ఆహిత అగ్నిహోత్ర యజ్ఞములను నీ సాధనాత్రయ నిరూపణము గావింపబడుచున్నది — హే శిష్య! బ్రాహ్మణాది త్రివర్ణస్థులందు, వేదాధ్యయనము చేయువారును, స్త్రీపుత్రాదులుగలవారును, కృష్ణకేశయుక్తుడును, అంధత్వాదిదోష రహితుడును, వేదోక్తకర్మకాండమందు కుశలుడును, ధనవంతుడునగు పురుషుడు దక్షిణాగ్ని, గార్హపత్య ఆహవనీయ సభ్య, అవసథ్యములను నీ పంచాగ్నులను గృహమందు స్థాపించవలెను. అథవా, దక్షిణాగ్ని, గార్హపత్య ఆహవనీయములను నీ యగ్నిత్రయమునైన స్థాపనము చేయవలెను. వీటికి శ్రౌతాగ్నియనిపేరు, హే శిష్య! అథర్వణాధ్యయనులగు కొందఱు బ్రాహ్మణులు ఋషియను ఒకేయగ్నిని శ్రౌతాగ్ని యనుచున్నారు. ఆ యగ్నియొక్క గ్రహణము వివాహకాలమందు చెప్పబడియె. కొందఱు గృహ్యసూత్రకారులిట్లనిరి — ఎవనికి పూర్వోక్త అగ్నిత్రయగ్రహణసామర్థ్యములేదో, అతడు ఔపాసనయను స్మార్తాగ్నిని గ్రహణము చేయవలెను. కాని గృహస్థుడు అగ్న్యాధానములేక యెప్పటికిని యుండగూడదు.

ఇపుడు అగ్నిరక్షణఫలము వచింపబడుచున్నది — ఎవఁడు కేవలము పూర్వోక్త అగ్నిసంబంధ కర్మముమాత్రము జేయునో, వానికి ఈ లోకమందు మహాకీర్తియగును. ఎవఁడు అగ్న్యుపాసనా సహితముగ అగ్నికర్మము చేయునో అతడీ లోకమందు మహాకీర్తిని బొంది మరణానంతరము దేవయాన మార్గమున బ్రహ్మలోకమునకు పోవును.

హే శిష్య! పూర్వోక్త ఆహితాగ్నియందు ఆహుతి నొసంగుటకుపేరు అగ్నిహోత్రము గృహస్థుడు జీవించియున్నంతవఱకు అగ్నిహోత్రము చేయవలెనని శ్రుతియొక్క విధానమైయున్నది. ఐనను ఆశ్రుతియొక్క అభిప్రాయమేమనగా ఎంతవఱకు

వైరాగ్యము జనింపలేదో, అంతవఱకు అగ్నిహోత్రమాచరించి వైరాగ్యముదయింపగనే ఆ యగ్నిహోత్రమును పరిత్యజించి సన్న్యాసమును గ్రహింపవలెను. హే శిష్య! గృహస్థుని యింటిలో పంచసూనజనిత దోషములుగలవు. "ఖండినీ దలనీ చుల్లీ పేషణీమార్జనీ తథా" - ఈ యైదింటిచే నగు జీవహింస పంచసూనజనిత దోషమనఁబడును. అగ్నిహోత్రముచే గృహస్థునకాదోషములు కలుగవు. అగ్నిహోత్రముచరించునట్టి వారొసంగు ఆహుతి అగ్నిద్వారా ఆదిత్యుని పొందుచున్నది. ఆయాహుతివిశిష్టాదిత్యునిచే జలవృష్టి ఆ జలవృష్టిచే వ్రీహియవాద్యన్నము, అన్నముచే మనుష్యాదిప్రజ పుట్టుచున్నవి. ఇవ్విధమున అగ్నిహోత్రియగు పురుషుఁడు జగత్కారణమగుచున్నాఁడు. మఱియు నాతఁడు జగత్పాలనమున్ను చేయుచున్నాఁడు. అట్లు జగత్సృష్టిచేయుటచే అగ్నిహోత్రికి పుణ్యము సంప్రాప్తించుచున్నది ఎట్లు క్షుధాతురబాలుఁడు మాతనాశ్రయించునో, అట్లే యింద్రాది దేవతలు అగ్నిహోత్రిని ఆశ్రయించుచున్నారు. అగ్నిహోత్రికి కేవలమీలోకమందు కీర్తి, ధనము, దర్శపౌర్ణమాస్యాది యజ్ఞాధికారము ప్రాప్తించుచున్నవి. మరణానంతరము స్వర్గము ప్రాప్తింప, సర్వదేవతలును నమస్కరింతురు. ఉపాసనాసహితాగ్నిహోత్రము చేయువారు దేవయానమార్గమున బ్రహ్మలోకమును పొందుచున్నారు. (అశ్వమేధాది కర్మలకును, దానమునకును ఫలము పూర్వమే చెప్పబడియె.)

హే శిష్య! ధర్మసత్యాది దశసాధనములున్ను, సన్న్యాసమున్ను, ఈ సమస్త సాధనములు ఒక మానస సాధనమందే పుట్టుచున్నవి ధైర్యయుక్త మనస్సునకు పేరు మానససాధనము ఆ ధైర్యమనస్సుగల పురుషుఁడు ఒక్కసాధనమునకైనను శక్తుఁడు కాఁడు. ఇవ్విధమున మానససాధనమే సకలసాధనములకు కారణమైయున్నది ఇవ్విషయమున హిరణ్యగర్భదేవుఁడే దృష్టాంతరము. హిరణ్యగర్భదేవుఁడు ధైర్యమనః ప్రభావముచే సృష్ట్యాదికాలమందు సకలస్థూలజగత్తును సృజించుచున్నాఁడు. మఱియు తనస్మరణమాత్రముచే భక్తజనుల సర్వపాపములను నాశముజేసి జగత్స్తుతికి పాత్రుఁడాయెను. పూజ్యుఁడై సకల శ్రేష్ఠతను పొందెను. ఈ కారణమువలననే శ్రుతిభగవతిచే సకలసాధనములందును మానస సాధనమునకు శ్రేష్ఠత వచింపబడియె.

ఇపుడు సన్న్యాసరూపద్వాదశ సాధనముయొక్క ఉత్కృష్టతా నిరూపణముగా వింపబడుచున్నది – హే శిష్య! సంన్యాసము ద్వివిధము. ఒకటి లింగసన్న్యాసము, మఱియొకటి అలింగసన్న్యాసము. దండాది చిహ్నములతోఁగూడినది లింగసన్న్యాసము. అచిహ్నములులేనిది అలింగసన్న్యాసము. అలింగసన్న్యాసమందో, ఒక బ్రాహ్మణునికే అధికారముగలదు. క్షత్రియ, వైశ్య, శూద్ర, స్త్రీలకులేదు. వారికి అలింగసంన్యాసమందధికారముగలదు. ఆ రెండు సన్న్యాసములందును భిక్షాటనాది బాహ్యధర్మములు

శమదమాద్యంతర ధర్మములు, సమానముగనే యున్నవి. హే శిష్య! లింగసన్యాసము ద్వివిధము - ఒకటి త్రిదండము, మఱియొకటి ఏకదండము. ఆత్రిదండసన్యాసమున్ను ద్వివిధము - ఒకటి కుటీచకము, మఱియొకటి బహూదకము. ఏకదండసంన్యాసమున్ను ద్వివిధము - ఒకటి హంసము, మఱియొకటి పరమహంసము అశక్తశరీరము గలవారగుటచే గృహమందే నొకకుటి కట్టుకొని నివసించువారు కుటీచకులు. కొంత శరీరసామర్థ్యముగలవారు పృథ్విపై సంచారముచేయువారు బహూదకులు. పంచ సూత్రలు ధారణము చేయువారు బహూదకులు (దండత్రయము, కమండలువు. భిక్షాపాత్రము, జలపాత్రము, భోజనపాత్రము-ఇవి పంచసూత్రలు) శిఖ లేక యజ్ఞోపవీతముగలవారైన సామవేదపాఠియగు బ్రహ్మచారివలె శిఖలేనివారై యజ్ఞోపవీతధారణ మొనర్చి, ఏకదండముగలవారై, పృథ్విపై కీటమువలె మందసంచారముచేయువారు హంస. పరమ వైరాగ్యశీలురై, మోక్షేచ్ఛగలవారై, కర్మోపాసనారహితులై, వేణుదండమును ధరించియుండువారు పరమహంస. సంన్యాసములన్నిటియందు ఈ పరమహంస సంన్యాసము ఉత్కృష్టము హంస మొదలగు యితర సంన్యాసములు క్రమముగ ఒకదానికంటె నొకటి తక్కువైయున్నవి.

హే శిష్య! ప్రాణిమాత్రులలో వేటికి ప్రాణసంబంధ శ్వాసోచ్ఛ్వాసముల వ్యాపారము స్పష్టముగలేదో, అటువంటి వృక్షాదులకంటె, స్పష్టవ్యాపారముగల కీటాదులు శ్రేష్ఠము. ఆ కీటాదులకంటె స్పష్టబుద్ధిగల సర్పాదులు శ్రేష్ఠము. సర్పాదులకంటె చతుష్పాదపశ్వాదులు శ్రేష్ఠము. ఆ పశ్వాదులందును, అశ్వాదులు శ్రేష్ఠము. అశ్వాదులకన్నను గోవు శ్రేష్ఠము. గోవుకంటె ద్విపదమనుష్య ప్రాణులును, ఆ మనుష్యులందును, శూద్రునికన్న వైశ్యుడు వైశ్యునికన్న క్షత్రియుడు, క్షత్రియునికన్న బ్రాహ్మణుడు శ్రేష్ఠుడు, లోకమందు భూదేవ బ్రాహ్మణులెట్లు పూజనీయులో, అట్లే అగ్న్యాది దేవతలున్ను పూజ్యులే. కనుక శాస్త్రమందు అగ్న్యాదిదేవతలు బ్రాహ్మణతుల్యముగ కథనము చేయబడిరి. ఆ బ్రాహ్మణులందును వేదపాఠియు, వేదపాఠులందును సామాన్యవేదార్థవిచారి, వానికంటెను సంశయవిపర్యయరహితవేదార్థవిచారి శ్రేష్ఠుడు. వారిలోను, బ్రహ్మచారి, గృహస్థ, వానప్రస్థ, సంన్యాసులొకరికంటె యొకరు శ్రేష్ఠులు, సంన్యాసులందఱిలోను పరమహంస సన్యాసి అత్యంతశ్రేష్ఠుడు. కనుకనే శ్రుతిభగవతి యాతనిని బ్రహ్మవిత్, బ్రహ్మనిష్ఠ నామములచే కథనముచేయుచున్నది.

హే శిష్య! ఆనంద స్వరూపాత్మ నెఱుఁగుట కొఱకు శ్రుతిచే సంన్యాసాశ్రమ విధానము గావింపబడియె. అట్టి సన్యాసాశ్రమమును ధరించియు యెవఁడు ఆత్మ విచారముచేయడో మోహవశుడై కర్మమునే యాచరించునో, ఆ సన్యాసి పతితుడగును సురేశ్వరాచార్యులును యిట్లనే వచించిరి.

శ్లో॥ త్వంపదార్థ వివేకాయ సన్న్యాసస్సర్వకర్మణాం ।
శ్రుత్యా విధీయతే తస్మాత్ తత్త్యాగీ పతితో భవేత్ ॥

హే శిష్య ! ఎవఁడు సన్యాసగ్రహణముజేసి నిరంతరమాత్మవిచారణచేయునో, వానినిగూర్చి శ్రుతి యిట్లు వచించినది - 'బ్రహ్మవిద్బ్రహ్మైవ భవతి' — బ్రహ్మము నెఱిఁగినవారు బ్రహ్మరూపమేయగును — సర్వం ఖల్విదం బ్రహ్మ' - సకలజగత్తు బ్రహ్మరూపమేయైయున్నది అటువంటి సర్వాత్మరూప బ్రహ్మమునెవరు ఆత్మరూపముగ సాక్షాత్కరించుకొందురో, అట్టిబ్రహ్మవేత్తలు సర్వజగత్తును ఆత్మరూపముగనె యెఱుఁగుచున్నారు భూతభవిష్యద్వర్తమానకాలములందే పదార్థమును బ్రహ్మవేత్త కంటె నుత్కృష్టమగునదిలేదు. బ్రహ్మవేత్తయే సర్వోత్కృష్టుడు కార్యకారణజగత్తుకంటె బ్రహ్మము పరమైయున్నది కాన నట్టి బ్రహ్మమును పొందించునట్టి సన్యాసమున్ను తపస్సు మున్నగు సకల సాధనములకన్న పరమైయున్నది

హే శిష్య ! ఆదిత్యమండలనివాసియైన సువర్ణవర్ణముగల స్వయంజ్యోతియగు పురుషుడు స్వశరీరసంబంధకిరణములచే పృథ్వీస్థితజలము నాకర్షించి అద్దానిని మేఘములందు స్థాపించి, మఱల సృష్టిద్వారా భూలోకమునకు పంపుచున్నాడు. ఆ జలముచే వృక్షాదిప్రాణులు వ్రీహి యవాది ఓషధివనస్పతులు పుట్టుచున్నవి. ఓషధులచే అన్నము అన్నముచే మనుష్యాది ప్రాణులు పుట్టుచున్నారు. కనుక ఆదిత్యమండలస్థిత స్వయంజ్యోతియగు పురుషుడే అన్నముద్వారా సకలజగత్తునకు కారణమైయున్నాడు.

హే శిష్య ! అన్నముచే ప్రాణులు ప్రాణులచే కర్మోపాసనాసామర్థ్య రూప బలము ఆ బలముచే శుద్ధకర్మరూపతపము పుట్టుచున్నవి ఆ తపముచే పరలోక మందలి ఆస్తికబుద్ధిరూపశ్రద్ధ ఆశ్రద్ధచే శాస్త్రార్థధారణము చేయదగిన సామర్థ్యముగల బుద్ధిరూప మేధ పుట్టుచున్నవి. ఆ మేధచే మనోనిరోధసమర్థబుద్ధివృత్తిరూప మనీషయు, ఆ మనీషచే శాస్త్రార్థవాసనాయుక్త శుద్ధమనస్సు, ఆ మనస్సుచే ఆత్మాకార రూపకాంతి ఆ కాంతిచే ఆత్మానందస్వరూపనిర్ణయము చేయుదగినచిత్తము పుట్టు చున్నవి. ఆ చిత్తముచే గురూపదిష్ట వేదవాక్యముల యర్థమును ధారణచేయునట్టి స్మృతి, అస్మృతిచే శోధితతత్త్వంపదార్థప్రకాశకరూపమైన స్మరణము, ఆ స్మరణ ముచే బ్రహ్మసంబంధపరోక్షజ్ఞానము, ఆ జ్ఞానముచే 'నేను బ్రహ్మరూపుడ'నను అపరోక్షజ్ఞానము పుట్టుచున్నవి

హే శిష్య ! ఈ ప్రకారముగ ఆ బ్రహ్మరూప సన్యాసము వ్రీహియవాద్యన్న మునకు కారణమున్ను, ఫలరూపమున్ను యైయున్నది. ఆదిత్యస్థిత పురుషరూపము

చేత, ఆ బ్రహ్మరూపసన్న్యాసము కారణరూపమై, ప్రాణాదిపరంపరచే అన్నమునకు ఫలరూపమైయున్నది ఈ ప్రకారముగ అన్నమునకు కారణరూపముగాను, ఫల రూపముగాను, బ్రహ్మసంబంధముగా నెఱిఁగి ఏ యధికారిపురుషులు అతిథికి అన్న దానమును చేయుదురో, వారాయన్నముయొక్క పూర్వోక్త సకల కారణములను కార్య ములను దానముచేసిన వారగుదురు

శిష్యుడు — హే భగవన్! కార్యదానముచే కారణదానము సంభవింపదు గదా? గురువు — హే శిష్య. ఒక మనుజుడొక బ్రాహ్మణున కీప్రకారమగు దానము చేసెను — నా ఆమ్రవృక్షమెంతవఱకుండునో అంతవఱకు దాని ఫలములను నీకర్పణ చేయుదును. — ఇవ్విధమున నిట కార్యరూపఫలముల నర్పించుటచే కారణరూప వృక్షముయొక్కయు దానమగుచున్నది. మఱియు వేఱొకడొక బ్రాహ్మణునకు గోదానముచేసెను — ఇట ఆ కారణరూపగోసహితముగ కార్యరూపమగు దుగ్ధము యొక్కయు దానమగుచున్నది. అట్లనే అన్నదానముచే పూర్వోక్త సర్వకారణముల యొక్కయు, కార్యములయొక్కయు, దానము సంభవించుచున్నది హే శిష్య! పూర్వము చెప్పబడిన అన్నాదిపంచకోశములందును, అన్నమే స్థితమైయున్నది. ఈ కారణమువలనను అన్నమే జగత్కారణమగును

హే శిష్య! శ్రుతియందు విజ్ఞానమయకోశమునుండి ఆనందమయకోశమువఱకు ఉత్పత్తియేది చెప్పబడెనో, దానియందభిప్రాయమేమనగా — ఆనందమయకోశమున పుచ్ఛప్రతిష్ఠాభూతమై శుద్ధబ్రహ్మరూపమగుటవలన ఉత్పత్తినాశరహితమైయున్నను, ప్రియమోదప్రమోదాదివృత్తి విశిష్టరూపముచే ఆ యానందమయకోశము ఉత్పత్తినాశ ములుగలదిగానున్నది. కనుక ప్రియవృత్తివిశిష్టత నంగీకరించి శ్రుతిచే తదుత్పత్తి కథనము చేయబడియె.

ఇపుడానందరూపాత్మయొక్క మహిమ వర్ణింపబడుచున్నది. — ఒకే యానంద మయపురుషుడు ఆకాశ భూమ్యంతరిక్షస్వర్గ పూర్వాదిదిశలను నీ పంచరూపములచే పంచప్రకారములుగల్గి పుట్టుచున్నాడు. ఆ యానందమయపురుషులకు కేవల మీ పంచరూపములుమాత్రమేకావు. ఎట్లు తంతువులచే పటము సర్వత్ర ఓతప్రోతమై యున్నదో, అట్లే త్రిలోకములందు త్రికాలములందు స్థితమైన స్థూలసూక్ష్మమగు యెంత జగత్తుగలదో; ఆ సంపూర్ణజగత్తు ఆనందస్వరూపాత్మచేతనే వ్యాప్తమైయున్నది. ఆ యానందరూపాత్మయే సకల జగద్రూపమైయున్నాడు. మఱియు నాతడే విచార రూప జిజ్ఞాసచే ప్రాప్తమగుటకు యోగ్యమైయున్నాడు. అతడే ఫలహేతుకర్మములను జనింపచేయుచున్నాడు. ఆ యానందరూపాత్మయే సువర్ణాది సకల వస్తువులందు

అంశరూపముగ స్థితుడైయున్నాడు అతడే అధికారిపురుషులకు శ్రద్ధచేతను, సత్యము చేతను ప్రాప్తమగుచున్నాడు. ఈ కారణమువలన శ్రుతిభగవతి ఆ యానంద రూపాత్మను 'శ్రద్ధాసత్య' నామములచే కథనము చేయుచున్నది. ఆ యాత్మయే స్వయంజ్యోతిరూపుడైయున్నాడు ఈ కారణముచే నాతనిని శ్రుతిభగవతి 'మహాసత్య' నామముచే కథనముచేయుచున్నది మఱియు భృగుఋషి తనతండ్రియగు వరుణుని యుపదేశముచే నే విచారరూప తపమునొనర్చెనో, ఆ విచారరూపతపముకంటెను ఈ యానందరూపాత్మ శ్రేష్ఠుడైయున్నాడు. ఈ కారణమువలన శ్రుతిభగవతి యాత నిని 'తపసోవరిష్ఠః' యను నామముచే కథనము చేయుచున్నది

ఇపుడాయానందరూపాత్మయొక్క జ్ఞానమునకు ఫలము నిరూపింపబడు చున్నది – హే శిష్య! ఇటువంటి ఆనందస్వరూపపరమాత్మదేవుని ఏ యధికారి పురుషులు తమ యాత్మరూపముగ సాక్షాత్కరించుకొనుచున్నారో, వారు జీవితావస్థయందే అవిద్యాది క్లేశరహితులై మరణానంతరము మరల మృత్యువును పొందరు. హే శిష్య! ఏ యాత్మజ్ఞానప్రభావముచే అధికారి పురుషులు మఱల మృత్యువునొందరో, ఆ యాత్మ జ్ఞానము సన్యాసప్రభావముచే ప్రాప్తించుచున్నది. ఈ కారణమువలననే బ్రహ్మవేత్తలు సన్యాసమును సకల సాధనములందును శ్రేష్ఠమని వచించుచున్నారు.

ఇక సన్యాసముచే ప్రాప్తింపయోగ్యమైనట్టి ఆత్మయొక్క స్వరూపవర్ణనము గావింపబడుచున్నది ఆ స్వయంప్రకాశానందరూపాత్మదేవుడు ఉత్పత్తి నాశరహితు డగుటవలన సత్యరూపుడుగను దుర్విజ్ఞేయుడగుటవలన సూక్ష్మరూపుడుగను, ఆకా శాదుల కధిష్ఠానమగుటచే విభురూపుడుగనున్నాడు. మఱియు నాతడు ప్రాణాపాన నియంతృరూపమున స్థితుడై ఆ ప్రాణాపానములకు వ్యానరూపసంధిగావించుచు పరిచ్ఛిన్న వామనసంజ్ఞను పొందుచున్నాడు ఈ కారణమువలన శ్రుతిభగవతి ఆ యాత్మదేవుని 'ప్రాణసంధాత'యను నామముచే కథనముచేయుచున్నది. ఆ యాత్మ దేవుడు బ్రహ్మరూపుడుగను, సకలజగత్పాలకుడుగను, సూర్యచంద్రులకు తేజమొసంగు వాడును, బ్రాహ్మణాదులకు వర్చస్సు నిచ్చువాడుగనున్నాడు (జ్యోతిష్పదార్థమునకు వర్చస్సనిపేరు) హే శిష్య! ఈ యాత్మదేవుడు జఠరాగ్నిద్వారా బ్రాహ్మణాదులకు వర్చస్సును కలుగజేయుచున్నాడు. ఎట్లనగా - జఠరాగ్ని యెపుడు అన్నపచనము జేయుచున్నదో, అపుడు రసాదులద్వారా శరీరమందు వర్చస్సు కలుగుచున్నది. దానిచే మనుజుడు రోగరహితుడై సుందరకాంతిగలవాడగుచున్నాడు. హే శిష్య! సువర్ణదర్పణాది స్వచ్ఛపదార్థములందు సూర్యకిరణసంబంధముచే జనించిన పరప్రకాశ జ్యోతిరూపమునకు ద్యుమ్నమనిపేరు. ఆద్యుమ్నమొసంగువాడు పరమాత్మదేవుడే యైయున్నాడు. అథవా సూర్యచంద్రుల తేజమునకును ద్యుమ్నమనిపేరు. అగ్నితేజ

మునకు వర్పుస్సని పేరు, ఏ యానందరూపాత్మ సూర్యచంద్రాగ్నులకు తేజము నొసంగు చున్నాడో, అతడే అధికారిజనులకు సన్న్యాసముచే ప్రాప్తింపయోగ్యమైయున్నాడు.

హే శిష్య ! అహింసాసత్యాది పంచధర్మములతోగూడిన యమము సన్న్యాసికి సమీపమగుటవలన శ్రుతిభగవతి సన్న్యాసిని 'ఉపయమ' నామముచే కథనము చేయుచున్నది. మఱియు నీ యానందరూపాత్మ సచ్చిదానంద స్వరూపుడగుటవలన శ్రుతి భగవతి యాతనిని 'బ్రహ్మ'నామముచే కథనముచేయుచున్నది. హే శిష్య ! జాబాలాద్యుపనిషత్తులందు సన్న్యాసనిరూపణము గలదు. తదనుసారముగ సన్న్యాసగ్రహణముచేసి జీవబ్రహ్మాభేదమును బోధించునట్టి యే ప్రణవము గలదో, దానిని లెస్సగ నెఱిగి హంసాద్యుపనిషత్తులచే కథనముచేయబడిన యోగము నాశ్రయించి అధికారి పురుషులు బ్రహ్మవేత్తయగు గురువుయొక్క ఉపదేశముచే తమ యాత్మను బ్రహ్మరూపముగ చింతనజేసి బ్రహ్మభావమును పొందుచున్నారు.

హే శిష్య ! తిత్తిరి బ్రాహ్మణులచే తమ శిష్యులకు బోధింపబడిన యీ బ్రహ్మవిద్య అజ్ఞానరూపమోహమును నశింపజేయునదిగాను, అగ్న్యాదిదేవతలచేతను విధివలె రక్షించుకొనదగినదిగానున్నది. ఈ కారణమువలన బ్రహ్మవిద్య అగ్న్యాదిదేవతలకును గుహ్యధనమై యున్నది. ఇటువంటి బ్రహ్మవిద్యను ఏ యధికారిజనులు బ్రహ్మవేత్తయగు గురుముఖమున నిశ్చయమొనర్చుకొనుచున్నారో, ఆ యధికారులే అద్వితీయ బ్రహ్మభావము నొందుదురు కనుక ఏ యధికారిజనులకు బ్రహ్మభావేచ్ఛయగునో, వారు సర్వప్రకారముల నా బ్రహ్మవిద్యను సంపాదింపవలెను. హే శిష్య ! ఈ యాత్మజ్ఞానరూప బ్రహ్మవిద్య తన సమీపతచే కార్యసహితాజ్ఞానమును నాశమొనర్చుచున్నది. ఈ కారణమువలన ఉపనిషచ్ఛబ్దము బ్రహ్మవిద్యకే వాచకమైయున్నది కావున బ్రహ్మవిద్యాప్రాప్తి గావించునట్టి యీ తైత్తిరీయనామక గ్రంథమును శాస్త్రవేత్తలు ఉపనిషన్నామముచే కథనము చేయుచున్నారు.

హే శిష్య ! యజుర్వేద సంబంధమగు తిత్తిరియను శాఖయందు తిత్తిరిబ్రాహ్మణులచే తమ శిష్యులకు యే బ్రహ్మవిద్య కథనముచేయబడెనో, ఆ బ్రహ్మవిద్యనంతటిని ఈ యాత్మపురాణ దశమాధ్యాయమందు నేను నీకు నిరూపించితిని. హే శిష్య ! నారాయణోపనిషత్తుయొక్క అంతమందు బ్రహ్మవేత్తయగు పురుషుని జ్ఞాననిష్ఠారూప యజ్ఞమునకు 'ఆత్మాయజమానశ్శ్రద్ధా పత్నీ' ఇత్యాదిమంత్రములు నిరూపింపబడినవి అవి ఆత్మసాక్షాత్కారముకొఱకు కథనముచేయబడలేదు. మందబుద్ధులు చిత్తశుద్ధి కొఱకే వచింపబడినవి. హే శిష్య ! తిత్తిరి బ్రాహ్మణులచే తమ శిష్యులకుపదేశింపబడిన బ్రహ్మవిద్యనంతయు నేను నీకు కథనముచేసితిని. ఇక నిపుడే విషయము వినుటకై నీకు యిచ్ఛగలదో వచింపుము. దానిని నేఁజెప్పెదను.

ఇతి శ్రీమదాత్మపురాణే దశమోఽధ్యాయః.

శ్రీ

ఆత్మపురాణము

అథ ఏకాదశాధ్యాయారంభః

ఏకాదశాధ్యాయము

పూర్వము దశమాధ్యాయాంతమందు తైత్తిరీయోపనిషత్సంబంధ నారాయణోపనిషదర్థనిరూపణము చేతుబడియె ఇపుడీ యేకాదశాధ్యాయమందు జాబాలక. గర్భ అమృతనాద హంస క్షురిక అరుణేయ బ్రహ్మ పరమహంస మహత్ ఆత్మ ప్రభోద కైవల్యములను యీ యేకాదశోపనిషత్తులయొక్క అర్థనిరూపణము గావింపబడును దశమాధ్యాయమందు తిత్తిరి బ్రాహ్మణుబ బ్రహ్మవిద్య శ్రవణముజేసి శిష్యుడు పరమాశ్చర్యముపొంది సాధనసహితముగా ఫలసహితముగా పరమహంస సంన్యాసము నడుగుట కిచ్ఛగింపుచు స్వగురునిగూర్చి యిట్లనియె

శిష్యుడు - హే భగవన్ ఇతరేయ కౌషీతక, శ్రీసూర్య శ్వేతాశ్వతర తిత్తిరికర ఋషులచేత వారివారికి కధనముచేయబడిన సంపూర్ణబ్రహ్మవిద్యను తాము నాకు నివేదనముచేయుచున్నారు ఇప్పుడు నాకు పరమహంస సవ్యాసముయొక్క స్వరూప మెఱుగుటయందుత్కటేచ్ఛ గలిగినది కనుక యీ విషయమును గూర్చియే నేను మొదట అడుగుచున్నాను తరువాత యితరోపనిషత్తులనుగూర్చి యడిగెదను తాము దయచేసి మొదట పరమహంస సంన్యాసస్వరూపమును నిరూపణచేయుడు భగవన్! అట నాప్రశ్న యిది ఆ పరమహంస సన్యాసము ఏ అధికారికి యోగ్యమగును? అది పూర్వమేమహాత్ములచే ఆచరింపబడియున్నది? ఆ సన్యాసముచే ఏ ఏ వస్తు వెఱుగుటకు యోగ్యము? ఆ సన్యాసముయొక్క ధర్మము లెయ్యవి? దానికి ఫలమేమి?

శ్రీ గురు — హే శిష్య నీవు పరమహంస సన్యాససంబంధ ప్రశ్నమేది చేయుచున్నావో, అది వృద్ధకుమారీ వరన్యాయముగనున్నది. — ఒక వృద్ధకుమారి తపస్సు

చేసి యింద్రుడు ప్రసన్నమైనపుడు వాని నీ వరములడుగుచున్నది హే యింద్రా! నా పుత్రుడు స్వర్ణపాత్రమందు దధ్యోదనభోజనముచేయువలయును ఆ ఒకేవరమందు ఆ వృద్ధకుమారి తారుణ్యమును పతిని పుత్రుని ఐశ్వర్యమును సంపాదనముచేయు చున్నది. అట్లే నీవున్ను పరమహంససన్యాసమునుగూర్చి అడుగుటచే జాబాల బ్రహ్మ అరుణేయ పరమహంసములను నాలుగు ఉపనిషత్తులందు చెప్పబడిన పరమహంస ధర్మమును యోగమును గర్భోపనిషత్సంబంధ యోగోపయోగమును వైరాగ్యమును, ఒకే ప్రశ్నకుత్తరముగా నీకు చెప్పబోయెదను ఈ పరమహంససన్యాసము బ్రహ్మోపని షత్తునందు యే ఋషియొక్క ప్రశ్నోత్తరములేకనే వేదభగవంతునిచే స్వయముగనే సృష్టీకరింప బడినది. దానిని సమగ్రముగా విస్తారముగా నీకు చెప్పెదను. సావధాన ముగశ్రవణముచేయుము

హే శిష్య! బృహస్పతియొక్క భ్రాతయగు సంవర్తకుడనుఋషి, అరుణి, ఉద్దాలకుడు శ్వేతకేతువు శంకరావతారదూర్వాసముని, సనకాదులను బ్రహ్మమానస పుత్రులు అట్లే ఋభువనుమానసపుత్రుడు నిదాఘుడు, జడభరతుడు విష్ణ్వవతార దత్తాత్రేయముని రేవతుడు భారద్వాజుడను నీపదుగురు ఋషులును యింకను శుకవామదేవాది అనేక బ్రాహ్మణులును పరమహంస సన్యాసమును ధారణజేసిరి. ఆ సమస్త సన్యాసులు నేను బ్రహ్మరూపుడను' నీ ప్రకారమగు ఆత్మసాక్షాత్కారముచే సంసారబంధరహితులైరి ఇపుడా పరమహంససన్యాసులయొక్క అవ్యక్త ఆచారములు రూపింపబడుచున్నవి (ఏ చిహ్నములను ఆచారములను జనులు యెఱుగరో, అవి అవ్యక్తమనబడును) హే శిష్య! ఆ సంవర్తకాది సన్యాసులు నియమముగా ముండులుగను నియమముగా జటాధారులుగను నియమముగా దండధారులుగను, నియమముగా శ్వేతవస్త్రధారులుగను లేరు మఱియు నియమముగా కాషాయవస్త్ర ధారులుగను లేరు

హే శిష్య ఎట్లు ఆ పరమహంససన్యాసులకు అవ్యక్తచిహ్నములుగలవో, అట్లే వారియొక్క ఆచారములును అవ్యక్తముగనేయున్నవి. హే శిష్య! ఆ యవ్యక్తా చారములుగలవారైన మహాత్ములు ఎట్లు అవ్యక్తరీతిగా విచరించుచున్నారో, అట్లు ఆ మహాత్ములయొక్క మతియును అవ్యక్తమే వారియొక్క ఆకృతియు అవ్యక్తమే, ఆ మహాత్ములొకపుడు సర్వపదార్థములయెడ యిచ్ఛారహితులుగాను ఒకపుడు అసక్తి గలవారుగాను ఒకపుడు శాస్త్రవేత్తలుగాను ఒకపుడు మూఢులుగాను ఒకపుడు నానాచేష్టలు గలవారుగాను ఒకపుడు చేష్టారహితులుగాను ఒకపుడు వాచాలురుగాను, ఒకపుడు మూగులుగాను, ఒకపుడు పామరపురుషునివలె రాగాంధులుగాను, ఒకపుడు విరక్తునివలె సర్వరాగరహితులుగాను, ఒకపుడు శ్రేష్ఠపురుషునివలె ఆచారసంపన్నులు

గాను, ఒకపుడు నీచపురుషునివలె నిషిద్ధాచారులుగాను, ప్రతీతమగుచున్నారు. ఈ ప్రకారముగ ఆ పరమహంససన్యాసులు అవ్యక్తచిహ్నములను అవ్యక్తాచారములను, ధారణచేసి లోకమందు విచరించుచున్నారు. ఇటువంటి సన్యాసులచూచి యితడు శ్రేష్ఠుడా! యితడు. నికృష్టుడా! యితడు పండితుడా! మూఢుడా! యితడు బ్రాహ్మణుడా! చండాలుడా! యితడు గృహస్థుడా! సన్యాసియా! అని యెవడును యెఱుగడు. ఈ వార్త స్మృతియందును కథనము చేయబడినది.

"యన్న సన్తం నచా సన్తం నానా శ్రుతం న బహుశ్రుతం।
నసువృత్తం న దుర్వృత్తం వేద కశ్చిత్ న బ్రాహ్మణః॥"

హే శిష్య! దత్తాత్రేయ సంహితయందు ప్రసిద్ధమైన దత్తాత్రేయుని సంగతిని వినుము. — ఒక కాలమందు దత్తాత్రేయస్వామి నర్మదానదీజలమందు స్థితుడై యుండెను. అపుడాస్వామి యెట్లుండెననగా — ఆ రక్తవస్త్రములచే యుక్తుడుగాను, యౌవనావస్థగలవాడుగాను, సూర్యసమానశరీరకాంతిగలవాడుగాను, ఒక హస్తమందు మదిరాపాత్రము, ఒక హస్తమందు దండము ధారణముచేసి, మదముచేత ఘూర్ణితములగు నేత్రములుగలదైన ఒక సుందర స్త్రీని వామభాగమందు నిలువబెట్టి ఆ స్త్రీయొక్క ముఖమును మాటిమాటికి చూచుచు ఆ దత్తాత్రేయస్వామి ఆ స్త్రీకి శ్రుతివచనములచే అద్వితీయబ్రహ్మమునుపదేశము చేయుచుండెను. ఇటువంటి వ్యవహారయుతుడగు ఆ దత్తాత్రేయస్వామిని సహస్రార్జునరాజు చూచెను చూచి ఆ చక్రవర్తి తన మనస్సులో చాల విచారముచేయ దొడగెను. కాని అతడు స్వామిని యెఱుగడాయెను. శిష్యుడు — హే భగవన్! ఆ దత్తాత్రేయాది మహాపురుషులు యిటువంటి శాస్త్రనిందిత ఆచారముల నెందుకు చేయుచున్నారు?

గురువు — హే శిష్య! శాస్త్రమందిట్లు చెప్పబడియున్నది. "అభిమానం సురాపానం గౌరవం ఘోరరౌరవం। ప్రతిష్ఠా సూకరీ విష్టా త్రీణి త్యక్త్వా సుఖీ భవేత్" భావార్థము అభిమానమును సురాసమానముగ నెఱిగి గౌరవమును ఘోరనరకముగ నెఱిగి, ప్రతిష్ఠను పందియొక్క విష్టగానెఱిగి, విద్వజ్జనులు ఈ మూడింటిని పరిత్యాగముచేసి సుఖులగుచున్నారు. శ్రేష్ఠాచారసంపన్నులైన విద్వాంసుల సమీపమునకు అనేక జనులు వచ్చెదరు. దానివలన విద్వాంసుని చిత్తము బహిర్ముఖమై ఆ బహిర్ముఖ చిత్తమందు జీవన్ముక్తిసుఖము కానేరదు. ఈ ప్రకారమగు విచారముచేసి దత్తాత్రేయాది మహాత్ములు లోకప్రవృత్తిరూపవిక్షేపనివృత్తికొఱకు విపరీతాచరణమును పైపై ధారణము చేయుచున్నారు. అథవా — అధికారిశిష్యుల శ్రద్ధాపరీక్షకొఱకు విపరీతాచరణము చూపుచున్నారు. అథవా — బ్రహ్మవిద్యగలవానికి కించిన్మాత్రము

దోషము స్పర్శముజేయదు. ఇవ్విధమగు బ్రహ్మవిద్యమాహాత్మ్యబోధనకొఱకు విపరీతా చరణ చూపుచున్నారు. అట్లైనను ఆ బ్రహ్మవేత్తపురుషులు సర్వవికారములచే రహితులుగా నున్నారు. హే శిష్య! ఆ దత్తాత్రేయాదిమహాత్ముల నిషిద్ధావస్థ అస్మదాది జనులకు సహస్రజన్మములందును దుర్లభముగా నున్నది. ఇటువంటి మహాత్ముల అభిప్రాయమెఱుగక ఏ అజ్ఞానులు వారియొక్క బాహ్యాచారమును గ్రహణముచేసి లోకమందు విచరించుచున్నారో, ఆ యజ్ఞానులు నరకమునే పొందుదురు. దృష్టాంతము — శ్రీ శంకరునిచే సకలజనుల రక్షణముకొఱకు యోగప్రభావముచే కాలకూట విషము పానము చేయబడియె అదిచూచి యోగసాధనరహితులగువారు విషపానము చేసిన పక్షమందు ఆ మూఢపురుషులు మృత్యువునే పొందుచున్నారు. అట్లే దత్తాత్రేయాది మహాత్ములయొక్క పై ఆచారమునుమాత్రము గ్రహణము చేయువారైన అజ్ఞానిపురుషులు నరకమునే పొందుదురు. హే శిష్య! ఆ దత్తాత్రేయాది పరమహంస సన్యాసులు 'నేను బ్రహ్మరూపుఁడను' ఈ ప్రకారముగ ఆత్మసాక్షాత్కారముచేసి పరమపదమందు స్థిరులైనారు ఆ మహాత్ముల పుణ్యపాపములకు విభాగమిట్లుండును. ఏ భక్తజనులు వారియందు ప్రీతిజేయుచున్నారో, ఆ భక్తజనులకు ఆ మహాత్ములు తమ పుణ్యకర్మమును, ఏ దుష్టపురుషులు వారియెడ ద్వేషభావము చేయుచున్నారో, ఆ దుష్టజనులకు తమ పాపకర్మమును యిచ్చుచున్నారు. శ్రుతి "సుహృదస్సాధుకృత్యం ద్విషన్తం పాపకృత్యం" ఈ ప్రకారముగ మహాత్ముల పుణ్యపాపములను సాధు అసాధుపురుషులు పొందుచున్నారు. అందుచే ఆ బ్రహ్మవేత్తపురుషులు అసంగులైయున్నారు. హే శిష్య! ఆ బ్రహ్మవేత్త పరమహంస సన్యాసులు ఒకపుడు దిశారూప వస్త్రమును ధారణచేయుచున్నారు. ఒకపుడు దుకూలాదివస్త్రముల ధారణచేయుచున్నారు. ఒకపుడు విష్టామూత్రములచే లిప్తులైయున్నారు ఒకపుడు చందనాది సుగంధపదార్థములచే లిప్తులైయున్నారు. ఒకపుడు నవ్వుచున్నారు. ఒకపుడు యేడ్చుచున్నారు ఒకపుడు నానాప్రకారగానముల చేయుచున్నారు. ఒకపుడు అశ్వమువలె శీఘ్రగమన మొనర్చుచున్నారు. ఒకపుడు పిశాచమువలె తన శరీరమును తాడనము చేయుచున్నారు. ఒకపుడు సర్వేచ్ఛారహితులైయున్నారు ఒకపుడు బాలురతోటి పలువిధక్రీడ లొనర్చుచున్నారు. ఒక్కొకపుడు దుష్టజనులు తాడనము చేయుచుండగా తాముహర్షనిర్భరులై నృత్యముసల్పుచు మేఘగర్జన చేయుచున్నారు. హే శిష్య! యీ ప్రకారముగ దత్తాత్రేయాది మహాత్ములు తమ వాస్తవస్వరూపమున జనులకు వ్యామోహము గలుగజేయుటకొఱకు ఉన్మత్తపురుషునివలె విపరీతచేష్టలు చేయుచున్నారు. ఐనను ఆ మహాత్ములు వాస్తవముగ ఉన్మత్తులుకారు. మఱేమనిన వాస్తవముగ ఆ బ్రహ్మవేత్తలు అహింసాదిధర్మములను రక్షించువారైయున్నారు. శిష్యుడు—

హే భగవన్ ఉన్మత్తపురుషునివలె విద్వాంసుని ఆచరణము ఏ శాస్త్రముచేతను విధింపబడలేదుగదా!

గురువు — హే శిష్య తన స్వరూపమును గుహ్యముగా రక్షించుటకొఱకు ఉన్మత్తునివలె ఆచరణచేయుట యోగశాస్త్రమందు చెప్పబడియె "తథాచరేత వై యోగీ సతాం ధర్మమదూషయన్ జనా యథాఽవమన్యేరన్ గచ్ఛేయుర్నైవ సంగతిం" భావార్థము — బ్రహ్మవేత్తలగు విద్వాంసులు శ్రేష్ఠపురుషుని ధర్మమును రక్షింపుచునైపైన యెటువంటి ఆచరణచేయవలయుననగా ఆ బ్రహ్మవేత్త యెవనిని సన్మానము చేయకూడదు. యెవనితోను సంగముచేయరాదు. ఎందుకనగా-జనుల మానముచేతను సంగముచేతను చిత్తము బహిర్ముఖమగుచున్నది హే శిష్య యెట్లు లోకప్రసిద్ధాగ్ని విషాది సకలవస్తువులను భక్షణముచేయుచున్నదో, అట్లే మూఢపురుషుఁడు ఆ అగ్నివలె విషాదివస్తు భక్షణముచేసినపక్షమందు మరణమునే పొందును. అలాగుననే ఆత్మసాక్షాత్కారరహితులైన యే పరమహంసలను పేరుగల సంన్యాసులు దత్తాత్రేయాది మహాపురుషుల యొక్క పై ఆచరణమునుచూచి తదనుసారముగ తాము ను ఆచరణముచేయుచున్నారో వారీలోకమందు అవమానాదిదుఃఖములను పరలోకమందు నరకాది దుఃఖములను ఉపభోగించుచున్నారు హే శిష్య దత్తాత్రేయాది పరమహంసలకు సన్యాసమందు కర్తవ్యబుద్ధిలేదు అంతరంగబహిరంగసాధనలందును కర్తవ్యబుద్ధిలేదు. ఎందుకనగా యెంతవఱకు ఫలోత్పత్తికాలేదో, అంతవఱకే సాధనలందు కర్తవ్యబుద్ధి యుండును ఫలోత్పత్త్యనంతరము సాధనములకిక ప్రయోజనములేదు ఈ కారణము వలననే వేదభగవంతుఁడు ఆ బ్రహ్మవేత్తపురుషులకు స్నానవిధియును చెప్పఁడు వేదభగవంతుఁడు ఆ బ్రహ్మవేత్తలకు సమాధివిధానము చెప్పఁడు యెందుకనగా ఆ బ్రహ్మవేత్తలు పద్మాసనాదులు వైచుకొని సమాధిస్థులైకూర్చుండనీ అథవా-చేతులు కాళ్లుచాచుకొని అవ్యవస్థితముగాపడియుండనీ, లేవనీ తిరుగనీ అన్నపానాదులచేయనీ ఏ రీతిగానైనను చరించనీ వారికి ఎప్పటికిని సమాధిభంగమేకాదు యీ వార్త పూర్వము వృద్ధపురుషులచే పెద్దలగు మహాత్ములచే చెప్పబడియె —

" దేహాభిమానే గలితే విజ్ఞాతే పరమాత్మని
యత్ర యత్ర మనోయాతి తత్రతత్ర సమాధయః" ॥

హే శిష్య! ఎట్లు ఐదువత్సరములవయస్సు పర్యంతము బాలకునిపై శాస్త్ర సంబంధ విధినిషేధములు లేవో. అట్లే బ్రహ్మవేత్తయగు పురుషునిపైనను, శాస్త్ర సంబంధ విధినిషేధములు లేవు. ఎందుకనగా ఏ పురుషునియందు భేదదర్శనరూపావిద్య యుండునో ఆ పురుషునియందే శాస్త్రసంబంధ విధినిషేధము సంభవించును. ఆ భేద

దర్శనరూపావిద్య బ్రహ్మవేత్తయందు లేదు. ఆబ్రహ్మవేత్తలు తమ శరీరమును శ్వాన విష్టను సమానముగా చూచుచున్నారు. కనుకనే వారికి భక్తజనులు దుశాలపరి ధానము చందనాదుల లేపనము, సుగంధపుష్పాదులచే పూజనము గావించినను వారు హర్షమును పొందరు. దుర్జనులచే తాడనబంధనాదులొనర్పబడినను ఖేదమును పొందరు. భక్తజనుల శరీరమందును, దుర్జనుల శరీరమందును, ఒకే అనుగతాత్మను చూచుచున్నారు. కనుక ఆ బ్రహ్మవేత్తలకు యెవడును మిత్రులు లేరు ఎవడును శత్రువును లేడు. ఏ యొక పదార్థము తనదగునదిలేదు. యితరునిదియు లేదు. ఆబ్రహ్మ వేత్తలకు శీతోష్ణక్షుత్పిపాసార్థ శోకమోహజరామరణములున్ను లేవు. అభిప్రాయము- ఆ బ్రహ్మవేత్తలగు పురుషులు తమ వాస్తవస్వరూపమును సర్వదా అసంగముగా నెఱుగుచున్నారు

ఇపుడు వైరాగ్యప్రాప్తికొఱకు గర్భోపనిషదర్థ నిరూపణము గావింపబడుచున్నది.

హే శిష్య! బ్రహ్మదేవుని శరీరమునుండి, శ్వానశరీరపర్యంతము యెన్ని శరీరములు గలవో, అవన్నియు పంచభూతములచే రచితములుగాను, శ్రోత్రాదింద్రియములకు ఆధారములుగానున్నవి. కనుక ఆ సమస్త శరీరములున్ను సమానములే. అకాశాది పంచమహాభూతములు స్థూలసూక్ష్మరూపముగా విద్యమానములై సర్వప్రాణులకు స్థూలసూక్ష్మశరీరరూపములగుచున్నవి. ఆకాశసంబంధసాత్వికాంశముచే శ్రోత్రము రాజసాంశముచే వాగింద్రియము, వాయుసంబంధసత్వాంశముచే త్వగింద్రియము, రాజసాంశముచే ప్రాణేంద్రియము, తేజస్సంబంధసాత్వికాంశముచే చక్షురింద్రియము, రాజసాంశముచే పాదేంద్రియము, జలసంబంధసాత్వికాంశముచే రసనేంద్రియము, రాజసాంశముచే ఉపస్థేంద్రియము, పృథ్వీసంబంధసాత్వికాంశముచే ఘ్రాణేంద్రియము, రాజసాంశముచే పాయుఇంద్రియము పుట్టుచున్నవి. వాగాది పంచేంద్రియములు శబ్దోచ్చారణాదిక్రియలకు కారణమగుటవలన కర్మేంద్రియములనబడును. మఱియు శ్రోత్రాదిపంచేంద్రియములు విషయజ్ఞానమునకు కారణమగుటవలన జ్ఞానేంద్రియములనబడును. ఆ యాకాశాది పంచభూతముల మిళిత సాత్వికాంశము వలన అంతఃకరణము, రాజసాంశములవలన పంచప్రాణములు పుట్టుచున్నవి. అట్లే ఆకాశాదిభూతముల పృథక్కరణమువలన నాగకూర్మ,కృకర, దేవదత్త, ధనంజయములను నీయైదు ఉపప్రాణములు పుట్టుచున్నవి. సర్వజీవుల హృదయకమలస్థితమై జ్ఞానశక్తిగలదైన ఏ అంతఃకరణముగలదో, అది మనోబుద్ధిచిత్తాహంకారభేదములచే చతుర్విధము. ఈ పంచజ్ఞానేంద్రియ, పంచకర్మేంద్రియ, పంచప్రాణాంతఃకరణ సముదాయము సూక్ష్మశరీరమనబడును. అదియే లింగశరీరమనబడును. ఈ సూక్ష్మ శరీరము అపంచీకృతభూతముల కార్యమగుటవలన నేత్రాదింద్రియముల, కవిషయ

మగుటవలన, సూక్ష్మమనబడియె. స్థూలశరీరము పంచీకృతభూతముల కార్యమగుట వలనను, నేత్రాదీంద్రియములకు విషయమగుటవలనను, యిది స్థూలమనబడియె. ఈ స్థూల సూక్ష్మ శరీరములు అధ్యాత్మ అధిదైవములను రెండు భేదములు గలది ఇతర గ్రంథములలో అధ్యాత్మ అధిదైవ అధి భూతములను మూడు భేదములు చెప్ప బడియున్నవి. ఆ యధిభూతము స్థూలసూక్ష్మ శరీరములకు అంతర్గతమేయైయుండుట వలన యిచట దానిని వేరుగ వ్రాయలేదు. అధ్యాత్మాది మూడునుచేరి సకల వ్యవ హారము నడుచుచున్నది. సమష్టి సూక్ష్మశరీరమునకు నామము హిరణ్యగర్భుడును, వ్యష్టి సూక్ష్మశరీరమునకు నామము తైజసుడునైయున్నది. అట్లే సమష్టి స్థూలశరీరము నకు నామము విరాట్టున్ను, వ్యష్టిస్థూలశరీరమునకు నామము విశ్వుడునైయున్నది. ఆ యాపంచీకృతభూతములు పంచీకృతమగుటకు రెండు ప్రకారములు శాస్త్రమందు చెప్పబడియె. వానిలో — ఒక భూతమును యిరువదియైదు అంశములుగజేసి, అందు యిరువదియొక్క అంశములను ఆ భూతమందేయుంచి తక్కిన నాలుగు అంశ ములలోనూ, ప్రత్యేక భూతములందు ఒక్కొక్కటిగ జేర్చుట యిది ఒక ప్రకారము. మఱియు ఒక భూతమును రెండు అంశములుగజేసి వానిలో ఒక్కొక్క అంశమును ఆ భూతమందేయుంచి తక్కిన ఒక అంశమును నాలుగు అంశములుగజేసి, వానిలో ఒక్కొక్క అంశమును తక్కిన ఒక్కొక్కభూతమున జేర్చుట యిది ఒక ప్రకారము (యింద్రియములకు గోచరములైన భూతములు పంచీకృతములనియు, యింద్రియ ములకు గోచరముగాని భూతములు అపంచీకృతములనియు, యెఱుగవలయును)

హే శిష్య! ఇటువంటి పంచీకృతభూతముల కార్యమైన స్థూలశరీర మేది గలదో అయ్యది తనయందనేకగుణములను ధారణచేయుచున్నది. చూడుము — యీ స్థూలశరీరమందు శుక్ల, రక్త, కృష్ణ, ధూమ, పీత, కపిల, పాండురములను నీ సప్తరూపములు గలవు. కటు తీక్ష్ణ, కషాయ, క్షార, అమ్ల, మధురములను నీ షడ్రసములు గలవు. అందు ధ్వనిరూపమును వర్ణరూపమునునైన ద్వివిధశబ్దములు గలవు. అట ధ్వనిరూపశబ్దమిది నిషాద, ఋషభ, గాంధార, షడ్జ, మధ్యమ, దైవత పంచములను నీ సప్తధ్వనులు స్వరములనబడును. నీ సప్తస్వరములకు నారదముని చే యిట్లు దృష్టాంతము చెప్పబడియె.

"షడ్జనం రౌతి మయూరస్తు గావో నన్దతిచార్షభం।
అజావికౌచ గాంధారం క్రౌంచో నదతి మధ్యమం।
పుష్పసాధారణే కాలే కోకిలో రౌతి పంచమం।
అశ్వస్తు దైవతం రౌతి విషాదం రౌతి కుంజరః॥"

శ్రీరాగ, వసంత పంచమ భైరవ, మేఘనాధ నటనారాయణములను రాగములు గలవు. ఆ ఒక్కొక్క రాగమందు పైజెప్పిన యేడు స్వరములుగలవు ఆ ఒక్కొక్క రాగమునకు ఆరుగురారుగురు భార్యలుగలరు వానిలో గౌడి కోలాహసి, ధాలి, ద్రవిడి, మాలవి కౌశిక, గాంధారి, యీ ఆరును శ్రీరాగమునకు భార్యలు. ఆదేవి, కౌశిక, రామగిరి, పుటమంజరి, గుంగలి, దేశాఖ్య ఈ ఆరును వసంతరాగమునకు భార్యలు భైరవి, ఘుర్జరీ భాషా, వేలివతి కర్ణాటకి, రక్తసింహ, ఈ ఆరు పంచమరాగమునకు భార్యలు. త్రిగుణ, స్తంభతీర్థ అభీరి, కకుభ, విరాడి, సావేరి. ఈ ఆరు భైరవరాగమునకు భార్యలు. బంగాళ, మధుర, కామద, చౌకమాదిక, కంబుగ్రీవ, దేవాళ ఈ ఆరును మేఘనాధరాగమునకు భార్యలు. త్రోటకి, గాంధారి, శుద్ధముద్ధారి మొదలగు యీ ఆరును నటనారాయణరాగమునకు భార్యలు. ఈ ప్రకారముగ షడ్రాగములు, సప్తస్వరములు, ముప్పదియారు భార్యలు, యివన్నియు శరీరమందే గలవు కాని ఇవి సర్వజీవులకు ప్రత్యక్షముగావు. అట్లే అనేక ప్రకారసు గంధములును శరీరమందు గలవు. అవియు సర్వజీవులకు ప్రత్యక్షముగావు. మఱి మనిన పుణ్యవంతులగు యోగులకే ప్రత్యక్షమగుచున్నవి. పాపులగు జీవులకు గుర్జర శబ్దము దుర్గంధమే ప్రతీతమగును. నిషాదాదిస్వరములను యోగిపురుషులు అనాహతమనుచున్నారు. వాటిని తాము సర్వదా అనుభవము చేయుచున్నారు. గాయకులగు వారాసప్తస్వరములను తమ ముఖముచే ప్రకటిత మొనర్చుచున్నారు.

హే శిష్య! ఎట్లు ధ్వనిరూప శబ్దములు అనేకప్రకారములు గలవో, అట్లే క, ఖ, గ, ఘ యిత్యాది వర్ణరూప శబ్దములును అనేకప్రకారములు గలవు. అవర్ణరూపశబ్దములనున్ను యోగిపురుషులు శరీరములోపలనే అనుభవముచేయుచున్నారు. అన్యపురుషులు ముఖముచే ఉచ్చారణము చేయుచున్నారు. ఈ శరీరమందు, రస, రుధిర, మాంస, మేద, అస్థి మజ్జ, వీర్యములను సప్తధాతువులుగలవు ముఖమందు ముప్పదిరెండు దంతరూప అస్థులు, పాదమునుండి మస్తకమువరకు నూటయేడు మర్మస్థానములు గలవు. అస్థులకు సంధులు నూటయెనబై గలవు. తొమ్మిదివందల స్నాయువులు గలవు. యెనిమిదివేలకోట్ల కేశరోమములు, మఱియొకశాస్త్రమందయ్యవి మూడున్నరకోట్లనియు చెప్పబడియె. ముఖమందు జిహ్వ ద్వాదశఫలప్రమాణమైనది. రక్తవర్ణముగల హృదయకమలము హార్దకమని శాస్త్రమందు చెప్పబడినది. ఆ హృదయ మధ్యమము అష్టపలపరిమాణమైనది హృదయదేశమందు పిత్తధాతువు ఒక ప్రస్థ పరిమాణముగలదైయున్నది. (ఐదుగుంజలు ఒకమాషము షోడశమాషలు ఒక కర్షము నాల్గు కర్షములు ఒక పలము. నాల్గుపలములు ఒక కుడవము. నాల్గుకుడవము లొక

(ప్రస్థము) కంఠదేశమందు కఫము నాల్గుప్రస్థముల పరిమాణము గలిగియున్నది. మఱియు వీర్యరూపసప్తమధాతువు సర్వశరీరమందు స్థిరమై కంఠహృదయ మూర్ధము. లను నీ మూడుస్థానములందు విశేషముగ నుండును. ఆ వీర్యము కుదవ పరిమాణము. గలిగియున్నది. మేధోధాతువు రెండు ప్రస్థములు గలిగియున్నది మఱియు భ స్త్రిస్థాన మందు స్థితములైన మూత్రపురీషములు జలాన్నముయొక్క న్యూనాధిక సేవనము వలన న్యూనాధికములగుచున్నది. వీటికి పరిమాణనియమములేదు. ఈ సంగతి గర్భో పనిషత్తునందు పిప్పలాదిమునులచే కథనముచేయబడియె. రుధిరాది ధాతువులకు 9 అంగులుల పరిమాణము యాజ్ఞవల్క్యమునిచే కథనముచేయబడియె. ఇతర శాస్త్ర ములయందు చెప్పబడిన పరిమాణము — హే శిష్య! సర్వజీవుల పాదాగ్రభాగముల నుండి కేశాగ్రపర్యంతము తొంబైఆరు అంగుళములు శరీరము దీర్ఘమైయుండును శరీర సంబంధ రెండు పార్శ్వభాగములయందు ధనుషాకారములగు షోడశ అస్థులుండును. మఱియు యెట్లు వృక్షమునకు స్కంధములు, శాఖలు, ఉపశాఖలుగలవో, అట్లే శరీర రూప వృక్షమునకు హృదయదేశమునుండి మొదట సుషుమ్నానాడి బయటకు వచ్చు చున్నది. ఆ సుషుమ్నానాడినుండి శతనాడులున్ను వానిలో నొక్కొక్కనాడినుండి శతశత నాడులున్ను వానిలో, నొక్కొక్కనాడినుండి డెబ్బదిరెండువేల నాడులున్ను ప్రసరించు చున్నవి అన్నియుచేరి ఆ నాడులు 72 కోట్ల 10 వేల 101 టి యగుచున్నవి. ఇన్ని నాడులు సమగ్ర శరీరమున వ్యాపించియున్నవి. శరీరమునుండి ప్రాణవాయువు వాటిక ద్వారాద్వాదశాంగుళపరిమాణమున బయటకుపోవుచున్నది. యీ కారణమువలన ప్రాణవాయువు అష్టోత్తరశత అంగుళముల పరిణామముగలిగియు పాదాగ్రమునుండి నలుబదియెనిమిది అంగుళములపై ప్రదేశము మఱియు కేశాగ్రభాగమునకు క్రిందది నలుబధియెనిమిది అంగుళముల ప్రదేశమేదికలదో, అది శరీరమునకు మధ్యప్రదేశమై యున్నది ఆ మధ్యప్రదేశమందు తప్తసువర్ణసమాన తేజముగల చతుష్కోణయుతమైన యొక అగ్నిస్థానముకలదు. ఆ అగ్నిరూపతేజము నాడీమార్గమున సకలశరీరముల యందు చంద్రమండల పర్యంతము వ్యాపకమైయున్నది. ఈ సంగతి ఆగమశాస్త్రమందు శ్రీ మహాదేవునిచే కథనముచేయబడియె "సర్వేషామపిజంతూనాం మూర్ధ్ని తిష్ఠతి చంద్రమాః అధోభాగే రవిః ప్రోక్తో మృత్యుకాలే విపర్యయాత్॥" హే శిష్య! ఆ చతుష్కోణకుండలమందు ఏ అగ్నిరూపతేజముకలదో, ఆ తేజము శరీరేంద్రియాది సంఘాతమునకు సామర్థ్యప్రాప్తిచేయుచున్నది ఈ కారణమువలన శాస్త్రవేత్తలా తేజమును శక్తినామముచే కథనము చేయుచున్నారు. ఆ తేజమత్యంత సూక్ష్మమగుట వలన జీవులచే యెఱుగబడదు. ఆ అగ్నిరూపతేజమే తన యుష్ణతారూపముచే సర్వ ప్రాణుల జీవమునకును కారణమైయున్నది. ఆ తేజమొక అంగుళపరిమాణము గల్గి

యున్నది. పాయుస్థానమునుండి రెండంగుళములపై ప్రదేశమందు మఱియు ఉపస్థస్థానమునకు రెండంగుళముల క్రిందిప్రదేశమందు ఆ అగ్నియొక్క స్థానము కలదు. ఆ ప్రదేశముననవాంగుళపరిమాణముగల అవకాశము కలదు. దానియందు నాల్గంగుళముల చతుష్కోణము కందసమానముగల ఒక మాంసపిండముకలదు. ఆ కందమునుండి నాభికమలమునకు నాళము పుట్టుచున్నది ఆ నాళము దండమువలె నవాంగుళ దీర్ఘపరిమాణముగలదై సప్తధాతువులచే వేష్టితమై సకల అవయవములకు మూలమైయున్నది. ఆ నాభిచక్రమునకు రధచక్రమువలె ద్వాదశ అరలుగలవు. హే శిష్య ఎట్లు ఊర్ణనాభితంతువందు భ్రమణముచేయుచున్నదో, అట్లే పుణ్యపాప కర్మరూపతంతువు నాశ్రయించి జీవాత్మ నాభిచక్రమందు భ్రమణము చేయుచున్నారు

శిష్యుడు — హే భగవన్! సకల శరీరములయందు వ్యాపకుడైన జీవాత్మకు ఒక నాభిచక్రమందే స్థితియెట్లు సంభవించును?

గురువు — హే శిష్య! జీవాత్మ సకలశరీరములయందు వ్యాపకుడుగనుండి నను నాభి, హృదయ, కంఠ, చక్షు, మూర్ధములను నీ స్థానములందు విశేషముగా అభివ్యక్తియగుటవలన శాస్త్రవేత్తలునాభి యిత్యాదిస్థానములందు జీవాత్మకు స్థితి వచించుచున్నారు హే శిష్య! పూర్వము చతుష్కోణమని వర్ణింపబడినదానిని ఆధారచక్రమనియు మూలచక్రమనియు అనుచున్నారు. ఈ ఆధారచక్రమందు జీవుడు సర్వదా నివాసము చేయుచున్నాడు. ఈ ఆధారచక్రమునకు పైగాను నాభి చక్రమునకు క్రిందుగాను సర్పాకారముగ కుండలినీయను ఒక శక్తిగలదు ఆ కుండలిని కారణబ్రహ్మమూర్తిరూపము గలది. మఱియు పంచభూత మనోబుద్ధ్యహంకారములు చేరి అష్టధాప్రకృతి గీతయందు చెప్పబడియె. ఆ ప్రకృతికిని యీ శక్తియే కారణమై యున్నది. ఆ శక్తియే ప్రాణవాయువుచే తాడనముపొంది సకల శబ్దములను గావించు చున్నది. ఈ శక్తియే బ్రహ్మలోకము పొందుటయందు ప్రతిబంధకమై యున్నది ఎలాగుననగా — దశమద్వారమునుండి బ్రహ్మలోకమార్గము సుషుమ్నానాడియై యున్నది ఆ నాడియొక్క ముఖమును నిరోధముజేసి యీ కుండలిని తాను శయనము చేయుచున్నది.

శిష్యుడు — హే భగవాన్! ఆకుండలిని యెపుడు మేల్కొమను? ఎపుడు సుషుమ్నముఖమును తెఱచును.

గురువు — హే శిష్య! ఎపుడు యోగముచే ప్రాణవాయువు చలాయమాన మగునో, అపుడు ఆ సుషుమ్నానాడికి నాల్గుప్రక్కల అనేక నాడులుగలవు వాటిలో సుషుమ్న, ఇడ, పింగళ, సరస్వతి, కుహూ, వారణ, యశ్వశని, పూష పయస్వని, శంఖిని, గాంధారి, హస్తిజిహ్వ, విశ్వోదర, అలంబుష యను నీ చతుర్దశనాడులు ప్రధాన

ములు. వాటిలో సుషుమ్న, ఇడ, పింగళ నాడులు ప్రధానములు. అందులో సుషుమ్న మిక్కిలి ప్రధానము. ఆ సుషుమ్నానాడి మధ్యకందమును ఆశ్రయించి, శరీరపృష్ఠదేశము మధ్య స్థితమగు ఏదీర్ఘ అస్థికలదో, ఆ యస్థిరూపమార్గమున మూర్ధస్థానమును పొందినది. ఆ సుషుమ్నకు వామభాగమందు ఇడ, దక్షిణభాగమందు పింగళ, పృష్ఠభాగమందు సరస్వతి, అగ్రభాగమందు కుహు, యిడానాడికి పృష్ఠదేశమందు గాంధారి, అగ్రభాగమందు హస్తిజిహ్వ మఱియు పింగళనాడికి పృష్ఠభాగమందు పూష, అగ్రభాగమందు పయస్విని స్థితమైనది. అట్లే హస్తిజిహ్వ, కుహు యీ రెంటికి మధ్యభాగమందు విశ్వోదరి, మఱియు కుహు యశస్విని యీ రెంటికి మధ్యభాగమందు వారణ, గాంధారి సరస్వతి యీ రెంటికి మధ్యమందు పయస్విని, సరస్వతి పూష యీ రెంటికి మధ్యమందు శంఖిని స్థితమై యున్నవి. మఱియు అలంబుసనాడి కందమునకు క్రిందుగ నిలుచుచున్నది. సుషుమ్నానాడి సంపూర్ణవిశ్వధారణరూప వ్యాపారము చేయుచున్నది. మఱియు యిడ పింగళ యీ రెండు వామదక్షిణ నాసికలయందు నిలిచి గంధగ్రహణ వ్యాపారమును చేయుచున్నవి. గాంధారి పూష యీ రెండు వామదక్షిణ నేత్రములయందు నిలిచి రూపగ్రహణ వ్యాపారమును, శంఖని, పయస్విని యివి రెండు వామదక్షిణకర్ణమందు నిలిచి శబ్దగ్రహణ వ్యాపారమును, సరస్వతి రసనయందు నిలిచి రసగ్రహణ వ్యాపారమును, హస్తి జిహ్వ పయశ్విని యీ రెండు వామదక్షిణ పాదాంగుష్ఠమందు నిలిచి గమనవ్యాపారమును, అలంబుష పాయుస్థానమందు నిలిచి మలపరిత్యాగ వ్యాపారమును, కుహు ఉపస్థయందు నిలిచి విషయానంద వ్యాపారమును, విశ్వోదరి వారణ యివి రెండు వామదక్షిణ హస్తములందు నిలిచి వస్తుగ్రహణ వ్యాపారమును చేయుచున్నవి.

హే శిష్య! ఈ మొదలగు అసంఖ్యాకనాడులు శరీరమందు నిలిచియున్నవి. ఆ సర్వనాడులందు ప్రాణవాయువు భ్రమణము చేయుచున్నది. కనుక ప్రాణగమన మార్గమనునది సర్వనాడులకు సాధారణ వ్యాపారమైయున్నది. ఇపుడు పంచప్రాణముల వ్యాపారము నిరూపింపబడుచున్నది. నాసికాద్వారమున వాయువు బయటకు పోవుటకు పేరు శ్వాసము, బయటనుండి లోపలకు వచ్చుటకు పేరు ప్రచ్ఛ్వాసము (నిశ్శ్వాసము) యివి రెండును ప్రాణముయొక్క వ్యాపారములు మలమూత్రపరిత్యాగము అపానముయొక్క వ్యాపారము. బలముగ గ్రహణము చేయుటకు అథవా త్యాగము చేయుట వ్యానముయొక్క వ్యాపారము శరీరమునకు ఉత్థానాదులొనర్చుట ఉదానముయొక్కయు, సర్వశరీరమందు వ్యాపకమై చలనము గావించుట సమానము యొక్కయు వ్యాపారములు, ఉప ప్రాణముల వ్యాపారములు:— వాంతి, యెక్కిళ్లు గావించుట నాగముయొక్క వ్యాపారము. నేత్రముయొక్క నిమీలనోన్మీలనములు

కూర్మముయొక్కయు, తుమ్ములు కృకురముయొక్కయు, విజృంభణము దేవదత్తము యొక్కయు, శరీరమును ఉబ్బించుట ధనంజయముయొక్కయు వ్యాపారములు.

హే శిష్య! పంచభూతములు, దశేంద్రియములు, దశ విషయములు, అంతః కరణ చతుష్టయము, పంచ ప్రాణములు, పంచ ఉపప్రాణములు, సప్తధాతువులు అసంఖ్యాక నాడులు, నూట యేడు మర్మస్థానములు, పిత్తాది మూడు దోషములు, విష్ట, మూత్రము, ఇత్యాదుల సమూహమునకు శరీరమని పేరు. ఈ అవయవములకన్న భిన్నముగ శరీరమునకు కించిన్మాత్రమును స్వరూపము సిద్ధింపదు ఇటువంటి నిషిద్ధ శరీరమునందు జీవులు ఆత్మబుద్ధి చేయుట ఉచితము కాదు. ఎందుకనగా — ఏ విష్టా మూత్రాది మలినవస్తువులయొక్క సముదాయమగు యీ శరీరము కలదో, ఆ విష్టా మూత్రాది మలినవస్తువులు నరకాది స్థానములందు విలుచుచున్నవి. కనుక యీ జ్ఞాని జీవులెట్లు శరీరమందు ఆత్మబుద్ధి చేయుచున్నారో, అట్లు నరకాది స్థానములందు స్థిత మైన విష్టామూత్రాదులందును ఆత్మబుద్ధి నెందుకు చేయరు? వానియందును అవశ్య ముగ ఆత్మబుద్ధి చేయవలసినది. శరీరబాహ్యములైన విష్టామూత్రాది పదార్థములందో ఆత్మబుద్ధి ఎవనికి కాదు, పైగా అట్టి పదార్థముల స్పర్శముచే జనులు స్నానాదులు కూడ చేయుచున్నారు.

అథవా — మార్గమందు పడియున్న కేశదంతాది పదార్థములపై ఎట్లు ఆత్మ బుద్ధి చేయరో, అట్లనే కేశదంతాది సమూహరూపమగు యీ శరీరమందును ఆత్మబుద్ధి చేయకూడదు. అథవా — సుషుప్తి మరణ మూర్ఛావస్థలయందు యెవనికిని శరీరవిష యమై ఆత్మబుద్ధియే కాదు. కనుక జాగ్రదవస్థయందును శరీరాత్మబుద్ధి మిథ్యయే యైయున్నది. ఎట్లనగా - ఒకపుడు ప్రతీతియై ఒకపుడు ప్రతీతి కానట్టి మృగతృష్ణా జలము మిథ్యయై యున్నది. అథవా — వ్యాధిచేతగాని శస్త్రముచేతగాని, ఎపుడు శరీర మునకు వ్రణమై ఆ వ్రణముచే శరీరము కృమి దుర్గంధములచే యుక్తమగునో, అపుడా వ్రణమునుగూర్చి మనుజుడు చాలా అసహ్యపడుచున్నాడు. ఆ వ్రణమునకు కారణమైన శరీరమునుగూర్చి అసహ్యపడడు. ఇదే మాకు పరమాశ్చర్యముగా తోచుచున్నది. అథవా—లోకమందు ప్రసిద్ధమైన అన్నముయొక్క వికారమువిష్ట, మఱియు, వమనము ఆ విష్టావమనములనుచూచి సర్వజీవులకు గ్లాని యగుచున్నది. అట్లే శరీరమున్ను అన్నముయొక్క వికారము, ఇట్లుండగా యీ శరీరమందు మనవంటి వివేకపురుషునకు గ్లాని యెందుకుకాదు! కావలసినదే, హే శిష్యా! ఈ ప్రకారముగ అధికారి పురుషులు యెపుడు శరీరదోషములను విచారముచేయుదురో, అపుడే వైరాగ్యము ప్రాప్తమగు చున్నది, కనుక అధికారిపురుషులు అవశ్యముగ శరీరదోషములను విచారముచేయ

వలయును. అట్లు గర్భోపనిషత్తునందు చెప్పబడిన జన్మదుఃఖమును స్మరింపవలయును. హే శిష్య! యిపుడు స్వర్గాదిదుఃఖములను చూడుము. — ఎట్లు నరకమందు, భూలోకమందు, మరణకాలమందు, సర్వజీవులకు దుఃఖప్రాప్తిప్రసిద్ధమో, అట్లు స్వర్గ లోకమందును దుఃఖప్రాప్తి ప్రసిద్ధమేయైనది. హేశిష్య! యే పురుషుడు అగ్ని హోత్రాదియిష్టకర్మలను, వాపీకూపాది పూర్తకర్మములను నానాప్రకారదానములను చాంద్రాయణాది తపస్సులను చేయునో, ఆ పురుషుడు పితృయాన రూపధూమమార్గ మును దక్షిణాయనకృష్ణపక్షరాత్రిని పితృలోకమునుపొంది చంద్రుని చేరుచున్నాడు. ఆ చంద్రుని కృష్ణపక్షమందు యింద్రాదిదేవతలు భక్షణముచేయుదురు. శుక్లపక్ష మందు వృద్ధిచేయుదురు. (యిచ్చట ధూమము రాత్రి మొదలగు శబ్దములచే తత్తదభి మానదేవతల గ్రహింపవలయును.) యెట్లు సేవచేయువారైన దాసజనులు ధనికులకు భోగసాధనమగుచున్నారో, అట్లు చంద్రునితో తాదాత్మ్యభావము పొందినవారైన కర్మిపురుషులను వసురుద్రాదిదేవతలు తమభోగసాధనములుగా చేయుదురు. కనుక ఆ కర్మిపురుషులు దేవతలకధీనులై సర్వదా దుఃఖానుభవమే చేయుచున్నారు. హే శిష్య! యీ లోకమందు దేహధారిజీవులు ఎట్లు స్త్రియాదివిషయముల అప్రాప్తి వలనను, రాజభయమువలనను, ప్రియపదార్థవియోగమువలనను, పరమదుఃఖమును పొందుదురో, అట్లు స్వర్గలోకమందును; ఆ కర్మిపురుషులు స్త్రియాదుల అప్రాప్తి వలనను, దైత్యాదుల భయమువలనను, ప్రియపదార్థవియోగమువలనను, మరణము కన్నను అధికదుఃఖమును పొందుదురు. పెక్కు తేల - ఈ లోకమునకన్నను కోటిగుణ దుఃఖము స్వర్గమందు ప్రాప్తమగుచున్నది. హే శిష్య! యింతదుఃఖముపభోగము చేసిచేసి యెప్పుడో స్వర్గమునుండి క్రిందకు పతనమగుచున్నాడు మేఘవృష్టిద్వారా భూలోకమందు అన్నభావమును పొంది పితృసంబంధజఠరాగ్నితో ప్రవేశించు చున్నారు. తరువాత మహాకష్టమున మాతృోదరమందు ప్రవేశముచేయుట, మహా కష్టమున బయటవచ్చుట మొదలగు మహాతాపములుపభోగించుచున్నారు. పూర్వము ప్రథమాధ్యాయమందు యీ తాపములగూర్చియు, మాతాపితృల మూఢతనుగూర్చియు అనేకవిధముల చెప్పబడినది.

శిష్యుడు — హే భగవన్! ఋగ్వేదములో హరిశ్చంద్రోపాఖ్యానమునందు "అపుత్రస్య న లోకోఽస్తి" పుత్రరహితునకు స్వర్గాదిలోకప్రాప్తికాదు. యిత్యాది వచనములచే పుత్రోత్పత్తియొక్క స్తుతిచేయబడియె. కనుక పుత్రోత్పత్తిచేయువాడైన పితకు దోషము సంభవింపదుకదా?

శ్రీ గురువు — హే శిష్య! ఆ ఋగ్వేదవచనముచే పుత్రోత్పత్తి స్తుతిచేయబడ లేదు. మరేమనిన అధికారిపురుషులకు పుత్రోత్పత్తియందలి వైరాగ్యము కలుగ

జేయించుటకొఱకు ఆ వచనముచే కామిపురుషుని మిథ్యాభిప్రాయము అనువాదము చేయబడియె. ఏలాగుననగా ఋగ్వేదమునందీ వచనముకలదు. "మాతరం చ స్వసారం చ తేయాన్తి" భావార్థము — ఆ కామిపురుషులు ఆ మిథ్యాభిప్రాయముచే పశుతుల్యముగ తమ మాతతోడను భగినితోడను గమనము చేయుచున్నారు. ఈ వచనముచే పుత్రోత్పత్తిచేయువారైన పురుషులందు పశు ఆధారముచూపబడి కామిపురుషుల నిందయే చేయబడినది — ఓ కామిపురుషులారా! శ్వానాదిపశువులు తమమాతతోటి భగినితోటి విషయసంభోగముచేసి అవశ్యముగపుత్రోత్పత్తి చేయుచున్నవి. ఆశ్వానాదుల ఆచరణమంగీకరించి అధికారిపురుషులగు మీరుకూడ పుత్రోత్పత్తిజేసినపక్షమందు "ఆత్మావై పుత్రనామాసి"యను శ్రుతిచే పితయే పుత్రనామముచే కథనముచేయబడెను. కనుక మీయొక్క పుత్రనామము మీయందు శ్వానాదిపశువుల సమానతను బోధన చేయుచున్నందున ఆ నామము అత్యంతనింద్యమగును ఓ కాముకులారా! "ఆత్మావై జాయతేపుత్రః" యను శ్రుతిచే పుత్రుడు పితయొక్క ఆత్మస్వరూపముగా కథనము చేయబడియె కనుక పిత తన మాత్రోదరమునుండి ఎట్లు వచ్చుచున్నాడో అట్లు పుత్రరూపుడై భార్యా ఉదరమునుండియు వచ్చుచున్నాడు. కాన ఒక పుత్రుని యుత్పత్త్యనంతరము స్త్రీ ఆ పుత్రునికి మాతయగుచున్నది. స్వమాత యెట్లు కామ భావనచే స్పర్శయోగ్యముకాదో, అట్లు ఒక పుత్రుని యుత్పత్త్యనంతరము ఆ స్త్రీ కూడ కామభావనచే నీచే స్పర్శముచేయబడుటకు యోగ్యముకాదు. మఱియు ఓ కామ పురుషులారా! మీకు పుత్రభావనచే పుట్టినవారైన ఏ జీవుడు కలడో ఆ జీవుడు తన యొక్క కర్మాధీనుడగుటవలన పరతంత్రుడుగానున్నాడు. ఇటువంటి పరతంత్ర జీవుడు యీ దుఃఖరూపమగు మాత్రోదరమందు ప్రవేశముచేయుచున్నాడు. దాని యందు యేయొక ఆశ్చర్యమునులేదు. అయినను మీరు స్వతంత్రులై యిటువంటి దుఃఖరూప స్త్రీ యుదరమందు పుత్రరూపులై యే ప్రవేశముచేయుచున్నారో, అదే మాకు పరమాశ్చర్యముగా తోచుచున్నది. హే శిష్య! హరిశ్చంద్రోపాఖ్యానమందలి వచనమునకు పుత్రోత్పత్తియొక్క స్తుతియందు తాత్పర్యములేదు. విచారముచేయుము.

ఆశ్రుతి వచనము బలవంతముగ నొకచో పుత్రునిచే పితకు లోకప్రాప్తి అంగీకరించినను, యీ మనుష్యలోకప్రాప్తియే అంగీకరింపవలసినది. ఎందుకనగా - బృహదారణ్యకోపనిషత్తునందు పుత్రునిచే పితకు ఈ మనుష్యలోకమందే జయప్రాప్తి చెప్పబడియె.

శ్రుతి "పుత్రేణాయం లోకజయః" అభిప్రాయము — పితకు పుత్రునిచే యీ లోకమందు జయమగునుకాని మోక్షప్రాప్తికాదు. హే శిష్య! గుడజిహ్వాన్యాయమున (బెల్లమునుచూపి చేదగు మందుల త్రాగించుట మాతయొక్క స్వభావము) శ్రుతి రూప

మాతకు హరిశ్చంద్రాఖ్యాన వచనముచేతను అధికారినివృత్తియుందే తాత్పర్యముగలదు. కాని పుత్రోత్పత్తియందు తాత్పర్యములేదు. హే శిష్య! తపోరూపధనమును నాశము చేయునట్టి ఏ స్త్రీలు గలరో, ఆ స్త్రీలతోటి మీరు గమనముచేయకుడు. ఆ స్త్రీగమనముచే మీకు యీ లోకమందును పరలోకమందును మహాదుఃఖప్రాప్తియగును. మఱియు ఆ అనేక దుఃఖము లనుభవించుటకు కారాగృహసమానములైన అనేక శరీరములు మీకు ప్రాప్తమగును. ఈ ప్రకారముగ శ్రుతిభగవతి స్త్రీలయందు రమణీయ బుద్ధి రూప సంకల్పమును నిరోధము చేయునట్టి ఉపదేశము చేయుచున్నది.

హే పుత్ర! మీరు కామవేగమును నిరోధముచేసి బ్రహ్మచర్యధర్మమును పాలనముచేయుడు అపుడు మీకు స్వర్గలోకమందును బ్రహ్మలోకమందును ఎటువంటి స్త్రీలు లభింతురనగా – వారు మనుష్యస్త్రీలకన్న రూపాదిగుణములచే కోటి రెట్లు అధికముగ నుందురు. ఇటువంటి సుందర సుందర అప్సరసలు పంచశత సంఖ్యాకులు మిమ్ముల తీసుకొనిపోవుటకొఱకు చేతులందు పుష్పచందనాది పదార్థముల గ్రహించి మీ యెదుటకు వచ్చెదరు. మఱియు యెట్లు మనుష్యస్త్రీలకు పురుష సంబంధముచే గర్భధారణమగునో, అట్లు ఆ స్వర్గ బ్రహ్మలోకస్త్రీలకు గర్భధారణ కాదు కనుక గర్భధారణాసంబంధమగు దుఃఖము కించిన్మాత్రమును వారికి కలుగనేరదు.

హే శిష్య! యీ ప్రకారముగ శ్రుతిభగవతి అధికారిపురుషులగూర్చి బ్రహ్మచర్య ధర్మోపదేశము జేయుచున్నది. మఱియు యే పురుషులు బ్రహ్మచర్యవ్రతపాలనయందు సమర్థులుకాక పోవుదురో, ఆ అధికారిపురుషులనుగూర్చి శ్రుతిభగవతి యిట్లుపదేశము చేయుచున్నది.

హే పుత్ర! మీరు బ్రహ్మచర్యవ్రతపాలనమందు సమర్థులుకాకపోయినను, శరీరమనోవాక్కులచే పరస్త్రీగమనము నెప్పటికి చేయకుడు. మరేమనిన మీ కామనివృత్తికొఱకు స్వస్త్రీని సంపాదించి గృహస్థాశ్రమమును ధారణచేయుడు. గృహస్థాశ్రమముచేపట్టినను మీరు శాస్త్రనిషిద్ధకర్మములందు కాలమును వ్యతీతముచేయకుడు. మఱేమనిన – యజ్ఞదానాది శ్రేష్ఠకర్మము లాచరింపుడు. హే పుత్రా! స్వస్త్రీయందును యీ క్రింద చెప్పబోవు నియమము పాటింపుము. పగటియందు స్త్రీతోటి గమనము చేయకూడదు రాత్రియందే గమనము చేయవలయును. రాత్రియందైనను, ఏకాదశి, ద్వాదశి, అమావాస్య, పౌర్ణమి, సంక్రాంతి, వ్యతీపాత ప్రదోషాది పర్వరాత్రులందు స్త్రీతోటి గమనముచేయరాదు. ఆ పర్వభిన్నములగు యితర రాత్రులందును, ఋతుకాలమునగాక తక్కిన సమయములందెప్పటికిని గమనము చేయకూడదు. మఱేమనిన-

శాస్త్రోక్తసంస్కారముగావించి ఋతుస్నాతయగు స్వస్త్రీయందే గమనము చేయుడు. యిటువంటి నియమము ధారణచేసినపక్షమందు మీకు శుభగుణములుగల పుత్రోత్పత్తి యగును.

హే శిష్య! ఈ ప్రకారముగ మూఢపురుషులను విషయాసక్తినుండి విడిపించుట కొఱకు ఆ శ్రుతిభగవతి పుత్రోత్పత్తిని స్తుతిచేయుచున్నది. ఆ శ్రుతివచనమునకు నివృత్తియందే తాత్పర్యముగలదు. గాని పుత్రోత్పత్తియందులేదు ఏలాగుననగా— యే పదార్థము రాగముచే ప్రాప్తముకాదో ఆ పదార్థమునే శాస్త్రము విధానము చేయుచున్నది. రాగప్రాప్తవస్తువును విధానముచేయదు ఈ నియమమును సర్వవాదులు అంగీకరింతురు స్త్రీ సంగము, పుత్రోత్పత్తి ఈ రెండును శాస్త్రములేకయే రాగము చేతనే సర్వజీవులకు ప్రాప్తించుచున్నవి. శాస్త్రరహితపశుపక్ష్యాదులకును స్త్రీసంగ పుత్రోత్పత్తులు రాగముచేతనే ప్రాప్తములగుచున్నవి. ఈ కారణమువల్లనే అధర్వణ శ్రుతిచే పుత్రోత్పత్తిగలుగజేయు రాగిపురుషులకు పశువులతోటి దృష్టాంతమివ్వబడినది. మఱియు యీ కారణముచేతనే "పతిర్జాయాం ప్రవిశతి" యని శ్రుతి ఏకపుత్రోత్పత్త్యనంతరము మఱల స్త్రీ సంబంధమును నిషేధముచేయుచున్నది ఏలాగుననగా — పుత్రోత్పత్తికి పూర్వము ఏ స్త్రీమాతావాచకమైన జాయాశబ్దమునకర్థముకాదో, ఆ స్త్రీయే పుత్రోత్పత్తి కనంతరము జాయాశబ్దమున కర్థమగుచున్నది. ఈలాగున రాగప్రాప్త స్త్రీసంగ పుత్రోత్పత్తులను శ్రుతి విధానముచేయును. మఱేమనిన సంసారదుఃఖమునకు హేతువై ఆనందరూపాత్మ నావరణము జేసినదైన ఏ రాగరూపకామము కలదో తన్నివృత్తిబోధనయే శ్రుతిచే చేయబడియె. హే శిష్య! జీవులహృదయదేశమందు స్థితమైన ఏ స్వయం జ్యోతిరాత్మగలదో ఆ యాత్మదేవుడే రాగరహితపురుషులకు బ్రహ్మచర్య సాధనము చేతనే దీపమువలె స్పష్టముగా ప్రతీతమగుచున్నాడు. మఱియు ఆ బ్రహ్మచర్య ధర్మము జీవులకు శాస్త్రములేక ప్రాప్తములేకుండును. ఈ కారణమువలన ఆశ్రుతి భగవతి అధికారిపురుషులకు బ్రహ్మచర్య విధానముచేయుచున్నది.

హే శిష్య! జరాయుజాదిచతుర్విధప్రాణులు సర్వదా సుఖప్రాప్తిచ్ఛయు తత్ప్రయత్నమును చేయుచున్నవి. కాని ఆ ప్రాణులకు సుఖప్రాప్తిగాకున్నది. యిటువంటి సుఖరహితజీవులనుచూచి. వారియొక్క దుఃఖములను సహింపజాలక శ్రుతిభగవతి అత్యంతఖేదమును పొందుచున్నది. మఱియు హితకారిమాతవలె తన కృపాజన్య దుఃఖమెఱిగించుటకు తన మస్తకమును తాడనముచేసుకొనుచు ఆశ్రుతిభగవతి బ్రాహ్మణాదిత్రైవర్ణిక అధికారిపురుషుల గూర్చి యిట్లనియె. — ఓ అధికారిజనులారా! మీకు సుఖముకావలనన్న మీరు నావచనములపై శ్రద్ధయుంచి కామపరిత్యాగరూప

బ్రహ్మచర్యధర్మమును సంపాదింపుడు. ఆ బ్రహ్మచర్యముచే మీకు సుఖప్రాప్తియగును. ఓ అధికారిజనులారా! మీరు శ్రోత్రేంద్రియములచేతను, బుద్ధ్యాదిగుణములచేతను, యుక్తులుగానున్నారు. శ్రవణాదిసాధనములయందును సమర్థులుగానున్నారు కనుక మా ఉపదేశమును ధారణచేయుటకు మీకే అధికారముగలదు. ఇతర జీవులకులేదు. ఏలాగుననగా — వృక్షాదిస్థావరప్రాణులో శ్రోత్రాదిరహితులు, గోఅశ్వాదిపశువులో శాస్త్రార్థబుద్ధిరహితులు, శూద్రాదిమనుష్యులో "స్త్రీశూద్రౌనాధీయేతామ్" స్త్రీశూద్రాదులు వేదాధ్యయనమున కనధికారులు మతేమనిన త్రైవర్ణిక అధికారులైన మీకే మా ఉపదేశమున కధికారము కలదు కనుక అధికారిజీవులగు మీరు మా ఉపదేశమంగీకరించి కామమును పరిత్యాగము జేయుడు ఓ యధికారిజనులారా! లోకమందెందఱు జీవులు దుఃఖమును పొందుచున్నారో, వారందఱు కామముచేతనే యీ దుఃఖమును పొందుచున్నారు. కామములేకున్న దుఃఖములేదు. కనుక అన్వయ వ్యతిరేకముగ కామమే దుఃఖమునకు కారణమైయున్నది. ఇటువంటి దుష్టకామమునకు వశమగుట అధికారులగు మీకుచితముగాదు.

ఇప్పుడు తైత్తిరీయోపనిషద్రీతిగా కామపరిత్యాగమందు సుఖరూపతను స్మరింపుడు. చక్రవర్తినుండి హిరణ్యగర్భునివఱకు ఏకాదశపురుషులకు పూర్వపూర్వముకన్న ఉత్తరోత్తరము శతగుణాధికముగ ఆనందము చెప్పబడినది. "శ్రోత్రియస్యచాకామహతస్య" ఆ కామదోషరహితనిష్కామపురుషునకు ఆ సకలానందములు ప్రాప్తమగును ఆ సంపూర్ణానందము బ్రహ్మానందరూప సముద్రమునందొక బిందువుమాత్రమేయైయున్నది. ఓ అధికారిజనులారా! ఇటువంటి బ్రహ్మానందమును సాక్షాత్కరించుటయే మనుష్యశరీరమునకు ఫలము. ఓ అధికారిజనులారా! శ్వానాదిపశువులు శాస్త్రజ్ఞానరహితములు ఆ పశువులు స్త్రీసంభోగము చేయును. పుత్రోత్పత్తి చేయును. కుటుంబమునకు భరణపోషణము చేయును ఆ శ్వానాదిపశువులవలె అధికారిజనులగు మీరును స్త్రీసంభోగాదుల చేసిన పక్షమందు ఆ శ్వానాదిపశువులకన్న మీ అధికతయేమి? తత్తుల్యులేయగుదురు. శిష్యులు — హే భగవన్! మేము పశువులైన కానిమ్ము. మేము శాస్త్రాజ్ఞాపరిపాలనమే చేసెదము. గృహస్థులు స్త్రీసంభోగమును పుత్రోత్పత్తియు చేయవలయునని శాస్త్రవిధానముగదా!

గురువు — హే శిష్యా! శాస్త్రవచనమునకు తాత్పర్యము మీరెఱుగరు, వేదమందు విధివచనము ద్వివిధము — ఒకటి నిత్యవిధిరూపము, మరొకటి కామ్యవిధిరూపము, యే విధివచనములను ఉల్లంఘనచేయుటవలన అధికారికి పాపప్రాప్తియగునో, చేయుటచే పుణ్యప్రాప్తియగునో, దానికి నామము నిత్యవిధివచనము.

ఎట్లనగా — "అహరహః సంధ్యాముపాసీత" నిత్యము సంధ్యావందనము చేయవల యును అనునది విధివచనము. మఱియు యే విధివచనమును ఉల్లంఘించుటచే పాపములేదో, చేయుటచే యేదో ఒక ఫలప్రాప్తియగునో అది కామ్యవిధివచనము. ఎట్లనగా "జ్యోతిష్టోమేన స్వర్గకామో యజేత" అనునట్లు ఆ జ్యోతిష్టోమాదులనుచేయక పోయినచో పాపములేదు. చేసిన పక్షమందు స్వర్గాదుల ప్రాప్తియగును. కనుక యిది కామ్యవిధివచనము — అట్లే ప్రకృత ప్రసంగమందు స్త్రీ సంభోగపుత్రోత్పత్త్యాది వేదవచములు ఒకచో నిత్యవిధిరూపమైనపక్షమందు వానిని ఆచరింపనిచో అధికారికి పాపప్రాప్తి కావలసినది. కాన ఆ వచనములు నిత్యవిధిరూపములుకావు మఱేమనిన కామ్యవిధిరూపములు. కనుక వాటిని ఆచరింపకుండుటచే నిష్కామపురుషులకు పాపప్రాప్తికాదు. ఎట్లనగా "శ్యేనేనాభిచరన్ యజేత" శత్రునాశేచ్ఛగల పురుషుని గూర్చి శ్యేనయాగవిధానము చేయబడియె శ్యేనయాగము చేయకుండుటవలన పాపోత్పత్తికాదు. పైగా చేయువానికి నరకాదిదుఃఖప్రాప్తియగుచున్నది. అట్లే పుత్రో త్పత్తి కథనముచేసినదైన కామ్యవిధిరూపవచనము నుల్లంఘనముచేయుటచే పాపము కాదు. మరేమనిన పైగా పుత్రోత్పత్తిచేయువానికి అనేక ప్రకారములగు దుఃఖప్రాప్తి యగుచున్నది.

మఱియు — ఓ అధికారి జనులారా! పుత్రోత్పత్తి, వివాహము, ఋతస్నాతస్త్రీ గమనము మొదలగు సమస్త కామ్యవిధిరూపవచనములు రాగియగు పురుషునిగూర్చి నాయా యర్థములను విధానము చేయుచున్నది. రాగరహిత నిష్కామపురుషులతో ఆ వచనోల్లంఘనముచే కించిన్మాత్రము దోషోత్పత్తికాదు. పైగా మహాఫలప్రాప్తియగు చున్నది. ఓ అధికారిజనులారా! యెట్లు కామముచే అంధములైన శ్వానాదిపశువులు తమ మాతా భగినులతో గమనముచేయుచున్నవో, అట్లే మీరు చేయకుడు. ఈ కామమే జీవుల కనర్థకారణమై యున్నది ఈ వార్త కేవలము మేమే చెప్పునదికాదు. కామ మందనర్థకారణత లోకమందును ప్రసిద్ధమైయున్నది. ఏలాగుననగా — లోకమందు యే పురుషులు కామాంధులగుదురో, ఆ పురుషులేయనర్థములనుచేయరు? సర్వానర్థ ములును చేయుదురు. ఈ కామాంధపురుషులు తమ స్త్రీలకు గర్భధారణరూపదుఃఖో త్పత్తిని తమకు పాపరూపదుఃఖోత్పత్తిని పుత్రులకు శరీరధారణరూపదుఃఖోత్పత్తిని గలుగజేయుచున్నారు. కనుక కామమే అనర్థకారణమైయున్నది. ఇటువంటి దుష్ట కామమును యెప్పుడు మీరు పరిత్యాగముచేయుదురో, అపుడే మీకు సుఖప్రాప్తియగును. హే శిష్య. ఈ ప్రకారముగ ఆ శ్రుతిభగవతి మాతవలె కృపగల్గి అధికారిపురుషుల గూర్చి బ్రహ్మచర్య ధర్మోపదేశము చేయుచున్నది. ఇవ్విధమున సమస్త శ్రుతివచన ములకును సాక్షాత్తుగాగాని, పరంపరగాగాని, నివృత్తియందే తాత్పర్యముగలదు.

పుత్రోత్పత్తియందు ఏయొక్క శ్రుతివచనమునకు తాత్పర్యములేదు. (పుత్రోత్పత్తి దుఃఖవర్ణనము ప్రథమాధ్యాయమందు విస్తారముగ చెప్పబడినది.)

హే శిష్య! మనష్యాదియోనిజశరీరములందు త్రివిధమలముగలదు — పిత యొక్క శుక్లమను కార్మణమలము, మాతయొక్క శోణితమను మాయాయమలము రెండు మలములుఁచేరి విలక్షణ వర్ణముకలిగి ఆణవనమలమగుచున్నవి. సంభోగకాల మందు పితృవీర్యము అధికమై మాతృశోణితము న్యూనమైనపుడు పుత్రుడుగాను వీర్యముకన్న శోణిత మధికమైనపుడు కన్యగాను, సమానమైనపుడు నపుంసకుడుగాను బిడ్డపుట్టును సంభోగకాలమందు పిత, మాత, చింతారహితులై స్వస్థచిత్తులైయుండి నపుడు శిశువు సుందరముగాను, పూర్ణేంద్రియములు గలిగినదిగాను, శుద్ధగుణయుక్తము గాను పుట్టును. దంపతులు చింతాదులచే వ్యాకులచిత్తులైయున్న పక్షమందు శిశువు కురూపముగాను, న్యూనాధిక యింద్రియముగలదిగాను, అశుభగుణయుక్తముగాను పుట్టును. ఆ శుక్లశోణితములు కఫాదిదోషములచే యుక్తమైనపుడు శిశువు కుంటిగను, న్యూనాధిక అంగములుగలదిగాను పుట్టును. సంభోగకాలమందు పురుషునియొక్క గాని, స్త్రీయొక్కగాని, అపానవాయువు యేదో ఒక నిమిత్తముచే క్షోభితమైనపుడు ఆ వాయువు స్త్రీయొక్క గర్భాశయమందుపోయి ఆ మిశ్రమైన శుక్లశోణితములను రెండులేక అనేకములైన విభాగములు చేయును. అపుడు అనేక బిడ్డలు పుట్టుదురు.

ఇక యిపుడు మాతృోదరమందు గర్భవృద్ధి చూపబడుచున్నది. హే శిష్యా! స్త్రీ ఉదరమునుపొందిన శుక్లశోణితములు పరస్పరము మిశ్రితమై ప్రథమరాత్రియందు జలఫేనమువలె కలలావస్థను పొందును. ఆ కలలము మాతయొక్క అంగుష్ఠప్రమాణ మగును సప్తరాత్ర్యనంతరము అది బుద్బుదావస్థ చెందును. పక్షానంతరము ఆ బుద్బుదాకారమాంసము ద్రవీభావమును పరిత్యజించి తన అగ్నిసంబంధముచేతను, మాతయొక్క అగ్నిసంబంధముచేతను పిండభావమునుపొంది చతుష్కోణమగును. ఆ చతుష్కోణపిండము రెండు అండకోశరూపములై పృథగ్భావమును చెందును. అపుడు అంతర ప్రాణవాయువుయొక్క ఊర్ధ్వప్రేరితమైన ఆ రెండు అండములనుండి మొదట సుషుమ్నానాడి పుట్టును. ఆ సుషుమ్నానాడి పూర్వము నాడీరంధ్రమధ్యమం దున్నట్లు వర్ణింపబడియె. ఈ సుషుమ్న యోగహీనులకలక్ష్యమైయున్నది. ఇది వర్తులాకారముగాను, సరళముగా నుండును. నాభి హృదయము తాలుకంఠభ్రూమధ్య ములను నీ పంచస్థానములను బోధించుటవలన పంచవర్ణనామముచే నిది కథనము చేయబడియె. ఇది వృక్షమువలె అధోముఖమైయున్నది. ఇటువంటి సుషుమ్నానాడికి రెండుప్రక్కల యిడపింగళయను రెండు నాడులు పుట్టుచున్నవి. అవి అండకోశము

నుండి లేచి క్రమముగా వామదక్షిణనాసికలందు ప్రవేశించుచున్నవి. శిష్యుడు — హే భగవన్! అట్లు రెండునాడులు అండకోశమునుండి లేచి వామదక్షిణ నాసికలందు ప్రవేశించుచున్నవను సంగతి పురుషశరీరమందు ఘటించునుగాని, స్త్రీ శరీరమందు ఘటింపదుకదా ?

గురువు — హే శిష్య! ఆ నాడులకు మూలగ్రంథిరూపమగు అండకోశము పురుషశరీరమందు స్పష్టముగాను, స్త్రీశరీరమందు అస్పష్టముగాను, నపుంసకశరీరమందు కించిత్ స్పష్టముగాను ఉన్నది. ఈలాగున స్త్రీ నపుంసకశరీరములందును ఆ నాడుల ఉత్పత్తి సంభవించుచున్నది. ఒక మాసమైన తర్వాత ఆ చతుష్కోణ పిండము గట్టిపడును రెండుమాసముల పిమ్మట ఆ పిండమునుండి మొదట శిరస్సు పుట్టుచున్నది. మూడుమాసముల పిదప ఆ నాల్గుకోణములనుండి యథాక్రమముగ రెండుచేతులును, రెండుపాదములును పుట్టుచున్నవి. నాల్గుమాసముల పిదప ఆ హస్త పాదములకు వ్రేళ్ళు కలుగుచున్నవి. మఱియొకటి ఉదరము. ఆ రెండు పార్శ్వముల కున్ను అవయవములు పుట్టుచున్నవి. ఆయిదు మాసములపిదప పృష్ఠదేశస్థితదీర్ఘ అస్థి కలుగుచున్నది. ఆరుమాసములపిదప ముఖాది నవద్వారములును వాగాదీంద్రియము లును పుట్టుచున్నవి. సప్తమమాసానంతరము ఆ గర్భమందు ప్రాణముల వ్యాపారము స్పష్టమగుచున్నది. అష్టమమాసమందాగర్భము అంతరబాహ్య సకల అంగములచే పూర్ణమగుచున్నది. కాని, ఆ యష్టమమాసములో గర్భమందు, చైతన్యప్రకటనము కాదు. కనుక అష్టమమాసమందును ఆ గర్భము సుషుప్తియందువలె స్థితమగుచున్నది. ఆ అష్టమమాసమందు వాతపిత్తాదుల విషమతారహితమై ఆ గర్భము ఒకానొకప్పుడు మాతృోదరమునుండి బయటకువచ్చి జీవితముగానుండిన పక్షమందు ఆ గర్భము భోగమోక్షముల రెంటియందును సమర్థమగును. ప్రణవాది ఉపాసనచే బ్రహ్మలోక మునకు పోవును. ఆత్మసాక్షాత్కారమును పొంది మోక్షమును పొందును. దీనివలన సిద్ధమైనదేమనగా — అష్టమమాసమందు జననమైనపక్షమందు ఆ బాలకుని జీవిత మందు సంశయమే లేదు. నవమమాసారంభమందు ఆ గర్భము సర్వజ్ఞమగును. ఎట్లు వివేకాదిసాధనచతుష్టయసంపన్నుడగు అధికారిపురుషుడు బ్రహ్మజ్ఞానేచ్ఛవల ననే వినయపూర్వకముగా బ్రహ్మవేత్తయగు గురుని సముఖమునకేరి అడుగుచున్నాడో, అట్లే ఆ నవమమాసగర్భమున్ను వినయపూర్వకముగా మాతృోదరమందు స్థితముగా నున్నది. మఱియు అపుడా శిశువు అనేకజన్మముల పుణ్యపాపకర్మములను స్మరణ జేయుచు తన్ను ధిక్కరించుచున్నది. హే శిష్య! బాలకుని పశ్చాత్తాపము వినుము — దుఃఖరూప సంసారమున నేను పూర్వము సుఖదుఃఖప్రాప్తి చేయదగిన అసంఖ్యాకము లగు శరీరముల ధారణచేసియుంటిని. శ్వాన, సూకర గో, అజ, మృగ పక్షి, మత్స్య.

కీటక అనులోమప్రతిలోమములైన శరీరములు ఏక పాద ద్విపాద చతుష్పాద అనేక పాదములుగల శరీరములు ఏకహస్త, ద్విహస్త, అనేక హస్తములుగల శరీరములు యిటువంటి అనేక శరీరముల పొందితిని. ఎట్లు వాయువుచే చలితమైన తృణము నిరంతరము భ్రమణము చేయుచున్నదో, అట్లే పుణ్యాపాపకర్మవశమైన నేను నరకస్వర్గ భూలోకములయందును, భ్రమణము చేయుచున్నాను. ఎట్లు కాపుజనులు రజ్జుపాశముచే వృషభాదిపశువులను కట్టి కృష్యాదికార్యములయందు ప్రవృత్తములుగా చేయుచున్నారో, అట్లే మాయారూపసూత్రముచే పుట్టినదైన పుణ్యాపాపరూపపాశముచే పశువైన నన్నుకట్టి స్త్రీ పుత్రాది కుటుంబపాలన చేయుటయందు యేదో ఒక అంతర్యామియగు దేవుడు ప్రవృత్తముగా చేయుచున్నాడు అయినను ఆ యంతర్యామి దేవుని మూఢబుద్ధియగు జీవుడనైన నేను యెఱుగనైతిని. ఇంతవఱకు అనేకశరీరములందు అనేక మాతలయొక్క అసహ్యమైన స్తన్యపానము నేను చేసితిని. నింద్య నింద్య ఆహారములు భోజనము చేసితిని. అనేక శరీరములయందు ఆ యా శరీరసంబంధములైన అనేక పిత, మాత, పుత్ర, స్త్రీ బాంధవ గృహాది పదార్థములందు నాకు అత్యంత రాగము జనించినది. ఆ యా శరీరములు నాశనమైన పిదప ఆ పదార్థములయొక్కయు, రాగముయొక్కయు నాశమైనది భూమియందు యెన్ని సూక్ష్మరజఃకణములుగలవో, ఆకాశమందు యెన్ని తారాగణములుగలవో, వాటికన్నను అధికశరీరములు నాకుకలిగి అందఱు మాతాపితరులునాకైరి విసఱినధాన్యములు మఱల విసఱుట ఆశ్చర్యకరమైనట్లు అనేకమాఱులు పుట్టుట, అనేకమార్లు చచ్చుట నాకు ఆశ్చర్యముగ తోచుచున్నది.

విచారహీనుడనైన నేను సుఖసాధనమని యెఱిగి అనేక పుణ్యాపాపకర్మములు చేయుచున్నాను. ఆ సమస్తకర్మములు ఈ లోకమందును, పరలోకమందును, నాకనేక ప్రకారదుఃఖప్రాప్తియే జేయుచున్నవి. ఈ అనాదిసంసారమందు విషరూప జూదరులు మూఢబుద్ధియైన జీవుడనగు నన్ను అనేకశరీరములయందు పరాజయము చేయుచున్నారు. ఇపుడేదో ఒక పుణ్యప్రభావముచే యీ మాతయొక్క ఉదరమునుండి బయటకు వచ్చిన తర్వాత యింకెప్పటికిని పూర్వశరీరమునందువలె ప్రమాదము చేయను. మఱేమనిన జన్మమరణాది దుఃఖములను నాశముచేయదగిన ఏ బ్రహ్మజ్ఞానముగలదో, ఆ బ్రహ్మజ్ఞానమును నేను సంపాదించెదను. అష్టాంగయోగాది యుపాయము లొనర్చెదను. మఱియు ఒకచో ఆ యాత్మసాక్షాత్కారసంపాదనమందు నాకు సామర్థ్యములేక పోయిన పక్షమందు పార్వతీపతియగు మహాదేవుని, లక్ష్మీపతియగు విష్ణువుని నేను నిరంతరము ఆరాధనము చేసెదను ఈ మాత్రోదరమునుండి బయటకువచ్చిన తర్వాత పూర్వమువలె స్త్రీపుత్రాదికుటుంబపాలనమందు ఆయుస్సును క్షేపముచేయను. యెందుకనగా — పూర్వము నేను ఏ స్త్రీ పుత్రాదుల పాలనముకొఱకు అనేక ప్రకార

పుణ్యపాప కర్మములఁజేసితినో, వారికి నా అనుగ్రహముచేతనే సుఖప్రాప్తియైనది. ఇట్లుండ నా స్త్రీ పుత్రాదిబాంధవులెంత కృతఘ్నులుగానుండిరనగా చాటయందు విష్ట తీసికొని యింటినుండి బయటపారవైచినట్లు మరణానంతరము నన్ను గృహమునుండి బయటకు తీసికొనిపోయి స్మశానభూమియందు పారవైచిరి. అథవా నా జీవితకాలమందా స్త్రీపుత్రాదులు నాచరణముపై తమమస్తకముంచి నమస్కారము చేయువారై నను మరణానంతరము నన్ను స్పర్శముచేసిన తమ్ము అశుద్ధమని యెఱిగి స్నానము చేయుచున్నారు. అథవా – నా జీవితావస్థయందు ఏ స్త్రీపుత్రబాంధవాదులు నా శరీరముపై చందనాదిలేపములు చేయువారై యుండిరో, వారే మరణాంతరమందు నన్ను ప్రజ్వలితాగ్నియందు కాల్చుచున్నారు అథవా - యెవరిపాలనముకొఱకు నేను అనేక పాపకర్మములు చేసితినో, ఆ స్త్రీపుత్రాది బాంధవులు ఆ పాపకర్మసంబంధఫలోపభోగముకొఱకు యేజన్మమందును నాతోడరాలేదు. మఱేమనిన ఆ పాపకర్మ సంబంధ దుఃఖరూపఫలమును నేనొకడనే ఉపభోగించితిని ఇటువంటి అగమాపాలులగు కృతఘ్నబాంధవులతో నెప్పటికిని స్నేహము చేయను అథవా - లోకమందు యెట్లు వేశ్యాస్త్రీ యంతరమున స్నేహరహితగానుండినను, బయటకు నానా ప్రకారముల స్నేహలాభములచూపి ధనవంతులగు పురుషుల మోహితులగా జేయుచున్నదో, అట్లే ఆ స్త్రీపుత్రాదిబాంధవులును అంతరమున స్నేహరహితులై యుండినను బయటకు నానా ప్రకారస్నేహమును చూపి తమస్వార్థసిద్ధికొఱకు మూఢబుద్ధినైన నాకు మోహప్రాప్తిని చేయుచున్నారు. మఱియు యెట్లు వేశ్యాస్త్రీ ధనవంతుని సర్వస్వమును హరణముచేసి ఆపత్కాలమందు వానిని పరిత్యాగము చేయుచున్నదో, అట్లే నా స్త్రీ పుత్రబాంధవాదులును నాయొక్క సర్వస్వము అపహరించి మరణరూప ఆపత్కాలమందు నన్ను పరిత్యాగము చేయుచున్నారు. హే శిష్య! యీ ప్రకారముగ నవమాస శిశువు మాత్రోదరమందు స్థితమైయుండి అనేక జన్మలయొక్క స్మరణముచేసి పశ్చాత్తాపము నొందుచున్నది. అనంతరము ప్రసూతివాయువు ఆ బాలకుని ముఖమును క్రిందికిని పాదములు పైకిని యొనర్చుచున్నది. ఆ కాలమందు వాతపిత్త కఫములు క్షోభితమగుటవలన ఆ శిశువు బహుదుఃఖమునుపొంది తన్నెఱుగదు. ఇతరుని యెఱుగదు. తానో ఆరంగుళములు. మాతృశరీరమందు నాలుగు అంగుళముల యోనిస్థానము. ఇటువంటి సంకీర్ణమైన యోనియంత్రమందు ప్రసూతివాయువుచే ఆ శిశువు చలితముకాగా, మాత్రోదరమందు మూత్రముండునట్టి బస్తిస్థానము విష్టయుండునట్టి సంగ్రహణిస్థానము యీ రెండు స్థానముల ప్రసూతివాయువుచే క్షోభితమై ఆ బాలకుని మస్తకముమీద విష్టామూత్రములు గావింపుచున్నవి.

హే శిష్య! తీక్ష్ణక్రకచముచే ఉదరమును కోసికొనుటయందు అస్మదాది జీవులకు యెంత దుఃఖప్రాప్తియగునో, అంత దుఃఖప్రాప్తి గర్భత్యాగకాలమందు ఆ గర్భిణీస్త్రీకిని శిశువునకును అగుచున్నది. అల్పవ్రణమందు పెద్దకీటకము మనుజునకు యెట్లు పరమదుఃఖప్రాప్తి చేయుచున్నదో, అట్లే సంకుచితయోనిద్వారమందు ప్రాప్తమైన శిశువు తనకును తన మాతకునుకూడ పరమదుఃఖప్రాప్తిని చేయుచున్నది. మఱియు యెట్లు తీక్ష్ణశస్త్రము అజాదుల యోనిస్థానమును విదారణ చేయుచున్నదో, అట్లే యీ శిశువున్ను, మాతయొక్క యోనిస్థానమును విదారణ చేయుచున్నది. ఎట్లు రాజగృహమున చౌర్యము చేసిన అపరాధిని రాజభృత్యులు బలాత్కారముగ రెండు క్రకచముల మధ్యమందు ఉంచుచున్నారో అట్లే ప్రసూతి సంబంధ వాయువు ఆ శిశువును బలాత్కారముగ యోనియంత్రమందుంచుచున్నది. మఱియు ప్రసూతికాలమందు జరాయునామపటరహితమై, ఆ కోమల శిశువు అగ్నిస్పర్శచేవలె యోనియంత్రము యొక్క స్పర్శముచే దహనమగుచున్నది. — హే శిష్య! ఈ ప్రకారముగ ననేక దుఃఖముల ననుభవము చేసి ఆ శిశువు నవమాసమందు అథవా దశమమాసమందు యోనియంత్రమునుండి బయటకు వచ్చుచున్నది. ఎట్లు దుర్గంధవ్రణమునుండి కీటకము భూమిమీద పడుచున్నదో, అట్లే ఆ శిశువున్ను యోనియంత్రమునుండి భూమిమీద పడుచున్నది. తీవ్రకంటకములనుండి లాగుటచే అస్మదాది జీవులకు యెంత దుఃఖప్రాప్తియగునో, అంత దుఃఖము ఆ శిశువునకు యోనియంత్రమునుండి బయటకు వచ్చుటయందగుచున్నది. జన్మకాలమందు మూర్ఛావస్థను పొంది ఆ శిశువు యేమి నెఱుగగలదు? హే శిష్య! మూర్ఛాభావానంతరము, వైష్ణవవాయువు తన సంబంధముచే శిశువునకు పూర్వవిచారమును విస్మరింపజేయుచున్నది. ఆ వైష్ణవవాయువు యెట్లున్నదనగా — మాతృోదరముయొక్క బాహ్యమున సర్వత్రా వ్యాపకమై యున్నది. జీవులకు వ్యామోహము ద్వారా సంసారచక్రమందు భ్రమింపజేయుటకొఱకు విష్ణుభగవంతునిచే నా వాయువు పుట్టింపబడినది. ఈ కారణమువలన శాస్త్రవేత్తలు నా వాయువును వైష్ణవనామముచే కథనము చేయుచున్నారు.

హే శిష్య! ఈ వైష్ణవవాయువుయొక్క భయముచేతనే పూర్వము శుకమహర్షి స్వాంగబలముచే ప్రసూతి వాయువును నిరోధించి మాతృోదరమందు బహుకాలము వరకు స్థితుడైయుండెను. బయటకు వచ్చుటకు ధైర్యము లేదు, ఇటువంటి బలిష్ఠమైన యీ వైష్ణవవాయువు, బుద్ధిమంతులును, సర్వజ్ఞులును అగు పురుషులనుకూడ తన స్పర్శముచే మూఢులునుగ జేయుచున్నది. హే శిష్య! శిశువు మాతృోదరమున నవమమాసమందు చేసినదైన ఆ సంపూర్ణశుభవిచారమును వైష్ణవవాయుస్పర్శముకాగా పరిత్యాగము చేసి శ్వాసపుచ్ఛన్యాయమున వక్రభావమును పొందుచున్నది ఎట్లు అగ్ని

దగ్ధకాష్ఠము పరిభ్రమించుటచే అగ్నిభ్రమణమగుచున్నదో, అట్లే వక్రమనస్సుయొక్క తాదాత్మ్యాధ్యాసముచే సాక్షియగు ఆత్మయు వక్రభావమును పొందుచున్నారు అనంతరము అత్యంతదుఃఖియైన ఆ శిశువు "కోఽహమ్ కోఽహమ్" అను శబ్దోచ్చారణ చేయుచు నేడ్చుచున్నది. హే శిష్య! ఈ ప్రకారముగ గర్భోపనిషత్తునందు వైరాగ్య ప్రాప్తికొఱకు జీవుల జన్మము కథనము చేయబడియె అట్లే మరణావస్థయొక్క విచార మున్ను వైరాగ్యప్రాప్తికొఱకు చెప్పబడియె. ఏ అధికారి పురుషులు ఉపనిషత్తునందు వచించిన రీతిగ జన్మ మరణ విచారము చేయుదురో, వారు అవశ్యముగ వైరాగ్యమును పొందుదురు (ఇచ్చట చెప్పబడిన జననమరణ విచారము చూచికూడ ఎవరు వైరాగ్య మును పొందరో, వానిని పశువనవలెనా? అథవా శిల యనవలెనా? అను నీ విషయ మందు సర్వజ్ఞులగు జనులుకూడ చాల సందేహపడియున్నారు ఇంతవఱకు అది నిర్ణయము కాలేదు) "జాతస్య హి ధ్రువో మృత్యుర్ధ్రువం జన్మ మృతస్య చ" అను భగవ దుక్తి ప్రకారముగ ఏ ప్రాణికి జన్మమగునో, వానికి మృత్యువు తప్పదు. మా మాతా పితృబాంధవులకు జన్మముండెను. వారికిని మృత్యువైనది. అట్లే మాకును జన్మయైనది గాన మాకును అవశ్యము మృత్యువగును అను నీ అనుమాన ప్రమాణముచేతను జీవు లకు మృత్యువు నిశ్చయమగుచున్నది. అయినను తనకెన్ని దినములకు మృత్యువగు నను సంగతి యోగరహితులకు తెలియదు. కనుక ఋగ్వేదమునందు కౌషీతకిముని చేతను, వసిష్ఠసంహితయందు వసిష్ఠభగవంతునిచేతను, మృత్యుచిహ్నములు కథనము చేయబడెను.

కౌషీతకి ఉపనిషత్సంబంధ మరణచిహ్నములు — సూర్యమండలమందు మఱియు మనుష్యుని దక్షిణనేత్రమందు ఒకడే అంతర్యామియగు పురుషుడు స్థితుడై యున్నారు. ఆ రెండు చోటులకు నాడీద్వారా పరస్పర సంబంధము కలదు మరణ కాలము సమీపమునకు రాగా, ఆ సంబంధము నివృత్తమైనపుడు మనుజునకు పూర్వ వత్తుగా సూర్యభగవానుడు ప్రతీతము కాడు. శీతలచంద్రునివలె అథవా కిరణరహితుని వలె అథవా సచ్ఛిద్రముగ అథవా రక్తవస్త్ర సమానముగ ప్రతీతమగును. అట్లు సూర్య భగవంతుని విపరీతముగ చూచువాడు అల్పకాలమందే మృత్యువును పొందును. అట్లే పూర్వాది అష్టదిక్కులను, అంతరిక్షలోకమును, తారాగణమును, సర్వదా రక్తవర్ణముగ చూచువాడు, మలపరిత్యాగకాలమందు పాయుద్వారము సంకోచరహితమైన విధమున ఆ పాయుద్వారము సర్వదా సంకోచరహితమై యున్న పురుషుడును, అండములచే యుక్తమైన కాకగృహమందు దుర్గంధము గల్గినట్లు మస్తకమందు దుర్గంధముగల పురుషుడును, తన ఛాయయందు ఛిద్రమును చూచువాడును, దర్పణస్థిత జలస్థిత

ప్రతిబింబములందు అథవా భూమిస్థితచ్ఛాయయందు తన మస్తక సంబంధ సందేహము అథవా మస్తకాభావమును చూచువాడును, ద్వితీయ పురుషుని నేత్రమందు అథవా దర్పణమందు తన పాదములు పైకిగను, మస్తకము క్రిందికిగను చూచువాడును, సంశయము గలవాడును, అంగుళిచే నేత్రపీడనము చేసినపుడు అస్మదాదులకు కిరణయుక్తతేజము విశేషముగా ప్రతీతమగునట్లు ఆ తేజము నేత్రపీడనముచేత ప్రతీతముగాని పురుషుడును, రెండంగుళములు రెండు కర్ణములందు నిరోధము చేసినపుడు ప్రాణముల ధ్వనిరూపశబ్దము వినబడనివాడును, మయూరకంఠసమానముగల అగ్నిని నీలవర్ణముగ చూచువాడును, మఱియు మేఘము లేకనే ఆకాశమందు విద్యుల్లతను గాంచువాడును, మేఘమందు విద్యుల్లతను చూడనివాడును, వృష్టిగల మేఘమందు సూర్యకిరణములను, అగ్నిరహితభూమియందు ప్రజ్వలితాగ్నిని చూచువాడును, అల్పకాలమందే మృత్యువును పొందును.

వసిష్ఠసంహితయందలి మృత్యుచిహ్నములు — హే శిష్య! ఒకేదినములోగా ప్రాతఃకాల సాయంకాలములందును తన మస్తకమునుండి పొగ బయటకు వచ్చుట చూచువాడు మహాభయమును అథవా మృత్యువును పొందును. ౕ దినములుగ పొగను చూచువాడు మూడు వర్షములకును నాలుగు దినములుగ చూచువాడు రెండు వర్షములకును, మూడు దినములుగ చూచువాడు ఒక వర్షమునకును మృత్యువును పొందును. తన రెండు కర్ణములను రెండు అంగుళులచే నిరోధము చేసినపుడు కర్ణాంతర్గతప్రాణముల ధ్వనిరూపశబ్దమును విననివాడును, శరీరము పూర్వము కృశించియుండగా, యే యొక నిమిత్తము లేకయు ఒకేసారి స్థూలముగ నైనట్టి అథవా పూర్వము స్థూలముగ నుండగా ఒకేసారి కృశించినట్టి పురుషుడును పూర్వము క్రోధిష్ఠుడై యుండగ ఒకేసారి శాంతుడుగాను, పూర్వము శాంతుడై యుండగ ఒకేసారి క్రోధిష్ఠుడుగానగువాడును. విష్ఠామూత్రపరిత్యాగము ఒకేకాలమందు, క్షుధాపిపాస ఒకే కాలమందై ఆ కాలమందు వ్యామోహము పొందువాడును, అకస్మాత్తుగా వృక్షాగ్రమందు గంధర్వనగరమును చూచువాడును, అథవా తన శరీరమును కృష్ణవర్ణము గలదిగ, పింగళవర్ణము గలదిగను చూచువాడును, గృధ్రకాక గోమాయు సారసాది మాంసభక్షక పక్షులు మఱియు దంతరహితమైన వృశ్చికాదిప్రాణులు, రాక్షసభూతపిశాచాదిమాంసభక్షకదష్టజీవులు, వీటిలో అనేకములుగాని అథవా ఒకటిగాని, మాంసభక్షణము చేయుటకు ఏ పురుషుని ప్రక్కకు పరుగెత్తుకొనివచ్చునో ఆ పురుషుడును, యీ ప్రకారము స్వప్నమందు చూచినవాడును, ఏ పురుషునకు యితరపురుషులు అరుంధతి, తార, ధ్రువతార, పూర్ణచంద్రాంతర్గత శ్యామలతచూపినను కూడ అది ప్రయత్నము చేతను కనబడదో ఆ పురుషుడును, ఒక వర్షాంతరమునగాని, వర్షములోపలగాని

మృత్యువును పొందును. అభిప్రాయము — ఏ తిథియందు యీ పదార్థములను చూచుచున్నాడో ఆ తిథిని మఱల చూడదు ఇపుడు షణ్మాసాది మృత్యునిరూపణము:— శ్యామవర్ణముగల వస్త్రమును శ్వేతముగాను, శ్వేతవర్ణముగల వస్తువును శ్యామముగాను చూచువాడు అథవా సూర్యచంద్రులు క్రిందకు పతనమైనట్లు గాంచువాడు, అథవా భూమిస్థితపదార్థములను ఆకాశమందును, ఆకాశస్థితపదార్థములను భూమిమీదను చూచువాడు, రోగాదికారణములులేకయు ఓష్ఠము తాలువు శుష్కమైనవాడు, అథవా చక్రమువలె శరీరభ్రమణము నొందువాడు, అథవా పర్వతాదులను చలించునట్లు, చలించుపదార్థము స్థితమైనట్లు గాంచువాడును ఘంటాశబ్దము విననివాడును, బంకభూమియందుగాని, యిసుకభూమియందుగాని తన పాదచిహ్నములను ఖండితముగ చూచువాడు షణ్మాసానంతరము మృత్యువును పొందును.

హే శిష్య! అంగుళిచే నేత్రపీడనము చేసినపుడు అస్మదాదులకు ఖద్యోతసమానముగ కనబడు తేజఃకిరణము, కంటిని పీడనము చేసినపుడు ప్రతీతముకాని వాడును, మూడుమాసముల అనంతరము మృత్యువును పొందును. నేత్రాదీంద్రియములు పూర్వమువలె, రూపాదివిషయమును గ్రహణముచేయనివాడును, ఏ దేవతల శరీరము అస్మదాదిజీవులకు ప్రత్యక్షముకాదో. ఆ దేవతలయొక్క శ్రవణము చేయదగిన వచనములను కథనముచేయువాడును, మస్తకము అగ్నిజ్వాలలచే యుక్తమైనవాడును. పగటియందు ఉల్కాపాతము, రాత్రియందు ధనుస్సును మేఘరహితాకాశమందు విద్యుల్లతను చూచువాడును, మేఘయుక్తాకాశమందు విద్యుల్లతను చూడనివాడును, కాకమైథునమును హంసమైథునమును చూచువాడును. రుక్షపదార్థమును స్నిగ్ధముగ, శీతలపదార్థమును ఉష్ణముగ, ఉష్ణపదార్థమును శీతలముగ చూచువాడును, స్నానము చేసిన పిదప హృదయము పాదమున్ను శీఘ్రమే శుష్కమైపోవునట్టివాడును ఏకమాసానంతరము మృత్యువును పొందును

హే శిష్య! అకస్మాత్తుగా భూమియందు ఛిద్రమును చూచువాడును, అథవా భూమిఛిద్రమందలి శబ్దమును వినువాడును, సూర్యకిరణములు శీతలముగాను చంద్రకిరణములు ఉష్ణముగాను ప్రతీతమయ్యెడువాడును, అథవా యే పురుషునిముఖము రక్తకమలమువలె రక్తవర్ణము, అథవా జిహ్వ ప్రజ్వలితాగ్ని సమానవర్ణముగలవియై, రెండుకర్ణములు అశ్వకర్ణసమానముగ స్తబ్ధములై, హృదయమందు, నాభియందు తాలువునందును కంపముగలవాడైయుండువాడును, అర్ధమాసానంతరము మృత్యువును పొందును. ఎవని శరీరమందు అకస్మాత్తుగా అగ్నిజ్వాల ప్రకటితమగునో వాడును తారామండలస్థితసప్తర్షి ఆదిత్యాది నవగ్రహములు ఎవనికి కనబడవో వాడును, తన మస్తకమును జిహ్వను చూడజాలనివాడును, బహువిస్మృతిగలవాడును, అథవా

అర్ధశరీరము శీతముగానున్నవాడును, నేత్రములు చాల వికాసము పొందినవాడును, కర్ణద్వయము శిథిలతచే స్థానభ్రష్టతగల్గియుండువాడును, నాశికము వక్రముగ గల్గి యుండువాడును సప్తదినానంతరము మృత్యువును పొందును.

హే శిష్య! దక్షిణదిశను సూర్యుడుండగా పురుషునిఛాయ ఉత్తరదిక్కునకు పడుచున్నది. అట్టి ఛాయను ఉత్తరదిక్కున చూడనివాడు, శస్త్రఘాతముచే ఆ దినముననే మృత్యువును పొందును. అట్లే తాను భోజనముచేయు అన్నమున పరిత్యాగము చేయుటకు ఆ అన్నమును యెవరో అపూర్వమైన స్త్రీ భోజనముచేయునట్లు చూచువాడును, వృషభారూఢుడై మహిషారూఢుడై దండపాణియైన భయానకపురుషుని, రక్తవర్ణమగు కేశములుగలవానిని, అథవా హస్తమందు పాశము గ్రహణము చేసినదైన భయానక స్త్రీని, భోజనకాలమందు చూచువాడు ఆ దినముననే చనిపోవును. ఇంతవఱకు చెప్పినవి జాగ్రదవస్థామరణచిహ్నములు. ఇపుడు వసిష్ఠభగవానునిచే చెప్పబడిన స్వప్నావస్థయందలి మరణచిహ్నములు నిరూపించబడుచున్నవి.

హే శిష్య! ఏ పురుషుడు స్వప్నమున కృష్ణదంతములుగల, అథవా కృష్ణవర్ణముగల పురుషుని చూచుచున్నాడో అతడు అల్పకాలములో చనిపోవును. స్వప్నమునందు యే పురుషుని శరీరమును వరాహము అథవా మర్కటము భక్షణముచేయునో, అథవా తీసుకొనిపోవునో ఆ పురుషుడు, స్వప్నమందు పీతవర్ణపదార్థమును భక్షణము చేసి మఱల వమనముచేయువాడు, అథవా మధుయుక్తాన్నమును భోజనముచేయువాడు, కమలసంబంధకోమలజటను భక్షణముచేయువాడు, శ్వేతకమలమును మస్తకముమీద అథవా కంఠమందు ధారణముచేయువాడు. అథవా గర్దభ, వరాహ, ఉష్ట్రయుక్తరథమందు ఆరూఢుడగువాడు, అథవా వాటిమీద కూర్చుండువాడు కృష్ణవత్సముగల కృష్ణగోవును దక్షిణదిక్కున పోవుటచూచువాడు జపాకుసుమమాలను పాచియొక్క మాలను ధారణముచేసి శరీరముమీద తైలమును మర్దనముచేసి నగ్నుడై యొకడే దక్షిణదిక్కునకు పోవువాడు, కాకగృధ్రాదులచే భక్షణము చేయబడుచుండగా, క్షుధాపిపాసాతురుడైయుండగా, ప్రసన్నుడైయుండగా, రక్తవస్త్ర రక్తగంధతైల యుక్తుడై యుండగా, శ్వానాదులచే భయప్రాప్తుడై శీఘ్రమే దక్షిణదిశకు గమనముచేయువాడు, షణ్మాసానంతరము చనిపోవును. లోహదండము ధారణముచేయువాడై కృష్ణవర్ణ పురుషునిచూచువాడు మూడుదినములకు చనిపోవును. కృష్ణగంధ కృష్ణవస్త్రధారణము చేసినదైన స్త్రీని స్నేహపూర్వకముగా ఆలింగనముచేయువాడు పదిదినములకు మునుపుగాని, అథవా ఆ దినమే చనిపోవును.

హే శిష్య ! ఈ ప్రకారము మృత్యుచిన్నములుగల ఆ స్వప్నమున్ను ద్వివిధము - అందొక స్వప్నము పుణ్యపాపాది అదృష్టసామాగ్రిచే జన్యముగాను, మఱియొక స్వప్నము వాతపిత్తకఫ కామక్రోధలోభచింతాది దృష్టసామగ్రిచే జన్యముగానున్నది. వాటిలో కేవలము అదృష్టసామగ్రిచే జన్యమైన స్వప్నము అవశ్యముగా మృత్యురూప ఫలప్రాప్తిని కలుగజేయుచున్నది. మఱియు దృష్టసామాగ్రిజన్యస్వప్నము నిష్ఫలమగుచున్నది. ఆ అదృష్టసామాగ్రిజన్యస్వప్నమున్ను రాత్రియొక్క నాల్గు చిన్నప్రహరము లందును భిన్నభిన్నఫలముల ప్రాప్తిచేయుచున్నది. ప్రథమప్రహరమందైన స్వప్నము వర్షానంతరము, ద్వితీయప్రహరమందైన స్వప్నము షణ్మాసానంతరము, తృతీయ ప్రహరమందైన స్వప్నము మాసత్రయానంతరము, చతుర్థప్రహరమందైన స్వప్నము రెండు రెండు భిన్న భిన్న ఘటికలందు ఫలప్రాప్తి గలుగజేయుచున్నది. వాటిలో ప్రథమ ఘటికాద్వయము మాసానంతరము, ద్వితీయఘటికాద్వయము పక్షానంతరము, తృతీయ ఘటికాద్వయము దశదివానంతరము, చతుర్థఘటికాద్వయము అదే దినమునను ఫలప్రాప్తిని కలుగజేయును.

హే శిష్య ! ఎట్లు వాతపిత్తాదిదృష్టసామగ్రిజన్యస్వప్నము నిష్ఫలమగునో, అట్లే అదృష్టజన్యస్వప్నములందును, ఆ స్వప్నమునకు ఉత్తరకాలమందు, ద్వితీయ స్వప్నమైనపుడు ప్రథమస్వప్నము నిష్ఫలమగును.

హే శిష్య ! ఈ ప్రకారముగ అనేక అపవాదములచే నిష్ఫలమగుచున్నది. కనుక స్వప్నవిషయమందు, యీ స్వప్నము దృష్టసామగ్రిజన్యమా? లేక అదృష్ట సామగ్రిజన్యస్వప్నమా? యీ మొదలగు విచారములు చేయవలసినది. జాగ్రదవస్థలో చెప్పబడిన, మృత్యుచిహ్నములు అవశ్యముగా ఫలప్రాప్తిని గలుగజేయుచున్నవి. సందేహములేదు.

ఇపుడు హంసాది ఉపనిషత్తునందు కథనము చేయబడిన యోగము నిరూపింపబడుచున్నది.

హే శిష్య ! బ్రహ్మచర్యధర్మముగలవాడు, మానసేంద్రియములను వశపరచుకొనినవాడునగు అధికారిపురుషుడు, మొదట తనవర్ణాశ్రమానుసారముగ నిత్యనైమిత్తిక కర్మలకొఱకు వనాదియేకాంతప్రదేశములందు కుటీరమువేసికొని అచట యోగాభ్యాసము చేయవలయును. ఆ ప్రదేశము, శీత, ఆతప, వాయ్వాది ఉపద్రవములచే రహితముగాను, మనస్సునకును, నేత్రమునకును సంతోషకరముగనుండవలసినది. ఇటువంటి యేకాంతప్రదేశమందా అధికారిపురుషుడు మొదట దర్భలను ఉంచి, దానిపై మృగచర్మమును అథవా వ్యాఘ్రచర్మమును, దానిపై మృదువస్త్రమును పరచవలయును. శరీరమునకు కించిన్మాత్రముకూడ బాధకలుగనట్లు చేసికొనవలయును.

ఆ యాసనము అత్యంత ఉచ్చమును అత్యంత నిమ్నమునుగాకుండ నుండవలయును. అటువంటి యాసనముపైకూర్చుని అధికారిపురుషుడు మొదట తనశరీరమధ్యదేశమును కంఠమును. శిరస్సును, దండమువలె సరళముగ నుంచవలయును. మఱియు నాసికాగ్రభాగమందు దృష్టినుంచి యితర దిశలను చూడకూడదు. ఆ అధికారి పురుషుడు అహింసాసత్యాదిపంచయమములను, శౌచసంతోషాదిపంచనియమములను, సర్వదా సేవనము చేయవలయును.

హే శిష్య ! యోగముచేయునపుడనేకప్రకారవిఘ్నములు ప్రాప్తములగుచున్నవి తత్పరిహారార్థము అధికారిపురుషుడు రుద్రభగవంతుని ధ్యానము చేయవలయును. రుద్రభగవంతుని ధ్యానముచే సర్వవిఘ్నములు నివృత్తమగును. అనంతరము అధికారి పురుషుడు స్వస్తిక, పద్మ, భద్రములను నీ మూడాసనములందు, యేదో ఒక ఆసనము వేసుకొని ఉత్తరదిక్కున కభిముఖుడై ప్రాణాయామము చేయవలయును. హే శిష్య ! వామజంఘము ఊరువు యీ రెండింటికి మధ్యమందు దక్షిణపాదతలముంచి దక్షిణ జంఘము ఊరువు ఈ రెండింటికి మధ్యమందు వామపాదతలముంచి దండము వలె సరళముగనుండుటకు పేరు స్వస్తికాసనము. మఱియు వామ ఊరువుపై దక్షిణ పాదముంచి ఆ దక్షిణపాదాంగుష్ఠమునకు, తన పృష్ఠదేశమునకు వెనుకగ. దక్షిణ హస్తము తెచ్చి, ఆ యంగుష్ఠమును గ్రహణము చేయుటయు అదేప్రకారముగ దక్షిణ ఊరువుమీద వామపాదమునుంచి, ఆ వామపాదాంగుష్ఠమును పృష్ఠదేశము వెనుకగ వామహస్తముచే గ్రహణము చేయుటయు. తన శరీరమును దండమువలె సరళముగ నుంచుటయు, పద్మాసనమనంబడును. రెండు పాదతలములను వృషణముల క్రింద నేకత్రపరచుట, మఱియు. ఆ పాదతలముమీద రెండు హస్తములును కచ్ఛపాకారముగ నేకత్రపరచుట, దండవత్తుగ సరళముగనుండుటయను దానికి పేరు భద్రాసనము.

హే శిష్య ప్రాణాయామ, ప్రత్యాహార, తర్కధారణ, ధ్యాన, సమాధులను నీషడంగములుచేరి యోగమగుచున్నది. ఎట్లు అగ్నిసంబంధముచే లోహాదిధాతు సంబంధముల నివృత్తియగుచున్నదో, అట్లే ప్రాణాయామముచే అంతఃకరణదోషము లున్ను. యింద్రియదోషములున్ను, నివృత్తియగుచున్నవి. ఆ ప్రాణాయామము రేచక పూరక కుంభకములని త్రివిధము. ఆ మూడు ప్రాణాయామములందును, ఒక్కొక్క ప్రాణాయామము చేయునపుడు అధికారిపురుషుడు ప్రణవసహితముగ సప్తవ్యాహృతి యుక్తముగ. గాయత్రీమంత్రమును త్రివారముచ్చారణ చేయవలయును. మఱియు సన్న్యాసులలో గాయత్రీమంత్రత్రివారోచ్చారణమందు ఎన్ని అక్షరములు కలవో, అన్ని పర్యాయములు ప్రణవోచ్చారణ చేయవలయును. ఈ ప్రకారముగ చేయబడిన ప్రాణాయామము సర్వదోషనివృత్తిని గలుగజేయుచున్నది.

హే శిష్య! ఆధారచక్రమునుండి కుండలినీమార్గద్వారముగ పైకిపోయి ఆ ప్రాణవాయువును నాసికాద్వారముగ వదలి బాహ్యాకాశమందు లయింపజేయుటకు పేరు రేచకము. మఱియు కమలనాళముద్వారా నోటితో జలాకర్షణముచేయునట్లు, బాహ్యస్థితవాయువును నాసికద్వారా శరీరాంతరమునకు ఆకర్షణము చేయుటకు పేరు పూరకము. తప్తశిలపైపడిన జలబిందువులు యభావము పొందునట్లు. ప్రాణవాయువును బాహ్యగతినుండియు, అంతర్గతినుండియు, నిరోధముజేసి శరీరాంతరముననే లయము జేయుటకు పేరు కుంభకము.

హే శిష్య! శబ్దాదిపంచవిషయములను గ్రహణము చేయునట్టివైన, శ్రోత్రాది పంచజ్ఞానేంద్రియములను, తమతమ విషయములందు. మనస్సే ప్రవృత్తము చేయుచున్నది. ఆ చంచల మనస్సును ఆత్మవిచారబలముచే నిరోధముచేయుటకు పేరు ప్రత్యాహారము. అభిప్రాయము - ఎట్లు సూర్యకిరణములు సూర్యునికన్న భిన్నములు కావో అట్లే సంపూర్ణదృశ్యప్రపంచము చైతన్యాత్మకన్న భిన్నముకాదు. ఈ ప్రకారము గల దృష్టిచే మనస్సహిత యింద్రియముల నిరోధించుటకు పేరు ప్రత్యాహారము. "యద్యత్పశ్యతి, తత్సర్వం పశ్యేదాత్మానమాత్మని, ప్రత్యాహారస్సచ ప్రోక్తోయోగవిద్భిర్మహాత్మభిః" భావార్థము - యోగి యే పదార్థములను చూచుచున్నాడో, ఆ పదార్థములను ఆత్మరూపముగ గాంచుటకు పేరు ప్రత్యాహారమని మహాత్ములచే చెప్పబడియె. (యాజ్ఞవల్క్యుడు)

హే శిష్య! వేదబాహ్యమతమును వదలి వేదతాత్పర్యవిషయమైన అంతరాత్మ వస్తుచింతనమునకు నామము తర్కము. (ఈ తర్కలక్షణము సర్వత్రలేదు.) లోకమందే పురుషుడు చోరుని చూడలేదో, ఆ పురుషునకాచోరుడనర్థప్రాప్తి చేయుచున్నాడు. అట్లే యే పురుషుడు విచారదృష్టిచే మనస్సును చూడలేదో, ఆ విచారహీనపురుషునకే ఆ మనస్సు సంకల్పవికల్పరూప అనర్థప్రాప్తిని చేయుచున్నది. ఈ ప్రకారముగ విచారముచేసి ఆ మనస్సును అంతరాత్మయందు యుక్తముచేయుటకు పేరు ధారణ. ఏ యానందరూపాత్మయందు మనస్సు ధారణచేయబడినదో, ఆ యానందరూపాత్మయందే విజాతీయవృత్తి వ్యవధానరహితముగ నిరంతర తైలధారవలె సజాతీయవృత్తులయొక్క ప్రవాహము గావించుటకు పేరు ధ్యానము. ఏ అవస్థయందు అంతరాత్మస్వరూపానందగ్రహణముచే ధ్యాతృ, ధ్యాన ధ్యేయాదిసర్వద్వైతప్రపంచమునాదరింపబడుచున్నదో, ఆ యవస్థకు పేరు సమాధి. ఈ సమాధియొక్క మాహాత్మ్యము భగవంతునిచే యిట్లు చెప్పబడినది. "యం లబ్ధ్వా చాపరం లాభం మన్యతే నాధికం తతః" భావార్థము — విద్వాంసుడు ఆత్మస్వరూపానందమును, ప్రాప్తుడైన

పిదప దానికన్న యధికముగ ఏ యొక లాభమునున్ను చూడదు. — ఇపుడు యోగి పరిత్యాగము చేయవలసిన పదార్థముల నిరూపణము గావింపబడుచున్నది.

హే శిష్య! రోగి తన రోగనివృత్తికొఱకు అపథ్యపదార్థముల పరిత్యాగము చేయునట్లు, యోగియు తన యోగసిద్ధికొఱకు, భయము, క్రోధము, ఆలస్యము అను నీ మూటిని పరిత్యాగముచేసి అతినిద్రను, అతిజాగరణమును, అధికాహారమును నిరాహారమును పరిత్యాగము చేయవలయును. నిద్రాహారాదులను యుక్తముగ జేయవలయును ప్రాణాయామముయొక్క ప్రకారము వేదవేత్తలచే నీ రీతిగా చెప్పబడియె. యోగి మొదట తన దక్షిణనాసికను హస్తాంగుష్ఠముచే నిరోధముచేసి, వామనాసిక ద్వారా బాహ్యవాయువు నాకర్షించి, లోన ధారణముచేసి మఱల నా వాయువును దక్షిణ నాసికద్వారా మెల్ల మెల్లగా విడువవలయును. అట్లు వామనాసికను నిరోధించి, దక్షిణనాసికద్వారా గ్రహణము చేయబడిన వాయువును వామనాసికద్వారా విడువవలయును

హే శిష్య! ఈ పూరకాదిత్రివిధప్రాణాయామమును యోగి ప్రణవమంత్ర సహితముగ చేయవలయును ఈ ప్రణవమంత్రమునకు కాలము మాత్రలచే సిద్ధించుచున్నది. ఒకమాత్రచే పూరకము, రెండుమాత్రలచే రేచకము, నాలుగుమాత్రలచే కుంభకము చేయవలెను. పిదప మెల్లమెల్లగ నొక్కొక్క మాత్రను వృద్ధిచేయవలయును. అట సర్వత్ర పూరకమునకు ద్విగుణితమగు రేచకము. రేచకమునకు ద్విగుణితమగు కుంభకము చేయవలయును. ఇట మాత్రనామము కాలపరిణామమునకు కలదు. ఆ మాత్రపరిమాణార్థము అనేక శాస్త్రములందు అనేక ప్రకారములుగ చెప్పబడియె. మార్కండేయ పురాణమందు పదిరెండుమార్లు వ్యవధానరహితమగు నిమేషవ్యాపారమునకు యెంతకాలముపట్టునో అంతకాలమునకుపేరు "మాత్ర" యని వచింపబడినది. అథవా పదిరెండుమార్లు వ్యవధానరహితముగ హస్తతాళముగావింప కాలమెంత పట్టునో, దానికి పేరు మాత్ర, అథవా ద్వాదశ లఘ్వక్షరోచ్చారణకాలమునకు నామము మాత్ర. వసిష్ఠసంహిత – పదునారుమార్లు ప్రణవమంత్రమువావృత్తిచేయుట యందెంతకాలముపట్టునో, ఆ కాలమునకు నామము మాత్ర. యాజ్ఞవల్క్యుడు — వ్యవధానరహితత్రివారచోటికాముద్రాకాలము మాత్ర. (జానువుమీద మూడుసార్లు హస్తముత్రిప్పుటలో అథవా మూడుమారులు చేతితాళము వేయుటలోగల కాలమునకు పేరు ఛోటికాముద్ర) మాండూక్యోపనిషత్తునందును, ప్రశ్నోపనిషత్తునందును, అకార ఉకార మకార అర్ధమాత్రలను నీ నాల్గు అవయవములు మాత్రారూపముచే కథనము చేయబడియె. నాదబిందూపనిషత్తునందు అకారాది నాల్గుమాత్రలందు ఉదాత్త అనుదాత్త స్వరితములను మూడు అవయవములు కల్పనచేసి మాత్రలకు ద్వాదశ

భేదములు కథనము చేయబడియె. ఈ యాత్మపురాణమందో యాజ్ఞవల్క్యునిచే వచింప బడినరీతి మూడు హస్తతాళముల కాలమునకు పేరు మాత్రయని కథనము చేయ బడుచున్నది.

హే శిష్య! ప్రణవమంత్ర సహితముగ యోగులలో ఒక మాత్రచే ప్రాణాయా మానుష్ఠానముచేయువాడు ఆకాశతత్త్వమునకు, రెండుమాత్రలచే అనుష్ఠానము చేయువాడు వాయుతత్త్వమునకు, మూడుమాత్రలచే అనుష్ఠానముచేయువాడు అగ్ని తత్త్వమునకు నాలుగుమాత్రలచే అనుష్ఠానముచేయువాడు జలతత్త్వమునకు, పంచ మాత్రలచే అనుష్ఠానముచేయువాడు పృధ్వీతత్త్వమునకు, అధిపతియగుచున్నాడు. ఈ ప్రకారముగ ప్రాణాయామపృథగ్భ్యాసముచే యోగులకు ఆకాశాది పంచభూతజయ రూప ఫలప్రాప్తియగుచున్నది. హే శిష్య! మఱల యోగులాప్రణవమాత్రలందు యథాక్రమముగ శబ్దాదిపంచతన్మాత్రలను ఆరోపణముజేసి చింతనచేయవలయును. చింతనముచే ఆ యోగులకు నిర్విశేషబ్రహ్మరూపముచే చింతనముచేయుటకు యోగ్య మైన అర్ధమాత్రారూపప్రణవముయొక్క అభ్యాసము ప్రాప్తమగుచున్నది. ఆ పంచ తన్మాత్రధ్యానముయొక్క ప్రకారము — పృధ్వీతత్త్వధారణముచే పార్థివసంజ్ఞ పొందినదైన ప్రణవమును శబ్దాదిపంచతన్మాత్రాస్వరూపముగ ధ్యానము చేయవలయును. అట్లే జలనామవారుణప్రణవమును, ఆగ్నేయప్రణవమును, మారుతప్రణవమును ఆకాశప్రణవమును చింతనచేయవలయును. ఈ ప్రకారమగు అభ్యాసము చేయుటచే యెపుడు యోగియొక్క చిత్తము చంచలతారహితమై స్థిరమగునో, అపుడా యోగి అర్ధమాత్రారూపప్రణవమును బ్రహ్మరూపముగ చింతనచేయవలయును. అథవా ప్రాణాయామకాలమందు తమ తమ వ్యాపారయుక్త ప్రాణాపానాదులను ధ్యానము చేయవలయును. ఇపుడు ప్రాణముల సాధారణవ్యాపారమును వినుము — శరీరమం దనేక నాడులున్నను, ముప్పది ఆరువేల నాడులు ప్రధానములు. ఆ సమస్త నాడు లందు పంచప్రాణములు హంసమంత్రరూపమగు యొకే వ్యాపారము చేయుచున్నవి. "హం — సః" యీ మంత్రము హకార మకార అకార సకార విసర్గలను నీ పంచ అవయవములుగలదిగానున్నది. అన్యగ్రంథములందు హంసమంత్రముయొక్క సంఖ్య ఏకవింశతి సహస్రషట్శతమని చెప్పబడియె. ఐనను ఉపాధికృతభేదము లంగీకరించి ఆ మంత్రసంఖ్య ఏకలక్షత్రయోదశసహస్రఏకశతఅశీతి (113180) యగుచున్నది. పంచప్రాణములలో ఒక్కొక్క ప్రాణమునకు 21600 హంసమంత్రముల వ్యాపారము కలదు. కాన మొత్తము (21600 × 5 = 108000) ఏకలక్ష-అష్టసహస్రసంఖ్య అయినది. మఱియు ఏకసహస్రషట్త్రింశత్తమసంఖ్య (1036) గల నాడులలో పంచ

ప్రాణములు సంచరించుచున్నందున, ఆ సంఖ్యను అయిదుచే గుణించినపుడు పంచ సహస్ర ఏకశత అశీతి (5180) అగుచున్నది. మఱల అన్నియు చేరినపుడు పై చెప్పబడిన 113180 యను సంఖ్యయే సిద్ధించుచున్నది. ఇన్ని హంసమంత్రములు పంచ ప్రాణములకు సాధారణ వ్యాపారమైయున్నది. హే శిష్య! పాయుస్థానమునుండి కంఠపర్యంతము ఏ అంతరఛిద్రముకలదో, ఆ ఛిద్రము ముప్పది అంగుళముల పరిమాణము కలది. ఆ ఛిద్రమందుండి ఆ ప్రాణాది పంచవాయువులు హంసమంత్రోచ్చారణము చేయుచున్నవి. మంత్రవ్యాపారము చేయునవియైన పంచప్రాణములందును ముఖనాసికలయందు సంచారముచేయు వాయువు ప్రధానముగనున్నది. అందువలన శాస్త్రవేత్తలు దానిని ప్రాణమనుచున్నారు. తక్కిన వాయువులు మంత్రవ్యాపారమునందు గౌణముగా నుండుటవలన వాటిని అపానవ్యానాదులనుచున్నారు. ప్రాణములకు స్థానములు — ప్రాణము హృదయస్థానము గలది, రక్తవర్ణము, అపానము పాయుస్థానముగలది అత్యంతరక్తవర్ణము. సమానము నాభిస్థానముగలది, శ్వేతవర్ణము. ఉదానము కంఠస్థానముగలది, కించిత్పాండువర్ణము, వ్యానము సర్వశరీరస్థానము గలది, అగ్నిశిఖాసమానవర్ణము. (వాయువులకు సహజవర్ణములేకుండినను, ఉపాసన కొఱకట్లు చెప్పబడినది.) హే శిష్య! జ్ఞానశక్తిగల మనస్సు, క్రియాశక్తిగల ప్రాణము రెండును ఒకే శరీరమందు కలవు. బయటకు పోయినపుడుకూడ ఒకదానినివిడచి మరొకటిపోదు. 'సహ హి ఏతే సముత్క్రామతః సహ తిష్ఠతః" భావార్థము — మనస్సు, ప్రాణము ఒకేచోట నిలుచుచున్నవి. రెండును చేరి పోవుచున్నవి. (ఈ సంగతి ద్వితీయాధ్యాయమందును కలదు.) ఈ ప్రకారము మనస్సు ప్రాణమునకును సహచారస్వభావము నెఱిగి యోగిపురుషుడు తచ్చింతనము చేయవలయును.

బ్రహ్మలోకమునకు మార్గము

హే శిష్య! ఈ శరీరమునందు మూలాధారమునకుపైన నాభిచక్రము, నాభిచక్రమునకుపైన హృదయకమలము కలదు. ఆ హృదయకమలము సుషుమ్నానాడీ రూపమార్గముచే సంబద్ధమైయున్నది కనుక ఆ హృదయకమలము బ్రహ్మలోకమునకు ద్వారమై యున్నది సుషుమ్నానాడి ప్రాణమునకును మనస్సునకును మార్గమైయున్నది. ఆ సుషుమ్నామార్గము దశమద్వారమును పొందుచున్నది. సూర్యమండలమందును చంద్రమండలమందును స్థితమైన బాహ్యఛిద్రముతో దశమద్వారమునకు అభేదము కలదు.

హే శిష్య! తీవ్రవైరాగ్యములేని యోగి ఆ సుషుమ్నానాడీద్వారా బ్రహ్మలోకమునకుపోయి అచ్చట వైరాగ్యమునుపొంది మోక్షమును పొందుచున్నాడు. వైరాగ్యము

కలవారు ఆ మార్గముచే బయటకు వచ్చినపుడే విదేహమోక్షమును పొందుచున్నారు. హంసమంత్రరూపవ్యాపార యుక్తప్రాణముల ధ్యానమునకును యిదే ఫలము కలదు.

హే శిష్య! ప్రణవమంత్రసహితముగ ప్రాణాయామముచేసినపుడు అకారాది నాలుగుమాత్రలకు వైశ్వానర, హిరణ్యగర్భ ఈశ్వర, తురీయమను అర్థమును చింతన చేయవలయును ఎట్లు లోకమందు రథము వాంఛితగ్రామమును ప్రాప్తింపచేయు చున్నదో, అట్లు అధికారికి ప్రణవమంత్రరూపరథమున్ను వాంఛితలోకప్రాప్తిని కలుగజేయుచున్నది. విష్ణుభగవంతుడు ఆ రథమునకు సారథియైయున్నారు. ఆ రథమును సారథిని ధ్యానము చేయవలయును. ఆ ప్రణవరూపరథముచే సకామపురుషునకు హిరణ్యగర్భరూపసగుణబ్రహ్మప్రాప్తి యగును, నిష్కామపురుషునకు నిర్గుణ బ్రహ్మప్రాప్తియగును. కనుక హిరణ్యగర్భుని శుద్ధబ్రహ్మమును అధికారులు తమ గంతవ్యస్థానరూపముగ ధ్యానము చేయవలయును.

హే శిష్య! యీ ప్రకారమగు యోగాభ్యాసము చేయుటయందు, అధికార పురుషులకు నానా ప్రకార విఘ్నములు వచ్చుచున్నవి. తన్నివృత్త్యర్థమువారు "నేను రుద్రరూపుడను" అను నీ ప్రకారము అభేదరూపముగ రుద్రభగవంతుని ధ్యానము చేయవలయును. ఆ రుద్రభగవంతుని ధ్యానముచే సర్వవిఘ్నములు నివృత్తములగును.

హే శిష్య! ఆ ప్రాణాయామప్రసంగమందు పాదాంగుష్ఠాగ్రభాగమునుండి ప్రాణమును పైకి ఆకర్షణముచేయుట అత్యంతకష్టతరము అందువలన, ఆ యాకర్షణము శాస్త్రమందు సూక్ష్మనామముచే కథనము చేయబడియె. మఱియు యా అంగుష్ఠముకంటె మూలాధారమునుండి ప్రాణమును పైకి ఆకర్షణముచేయుట సుగమము. కనుక ఆ యాకర్షణము స్థూలమనబడియె. ఆ మూలాధారమునుండి నాభిచక్రము నుండి పైకి ఆకర్షణము అత్యంతసుగమము. కనుక ఆ యాకర్షణము అతిస్థూల మనబడియె. ఇపుడు యోగాభ్యాసఫలనిరూపణము చేయబడును

హే శిష్య! పై చెప్పిన ప్రకారముగ యోగాభ్యాసముచేయు యోగికి మూడు మాసముల అనంతరము దూరదేశస్థితవిషయజ్ఞానము, నాలుగుమాసముల అనంతరము ఇంద్రాదిదేవతలదర్శనము అయిదు మాసముల అనంతరము సమస్తవిషయముల యందు వైరాగ్యము, ఆరు మాసముల అనంతరము శుద్ధాంతఃకరణముగలవాడై సర్వ కర్మములను సన్యసించి ఆత్మసాక్షాత్కారముకొఱకు శ్రోత్రియబ్రహ్మనిష్ఠుడగు గురువు యొక్క సన్నిధికి బోయి ఆత్మసాక్షాత్కారమును పొందును. ఇపుడు జీవన్ముక్తుని లక్షణము వచింపబడుచున్నది — జీవన్ముక్తుడగు యోగి సర్వపదార్థములయందును

అధిష్ఠానరూపముగ ఆత్మను చూచుచున్నాడు. అందువలన ఆ యోగి నేత్రాదీంద్రియ ములచే రూపాదివిషయములు చూచుచున్నను, చూచుటలేదు. తన శరీరమును శుష్కకాష్ఠసమానముగ ఉపేక్ష చేయును.

హే శిష్య! యిటువంటి జీవన్ముక్తి రూపఫలము ప్రాప్తమైన తరువాత ఉపాయ మునకు, యేయొక్క ప్రయోజనము లేదు. నదిని దాటినతర్వాత మనుజుడు నౌకను పరిత్యాగము చేయునట్లు అధికారి పురుషుడును, జీవన్ముక్తి రూప ఫల ప్రాప్తి యగుటచే క్లేశ పరిశ్రమ రూప సకలోపాయములను పరిత్యాగము చేయుచున్నాడు. హే శిష్య! యిది అమృతనాదోపనిషదుక్తమగు యోగపద్ధతి,

ఇక నిపుడు హంసోపనిషదుక్తయోగమార్గము చూపబడుచున్నది హే శిష్య! యీ శరీరమందు ఆధార, స్వాధిష్ఠాన, మణిపూరక, అనాహత, విశుద్ధ, ఆజ్ఞలను షట్చక్రములు గలవు.

ఆధారచక్రము — పాయుస్థానముకన్న రెండంగుళములు పైన నాల్గు దళ ములు గలదిగాను, లాక్షారస సమాన వర్ణముగలదిగానున్నది. ఆ నాల్గుదళములందు ప్రదక్షిణ క్రమముగ వం, శం షం, సం, అను నీ నాలుగక్షరములు స్థితమైయున్నవి. ఆ నాలుగక్షరములచే విరాజితమై ఈ చక్రము కుండలినీరూపసర్పిణియొక్క పుచ్ఛముచే యుక్తమై మూషకవాహనుడైన గణాధిపతితో గూడినదై యున్నది

స్వాధిష్ఠానచక్రము — ఆధారచక్రమునకు పైన ఉపస్థమూలదేశమందు షడ్దళ ములుగాను సువర్ణవర్ణముగాను అత్యంతతేజస్వినై యున్నది. ఆ చక్రసంబంధ షడ్దళ ములమీద, బం, భం, మం, యం, రం, లం, అను నీ షడక్షరములు విరాజిల్లు చున్నది. అందు ప్రజాపతియను దేవతగలదు. మణిపూరకచక్రము — స్వాధిష్ఠాన చక్రమునకుపైన నాభిస్థానమందు దశదళములుగలదై యింద్రనీలవర్ణసమానమై సూర్యచంద్రసమాన తేజముగలదై దశదళములమీద డం, ఢం, ణం, తం, థం, దం, ధం, నం, పం, ఫం, యనునీదశాక్షరములచే విరాజితమై విష్ణుదేవతాయుక్తమై యున్నది.

అనాహతచక్రము — మణిపూరకచక్రమునకు పైన హృదయదేశమందు గోదుగ్ధవర్ణ సమానముగాను, ద్వాదశదళములు గలదిగాను, కం, ఖం, గం, ఘం, ఙం, చం, ఛం, జం, ఝం, ఞం, టం, ఠం, ద్వాదశాక్షరములచే విరాజమానమై రుద్ర దేవతాయుక్తమైయున్నది.

విశుద్ధచక్రము — అనాహతచక్రముపైన కంఠదేశమందు యీ విశుద్ధచక్రము కలదు ఇది విచిత్రవర్ణము గలదిగాను, షోడశదళములుగలదిగాను అ మొదలగు షోడశస్వరములచే విరాజమానమై జీవాత్మకు వాసస్థానమైయున్నది. ఆజ్ఞాచక్రము —

విశుద్ధచక్రముమైన రెండు భ్రువులమధ్యమందు కించిద్రక్తవర్ణము గలదిగాను ద్విదళ యుక్తముగాను సూర్యచంద్రసమానమై హం క్షం అను రెండక్షరములచే విరాజమానమై పరమాత్మదేవుని స్థానమైయున్నది.

హే శిష్య! మస్తకమందు సహస్రదళములుగల పద్మము కలదు. పద్మగర్భమందు అమృతవృష్టిచేయువాడైన చంద్రుడుకలడు ఆ పద్మసంబంధ కర్ణికదళమద్వారము ను పొందినది. పూర్వోక్తషట్చక్రములు ఆ పద్మామృతముచే తృప్తములైయున్నవి. జీవాత్మ ఆ పద్మసంబంధహంసయై యున్నాడు ఎట్లు లోకమందు పక్షికి శబ్దోచ్చారణ సమానముగ నామము కలుగుచున్నదో, దృష్టాంతము 'కా కా' యను శబ్దముచేయు పక్షికి కాకమనిపేరు) అట్లే యీ జీవాత్మయు, హృదయకమలమందును, ఆధార చక్రాదులయందును స్థితుడై రాత్రిందివములందు యిరువది ఒక్కవేలా ఆరువందలు శ్వాసప్రశ్వాసరూప హంసమంత్రమును ఉచ్చారణము చేయుచున్నాడు. అచట హకారముచే ప్రాణవాయువు ముఖనాసికలద్వారా బయటకు పోవుచున్నది. మఱియు సకారముచే మఱల లోపలికి వచ్చుచున్నది ఈలాగున సర్వదా హంసమంత్రోచ్చారణ చేయుటవలన శ్రుతిభగవతి జీవాత్మను హంసనామముచే కథనము చేయుచున్నది.

ఇపుడు ధ్యానమునకై హంసపక్షివర్ణనము గావింపబడుచున్నది. హంసశబ్దార్థ సిద్ధికొఱకు వేదవేత్తలు జీవాత్మను పక్షిరూపముగ వర్ణనముచేసిరి. అటభోక్తృరూపమగు అగ్ని భోగ్యరూపమగు సోమము — యివిరెండును జీవరూపహంసపక్షికి రెండు పక్షములైయున్నవి. ఓంకారరూపప్రణవమంత్రము ఈ హంసపక్షికి శిరస్సున్ను, మూలశక్తిసంబంధ క్రియాశక్తిగలదైన పరిణామవిశేషము హృదయమున్ను నైయున్నది. ఎట్లు సూర్యాగ్నిసోమరూప త్రినేత్రములుగలిగి శ్రీ మహదేవుని ముఖముగలదో అట్లే సూర్యాగ్ని సోమములను త్రినేత్రములుగల్గి ఈ హంసకు ముఖము గలదు. మఱియు ఈ హంసకొక చరణము రుద్రరూపముగాను ఒక చరణము రుద్రాణిరూపముగా నున్నది. త్వంపదార్థజీవరూపహంసమే తత్పదార్థపరబ్రహ్మరూపమై యున్నది. అట నిరుపాధికదృష్టిచేత జీవరూపహంసము నిర్గుణబ్రహ్మరూపముగనున్ను, సోపాధిక దృష్టిచేత సగుణబ్రహ్మరూపమున్ను నైయున్నది. మఱియు ఆ సగుణబ్రహ్మమున్ను, వామభాగమందు అగ్నిరూపముగాను, దక్షిణభాగమందు సోమరూపముగానున్నది. ఆ జీవరూపహంసము కోటిసూర్యసమానతేజముగలదై, నఖమునుండి శిఖపర్యంతము సకలశరీరములందు నిండియున్నది. హే శిష్య! ఈ జీవరూపహంసము సకల శరీరములందుండినను హృదయకమలమందు విశేషముగ స్థితమైయున్నది. ఆహృదయ కమలమునకు పూర్వాది అష్టదిశలప్రక్కన అష్టదళములుగలవు. అట మనోయుక్తమైన ఆ జీవరూపహంసము పూర్వదిగ్దళముమీద స్థితమైనపుడు జీవులకు పుణ్య

కర్మలయందు బుద్ధిగల్గును. ఆగ్నేయదళముమీద స్థితమైనపుడు నిద్రాలస్యాది వికారములు జనించును. దక్షిణదళముమీద స్థితమైనపుడు క్రోధాదివికారములుపుట్టును. నైఋతదళముమీద స్థితమైనపుడు పాపబుద్ధి కలుగును. పశ్చిమదళముమీద స్థితమైనపుడు నానా వ్యవహారములందు ప్రీతి జనించును. వాయవ్యదళముమీద స్థితమైనపుడు విదేశగమనేచ్ఛగల్గును ఉత్తరదళముమీద స్థితమైనపుడు స్త్రీసంభోగమున ప్రీతిగల్గును. ఈశాన్యదళముమీద స్థితమైనపుడు దానమందు ప్రీతిగల్గును. అష్టదళములకుమధ్యప్రదేశమందు స్థితమైనపుడు, ఎట్లుప్రసిద్ధ హంసపక్షిక్షీరనీర విభాగము చేయుచున్నదో, అట్లు ఈ జీవుడున్ను సత్యాసత్యవిచారముచేసి సర్వవిషయ సుఖములనుండి వైరాగ్యమును పొందును. హృదయసంబంధ కేసరములమీద స్థితమైనపుడు, జాగ్రదవస్థనుపొందును. కమలసంబంధ కర్ణికయందు స్థితమైనపుడు స్వప్నావస్థనుపొందును. కమలకర్ణికమధ్య స్థిత రక్తవర్ణ రుధిర పిండముమీదస్థితమైనపుడు సుషుప్త్యవస్థనుపొందును. "నేను బ్రహ్మరూపుడ" నను నీ ప్రకారమగు పూర్ణదృష్టిచే పరిచ్ఛిన్నమైన హృదయకమలసంబంధ అభిమానమును పరిత్యాగము చేసినపుడు తురీయావస్థను పొందును. హే శిష్య! జాగ్రదాదిఅవస్థాత్రయముల కంటెను అతీతమగు తురీయావస్థ యేది చెప్పబడినదో, ఆ తురీయావస్థయందు, ఆత్మరూపజ్ఞేయవస్తువు జ్ఞాతరూపయోగికన్న భిన్నమై ప్రతీతమగును. ఇది (సంప్రజ్ఞాత లక్షణము) ఆ యోగి యోగాభ్యాసబలముచే, సంప్రజ్ఞాతసమాధిని, అసంప్రజ్ఞాత సమాధిని పొందుచున్నాడు. అట ఏ సమాధియందు జ్ఞాతృ జ్ఞాన జ్ఞేయ రూపత్రిపుటి ప్రతీతమగునో, అది సంప్రజ్ఞాతసమాధి. ఏ సమాధియందాత్రిపుటి ప్రతీతముకాదో అది అసంప్రజ్ఞాతసమాధి. త్రిపుటిభావముండువఱకు తురీయావస్థయగును. త్రిపుటి బ్రహ్మరూపనాదమందు లయభావమును పొందునపుడు ఆ యోగి తురీయాతీతుడన బడును. అభిప్రాయము — ఓంకారరూపప్రణవమందు, అకార ఉకార, మకార బిందునాదములను నీపంచావయవములు గలవు. అట అకారాది మకారాంతమగు మూడవయవములు విశ్వతైజసప్రాజ్ఞులకు వాచకములు. మఱియు అర్ధమాత్రారూపమైన బిందునాదములు రెండును బ్రహ్మమునకు వాచకములు. ఈ రెంటిలోనూ బిందువు సవిశేషబ్రహ్మమునకు వాచకముగాను, నాదము నిర్విశేషబ్రహ్మమునకు వాచకముగాను నున్నది. ఇటువంటి తురీయావస్థాతీతబ్రహ్మపదము అనేక విరక్త పురుషులయందెవనికో యొకనికి ప్రాప్తమగును గాని అందఱికిని ప్రాప్తముగాదు. భగవంతుడున్ను యిట్లు వచించెను.

"మనుష్యాణాం సహస్రేషు కశ్చిద్యతతి సిద్ధయే
యతతామపి సిద్ధానాం కశ్చిన్మాం వేత్తి తత్త్వతః॥"

భావార్థము — సహస్రావధి వేలకొలది మనుష్యులందొకానొకడు నన్ను పొందుట కొఱకు యత్నము చేయుచున్నాడు. ఆ ప్రయత్నము చేయువారైన, అనేక మనుష్యు లలో, యెవడో ఒకడే నన్నెఱుగుచున్నాడు.

హే శిష్య! ఆ యోగి పూర్వోక్తరీతిగా షట్చక్రసహితముగ హంసచింతనము చేసి, బ్రహ్మరూపనాదచింతనము చేయవలయును. అట ఆధారచక్రమునుండి దశమ ద్వారపర్యంతము వ్యాపకరూపముగ, అత్యంతశ్వేతరూపముగ బ్రహ్మమును చింతనము చేయవలయును. ఈ ప్రకారముగ బ్రహ్మమందు ఏకాగ్రముగచేసి ఆ యోగితనపాయు ఉపస్థలను రెండుద్వారములను సంకోచముచేసి, అనంతరము తన పాదాంగుష్ఠాగ్ర భాగమునుండి ప్రాణవాయువును పైకి ఆకర్షణముచేసి మొదట ఆధారచక్రమందు అనంతరము మెల్ల మెల్లగ స్వాధిష్ఠానచక్రమందు స్థాపనముచేసి, ఆ స్వాధిష్ఠాన చక్రమునకు మూడుప్రదక్షిణముల జేయించి అచటనుండి నా ప్రాణవాయువును మణిపూరకచక్రమందు స్థాపనముచేసి ఆ మణిపూరకమునుండి అనాహతచక్రమందు, అనాహతమునుండి విశుద్ధచక్రమందు, విశుద్ధచక్రమునుండి ఆజ్ఞాచక్రమందు స్థాపనముచేసి, అనంతరము ప్రాణవాయువును, దశమద్వారమందు స్థాపనము చేయ వలయును. హే శిష్య! ఈ ప్రకారముగ ఏ యోగి యోగాభ్యాసబలముచే ప్రాణ వాయువును పైకి తీసుకొనిపోయి హంసరూపమును ధ్యానము చేయుచున్నాడో, మఱియు బ్రహ్మరూపనాదమును ధ్యేయరూపముగ చింతన చేయుచున్నాడో, ఋషి, ఛందస్సు, దేవత, యిత్యాదియుక్తహంసమంత్రమును, ఏకకోటిసంఖ్యగా జపము చేయుచున్నాడో, ఆ యోగి శరీరమందపుడు యోగఫలసిద్ధియందు విశ్వాసము జనింప జేయు. చిణి, చిణి. చిణి. ఘంటా, శంఖ, తంత్రి, తాళ, వేణు, భేరీ, మృదంగ, మేఘము ను నీ దశవిధనాదములు పుట్టుచున్నవి.

హే శిష్య! ఆ దశనాదములందును మేఘనాదమును మాటిమాటికి అభ్యాసము చేయువాడైన యోగి వైరాగ్యజ్ఞానాదులను పొందును. కనుక యోగులు యితర నాదములను పరిత్యాగముచేసి, మేఘనాదమునే నిరంతర మభ్యాసము చేయవలయును. ఆ యభ్యాసముచే యోగియొక్క పుణ్యాపాపసంకల్పవికల్ప మనోధర్మములు లయభావ మును పొంద అపుడానంద స్వరూపాత్మ స్వప్రకాశ చైతన్యరూపముగ వానికి ప్రత్యక్ష మగును. ఇది హంసోపనిషత్తు.

ఇపుడు క్షురికోపనిషత్తు నిరూపింపబడుచున్నది. హే శిష్య! 'క్షురిక' యని కత్తికిపేరు ఆ క్షురిక శస్త్రమువలె సంసారబంధచ్ఛేదము చేయునట్టి ధారణము కథనము చేయుటవలన వేదవేత్తలీ యుపనిషత్తునకు క్షురికనామమును పెట్టిరి.

హే శిష్య! షట్చక్రములఛేదనముచేసి, యోగులు మనోరూపఖడ్గముచే దేహాభిమానాది బంధనముల గల్గజేయునవైన ఏకర్మములు గలవో, వాటిని ఛేదనము చేయవలయును. లోహమయమైన ఆ మనోరూపఖడ్గమును, సగుణనిర్గుణబ్రహ్మమును కథనము చేయునట్టి బ్రహ్మవిద్యారూపమగు సానమీద ఘర్షణముచేసి, చక్కగా నిర్మలమైన యద్దానిచే యోగులు ప్రతిబంధక కర్మములను ఛేదనము చేయవలయును. హే శిష్య! ఆ నిర్మల మనస్సుచే వశము చేయబడదగిన తీక్ష్ణధారగల ప్రాణవాయురూపఖడ్గముచే యోగి తన పాదతలముపైన స్థితమైన అంగుష్ఠగుల్ఫాది మర్మములను ఛేదనము చేయవలయును. మఱియు యింద్రవజ్రసమానముగ దుర్భేద్యమైన జంఘస్థితమర్మములను ధ్యాన బలముచే ఛేదనము చేయవలయును. ఏ మర్మములయొక్క ఛేదనమైనపుడు మృత్యువు ప్రాప్తమగునో, అటువంటి ఊరుస్థానసంబంధమర్మములను, యోగి త్రికాలాభ్యాసముచే, ఛేదనము చేయవలయును. ఈ ప్రకారముగానే, పాయు శిశ్న, కంద, నాభి, హృదయకమల, కంఠాదిస్థానములందు గల సకలమర్మములను, యోగబలముచే ఛేదనము చేయవలయును.

హే శిష్య! యీ ప్రకారముగ మర్మముల ఛేదనముచేసి, యోగులు నాడులను ఛేదనము చేయవలయును ఈ శరీరమందు ఏకశత ఏక ప్రధాన నాడులు గలవు. వాటిలో నొక్కొక్కనాడికి డెబ్బదిరెండు (72) శాఖారూప ఉపనాడులునుగలవు. ఆ సర్వ నాడులందును సుషుమ్నయనునాడి ప్రధానము ఆ నాడి దశమద్వారమును పొందియున్నది. ఆ సుషుమ్నానాడియందు తన ప్రాణమును ప్రవేశపెట్టి యోగులు యితర సర్వనాడుల ఛేదనము చేయవలయును. 'నేను యీ మర్మమందును యీ నాడియందును స్థితుడను కాను' అను నీ ప్రకారమగు బోధనుగూర్చిన నిశ్చయమే అనాదిమర్మములయొక్క ఛేదనమైయున్నది. దానివలన ఆయోగులు యీ జన్మమందుగాని అన్యజన్మమందుగాని వైరాగ్యమునుపొంది ఆత్మజ్ఞానముద్వారా మోక్షమునుపొందుదురు.

హే శిష్య! ఈ ప్రకారమగు యోగాభ్యాసముయొక్క బలముచే ఏ యోగి యొక్క చిత్తము వైరాగ్యమును పొందుచున్నదో, ఏయోగి సర్వదా యేకాంతనివాసము చేయుచున్నాడో. ఏ యోగి సర్వసంగరహితుడో, ఏయోగి యోగసంబంధ సర్వాంగముల నెఱింగినవాడో, అటువంటియోగి పూర్వోక్తసాధనాపేక్షలేకయే, మెల్లమెల్లగా మోక్షమును పొందుచున్నాడు. ఎట్లుపాశముచే కట్టబడిన హంసపక్షి పాశముల ఛేదనముజేసి చేసి నిశ్శంకముగ ఆకాశమందెగురుచున్నవో, అట్లే యోగియు, నాడీ రూపపాశములను ఛేదనముచేసిచేసి, బ్రహ్మలోకమునకుపోయి మోక్షమును పొందుచున్నాడు. అథవా అగ్న్యాది విశేషతేజములు కాష్ఠాదియింధనములను దహించి

తమసామాన్యతేజోభావమును పొందుచున్నవో, అట్లే యోగియు తన అభ్యాసబలముచే సర్వకర్మములనుదహించి, బ్రహ్మభావరూపమగు మోక్షమును పొందుచున్నారు.

హే శిష్య! ఈ ప్రకారముగ క్షురికోపనిషదర్థమును నీకుచెప్పితిని, ఇక నిపుడు, జాబాలోపనిషత్తుయొక్క చతుర్థఖండమునందు కథనముచేయబడిన పరమ హంస సన్న్యాసగ్రహణముయొక్క కాలమునుగూర్చి చెప్పెదను వినుము.

హే శిష్య! సకలాధికారులకును సర్వావస్థలయందును పరమహంససన్న్యాస గ్రహణముచేయుటయందు వైరాగ్యమే ముఖ్యకారణమై యున్నది. వైరాగ్యములేక సన్న్యాసగ్రహణముకాదు. కాబట్టి వైరాగ్యమే పరమహంససన్న్యాసగ్రహణమునకు కాలమైయున్నది. శ్రుతి "యదహరేవ విరజేత్తదహరేవ ప్రవ్రజేత్" భావార్థము. అధికారి పురుషునకు బాల్యావస్థయందుగాని, వృద్ధావస్థయందుగాని యేదినమందు యేక్షణమందు తీవ్రవైరాగ్యము పుట్టునో, అక్షణమందే సన్న్యాసగ్రహణము చేయ వలయును. తీవ్రవైరాగ్యములేక సన్న్యాసమునుగూర్చిన సంకల్పమైనచేయకూడదు. ఈ కారణమువలననే వేదవేత్తలచే సన్న్యాసగ్రహణమునకు వైరాగ్యమే కాలమని చెప్ప బడియె. ఆ వైరాగ్యోత్పత్తికొఱకు పూర్వముగర్భదుఃఖవిచారము, మరణకాలజ్ఞానము, యోగాభ్యాసకాలము యీ మూడుకారణములు చెప్పబడియె. అట్లే నానాప్రకార ఉపనిషత్తులందు నానాప్రకార ఉపాసనలున్ను వైరాగ్యోత్పత్తికొఱకే చెప్పబడియె.

శిష్యుడు:— హే భగవన్! ఉపాసన సాక్షాత్తుగ ముక్తికి సాధనమేల కాకూడదు.

గురువు — హే శిష్య! ఉపాసన విపరీతజ్ఞానరూప అధ్యాసముచే జన్యమై యున్నది. కనుక ఉపాసనలందు సాక్షాన్ముక్తికి కారణత సంభవింపదు. ఎట్లు నామ, రూప, క్రియ, స్థాన, గుణములను నీయైదున్ను లేని ఏ అద్వితీయబ్రహ్మము కలదో, ఆ అద్వితీయబ్రహ్మమునకు "ఉత్" నామము, సువర్ణసమానరూపము, ఊర్ధ్వలోకపాలనక్రియ, ఆదిత్యమండలస్థానము, సర్వముకన్న శ్రేష్ఠమైనగుణము ఆరోపింపబడుచున్నవి. ఈ ప్రకారము నిర్గుణబ్రహ్మమునందు, నామరూపాదుల ఆరోపణముచే, సర్వత్ర యుపాసన సంభవించుచున్నది. కనుక ఆ సమస్త ఉపాసనలు విపరీతజ్ఞానరూప అధ్యాసముచే జన్యములైనవి. హే శిష్య! ఆ యుపాసన లనేక ప్రకారములుగ నున్నవి. అట యుపనిషత్తులందు యెన్నియో స్థలములందు సాక్షాద్బ్ర హ్మముయొక్క ఉపాసన చెప్పబడియె. ఎన్నియో స్థలములందు బ్రహ్మసంబంధ విభూతుల ఉపాసన చెప్పబడియె. ఆ విభూతులందును యెన్నియోవిభూతులు కారణ

రూపములై యున్నవి. అవి సమష్టిరూపములై అధిదైవరూపములగుచున్నవి. (హిరణ్యగర్భ విరాట్ ఆదిత్యాదుల ఉపాసనలవలె) కొన్ని విభూతులు కార్యరూపములై అధ్యాత్మరూపములగుచున్నవి. (మనః ప్రాణవాగాదుల ఉపాసనలవలె) ఆ కారణ కార్యరూపవిభూతులకును, బ్రహ్మరూపములచే ఉపాసన చెప్పబడియె. మఱియు ఎన్నియో స్థలములందు, ప్రణవాదిమంత్రములకును, బ్రహ్మరూపమంత్రార్థములకును తాదాత్మ్యరూపముచే ఉపాసన చెప్పబడియె. ఆయుపాసనాదులున్ను ద్వివిధములై యున్నవి. అట ఒక ఉపాసనయందో, ప్రణవాదిమంత్రములు ప్రధానముగాను, బ్రహ్మరూపార్థము గౌణముగాను గలదు. ఇంకొక ఉపాసనయందు ప్రణవాది మంత్రములు గౌణములుగాను బ్రహ్మరూపమంత్రార్థము ప్రధానముగాను గలదు. అధర్వశిర, యోగశిఖ, పూర్వతాపనీయ, ఉత్తరతాపనీయ, మాండూక్య, ఆత్మబోధ, ద్వివిధనారాయణ, అమృతనాద, అమృతబిందు, యిత్యాది ఉపనిషత్తులందు, ప్రణవాదిమంత్రములకు ప్రధానరూపముగాను, తదర్థములకు గౌణరూపముగాను, ప్రశ్న, ముండక, బృహదారణ్యక, ఛాందోగ్య, కఠవల్లి యిత్యాది ఉపనిషత్తులందు ప్రణవార్థమునకు ప్రధానరూపముగాను ఉపాసన చెప్పబడియె. మఱియు రుద్రాధ్యాయమందును, మండలబ్రాహ్మణమునందును, పురుషసూక్తమందును, స్తుతి, రహస్యనామ, మంత్రములను నీమూడింటి సహితముగ బ్రహ్మోపాసన చెప్పబడియె. ఈ ప్రకారముగ నాల్గువేదములలోన యెన్ని ఉపనిషత్తులుగలవో సమస్త ఉపనిషత్తులందును, అనేక ప్రకారఉపాసనలు చెప్పబడియె. ఆ యన్ని ఉపాసనలును వైరాగ్యమునకు కారణములైయున్నవి.

శిష్యుడు — హే భగవన్! అధికారులకు తమ ఆత్మరూపముగ నిర్గుణ బ్రహ్మమును బోధన చేయుటకై ప్రవృత్తములైన సకలోపనిషత్తులందు నానాప్రకార ఉపాసనల గూర్చిన కథనము అసంగతము.

గురువు — హే శిష్య! ఆ ఉపనిషత్తులు నిర్గుణ బ్రహ్మమునే కథనము చేయుచున్నవి. ఆ నిర్గుణ బ్రహ్మము ఏ పురుషుని బుద్ధియందు జొరబడదో అట్టి మందబుద్ధి గలవారైన నానాప్రకార అధికార పురుషులయెడ అనుగ్రహము చేయుటకొఱకు ఆ యుపనిషత్తులు స్థూలారుంధతీ న్యాయమనుసరించి నానాప్రకారము బ్రహ్మమును వర్ణన చేసి ఆ మందబుద్ధులగు పురుషుల చిత్తమందు నిర్గుణ బ్రహ్మముయొక్క జ్ఞానమును కలిగించుచున్నవి. కనుక ఉపనిషత్తులందు నానాప్రకారోపాసనల వర్ణనము అసంగతము కాదు. బ్రహ్మము సర్వదా ఏకరసమగుటవలన అద్వితీయ బ్రహ్మమునకు నామరూపములతో సహా వర్ణనము సంభవింపదు. గురువు — హే శిష్య!

ఆ యద్వితీయ నిర్గుణ బ్రహ్మము అధిష్ఠానరూపముచే సర్వజగత్తునకు ఆత్మరూపమై యున్నది. ఎట్లు రజ్జు రూపాధిష్ఠానమునందు ఇదమంశము కల్పిత సర్పాదులందు అనుగతమై ప్రతీతమగుచున్నదో అట్లే అధిష్ఠానరూప బ్రహ్మమున్ను తన సత్యరూపముచే సర్వజగత్తునం దనుగతమై ప్రతీతమగుచున్నది. ఆ కల్పిత జగద్రూపోపాధి సంబంధముచే నిర్గుణ బ్రహ్మము నుపనిషత్తులు నామ, రూప, క్రియా స్థాన, గుణములను నీ పంచ రూపములచే విశిష్టముగా కథనము చేయుచున్నవి. ఈలాగున కల్పితోపాధి సంబంధముచే అయద్వితీయ బ్రహ్మమునకు నానారూపము సంభవించుచున్నది.

హే శిష్య! నామాదిపంచ గుణవిశిష్ట సవిశేష బ్రహ్మమును బోధన జేయుటయందు ఉపనిషత్తుల ప్రవృత్తి ఏది గలదో, ఆ ప్రవృత్తియు ద్వివిధము. ఒకటి నామ రూపాదుల అనిషేధపూర్వక ప్రవృత్తి, మఱియొకటి నామరూపాది ఉపాధులను త్యజించి నిర్గుణ బ్రహ్మము నెఱుగుట. ఈ యభిప్రాయమును మనస్సులో నుంచుకొని యుపనిషత్తులు సవిశేషబ్రహ్మ మాత్రమును కథనము చేసి నిర్విశేష బ్రహ్మకథనము నుండి ఉపరామమును పొందుచున్నవి. ఈ ప్రకారము మొదట సవిశేషబ్రహ్మమును కథనము చేసి తరువాత ఈ యధికారి పురుషులు మా యుపదేశములేక నిర్విశేష బ్రహ్మము నే రీతిగ నెఱుగుదురు? ఏ రీతిగను ఎఱుగరు అని యిట్లాలోచించి అధికారి జనులపై అత్యంత కరుణ గల్గి ఆ యుపనిషత్తులు నామరూపాది సకలోపాధుల నిషేధము చేసి పలుమారు ఆ నిర్విశేషబ్రహ్మమునే కథనము చేయుచున్నవి హే శిష్య! ఆ రెండవ ప్రవృత్తిని అంగీకారము చేసి నిర్గుణబ్రహ్మమును కథనము చేసినవైన బృహదారణ్యకాద్యుపనిషత్తులు గలవు. వాటి యర్థము నీకు పూర్వము నుండియే చెప్పుచు వచ్చుచున్నాను. మఱియు నిట్టిదే యగు నిర్గుణ బ్రహ్మప్రతిపాదకోపనిషత్తుల యర్థము నీకింకను ముందు ముందు చెప్పబడును. హే శిష్య! తదనుగుణముగ ఏ యధికారిపురుషులు ఆరాధనము చేయుదురో ఆ యధికారి పురుషులు అల్పకాలమందే శుద్ధాంతఃకరణము గలవారై వైరాగ్యమును పొందుదురు. కనుక గర్భదుఃఖాదుల విచారమువలె పరమేశ్వరుని యుపాసనయు వైరాగ్యమునకు కారణమై యున్నది.

శిష్యుడు — హే భగవన్! ఏ యధికారి ఉపాసనలయందు అసమర్థుడగునో అతడే యుపాయమును చేయవలయును?

గురువు — హే శిష్య! వేదముచే కర్మకాండమందు కథనము చేయబడిన వర్ణాశ్రమాది కర్మములన్ను శ్రద్ధాపూర్వకముగ నిరంతరము చేయవలయును. అయినను ఆ కర్మ సంబంధ ఫలము నభిలషింపగూడదు. ఇటువంటి నిష్కామకర్మములచేతను అధికారి అంతఃకరణశుద్ధి పొంది వైరాగ్యమును పొందగలడు. కనుక నిష్కామ

కర్మయు, వైరాగ్యమునకు కారణమైయున్నది. ఏ యధికారి నిష్కామములందును సమర్థుడు కాడో వానికొఱకు 'తమేతం వేదానువచనేన బ్రాహ్మణా వివిదిషన్తి, యజ్ఞేన దానేన తపసా౽నాశకేన'' అని శ్రుతిచే బ్రహ్మజ్ఞానప్రాప్తికొఱకు వేదాధ్యయనాది పంచ ధర్మముల విధానము చేయబడియె.

హే శిష్య! — ఏ యధికారి కర్మమందును సమర్థుడు కాడో, అతడు 'యత్కరోషి యదశ్నాసి యజ్జుహోషి దదాసి యత్। యత్తపస్యసి కౌన్తేయ! తత్కురుష్వ మదర్పణమ్॥'' అను భగవదుక్తి ప్రకారముగ వ్యవహార క్రియా సహిత సర్వకర్మలను పరమేశ్వరార్పణము చేయవలయును. అదియును వైరాగ్యమునకు కారణమే.

హే శిష్య! గర్భదుఃఖవిచారము, మృత్యుకాలజ్ఞానము, అష్టాంగయోగము, ఉపాసన, నిష్కామకర్మము, బ్రహ్మజ్ఞానప్రాప్తి సంబంధ గురుసేవ, ఈశ్వరార్పణ కర్మము అను నీ సప్త ఉపాయములచే అధికారికి వైరాగ్యప్రాప్తి యగుచున్నది. హే శిష్య! మనుష్యలోకమునుండి బ్రహ్మలోకపర్యంతము ఎంత విషయజన్యసుఖము, స్త్రీ పుత్రాది ధనాది తత్సాధనములెన్ని గలవో, ఆ సమస్తములనుండి తీవ్రవైరాగ్యము గలుగుటయే సన్న్యాసకాలమైయున్నది. ఇపుడు సంన్యాసమున కధికారి నిరూపింపబడుచున్నారు. ఈషణ యని యిచ్ఛకు నామము. విత్తేషణ, లోకేషణ, పుత్రేషణ యను భేదములచే ఆ ఈషణ త్రివిధము. విత్తమనగా ధనము. అది దైవధనము మనుష్యధనమని ద్వివిధము. తదిచ్ఛకు నామము విత్తేషణ. స్వర్గపితృమనుష్యాది లోకేచ్ఛ లోకేషణ. పుత్రపౌత్రాది సంతతీచ్ఛ పుత్రేషణ. ఈ త్రివిధేషణారహిత పురుషుడే సన్న్యాసమున కధికారి.

ఇపుడు జాబాలోపనిషచ్చతుర్థ ఖండవచనార్థ నిరూపణము గావింపబడుచున్నది. — హే శిష్య! ఈషణ గలవాడు సన్న్యాసగ్రహణము చేయకూడదు. ఈషణారహితుడే క్రమముగ బ్రహ్మచర్యాశ్రమమును గృహస్థాశ్రమమును, వానప్రస్థాశ్రమమును గ్రహణముచేసి అనంతరము కుటీచకాది సన్న్యాసాశ్రమములయందేదో యొకటి గ్రహణము చేయవలయును. అథవా పూర్వము చెప్పిన ప్రకారముగ ఆశ్రమక్రమములేకయు తీవ్రవైరాగ్యము పుట్టినపుడే పరమహంససన్న్యాసమును గ్రహణము చేయవలయును. హే శిష్య! వేదవిద్యాప్రాప్తికొఱకు బ్రహ్మచారికి గురుకులవాసాదిధర్మములు గలవు. ఆ ధర్మములుగలవానికి వ్రతియనిపేరు. ఆధర్మములులేనివానికి అవ్రతి యనిపేరు. ఏ పురుషుడు గురుసమీపమున నివాసముచేసి వేదముల నన్నిటిని అథవా రెండువేదములను అధ్యయనమునుచేసి బ్రహ్మచర్యాశ్రమమును సమాప్తిచేయుచున్నాడో, ఆ పురుషునకు స్నాతకుడని పేరు. అంగాంశవేదాధ్య

యనము చేయువానికి అస్నాతకుడని పేరు. మఱియు పూర్వము శ్రౌతాగ్నిని అథవా స్మార్తాగ్నిని గ్రహణముచేసియు స్త్రీ మరణాదినిమిత్తములచే నష్టమైన యగ్నిగలవానికి ఉచ్ఛిన్నాగ్నికుడని పేరు. ఎవడు స్త్రీ మరణాదినిమిత్తముగా యే ఒక అగ్నియొక్క అంగీకారముచేయలేదో, అతనికి అనగ్నికుడనిపేరు. ఎవడు అగ్నియొక్క అంగీకారముచేయలేదో, అతనికిని ఉచ్ఛిన్నాగ్నికుడనిపేరు. అగ్నిగ్రహణముకొఱకు ఉపయుక్తమైన ధనాదిపదార్థములను అంగీకారము చేయనివానికి అనగ్నికుడనిపేరు. హే శిష్య! — వ్రతి, అవ్రతి, స్నాతకుడు, అస్నాతకుడు, ఉచ్ఛినాగ్నికుడు, అనగ్నికుడు అను నీ షడ్విధపురుషులందు యే పురుషునకే కాలమందు తీవ్రవైరాగ్యము కలుగునో, అతడు ఆ కాలమందే పరమహంస సన్యాససంగ్రహణము చేయవలయును. అట్లు కుటీచక 'బహూదక' హంస యను నీ మూడు సన్న్యాసులందును ఎవని కెపుడు తీవ్రవైరాగ్యముదయించునో, అతడపుడే పరమహంససన్న్యాసమును గ్రహణము చేయవలయును. తీవ్రవైరాగ్యములేక మాత్రము యే యధికారికూడా పరమహంస సన్న్యాసమును గ్రహణము చేయకూడదు. ఇపుడు ధర్మశాస్త్రానుసారముగ పరమ హంస సన్న్యాసగ్రహణము విరూపింపబడుచున్నది.

హే శిష్య! ఎట్లు వివాహాది శుభకార్యములందు నానాప్రకారమంగళములగు చున్నవో, అట్లే సన్న్యాసగ్రహణమునకు పూర్వదినమున నానా ప్రకారమంగళములచే యుక్తుడైనట్టి యధికారి మొదట నాందీముఖశ్రాద్ధము చేయవలయును. ఆ నాందీముఖ శ్రాద్ధమునందు సన్న్యాసకర్త మొదట వసు సత్యయను నామములుగల విశ్వేదేవతలను పూజనము చేయవలయును. మఱియు నాందీముఖశ్రాద్ధానంతరము దైవశ్రాద్ధము, ఋషిశ్రాద్ధము, దివ్యశ్రాద్ధము, మానుషశ్రాద్ధము, పితృశ్రాద్ధము మాతృశ్రాద్ధములను చేయవలయును. అదియందు నవమమైన వైశ్యదేవశ్రాద్ధము చేయవలయును. ఈ యున్ని శ్రాద్ధములును నాందీముఖశ్రాద్ధమునకు అంతర్గతములే యైయున్నవి. శౌనకాది కొందఱి ఋషులమతమందు మాతృశ్రాద్ధముకన్న వేఱై యింకొక మాతామహశ్రాద్ధము కలదు. అది చేరినపక్షమందు శ్రాద్ధములు పదియగుచున్నవి. మాతృమాతామహ శ్రాద్ధములందును తద్దేవతలందును ఋషులకు నానా విధ అభిప్రాయము గలదు. కులాచారానుసారముగను వ్యవస్థ చెప్పబడియె.

హే శిష్య! బ్రహ్మవిష్ణుమహేశ్వరులు దైవశ్రాద్ధమునకు దేవతలు. దేవర్షి, రాజర్షి, మనుష్యర్షి వీరు ఋషిశ్రాద్ధమునకు దేవతలు. వసు రుద్ర ఆదిత్యులు దివ్య శ్రాద్ధమునకు దేవతలు. సనక సనందన సనత్కుమారులు మానుషశ్రాద్ధమునకు దేవ తలు. పృథివ్యాది పంచభూతములు, నేత్రాదిదశేంద్రియములు, జరాయుజాది చతుర్విధ

యోనులు యివి భూతశ్రాద్ధమునకు దేవతలు. పితృ, పితామహ, ప్రపితామహులు పితృశ్రాద్ధమునకు దేవతలు, మాతృ పితామహి ప్రపితామహులు మాతృశ్రాద్ధమునకు దేవతలు, ఎవని కులాచారమందు మాతృశ్రాద్ధానన్తరము మాతామహశ్రాద్ధమగునో వానిచేత ఆ మాతామహశ్రాద్ధము మాతృశ్రాద్ధానంతరమే చేయబడవలయును. ఆ మాతామహశ్రాద్ధమునకు మాతామహ ప్రమాతామహ, వృద్ధమాతామహులు దేవతలు మఱియు ఆ మాతృశ్రాద్ధానంతరము అథవా మాతామహశ్రాద్ధానంతరము ఆ సన్న్యాస కర్త ఆత్మశ్రాద్ధము చేయవలయును. ఆ యాత్మశ్రాద్ధమునకు, సన్న్యాసకర్త, వాని పిత, పితామహుడు, వీరు ముప్వురు దేవతలు, ఈ ప్రకారముగ సన్న్యాసకర్త ఆ నాందీముఖశ్రాద్ధమునకు పూర్వము వైశ్వదేవశ్రాద్ధముచేసి అనంతరము తన కులాచారానుసారముగ అష్టశ్రాద్ధములు అథవా నవశ్రాద్ధములు శ్రద్ధాపూర్వకముగ జేయవలయును. అష్టశ్రాద్ధపక్షమునందు ఒక్కొక్కదేవతకు ఒక్కొక్క పిండము అలాగున యిరువదినాల్గు (24) పిండములు, నవశ్రాద్ధపక్షమందు యిరువదియేడు (27) పిండములు కావలయును.

హే శిష్య! ఆ సన్న్యాసకర్త ఆ పిండములందు దధి లాజ అక్షత బదరీఫల మధుదూర్వ కుంకుమాది మంగళపదార్థములను జేర్చి ఆ పిండముల మధ్యమందు మధు శర్కరాదుల విశేషముగ పోయవలయును. ఆ ప్రతియొక శ్రాద్ధమందు యిద్దరిద్దరి బ్రాహ్మణులకు నవశ్రాద్ధమందు అష్టాదశబ్రాహ్మణులకు, దశశ్రాద్ధపక్షమందు వింశతి బ్రాహ్మణులకు భోజనము పెట్టవలయును. బ్రాహ్మణసంఖ్య న్యూనాధికముగ నుండ కూడదు. సన్న్యాసకర్త ధనవంతుడైన పక్షమందు దుకూలాదివస్త్రములు కంకణాది భూషణములు ఛత్ర, ఉపానహాది పదార్థములు దక్షిణగ నివ్వవలయును. భూదానము నొసంగవలయును. సన్న్యాసకర్త నిర్ధనుడైనపక్షమందు యథాశక్తి దక్షిణలివ్వవల యును. రెండవదినమున అనాథజనులకు నానా ప్రకార అన్నవస్త్రధనాదుల దానము జేయువలయును.

హే శిష్య! యీ ప్రకారముగ సన్న్యాసకర్త తమ ఋషిప్రణేతసూత్రానుసారముగ నాందీముఖశ్రాద్ధముచేసి దానాదులొనర్చి ప్రసన్నతబొంది తన బాంధవులతోటి స్త్రీ పుత్రాదులతోటి యథాయోగ్యముగ భాషణము చేయవలయును. మఱియు మఱి వాడు హోమము చేయుటకొఱకు కొంచెము ద్రవ్యము వేఱుగనుంచి, కంథకౌపీనాది వస్త్రములకు ధనమును వేఱుగనుంచి, తక్కిన ధనాది సర్వపదార్థములను తన పుత్రాదులకు విభాగము చేసి యివ్వవలయును. ఈ ప్రకారముగ సర్వకార్యములు జేసి, ఆ సన్న్యాసకర్త తన బాంధవులతో నొకే పంక్తియందు కూర్చుండి 'పుణ్యోఽహమ్' అని

నీ ప్రకార వచనోచ్చారణము జేసి భోజనము చేయవలయును. ఐనను ఆ దినమందు సంన్యాసకర్తయొక్క చిత్తమందు యే విక్షేపాదులులేని పక్షమందే భోజనము చేయవలయును. చిత్తము విక్షేపాది యుక్తమైన పక్షమందు అన్నమందు రుచి యుండదు. అపుడా సంన్యాసకర్త తన ఘ్రాణముచే శ్రాద్ధశేషాన్నముయొక్క గంధమును గ్రహించి, ఆ దినము ఉపవాసముండి మరుసటి దినము భోజనము చేయవలయును. ఆ దినముననే భోజనము చేసినచో మరుసటి దినము ఉపవాసము చేయవలెను. ఉపవాసము చేయుట ముఖ్యము. ఉపవాస దినమందు సంన్యాసకర్త తన కక్ష యందలి రోమములను, ఉపస్థ సంబంధ రోమ శిఖారోమములను రక్షణము చేసి తక్కిన సర్వశరీరసంబంధ రోమములను ముండనము చేయింపవలయును. అనంతరము స్నానము చేసి వేత్రైన శుద్ధవస్త్రములు ధారణ చేయవలయును. మఱియు హోమముకొఱకు రక్షితమగు పదార్థమును మాత్రము వదలి తక్కిన యింటిలోని ఏ సాలగ్రామ కంబళ మృగచర్మాది పదార్థములు గలవో, ఆ పదార్థములను (సంన్యాసికి నిషిద్ధములు గావట్టి పదార్థములను) ఆ సంన్యాసకర్త తన బ్రహ్మవేత్తయగు గురువు నెదుట నర్పణము చేయవలయును. హే శిష్య! ఏ సంన్యాసి ఆత్మోపదేశము చేయుటయందు అత్యంతకుశలుఁడగునో, బ్రహ్మనిష్ఠుఁడగునో, శమదమాది యుక్తుఁడగునో, అటువంటి సంన్యాసిని ఆ సంన్యాసకర్త బహుకాలమునుండి పరీక్ష చేసి గురువుగ చేసుకొనవలయును. అట్లే గురువునకు సాలగ్రామాది పదార్థముల నర్పణ జేసి తన శీతనివృత్తికొఱకు కౌపీన కంథాది వస్త్రములను వేఱుగ నుంచి, ఆ వస్త్రములను, వేణుదండమును, అగ్నికుండ సమీపమున స్థాపనము చేయవలయును. ఆ వేణుదండము జలముచే శుద్ధమై ఛిద్రరహితమై. మనోహరమై, సంన్యాస కర్తకు సమానమైన పరిమాణము ఉచ్చముగ నుండవలెను.

హే శిష్య! ఆ సంన్యాసకర్త ఏ దినము హోమము చేయునో, ఆ రాత్రియందాతడు జాగరణము చేయవలయును. మహానదీతటమునగాని, విష్ణ్వాది దేవతల మందిరమునగాని, వనమునగాని, గోశాలయందుగాని, మనుష్య రహిత యేకాంత గృహమునందుగాని, అటువంటి స్థానములందు జాగరణము చేయవలయును. హే శిష్య! ఇటువంటి పవిత్రప్రదేశమునందు ఆ సంన్యాసకర్త స్వాసనముపై స్థితుఁడై, రెండు హస్తములను ముడిచి, మనస్సహిత యింద్రియములను నిరోధము చేసి మొదట బ్రహ్మ, ఇంద్ర, సోమ, సూర్య, ఆత్మ, అంతరాత్మ, పరమాత్మ, విజ్ఞానాత్మ యను నీ యష్ట రూపములు గలవాఁడైన పరమేశ్వరుని స్మరణము చేయవలయును. మఱియు ప్రణవపూర్వకముగ బ్రహ్మణే నమః, ఇంద్రాయ నమః, సోమాయ నమః, సూర్యాయ నమః, ఆత్మనే నమః, అంతరాత్మనే నమః, పరమాత్మనే నమః, విజ్ఞానాత్మనే నమః, అను నీ అష్ట మంత్రములను మానసికముగ జపము చేయవలయును. ఈ మానసిక

జపమునుగూర్చి వ్యాసభగవంతుడిట్లు వచించెను. 'ధియా యదక్షరశ్రేణిం వర్ణస్వర విభూషితాం ఉచ్చరేదర్థ సంస్మృత్యా న ఉక్తో మానసో జపః' భావార్థము — కకారాది వర్ణములచే ఉదాత్తాది స్వరయుక్త అక్షరపంక్తిని జపకర్త తదర్థ స్మృతి పూర్వకబుద్ధిచే యుచ్చారణము చేయుటకు మానస జపము అని నామము. హే శిష్య! ఆ మానస జపానంతరము సంన్యాస కర్త ఒక ముష్టి సక్తువు (పేలపిండి) భక్షణము చేసి మూడు మార్లు ఆచమనము చేయవలయును. అనంతరము తన హస్తమును నాభిదేశమందుంచి ప్రణవపూర్వకముగ ఆత్మనే స్వాహా, అంతరాత్మనే స్వాహా. ప్రజాపతయే స్వాహా. అను నీ మూడు మంత్రముల నుచ్చారణ చేయవలయును. తరువాత పయస్సు, దధి, ఘృతములను యీ మూడు పదార్థములను ఒక్కొక్క పదార్థము మూడు మూడు మార్లు చొప్పున భక్షణము చేయవలయును సకల భక్షణమునందును ప్రణవోచ్చారణము చేసి భక్షణానంతర మాచమన మొనర్చి పూర్వదిక్కున కభిముఖుడై యథా శక్తి ప్రణవ మంత్రోచ్చారణ చేయవలయును. అథవా ఋగ్ యజుష్, సామములను నీ మూడు వేదముల కంఠగతమైన క్రమముగా అగ్నిమీల, ఇషేత్వేతి, అగ్న ఆయా హేతి అను నీ మూడు మంత్రములను ప్రణవపూర్వకముగా నుచ్చారణ చేయవలయును. తరువాత సావిత్రీ ప్రవేశమంత్రము, అది, భూః, భువః, సువః అను నీ మూడు వ్యాహృతు లందు ఒక్కొక్క వ్యాహృతి ఉచ్చారపూర్వకముగ 'సావిత్రీ ప్రవిశామి' యను వచనములను రెండు రెండు మార్లు ఉచ్చారణము చేయవలయును.

ఈలాగున సావిత్రీ ప్రవేశ షణ్మంత్రములందు క్రమముగా గాయత్రీ మంత్ర పాదోచ్చారణము చేయవలయును. మొదట ప్రణవోచ్చారణము, పిదప వ్యాహృతి ఉచ్చారణము, తదుపరి సావిత్రీ ప్రవేశ వాక్యోచ్చారణము, తదుపరి గాయత్రీ పాదో చ్చారణము అన్నియు చేరి ఒక మంత్రమగుచున్నవి. హే శిష్య! ఈ ప్రకారమగు సావిత్రీప్రవేశ షణ్మంత్రోచ్చారణమైన తరువాత ఆ సంన్యాస కర్త, బ్రహ్మన్వాధాన మను కర్మము చేయవలయును. తత్ప్రకారమిది — ఆ సంన్యాస కర్త సూర్యాస్తమ యముకన్న పూర్వము హోమముకొఱకు శ్రౌతాగ్నినిగాని, స్మార్తాగ్నినిగాని, పవిత్ర స్థలగత లౌకికాగ్నినిగాని తెచ్చి, కుండయందు అథవా భూమియందు స్థాపనము చేయ వలయును. తరువాత తమ ఋషిప్రణేత సూత్రానుసారముగ అగ్నిహోత్ర హోమము చేయవలయును. అట ఆజ్యభాగ పర్యంతముసర్వాంగములను విధి పూర్వకముగ జేసి అనంతరము ప్రణవ పూర్వక స్వాహామంత్రసహితముగ, ఆ యగ్నియందు ఆజ్యా హుతి నొనర్చవలయును. పూర్ణాహుతియును గావింపవలయును. ఈ కర్మమునకు బ్రహ్మన్వాధానమని పేరు.

హే శిష్య! ఆ సంన్యాస కర్త సాయంకాలమున ఇష్టియును చేయవలయును. అతడు గార్హపత్యాది శ్రౌతాగ్ని గలవాడైన పక్షమందు వైశ్వానరమను ఇష్టి చేసి, తరువాత 'రాజాధిరాజ స్వరాట్' యిత్యాది గుణ విశిష్ట దేవతా సంబంధమగు 'త్రైధాతవి' యను ఇష్టి చేయవలయును. ఆ సంన్యాస కర్త స్మార్తాగ్ని గలవాడైన పక్షమందు ప్రాజాపత్యమను ఇష్టిచేయవలయును. విధురుడైనపక్షమందు విధురాగ్నిచే ప్రాజాపత్య ఇష్టిచేయవలయును. (సృష్టోదివీత్యాది మంత్రములచే సిద్ధించినది విధురాగ్ని) యీ ఇష్టి ప్రకరణమందు శాస్త్రకారులకు మూడు వాదవివాదములు గలవు.)

హే శిష్య! ఆ సన్న్యాసకర్త తృతీయదినమున బ్రహ్మముహూర్తమునందు దర్భాసనమునుండిలేచి జలస్నానము అధవా భస్మస్నానముచేసి తన అగ్నిమీద చరు అన్నముల పక్వముచేసి, హోమము చేయవలయును. ఆ హోమానంతరము మఱల అలాగుననే విరజా హోమము చేయవలయును. అట పూర్వమువలె అగ్నిమీద చరువును పక్వముచేసి, ఆ చరువును ఘృతయుక్తముగజేసి పూర్ణాహుతిపర్యంతము విరజాహోమము చేయవలయును. హోమానంతరము పరిశేషమైన చరువును భక్షణము చేయవలయును అనంతరము ఆచమనముచేసి ప్రణవపూర్వకముగ స్వాహామంత్రముచే అగ్నియందు పూర్ణాహుతి చేయవలయును. హే శిష్య! ఈ ప్రకారముగ ఆ సన్న్యాస కర్త పూర్వోక్తసర్వకర్మములజేసి అనంతరము ఉత్తరనారాయణోపనిషత్తును పాఠము చేయుచు తమ గృహమునుండి బయలుదేరి నదీసరోవరాదిజలస్థానము వద్దకు పోవలయును. అక్కడకు తనతోడవచ్చినవారైన ఋత్విక్‌జనులను బంధుజనులను ప్రార్థించి వారిచే తన అపరాధముల క్షమింపింపవలయును. మఱియు పుత్రస్త్రీ బాంధవులను ఆశీర్వాదముచే ప్రసన్నముగ జేయవలయును. ఈరీతిగా సర్వులను ప్రసన్నచిత్తులుగ తిరిగిపంపించి తాను నిష్పంగుడై నిలువవలయును.

హే శిష్య! తరువాత అగ్నిసాధ్యహోమాది సర్వకర్మములు జలమందే చేయవలయును. భావనామయ అగ్నికుండముచేసి దానియందు భావనామయ సకల అగ్ని కర్మములజేసి, ఆ అగ్నిసంబంధ ఉష్ణతను తన యుదరమందు గ్రహించి నాభిపరిమాణ జలమందు ప్రవేశించి పూర్వోక్తసావిత్రీ ప్రవేశమనుమంత్రమును పఠనము చేయవలయును. పిదప పూర్వదిశాభిముఖుడై రెండుభుజములు పైకెత్తి "అహం వృక్షస్య" అను వచనమునుండి "త్రిశంకోర్వేదానువచనమ్" అను వచనమువరకుగల సమస్త వచనములను పఠనచేయవలయును. మఱియు "యశ్ఛందసాం" అను శాంతిమంత్రమందుగల నవవాక్యములను జపముచేసి అనంతరము "పుత్రేషణాయ విత్తేషణాయ" నీ మొదలగు వచనములను పాఠము చేయవలయును. పిదప ప్రణవపూర్వకముగా

భూరాది మూడు వ్యాహృతులయందు ఒక్కొక్క వ్యాహృతియొక్క ఉచ్చారణ పూర్వక ముగ క్రమముగ మంద, మధ్యమ, ఉత్తమములను నీ మూడు స్వరములచే ప్రేష మంత్రము నుచ్చారణ చేయవలయును.

ఇప్పుడు ఆతురసన్న్యాసము నిరూపింపబడుచున్నది. — హే శిష్య! అష్ట శ్రాద్ధము మొదలుకొని జలస్థితిపర్యంతముగ యే సన్న్యాససాధనములు నిరూపింపబడి నవో, ఆ సాధనములు ఆరోగ్యశరీరముగల పురుషులకొఱకే చెప్పబడినవి. ఏ అధికారి పురుషుని శరీరము రోగాదులచే వ్యాకులమైనదో, ఆ యాతురపురుషుడు కేవల ప్రేష మంత్రము నుచ్చారణ చేయుటచాలు. ఈ ఆతురసన్న్యాసమందు శ్రాద్ధాదుల ఆవశ్యకతలేదు.

హే శిష్య! యే అధికారి ఒకచో వాక్కుచేతను ప్రేషమంత్రోచ్చారణమందు సమర్థుడుకాడో, ఆ యధికారి మరణకాలమందు మనస్సుచేతనైనను ప్రేషమంత్రము నుచ్చారణ చేయవలసినది. శ్రుతి "యద్యాతురుస్స్యాన్మనసావాచా సన్న్యసేత్" భావార్థము — అధికారి అత్యంతాతురుడైనపుడు వానికి శ్రాద్ధాదికర్మముల విధా నములేదు. వాక్కుచేతగాని, మనస్సుచేతగానియైన ప్రేషమంత్రోచ్చారణచేతనే వానికి సన్న్యాసప్రాప్తియగుచున్నది. ఇపుడు సన్న్యాసఫలము నిరూపింపబడుచున్నది హే శిష్య! సన్న్యాసి శరీరత్యాగము చేయునపుడు ప్రతిబంధకాభావమైన పక్షమందు అతడు శీఘ్రమే బ్రహ్మలోకమునకుపోవును. ఏదో ఒక ప్రతిబంధకముండిన పక్షమందు కాలాంతరమున బ్రహ్మలోకమునకు పోవును. హే శిష్య! కపిలమహర్షిచే చెప్పబడిన సన్న్యాసఫలమిది.

"సన్న్యస్తమితి యోబ్రూయాత్ ప్రాణైః కంఠగతైరపి।
స సూర్యమండలం భిత్వా బ్రహ్మలోకే మహీయతే॥"

భావార్థము — మరణకాలమందు ప్రాణములు కంఠదేశగతములై యున్న స్థితియందైనను ప్రేషమంత్రోచ్చారణచేయు పురుషుడు మరణానంతరము సూర్య మండలమును భేదించి బ్రహ్మలోకమును పొందుచున్నాడు. మహాప్రళయకాలమందు ఆ సన్న్యాసి బ్రహ్మదేవునితో సహా నిర్గుణబ్రహ్మరూపమోక్షమును పొందును. దక్ష ప్రజాపతిచే చెప్పబడినఫలము —

త్రింశత్పరాంస్త్రింశదపరాంస్త్రింశచ్చ పరతఃపరాన్।
సద్యస్సన్న్యసనాదేవ నరకాత్త్రాయతే పితౄన్॥

భావార్థము — సన్న్యాసి తన సన్న్యాసాశ్రమప్రభావముచే పూర్వోత్తరము లగు తొంబది (90) వంశములపర్యంతము సమస్తపితరులను నరకమునుండి యుద్ధ రించుచున్నాడు. జాబాల్యుపనిషదుక్తఫలము —

శకుంతలానాం పురతోబభూవ తథాకులానాం త్రిశతం సమగ్రం।
ఏతే భవన్తి సుకృతస్య లోకే యేషాంకులే సన్యసతీహ విప్రః॥

భావార్థము — ఏ కులమందు ఏ బ్రాహ్మణుడు సన్న్యాసాశ్రమమును గ్రహణము చేయుచున్నాడో ఆ కులమందు పూర్వము గడచిన నూటఒక పురుషులు రాబోవు మూడునూర్లపురుషులు స్వర్గాది ఉత్తమలోకములను పొందుచున్నారు.

హే శిష్య! "సన్న్యాస" నామమందు "సం" "న్యాస" యను నీ రెండు పదములు గలవు. అందు "సం" పదము సమ్యక్ అర్థబోధకము. "న్యాస" పదము త్యాగార్థబోధకము. ఈలాగున త్యాగరూప సన్న్యాసమందు సమ్యక్ తత్త్వము కలదు. సర్వకాలములందు సర్వదేశములందు, సర్వపదార్థములయందు శరీరమనోవాక్కులచే త్యాగము చేయుట యను నీ ప్రకారము గల ముఖ్యసన్న్యాస శబ్దార్థము పరమహంస సన్న్యాసమందే ఘటింపుచున్నది. కుటీచకాది యితర సన్న్యాసములందు ఆ సన్న్యాస శబ్దార్థము గౌణముగా నున్నది.

హే శిష్య! ఇపుడు పరమహంసయొక్క మరణానంతరము చేయబడునట్టి ధర్మములు నిరూపింపబడుచున్నవి. పరమహంస సన్న్యాసి మృత్యువును పొందిన పిదప వానియొక్క పుత్ర బాంధవాదులనుండి నగరముయొక్క రాజు పర్యంతముగ సకల భక్తజనులచే చేయబడునట్టి సంస్కారములు శౌనక, బోధాయనాది ఋషులచే ధర్మశాస్త్రమందు కథనము చేయబడియె వానిని వినుము.

ఆ పుత్రాది అధికారి జనులు ఆ సన్న్యాసియొక్క శరీరమును తీసుకొని పోవుటకు సుందరరథముగాని, సుందరవిమానముగాని, సుందరమగు ఉట్టిగాని కట్టి సిద్ధము చేయవలయును. ఎట్లు మహాదేవుని భక్తజనులు, విష్ణువుయొక్క భక్తజనులు శివరాత్రి కృష్ణాష్టములయందు నానాప్రకార వాద్యములను నృత్యములను చేయుచున్నారో, మఱియు జయ జయకార మొనర్చుచున్నారో, వేదశబ్దోచ్చారణము చేయుచున్నారో, అట్లే ఆ యధికారి జనులున్ను నానాప్రకార వాద్యములు నానాప్రకార నృత్యములు జయజయకారములు వేదపాఠములు అనేకప్రకార ఉత్సవములు చేయవలయును. అధికారి జనులు మొదట స్నానము చేసి, దుకూలాది సుందరవస్త్రములు ధారణ చేసి శరీరమునకు చందనచర్చ, ముఖమందు తాంబూలము, కంఠమందు సుగంధ పుష్పమాల ధారణము చేసి, హరిద్రాచూర్ణము, దుగ్ధము, ఫలము, సుగంధపుష్పము మొదలగు మంగళ పదార్థములు హస్తమందు ధరించవలెను. ఆ అధికారిజనులు ధన సంపత్తి గలిగియున్న పక్షమందు సన్న్యాసి శరీరమును తీసుకొనిపోవు మార్గమును గృహాదులను మార్జనము చేయించి శుద్ధముగా నొనర్చి చందన కర్పూరాదుల జలముచే

సించనము చేయవలెను. మఱియు ఎట్లు భక్తజనులు శివ విష్ణు ప్రతిమలకు పంచామృతస్నానము చేయింతురో, అట్లే ఈ అధికారిభక్తజనులును సన్న్యాసి శరీరమునకు పంచామృతస్నానమును చేయించవలయును. మఱియు గంగానదుల పవిత్రజలముచే శుద్ధోదక స్నానము చేయించవలయును. చందనాది సుగంధ ద్రవ్యములను సన్న్యాసి శరీరమునకు పూయవలయును. సుగంధపుష్పమాలను ధరింపజేయవలయును. ధూప దీపాది సకలదేవోపచారములు చేయవలయును. పలుమారు కర్పూరహారతి చేయవలయును.

హే శిష్య! ఈ ప్రకారముగ అధికారిజనులు సన్న్యాసి శరీరమునకు పూజనము చేసి అద్దానిని విమానాదులందు కూర్చుండబెట్టి విష్ణ్వాదిదేవతలవలె మహారాజునివలె మహోత్సవము చేసి వాద్యాదులతోడను, వేదపాఠాదులతోడను, తీసుకొని పోవలయును. వనమందుగాని, పిప్పలాది వృక్షసమీపమునగాని, శివ విష్ణ్వాది దేవతాస్థానములందుగాని, గోశాలయందుగాని, మహానది మొదలగు పవిత్రస్థానమునందుగాని, ఆ సన్న్యాసి శరీరమును తీసుకుపోయి ఆ శుభస్థానమందు అధికారిజనులు కూపమువలె వర్తులాకారముగ పురుష పరిమాణముగ ఒక గొయ్యి త్రవ్వవలయును. ఆ గొయ్యిని త్రవ్వువారైన బ్రాహ్మణులు పలుమారు భూరాది వ్యాహృతులయొక్క పాఠమును చేయవలయును. మఱియు సప్త వ్యాహృతులను పాఠము చేసి ఆ గోతిని జలముచే ప్రోక్షణము చేయవలయును. దానియందు ప్రణవమంత్రముతోటి దర్భాసనము వేయవలెను. మఱియు ఆ గోతియొక్క బాహ్యప్రదేశమందు సన్న్యాసి శరీరమును స్థాపన చేసి సావిత్రిమంత్రపాఠ యుక్తముగ స్నానము చేయించి మృత్తికాది మల రహితముగ చేయవలయును. పిదప ఆ అధికారి పురుషులు ఆ సన్న్యాసి శరీరమును విష్ణుబుద్ధిచే పురుషసూక్తమంత్రముతో స్నానము చేయించవలయును. మఱియు పూర్వమువలె సుగంధపుష్పమాలాదులచే శోభాయమానముగ చేయవలయును అనంతరము 'విష్ణోర్హవ్యం రక్షస్వ'' యను మంత్రము నుచ్చరించి సన్న్యాసి శరీరము నా గోతియందు పూర్వముఖముగా కూర్చుండ పెట్టవలెను, పిదప సన్న్యాసియొక్క దండమును త్రిఖండములుగ జేసి వాని దక్షిణ హస్తమందివ్వవలెను.

హే శిష్య! ఆతురసన్న్యాసిగా నుండిన పక్షమందు వానికి దండములేదు. అట్లైన పక్షమున 'ఇదం విష్ణుర్విచక్రమే' అను మంత్రముతో ఏదో ఒక దండమును వాని చేతికి యిచ్చి ఆ దండమును మూడు ఖండములు చేసి వాని దక్షిణ హస్తమందివ్వవలయును. అనంతరమీ అధికారి జనులు సన్న్యాసి హృదయముమీద తమ హస్తముంచి 'హంసః' 'శుచిషత్' యిత్యాది మంత్రములను - జపము చేయవలయును.

మఱియు వాని భ్రూమధ్యమందు హస్తముంచి పురుషసూక్తమంత్రము జపము చేయవలయును. మూర్ధస్థానముమీద హస్తముంచి 'బ్రహ్మ జజ్ఞానం' యిత్యాది మంత్రములు జపము చేయవలయును. అనంతరమా యధికారిజనులు 'భూమిర్భూమిమగాత్' అను మంత్రము నుచ్చారము జేసి ప్రణవమంత్రమును భూరాది వ్యాహృతులను మాటి మాటికి నుచ్చారము జేయుచు వాని దేహమును రాళ్ళచేతను, మన్నుచేతను, దృఢముగా కప్పవలయును. అభిప్రాయము — ఆ సన్న్యాసియొక్క శరీరమును శ్వాన శృగాలాది ప్రాణులు భక్షణము చేయకూడదు. ఎందుకనగా ఏ ప్రదేశమందు సన్న్యాసి శరీరమును శ్వానశృగాలాదులు భక్షణము చేయునో, ఆ ప్రదేశమందు దుర్భిక్షాది ఉపద్రవములు గలుగును. అను ఈ ప్రకారముగ బోధాయనాది ఋషులచే చెప్పబడి యున్నది. పరమహంస సన్న్యాసి మరణానంతరము ఏ యే సంస్కారములు చెప్పబడెనో, ఆయా సంస్కారములను విధి పూర్వకముగ జేయుటచే ఆ ముక్తసన్న్యాసికి వీటిచే నెట్టి పుణ్యప్రాప్తియు కలుగదు. చేయకుండుటచే యే యొక పాపప్రాప్తియు కాదు. అయినను అట్లు విధిపూర్వకముగ సంస్కారము చేయువారికి పుణ్యప్రాప్తియు చేయనివారికి పాపప్రాప్తియు గలుగును.

హే శిష్య! ఆ బ్రహ్మవేత్తయగు సన్న్యాసి మరణానంతరము నా శరీరమును ఛేదనముచేసి శ్వానశృగాలాదులచే భక్షణము చేయింపుడు అని యిట్లనిన కూడ అధికారి జనులు తమ పుణ్యప్రాప్తికొఱకట్లుచేయరు. విధిపూర్వక సంస్కారమే చేయుదురు. సన్న్యాసి శరీరమును భూమియందు పూడ్చుట బ్రాహ్మణాది నాల్గువర్ణములకు సుఖ కారణమై యున్నది. కనుక అధికారి జనులు మరణానంతరము సన్న్యాసి శరీరమును భూమియందు బాగుగ పూడ్చవలయును.

హే శిష్య! కుటీచక, బహూదక సన్న్యాసులకు శిఖాసూత్రములు గలవు. కనుక వారి శరీరమును దహించుట లేక పూడ్చుట అను విషయముతో ఋషులకు భేదాభిప్రాయములు గలవు. కాని పరమహంస సన్న్యాసిని పూడ్చుటయందు ఎవనికిని వివాదము లేదు. కపిలముని యిట్లు చెప్పెను.

"అగ్నేర్దహనం కార్యం పూర్వభిక్షోర్యథావిధి।
విదుషస్తు న తత్కార్యమేకోద్దిష్టాది కర్హిచిత్ ॥"

శ్రౌతస్మార్తాగ్నిరహితులగు కుటీచకాది మూడుతెగల సన్న్యాసులకు మరణానంతరము అగ్నియందు దహనము చేయవచ్చునుగాని, పరమహంస సన్న్యాసిశరీరమును ఎప్పటికిని దహనము చేయకూడదు. హే శిష్య! దేవతాప్రతిమవలె భక్తజనులకు సకలమనోరథప్రాప్తిచేయునదైన పరమహంస సన్న్యాసియొక్క శరీరమేదికలదో,

ఆద్ధానియొక్క దహనము అథవా శ్వానశృగాలాదులచే భక్షణమైనపక్షమందు అధికారులతోసహా ఆ ప్రాణులయొక్క సకల మనోరథములు నాశనమగును. కనుక అధికారిజనులు పరమహంసుని మృతశరీరమును కాల్పక భూమియందు పూడ్చి తరువాత ''అగ్నినాగ్నిస్సమిధ్యతే సూర్యాత్'' యిత్యాది మంత్రములను పారము చేయవలయును.

హే శిష్య! ఎట్లు వివాహాది ఉత్సవములలో లోకులు ప్రసన్నముఖులగుదురో, అట్లే ప్రసన్నముఖులై శోకక్లేశాదిరహితులై సమస్త అధికారిజనులు భూమియందు పూడ్చబడిన ఆ సన్న్యాసి శరీరమునకు యథాశక్తి ప్రదక్షిణ నమస్కారములు చేయ వలయును. మఱియు ఆ భూమిమీద దేవాలయము కట్టించవలయును. వటపిప్పలాది పవిత్రవృక్షముల నాటవలయును. ఆ దేవాలయమందు విష్ణుప్రతిమలగాని, శివలింగము గాని, సూర్యగణపతి దేవ్యాదిదేవతల ప్రతిమగాని స్థాపనముచేసి ఆ ప్రతిమను అధికారి జనులు సర్వదా పూజనము చేయువలయును. వేయేల, ఆ స్థానమునకు బహుకాలము వఱకు, మలము అస్థిమొదలగు అశుచిపదార్థముల సంబంధముండకూడదు. హే శిష్య! ఎట్లు ప్రేతముల స్పర్శమైనపుడు అశుచిబుద్ధియగుచున్నదో అట్లు పరమహంస ప్రేతస్పర్శముచే అశుచిబుద్ధి యెన్నటికిని కలుగచేయకూడదు. మరేమనిన విష్ణు ప్రతిమదర్శనముచే, స్పర్శనముచే భక్తజనులకెట్లు శుచిబుద్ధియగుచున్నదో అట్లే అధికారిజనులు మృతసన్న్యాసియొక్క దర్శనస్పర్శనములచే, శుచిబుద్ధిని కలుగజేసు కొనవలయును. మఱియు ఏ నద్యాది జలములచే సన్న్యాసిప్రేతశరీరమును స్నానము చేయింపబడినదో ఆ నద్యాదిజలములందు తీర్థబుద్ధిచే స్నానము చేయవలయునుగాని అశుచిబుద్ధిచే చేయగూడదు. స్నానముచేయుట యందిచ్ఛలేని పక్షమందు స్నానము చేయక యుండవచ్చును. కాని అశుచిబుద్ధిచే మాత్రము స్నానము చేయగూడదు. సన్న్యాసియొక్క శరీరము మరణముకన్న ముందు విష్ణురూపముగాను, మరణానంత రము విష్ణుప్రతిమారూపముగానున్నది. అత్రిఋషి ఇట్లు చెప్పెను.

"ద్వేరూపే వాసుదేవస్య, చలంచాచలమేవచ।
చలం సన్న్యాసినాం రూపమచలం ప్రతిమాదికమ్॥
దేవతాప్రతిమాం దృష్ట్వా, యతిం దృష్ట్వాచదండినమ్।
ప్రణిపాతమకుర్వాణో, నరకం రౌరవం వ్రజేత్॥''

భావార్థము — వాసుదేవుడైన విష్ణువునకు రెండురూపములు గలవు. ఒకటి చలరూపముగాను, మరొకటి అచలరూపముగాను గలదు. అట పరమహంస సన్న్యాసియో విష్ణుసంబంధ చలరూపమున్ను, సాలగ్రామాదిప్రతిమలు అచలరూప

మున్నుయైయున్నవి. ఎవరు సాలగ్రామాది ప్రతిమలనుచూచియు పరమహంస సన్న్యాసులనుచూచియు నమస్కారముచేయడో వానికి రౌరవనరకప్రాప్తియగును. హే శిష్య! యీ వార్తను వ్యాసభగవంతుడున్ను వచించెను.

"దుర్వృత్తో వా సువృత్తో వా మూర్ఖః పండిత ఏవవా।
కాషాయదండమాత్రేణ యతిః పూజ్యోద్విజైః సదా॥"

దురాచారుడుగాని, సదాచారుడుగాని, మూర్ఖుడుగాని, పండితుడుగాని కాషాయ వస్త్రదండయుక్తసన్న్యాసిని బ్రాహ్మణులు విష్ణురూపముగ పూజనము చేయవలయును. నారదముని యిట్లు వచించెను.

"అపమానే కృతే తేషాం దేవాః సర్వేఽపకారితాః"

అభిప్రాయము — బ్రహ్మవిష్ణురుద్రయింద్రలోకపాలకస్యాది సమస్తదేవతలు పరమహంసుని శరీరమందు నివాసము చేయుచున్నారు. కనుక యే అధికారిపురుషులు శ్రద్ధాభక్తిపూర్వకముగా ఆ పరమహంసుని పూజనముచేయుదురో వారు బ్రహ్మాదుల పూజనము చేసినవారగుదురు. నిరాదరణముచేసినవారు బ్రహ్మాదులనిరాదరణము చేసినవారగుదురు.

హే శిష్య! విష్ణుభగవంతుడు సాలగ్రామాది ప్రతిమలందు సర్వదా స్థితమగు నట్లు పరమహంస శరీరమందును సర్వదా స్థితుడగును కనుక అధికారిజనులు అవశ్యముగ పరమహంసను పూజనము చేయవలయును. హే శిష్య! లోకమందు జనులు పరమహంసను స్తుతి చేయుదురు. అధవా నింద చేయుదురు. అధవా వాని కన్నవస్త్రాదుల నిచ్చెదరు. ఆ సమస్తపదార్థములను ఆ సన్న్యాసి విష్ణుభగవంతునకు అర్పణము చేయుచున్నాడు. తుదకు ఆ విష్ణు భగవంతుడు, ఆ దాతకు యథా యోగ్య ఫలము నిచ్చుచున్నాడు. హే శిష్య! చాతుర్వర్ణ్యజనులు, ఒకచో ఆ సన్న్యాసి ధర్మ భ్రష్టుడైయున్నను, బ్రాహ్మణాది చాతుర్వర్ణ్యజనులు తమకాతడు నమస్కారము చేయ వలయునని సంకల్పించకూడదు. ఎందుకనగా సన్న్యాసిచే నమస్కరింపదగినవారు ముగ్గురు గలరు. ఒకడు గురువు, ఒకడు రాజు, ఒకడు యమధర్మరాజు. సన్న్యాసిని గురువే శిక్షించుట యుచితమని జమదగ్ని చెప్పెను. ఎట్లన

"అధవా యద్గురుర్బ్రూయాత్ తత్కార్యమవిశంకయా।
నిగ్రహేఽనుగ్రహేచాపి గురుః సర్వత్ర కారణమ్॥"

సన్న్యాసికి ఏ వచనము తన గురువు చెప్పుచున్నాడో నా వచనము నా సన్న్యాసి సంశయరహితముగ నంగీకరింపవలయును. సన్న్యాసిని నిగ్రహము చేయు టకును, అనుగ్రహము చేయుటకును, గురువే సర్వత్ర కారణముగ నున్నాడు.

మఱియు సన్న్యాసి మద్యపానము స్త్రీగమనము మొదలగు పాపకర్మములు చేసి నపుడు ఆ దురాచారి యగు సన్న్యాసిని రాజు శిక్షింపవలయును. ఈ వార్తను దక్ష ప్రజాపతియు చెప్పెను. ఎట్లన

"పారివ్రాజ్యం గృహీత్వా తు యః స్వధర్మే న తిష్ఠతి।
శ్వపదేనాంకయిత్వా తం రాజా శీఘ్రం ప్రవాసయేత్॥"

స్వధర్మమందు స్థితుడు గాకుండగా, మద్యపాన స్త్రీగమనాది పాపాచరణములు చేయు వాడైన దురాచారి యగు సన్న్యాసిని, రాజు వాని మస్తకమందు శ్వానపదచిహ్నము వేసి, తన దేశమునుండి బయటకు పంపవలయును. మఱియు ఏ సన్న్యాసి రాజాదు లకు తెలియక రహస్యముగా పాపాచరణము చేయునో, వానిని యమధర్మరాజు శిక్షింపవలయును. ఈ ప్రకారమగు శాస్త్రమర్యాద నెఱిగి, అధికారి జనులు తమ ధర్మ వృద్ధికొఱకు ఆ సన్న్యాసికి శరీరమనోవాక్కులచే సుఖప్రాప్తియే కలుగజేయవలసినది. హే శిష్య! ఇతరపురుషుల మరణానంతరము అశౌచము, తిలాంజలి విధానము. నింబపత్ర భక్షణము మొదలగు ఏయే విధులు గలవో ఆయా విధులను సన్న్యాసి మరణానంతరము చేయగూడదు. ఏ అధికారి పురుషులు శ్రద్ధా భక్తి పూర్వకముగ పరమహంసుని శరీరమును తీసుకొనిపోవుదురో, వారియొక్క ఒక్కొక్క పాదము లేచుటయందు అశ్వమేధ ఫలము ప్రాప్తమగుచున్నది మఱియు విష్ణు భగవంతుని సాలగ్రామాది ప్రతిమలయొక్క దర్శనస్పర్శనాదులయొక్క ఫలమున్ను సన్న్యాసి శరీరముయొక్క దర్శన స్పర్శనాదులచేత అధికారి జనులకు ప్రాప్తమగుచున్నది.

హే శిష్య! పరమహంససన్న్యాసి శరీరమును తీసుకొనిపోవువారు, తోడ నడచువారు, గర్తఖననము చేయువారు, గర్తమందు శరీరమును పూడ్చువారు, యీ సమస్త అధికారి జనులు సర్వదా శుచివంతులే యగుదురు. హే శిష్య! సన్న్యాసి మరణానంతరము అగ్నిదహన పిండోదకాది క్రియలను చేయకూడదు. ఐనను, మరణానంతరము ఏకాదశి దినమందు ఆ సన్న్యాసియొక్క పూర్వగృహస్థాశ్రమసంబంధ పుత్రులు పార్వణ యను శ్రాద్ధము చేయవలయును. అట వివాహమునందలి యుత్స వమువలె ఉత్సవము చేయవలయును. మఱియు విష్ణు నామోచ్చారణ పూర్వకముగ తమ పితయొక్క నామము నుచ్చరించి విధి పూర్వకముగ పార్వణ శ్రాద్ధము చేయవల యును. ఇతర అధికారి జనులు ద్వాదశి దినమందు నారాయణ బలి చేయవలయును. ఇపుడు బోధాయన ఋష్యుక్త నారాయణ బలి తెలుపబడుచున్నది.

మొదట షోడశోపచారముగ విష్ణు పూజనము చేసి అనంతరము పాయసాన్న నైవేద్య మొనర్చి పిదప ఆ పాయసమును ప్రణవపూర్వకముగ, భూరాది మూడు

వ్యాహృతుల నుచ్చారము జేసి అగ్నియందు హోమము చేయవలయును. ఈ ప్రకార మగు హోమముచే సంస్కృతమైన ఆ నైవేద్యము సర్వబ్రాహ్మణులకు నొసంగవలెను. మఱియు అధికారి జనులు, ఆ నారాయణ బలియందు త్రయోదశ పురుషులను ప్రధాన ముగ పూజనము చేయవలయును.

ఆ పూజయొక్క క్రమము – ద్వాదశ సన్న్యాసులను నిమంత్రణము జేసి తన యింటికి తీసికొని రావలయును. ఒకవేళ ద్వాదశ సన్న్యాసులు దొరకని పక్షమందు శ్రేష్ఠ ఆచారసంపన్నులగు ద్వాదశ గృహస్థ బ్రాహ్మణులను పిలువవలయును. మఱియు 'కేశవాయ నమః' ఇత్యాది మంత్రములచే ఆ సన్న్యాసులను, అథవా బ్రాహ్మణులను పూజనము చేసి వారికి భోజనము పెట్టి, నానాప్రకారవస్త్రములను దక్షిణను యివ్వవల యును. త్రయోదశ సంఖ్యను పూర్ణము చేయుటకొఱకు ఒక శ్రేష్ఠ విద్వాంసుడైన సన్న్యాసిని అథవా శ్రేష్ఠబ్రాహ్మణుని పిలిచి వానికి ఉత్కృష్టపూజనము సల్పి ఉత్కృష్ట భోజనమొసంగి, తరువాత సమీపదేశమందు దర్భను ప్రసరించి, జరాయుజాది చతు ర్విధ ప్రాణులకు ఒక్కొక్క ప్రాణియొక్క నామోచ్చారము జేసి ప్రణవపూర్వకముగ భూస్స్వాహాది మంత్రములచే మధురాన్నమును బలి యివ్వవలయును.

హే శిష్య! దానాది కర్మముల విధానము చేయు శాస్త్రమేదిగలదో, అది కర్మ కర్తయగు పురుషుని శక్త్యనుసారమే కర్మములను విధానము చేయుచున్నది. కనుక ఆ నారాయణ బలియందు పూర్వము కథనము చేయబడిన పక్షములందు, ఏ పక్షము నకును నియమము చెప్పబడలేదు. నారాయణబలికర్త తన శక్త్యనుసారముగ, త్రయోదశసన్న్యాసులను అథవా బ్రాహ్మణులను భోజనము చేయించి వారికి వస్త్రాది పదార్థముల దానమిచ్చి, అనంతరము యితరబ్రాహ్మణులకు భోజనము దక్షిణ నొసంగవలెను.

హే శిష్య! ఈలాగున నారాయణ బలి చేయువారైన యధికారి జనులు తమ పితృసహితముగ విష్ణులోకమునకు ప్రాప్తులగుదురు.

హే శిష్య! యీ ప్రకారముగ ఆతురసన్న్యాసియొక్కయు, పరమహంస సన్న్యాసియొక్కయు ఉత్తరకార్యమును చెప్పితిని. ఇక నిపుడు పూర్వప్రసంగమును శ్రవణముచేయుము,

హే శిష్య! త్రిదండశిఖాయజ్ఞోపవీత ధారణముచేసి, పుత్రుని యింటిలో భిక్ష చేయువారైన కుటీచక సన్న్యాసి, సప్తగృహ భిక్షచేయువారై, దేశాంతర సంచారము

చేయువారైన బహూదకసన్న్యాసి, శిఖారహితులై యేకదండయజ్ఞోపవీతముల ధారణ చేయువారై, అష్టగ్రాస భోజనముచేయువారైన హంససన్న్యాసి. వీరిలో యెవ్వరికైన తీవ్రవైరాగ్యము కలిగినపక్షమందు పరమహంసదీక్షాధారణేచ్ఛాపక్షమందును వానికిక అష్టశ్రాద్ధహోమాదికర్మాపేక్ష లేదు. మఱేమనిన ఆతురపురుషునివలె కేవలప్రేష మంత్రోచ్చారణచేతనే వానికి పరమహంససంన్యాసప్రాప్తి యగుచున్నది. ఆ కుటీచకాది సన్న్యాసులు మొదట తమ హస్తాంజలిని జలముచే పూర్ణముగజేసి భూరాది త్రివ్యాహృతులను ప్రణవపూర్వకముగ నుచ్చారణజేసి "అభయమ్" అను పదమునుండి "స్వాహా" అను పదమువఱకుగల సమగ్రమంత్రమును. మంద, మధ్యమ, ఉత్తమ స్వరములచే నుచ్చారణమొనర్చి యజ్ఞోపవీతము తీసి శిఖను హస్తముచే ఖండించి, హస్తాంజలియందు గైకొని ప్రణవపూర్వకముగ "భూఃస్వాహా" యను మంత్రముచే ఆ శిఖాయజ్ఞోపవీతములను జలమందు, అథవా భూమియందు పరిత్యాగము చేయవలయును. శ్రుతి "ఉపవీతం భూమౌవాప్సువావిసృజేత్" అనంతరమాసన్న్యాసి, విరక్తుడై, నగ్నుడై, ఉత్తరదిశకు, అథవా పూర్వదిశకు పోవలయును. ఒకచో ఆత్మజ్ఞానేచ్ఛుయైన పక్షమందు శ్రోత్రియ బ్రహ్మనిష్ఠుడగు గురువును ఆశ్రయించవలయును....

ఇపుడు జాబాలి ఉపనిషత్తునందు కథనముచేయబడిన క్షత్రియ వైశ్యుల సన్న్యాసము నిరూపింపబడుచున్నది. తీవ్రవైరాగ్యము కలిగినపక్షమందు క్షత్రియుడు అథవా వైశ్యుడు, అష్టశ్రాద్ధహోమాది సర్వకర్మలనుచేసి, శిఖాయజ్ఞోపవీతములను జలమందు అథవా భూమియందు పరిత్యాగముచేసి, ఉత్తరదిశకు అథవా పూర్వదిశకు పోవలయును. ఐనను బ్రాహ్మణ సన్న్యాసివలె, దండాదిచిహ్నములు ధారణచేయ కూడదు జడోన్మత్తపిశాచులవలె నగ్నులై తిరుగవలయును లోన విద్వాంసులైనను బాహ్యమునకు అవిద్వాంసునివలె ప్రతీతము కావలెను. పరమహంస సన్న్యాసము నందు తన స్వరూపమును దాచుటకొఱకు, నానాప్రకారచిహ్నములు సంభవించినను, వైష్ణవదండరూపచిహ్నముల ధారణచేయుటకు ఒక బ్రాహ్మణునకే అధికారము గలదు యితరులకు లేదు. షడ్గ్రంథిగల దండమునకు నామము సుదర్శనము, అష్ట గ్రంథిగలదండమునకు నామము వాసుదేవము. ఈ కారణమువలన ఆ దండమునకు వైష్ణవదండమని నామము కలిగినది.

హే శిష్య! ఆ క్షత్రియవైశ్యసన్యాసులు నగ్నులై, పునరావృత్తిరహితులై, ఉత్తర లేక పూర్వదిశలకు పోవలయునని చెప్పుటయందభిప్రాయమేమనగా — బ్రాహ్మణ సన్న్యాసివలె ఆచార్యుడు వానికి నమస్కారముచేసి వెనుకకు తీసుకొనిరాడు. బ్రాహ్మణ సన్న్యాసి యెపుడు శిఖాదులు పరిత్యజించి, ఉత్తరాదిదిశలకు పోవునో, అపుడు

శ్రాద్ధము చేయించినవాడైన ఆచార్యబ్రాహ్మణుడు ఆ సన్న్యాసియెదుటికిపోయి, దండప్రణామముచేసి, తన హస్తద్వయమును వానిచరణములపైనుంచి యిట్లు ప్రార్థన చేయును. హే బ్రాహ్మణోత్తమా! వేదవేత్తయగు బ్రాహ్మణుని శరీరమందు సమస్తదేవతలు నివాసముచేయుటవలన ఈశ్వరరూపముగానున్నాము. నీవును అటు వంటివాడవే గనుక, యీ ఉత్తమబ్రాహ్మణశరీరమును నిరర్థకముచేయుట నీకుచితము కాదు. హే బ్రాహ్మణోత్తమ! ఏ అధికారిజనులు నీ దర్శనముచేతను, వచనముల చేతను, కృతార్థులగుదురో, ఆ అధికారిజనులయొక్కయే నీశరీరమగునుగాని నీదికాదు. కనుక లోకమందెట్లు బుద్ధిమంతుడు, యితరుని పదార్థమును నాశముచేయడో, అట్లే బుద్ధిమంతుడవైన నీవున్ను, యితరుని శరీరమును నాశముచేయకుము. దుర్లభమైన యధికారిశరీరమును పొందిన నీవు గురుముఖముగ వేదాంతశాస్త్ర శ్రవణమననాదుల జేసి, ఆత్మసాక్షాత్కారము సంపాదనము చేయుము. ఆ తరువాత స్వేచ్ఛాచారముగ వర్తనము చేయుము. హే బ్రాహ్మణోత్తమా! ఏ బ్రహ్మవేత్తయగు గురువును నీవు చిరకాలము సేవించితివో, ఆ నీ గురువునాకిట్లు ఆజ్ఞ చేయుచున్నాడు. నా శిష్యుని నానా ఉపాయములచేసి వెనుకకు తీసుకొనిరమ్ము. కనుక ఆత్మజ్ఞానప్రాప్తికొఱకై నీవును ఆజ్ఞను పాలింపుము.

హే శిష్య! ఇట్లు యాచార్యబ్రాహ్మణుడు ఆ సన్న్యాసినిగూర్చి యిట్లు నానా ప్రకారములుగ ప్రార్థన చేయుచున్నాడు. మఱియు యిచ్చట నిలువుము, యిచ్చట నిలువుము అను నీ ప్రచారవచనములబల్కి అపుడా యాచార్యుని ప్రార్థన మంగీకరించి అతడచటనే నిలబడుచున్నాడు. అనంతరమా ఆచార్యుడు ఆ సన్న్యాసికి వేణు దండము, కటిసూత్రము, కౌపీనాదికాషాయవస్త్రములు యిచ్చుచున్నాడు. అపుడా సన్న్యాసి "ఇంద్రస్య వజ్రోఽసి" యిత్యాది మంత్రములచే దండధారణము, ప్రణవ మంత్రముచే కౌపీనధారణముచేసి, ఉత్తర దిక్కునకు అథవా పూర్వదిక్కునకు తిరిగి తన గురుసన్నిధికివచ్చి, ఆ బ్రహ్మవేత్తయగు గురువునకు దండప్రణామముచేసి, బ్రహ్మవిద్యాప్రాప్తికొఱకు, శరీరమనోవాక్కులచే సేవచేయుచున్నాడు. క్షత్రియ వైశ్యసన్న్యాసులకు ఆచార్యప్రార్థనలేకుండుటవలన, కౌపీనాదిపరిధానమున్ను తిరిగి వచ్చుటయును సంభవింపదు. కనుక ఎట్లు ఋషభదేవునిచేతను, పాండవులచేతను వీరమార్గమున శరీరపరిత్యాగము చేయబడినదో, అట్లే ఆ క్షత్రియ వైశ్య సన్న్యాసులున్ను, వీరమార్గమున తమ శరీరమును పరిత్యాగము చేయవలయును. (సింహాదుల శబ్దముచేతను, జలాగ్నులచేతను, వ్యాఘ్రాదిజీవులచేతను, భయరహితమై శరీరనాశ పర్యంతము భూమిపై విచరించుటకుపేరు వీరమార్గము) ఆ సన్న్యాసులు ఉత్తర మార్గము అథవా పూర్వమార్గము చేపట్టి బ్రహ్మవేత్తయగు గురువుయొక్క అన్వే

షణము చేయుచు చేయుచు పోవలయును. మఱియొక మార్గమున పోకూడదు. గురుశోధనమార్గమందు జలాశయము, అథవా అగ్ని యిత్యాది ప్రతిబంధకపదార్థము లున్నను వాటిని లక్ష్యపెట్టక తమ నిష్ఠయందే యుండి పోవుచుండవలయును. భయపడకూడదు. ఇపుడు శూద్రులయొక్కయు, స్త్రీలయొక్కయు, సన్న్యాసము విరూపింపబడుచున్నది. యెవడైన శూద్రునకు అథవా స్త్రీకి తీవ్రవైరాగ్యము కలిగిన పక్షమందు పూర్వోక్తశ్రాద్ధాదులును, ప్రేషమంత్రాదులును యెప్పటికిని చేయకూడదు మఱేమనిన తమ మనస్సులో సన్న్యాస సంకల్పముచేసి క్షత్రియ వైశ్యులవలె వీర సన్న్యాసమే గ్రహణము చేయవలయును. వీరసన్న్యాసమునకు అలింగసన్న్యాసమని పేరు.

ఇపుడు జాబాలాద్యుపనిషదుక్తపరమహంసధర్మముల విశేషవిషయము నొకింత చెప్పెదను. — పరమహంస సన్న్యాసి ఎవనికిని వాగ్వేదమును చేయరు. వాగ్వేదమనగా చలము, అథవా నిర్భత్సనము. ఆ వాగ్వేదము నానా ప్రకారము కలదు. వానిలో నొకదాని కుదాహరణము. క్రొత్తకంబళిని ధరించు దేవదత్తునిచూచి యొకరు నవకంబళముకలవాడు దేవదత్తుడనుచున్నారు. అది విని దురాత్ముడగు నొకడిట్లనుచున్నారు. — ఓయీ! ఈ దరిద్రుడగు దేవదత్తునకు ఒక కంబళియే ప్రాప్తించుట అశక్యమైయుండ వీనికి తొమ్మిదికంబళ్ళు యెక్కడ దొరకును? ఆ సన్న్యాసి పవిత్రమైన యేకాంతమందు వాసము చేయుచుండును. కూర్చొనునపుడు నాసాగ్రదృష్టి గల్గియుండును. అథవా — వేదాంతగ్రంథములపై దృష్టినుంచు చుండును. నడచునపుడు పాదములక్రింద ప్రాణులు హింసకాకూడదను అభిప్రాయముచే మెల్లమెల్లగా నడచును. భిక్షకొఱకు గ్రామమునకు పోయినపుడు ప్రదక్షిణ క్రమముగ గృహమునుండి అన్నమును గ్రహణముచేయును. సన్న్యాసికి జలము కొఱకు సొరకాయ కాష్ఠపాత్రము, వేరుపాత్రము, మృత్తికాపాత్రము చెప్పబడినవి. అట్లే భిక్షాన్నముకొఱకు వస్త్రము మొదలగునవి పాత్రములుగా చెప్పబడినవి. ఐనను భిక్షాన్నముకొఱకు సన్న్యాసికి ఉదరపాత్రము, హస్తపాత్రము ఇవి రెండును ముఖ్యముగా నున్నవి. ఏ సన్న్యాసి హస్తముచేతను, భిక్షాన్నగ్రహణముచేయడో, వాని ముఖమందు భక్తజనులు అన్నగ్రాసమును వేయుదురు. ఆ అన్నము ఉదరమందు పోవుటవలన ఉదరము ఒక పాత్రమని చెప్పబడియె భోగియగు వాడు రోగనివృత్తి కొఱకు ఎట్లు ఔషధమును భక్షణము చేయుచున్నాడో, అట్లు రుచిచూడక క్షుధా నివృత్తికొఱకు సన్న్యాసి అన్నభక్షణము చేయును. కాన అతడు భుజించుట రుచికొఱకుకాదు. శరీరపుష్టికొఱకుగాదు. శ్రుతి " ఔషధవదశన మాచరేత్ " ఆదరముతోగూడిన భిక్షాన్నప్రాప్తిచే ప్రసన్నుడునుకాడు. నిరాదరముతోగూడిన అన్న

ప్రాప్తిచే గ్లానియును పొందదు. మఱియును సుఖదుఃఖశీతోష్ణాదిద్వంద్వధర్మము లందు సమానుడుగ నుండును. ఋతుసంధియందు పౌర్ణమిదినమందు కేశశ్మశ్రునఖములను ముండనము చేయించును. వర్షాకాలమందు సన్న్యాసిముండనము చేయించుకొనుట, చేయించుకొనకపోవుట యను నీ రెండు పక్షములును శాస్త్రమందు గలవు.

సన్న్యాసి ఆషాఢమాస పౌర్ణమిదినమందు వ్యాసపూజ చేయవలయును. వ్యాస పంచక, కృష్ణపంచక, ఆచార్యపంచక, గురుపంచక, ఆత్మపంచకములను నీ పంచ పంచకముల పూజనము చేయవలయును. అట పూర్వాది నాల్గుదిశలందు క్రమముగ వైశంపాయన, సుమంత, జైమిని, పైలవురసు నీ నలుగురి మధ్యమందు వ్యాసభగవంతు డుండుట, ఇది వ్యాసపంచకము, పూర్వాది నాల్గుదిశలందు క్రమముగ వసుదేవ, సంకర్షణ, ప్రద్యుమ్న, అనిరుద్ధులను నీ నల్గురిమధ్యమందు కృష్ణభగవంతుడుండుట యిది కృష్ణపంచకము. పూర్వాది నాల్గుదిశలందు క్రమముగ విశ్వరూప, పద్మపాద, హస్తామలక, తోటకులను నీ నల్గురిమధ్యమందు శంకరాచార్యులుండుట యిది ఆచార్య పంచకము. పూర్వాది నాల్గుదిశలందు క్రమముగ పరమగురు పరమేష్ఠిగురు గోవింద పాద గౌడపాదులను నీ నల్గురి మధ్యమందు తన గురువుండుట గురుపంచకము. పూర్వాది నాల్గుదిశలందు క్రమముగ అంతరాత్మ, జ్ఞానాత్మ, పరాత్మ ఆనందాత్మలను నీ నల్గురి మధ్యమందు ఆత్మ (కూటస్థాత్మ) యుండుట యిది ఆత్మపంచకము హే శిష్య ! పూజామండపమధ్యమందు కృష్ణపంచకమును, స్థాపనముశేసి కృష్ణ పంచకముయొక్క పూర్వదిశను ఆత్మపంచకమును, దక్షిణదిశ నాచార్యపంచకమును పశ్చిమదిశను గురుపంచకము. ఉత్తరదిశ వ్యాసపంచకమును, స్థాపనము చేయవల యును. మఱియు కృష్ణపంచకమునకు ఆగ్నేయ, నైఋతి, వాయవ్య, ఈశాన్యములను నీ నాల్గుకోణములందు క్రమముగ గణపతి, దుర్గాదేవి, సరస్వతి, క్షేత్రపాలురను నీ దేవతలను స్థాపనము చేయవలయును. కృష్ణదేవుని సన్నిధిని సనక, సనందన, సనత్కుమార సనత్సుజాతలను నీ నలుగురిని అగ్రభాగమందు, నరనారాయణులను నీయిరువురుని పృష్ఠదేశమందు, బ్రహ్మ విష్ణు మహేశ్వరులను నీ ముప్వురను నరనారాయణుల అగ్రభాగమందు నారదమునిని స్థాపనము చేయవలయును. అట్లే యింకను మునీశ్వరులను దిక్పాలకులను యథాయోగ్యస్థానములందు స్థాపనము చేయవలయును. ఆ యందఱియందును కృష్ణభగవంతునో మూలమంత్రముచే పూజ నము చేయవలయును. ఇతర దేవతలను ప్రణవపూర్వకముగ 'గురవేనమః' 'ఆత్మనే నమః' యిత్యాది నామమంత్రములచే పూజింపవలయును. ఈ ప్రకారముగ వ్యాసాది దేవతల పూజనముచేసి ఆ స్థానమందు రెండులేక నాల్గుమాసములు నివాసము చేయ వలయును.

హే శిష్య! వర్షాకాల చాతుర్మాసములందు భూమియందనేక క్షుద్రజంతువులు పుట్టును. మఱియు దేశాంతరముపోవుటయందు అనేకప్రాణుల హింసయగునను విచారముచే ఒకేచోట నాల్గుమాసములవఱకు నివాసము చేయవలయును ఆ పరమ హంస సన్న్యాసులు యే ప్రాణిని హింసచేయరు. అసత్యభాషణముచేయరు చౌర్యము చేయరు. స్త్రీసంగము చేయరు. విషయసాధనమును సంగ్రహింపరు ఏ దంభచేష్ట యున్నుచేయరు వ్యర్థవచనోచ్చారము చేయరు. సర్వదా మహాదేవ విష్ణువులయొక్క స్మరణమును కీర్తనమునుచేయుదురు. ప్రియాప్రియపదార్థ ప్రాప్తిచే హర్షవిషాదమును చేయరు. శత్రుమిత్రులందును, మానావమానములందును సమానబుద్ధిగల్గియుందురు సకలప్రాణిమాత్రులకు సుఖప్రాప్తి గోరుదురు. సువర్ణాదిపదార్థములను సుందర స్త్రీలను కాకవిష్ఠాసమానముగ తుచ్ఛముగనెఱిగి దూరమునుండియే పరిత్యాగము చేయుదురు ఆ సన్న్యాసులు సర్వదా మనస్సునుగూర్చి యిట్లు బోధనము చేయుదురు ఓ మనసా! ఏ శరీరమునందు నీవు తాదాత్మ్యాభిమానము చేయుచున్నావో, ఆ శరీర మెట్లున్నదనగా — అది మాతాపితరుల శుక్లశోణితములచే పుట్టినది. విష్ఠా మూత్రాదిమలములకు స్థానమైయున్నది. యిటువంటి నింద్యశరీరమునందు అభి మానముచేయుట నీకుచితముకాదు మఱియు హే శిష్య! ఆ పరమహంససన్న్యాసులు 'నేను బ్రహ్మరూపుడను' అను నీ ప్రకారమగు నభేదజ్ఞాన ప్రాప్తికొఱకు బ్రహ్మవేత్త యగు గురుముఖమున వేదాంతవచనశ్రవణమనన నిదిధ్యాసములను, ప్రణవమంత్రా దుల జపమును చేయుచుందురు.

ఇపుడు పరమహంసోపనిషత్తునందు చెప్పబడిన విశేషధర్మములు నిరూ పింపబడుచున్నవి. — ఎట్లు గృహస్థాదిబ్రాహ్మణులు త్రికాలసంధ్యావందనము చేయుదురో, అట్లే పరమహంసయును సంధ్యావందనముచేయుచుండును (జీవబ్రహ్మ భేదపూర్వకముగ నేను బ్రహ్మరూపుడనను చింతనమే సంన్యాసికి సంధ్యావందనము) ఏ చేష్టవలన జనులు ప్రసన్నులగుదురో, ఆ చేష్టసన్న్యాసి యెప్పటికినిచేయడు ఆత్మభిన్నపదార్థమును కథనముచేసినదైన మంత్రముయొక్క జపముచేయడు. వాటి ధ్యానమునుచేయడు ఆత్మయొక్క ధ్యానమునేచేయును. వెయ్యేల — పరమహంస సన్న్యాసి సకల జగత్తును ఆత్మరూపముగనే నెఱుగును హే శిష్య! సన్న్యాసి రాగ ముతో సువర్ణాదిపదార్థములచూచుచో ఆ సన్న్యాసి బ్రాహ్మణ స్త్రీయందు శూద్ర పురుషునిచే పుట్టినపురుషుని సమానముగాను, రాగముచే సువర్ణాదిపదార్థములను స్పర్శముచేయుచో, ఆతడు శూద్రస్త్రీయందు నిషాదునిచే పుట్టినవాడుగను, సువర్ణాది పదార్థములను సంగ్రహముచేయుచో, ఆతడు ఆత్మహత్య యొనర్చినవాడుగను యెన్న బడినది. ఎవడు ఆత్మహననముచేయునో, ఆతడు సకల జగత్తుయొక్కయు హననము

చేయువాడగును. ఏలాగుననగా — ఆత్మయే జగద్రూపుడుకదా! ఆ పరమహంస సన్న్యాసి వివేక వైరాగ్యాదిసాధనసంపన్నుడై పూర్వపు యజ్ఞోపవీతమును పరిత్యాగము చేసి ఆ స్థానమున ఆత్మజ్ఞానరూపమైనట్టి యజ్ఞోపవీతమును, పూర్వశిఖను పరిత్యాగము చేసి ఆ స్థానమున ఆత్మజ్ఞానరూపనూతనశిఖను ధారణచేయును.

హే శిష్య! పరమహంసోపనిషత్తునందును, ఆరుణికోపనిషత్తునందును ఆత్మజ్ఞానరూపయజ్ఞోపవీతముయొక్కయు, ఆత్మజ్ఞానరూపశిఖయొక్కయు విధానము చెప్పబడియున్నది. దానినిగూర్చి వినుము - ఎట్లు లోకమందు గృహస్థ బ్రాహ్మణాదుల కంఠమున మూడు దారములతోగూడిన యజ్ఞోపవీతములో ఒక్కొక్క దారమునకు మూడుమూడు తంతువులుగలవో అట్లే బ్రహ్మవేత్తయగు సన్న్యాసియొక్క హృదయ దేశమందు స్థితమైన ఏనవతత్త్వములుగలవో, అవియే ఆ సన్న్యాసికి నవతంతురూప యజ్ఞోపవీతమైయున్నది. (ఈశ్వర, హిరణ్యగర్భ, విరాట్, విశ్వ, తైజస, ప్రాజ్ఞ, ప్రాణ, అపాన, వ్యానములనునవి నవతంతువులు) ఎట్లు నవతంతువులచే చేయబడిన దైన యజ్ఞోపవీతము యజ్ఞాదికర్మములకు సాధనమైయున్నదో, అట్లే యీ నవతత్త్వ విచారముచే ప్రకటితమైన ఏ అఖండచైతన్యము కలదో, ఆ చైతన్యము జ్ఞానరూప యజ్ఞమునకు అంగమగుటవలన అద్దానిని శాస్త్రవేత్తలు యజ్ఞోపవీతమనుచున్నారు. మఱియు "యజ్ఞోపవీతం పరమం పవిత్రం" అను మంత్రమున్ను, ముఖ్య వృత్తిగా యీ చైతన్యరూప యజ్ఞోపవీతమునే కథనము చేయుచున్నది. ఎందుకనగా - పరమపవిత్రతయో చైతన్యమందుగాక యింకొక యనాత్మపదార్థమందు సంభవింపదు. చైతన్యమే పరమపవిత్రమై యున్నది. ఇటువంటి చైతన్యరూప యజ్ఞోపవీతమును హృదయదేశమందెఱిగి ఆ సన్న్యాసులు బాహ్యయజ్ఞోపవీతమును పరిత్యాగము చేయు చున్నారు. మఱియు సంపూర్ణదృశ్యప్రపంచమును పరిత్యాగముచేసి తదధిష్ఠానరూప మగు అక్షరబ్రహ్మమునే ఆ విద్వత్పురుషులు సూత్రరూపముగ నిశ్చయముచేయు చున్నారు. ఎట్లు లోకప్రసిద్ధతంతువు తనయందు స్థితమైన వస్త్రమును ప్రకాశము చేయుటవలన దానిని సూత్రమనుచున్నారో, అట్లే ఆ పరబ్రహ్మమున్ను తనయందు స్థితమైన జగద్రూపవస్త్రమును ప్రకాశముచేయుటవలన నా పరబ్రహ్మమును శాస్త్రవేత్తలు సూత్రమనుచున్నారు.

హే శిష్య! ఏ విద్వత్పురుషునిచే ఆ పరబ్రహ్మసూత్రము తన ఆత్మరూపముగ నెఱుగబడినదో, ఆ విద్వాంసుడే సర్వము వేదార్థము నెఱిగినవారుగానున్నారు. హే శిష్య! ఎట్లు సూత్రాధారముగ సర్వమణులు గలవో అట్లే ఏ చైతన్యబ్రహ్మరూపసూత్ర మందు దృశ్యప్రపంచరూపమణులు గలవో, ఆ చైతన్యరూపసూత్రమునే విద్వత్పురుషులు ధారణము చేయుచున్నారు.

హే శిష్య! ఏ పురుషుడు అష్టాంగయోగము నెఱిగినవారై నిత్యానిత్యవస్తు వివేకముగలవారైయున్నారో, ఆ పురుషుడే చైతన్యరూపసూత్రధారణమందు సమర్థుడగును. కాని యితర పురుషుడు సమర్థుడుకాడు. హే శిష్య! జీవబ్రహ్మభేదము నెఱిగినవారై బాహ్యసూత్రపరిత్యాగముచేయువారై చైతన్యరూపబ్రహ్మసూత్రమునే ధారణము చేయువారైన విద్వత్పురుషుడే చైతన్యరూపుడైయున్నాడు. ఇతర పురుషులెన్ని శాస్త్రముల నెఱిగినవారైనను శిలవలె జడరూపులైయే యున్నారు.

హే శిష్య! చైతన్యసూత్రమును ధారణముచేయువారైన విద్వాంసు డెప్పుడును నీచత్వమును పొందడు, అశుచివంతుడునుకాడు. అతనికి ఆత్మజ్ఞానమే ప్రధానకర్మమై యున్నది. ఆ విద్వాంసుని కాయిక వాచిక మానసిక పాపకర్మములనుండి శుద్ధము చేయదగినది ఆత్మజ్ఞానమే యైయున్నది. భగవంతుడును యిట్లు వచించెను. "నహిజ్ఞానేన సదృశం పవిత్రమిహవిద్యతే" ఆత్మజ్ఞానమునకు సమానముగ పవిత్రమైనది యింకొక పదార్థములేదు. హే శిష్య! ఎట్లు అగ్నిజ్వాలరూపశిఖ అగ్నికన్న భిన్నముకాదో, అట్లే నిత్యవిజ్ఞానరూపశిఖ తన స్వరూపముకన్న భిన్నముకాని విద్వాంసునే వేదవేత్తలు "శిఖి" యనుచున్నారు. ప్రసిద్ధకేశములను ధారణచేయువారైన, శూద్రులను స్త్రీలను యెవరును శిఖియనరు.

శిష్యుడు — హే భగవన్! ఎపుడు జ్ఞానరూప యజ్ఞోపవీతము జ్ఞానరూప శిఖయే శ్రేష్ఠములో అపుడు సర్వబ్రాహ్మణులు బాహ్యయజ్ఞోపవీతశిఖల పరిత్యాగము చేయవలసినదా?

గురువు — హే శిష్య! వేదభగవంతునిచే కథనము చేయబడిన అగ్నిహోత్రాది కర్మములందు అధికారిబ్రాహ్మణులకు బాహ్యయజ్ఞోపవీతమున్ను శిఖయు అవశ్యముగ కావలసినది. అంతఃకరణ శుద్ధిగలవానికది యక్కరలేదు. పైనదెల్పినదే కావలసినది. బ్రహ్మవేత్తలగువారు జ్ఞానమయయజ్ఞోపవీతము, జ్ఞానమయశిఖ ధారణ చేయువారినే బ్రాహ్మణులనుచున్నారు. తదితర బ్రాహ్మణులందు బ్రాహ్మణత గౌణముగా నున్నది. వజ్రసూచిదోపనిషత్తు యిట్లు వచింపుచున్నది.

"జన్మనా జాయతే శూద్రో వ్రతబంధాద్ద్విజస్స్మృతః।
వేదాభ్యాసాద్భవేద్విప్రో బ్రహ్మణావాతి బ్రాహ్మణః॥"

జీవుడు జన్మముచే శూద్రసంజ్ఞను, ఉపనయనసంస్కారముచే ద్విజసంజ్ఞను వేదాధ్యయనముచే విప్రసంజ్ఞను బ్రహ్మజ్ఞానముచే బ్రాహ్మణసంజ్ఞను పొందుచున్నాడు.

హే శిష్య! ఎట్లు ఆత్మజ్ఞానరూపయజ్ఞోపవీతశిఖలులేనిచో యితర యజ్ఞోపవీతశిఖలచే "శిఖిత" సంభవింపదో, అట్లే ఆత్మజ్ఞానరూప దండము లేకున్న కేవల

కాష్ఠదండధారణముచే సన్న్యాసికి "దండిత" సిద్ధింపదు. పరమహంసోపనిషత్తు యిట్లు తెలుపుచున్నది. —

"జ్ఞానదండో ధృతో యేన ఏకదండీ స ఉచ్యతే ।
కాష్ఠదండో ధృతో యేన సన్న్యాసీ జ్ఞానవర్జితః ।
స యాతి నరకాన్ ఘోరాన్ మహారౌరవసంజ్ఞకాన్ ॥"

భావార్థము — ఏ సన్న్యాసిచేత ఆత్మజ్ఞానరూపదండము ధారణము చేయబడినదో, ఆ సన్న్యాసియే ఏక దండి యనబడును. ఏ సన్న్యాసిచే కేవలము కాష్ఠ దండముమాత్రము ధారణచేయబడినదో, ఎవడు జ్ఞానదండముచే రహితుడుగ నున్నాడో, విషయాసక్తిగలవాడుగ నున్నాడో, ఆ సన్న్యాసికి మరణానంతరము రౌరవాదిమహాఘోరనరకములు ప్రాప్తమగును.

హే శిష్య ! జ్ఞానదండధారియగు సన్న్యాసి తన మనస్సుతో యిట్లు విచారము చేయును. — ఎట్లు మధ్యాహ్నసూర్యుడు అంధకారరహితుడో అట్లే ఏ అద్వితీయ బ్రహ్మము తన స్వయంజ్యోతిరూపముచే సర్వదా అవిద్యాంధకారరహితముగనున్నదో, ఆ అద్వితీయబ్రహ్మము ఈ జీవాత్మయందు సర్వదా అభేదరూపముగ స్థితమైయున్నది. తటస్థరూపముగ స్థితముకాదు. ఆ యద్వితీయబ్రహ్మము జన్మమరణాది సకలవికార రహితమై ఆకాశమువలె సర్వత్రవ్యాపకమై సకల క్రియారహితమై నిశ్చలరూపమై యున్నది. ఆ యద్వితీయబ్రహ్మము మా యాత్మరూపమే యైయున్నది. ఇటువంటి ఆత్మస్వరూపబ్రహ్మమే మాకు ఉత్కృష్టప్రియస్థానమై యున్నది.

శ్రుతి॥ "స భూమా కస్మిన్ ప్రతిష్ఠితః స్వే మహిమ్ని"

భావార్థము — ఆ వ్యాపకాత్మదేవుడు యెక్కడనున్నాడను ప్రశ్నకు తన స్వప్రకాశమహిమయందని శ్రుతిభగవతి ఉత్తరము చెప్పుచున్నది. ఆ యద్వితీయ బ్రహ్మము మాకుమాత్రమే ఆత్మకాదు. సంపూర్ణజగత్తునకును ఆత్మస్వరూపమై యున్నది కనుక ఆ జ్ఞానస్వరూపబ్రహ్మమే మాకు దండరూపమైయున్నది. లోక మందు రాజాదులే ఉపాయముచే శత్రువు మొదలగువారిని తమ వశముగ జేయుదురో, ఆ ఉపాయమునకు దండమనిపేరు. ఈ ప్రకారదండశబ్దమునకు ముఖ్యార్థము జ్ఞాన స్వరూపబ్రహ్మమునందే ఘటింపుచున్నది. ఏలాగుననగా — ఆ జ్ఞానస్వరూపబ్రహ్మమే మహావాక్యజన్యఅంతఃకరణవృత్తియందారూఢమై కార్యసహితాజ్ఞానరూపశత్రువును నివృత్తము చేయుచున్నది. మా హస్తమందు గల కాష్ఠదండము మనస్సును వశము

చేయుటకు సమర్థముకాదు. మఱేమనిన మనోవశమునుగూర్చి కొంచెము. స్మృతిని మాత్రము కలుగజేయుచున్నది కనుక ఈ కాష్ఠదండము దండశబ్దమునకు గౌణార్థము.

హే శిష్య! ఈ ప్రకారముగ విచారముచేసి ఆ పరమహంససన్న్యాసులు సర్వ కర్మాధికారమునుండి రహితులై అద్వితీయబ్రహ్మమును స్వాత్మరూపముచే అపరోక్షముగ జూచుచున్నారు.

ఇప్పుడు బ్రహ్మోపనిషద్భాగము నిరూపింపబడుచున్నది. హే శిష్య! ఈ త్వంపదార్థజీవాత్మను స్పష్టీకరించుటకై బ్రహ్మోపనిషత్తునందు వాస్తవముగ అవస్థా రహితాత్మకు మాయావశముగ జాగ్రత్స్వప్న సుషుప్తి తురీయములను నీనాల్గవస్థలు చెప్పబడినవి. ఈ నాలుగు అవస్థలకు, నాభి కంఠ, హృదయము, మూర్ధములను నీనాలుగు స్థానములు గలవు హే శిష్య! ఈ అంతఃకరణవిశిష్టజీవాత్మ ఎపుడు నాభిదేశమునుండి నేత్రమువరకు స్థితమగునో, అపుడు జాగ్రదవస్థను విశ్వనామమును పొందుచున్నాడు. కంఠదేశమందు విశేషముగ స్థితమైనపుడు తైజస సంజ్ఞను స్వప్నావస్థను పొందుచున్నాడు. హృదయకమలమందు స్థితమైనపుడు ప్రాజ్ఞసంజ్ఞను సుషుప్త్యవస్థను పొందుచున్నాడు. మూర్ధస్థానమందు స్థితమైనపుడు శుద్ధాత్మసంజ్ఞను తురీయావస్థను పొందుచున్నాడు. నాలుగు అవస్థలదేవతలు, జాగ్రదవస్థకు విరాట్టున్ను, స్వప్నావస్థకు హిరణ్యగర్భుడున్ను, సుషుప్త్యవస్థకు రుద్రుడున్ను, తురీయావస్థకు పరమాత్మయున్ను దేవతలైయున్నారు. హే శిష్య! తురీయావస్థాదేవతారూపుడగు పరమాత్మదేవుడు మాయోపాధిసంబంధముచే సర్వజగద్రూపుడైనాడు. వాస్తవముగ ఆ పరమాత్మదేవుడు కార్యకారణభావరహితుడై మనోవాక్కులకవిషయుడై, ఆనంద రూపుడుగా నున్నాడు. ఆ పరమాత్మదేవునియందు కర్మఫలరూపమైనవిషయములు తమ స్వభావమును పరిత్యాగము చేయుచున్నవి అట్లే సకల దేవతలు వేదములు, యజ్ఞము, మాత పిత, స్నుష (కోడలు) మొదలగు మమాధ్యాసమునకు విషయములును, బ్రాహ్మణత్వ క్షత్రియత్వాది అహంత్వాధ్యాసమునకు విషయములును, బ్రహ్మచర్యాది నాల్గు ఆశ్రమములును, ఉత్తమ, మధ్యమ, కనిష్ఠ, కర్మ, కర్తలును సుఖ దుఃఖప్రాప్తిచేయదగిన నానా సాధనములును, యిహలోక పరలోక సంబంధ సుఖ దుఃఖరూపఫలములను ఈ మొదలగు సంసారమెంతగలదో, ఆ సకలసంసారమున్ను పరమాత్మదేవునియందు వాస్తవముగ లేదు. ఇటువంటి పరమాత్మదేవుడు శుద్ధచిత్తము గలవారైన అధికారిజనులకు. తన స్వయంజ్యోతిరూపకముగ ప్రతీతమగుచున్నాడు. మఱియు ఆ పరమాత్మదేవుడు యింద్రాది సకలదేవతలను తన ఆజ్ఞయందు నడిపించు చున్నాడు. ఋషి పితృదేవతాది మహాపురుషులున్ను, ఆ పరమాత్మదేవుని నిర్భయము

చేయుటయందు సమర్థులుకారు. ఆ పరమాత్మదేవుడు సకలజడపదార్థములకన్న విలక్షణముగాను చిద్ఘనరూపముగాను అద్వితీయరూపముగాను నిర్గుణరూపముగాను ఉన్నారు. "సాక్షి చేతా కేవలో నిర్గుణశ్చ" యను శ్రుతివాక్యమందుగల చేతాశబ్ద మున కర్థముగ, కొందఱు భేదవాదులు పరమాత్మ చైతన్యగుణముగలవాడనుచున్నారు. (పరమాత్మదేవుడు జ్ఞానాదిగుణములుగలవాడుకాడు జ్ఞానస్వరూపుడేయనుసంగతి పూర్వము చెప్పబడియె) కాని అట్లుకాదు. ఆ చేతాశబ్దము చైతన్యస్వరూపాత్మను కథనము చేయుచున్నది. ఆ పరమాత్మదేవుడు మాయాసంబంధముచే తనస్వరూపమునే జగద్రూపముగజేసి, ఆ జగత్తును తన ఆజ్ఞయందు వర్తనము చేయించుచున్నారు

హే శిష్య! ఎట్లు కాష్ఠస్థితమైయున్న అగ్ని ఆ కాష్ఠములయొక్క మథనరూపో పాయములచేతనే ప్రకటితమగుచున్నదో, అట్లే బ్రహ్మవేత్తలగు పురుషులచే ఆత్మ సాక్షాత్కారముకొఱకియుపాయము కథనము చేయబడియె అధికారిపురుషులు తమ బుద్ధిని క్రింది అరణినిగాజేసి ప్రణవమును పై అరణిగజేసి ధ్యానమను మథనము చేసినపుడు ఆత్మసాక్షాత్కారరూపాగ్ని ప్రకటితమగును. ఆ యాత్మజ్ఞానరూపాగ్ని కార్యసహితాజ్ఞానమును దహించును హే శిష్య! అధికారిపురుషులు మొదట విశ్వ తైజస, ప్రాజ్ఞతురీయులను నీ నలుగురిని క్రమముగ విరాట్, హిరణ్యగర్భ ఈశ్వర పరమాత్మలతోటి అభిన్నరూపముగ చింతనము చేయవలయును. పిదప క్రమముగ అకార ఉకార మకార అర్ధమాత్రలయొక్క అభేదచింతనము చేయవలయును. ఈ ధ్యానమే రెండు అరణులయొక్క మథనమై యున్నది

హే శిష్య. కాష్ఠమందగ్ని ప్రకటితమగునట్లును, తిలలందుతైలము ప్రకటిత మగునట్లును, దుగ్ధమందు నవనీతము ప్రకటితమగునట్లును, యీ ధ్యానరూపో పాయముచేతను, తప, సత్య, వివేకాది ఉపాయములచేతను. ఆత్మదేవుడు ప్రకటిత మగుచున్నాడు. హే శిష్య! ఏ స్వయంజ్యోతిరూపాత్మను మనస్సు. ఇంద్రియములు విషయము చేయజాలవో, అట్లే స్వయంజ్యోతిరాత్మను, వివేకులైన అధికారిపురుషులు. మనోనిగ్రహముచే సాక్షాత్కరించుచున్నారు (మోక్షమును పొందుచున్నారు) మనో నిగ్రహము లేనిచో, కోటిజన్మములకైనను ఆత్మసాక్షాత్కారమును పొందలేరు. (మోక్ష మును పొందలేరు)

ఇపుడు బ్రహ్మబిందూపనిషద్భాగము నిరూపింపబడుచున్నది.

శ్రుతి॥ "మనోహి ద్వివిధం ప్రోక్తం, శుద్ధంచాశుద్ధమేవచ
అశుద్ధం కామసంకల్పం శుద్ధం కామవివర్జితం॥"

హే శిష్య! శుద్ధాశుద్ధభేదముచే మనస్సు ద్వివిధము. అందు రాగసంకల్పాది యుక్తమనస్సు అశుద్ధముగాను, రాగవివర్జితమైన నిష్కామ మనస్సు శుద్ధముగానున్నది.

దానిలో అశుద్ధమనస్సు బంధమునకు కారణముగను, శుద్ధమనస్సు మోక్షమునకు కారణముగనున్నది ఎపుడధికారియొక్క మనస్సు ఆత్మసాక్షాత్కారముచే ద్వైత ప్రపంచాకారవృత్తిని పరిత్యాగము చేయుచున్నదో అపుడా అధికారిపురుషుడు ద్వైతా గ్రహణరూప అమనస్కభావమును పొందుచున్నాడు.

శిష్యుడు — హే భగవన్! ఏకాలమందు మనస్సు అమనస్కభావమును పొందునో, ఆ కాలమందు ఆత్మయొక్క స్వరూపము ఏలాగున పరిశేషముగా నుండును?

గురువు — హే శిష్య! అమనస్కభావప్రాప్తికాలమందు ఆత్మయొక్క స్వరూపమును వేదవేత్తలు ఈలాగున కథనముచేయుచున్నారు. ఆ కాలమందీయాత్మ దేవునకు బ్రహ్మయొకటియే బోధయగును ఇతరమైన అనాత్మపదార్థములయొక్క బోధకాదు. ఈ కారణమువలన ఆ కాలమందు ఆ ఆత్మదేవుడు జ్ఞేయమైన పరబ్రహ్మ వస్తువుకన్న అభిన్నమగు స్వప్రకాశజ్ఞానరూపుడేయై యుండును.

హే శిష్య! కొందఱు భ్రాంతపురుషులు సుషుప్తియందు మనస్సులయమగు వట్లు లయమగుట అమనస్కభావమనుచున్నారు (అట్లనట సంభవింపదు ఎందు కనగా — సుషుప్త్యవస్థలోని మనోలయమునకును సమాధ్యవస్థలోని మనో నిరోధమున కును చాల విశేషత కలదు చూడుము — సుషుప్తిలో ఆ మనస్సు తన కారణాజ్ఞాన మందు సూక్ష్మరూపముగ స్థితమగుచున్నది. సమాధిలో మనస్సు లయభావమును పొందదు. మఱేమనిన ఆ మనస్సు అధిష్ఠానబ్రహ్మమందు బాధనుపొందుచున్నది. ఇంకను వానియందలి విశేషతనుచూడుము — సమాధిలో జ్ఞాతృ జ్ఞాన, జ్ఞేయాది త్రిపుటిభేదరహితమైన ఆ మనస్సు అద్వితీయ బ్రహ్మరూపమేయగుచున్నది. ఆ బ్రహ్మ మెట్టిదనగా — ద్వైతభావరహితమై, అభయమై స్వప్రకాశజ్ఞానస్వరూపమై సర్వత్ర వ్యాపకమై, జన్మాది వికారరహితమై, అజ్ఞానరూప నిద్రారహితమై అహంమమేత్యాది సకలాధ్యాసవర్జితమై నామరూపాదిధర్మరహితమై నేత్రాదీంద్రియముల కవిషయమై యున్నది. ఆ బ్రహ్మముయొక్క జ్ఞానముచే ఒకేపర్యాయము నాశముపొందినదైన అవిద్య మఱల పుట్టదు. ఈ కారణమువలన ఆ బ్రహ్మము ఒకేసారి ఆవిర్భూత మగుచున్నది. ఇటువంటి శుద్ధచైతన్యబ్రహ్మముతో సమాధిఅవస్థయందు మనస్సు ఏకాకారతను పొందుచున్నది మఱియు సుషుప్త్యవస్థలో మనస్సు అవిద్యావిశిష్ట చైతన్యముతో లయభావమును పొందుచున్నది. ఈలాగున సమాధికిని సుషుప్తికిని మహావిలక్షణత కలదు. ఇపుడు సమాధియొక్క దుర్లభత నిరూపింపబడుచున్నది

హే శిష్య! అనేకజన్మపుణ్యప్రభావముచేతనే అధికారియొక్క మనస్సు యెపుడు అమనస్కభావమును పొందుచున్నదో, అపుడే ఆ అధికారి నిర్వికల్పసమాధిని

పొందును. ఆ నిర్వికల్పసమాధి యెట్టిదనగా — వాగాదీంద్రియసంబంధశబ్దాది విషయరహితమై అంతఃకరణసంబంధచిత్తాది వృత్తిరహితముగానున్నది. ఇటువంటి నిర్వికల్ప సమాధియందు సకలద్వైతమున కభావమగుచున్నది. కనుక ఆ సమాధి యందు స్థితుడైన విద్వాంసుడు ఏ ఒక పదార్థమును గ్రహణముచేయడు. త్యాగమును చేయడు. అద్వితీయాత్మరూపుడే తానగుచున్నాడు. సంకల్పవికల్పరహితుడగు చున్నాడు. సమతాభావమును పొందుచున్నాడు.

హే శిష్య! యిటువంటి నిర్వికల్పసమాధి వేదాంతశాస్త్రముచే కథనము జేయ బడినను బ్రహ్మవేత్తయగు గురువుయొక్క ఉపదేశముచేతనే అధికారికి సమాధిప్రాప్తి యగుచున్నది. గురూపదేశములేక ప్రాప్తముకాదు.

హే శిష్య! ఈ నిర్వికల్పసమాధి జ్ఞాతృ, జ్ఞాన, జ్ఞేయ, ధ్యాతృ, ధ్యాన, ధ్యేయాది సకల త్రిపుటీసంబంధరహితముగ నుండుటవలన విద్వత్పురుషులీసమాధిని, అస్పర్శ యోగమను నామముచే కథనము చేయుచున్నారు ఇటువంటి నిర్వికల్పసమాధిని వేదాంతవిచారరహితులైన యోగులు జూచుటకును శక్యులుకారు. ఏలననగా - భయ రహితమైన యేకాంతదేశమందు భయకారణతను ఆరోపణముచేసి మూర్ఖబాలకు డాస్థానమునుండి భయముచే పరుగెత్తుచున్నాడు. అలాగువనే సకల భయరహితమైన ఆనిర్వికల్పసమాధియందు భయకారణత నారోపణముజేసి వేదాంతవిచారణరహితులైన యోగులు భయపడుచున్నారు. హే శిష్య! ఎట్లు జన్మాంధపురుషుడు ప్రసిద్ధరూప మును అన్యథారూపముగ వర్ణనముచేయుచున్నాడో, అట్లే వేదాంతవిచారరహితులగు యోగులు, అంతరాత్మయొక్క అజ్ఞానముచే, ఆ యమనస్కభావరూపసమాధిని సుషుప్తి తుల్యముగ కథనము చేయుచున్నారు. ఆ వేదాంతవిచారవిహీనులగు యోగులకు నిర్వికల్పసమాధియందు భయప్రాప్తికలుగుటకు రెండు కారణములు గలవు మొదటిది స్వరూపాజ్ఞానము, రెండవది శాస్త్రవిరుద్ధనానాప్రకారకుతర్కములు. ఇపుడు కుతర్క నిరూపణము గావింపబడుచున్నది — సాంఖ్యవాదుల కుతర్కము — సర్వత్రభేదరహిత మైన ఒకే అద్వితీయాత్మ సర్వశరీరములయందు వ్యాపకుడై సచ్చిదానందస్వరూపుడై యున్నాడను వేదాంతమతమునందు కధనముచేయబడిన యట్టి ఆత్మస్వరూపము సంభవింపదు. ఎందుకనగా — సర్వప్రాణులందు ఒకే ఆత్మయుండినపక్షమందు, ఒకడు సుఖి ఒకడు దుఃఖి కాకుండవలసియుండె, అందఱును సుఖులు అథవా అంద రును దుఃఖులు కావలసియుండె, అట్లుకనబడుటలేదు. కనుక ఒక్కొక్క శరీరమందు ఒక్కొక్క ఆత్మకలదు. ఈలాగున అనేక శరీరములందనేక ఆత్మలంగీకరింపవలసినది. మఱియు అనేకాత్మలకు భోగమోక్షముల నివ్వదగినట్టి ఒకే ప్రకృతిని అంగీకరింప

వలసినది ఆ ఒకే ప్రకృతి సంసారదశయందు మహత్తత్త్వాద్యనేకరూపములుగా స్థితమైయున్నను మోక్షావస్థయందది మనుజునకు దర్శనమివ్వదు. అథవా ఆ ప్రకృతి సంసారదశయందు బంధరూపపరిణామమును పొందినను, మోక్షకాలమందు ముక్తి రూపప్రతిలోమపరిణామమును పొందుచున్నది. అథవా ఆ ప్రకృతి తన స్వరూపముచే మనుజునకు బంధప్రాప్తికలుగజేయదు మరేమనిన మనోరూపముచే బంధప్రాప్తి కలుగజేయుచున్నది. ముక్త్యవస్థయందు కృతార్థమైన ఆ మనస్సు తన కారణమందు లయరూపతను పొందుచున్నది యీ మూడు ప్రకారములును సంభవించుచున్నవిగావి. వేదాంతులచే మనస్సునకు అద్వితీయబ్రహ్మమునందు తాదాత్మ్యరూపముచే లయమేది అంగీకరింపబడుచున్నదో, అది సంభవింపదు. ఎందుకనగా — లోకములో తన కారణమునందు కార్యమునకు లయము కనిపించుచున్నది. ఎట్లన — ఘటమునకు తన కారణమైన మృత్తికయందే లయము కనబడుచున్నది అకారణమైన తంతువునందు లయము కన్పడుటలేదు అట్లే అకారణమైన నిర్వికారాద్వితీయ బ్రహ్మమునందు మనస్సునకు లయము సంభవింపదు. — ఇక నైయ్యాయికాది మతస్థుల కుతర్కములు — సర్వసాక్షియైన ఆనందరూపస్వయంజ్యోతిరాత్మను నైయ్యాయికులు జ్ఞానరహితమని, జడమనియనుచున్నారు. శూన్యవాదులగు మాధ్యమికులు సుఖజ్ఞానమును అత్యంతాసత్యమే యనుచున్నారు నైయ్యాయికమతమందో, ఆత్మతో మనస్సంయోగమైనపుడు ఆ యాత్మయందు జ్ఞానసుఖాదిగుణములు పుట్టుచున్నవి. మాధ్యమిక మతమందు సుఖజ్ఞానాదులు త్రికాలమందును అసత్యములు నైయ్యాయిక మతములో ఆ యాత్మ మోక్షకాలమందు మనస్సంబంధరహితుడగుచున్నాడు జీవితావస్థయందు సంబంధరహితుడు కానేరడు. కనుక జీవితకాలమందా వాదులు అమనస్కభావము నంగీకరింపరు ఈ కారణమువలన ఆ భ్రాంతిస్థులైన వాదులు నిర్వికల్ప సమాధిచే సర్వదా భయమునే పొందుచున్నారు. ఇట్లు పైన దెల్పబడిన విధమున అనేక కుతర్కములచేసి ఆ వేదాంతరహితులగు యోగులు నిర్వికల్పసమాధివలన భయమును పొందుచున్నారు విద్వత్పురుషుల యనుభవసిద్ధమైన శ్రుత్యుక్తమైన ఏ యమనస్క భావముకలదో దానిని పరిత్యాగముచేసి ఆ యమనస్కభావమును సుషుప్తి తుల్యముగ నెఱిగి, ఆ యోగులు ఆత్మవిముఖులగుదురు

హే శిష్య! వేదాంతవిచారరహితులగు ఆ యోగులు వృక్షతుల్యముగ జ్ఞానరహితులైయున్నను తమ్ములను పండితులుగనే నెఱుగుచున్నారు. మఱియు ఆ యోగులు శిలవలె నిశ్చలులైయున్నను, భస్త్రివలె వ్యర్థముగనే శ్వాసోచ్ఛ్వాసములను విడుచుచున్నారు ఎట్లు అంధుడు హస్తస్థితమగు నిధినికూడా చూడజాలడో, అట్లే వేదాంతరహితులగు అంధయోగీశ్వరులు, తమ హృదయస్థిత ఆనందరూపాత్మను

చూడజాలరు. హే శిష్య! యిటువంటి శాస్త్రవిరుద్ధకుతర్కములను పరిత్యజించి ఏ అధికారులు బ్రహ్మవేత్తయగు గురువుయొక్కయు వేదాంత శాస్త్రముయొక్కయు, సంప్రదాయానుసారముగ ఆ యానందరూపాత్మను నిశ్చయముచేయుదురో, ఆ యధికారులే ఆత్మసాక్షాత్కారమునుపొంది జన్మమరణాది సకల సంసారదుఃఖ రహితులై సర్వభయరహితులగుచున్నారు

శిష్యుడు — హే భగవన్! మనస్సు అత్యంతప్రబలము. దానిని జయించుట కెవడును సమర్థుడుకాడు.

గురువు — హే శిష్య! మనోజయమునందే జీవుడును సమర్థుడు కానిపక్ష మందు శ్రుతిస్మృతులందు ఆ మనోజయము కొఱకైన విధానము కాకుండవలసియుండె ఎందుకనగా — ఏ కర్మమందధికారికి సామర్థ్యములేదో ఆ కర్మము చేయుటకు శాస్త్రము విధానముచేయదు ఎట్లనగా — అగ్నిహోత్రాదికర్మముల జేయుటందు మనుజునకు సామర్థ్యముకలదు కనుక శాస్త్రము అగ్నిహోత్రాది కర్మలను విధానము చేయుచున్నది. అగ్నిభక్షణముచేయుటకును సముద్రోల్లంఘనము చేయుటకును మనుజునకు సామర్థ్యములేదు కనుక అగ్నిభక్షణము సముద్రోల్లంఘనము శాస్త్రముచే విధానము చేయబడలేదు. మనస్సును జయించుటలో శాస్త్రము పలుమారు విధానము చేయుచున్నది మఱియు మనోజయము జ్ఞానులకనుభవసిద్ధమైయున్నది. కనుక గురు శాస్త్రోపదేశముచే మనోజయము అవశ్యముగ సిద్ధించుచున్నది

హే శిష్య! మనోనిగ్రహమందు అధికారియొక్క ఉద్వేగరహితమైన దృఢ ఉత్సాహమే కారణమైయున్నది. ఎట్లన పూర్వము అల్పమైన టిట్టిభపక్షిచే మహా సముద్రము శోషణముచేయుబడియె. (టిట్టిభపక్షిచే సముద్రము శోషణము కావింప బడిన సంగతి పూర్వము చెప్పబడియుండెను) ఎట్లు అల్పమైన టిట్టిభపక్షి తన దృఢ మైన పురుషార్థముచే సముద్రమును జయించెనో, అట్లే అధికారియు తన పురుషార్థ ముచే మనస్సును జయింపగలడు హే శిష్య! ఎట్లు టిట్టిభపక్షి సముద్రశోషణము పై దృఢనిశ్చయము చేయుచుండగా, గరుడభగవంతుడు వచ్చి దానికి సహాయము చేసెనో, అట్లే యీ అధికారియు మనస్సును జయించుటకై దృఢనిశ్చయముచేయుచో, అపుడు సమస్తదేవతలు సహాయము చేయుదురు.

శిష్యుడు - హే భగవన్! ఆ గరుడపక్షి ఆ టిట్టిభపక్షికి సజాతీయమగుట వలన దానికి సహాయము చేసెను. అట్లు దేవతలు మనుష్యులకు సజాతీయులు కారు కదా! వారెట్లు మనుజులకు సహాయము చేయుదురు?

గురువు — హే శిష్య! సమానజాతిగల వారిచేతనే సహాయమగునని నియమములేదు అచ్చటచట విజాతీయులచేతను సహాయమగుట కలదు. ఎట్లన శ్రీ సీతాదేవి వియోగమైనపుడు రావణునితో యుద్ధము చేయుటకు ప్రవృత్తుడైన శ్రీరామచంద్రునకు విజాతీయులైన వానరులచే సహాయము గల్గెను అట్లే దృఢనిశ్చయపూర్వకముగను శ్రద్ధాభక్తియుతముగను శుభాశుభకార్యమందు ప్రవృత్తుడైన అధికారికి సకల దేవతలును సహాయముచేయుదురు. హే శిష్య! ఉద్యమ, సాహస, ధైర్య, బల, బుద్ధి పరాక్రమములను నీ షడ్గుణము లేపురుషునియందు విద్యమానమైయున్నవో, ఆ పురుషునకు యే పదార్థమున్ను దుర్లభముకాదు. అట పురుషార్థమునకు పేరు ఉద్యమము ఇంద్రియజయరూపమునకు పేరు సాహసము. అనేక విఘ్నములు ప్రాప్తమైనను చిత్తమందు ఉద్వేగము గాకుండుటకు పేరు ధైర్యము. దృష్టసాధనముల సంపత్తికి పేరు బలము నానాప్రకారచాతుర్యమునకు పేరు బుద్ధి. శరీరబలమునకు పేరు పరాక్రమము హే శిష్య! అధికారి పురుషులు సింహమునుండి పరాక్రమము నేర్చుకొనవలయును. ఎట్లు సింహము ఒక కాలు ముందుంచినపుడు ఆ కాలుపై అనేక శస్త్రప్రహారములు కావింపబడినను దానిని వెనుక కెట్టు మరల్పదో, అట్లే అధికారి పురుషులు ఆరంభముచేసిన శుభ కార్యమునకు, విఘ్నరూప అనేక యాఘాతములైనను ఆ కార్యమును వదలిపెట్టరు. ఈ విషయమందు మహాత్ముల దృష్టాంతము — ఎట్లు తానంగీకరించినదైనకాలకూటవిషమును, శ్రీ మహాదేవుడు పరిత్యాగముచేయడో, తానంగీకరించిన బడబాగ్నిని సముద్రుడు పరిత్యాగముచేయడో, తానంగీకరించిన భూభారమును కూర్మదేవుడు పరిత్యాగముచేయడో, అట్లే అధికారిపురుషులును తా మారంభించిన మనోనిగ్రహరూప శుభకార్యమును పరిత్యాగముచేయరు. ఈ ప్రకారమగు విచారణజేసి ఏ యధికారి మనోనిగ్రహము చేయుటకు ప్రవృత్తుడగుచున్నాడో మరణాంతసంకటము ప్రాప్తించినను, ఆ ఉద్యమమునుండి నివృత్తుడుకాడో ఆ అధికారియే మనోజయమును పొందుచున్నాడు.

హే శిష్య! రజోగుణకార్యమైన యిచ్ఛారూపకామము సత్వగుణకార్యమైన విషయానుభవము తమోగుణకార్యమైన నిద్రాలస్యాదులు, వీటినుండి అధికారి మనస్సును నిగ్రహము చేయవలయును. వైరాగ్యాభ్యాసము గావింపవలెను. (విషయములందు పలుమారు దోషదర్శనమొనర్చుటకు వైరాగ్యమని పేరు. సంపూర్ణజగత్తు బ్రహ్మరూపము. నేను బ్రహ్మరూపుడనను నీ యర్థమును పలుమారు చింతనము చేయుటకు అభ్యాసమని, పేరు) భగవంతుడిట్లు చెప్పెను —

"అసంశయం మహాబాహో! మనోదుర్నిగ్రహంచలం
అభ్యాసేన తు కౌన్తేయ! వైరాగ్యేణ చ గృహ్యతే॥"

హే అర్జున! మనస్సునకు దుర్నిగ్రహత నీవు చెప్పినప్రకారము యథార్థమే యైనను అభ్యాసముచేతను, వైరాగ్యముచేతను, మనోనిగ్రహము శక్యము. హే శిష్య! మనోనిగ్రహరూపయోగమందు, లయము, విక్షేపము, కషాయము అను నీమూడు విఘ్నములు వచ్చుచుండును. అభ్యాసము, వైరాగ్యము అను నీ ఉపాయములచే, నా మూడింటియొక్కయు పరిహారమగుచున్నది. ఎపుడు అధికారియొక్క చిత్తము బ్రహ్మాకారమగునో, అపుడా చిత్తమును చలింపజేయకూడదు మఱేమనిన — ఆ బ్రహ్మాకారావస్థను పరిపాలనము చేయవలయును ఆ సమాధికాలమందు సత్వగుణాధికతచే పుట్టినదైన సుఖవిశేషమందును అధికారి ఆసక్తి నొనర్పకూడదు మఱేమనిన విచారముచే నా సుఖమునుండియు నిస్సంగుడు కావలయును హే శిష్య! ఏ కాలమందు చిత్తము లయవిక్షేపాది దోషములచే రహితమగునో, చలనరహితమగునో, సకల దృశ్యపదార్థసంబంధరహితమగునో, ఆ కాలమందే చిత్తము బ్రహ్మభావన పొందునని యెఱుగవలయును. ఎంతవఱకు సాక్షియగు ఆత్మయందు మనస్సు బాధింపబడదో, అంతవఱకధికారి మనస్సున అవశ్యముగ నిరోధింపవలెను ఆ నిరోధముచే మనస్సునకు బ్రహ్మభావనప్రాప్తియై మనోబాధ కలుగును. హే శిష్య! ఆ మనోనిరోధమే వేదాంతవాక్య విచారణరూపసాంఖ్యమునకు ఫలము సాంఖ్యయోగమునకు మనోనిరోధముకన్న అధికమైన యింకొక్కఫలములేదు. ఏఅధికారులు యీ యోగమును ప్రతిపాదించునట్టి వేదాంతశాస్త్రమును వదలి యితరమైన శాస్త్రములను అభ్యాసము చేయుదురో వారు బహువాచాలురగుదురు వ్యవహారమందు కుశలులగుదురు. భాషణప్రలాపమందు కంఠశోషణమాత్రము పొందుదురు కాని యింతకుమించిన మఱియొక ఫలమును పొందరు ఏ అధికారులు మనోనిగ్రహముచేయుదురో, వారు లేశగ్రంథపఠనముచేసినను పరమపురుషార్థరూపమగు మోక్షమును పొందుదురు న్యాయమీమాంసాది యితరశాస్త్రపండితులు లేశమాత్రమును శాంతిపొందరు. పైగా ఆ యనాత్మశాస్త్రములు మనుజులకు అహంకారవృద్ధి మాత్రము చేయుచున్నవి.

స్మృతి॥ "యజ్ఞదానతపశ్శౌచం, తీర్థం వేదాశ్రుతం తథా
ఆశాన్తమనసః పుంసః సర్వమేతన్నిరర్థకం॥"

ఏ పురుషుని మనస్సు అశాంతమైయున్నదో, వానిచే చేయబడినదైన యజ్ఞ, దాన, శౌచ, తపస్తీర్థవేదశ్రవణేత్యాది సకల కర్మములు నిష్ఫలము లగుచున్నవి. (గజస్నానమువలె)

హే శిష్య! ఈ యిహలోక పరలోక సంబంధములగు ఏ యే శుభకర్మములు గలవో, అవియును, మోక్షమును బ్రహ్మసాక్షాత్కారమున్ను అగును. జీవులకు

మనోనిగ్రహముచేతనే అథవా – బాహ్యవృత్తిగల మనస్సుచే చింతింపబడమిచే బ్రహ్మము అచింత్యనామముచేతను అంతరవృత్తిగల శుద్ధమనస్సుచే చింతింపబడునదగుటచే ఆ బ్రహ్మమునే చింత్యనామముచేతను శ్రుతిభగవతి కథనము చేయుచున్నది

హే శిష్య! జీవులకు శత్రుమిత్రాదులందు పక్షపాతమెట్లుగలదో అట్లు బ్రహ్మమునకు యెవ్వనియెడను పక్షపాతములేదు.

శ్రుతి — "సమః ప్లుషిణా, సమో మశకేన సమో నాగేన"

ప్లుషిమశకాది అల్పశరీరములందును గజముయొక్క అధికస్థూలశరీరమందును బ్రహ్మము సమానముగ వ్యాపకమైయున్నది. ఆ బ్రహ్మము పరమపదరూపముగాను నిరవయవముగాను వికల్పరహితముగాను కార్యసహితాజ్ఞానరహితముగాను, పరిచ్ఛేదరహితముగాను హేతుదృష్టాంతరహితముగాను ప్రమాణజ్ఞానమున కవిషయముగాను గ్రహణత్యాగరహితముగ నున్నది

శ్రుతి — "న నిరోధోన చోత్పత్తి ర్నబద్ధో, న చ సాధకః
న ముముక్షుర్నవై ముక్త ఇత్యేషా పరమార్థతా ॥"

ఈ అద్వితీయబ్రహ్మాత్మయందు జగత్సంబంధనిరోధమును లేదు. ఉత్పత్తియునులేదు, ఈ బ్రహ్మము బద్ధమునుకాదు సాధకమునుకాదు ముముక్షువును లేదు, ముక్తుడును లేదు, ఇదే వేదముయొక్క ముఖ్యాభిప్రాయము

శిష్యుడు — హే భగవన్! ఈ ఆత్మదేవుడొకడైయుండగా వానియందు నానా భేదమెందుకు ప్రతీతమగుచున్నది?

గురువు:— హే శిష్య! ఎట్లు ఆకాశస్థచంద్రునియందు భేదములేకుండినను ఒకే జలపాత్రమందు ఒకే చంద్రుడును, అనేక జలపాత్రములందు అనేక చంద్రులును ప్రతీతులగుచున్నారో, అట్లే ఈ ఆత్మదేవునియందు వాస్తవముగ నానాత్వము లేకుండినను కారణరూపమైన యొకే అజ్ఞానోపాధియందు, ఆత్మయొక్కటైనను, కార్యరూప అనేకోపాధులందు ఆత్మ నానావిధములుగ ప్రతీతమగుచున్నాడు హే శిష్య! ఏ అధికారి పురుషులు గురుశాస్త్రోపదేశముచే సకల ప్రాణులందు సకలావస్థలందు ఒకే ఆత్మకలడని నిశ్చయముచేయుదురో వారు జాగ్రదాది మూడవస్థలయందును, ఒకే ఆత్మనుగూర్చిన నిశ్చయము చేయుదురు మఱియు యెట్లు ఒకటేయగునాత్మ అవస్థాత్రయరహితుడుగనున్నాడో, అట్లే ఆ యాత్మనెఱిగినవారైన విద్వాంసులును, అవస్థాత్రయరహితులగుదురు ఎపుడధికారిపురుషులు భేదరహితాత్మ నెఱుగుదురో, అపుడు వారు ఉపాధిభేదముచే జీవాత్మయందు ప్రతీతమగు నానాత్వమును యిటువంటి యుక్తిచేవారు నివారణచేయుదురు. ఆ జీవుడు ఆత్మదేవునికన్న భిన్నుడుకాదు

భిన్నుడనిన ఆ వాది నిట్లడుగవలయును. జీవుడు ఒకడా? అథవా అనేకులా? అట ప్రథమపక్షము సంభవింపదు. ఏలాగుననగా — "ఏకోదేవ స్సర్వభూతేషు గూఢః" ఇత్యాది శ్రుతులచే ఆత్మదేవుడొకడని చెప్పబడియె. ఆ ఒకడైన ఆత్మదేవునినుండి ఒకడైన జీవుడు యెట్లు వేఱగును. వేఱుకాడు. ద్వితీయపక్షమనినను, ఆ అనేక జీవులకు ఆత్మతోటి భేదము సిద్ధింపదు. ఏలాగుననగా — ఆత్మయని పేరు తన స్వరూపమునకు కలదు. ఆ ఆత్మస్వరూపముకన్న జీవులు భిన్నులైన పక్షమందు, ఆ జీవులు వంధ్యాపుత్రసమానముగ నిస్స్వరూపులగుదురు.

శిష్యుడు — హే భగవన్! అనేక జీవులతోటి ఆత్మకభేదమైన పక్షమందు ఆ ఆత్మకు అనేకరూపత ప్రాప్తమగును. అపుడొకడను సిద్ధాంతమునకు హానియగును కదా?

గురువు — హే శిష్య! న్యాయమతమందు ఒకే ఘటత్వజాతి అనేకఘటము లందు గలదు. అట అనేకఘటములకు పరస్పరభేదముకలిగినను ఎట్లు జాతివిభేదము కాదో, అట్లే ఈ ఆత్మదేవుడును సర్వజీవులందు జాతివలె అనుగతమైనపుడు జీవులకు పరస్పరభేదమైనను ఆత్మకు భేదముకాదు. వాస్తవముగ విచారించిచూచినపుడు జీవు లందును పరస్పరభేదము సంభవింపదు. ఏలాగుననగా — అంతఃకరణవిశిష్ట చైతన్యమునకుగాని అజ్ఞానవిశిష్టచైతన్యమునకుగాని, జీవుడనినామము, ఆ జీవులయందే చైతన్యాంశముకలదో ఆ చైతన్యాంశము సర్వత్ర ఒకటిగానున్నది. చైతన్యాంశమునందు భేదమెక్కడనులేదు. పరిశేషముగ అంతఃకరణాద్యుపాధులందు భేదమంగీకరించుట యగును. ఆ యంతఃకరణోపాధులందును, అధిష్ఠానరూపసద్రూపాంశమును భిన్నము చేసినపుడు ఆ ఉపాధులకును భిన్నత్వము సంభవింపదు. కనుక అనేక జీవులును అద్వితీయాత్మకన్న భిన్నులుకాదు.

హే శిష్య! జీవులాత్మకన్న భిన్నులనియెఱిగిన పక్షమందు, శ్రుతిచే జీవాత్మ కొసంగబడిన ఘటాకాశ దృష్టాంతము అసంగతమగును. ఈ ఘటాకాశ దృష్టాంతము వేదాంతశాస్త్రమునకు చాల ఉపయుక్తముగానున్నది. ఘటాకాశనామముచే అనేక దృష్టాంతములు చెప్పబడుచున్నవి. సూక్ష్మకారణ సంఘాతమునందు జీవుడు ఘటా కాశసమానముగాను, ఆత్మదేవుడు మహాకాశసమానముగా మన్నారు. అట ఘట రూపోపాధి పరిత్యాగమైనపిమ్మట ఘటాకాశమహాకాశభేదముకానట్లు సంఘాతరూపో పాధిపరిత్యాగమైనపిదప జీవునకు ఆత్మదేవునితో భేదములేదు. మఱియు ఒక ఘటా కాశము ధూమాదులచే యుక్తమైనను ఆ కాలమందితరఘటాకాశములు ధూమాది రహితములే యైయున్నవి. అట్లే ఏ కాలమందొక జీవుడు సుఖదుఃఖముల పొందు చున్నాడో, ఆ కాలమందితర జీవులు సుఖదుఃఖరహితులై యున్నారు. అభిప్రాయము—

సుఖదుఃఖాదిధర్మములు కేవలమంతఃకరణోపాధియందు కలవు ఆ అంతఃకరణాద్యుపాధులు అనేక శరీరములయందు వేఱువేఱుగానున్నవి. కనుక ఒక జీవునకు సుఖదుఃఖములు గలిగినపుడు యితర జీవులకు సుఖదుఃఖములుగావు. మఱియు ఎట్లు ఘటాకాశమందు వర్తులత్వ దీర్ఘత్వాదిరూపభేదము, జలానయన ధాన్యభరణాది కార్యములందు భేదము ఘటాకాశ మఠాకాశేత్యాది నామములందును భేదముకలదో అటువంటి భేదము కలిగినను ఆకాశమునకు భేదమెట్లులేదో, అట్లే అంతఃకరణాద్యుపాధిభేదముచే జీవులందు పరస్పరభేదము గల్గినను ఆత్మదేవునకులేదు. మఱియు వాస్తవముగ నిర్మలమైన మహాకాశము మూఢబాలునకు మలినవంతమై ప్రతీతమైనట్లు వాస్తవముగ బంధరహితమైన ఆ యాత్మదేవుడు అవివేకులగు మూఢపురుషులకు బద్ధుడుగ ప్రతీతమగుచున్నాడు. మఱియు ఘటాద్యుపాధులకు జన్మమరణ గమనాగమనములైనను, ఘటస్థితాకాశము జన్మాదివికారములపొందదో, అట్లే శరీరాద్యుపాధులకు జన్మమరణ గమనాగమనములైనను శరీరోపాధిస్థితుడగు ఆత్మదేవుడు జన్మాదివికారములను పొందడు. స్వప్నమందు ప్రతీతుడైనజీవుడు యింద్రజాలకునిచే తన మాయాప్రభావమున చూపబడిన జీవుడు భ్రాంతపురుషుల దృష్టియందు జన్మమరణాదివికారములుగలవాడుగ ప్రతీతుడైనను ఆ జీవుడు వాస్తవముగ జన్మమరణాదివికారరహితుడై యున్నాడు ఆలాగుననే జాగ్రదవస్థగల జీవుడును జన్మమరణాది వికారరహితుడుగనున్నాడు చిత్తమే తాను జన్మమరణాది వికారములనుపొంది తన యా వికారములను జీవాత్మయందు చూపించుచున్నది. ఈ విషయమున ఆలాతదృష్టాంతము. ఒక కాష్ఠమునకు నూనెచే తడుపబడినగుడ్డలను యిరుప్రక్కలగట్టినచో నది అలాతము. అథవా పవితము యనవడును. ఆ అలాతమును రెండుప్రక్కల అగ్నిచే ప్రజ్వలితముగజేసి. అదండమధ్యమును, చేతితోపట్టుకొని భ్రమణముచేసినపుడు ఒక్కొక్కసారి అగ్నిచక్రమువలె ఒక్కొక్కసారి దండమువలె ప్రతీతమగుచున్నది. అట్లే మాయావిశిష్టపరమాత్మదేవునినుండి ఉత్థానమునొందిన ఏ మనస్పందముకలదో అది జ్ఞాతృ జ్ఞాన జ్ఞేయాది త్రిపుటిరూపముచే ప్రతీతమగుచున్నది. మఱియు యెట్లు భ్రమణరూపస్పందరహితమైన అలాతదండము చక్రాకారముచే రహితమైయున్నదో, అట్లే స్పందరహితమైన చిత్తమున్ను కల్పితమైన త్రిపుటిచే రహితమై యున్నది. కల్పిత జన్మాదులచేతను రహితమై యున్నది. అనగా ఆ శాంతచిత్తము చైతన్యస్వరూపమే యగుచున్నది. అలాతమందు చక్రాకారము రజ్జుసర్పన్యాయముగ మిథ్యయైనట్లు, మనస్పందముచే ప్రతీతమైన జ్ఞాతృజ్ఞానాదిత్రిపుటియును మిథ్యయేయై యున్నది.

శిష్యుడు — హే భగవన్! జ్ఞాతృజ్ఞానాది త్రిపుటి మిథ్యయైన పక్షమందు అది జీవులమగు మనకెందులకు ప్రత్యక్షమగుచున్నది?

గురువు — హే శిష్య! వాస్తవముగ మనుష్యునకు శృంగములేకుండినను, మనుష్యునకు శృంగముగలదు అను నీ శబ్దసంబంధదోషప్రభావముచే గంధర్వనగరము లేకుండినను ప్రతీతమైనట్లే మనుష్యునకు శృంగము కనిపించుచున్నది అట్లే ఆత్మ దేవునియందు ద్వైతప్రపంచము వాస్తవముగలేకుండినను ప్రతీతమగుచున్నది. (యిది శబ్దమాహాత్మ్యము)

శిష్యుడు — హే భగవన్ ఏ మాయయొక్క బలముచేతను శబ్దముయొక్క బలముచేతను జగత్తుప్రతీతమగుచున్నదో, ఆ మాయయందును, శబ్దమునందును అసత్యత యేరీతిగ సిద్ధించును?

గురువు — హే శిష్య! నరశృంగమను శబ్దమాత్రముచేతనే, మాయ అవిద్య అజ్ఞానాదులచేతనే ఆ నరశృంగాదుల సిద్ధియైనది. ఇతర యేయొక ప్రమాణముచేతను సిద్ధికాలేదు కనుక ఆ శబ్దమున్ను మాయయు అసత్యములే.

శ్రుతి॥ "వాచారంభణం వికారో, నామధేయం, మృత్తికేత్యేవ సత్యమ్॥

ఘటశరావాది సకలవికారములు నామమాత్రముతైయున్నవి అవి వాక్కుయొక్క ప్రలాపములేయగును ఆ వికారములయందు అనుగతమైన యొక మృత్తికయే సత్యమై యున్నది. అట్లే మనోవాక్కులకు విషయమైన, ఒకే ఆత్మదేవుడు సత్యముగానున్నాడు. ఆ యాత్మకన్న భిన్నమైన సంపూర్ణజగత్తు మిధ్యగానున్నది. హే శిష్య! శబ్దమాత్రమే స్వరూపముగాగల యే జగద్రూపవికారముకలదో, దానికి కారణరూపమగు యే మాయగలదో, ఆ రెంటిచేతను ఆవృతుడైన జీవాత్మ తన వాస్తవస్వరూపము నెఱుగడు, మఱేమనిన తన్ను పరిచ్ఛిన్నరూపుడుగ నెఱుగుచున్నాడు ఎట్లు జలమందు స్థితమైన మహాఘటము అల్పరూపముగ ప్రతీతమగుచున్నదో అట్లే మాయాజగత్తుచే నావృతమైన, యీ మహాత్మయు పరిచ్ఛిన్నముగ ప్రతీతమగుచున్నది మఱియు హే శిష్య! అకార ఉకార మకారములను నీ మాత్రాత్రయముగల ప్రణవమునందు యథాక్రమముగ సమష్టిస్థూలసూక్ష్మకారణములను నీ యుపాధిత్రయముగల యే బ్రహ్మము తాదాత్మ్యసంబంధముచే నుండునో, ఆ సోపాధికబ్రహ్మమును ప్రణవమాత్రాసహితముగ యెపుడధికారిపురుషులు లయచింతనముచేయుదురో, అపుడు నాశరహితతురీయబ్రహ్మమే పరిశేషముగ నుండును. ఆ తురీయబ్రహ్మమే సకల భేద రహితముగాను, అద్వితీయరూపముగను నున్నది కనుక అధికారిపురుషులు మొదట ప్రణవమంత్రమును బ్రహ్మరూపముగ చింతనము చేయవలయును హే శిష్య! యీ అధికారిపురుషుల కెంతవఱకు నిర్విశేషబ్రహ్మసాక్షాత్కారముకాలేదో, అంతవఱకు ప్రణవరూపశబ్దబ్రహ్మమును చింతనము చేయవలయును. నిర్విశేషబ్రహ్మసాక్షాత్కారా

నంతరము శబ్దబ్రహ్మమును పరిత్యాగము చేయవలయును. (ధాన్యమును గైకొని పొట్టు వదలినట్లు) హే శిష్య! నానా వర్ణములుగల గోవులైనను, దుగ్ధము యేకవర్ణమేయై యున్నట్లు నానావర్ణశరీరములందును ఆత్మయేకరూపుడై సమానముగ వ్యాపించి యున్నాడు. అట్లయినను ఆ యాత్మదేవుడు అశుద్ధమనస్సుచే నెఱుగబడడు. కనుక అధికారిపురుషులు శ్రవణాదిసాధనములచే మనస్సును శుద్ధముగచేసి ఆ యాత్మ నెఱుగవలసినది. ఈ ప్రకారముగ నాత్మ నెఱిగి అధికారిజనులు శోకరహితులగుదురు ఆ శోకరహితఆనందరూప బ్రహ్మమునందు సంపూర్ణజగత్తు వాసముచేయుచున్నది అథవా — ఆ బ్రహ్మమే సంపూర్ణజగత్తునందు వాసము చేయుచున్నది ఈ కారణము వలనవేదవేత్తలు ఆ బ్రహ్మమును వాసుదేవనామముచే కథనము చేయుచున్నారు.

ఇపుడు నారాయణోపనిషత్తునందును మహోపనిషత్తునందును, ఆత్మప్రబోధో పనిషత్తునందును కథనము చేయబడిన బ్రహ్మస్వరూపమును కథనము చేసెదను. సావధానముగ వినుము. హే శిష్య! ఆ పరమాత్మదేవుడు తన అస్తిభాతి ప్రియరూప ముచే సకలజగత్తును పూర్ణమొనర్చుచున్నాడు. ఈ కారణమువలనను అథవా — సకల శరీరరూపపురములందు నివాసము చేయుచున్నాడు గనుకను శ్రుతిభగవతి ఆ పర మాత్మదేవుని పురుషనామముచే కథనము చేయుచున్నది మఱియు ఈ విరాట్‌రూప పరమాత్మదేవుడు ప్రళయకాలమందు సమస్తలోకములను తన ఉదరమందు గ్రహించి క్షీరసముద్రమందు శేషనాగరూపశయ్యపై బాలకునివలె శయనము చేయుచున్నాడు ఈ కారణమువలన శ్రుతిభగవతి ఆ పరమాత్మదేవుని 'నారాయణ' నామముచే కథనము చేయుచున్నది. అథవా — ఎట్లు మాత్రోదరరూపశయ్యయందు గర్భరూపబాల కము శయనము చేయుచున్నదో, అట్లే సృష్టిసూక్ష్మోపాధిగలవారైన, తైజసనామ జీవ రూప ప్రతిబింబములకు బింబరూపుడైన ఈ హిరణ్యగర్భ భగవంతుడు మాయారూప శయ్యమీద శయనము చేయుచున్నాడు ఈ కారణమువలన శ్రుతిభగవతి ఆ పరమాత్మ దేవుని 'నారాయణ'నామముచే కథనము చేయుచున్నది అథవా - జీవరూపనరుల యొక్కసముదాయమేదికలదో, దానికి నార'మనిపేరు ఆ నారమునకు బింబభూత మైన పరమాత్మదేవునిచే స్వరూపలాభమగుచున్నది గాన యీ కారణమువలనను అథవాయెట్లుబాలుడు చెండునుదూరముగ విసరుచున్నాడో, అట్లే ఈ పరమాత్మదేవుడు కార్యకారణమగు అవిద్యారూపబాలుని దూరముగ విసరుచున్నాడు గనుకను అథవా ఈ జీవరూపనరులకు అంతర్యామియగు పరమాత్మదేవునిచేతనే ప్రవృత్తమగుచున్నది కనుకను, అథవా తురీయశుద్ధరూపముచే యెఱుగబడిన ఆ పరమాత్మదేవునిచేతనే. జీవసంబంధ ఆ విద్యారూపవారమునకు నివృత్తియగుచున్నది గనుకను అథవా బదరి కాశ్రమనివాసియగు గురుమూర్తి జీవుల అవిద్యానివృత్తి చేయుచున్నాడు: గనుకను,

ఆ గురుమూర్తికి 'నారాయణ'నామము ప్రసిద్ధముగానున్నది (ఇంకను నారాయణ శబ్దార్థము దశమాధ్యాయమందు వివరింపబడియున్నది.)

హే శిష్య ! సృష్టియొక్క ఆదికాలమందు అద్వితీయరూపముగ స్థితుడైన నారాయణదేవుడు జీవుల పుణ్యపాపకర్మముచే ప్రేరితుడై 'నేను' జగదుత్పత్తిచేసెద నను నీ ప్రకారమగు యిచ్ఛయొనర్చి పిదప సకలజీవులను సృజించి నానా ప్రకార సామర్థ్యముగలవారైన, బ్రహ్మేంద్రాదిత్యరుద్రాది సమస్తదేవతలను సృజించుచున్నారు. ఆ బ్రహ్మాదిదేవతలతో సకలజగత్తున్ను నారాయణదేవునిచేతనే పుట్టుచున్నది నారాయణదేవునియందే స్థితమైయున్నది. నారాయణదేవునియందే లయమును పొందు చున్నది కాన యెట్లు ఘటోత్పత్తిస్థితిలయములు మృత్తికయందే యగుటవలన ఘటము మృత్తికకన్న భిన్నముకాదో, అట్లే దేవతాసహిత సకలజగత్తున్ను నారాయణ దేవునికన్న భిన్నముకాదు. నారాయణస్వరూపమే యైయున్నది. హే శిష్య ! ఆ నారాయణదేవుడు నాశరహితుడై ప్రాణశబ్దాది షోడశకళారహితుడై జగద్రూప వికల్ప వర్జితుడై అజ్ఞానరూపాంజనరహితుడై జడమాయాకార్యవివర్జితుడై యున్నారు. ఏ అధికారిపురుషులు 'నేను బ్రహ్మరూపుడ నను నీ ప్రకారముగల బుద్ధిని సారథిగా జేసుకొని శ్రవణాదిసాధనయుక్తశుద్ధమనోరూపరజ్జువుచే వశముచేయబడినవైన యింద్రియ రూపాశ్వములచే యుక్తమగు శరీరరూపరథమందు స్థితులగుదురో, ఆ యధికారి పురుషులు బ్రహ్మభావరూపమోక్షమును పొందుదురు.

హే శిష్య ! యీ నారాయణోపనిషత్తునే యధికారిపురుషులు బ్రహ్మ వేత్తలగు గురు ముఖముగ శ్రవణము చేయుదురో, ఆ యధికారి పురుషులు జీవితావస్థయందు సకల క్లేశరహితులై ఈప్సిత భోగములనుపభోగించి మరణానంతరము బ్రహ్మలోకమునకు పోయి అచట మోక్షమును పొందుదురు

హే శిష్య ! యిటువంటి నారాయణదేవుని స్మరణము చేయించునట్టియే "ఓం నమోనారాయణాయ" అను అష్టాక్షరమంత్రముగలదో దానిని జపముజేయు వారైన జీవుల కది వాంఛితప్రాప్తి చేయదగినదిగా నున్నది నారాయణుని సాక్షాద్ధ్యాన ముచే నే ఫలప్రాప్తియగునో, ఆ ఫలప్రాప్తి అష్టాక్షరిమంత్రముచే నగును. కనుక ఈ అష్టాక్షరిమంత్రము నారాయణదేవునితో సమానముగనున్నది. ప్రణవమంత్రము వలె యీ అష్టాక్షరిమంత్రము నారాయణప్రాప్తి కుపాయమై యున్నది.

హే శిష్య ! పాపాత్ములైనను, శూద్రులైనను, స్త్రీలైనను, శ్రద్ధాపూర్వకముగ అర్థజ్ఞానపూర్వకముగా యీ మంత్రమును జపము జేయువారైనచో, వారందఱును సకలపాపరహితులై నారాయణదేవుని సాక్షాత్కారమును పొందుదురు. పాపాత్ములే

పరమపదవిని పొందుదురని వచింప పాపరహితబ్రాహ్మణాదులీ మంత్రముచే పరమ పదవిని పొందుదురని వేరుగ చెప్పవలెనా ?

ఇపుడు మహోపనిషత్తునందు చెప్పబడిన బ్రహ్మవిద్య నిరూపింపబడుచున్నది. హే శిష్య! ప్రాచీన వృత్తాంతముల నెఱిగినవారైన వేదవేత్తలగు ఋషులు ఈ విధ మున నుడువుదురు. జగదుత్పత్తికి పూర్వము ఒకరైన నారాయణదేవుడే గలడు. సృష్టికి పూర్వము బ్రహ్మాదిదేవతలు లేరు. ఇక జగత్తు యెక్కడిది? భూతములు ఎక్కడివి? ఇట్లు సకలద్వైత ప్రపంచరహితుడై ఏకాకియై స్థితుడైన నారాయణదేవుడు ఆ కాలమందు కించిన్మాత్రమును క్రీడింపదాయెను. అనంతరమాత దన్యపదార్థముల చింతనముచేయ దొరగెను ఆ చింతనానంతరము నారాయణదేవునకు మాయారూప స్త్రీతోటి సంబంధమాయెను ఆ మాయాదేవి సంబంధముచే ఆ నారాయణదేవునకు త్రయోదశపుత్రులును వ్యభిచారిణియైన ఒక కన్యయు పుట్టినవి. ఆ వ్యభిచారిణియగు కన్య అధ్యాత్మ అధిదైవ అధిభూతములను రూపత్రయముచే నటించుచున్నది. అట్లు త్రయోదశపుత్రులును అధిదైవాది రూపత్రయముచే నటించుచున్నారు. అట సమష్టి ఘటకపదార్థములకు నామము అధిదైవము. వ్యష్టిశరీరఘటకపదార్థములకు నామము అధ్యాత్మము, యింద్రియములకు దృశ్యమానమగు పదార్థములకు నామము అధిభూతము ఎట్లనగా సూర్యాదిదేవతలు అధిదైవతము నేత్రాదీంద్రియములు అధ్యాత్మకము రూపాదివిషయములు అధిభూతము

హే శిష్య! ఒకరైన నారాయణదేవుడు తనవాస్తవ స్వరూపముయొక్క అవివేకముచే ఆ బహురూపిణియగు పుత్రితోను బహురూపములుగలవారైన పుత్రుల తోను తాదాత్మ్యాధ్యాసమునొంది తన్ను బహురూపముగ నెఱుంగుచున్నారు

హే శిష్య! సృష్టికి ఆదికాలమందు నారాయణదేవుడు పుత్రపుత్రీసహితమగు చతుర్దశసంతతిని పుట్టించి, తరువాత ఆ కారణములచే క్రియాశక్తిని సృష్టించుచున్నారు. ఆ క్రియాశక్తి యెట్టిదనగా పూర్వము జనించిన యెన్నియో-పదార్థములకు కార్య రూపముగాను, ఉత్తరమున జనించిన యెన్నియో పదార్థములకు కారణరూపము గాను నున్నది.

శిష్యుడు — హే భగవన్! ఆ చతుర్దశసంతతి యేది? క్రియాశక్తి యెద్ది? యీ విషయమంతయు దయచేసి నిరూపణము చేయుము.

గురువు — హే శిష్య! ఆకాశాదిపంచభూతములాసంతతికి కారణము ఆ భూతములు ద్వివిధములు అందులో — పంచీకృతభూతములు స్థూలములు. అపంచీకృతభూతములు సూక్ష్మములు. శబ్దస్పర్శాదిపంచతన్మాత్రలకు నామము

సూక్ష్మములు. ఆ పంచభూతరూపకారణము ద్వివిధముగుటవలన తత్కార్యమున్ను స్థూలసూక్ష్మభేదముచే ద్వివిధమైయున్నది. హే శిష్యా! ప్రాణవాయువునకు నామము క్రియాశక్తి. ఆ క్రియాశక్తిరూపప్రాణము. ఆ యాకాశాదిభూతములకు కార్యరూపము గాను, ఆ చతుర్దశ సంతతియొక్కస్థితికి కారణమున్నునైయున్నది అహంకారమన చిత్తదశేంద్రియములుచేరి త్రయోదశపుత్రులుగాను బుద్ధి యొక కన్యగాను గలరు. మఱియు తన్మాత్రపంచకము, భూతపంచకము ప్రాణము అన్నియుచేరి పంచవింశతి తత్త్వములాయెను ఈ పంచవింశతితత్త్వములకు హిరణ్యగర్భాదులు అధిదైవరూపములుగాను స్థావరజంగమసమస్తశరీరములు అధిభూతములుగ నున్నవి. వాటియందింత విశేషతగలదు అధిభూతరూపముచే కధనముచేయబడిన యే శరీరములుగలవో, వాటిలో యే శరీరమందు యే జీవునకు అహంబుద్ధి కలదో, ఆ యా శరీరమాయా జీవునకు అధ్యాత్మరూపముగాను, యితరజీవుల కధిభూతరూపమును నైయున్నది. ఎట్లనగా – దేవదత్తుని శరీరము దేవదత్తునకధ్యాత్మముగను యజ్ఞదత్తున కధిభూతము నైయున్నది.

హే శిష్య! సర్వభూతప్రాణుల నుత్పత్తిస్థితిలయములజేయునట్టిదైన యే కాలము కలదో, ఆ కాలమున్ను నారాయణదేవునిచేతనే యుత్పన్నమైనది. ఈ ప్రకారముగ సకలజగత్తును సృజించినవారైన నారాయణదేవుడు సూత్రాత్మరూపముచే సర్వదేవతలను సృష్టించుచున్నారు మఱియు ఆ నారాయణదేవుడే యేదో ఒక అనిర్వచనీయనిమిత్తముచే తనయందు క్రోధమును ప్రకటిత మొనర్చెను. ఆ క్రోధముచే కుటిలమైన యే భృకుటి కలదో, తద్భృకుటియుక్త లలాటదేశమునుండి ఆ నారాయణదేవుడు రుద్రభగవంతుని జనింపజేయుచున్నారు. — ఇపుడు ధ్యానమునకుగాను రుద్రభగవంతుని స్వరూపము నిరూపింపబడుచున్నది ఆ రుద్రభగవంతు డెట్లుండుననగా, నీలకంఠము లోహితాంగములు సూర్యచంద్రాగ్నిరూపత్రినేత్రములుగలవారై శూలధారియై, మహాబలయుతుడై దుష్కరమైనట్టి కర్మముల జేయుచున్నారు రుద్రభగవంతుని సమానముగ యుండెవడునులేడు. ఆ రుద్రభగవంతుడు నారాయణదేవునితో యభిన్నుడుగా నున్నారు. ఈ కారణమువలన ఆ రుద్రభగవంతుడు సమస్తైశ్వర్యములకును, సమస్తధర్మములకును, సమస్తయాశ్రమములకును, సంపూర్ణ శ్రీకిని సంపూర్ణ జ్ఞానమునకును, సంపూర్ణ వైరాగ్యమునకును సంపూర్ణ సత్యమునకును, సంపూర్ణ బ్రహ్మచర్యమునకును, ఇంద్రియనిగ్రహరూపసంపూర్ణతపమునకును సమస్తవేదశాస్త్రములకును, ఆధారమైయున్నారు. ఆ రుద్రభగవంతునిచేతనే యింద్రాదిదేవతలకు ఐశ్వర్యాదిసకలగుణములు ప్రాప్తములైనవి. ఆ రుద్రభగవంతుడే సమస్తదేవతలకును,

ఋషులకును, మనుష్యులకును విద్యాప్రాప్తి విషయమందు గురురూపుడుగా నున్నాడు. మఱియు ఎట్లు కర్పూరరాశి అగ్నిసంబంధముచే శీఘ్రముగా దహింపబడుచున్నదో, అట్లే త్రైలోక్యరూపకర్పూరరాశి రుద్రాగ్నిపొందుటవలన శీఘ్రముగ దహింపబడుచున్నది ఇటువంటి రుద్రభగవంతుడు లలాటదేశమునుండి పుట్టిన తర్వాత సకలజగద్ద్రష్టయైన యీ పరమాత్మదేవుడు మఱల ధ్యానరూపతపము చేయదొడంగెను ఆ ధ్యానరూపతపముచే శ్రమను పొందుటవలన ఆ నారాయణ దేవుని లలాటమునుండి స్వేదబిందువులుపడెను ఆ స్వేదబిందువులు సకలబ్రహ్మాండమును బ్రహ్మాండవర్తు లగు సకలలోకములను ఉత్పన్నముచేయుటయందు సమర్థమగుటవలన అవి శాస్త్రమందు నారమను నామముచే కథనముచేయబడియె. ఆ స్వేదరూపజలమందు నారాయణదేవుడు తన వీర్యమునుంచుచున్నాడు. సువర్ణసమానవర్ణముగలదియు, అత్యంతమనోహరమును, కోటిసూర్యప్రభగలదియు నగు ఆ వీర్యము స్వేదరూపజలమును పొంది అండసమానాకారమగుచున్నది ఆ అండమునకు మధ్యమందు నాభికమలమేర్పడి దానినుండి చతుర్ముఖబ్రహ్మదేవుడుత్పన్నమయ్యెను. అపుడు ధ్యానము చేయుటకొఱకుగాను బ్రహ్మదేవుని స్వరూపము వివరింపబడుచున్నది. బ్రహ్మదేవుడు సకలప్రాణి స్వరూపులకు ఆదిరూపుడు వాని నాల్గు ముఖములనుండి గాయత్రి, త్రిష్టుప్, జగతి, అనుష్టుప్ అను నీ నాల్గు ప్రకారములగు ఛందస్సులు పుట్టుచున్నవి భూః, భువః, సువః మహః అను నీ నాలుగు వ్యాహృతులును, ఋక్, యజుష్, సామ అథర్వణములను నీ నాలుగు వేదములును పుట్టుచున్నవి సంపూర్ణ స్థావరజంగమజగత్తు బ్రహ్మచేతనే పుట్టుచున్నది ఇటువంటి చతుర్ముఖ బ్రహ్మ నారాయణదేవునినుండి పుట్టుచున్నాడు అద్వితీయుడగు నారాయణదేవుడు తన మాయాశక్తిచే నానా భావములను పొందినను వాస్తవముగ నాతడు నానా రూపుడుకాడు. మఱేమనిన — సకలభేదరహితుడై ఏకమై యున్నాడు.

హే శిష్య! యీ ప్రకారమగు విచారముచేసికూడ ఏ అధికారిపురుషులు నారాయణదేవుని యెఱుగకుందురో, వారు దశమాధ్యాయమందు చెప్పిన ప్రకారముగ నారాయణదేవుని ధ్యానముచేసి సాక్షాత్కరించుకొనవలయును. హే శిష్య! యే యధికారిపురుషులు శ్రద్ధాభక్తిపూర్వకముగ యీ మహోపనిషద్గ్రంథమును విచారము చేయుదురో, వారు పూర్వము, అశ్రోత్రియులుగానుండినను శ్రోత్రియభావమును పొందుదురు. ఈ ప్రకారముగ నీ యుపనిషన్మాహాత్మ్యము కథనము చేయబడియె. ఎపుడీయుపనిషద్విచారముచేతనే యింత మహాఫలము సంప్రాప్తించుచున్నదో, అపుడిక నీ యుపనిషద్విచారముచే సిద్ధించునట్టి ఆత్మసాక్షాత్కారముచే కార్యసహితావిద్యకు నాశముగునని మోక్షప్రాప్తియగునని వేఱుగ చెప్పనేల

ఇపుడాత్మప్రబోధోపనిషదర్థము నిరూపింపబడుచున్నది. ఈ ఆత్మప్రబోధోపనిషత్తునందు మొదట ఆత్మసాక్షాత్కారముకొఱకు రెండు ఉపాయములు చెప్పబడియె.— ఒకటి ప్రణవమంత్రము రెండవది అష్టాక్షరీమంత్రము. (ఈ విషయమున్ను చెప్పబడెను) హే శిష్య! ఈ రెండు మంత్రములకు వాచ్యార్థరూపములైన ఏ బ్రహ్మము కలదో ఆ బ్రహ్మము వాస్తవముగ నిర్గుణస్వరూపమైయున్నది. ఆ నిర్గుణస్వరూపము కార్యసహితావిద్యాధ్వంసరూపమోక్షమున కధిష్ఠానమైనది. మఱియు అద్వితీయరూపమైయున్నది. ఇటువంటి నిర్గుణబ్రహ్మము నెంతవఱకు పొందరో అంతవఱ కధికారిపురుషులు ఆ బ్రహ్మమును సగుణరూపముగ ధ్యానము చేయవలసినది. ఆ సగుణబ్రహ్మధ్యానముచే అధికారి సులభముగ నిర్గుణబ్రహ్మసాక్షాత్కారమును పొందును

హే శిష్య శ్రుతిస్మృత్యాదులందా సగుణబ్రహ్మముయొక్క స్వరూపము బ్రహ్మ, విష్ణు రుద్ర సూర్యాది అనేక ప్రకారములుగ వర్ణనము చేయబడినను, నారదాదిమునీశ్వరులచే అత్యంతాదరపూర్వకముగ ఏ సగుణబ్రహ్మముయొక్క వర్ణనము చేయబడినదో, దానిని వినుము. — హే శిష్య! ఎట్లు కాష్ఠరూప అరణి అగ్నిని ప్రకటిత మొనర్చుచున్నదో, అట్లే భక్తజనుల రక్షణముకొఱకును, తపాదిధర్మముల రక్షణకొఱకును, ఏ పరమాత్మదేవుడు దేవకీవసుదేవులకు జనించి కృష్ణరూపముగ తన్ను ప్రకటితమొనర్చుకొనుచున్నాడో, ఏ కృష్ణభగవంతునకు, అంగీరసగోత్రముగలవారైన ఘోరుడను బ్రాహ్మణుడు సమస్తవిద్యలనొసంగెనో, మఱియు ఏ కృష్ణభగవంతునిచే అర్జుననకును యశోదమాతకును, విశ్వరూపము చూపబడినదో, ఆ కృష్ణభగవంతుడే సర్వముకన్నను శ్రేష్ఠుడుగనున్నాడు. మఱియు ఆ కృష్ణభగవంతుడే తనయొక్క స్మరణమాత్రముచే జీవులయొక్క సకలపాపములను హరణము చేయుచున్నాడు ఈ కారణమువలన శ్రుతిభగవతి కృష్ణభగవంతుని "హరి" నామముచే కథనము చేయుచున్నది.

హే శిష్య! భారతాది గ్రంథములందు వ్యాసభగవంతునిచేతను, శ్రీమద్భాగవతమునందు శుకమహర్షిచేతను, నారదమునీశ్వరులచే యితర పురాణములయందును, కృష్ణభగవంతుని ప్రభావము వర్ణనము చేయబడియె. ఇవ్విధమున కృష్ణభగవంతుడే సర్వముకన్న శ్రేష్ఠుడుగనున్నాడు హే శిష్య! యింద్రాది సకలదేవతలును కృష్ణభగవంతుని రూపములేయైనను, వారు ప్రతిబింబరూపములైయున్నారు ఎట్లు నీల పీతాది ధర్మములు దర్పణాద్యుపాధులందు ప్రతీతములగువేగాని ముఖరూపబింబములందు ప్రతీతములుగావో, అట్లే మాయారూపోపాధిచే కామక్రోధాది ధర్మములు ఆ

దేవతారూప బింబములందు ప్రతీతమగుచున్నవిగాని అవి శ్రీకృష్ణరూపబింబమందు ప్రతీతములుకావు. ఈ కారణమువలననే యెందఱో దేవతలందు కామాధిక్యత, ఎందఱోదేవతలందు క్రోధాధిక్యత యెందఱో దేవతలందు లోభాధిక్యత యెందఱో దేవతలందు అహంకారాదిదోషతకలదు కృష్ణభగవంతునియందో కామక్రోధాది దోషము త్రికాలమందును లేదు

శిష్యుడు — హే భగవన్! కృష్ణభగవానునియందు కామక్రోధాదిదూషణము లేదని యెట్లు తెలియవలెను?

గురువు — హే శిష్య! ఆ కృష్ణభగవంతుడు అర్జునునకు సారథియైనాడు. దానివలన కృష్ణభగవానునియందహంకారములేదనియు దుర్యోధనుని పరిత్యాగముచేసి పాండవుల పక్షపాతియైనాడు గనుక, దానివలన వానియందు లోభములేదనియు, బలభద్రసోదరునియొక్క కఠోరభాషణము సహనముచేసెనుగాన దానివలన కృష్ణ భగవంతునియందు క్రోధములేదనియు తెలియవలెను. మఱియు కామావతారుడైన ప్రద్యుమ్నుడా శ్రీకృష్ణుని పుత్రుడాయెను పుత్రునిబలము పితరుచెందదు దానివలన కృష్ణభగవంతునియందు కామములేదని తెలియబడుచున్నది ఆ కృష్ణభగవంతుడు స్కందునియొక్క శక్తిని తన వామహస్తముచే లేపి వానియొక్క బ్రహ్మణ్యతాగర్వమును నివృత్తముచేసెను గాన దానివలన నీతడు త్రిలోకములందును బ్రహ్మణ్యసంజ్ఞను పొందుచున్నాడు ఈ విషయమై మహాభారతములో స్కందోపాఖ్యానమందు కథనము చేయబడియె అభిప్రాయము — ఈ పరమాత్మదేవుడు సత్యరూప తపమును రక్షణ చేయుటకొఱకు దేవకీపుత్రరూపమున ప్రకటితమాయెను "బ్రహ్మణ్యోదేవకీపుత్రో మాధవో మధుసూదనః" మఱియు ఏ పరమాత్మదేవుడు వేదరక్షణముకొఱకు హయగ్రీ వాదిరూపములధరించి మధుకైటభాదిదైత్యుల హననముచేసెనో, ఏ పరమాత్మదేవుడు మహాదేవునిపూజయందు తన ప్రతిజ్ఞను సత్యముజేయుటకై తన నేత్రమునర్పించెనో, ఏ పరమాత్మదేవుడు విష్ణురూపముగ తన వక్షస్థలమందు భృగుబ్రాహ్మణుని పాద చిహ్నమును ధరించెనో, అట్టి పరమాత్మయగు శ్రీకృష్ణభగవంతుడు గాక యింకెవడు బ్రహ్మణ్యుడగును? శ్రీకృష్ణభగవంతుడే బ్రహ్మణ్యుడు. సర్వోత్కృష్టునకు బ్రహ్మణ్యు డనిపేరు ఈ కృష్ణభగవంతుడు రూపలావణ్యసౌభాగ్యాదిగుణములకు నివాసస్థాన ముగనున్నాడు. ఈ కారణమువలన అతని శరీరమందు విశ్వకర్మయొక్క చాతుర్య మున్ను ప్రవృత్తముకాదు (ఇట మౌక్తికసమానమగు అంగకాంతికి లావణ్యమని పేరు. మనోహరతకు సౌభాగ్యమనిపేరు.)

హే శిష్య! ఆ కృష్ణభగవంతునియందు యే జీవులచిత్తము ద్వేషముచేతగాని, భయముచేతగాని, కామాదిబుద్ధిచేతగాని, సంలగ్నమైనదో, ఆ జీవులు దివిలోకమును

పొందుదురు. వ్రజగోపికలు కృష్ణభగవంతునియందలి కామబుద్ధిచే దివిలోకమునకు జనిరి కంసరాజు కృష్ణభగవంతునియెడ భయముచేతను, శిశుపాలాదులు ద్వేషము చేతను, యాదవజనులు బాంధవబుద్ధిచేతను పాండవులు స్నేహభావముచేతను నారదాది మునీశ్వరులు భక్తిభావముచేతను, దివిలోకమును పొందిరి. ఈ మొదలు గాగల అనేకజీవులు, కృష్ణభగవంతునియొక్క సంబంధముచే దివిలోకమును పొందు చున్నారు. ఇట శ్రుతిస్మృతులందు బ్రహ్మలోకనామముచే ప్రసిద్ధమైన వైకుంఠమునకు దివిలోకమనిపేరు. ఏ బ్రహ్మలోకమందు బ్రహ్మభావమును పొందువారైన సన్న్యా సులు మఱల సంసారమునకు రారో, అటువంటి బ్రహ్మలోక వైకుంఠమును కృష్ణ భక్తులు పొందుదురు.

ఇపుడు ధ్యానముకొఱకుగాను కృష్ణభగవంతుని స్వరూపము వర్ణింపబడు చున్నది.

"సంచిన్తయే ద్భగవతశ్చరణారవిన్దం
వజ్రాంకుశధ్వజసరోరుహలాంఛనాఢ్యం
ఉత్తుంగ రక్తవిలసన్నఖచక్రవాలం
జ్యోత్స్నాభిరాహత మహద్ధృదయాన్ధకారమ్" ॥

ఇటువంటి చతుర్థశ్లోకముచే, శ్రీమద్భాగవతమునందు కపిలమహాముని దేవ హూతియను తనతల్లికి ఉపదేశముచేసెను ఏ కృష్ణభగవంతుడు ద్వారకాపురి యందును, మధురాపురియందును, గోకులబృందావనాదిస్థానములందును, నివాసము చేయుచున్నాడో, ఏ కృష్ణభగవంతుడు మేఘసమానవర్ణముగలవాడును యింద్రనీల మణివర్ణముగలవాడును, కోటిసూర్యసమానకాంతిగలవాడును అజానుబాహుడును శంఖసమానవలయాకారగ్రీవముగలవాడును, ఉచ్చగండస్థలము గల్గియున్నవాడును, పరమశోభాయమానములగు కపాలకర్ణములుగలవాడును, నీలవర్ణకుటిలకేశములు గలవాడును, నఖదంతప్రకాశముచే చంద్రప్రభను జయించువాడును శ్రీవత్సలాంఛన భూషితవిశాలవక్షస్థలముగలవాడును నైయున్నాడో, ఏ కృష్ణభగవంతుడు కృశోదరము గలవాడైన, పుష్టవర్తులములగు జానుగుల్ఫములుగలవాడై అత్యంతశోభాయమానము లైన హస్తకమలచరణకమలములుగలవాడై, చతుర్భుజపీతాంబరధారియై, కౌస్తుభమణి మండితమగు కంఠముగలవాడై, ఆపాదలంబినియగు వైజయంతివనమాలను ధారణ చేయువాడై యున్నాడో. ఆ కృష్ణభగవంతుని మస్తకమందలి కిరీటము రత్నజటితమై, ప్రకాశమానమైనదిగాను, కర్ణదేశస్థిత మకరకుండలములు చలితమగుచు, ఛమకఛమక మని మెఱయుచు, రవికిరణకాంతిగలవిగాను నున్నవి. మఱియు నాతని కటిప్రదేశ మున కిణికిణీరవయుక్తమగు కాంచిసూత్రము కలదు. చరణదేశమున ఝుణఝుణారవ

యుక్తములగు నూపురములు విరాజమానమైయున్నవి. హస్తదేశమందు రత్నజటితము లగు వీరకంకణాంగదకేయూరములు రత్నజటితముద్రికలు, అంగుళులందు అంగుళీకములు, మొదలగు భూషణములు స్వస్వస్థానములందు విరాజమానములై యున్నవి ఆ యదుకులతిలకుని లలాటదేశమందు కస్తూరీతిలకము ఝుగఝుగితముగ విలసితమగుచున్నది ఆ కృష్ణభగవంతుడు యెప్పుడెప్పుడు దుష్టజనులచే సాధుజనులకు పరితాపమగునో, దుష్టజనుల వృద్ధియగునో, ధర్మమునకు లోపమగునో, అప్పుడప్పుడు నానావతారములను ధరించుచున్నాడు. భగవద్గీత —

"పరిత్రాణాయ సాధూనాం వినాశాయచ దుష్కృతాం
ధర్మసంస్థాపనార్థాయ సంభవామి యుగే యుగే ॥"

(ఇట్లు యుగయుగశబ్దమునకు కృతత్రేతాదియుగములనియు లేక క్షణక్షణమనియు అర్థము కలదు) శ్రీకృష్ణభగవంతుడు సాక్షాత్‌నారాయణుడుగానుండుట వలనను, సకలదేవతలకు ఆత్మగానుండుటవలనను ప్రణవమంత్రమున్ను, అష్టాక్షర మంత్రమున్ను, అతని స్వరూపమునే ప్రతిపాదనచేయుచున్నవి. కనుక ఈ కృష్ణ భగవంతుడు సకలసగుణరూపములందు శ్రేష్ఠుడుగానున్నాడు.

హే శిష్య ! ఏ అధికారిపురుషుడెంతవఱకు నిర్గుణబ్రహ్మసాక్షాత్కారము కాలేదో, అంతవఱకాయధికారిపురుషులు పూర్వోక్తవస్త్రభూషణాది సహితమగు కృష్ణ భగవంతుని ధ్యానము చేయవలయును

హే శిష్య ! హృదయదేశమందును సూర్యమండలమందును గోకులాదిస్థానము లందును స్థితిగలవారై పూర్వోక్తలీలాదిగుణములచే, యుక్తుడైనట్టి యే కృష్ణభగవంతుడు గలడో, ఆ కృష్ణభగవంతుడెపుడు అధికారియొక్క చిత్తమందు ప్రత్యక్షములేక సర్వదా ప్రతీతుడగుచున్నాడో, అపుడు యెట్లు దీపము ఘటాదిపదార్థముల ప్రకాశమునకు హేతువగుచున్నదో, అట్లే కృష్ణభగవంతుడున్ను తనయొక్క నిర్గుణస్వరూప సాక్షాత్కారమందు హేతువగుచున్నాడు. ఏ అధికారిపురుషులు ఆ కృష్ణభగవంతుని ధ్యానమున శుద్ధాంతఃకరణగలవారై నిర్గుణబ్రహ్మమును తన ఆత్మస్వరూపముగ సాక్షాత్కరించుకొనుచున్నారో, ఆ యధికారిపురుషులు సర్వశోకరహితులగుదురు. అపుడధికారిపురుషులకు ద్వైతప్రపంచము ప్రతీతముకానేరదు. మఱేమనిన యెట్లు రజ్జుజ్ఞానానంతరము కల్పితసర్పము రజ్జురూపమేయగుచున్నదో, అట్లే అద్వితీయ బ్రహ్మజ్ఞానానంతరము ఈ ద్వైతప్రపంచమున్ను అద్వితీయబ్రహ్మరూపమే యగుచున్నది.

ఇపుడు భేదదర్శనమందు అనర్థకారణత నిరూపింపబడుచున్నది — హే శిష్య ! యిటువంటి అద్వితీయబ్రహ్మమునందు ఏ పురుషుడు భేదమును చూచుచున్నాడో, ఆ భేదదర్శి పలుమారు జన్మమరణాదిదుఃఖరూపసంసారమునకు వచ్చుచున్నాడు హే శిష్య ? ఎట్లు నిర్గుణబ్రహ్మమందు వాస్తవముగ భేదములేదో, అట్లే మాయావిశిష్ట సగుణబ్రహ్మమందును వాస్తవముగ భేదములేదు. ఎందుకనగా — ఎట్లు మృత్తికా కార్యమైన ఘటశరావాదులు మృత్తికారూపకారణముకన్న భిన్నములు కావో, అట్లే బ్రహ్మకార్యమైన యీ జగత్తున్ను బ్రహ్మరూపకారణముకన్న భిన్నముకాదు మాయయు భిన్నముకాదు మాయావిశిష్టబ్రహ్మమున్ను భిన్నముకాదు. హే శిష్య ! విపరీతదర్శియగు పురుషునకు అనర్థప్రాప్తియగుననువార్త కేవలము శ్రుతిప్రమాణము చేతనే సిద్ధింపలేదు లోకానుభవముచేతకూడ సిద్ధించుచున్నది చూడుము — లోకమందు విషమును అమృతముగనెఱిగి భక్షణము చేయువారైన విపరీతదర్శియగు పురుషుడొకడు మృత్యువును పొందుచున్నాడు. భ్రాంతిపురుషుడొకడగ్నిని జలమని యెఱిగి అందుప్రవేశముచేసి దహింపబడుచున్నాడు. అట్లే సకల ద్వైతరహితాద్వితీయబ్రహ్మమందు ద్వైతబుద్ధియుండుటయును, విపరీతదృష్టిగలవారు మఱల మఱల జన్మమరణముల పొందుచున్నారు. ఏ బీజము నాటబడునో ఆ ఫలమే ప్రాప్తించును. నింబబీజమునకు నింబఫలము, ఆమ్రబీజమునకు ఆమ్రఫలము మాత్రమే కలుగును అద్వితీయబ్రహ్మమునందు భేదదృష్టిగల పురుషునకు జన్మమృత్యువులను ఫలమే కలుగును. మోక్షఫలమెక్కడిది? అభిప్రాయము — గౌణాత్మ, మిథ్యాత్మ, ముఖ్యాత్మలను భేదముచే ఆత్మ త్రివిధము. అట పుత్రాదిపదార్థములు గౌణాత్మ, శరీరము మిథ్యాత్మ, సాక్షియగు కూటస్థుడు ముఖ్యాత్మ. ఏ పురుషుడు ఒకనియొక్క పుత్రాది గౌణాత్మను హననము చేయుచున్నాడో, అథవా ఒకని శరీరరూపమిథ్యాత్మను హననము చేయుచున్నాడో ఆ పురుషుని రాజు మహాతాడనము చేయుచున్నాడు ఎపుడు గౌణాత్మ మిథ్యాత్మల హననముచేతనే తాడనమగుచున్నదో అపుడు సాక్షియగు కూటస్థరూప ముఖ్యాత్మను విపరీతదృష్టిరూపశస్త్రముచే హననము చేయువారైన పురుషులు మాటిమాటికి జన్మమరణముల పొందుదురని చెప్పనేల? ఈ వార్త అన్యశాస్త్రములయందును చెప్పబడియె.

"అన్యథా సన్తమాత్మాన మన్యథా యోఽభిమన్యతే
కిం తేన న కృతం పాపం చౌర్యేణాత్మాపహారిణా ॥"

భావార్థము — అద్వితీయసచ్చిదానందవ్యాపకాత్మను ఏ పురుషుడు ద్వైతాఽసజ్జడదుఃఖపరిచ్ఛిన్నరూపముగ నెంచుచున్నాడో, ఆ పురుషుడు తన ఆత్మయొక్క

హననము చేయువాడుగనున్నాడు ఇటువంటి ఆత్మహత్యచేయుచోరునిచే లోకమందే పాపము చేయబడలేదు ? సమస్తపాపకర్మలు చేయబడినవి.

హే శిష్య జీవుల హృదయకమలమందు విరాజమానుడై సకలభేదరహితుడైన సకలబుద్ధిప్రకాశకుడై సకలజగదాధారుడై సూర్యాది సకలప్రకాశములకు ప్రకాశకుడైనట్టి ఏ యానందస్వరూపాద్వితీయుడగు కృష్ణభగవంతుడుగలడో, యాతనినే యధికారిపురుషులు ''నేను కృష్ణరూపుడ''నను నీ ప్రకారముగ తన ఆత్మరూపముగ నెఱుగుచున్నారో ఆ అధికారులు కించిన్మాత్రమును సంసారదుఃఖమును పొందరు హే శిష్య ! ఈ యాత్మపురాణ ప్రథమాధ్యాయమున ఐతరేయోపనిషత్తునందు ఆత్మ ప్రజ్ఞారూపముగ కథనము చేయబడియె ఆ ఆత్మయే ఈ యైతరేయశాఖాస్థిత ఆత్మ ప్రబోధోపనిషత్తునందు ప్రజ్ఞానేత్రనామముచే కథనము చేయబడియె ఎట్లు జీవుని నేత్రము బ్రహ్మమైన సర్వవ్యవహారసిద్ధి చేయుచున్నచో, అట్లే యీ ఆత్మదేవుని ప్రజ్ఞారూపనేత్రము సకలవ్యవహారస్థితిని చేయుచున్నది ఈ కారణమువలన శ్రుతిభగవతి ఆత్మదేవుని "ప్రజ్ఞానేత్ర" నామముచే కథనము చేయుచున్నది. హే శిష్య ! ఏ చైతన్య రూపప్రజ్ఞ సకలజగత్తున కాధారమైయున్నదో, మఱియు ఏ ప్రజ్ఞయందు - సకలజగత్తు స్థితమైయున్నదో ఆ త్వం పదార్థరూపబ్రహ్మమునకు " ప్రజ్ఞానమానన్దం బ్రహ్మ '' ఈ మొదలగు మహావాక్యములు బ్రహ్మరూపముగ కథనము చేయుచున్నవి. ఆ ప్రజ్ఞా ప్రతిష్ఠారూపబ్రహ్మమును ఆ అధికారిపురుషులెపుడు తమ ఆత్మరూపముగ సాక్షాత్కరించుకొందురో అపుడా అధికారిపురుషులు దేహాద్యనాత్మపదార్థములందు ఆత్మ బుద్ధి రూపావిద్యయొక్క పరిత్యాగముచేసి బ్రహ్మభావమును పొందుదురు. హే శిష్య ! యీ ప్రకారముగల అద్వితీయాత్మను విచారముచేయువాడైన పురుషుడు విషయరాగాది ప్రతిబంధవశమున యీ జన్మమందాత్మసాక్షాత్కారము పొందకపోయినను బ్రహ్మలోకమునకుబోయి నానా ప్రకారభోగముల నుపభోగించి బ్రహ్మదేవునితోడనే పరబ్రహ్మభావమును పొందగలడు రాగరహితుడీజన్మమందే పరబ్రహ్మభావమును పొందును.

హే శిష్య ఆ పరబ్రహ్మప్రాప్తికొఱకధికారిపురుషులు కృష్ణభగవంతుని ప్రార్థించవలెను. హే వాసుదేవస్వరూప కృష్ణభగవంతుడా ! హే దేవకిజననినేత్రముల కానందప్రాప్తిచేయువాడైన ఓ కృష్ణభగవంతుడా! హే వసుదేవపుత్ర కృష్ణభగవంతుడా! అధికారినైన నేను నీకు శరణాగతుడనైనాను. నాకు వాస్తవమైన నిర్గుణస్వరూపమును ప్రాప్తింపజేయుము. హే శిష్య ! యీ ప్రకారముగ అధికారిజనులు కృష్ణభగవంతుని ప్రార్థనజేసినపుడా కృష్ణభగవంతుడా యధికారిజనులకు వేదాంతార్థధారణ సమర్థమైనట్టి మేధానామక శుద్ధబుద్ధినొసంగును. ఆ కృష్ణభగవంతుడే గీతయందిట్లు చెప్పియుండెను.-

దదామి బుద్ధియోగం తం యేన మాముపయాన్తి తే॥

ఆ కృష్ణప్రసాదరూపశుద్ధబుద్ధిచే అధికారిపురుషులు గురుశాస్త్రోపదిష్టమైన "నేను బ్రహ్మరూపుఁడ"నను నీప్రకారముగల ఆత్మజ్ఞానమును పొంది ఆ యాత్మజ్ఞాన ప్రభావముచే సంసారదుఃఖనివృత్తిపూర్వకముగ బ్రహ్మభావమును పొందుదురు. కాబట్టి అధికారి పురుషులచే కృష్ణభగవంతుని ధ్యానమును ప్రార్థనమును అనన్యముగ చేయవలయును.

ఇపుడు కైవల్యోపనిషత్తునందు ప్రతిపాదింపబడిన బ్రహ్మవిద్య నిరూపింపబడు చున్నది

హే శిష్య! పూర్వము ఋగ్వేదాచార్యుఁడగు అశ్వలాయనఋషి ఒకపుడు బ్రహ్మదేవుని సమీపమునకుబోయి యాతనినిట్లు ప్రార్థించెను. హే భగవన్! ఏ బ్రహ్మ విద్య సకలవిద్యలకన్న శ్రేష్ఠమైయున్నదో, శమదమాదిసాధనయుక్తులగు సాధుజనులు తమ హృదయకమలమందు ఏ బ్రహ్మవిద్యను సర్వదా సేవనము చేయుచున్నారో, ఏ బ్రహ్మవిద్య విషయాసక్తులైన అనధికారులకొసంగుటకయోగ్యమైయున్నదో, మఱియు యే బ్రహ్మవిద్యయొక్క ప్రభావమువలన విద్వత్పురుషులు సర్వపాపపరిత్యాగముచేసి పరబ్రహ్మబావమును పొందుచున్నారో, అటువంటి బ్రహ్మవిద్యను నీవు బాగుగ నెఱిగియున్నావు ఆ బ్రహ్మవిద్యను దయచేసి నాకుపదేశముచేయుము

హేశిష్య! ఈ ప్రకారముగ ఆయాశ్వలాయనముని ప్రార్థనముచేసినపుడా బ్రహ్మదేవుఁడామునినిగూర్చి యిట్లనియె హే అశ్వలాయన! ఏ అధికారిపురుషుఁడు వేదశాస్త్రవచనముయెడ ఆస్తికబుద్ధిరూప శ్రద్ధగలవాఁడై బ్రహ్మోపదేష్టయగు గురువునెడ పరమభక్తిగలవాఁడయి యుండునో మఱియు ఏ పురుషుఁడు బ్రహ్మాకారవృత్తిరూప ధ్యానముచే యుక్తుఁడో ఆ అధికారిపురుషుఁడే బ్రహ్మజ్ఞానమును పొందుచున్నాఁడు. శ్రద్ధాదిత్రయరహితునకు బ్రహ్మజ్ఞానప్రాప్తి కాదు. కాబట్టి అన్వయవ్యతిరేకముగ శ్రద్ధ, భక్తి ధ్యానము ఈ మూడును బ్రహ్మజ్ఞానమునకు సాధనములై యున్నవి.

శ్రుతి 'న కర్మణా న ప్రజయా ధనేన త్యాగేనైకే అమృతత్వమానశుః'

భావార్థము:— అగ్నిహోత్రాది కర్మలచేతను పుత్రపౌత్రాదిప్రజలచేతను, సువర్ణాదిధనముచేతను అమృతభావప్రాప్తి కానేరదు. మఱేమనిన — కర్మ, ప్రజ, ధనము యీ మూడింటియొక్క పరిత్యాగమువలననే అమృతభావప్రాప్తి యగును. అభిప్రాయము — ఈ ఆనందస్వరూపబ్రహ్మము స్వర్గాదిలోకములకన్న పరమై అమృతరూపముగాను, సకల జీవుల హృదయస్థితగుహయందు స్థితముగా నున్నది.

21

ఇటువంటి స్వప్రకాశనిత్యాపరోక్షబ్రహ్మముయొక్క పరోక్షజ్ఞానమేదిగలదో, అది భ్రాంతిరూపమగుటవలన ఆ భ్రాంతిజ్ఞానముచే మోక్షప్రాప్తి కానేరదు మఱేమనిన అపరోక్షబ్రహ్మజ్ఞానముచేతనే మోక్షప్రాప్తి యగును. ఇటువంటి బ్రహ్మాపరోక్షజ్ఞానమును సకలప్రతిబంధరహితుడైన సన్న్యాసియే ప్రాప్తినొందును హే అశ్వలాయన! సన్న్యాసియైయుండినను, బ్రహ్మవేత్తయగు గురుముఖమున వేదాంతవచనశ్రవణ మనన నిదిధ్యాసములచేసినను ఒకచో బ్రహ్మలోకేచ్ఛారూపప్రతిబంధము కలిగి యుండినవానికి యీ లోకమందు బ్రహ్మజ్ఞానము ప్రాప్తింపదు. మఱేమనిన శరీరత్యాగానంతరము బ్రహ్మలోకమందు వానికది ప్రాప్తించును కామనలేనివానికి యీ జన్మమందే యీ లోకమందే బ్రహ్మజ్ఞానము ప్రాప్తమగును హే అశ్వలాయన! బ్రహ్మలోకమునకు పోవువానికికూడా తత్కాలమున బ్రహ్మజ్ఞానము కలుగదు. మఱే మనిన ఎపుడాహిరణ్యగర్భబ్రహ్మదేవుని ఆయువు పూర్తియగునో, అపుడా సన్న్యాసి బ్రహ్మదేవునితోడనే పరబ్రహ్మభావమును పొందును. కనుక బ్రహ్మలోకేచ్ఛవదలి అధికారి బ్రహ్మభావప్రాప్తికొఱకు యీ ప్రకారమగు యోగము చేయవలయును. అధికారి యేకాంతమైన నిర్మలప్రదేశమందు మొదట దర్భాసనము ప్రసరించి దానిపై మృగచర్మమువైచి దానిపైవస్త్రమును ప్రసరించవలెను ఇటువంటి ఆసనముపై పద్మాదిఆసనములందలి యొక ఆసనము ధరించి కూర్చుండవలయును శాస్త్రరీతిగా బాహ్యశౌచము అంతరశౌచము గావించి శ్రమరహితుడై ఆ అధికారి తన మస్తకమును, గ్రీవమును, శరీరమును, దండమువలె సరళముగనుంచవలయును ఈ ప్రకారముగ ఆసనము దృఢముచేసి ఆయోగి నేత్రాదిబాహ్యేంద్రియములను, మనోరూప అంతరింద్రియమును నిరోధించవలెను మఱియు తన గురువునకు నమస్కరించి పంచ ఛిద్రయుక్తహృదయకమలమును ధ్యానము చేయవలయును ఆ హృదయకమలము సూర్యచంద్రాగ్ని యుక్తమై యున్నది. మఱియు రాగద్వేషాది రాజస ధర్మముల చేతను ఆలస్యమోహాది తామసధర్మములచేతను, రహితమై యున్నది ఇటువంటి హృదయకమలమును ధ్యానముచేసి ఆ యోగి ఆ హృదయకమలమందు సర్వదా నిరాకారబ్రహ్మమును ధ్యానించవలయును. ఆ బ్రహ్మము సకలదుఃఖరహితమై, అద్వితీయానందస్వరూపమై మనోవాక్కుల కచింత్యమై, శబ్దస్పర్శాదిగుణరహితమై, శివరూపమై మాయారహితమై దేశకాలవస్తుపరిచ్ఛేదరహితమై శ్వాసోచ్ఛ్వాసములవలె అప్రయత్నముగ నాల్గువేదముల ప్రకటించునదియై జననమరణాది వికారరహితమై స్వయంజ్యోతి రూపమై సర్వశక్తిసంపన్నమై ఆశ్చర్యకరమై యున్నది. ఈప్రకారముగ యోగి నిర్గుణబ్రహ్మమును ధ్యానము చేయవలయును. అట్టి ధ్యానముచే నా యోగి సులభముగానే నిర్గుణబ్రహ్మసాక్షాత్కారమును పొందును. హే అశ్వలాయన!

ఏ అధికారిచిత్తము నిర్గుణ బ్రహ్మధ్యాన సమర్థముకాదో ఆ యధికారి హృదయకమల మున ఈరీతిగా సగుణబ్రహ్మధ్యానమును చేయవలయును. కేనోపనిషత్తునందు ఏ యుమాదేవి బ్రహ్మవిద్యారూపముగ వర్ణింపబడినదో, ఆ రూపయవ్వనసంపన్నయగు ఉమాదేవి పరమేశ్వరునకు స్త్రీరూపముగ నున్నది. ఆ యుమాదేవి యెట్లున్నదనగా — నానాజాతి సకలస్త్రీరూప ప్రతిబింబములకు బింబరూపముగాను, సర్వశక్తిరూపము గాను మహదాదిసర్వతత్త్వరూపముగ నున్నది ఆ యుమాదేవియొక్క అనుగ్రహముచే యింద్రాదిదేవతలును, మనుష్యాదిజీవులును స్వర్గాదిలోకములను మోక్షమును పొందు చుందురు ఈ లోకమందు నానాప్రకారసుఖములను పొందుదురు జగదుత్పత్తిరూప బ్రహ్మదేవునికర్మమున్ను, జగత్పాలనరూప విష్ణుకర్మయున్ను, ఉమాదేవియొక్క కృపాకటాక్షముచేతనే జరుగుచున్నవి ఉమాదేవియొక్క క్రూరకటాక్షముచే సంపూర్ణ బ్రహ్మాండము నశించుచున్నది ఏ యుమాదేవికి స్తనద్వయముపీనముగాను, ఉన్నతము గాను, జఘనస్థానము విశాలముగాను, ముఖము చంద్రసమానముగాను, నేత్రము మత్స్యసమానముగ చంచలముగాను, కేశములు భ్రమరసమానముగ శ్యామవర్ణము గాను, సర్వాంగములు సుందరముగాను విచిత్రమైన కాంచీసూత్రము శోభాయమాన ముగనున్నదో, ఏ ఉమాదేవి మహాదేవునకు ధైర్యమొసగుచున్నదో, ఏ ఉమాదేవికి రత్నజటిత కంకణ అంగదనూపురహారకిరీట కుండలాది అలంకారములు పరమ శోభాయమానములుగనున్నవో, యే ఉమాదేవియొక్క స్వరూపము ఉపమారహితము గాను, సకలభూషణములకును భూషణముగనున్నదో, యే ఉమాదేవి సకలజగత్కారణ రూపముచే అనాదియై షోడశవర్షావస్థగలదిగానున్నదో, యిటువంటి ఉమాదేవి సహిత ముగ విరాజమానులై అద్దేవికి పతియగునే శ్రీమహాదేవుడు కలడో, ఆ మహాదేవుడు ఉమాదేవికన్నను అధికగుణవంతుడైయున్నాడు ఆ మహాదేవుడు బ్రహ్మాదిసర్వదేవ తలకును ప్రభువుగా నానా భూషణములచే విరాజమానుడుగనున్నాడు. అతడు వ్యాఘ్రచర్మము దిగారూపవస్త్రము ధరించియున్నాడు. ఆ మహాదేవుని సర్వాంగములు భస్మోద్ధూళితమైయున్నది. కంఠమందు దండమాల కలదు. లలాట దేశమందు చంద్రుడు స్థితుడైయున్నాడు. ఆ మహాదేవుని నీలకంఠము శంఖాకారముగానున్నది. శేషనాగమే యజ్ఞోపవీతము. పద్మాసనమువైచికొని నాసికాగ్రదృష్టిగల్గి యున్నాడు. అతనికి ఈశాన తత్పురుష అఘోర సద్యోజాత వామదేవులను నీ పంచమూర్తులు గలవు. ఆ పంచమూర్తులచే నా మహాదేవుడు క్రమముగ జగదుత్పత్తి స్థితిసంహార ప్రవేశ అనుగ్రహములను నీ యైదుకార్యములు చేయుచున్నాడు. అతడు సనకాది గురువులయొక్కయు గురువై స్వయంజ్యోతియై అద్వితీయానందస్వరూపుడుగా నున్నాడు.

సమష్టి స్థూలప్రపంచమును సృజించువాడైన ఏ హిరణ్యగర్భభగవంతుడు గలడో అతడున్ను యే మహాదేవునిచే జనించుచున్నాడో అట్టి మహాదేవుడు సకల విశ్వమునకీశ్వరుడుగానున్నాడు; అతడు తనయొక్క స్మరణమాత్రముచే భక్తజనుల సకలపాపముల దహనము చేయువాడుగా నున్నాడు ఇటువంటి ఉమాదేవి సహితుడును నీలకంఠుడును అగు మహాదేవుని ఆ యోగి తనహృదయకమలమందు అథవా సూర్యమండలమందు అథవా చంద్రమండలమందు అథవా అగ్నియందు అథవా కైలాసాది పర్వతములందు ధ్యానము చేయవలయును

హే అశ్వలాయన ! ఈ ప్రకారముగ ఉమాదేవిసహిత మహాదేవునియొక్క ధ్యానముచే మనస్సు స్థిరమై ఆ యోగి సులభముగ ఆత్మరూపనిర్వాణ బ్రహ్మసాక్షాత్కారమును పొందుచున్నాడు హే అశ్వలాయన! యిపుడు వర్ణింపబడిన ఉమాదేవి సహిత మహాదేవుడు సగుణబ్రహ్మము. అది నిర్గుణబ్రహ్మముకన్న వేరుకాదు. మఱేమనిన ఉపాధిపరిత్యాగము కాగా ఆ సగుణబ్రహ్మమే నిర్గుణబ్రహ్మమగును. బ్రహ్మవిష్ణువులనుండి జడపదార్థమువఱకుగల సమస్త పదార్థములందు ఆ బ్రహ్మమునకు వేఱగు యేయొక పదార్థమున్ను లేదు. శ్రుతి "సర్వం ఖల్విదం బ్రహ్మ" సంపూర్ణజగత్తు బ్రహ్మస్వరూపమే యైయున్నది హే అశ్వలాయన యెట్లు స్వప్నమందు ఒకడైన స్వప్నద్రష్ట నానాభావముల పొందుచున్నాడో, అట్లే ఒకడేయైన పరమాత్మదేవుడు మాయాసంబంధముచే నానారూపుడగుచున్నాడు. ఆ పరమాత్మదేవుని మార్గముతప్ప ముక్తికి యింకొకమార్గముండియుండలేదు యిపుడు లేదు. ముందును ఉండబోదు. శ్రుతి ' నాన్యః పంథా విద్యతేఽయనాయ" నేను బ్రహ్మరూపుడనను నీ ఆత్మజ్ఞానమే ముక్తికి మార్గమైయున్నది. హే అశ్వలాయన! ఏ అధికారి పురుషులు తన ఆనందరూపాత్మను సర్వభూతములయందును, సర్వభూతముల తమ ఆత్మయందును చూచుచున్నారో ఆ యధికారిపురుషులు బ్రహ్మభావమును పొందుదురు ఇదిగాక యింకొక ఉపాయములేదు. ఇపుడు చెప్పిన ప్రకారము ఆత్మదేవుని యెఱుగుటకు అధికారి సమర్థుడు కాకపోయిన పక్షమందు శ్రుతి యిట్లు వచించినది:—

"ఆత్మానమరణిం కృత్వా ప్రణవం చోత్తరారణిం
జ్ఞాననిర్మథనాభ్యాసాత్పాశం దహతి పండితః" ॥

సూక్ష్మశరీరమును క్రిందఅరణిగాను ప్రణవమును పైఅరణిగాను కల్పించి ధ్యానరూపమథనమును చేయవలయును. ఇట్లు ధ్యానముచే అధికారియొక్క హృదయమందు ఆత్మరూపాగ్ని ప్రకటితమై సకల సంసారపాశములను దహించును. అపుడే

ఈ త్వంపదార్థరూపుడగు జీవుడు తత్పదార్థమగు బ్రహ్మమేయగును. జీవుడు పూర్వ మున్ను బ్రహ్మరూపుడైయే యుండినను ఉపాధిచే కప్పబడియుండును యిపుడు ప్రకటితమగునని అభిప్రాయము.

అశ్వలాయనుడు — హే భగవన్! జీవుడు బ్రహ్మరూపుడేయైయుండిన పక్షమందు వానికి జన్మమరణాదిసంసారమెందుకు కలిగినది?

బ్రహ్మదేవుడు — హే అశ్వలాయన! చైతన్యాశ్రితమైన అవిద్యచే వావృతమైన బ్రహ్మమే జీవభావమును పొంది నానాఉపాధులందు నివాసముచేసి నానాప్రకార కర్మములుచేసి తత్ఫలములైన సుఖదుఃఖాదులను భోగించుచున్నది మాయాయుతు డైన ఆత్మదేవుడే జాగ్రత్స్వప్నావస్థలయందు నానాశరీరములను ధారణముచేసి నానా భోగములనుపభోగించి తుదకు మూర్ఛాసమానమగు సుషుప్త్యవస్థను పొంది అచట విక్షేపరూపప్రతిబంధరహితుడై ఆత్మస్వరూపానందమును పొందినను, మాయా సంబంధముచే నాయానందము నెఱుగకుండును ఎట్లు లోకమందు యేదో ఒకమంత్ర ముచే అథవా ఔషధాదులచే మూఢావస్థను పొందినమనుజుడు తన బ్రాహ్మణత్వ క్షత్రియత్వాదుల నెఱుగకుండునో, మఱియు నెట్లు ధర్మాత్ముడును చోరునిసాంగత్యముచే బంధనమును పొందుచున్నాడో, అట్లే వాస్తవముగ జన్మమరణాదిసంసారరహితమగు ఆత్మయు మాయాసాంగత్యముచే సంసారమును పొందుచున్నాడు ఆ మాయారహితా త్మయందు మాయయు మాయచేతనే ప్రతీతమగుచున్నది. అద్వితీయాత్మయందు జగత్తు మాయచే కల్పితమగుటవలన ఎట్లు మిథ్యయైయున్నదో అట్లే మాయయు మాయచే కల్పితమగుటవలన మిథ్యయే యైయున్నది. తన సిద్ధియందు తనయొక్క అపేక్ష యగుటచే ఆత్మాశ్రయదోషము సంప్రాప్తించుచున్నను దుర్ఘటకార్యముల నొనర్పగలిగి 'అఘటితఘటనాపటీయసీ'' యను నామమును పొందినట్టి మాయ యందాయాత్మాశ్రయదోషము సంభవింపదు. స్వపరనిర్వాహక పదార్థమునకు ఆత్మా శ్రయదోషము కాదు. ఎట్లనగా — ప్రకాశవిషయమందు స్వపరనిర్వాహకము దీపమైనట్లు మాయయు జ్ఞానవిషయమందు స్వపరనిర్వాహకమై యున్నది.)

హే అశ్వలాయన! ఎట్లు సర్వశాస్త్రవిశారదుడై విద్వాంసుడు, స్వప్నావస్థ యందు నిద్రాదోషముచే నానాప్రకారమోహమును పొందుచున్నాడో, అట్లు వాస్తవ ముగ మోహరహితుడైన ఈ ఆత్మదేవుడున్ను మాయాదోషముచే నానాప్రకార మోహమును పొందుచున్నాడు. స్వప్నపురుషుడు సింహవ్యాఘ్రాది భయంకర

పదార్థములనుచూచి దుఃఖముచే రోదనముచేసినపుడు ఒకానొకదయాళువగు పురుషుడు భేర్యాదుల ఉచ్చశబ్దముచే వానినిజాగరూకుడుగా జేయునట్లు మాయారూప నిద్రాదోష ముచే సంసారస్వప్నమందు పీడితుడైన జీవాత్మను బ్రహ్మవేత్తయైన దయాళువగు గురువు మహావాక్యరూప భేరీశబ్దముచే మాయారూపనిద్రనుండి జాగరూకుడుగా జేయు చున్నాడు ఆ గురూపదేశముచే బ్రహ్మజ్ఞానరూపజాగ్రదవస్థను పొందినవాడైన ఆ అధికారి మఱల సంసారస్వప్నమునకు రాడు. ఇటువంటి బ్రహ్మజ్ఞానప్రాప్తి జీవులకు అనేకజన్మపుణ్యకర్మప్రభావముచే నగుచున్నది కనుక ఈ బ్రహ్మజ్ఞాన రూపతురీయావస్థ అత్యంతదుర్లభముగా నున్నది. ఎవనికో మహాభాగ్యము గలవానికే యిది ప్రాప్తమగుచున్నది.

హే అశ్వలాయన! తురీయమని చతుర్థమునకు పేరు కలదు. జాగ్రత్స్వప్న సుషుప్తులను ఈ మూడవస్థలు జీవాత్మక్రీడాస్థానములై యున్నవి ఈ యవస్థలు పురమనబడును. చతుర్థమైన బ్రహ్మజ్ఞానరూపమగు తురీయావస్థ, ఆ పురత్రయమును నాశనము చేయుచున్నది. బ్రహ్మజ్ఞానరూపతురీయావస్థచేగాక యింకేయొక ఉపా యము చేతను పురత్రయము నశింపదు. హే అశ్వలాయన! ఎంతవఱకు తురీయావస్థ ప్రాప్తము కాలేదో అంతవఱకు జీవాత్మ పూర్వకర్మవశముగ మఱల మఱల జన్మ మరణములను నానాశరీరములను బాల్యతారుణ్యవార్ధక్యావస్థలను పొందుచుండును. గురుకృపవలన యే తురీయపదమును జీవాత్మ పొందుచున్నాడో, ఆ తురీయపద మెట్లున్నదనగా — సకలజగత్తునకు ఆధారముగాను కేవలశ్రుతిచే ప్రతిపాద్యముగాను స్వయంజ్యోతియగు ఆనందరూపముగాను, జగత్కారణముగాను, కార్యకారణ భావ రహితముగనున్నది హే అశ్వలాయన! ఏ పరబ్రహ్మము సర్వమునకు ఆత్మరూపమై యున్నదో సర్వవిశ్వమున కాధారమైయున్నదో, పరిచ్ఛేదత్రయరహితమో, సూక్ష్మము కన్నను సూక్ష్మమై యుత్పత్తినాశరహితమైయున్నదో, ఆ అద్వితీయబ్రహ్మమే నీ స్వరూపమైయున్నది. జాగ్రదాది మూడవస్థలలో క్రమముగ స్థూలసూక్ష్మ ఆనంద ములను నీమూడుప్రకారములగు భోగ్యములు కలవు. విశ్వ, తైజస, ప్రాజ్ఞులను నీముప్పురు భోక్తలు గలరు మఱియు భోగ్యపదార్థములను విషయము చేయునట్టి అంతఃకరణవృత్తిరూపములైన లేక అజ్ఞానవృత్తిరూపములైన భోగములు కలవు ఆ భోక్త్రాదిత్రయమును శుద్ధాత్మనగు నేను సాక్షిరూపముగ ప్రకాశము చేయుచున్నాను కనుక శుద్ధాత్మనగునేను భోక్త్రాదిత్రయముకన్న విలక్షణముగ నున్నాను

శ్రుతి॥ 'త్రిషు ధామసు యద్భోగ్యం భోక్తా భోగశ్చ యద్భవేత్
తేభ్యో విలక్షణస్సాక్షీ చిన్మాత్రోఽహం సదాశివ ॥'

"హే ఆశ్వలాయన! ఈ ప్రకారముగ బ్రహ్మవేత్తయగు గురుముఖమున ఆత్మ యొక్క వాస్తవ స్వరూపమును శ్రవణముజేసి ఆ అధికారిపురుషులీ ప్రకారముగ మననము చేయుదురు. ఈ సంపూర్ణజగత్తు ఆత్మయైన నాయందు పుట్టుచున్నది. నాయందే స్థితమై మఱల నాయందే అభావమును పొందుచున్నది. కనుక సకల భేద రహితమగు అద్వితీయబ్రహ్మమేనేనైయున్నాను. నాకన్న బ్రహ్మము భిన్నము కాదు.

ఈ కారణము వలననే సకలవేదములు నన్నువిశ్వరూపునిగ కథనము చేయు చున్నవి. మఱియు పురాణపురుషుడననియు సకలతేజోనిధియనియు, సకలేంద్రియ రహితుడనియు ప్రాణబుద్ధ్యాదిరహితుడనియు, భగవాన్ పరమేశ్వరుడనియు సర్వజ్ఞు డనియు, ద్వైతరహితుడనియు, మనోవాక్కులకవిషయమనియు సకల వేదవేద్యు డనియు సకలవేదార్థప్రవేశకుడనియు సకల విద్యలకు గురువనియు దేవుడనియు వచించుచున్నవి.

హే ఆశ్వలాయన! ఈ ప్రకారముగ ఆత్మవిచారముచేసి అధికారులు శుద్ధ బ్రహ్మమును పొందుదురు. ఆ శుద్ధబ్రహ్మము అద్వితీయానందస్వరూపముగాను సమస్త బుద్ధులందు స్థితమై సాక్షిరూపముగ నున్నది.

శ్వేతాశ్వతరముని:— ఓ శిష్యులారా! ఈ ప్రకారముగ బ్రహ్మదేవుడు ఆశ్వలా యనఋషికి సగుణనిర్గుణబ్రహ్మధ్యానపూర్వకముగ ఆత్మజ్ఞానోపదేశము గావించెను. కనుక అధికారులు ఆత్మజ్ఞానముకొఱకు నిర్గుణబ్రహ్మధ్యానమును సగుణబ్రహ్మధ్యాన మును అవశ్యముగ చేయువలసినది ఏ అధికారులు అంతఃకరణమలినతాదిదోషముల వలన సగుణ నిర్గుణబ్రహ్మధ్యానమునందు సమర్థులుకారో, శీఘ్రముగ సన్యాసధారణ మును చేయరో, ఆ యధికారులు అంతః కరణశుద్ధికై ఉపాయము గావింపవలయును! అంతఃకరణశుద్ధి కొఱకు శాస్త్రములందెన్ని సాధనములు చెప్పబడినవో, ఆ సకల సాధనములందు "నమస్తే" యిత్యాది రుద్రాధ్యాయ పారసమానముగ యింకొక సాధనములేదు. కనుక అధికారి పురుషులు రుద్రాధ్యాయమును నిరంతరము పారము చేయవలయును. ఆ రుద్రాధ్యాయపాఠముచే అధికారికి అంతఃకరణశుద్ధియై వైరాగ్య ప్రాప్తియగును. అథవా గర్భదుఃఖవిచారణమరణకాలజ్ఞానము అష్టాంగయోగము ఉపాసన మొదలగువానిచే వైరాగ్యప్రాప్తియగును. అపుడు సన్న్యాసగ్రహణము చేయవలయును

హే శిష్య! సన్యాసాశ్రమగ్రహణముచేసినను, ఎంతవఱకాత్మసాక్షాత్కారము కాలేదో అంతవఱకధికారిపురుషులు రుద్రాధ్యాయపాఠపూర్వకముగ ఉమాదేవీ సహిత శ్రీ మహాదేవుని ధ్యానమవశ్యముగ చేయవలయును

'ఉమాసహాయం పరమేశ్వరంప్రభుం, త్రిలోచనం నీలకంఠం ప్రశాన్తం
ధ్యాత్వా మునిర్గచ్ఛతి భూతయోనిం సమస్తసాక్షిం తమసః పరస్తాత్ ॥

భావార్థము — ఉమాదేవీసహితముగ విరాజమానులై పరమేశ్వరులై సర్వమునకు ప్రభువై త్రినేత్రముగలవారై అత్యంతశాంతస్వరూపముగలవారై నీలకంఠముగలవారైనట్టి మహాదేవుని ధ్యానముచే అధికారిపురుషులు అద్వితీయ బ్రహ్మభావమును పొందుదురు. ఆ బ్రహ్మము యెట్లున్నదనగా — సకల భూత భౌతిక జగత్తునకు కారణముగాను, సకలప్రపంచమునకు సాక్షిగాను, అజ్ఞానరూపతమము కన్న పరముగను నున్నది

హే శిష్య ! సన్న్యాసగ్రహణముచేసి అధికారులు శ్రద్ధాపూర్వకముగ నిరంతరము శ్రవణమననాదుల చేయవలయును

"ఆసుప్తే రామృతేః కాలం నయేద్వేదాన్తచిన్తయా
దద్యాన్నావసరం కించిత్ కామాదీనాం మనాగపి" ॥

ప్రాతఃకాలమున మేల్కొనినప్పటినుండి రాత్రి సుషుప్తి గలుగువఱకును, జన్మించినది మొదలు మరణ పర్యంతమును నిరంతరము వేదాంతచింతనముచేతనే కాలయాపనము చేయవలయును. వేదాంతచింతనమునకు తప్ప సన్న్యాసులు తమ చిత్తమందు కామక్రోధాదులకు కించిన్మాత్రమును అవసరమివ్వకూడదు. ఈ ప్రకారముగనే నిరంతరవేదాంతవిచారము చేయువారైన సన్న్యాసులు శీఘ్రముగనే ఆత్మసాక్షాత్కారమును పొందుదురు. ఈ విషయమున సర్వజ్ఞులైన శ్వేతకేతువే దృష్టాంతము. (చాందోగ్యోపనిషత్తునందు షష్ఠాధ్యాయమున వర్ణింపబడినటుల) శ్వేతకేతువను సన్న్యాసి పూర్వము వైరాగ్యపూర్వకశ్రవణమననాదిసాధనలచే ఆత్మసాక్షాత్కారమును పొందియుండెను కావున యీకాలమందును పరమహంససన్న్యాసులు శ్రవణమననాద్యుపాయములచే ఆత్మజ్ఞానమునవశ్యముగ సంపాదనము చేయవలసినది. పరమహంససన్న్యాసులకు ఆత్మజ్ఞాననిష్ఠారూపమగు ఆచారమే ప్రధానము ఆత్మనిష్ఠావిరుద్ధములైన సకలాచారములును తుచ్ఛములై యున్నవి

హే శిష్య ! పూర్వము పరమహంససన్న్యాసవిషయమున నీవేది ప్రశ్నింతువో, అట్టి పరమహంససన్న్యాసస్వరూపమును, తత్సన్న్యాసాధికారముయొక్క స్వరూపమును, వైరాగ్యాదిసాధనములయొక్క స్వరూపమును, తద్గ్రహణప్రకారమును నీకు విస్తారముగ వచించితిని ఇక నిపుడేవిషయమును శ్రవణము చేయుటకై నీకు యిచ్ఛగలదో, దానిని నాకు చెప్పుము

ఇతి శ్రీమదాత్మపురాణే ఏకాదశోఽధ్యాయః.

ఆత్మపురాణము

అథ ద్వాదశాధ్యాయారంభః

ద్వాదశాఽధ్యాయము

శ్రద్ధాభక్తిగలవాడైన శిష్యుడు శ్రీ గురువునుగూర్చి యిట్లు ప్రార్థనజేసెను.

హే భగవన్! యీ ఆత్మపురాణముయొక్క యేకాదశాధ్యాయమునందు సర్వజ్ఞుడును సర్వోత్కృష్టుడునైన శ్వేతకేతువను సన్న్యాసియొక్క దృష్టాంతమెతిం గించితిరి ఆ శ్వేతకేతుసన్న్యాసియొక్క విషయము ఆశ్చర్యకరముగ నుండును. దయచేసి తామద్దానిని వచింపవలెనని ప్రార్థన. అంత శ్రీ గురువు శిష్యునిప్రార్థన నంగీకరించి శ్వేతకేతు విషయమునుగూర్చి చెప్ప నారంభించెను.

శ్రీ గురువు హే శిష్య! పూర్వము శ్వేతకేతువను పేరుగల ఒక ఋషిబాలకు డుండెను, ఆ బాలకునిపై మాతాపితరులకు బహుస్నేహభావముండెను. మాతాపితృల స్నేహకారణమున ఆ శ్వేతకేతువుయొక్క దుష్టవృత్తి అశిక్షితవృషభతుల్యమాయెను. ఆ శ్వేతకేతుడు సర్వదా క్రీడించుటయందే వర్తించుచుండెను. ఈలాగున ఆ శ్వేత కేతువు ఉపనయనసంస్కారములు కూడ లేనివాడై క్రమముగ ద్వాదశవయస్సు గలవాడాయెను. కావలసినపుడు ఒకదినము భోజనముచేయుట ఒకదినము చేయ కుండుట యితర బాలకులనుకొట్టుట పశ్వాదులనుకొట్టుట పరుగెత్తి యింటికి వచ్చుట ఈ ప్రకారముగ బాల్యావస్థయందు ఆ శ్వేతకేతువు అశిక్షితపశున్యాయముగ జనుల పీడించుచుండెను. ఆ శ్వేతకేతు వొకదినమున వినయపూర్వకముగ ఆరుణినామకుడగు తన తండ్రి సమీపమునకొచ్చెను అపుడు ఆరుణి తనపుత్రుని ఉన్మత్తదశనుజూచి మనస్సులో ఖేదమునొంది వానిగూర్చి యిట్లనియె. అవివేకమూలమగు స్నేహమువకు

వశమై నేనును నీ జననియు నిన్ను శిక్షించలేదు. మఱేమనిన స్నేహమునకు వశులమై మేము సర్వదా నీలాలనమే చేయుచుంటిమి దానివలన నీకిట్టి ఉన్మత్తదశ ప్రాప్త మైనది. హే పుత్ర! శిష్య స్త్రీ పుత్రులమువ్వురికి లాలనముచే బహుదోషప్రాప్తియు తాడనముచే బహుగుణప్రాప్తియునగునని నీతిశాస్త్రమందు చెప్పబడియె

"లాలనాద్బహవో దోషా స్తాడవాద్బహ వోగుణాః
తస్మాత్పుత్రంచ శిష్యంచ తాడయేన్నతు లాలయేత్॥

హే పుత్రా! ఏ మాతాపితరులు స్నేహవశులై పుత్రునిశిక్షచేయక లాలన చేయుచున్నారో, ఆ మాతాపితరులాపుత్రునకు శత్రువులేగాని మిత్రులుగారు. ఎందుకనగా ఆలాలనచే జనించిన దోషమువలన ఆ పుత్రుడు యిహలోకమందును పరలోకమందును నానా దుఃఖముల నుపభోగించుచున్నాడు. ఏ మూఢబుద్ధియగు పుత్రుడు మాతాపితరుల శిక్షను ఆచార్యశిక్షను గ్రహణముచేయడో ఆ మూఢబుద్ధి ఈ లోకమందు రాజాదులభయమును, పరలోకమందు యమరాజుభయమును పొందు చున్నాడు. మాతాపితరులమగు మేము నిన్ను శిక్షచేయలేదు. కనుక నీవు ద్వాదశ వత్సరముల వయస్సుగలవాడవయ్యును బ్రహ్మచర్యరహితుడవుగానున్నావు. నీవు యెవడైన అనాచారియైనవానికి నికృష్టకులమందు పుట్టవలసినది నా కులమందు యిటువంటి వా డెవడును పుట్టలేదు. హే పుత్ర! నీతిశాస్త్రమర్యాదను పరిత్యాగముచేసి, యింతవఱకు మేము నిన్ను స్నేహముగ లాలనము చేసితిమి కనుకనే యిపుడు మేము నీకు ఉపనయనసంస్కారశిక్ష చేయుట అత్యంతదుర్ఘటముగానున్నది స్నేహ యుక్తులమగు మామీద నీకు శ్రద్ధకూడ లేదు. శ్రద్ధలేనివానికా విద్యోపదేశముచేసిన, అది భస్మమందు ఆహుతివలె వ్యర్థమగుచున్నది. కనుక యిపుడు నీవు యెవడైన మఱొక ఆచార్యుని సమీపమునకుపోయి, వానిచే విద్యాధ్యయనాది బ్రహ్మచర్య ధర్మములను సంపాదనము చేయుము. హే పుత్ర! బ్రహ్మచర్య విద్యాధ్యయనములు చేయకున్న అపుడు ఈ లోకమందు నరకలోకముకన్నను దుఃఖమగు అపకీర్తి యగును. మా కులమందు పుట్టితివి. కనుక మాకును అపకీర్తియగును. భగవంతు డును యిట్లు వచించెను. "సంభావితస్య చాకీర్తిర్మరణాదతిరిచ్యతే" శ్రేష్ఠునకు అపకీర్తి మరణముకన్నను అధికముగనున్నది

హే శిష్య! ఈ ప్రకారమగు పితృవచనముల వినినపుడాశ్వేతకేతువు విచార మును పొందెను. పిత్రాజ్ఞచే గృహమును పరిత్యాగముచేసి పరదేశమునకుపోయి ఒకానొక వేదవేత్తయగు బ్రాహ్మణుని గురువుగ జేసికొని వానివలన వ్యాకరణాది షడంగసహితముగ నాల్గు వేదముల నధ్యయనము చేసెను. ఒక ఉపనిషద్రూప

వేదాంతభాగమును విడచి తక్కిన అన్నివేదార్థములను విచారణచేసెను. ఈ ప్రకార మధ్యయనముచేసి, ఆ శ్వేతకేతువు గుర్వాజ్ఞనుగైకొని, తన గృహమునకు వచ్చుచు, మార్గమందిట్లు విచారణచేయ దొడంగెను నేను సకలవేదములను వేదార్థములను బాగుగ నధ్యయనము చేసితిని. కనుక నే నత్యంత బుద్ధిమంతుడుగానున్నాను. నే నెఱిగి నట్లుగ వేదపారమును వేదార్థమును నా పిత యెఱుగడు. నా పితకు వేదవేదార్థములు తెలిసియున్న పక్షమందు పుత్రుడనగు నన్ను దేశాంతరమునకేల పంపును? నేనే వేదాధ్యయనముచేసితినో దానినిచూచి నా గురువుకూడా నాయొక్క తీక్ష్ణబుద్ధినెఱిగి, తన పుత్రులకన్నను నాపై అధికస్నేహభావముంచెను. నా గురువొక దినమున ప్రసంగానుసారముగ నాతో యిట్లనెను ప్రియశిష్యుడవగు నో శ్వేతకేతూ! నేను శపథపూర్వకముగ చెప్పుచున్నాను. నేనెంతవిద్య నెఱుగుదునో, ఆ యంతవిద్యయు నీకొసంగుచున్నాను నీకొసంగక కొంచెమైనను విద్యను నేను దాచిపెట్టుకొనలేదు. ఈ గురువచనమువలన యేమి తెలియబడుచున్నదనగా — నేను ఆరుణియగు నాపితకన్నను అధికవిద్వాంసుడనైతిని యిందు సంశయమేలేదు పుత్రుడు పితకన్న అధికబుద్ధిమంతుడగు విషయమున ఆశ్చర్యములేదు. పూర్వము బృహస్పతిపుత్రుడగు కచుడు తన పితకన్నను బుద్ధిమంతుడాయెను అతడు శుక్రాచార్యులచే మృతసంజీవినీ విద్యను నేర్చి సకలదేవతలకును ఆ గోప్యవిద్యను నేర్పెను. ఈ వార్త శతపథబ్రాహ్మణ మందును, మనుస్మృతియందును ప్రసిద్ధముగనున్నది. అట్లే నేనుకూడ పితకంటె అధికవిద్వాంసుడుగా నున్నాను ఇట్లు విచారము చేసి చేసి మహాగర్వమునుపొంది ఆ గర్వముచే బుట్టిన మోహబలముతో ఆ శ్వేతకేతువు తన గృహమునకుపోయిన పిదప తన పితృచరణములపై మస్తకముంచి నమస్కారములుచేయుట విడచి, నమస్కారరహితుడై స్తంభమువలె ఉచ్చ ఆసనముపై స్థితుడాయెను

హే శిష్య — ఈ ప్రకారము తనపుత్రుని నమ్రతారహితునిగజూచి ఆ యారుణిపిత తన పుత్రుని కోపముచేయక కృపాయుక్తుడై యిట్లనియె — ఆరుణి — హే శ్వేతకేతూ! ఏ యతిశయాభిమానముతో నీవు స్థాణువువలె నమ్రతారహితుడ వైతివో, నే యతిశయతాభిమానముతో నీవు నిన్ను వేదవేత్తగ నెఱుగుచున్నావో, మఱియు నే యభిమానముచే నీవు నిన్ను సకల విద్వాంసులకన్న అధికముగ నెఱుగు చున్నావో, అటువంటి యే అతిశయత నీయందు విద్యమానమైయున్నదో, దానిని నాకు చెప్పుము. హే శ్వేతకేతూ. నీవు ఏ వస్తువుయొక్క శ్రవణముచే సమస్త అశ్రుత పదార్థములయొక్కయు శ్రవణమగుచున్నదో ఏ యొక్క వస్తువుయొక్క మననముచే మననముచేయని పదార్థముయొక్కయు మననమగుచున్నదో, యేయొక్క విజ్ఞానముచే సమస్తవిజ్ఞాతవస్తువులయొక్కయు విజ్ఞానమగుచున్నదో, ఆ వస్తువేదియని నీ గురువు

నెప్పుడైన ప్రశ్నించితివా? నీవు ఆ వస్తువు నెఱిగితివా? యెఱిగినపక్షమందున నాకు చెప్పుము. హే శిష్య! ఈ ప్రకారముగ నెప్పుడు ఆరుణి శ్వేతకేతువునుగూర్చి అడిగెనో, అపుడా శ్వేతకేతువు, ఆ ఏకవస్తువు నెఱుగనివాడై సకల గర్వరహితుడగు చున్నాడు. మఱియు పితృవచనమును శ్రవణముచేసి పరమాశ్చర్యముపొంది ఆ శ్వేతకేతువు శ్రద్ధాభక్తిపూర్వకముగ పితకు నమస్కారముచేసి ప్రార్థనావచనముచే నిట్లనియె. — శ్వేతకేతువు – నాయనా! ఏ వస్తువుయొక్క శ్రవణముచే మననముచే, విజ్ఞానముచే సర్వపదార్థముయొక్క శ్రవణమననవిజ్ఞానమగునో, ఆ ఏకవస్తువును నేనెఱుగను. దయచేసి నీవావస్తువుయొక్క ఉపదేశము నాకు చేయుము. ఈ ప్రకారముగ శ్వేతకేతువు ప్రార్థనచేసిన తర్వాత పితయగు ఆరుణి యిట్లనియె. హే శ్వేతకేతో! ఆ ఏకవస్తువు నెఱుగుటకై మొదట నీవు మూడు దృష్టాంతములచే యీ సర్వజగత్తును పృథ్వీజలతేజమని భూతత్రయరూపముగ నిశ్చయము చేయుము. అనంతరమాదృష్టాంతత్రయముచేతనే ఆ భూతత్రయములకు కారణమైన నే పరమాత్మ దేవుడుగలడో, ఆ పరమాత్మరూపముగ సర్వజగత్తును నిశ్చయము చేయుము. దృష్టాంతత్రయము — పృథ్వీరూపమైన మృత్పిండముయొక్క జ్ఞానానంతరము మృత్తికాకార్యములైన ఘటశరావాది సర్వపదార్థముల జ్ఞానమగుచున్నది (2) తేజోరూపమైన సువర్ణపిండముయొక్క జ్ఞానానంతరము కటకకుండలాది పదార్థముల జ్ఞానమగుచున్నది. (3) నఖనికృంతనాదులందు స్థితమైన లోహపిండముయొక్క జ్ఞానానంతరము లోహకార్యములైన ఖడ్గాది సకలపదార్థముల జ్ఞానమగుచున్నది. ఆలాగుననే పరమాత్మయొక్క జ్ఞానానంతరము పృథ్వీజల తేజోరూప సర్వజగత్తుయొక్క జ్ఞానమగుచున్నది (మృత్పిండము పృథ్వీరూపముగ సువర్ణపిండము తేజోరూపముగ నిట్లే రెండు దృష్టాంతములు సంభవించినట్లు నఖనికృంతనరూపమగు లోహపిండము జలరూపమని దృష్టాంతము సంభవింపదు. ఐనను నఖనికృంతన లోహపిండమందు జలసమానముగ నిర్మలతగలదు ఈ అభిప్రాయముచే శ్రుతిభగవతితో నఖనికృంతన లోహపిండము జలరూపముగ దృష్టాంతము చెప్పబడియె)

ఇపుడు ఒకటైన కారణవస్తువుయొక్క జ్ఞానముచే సర్వకార్యములయొక్క జ్ఞానమగునను నియమమందు గౌణతనెఱుగువారైన భేదవాదులమతములను ఖండనము చేయుటకుగాను, మొదట భేదవాదిమతము నిరూపణముగావింపబడుచున్నది. — హే శ్వేతకేతో! పరమాత్మయొక్క జ్ఞానముచే సకలజగద్జ్ఞానమగునను శ్రుత్యర్థమందు స్థాలీపులాకన్యాయమంగీకరించి గౌణతయెంచిన వారైన వాదుల అభిప్రాయము. — బియ్యమును పక్వముచేయు పాత్రమునకునామము స్థాలి, ఆ స్థాలియందు పక్వ

మయ్యేడు బియ్యమునకు నామము పులాకము. అది పొయ్యిమీద పక్వమైనతర్వాత వంటవారు పక్వపరీక్షకొఱకు లోపలి ఒక బియ్యపుగింజను బయటకు తీసిచూచును. ఆ దృష్టాంతమునకునామము స్థాలీపులాకన్యాయము. ఆ న్యాయమునుబట్టి భేదవాదులు ఒకదైన పరమాత్మయొక్క జ్ఞానముచే సర్వజగద్జ్ఞానమును కథనముచేయుచున్నారు.

ఆ భేదవాదుల నిట్లడుగవలయును. సిద్ధాంతి-హే వాదీ! ఒకదైన పరమాత్మయొక్క జ్ఞానముచే సకల జగద్జ్ఞానమును కథనముచేసినద్వైత శ్రుతియందు నీవు స్థాలీపులాక న్యాయమును కల్పనచేయుచున్నావు. అది స్వబుద్ధిచేతనా? అథవా శ్రుతిప్రమాణజన్య బుద్ధిచేతనా? అథవా పెద్దల పరంపరాసంప్రదాయబలముచేతనా? అట ప్రథమ పక్షము సంభవింపదు ఎందుకనగా - శ్రుతిప్రమాణరహితమగు కేవలమనుజునిబుద్ధికి బహుస్థానములయందు తన అర్థముతోటి వ్యభిచారము కనబడుచున్నది. యీ కారణ మువలననే వేదవేత్తలు మనుజుని బుద్ధికి ఏ యొక అర్థసిద్ధియందును ప్రమాణత నంగీకరింపరు. అథవా - లోకమందు కపిలబుద్ధకణాదగౌతమాది మహాపురుషులు కలరు. వారు శ్రుతిప్రమాణమునకు విరుద్ధముగ స్వబుద్ధిచే ఏ యే అర్థములసిద్ధి చేయుదురో, అది వారియొక్కబుద్ధి ఆయాఅర్థములందు వారియొక్కబుద్ధి అప్రమాణమే అగుచున్నది యీ కారణమువలన వారియుక్తులు పరస్పరము ఖండితములేయగు చున్నవి. ఎపుడు కపిలాది మహాపురుషులబుద్ధియందును, స్వతంత్రప్రమాణరూపత సిద్ధింపలేదో, అపుడిక యితర కణజీవులబుద్ధియందు ప్రమాణతలేదని వేరుగ చెప్పనేల? ఇక శ్రుతిప్రమాణయుక్తులచే మేము స్థాలీపులాకన్యాయమున అంగీకరించుచున్నా మను వాదియొక్క ద్వితీయపక్షమున్ను సంభవింపదు. ఎందుకనగా — శ్రుతిప్రమాణమందవిశ్వాసముచేయువారైన భేదవాదులగు మీకు శ్రుతిప్రమాణబుద్ధిచే మనోవాంఛితమునకు సిద్ధియగుట అత్యంతదుర్ఘటము. మఱియు పెద్దల సంప్రదాయ మునే మేము న్యాయకల్పనచేసెదమను తృతీయపక్షమంగీకరించినను సంభవింపదు ఏలాగుననగా — కపిలాది మహాపురుషుల శిష్యులచే తమ గురుసంప్రదాయ మనుసరించి వేదార్థనిర్ణయమందు ఏ యొక నిమిత్తము అంగీకరింపబడలేదు. దాని వలన తెలియబడుచున్నదేమనగా — ఆ సంప్రదాయాంగీకారముకన్నను పురుష బుద్ధ్యంగీకారమే ప్రధానముగా తోచుచున్నది. మనుజుని బుద్ధికన్న భిన్నమగు యే యొక ప్రమాణము అంగీకరింపబడలేదు. ఆ సాంప్రదాయక పురుషులు ఒకానొకపుడు శ్రుత్యర్థోపయోగియైన ఏదో ఒక ప్రమాణము నంగీకారముచేసియుండిన పక్షమందు వారు శ్రుత్యర్థమందు పరస్పరవివాదము చేయకయుందురు. కాని శ్రుత్యర్థమందు వారికి పరస్పరవివాదమగుట ప్రత్యక్షముగ గాంచబడుచున్నది. ఒకని యుక్తిని

యింకొకరు ఖండించుచున్నారు ఈ లాగున సాంప్రదాయాంగీకారముచేసినను వారి యొక్క ప్రలాపమందు మనుజుని ప్రాధాన్యత కనబడుచున్నది. ఆ మనుజునిబుద్ధియో ప్రథమపక్షమందే దోషముచూపబడి ఖండింపబడినది -వాది ఓ సిద్ధాంతీ! మేము సంప్రదాయమును అనగా పరంపరను అంగీకరించినపుడు తృతీయపక్షము ప్రథమపక్షముతో సమానమగును కాని మేము పెద్దల పరంపరని అంగీకరింపము మఱేమనిన సంప్రదాయమనగా మేము లక్షణావృత్తిగా న్యాయమని అంగీకరించెదము. ఆన్యాయమునకు శ్రుత్యర్థనిర్ణయమందు సావధానత సర్వవాదులకు సమ్మతముగానున్నది - కనుక తృతీయపక్షమునకు ప్రథమపక్షాంతర్భావము సంభవింపదు

సిద్ధాంతి — ఓ వాదీ! సంప్రదాయ పదముచే యే న్యాయమును మీరు అంగీకరించెదరో ఆ న్యాయమునకు స్వరూపమేదియో చెప్పుము. అభిప్రాయము — ఎచ్చటెచ్చట ధూమముండునో, అచ్చటచ్చట అగ్నియుండును. యీ ప్రకారముగ ధూమాగ్నులకు పలుమారు సహచారము చూడగా జనించినట్లు ధూమము అగ్నియొక్క వ్యాప్యమను నీ ప్రకారమగు బుద్ధికి పేరున్యాయమా? అథవా — అగ్న్యభావము గల పర్వతమందును ధూమముకలదను వాది శంకయొక్క నివృత్తికొఱకు, పుట్టినదైన ధూమము అగ్న్యభావముగల పదార్థమందును యుండినపుడు ఆ ధూమము అగ్నిచే జన్యము కాదను నీ తర్కమునకు పేరు న్యాయమా? అట వారంవారసహచారదర్శనజన్యబుద్ధి న్యాయమను ప్రథమపక్షము సంభవింపదు — ఏలన — యీ పక్షమందును మనుజుని బుద్ధికన్న భిన్నమగు ఏ యొక న్యాయస్వరూపమున్ను సిద్ధింపదు. మఱేమనిన — మనుజునిబుద్ధికే న్యాయస్వరూపత సిద్ధించును. కనుక న్యాయరూప సంప్రదాయమందును, ఆ ప్రథమపక్షమువలన భేదము సిద్ధింపదు అథవా వారంవారసహచారదర్శనముచే జన్యబుద్ధిని ప్రమాణరూపమని యెంచినపుడు ఎచ్చటెచ్చట పృథ్వీత్వధర్మము కలదో అచ్చటచ్చట లోహలేఖ్యత్వధర్మము కలదను నీ ప్రకారమగు వారంవారసహచారదర్శనముచే పుట్టినదైన పృథ్వీత్వధర్మము లోహలేఖ్యత్వధర్మమునకు వ్యాప్యము ఈ ప్రకారముగల బుద్ధియు ప్రమాణరూపము కావలసియుండె ఆ బుద్ధియందో ప్రమాణత లేదు ఎందుకనగా వజ్రమణియందు పృథ్వీత్వధర్మమో గలదు కాని దానియందు లోహలేఖ్యత్వధర్మము లేదు మఱియు తర్కమునకు పేరు న్యాయమను నీ ద్వితీయపక్షమంగీకరించిన వాది యిట్లడుగవలయును — ఆ న్యాయమందు తర్కరూపత యే ప్రకారముగాగలదు? వాదిట్లనిన — ఎట్లు న్యాయము ప్రమాణముపై అనుగ్రహము చేయుచున్నదో, అట్లే తర్కమున్ను ప్రమాణముపై అనుగ్రహము చేయుచున్నది. ఈ కారణమువలన న్యాయము తర్కరూపమైయున్నది. ఇట్లనిన వాదిని యివ్విధంబుగ ప్రశ్నింపవలయును. — ఆ తర్క

రూపన్యాయము ప్రమాణముపై యేరీతిగా ఉపకారము చేయుచున్నది? ఆ తర్కరూప న్యాయము ప్రమాణముపై ప్రమాణతావిరోధినివృత్తిరూపఉపకారము చేయుచున్నదా? అథవా ప్రమాణముపై ప్రమాణతా అభివ్యక్తిరూప ఉపకారము చేయుచున్నదా? అటవిరోధినివృత్తిరూప ఉపకారమను ప్రథమపక్షము సంభవింపదు యేలాగుననగా — ఆ ప్రమాణమందు విషయప్రకాశతారూపప్రమాణత యేదికలదో, ఆ ప్రమాణమును కొందఱు శాస్త్రకారులు స్వతఃగ్రాహ్యమనుచున్నారు. కొందఱు పరతఃగ్రాహ్యమనుచున్నారు. అట ఆ ప్రమాణధర్మముయొక్క ఆశ్రయము నెంత సామగ్రి గ్రహణము చేయుచున్నదో, ఆ యంతసామగ్రియు ఆ ప్రమాణతాధర్మమును గ్రహణము చేయుచున్నది. ఇట్టి దానికి నామము స్వతఃగ్రాహ్యము. మఱియు ఆ ప్రమాణతాధర్మముయొక్క ఆశ్రయమున నెంతసామాగ్రి గ్రహణము చేయుచున్నదో, అంత సామాగ్రి ఆ ప్రమాణతాధర్మమును గ్రహణము చేయదు. ఇట్టి దానికినామము పరతఃగ్రాహ్యము. అట వేదాంతమతమందు మీమాంసామతమందు స్వతఃగ్రాహ్యతగలదు. నైయాయికమతమందు పరతఃగ్రాహ్యతగలదు. స్వతఃగ్రాహ్యత పక్షమందో ఆ ప్రమాణతకు సిద్ధి ఆ ప్రమాణముతోనే చెప్పబడినది. ఇతర ప్రమాణతాపేక్షలేదు. ఎట్లనగా — దీపము ఘటాదుల ప్రకాశింపజేయుటయందు యింకేనొక పదార్థము నపేక్షచేయదు. ఒకచో ప్రమాణము తన ప్రమాణతయందు యితరమైనదానిని నపేక్షచేయుచో, అప్పుడా ప్రమాణమునకు అప్రమాణత సిద్ధించును. కనుక ఆ ప్రమాణము తర్కాదుల నపేక్షచేయదు. ఈలాగున తర్కమునకు ప్రమాణముపై ఉపకారము లేదు మఱియు ఆ తర్కము ఒకచో, ఆ ప్రమాణముయొక్క విషయముకన్న భిన్నమైన పదార్థమును విషయముచేసిన పక్షమందును, ఆ తర్కమునకు ప్రమాణము మీద ఉపకారము సంభవింపదు. ఎందుకనగా — ఆ ప్రమాణమందు ప్రమాణత తర్కముకన్న మొదటనే సిద్ధించియున్నది. అథవా ప్రమాణరూపమగు యేతర్కమనను ప్రమాణ సంబంధ విషయమందు ప్రవేశము భ్రమముచేతనుకూడా సంభవింపదు. ఏలాగుననగా — లోకమందు ప్రమాణాప్రమాణములకు భేదము, ఆశ్రయభేదము. విషయభేదమున్ను పరస్పరవిలక్షణములే యగుచున్నవి. వాటియందు కించిన్మాత్రము కూడా సాదృశ్యములేదు లోకమందో సమానస్వభావముగల వాటికే పరస్పరఉపకార్య ఉపకారకభావము కనబడుచున్నది. ఈ కారణమువలనను, ప్రమాణముపై అప్రమాణరూపతర్కమునకు ఉపకారము సంభవింపదు. మఱియు యెట్లు లోకమందు అనిష్టకారణములగు విషాదిపదార్థములు ప్రసిద్ధములైయున్నవో, ఆ విషాదుల నివృత్తిచేయగల ఉపకారకఔషధ మంత్రాదులును ప్రసిద్ధములైయున్నవో, అట్లే ప్రసంగమందు ఆ తర్కము అప్రమాణముపై విరోధి నివృత్తిరూపోపకారముచేయునను.

ద్వితీయపక్షము సంభవింపదు. ఏలాగుననగా .. ఎట్లు లోకమందు విరోధినివృత్తి రూపోపకారము ప్రసిద్ధమైయున్నదో అట్లే ప్రసంగమందు ఆ విరోధి నివృత్తిరూపోప కారము సంభవింపదు ఎందుకనగా ప్రమాణము మఱియు దానికి విరోధియైన అప్రమాణము యీ రెండును ఒకచో ఒకేచోటయుండినపక్షమందు ఆ తర్కముచే అప్రమాణ నివృత్తిరూపోపకారము ప్రమాణముపై కావచ్చును. కాని ఆ ప్రమాణాప్రమాణములు రెండు నొకచోటనుండవు ఒకేదేశమందు ఒకేకాలమందు నిలిచిన పదార్థములకే పరస్పరవిరోధమగును భిన్నభిన్నదేశకాలములందు నిలిచిన పదార్థములకు విరోధ మెక్కడను చూడబడదు ఎట్లు ముఖముచే మక్షికగ్రహణముచేయు మండూకమును సర్పము గ్రహింపుచున్నదో, అట్లు ప్రమాణాప్రమాణములను నీ రెంటిలో ఒకదానిని గ్రహించినదైన వేఱొకపదార్థము ప్రసిద్ధిగ లేదు అథవా యే స్థలమందు సమానబలము గల రెండుప్రమాణములకు ఒకేవిషయమందు ప్రవృత్తి యగుచున్నదో, ఆ స్థల మందును బుద్ధిమంతుడు ఆ రెండు ప్రమాణములకు పరస్పరవిరోధము నంగీకరించు చున్నాడు. కాని ఈ ప్రసంగమందట్లులేదు. ఎందుకనగా – ప్రమాణమునవో సత్య వస్తువందు ప్రవృత్తియైనది. అప్రమాణముననో అసత్యవస్తువందు ప్రవృత్తియైనది ఈలాగున ప్రమాణాప్రమాణములకు విషయభేదమైనది అట్లే ప్రమాణాప్రమాణ ములకు ధర్మభేదమున్నుయైనది (ప్రమాణధర్మము ప్రమాణమందు, అప్రమాణ ధర్మము అప్రమాణమందు) ఈ ప్రకారముగ భిన్నభిన్నార్థముల విషయము చేయు నట్లు, ఆ ప్రమాణాప్రమాణములందు పరస్పరవిరోధము సంభవింపదు

అథవా — ఏ వాది విరోధనివృత్తిరూపోపకారము నంగీకరించునో ఆ వాది నిట్లడుగవలయును నీతర్కము విరోధినివృత్తినేది చేయుచున్నదో, అది ప్రమాణ విరోధిని ప్రమాణమనియెఱిగి తద్విరోధనివృత్తిచేయుచున్నదా? అథవా ప్రమాణ విరోధిని అప్రమాణముగ నెఱిగి తద్విరోధనివృత్తిచేయుచున్నదా? అట ఆతర్కము, ప్రమాణవిరోధిని ప్రమాణరూపముగనెఱిగి విరోధనివృత్తిచేయుచున్నదను ప్రథమ పక్షము సంభవింపదు. ఏలాగుననగా — లోకమందు పిండిని మఱల ఎవడును పిండిచేయడు. చనిపోవువానిని మఱల నెవడును చంపడు. అట్లే ప్రమాణసంబంధ విరోధిని అప్రమాణమని యెఱుగుచుండగా ఆ తర్కము ఆ విరోధినివృత్తియందు ప్రవృత్తముకాదు. మఱియు ఆ తర్కము ఆ విరోధిని ప్రమాణమని యెఱిగి ఉప కారముచేయునను ద్వితీయపక్షమున్ను సంభవింపదు. ఏలాగుననగా — ఆ విరోధి యందు ప్రమాణతనెఱిగినదైన తర్కము ఆ ప్రమాణరూప విరోధిని నివృత్తిచేసిన పక్ష మందు ఆ తర్కము ప్రమాణమునున్ను నివృత్తముచేయును. శ్రుత్యనుకూలతర్కముచే ఆ విరోధినివృత్తి సంభవించినను, శ్రుతిప్రమాణములేక కేవల దురాగ్రహముచే

అర్థసిద్ధిచేయువారైన వాదులగు మీకు ఆశుష్కతర్కబలముచే వాంఛితార్థసిద్ధియగుట అత్యంతదుర్ఘటము. ఇంతవఱకు అప్రమాణమందు స్వతఃప్రమాణత నంగీకరించి ప్రమాణముపైని ఉపకారాభావము వర్ణనముచేయబడినది ఇపుడు పరతః ప్రామాణ్యత నంగీకరించి ఉపకారాభావము వర్ణింపబడుచున్నది

హే వాదీ! ప్రమాణమందు పరతఃప్రామాణ్యమంగీకరించినను, అప్రమాణముపై తర్కముయొక్క ఉపకారమేమి? ఆ ప్రమాణముపై విషయప్రకాశముచేయుట తర్కముయొక్క ఉపకారమనిన విషయప్రకాశమో, పూర్వము ఆ ప్రమాణముచేతనే సిద్ధించినది. అట్లు ఆ తర్కమునకు ప్రమాణముపై ప్రమాత్వసంబంధ అసంభావన. నివృత్తిరూపోపకారమున్ను సంభవింపదు ఏలాగుననగా - ప్రమాతృనిష్ఠాసంభావనయో పూర్వపాపకర్మముచే జన్యమైయున్నది. పుణ్యకర్మముచేతనే తన్నివృత్తిసంభవించును. తర్కముచే నివృత్తముకాదు. అథవా — అసంభావన నంగీకరించినను అది తర్కమునకు ప్రమాతపై ఉపకారముసిద్ధించునేగాని ప్రమాణముపై ఉపకారము సిద్ధింపదు. అథవా — విషయప్రకాశము చేయటయందు అసమర్థమైన ఆ యప్రమాణమందో సహస్ర తర్కములచేతను ప్రమాణరూపత సిద్ధింపదు. మఱియు విషయప్రకాశ సమర్థమైన ప్రమాణమందో ప్రమాణరూపత తర్కప్రవృత్తికన్నను మొదటనే సిద్ధించి యున్నది ఆ తర్కము ప్రమాణముపై ప్రమాణత్వధర్మముయొక్క అభివ్యక్తిరూపోపకారముచేయునను తృతీయపక్ష మంగీకరించినపుడు వాదివిట్లడుగవలయును. ఆతర్కము అప్రమాణరూపమైయున్నదా? ప్రమాణరూపమైయున్నదా? అటు అప్రమాణమను ప్రథమపక్షమున్ను సంభవింపదు. ఎందుకనగా — లోకమందే యే పదార్థము అప్రమాజ్ఞానమునకు విషయమగునో, ఆయాపదార్థము శుక్తిరజతాదులవలె మిధ్యయే అగును. అట్లే అప్రమాణరూప తర్కముచే అభివ్యక్తమైన ప్రమాణమున్ను మిథ్యయే అగును. ఇపుడా తర్కము ప్రమాణరూపమను ద్వితీయ పక్షమంగీకరించినను, సంభవింపదు. ఎందుకనగా — ఆ తర్కమందు యే వాదిచేతను, ప్రమాణరూపత అంగీకరింపబడలేదు. అటువంటి తర్కమందు ప్రమాణమంగీకరించిన మీ సిద్ధాంతమునకు హానియగును. అథవా — ప్రమాణరూపతను అభివ్యక్తిచేసినదైన తర్కమునకు ప్రమాణరూప మంగీకరించినపుడు ఆ తర్కసంబంధప్రమాణతను అభివ్యక్తి జేయునదైన యింకొక తర్కము కావలసినది. ఆ ద్వితీయతర్కప్రమాణతాభివ్యక్తి కొఱకు తృతీయతర్కము కావలసినది. ఈ ప్రకారముగ అనవస్థాదిదోషముల ప్రాప్తి యగును. అథవా — యే వాది తర్కమును ప్రమాణరూపముగ నంగీకరించునో ఆ వాది నిట్లడుగవలెను. ఆ తర్కము స్వతంత్రప్రమాణమా? అథవా — ప్రత్యక్షాది

యేదో ఒక ప్రమాణమున కంతర్గతమైన ప్రమాణమా? అట ప్రథమపక్షము సంభవింపదు. ఎందుకనగా — ఆ తర్కమందు స్వతంత్రప్రమాణత యే వాదిచేతను అంగీకరింపబడలేదు మఱియు నా తర్కము యితర ప్రమాణాంతర్గతమై ప్రమాణమను ద్వితీయ పక్షమంగీకరించినను సంభవింపదు ఎందుకనగా — ఆ తర్కము ప్రత్యక్ష ప్రమాణమందో సంభవింపదు. కనుక అనుమానాది ప్రమాణముల కంతర్గతమనిన అనుమానాదుల ప్రమాణరూపతయందు సకలవాదులకు యేకసమ్మతిలేదు మఱేమనిన ఆ ప్రమాణములందు నానా వాదుల నానా ప్రకారవివాదములు చూడబడినవి అట చార్వాకుడో ప్రత్యక్షప్రమాణమొకటే అంగీకరించును వైశేషికబౌద్ధ అర్హతులను నీ మువ్వురు వాదులు ప్రత్యక్ష అనుమానములను నీ రెండు ప్రమాణముల నంగీకరించెదరు. సాంఖ్యవాది అవిగాక శబ్దప్రమాణమునుకూడ అంగీకరించును. అట్లే ఉపమానప్రమాణముకూడను ప్రభాకరుడు, అర్థాపత్తినికూడను భట్టుడు, మఱియు వేదాంతి అనుపలబ్ధినికూడను పౌరాణికుడు సంభవ ఐతిహ్యములనుకూడను, తంత్రశాస్త్రార్థవాది చేష్టనుకూడను, అనగా మొత్తము నవప్రమాణములను అంగీకరించుదురు. ఈ ప్రకారము అనేకవాదులు భిన్నభిన్నప్రమాణములను అంగీకరించుచున్నారు ఆ సర్వప్రమాణములందు యే ప్రమాణమందాతర్కము అంతర్భావమై యున్నదో చెప్పుము?

వాది — హే సిద్ధాంతీ! ఏ ప్రమాణము తన విషయమునుండి వ్యభిచారి గాకుండునో అదే ప్రమాణమగును. తన విషయమునుండి వ్యభిచారియగునది ప్రమాణము కాదు ఈ ప్రకారముగ పూర్వము ఆ తర్కమేదో యొక ప్రమాణమున కంతర్భూతమైయున్నను, యిపుడు ప్రమాణలక్షణమును విచారము చేసినపిదప ఆ తర్కము అప్రమాణతను పొందెను. కనుక నీవు చూపినదైన వినిగమనవిరహ దోషము సంభవింపదు. సిద్ధాంతి — హే వాదీ! ఈ ప్రకారముగు ప్రమాణలక్షణమును విచారణచేయుటవలన ఒకచో ప్రత్యక్షాది షట్ప్రమాణములందు తమ తమ అర్థములచే అవ్యభిచారితారూప ప్రమాణతసిద్ధించినను, అన్యాయరూపతర్కము యే ప్రమాణమునకు అంతర్గతమగునను ఆ పూర్వోక్తవినిగమనవిరహదోషము నీ మతమందు బలాత్కారముగ ప్రాప్తమగును. ఎందుకనగా — భట్టపాదాది విద్వాంసులచే, ఆ ప్రత్యక్షాది షట్ప్రమాణములకు తమ తమ విషయమందు నియమముగ ప్రమాణత సిద్ధింపజేయబడి యున్నది.

వాది — హే సిద్ధాంతీ! నానా ప్రమాణరూపము ఏ యనుమాన ప్రమాణము గలదో, ఆ అనుమానప్రమాణమునకు అంతర్గతముగ న్యాయరూప తర్కము

కలదు. ఈ కారణమువలన నా తర్కము ప్రత్యక్షాదిప్రమాణముల కంతర్గతమై యున్నది. ఇట్లెంచుటచే పూర్వోక్త వినిగమనవిరహదోషము ప్రాప్తముకాదు అట అనుమానప్రమాణమునకు సర్వప్రమాణరూపత ఈ ప్రకారమైయున్నది. ప్రతిజ్ఞ హేతు, ఉదాహరణ, ఉపనయ, నిగమనములను నీ పంచవాక్యసముదాయరూపముగ అనుమానము సిద్ధించుచున్నది. చూడుము — ప్రసిద్ధానుమానమందు — (1) "పర్వతో వహ్నిమాన్'' అనునది ప్రతిజ్ఞ (2) 'ధూమత్వాత్' యిది హేతువు (3) 'యో యో ధూమవాన్' ఇది ఉపనయము. (4) 'యథా మహానసః' పాకశాల (యజ్ఞశాల) యెట్లో యిది ఉదాహరణం (5) తథా - అట్లు యీ పర్వతమున్ను పాకశాలవలె ధూమము కలది. తస్మాత్ (అందువలన) ఈ పర్వతమున్ను పాకశాలవలె వహ్ని గలదిగానున్నది ఇది నిగమనము — అట (1) ప్రతిజ్ఞావయవము ఆగమ ప్రమాణరూపము. (2) హేత్వావయవము అనుమానప్రమాణరూపము. (3) ఉదాహరణ అవయవము ప్రత్యక్షప్రమాణరూపము. (4) ఉపనయావయవము ఉపమాన ప్రమాణరూపము. (5) తస్మాదంశముచే పూర్వోక్త సర్వప్రమాణములకు సంగ్రహము చేయునట్లు యే నిగమనావయవముగలదో అది సర్వప్రమాణరూపమైయున్నది. ఈలాగున ఆ అనుమానప్రమాణము సర్వప్రమాణరూపమైయున్నది. ఆ యనుమాన ప్రమాణముననే అంతర్భూతమై ఆ న్యాయరూపతర్కమున్ను సర్వప్రమాణరూపమై యున్నది కాబట్టి పూర్వోక్త వినిగమనవిరహరూపదోషము మా మతమందు సంభవింపదు.

సిద్ధాంతి — ఓ వాదీ! ఈ నీ వచనము అసంఖ్యాకములగు దూషణములచే యుక్తమైయున్నది. ఆ దూషణముల చెప్పువాడనైన వక్తనగు నేను మఱియు వాటిని శ్రవణముచేయువాడవైన శ్రోతవగు నీవు మన కిద్దరికిని బ్రహ్మసమానమగు ఆయుష్యముండిన అపుడు వాటిని చెప్పుట పూర్తియగునేమో కాని నీకును నాకును అంత ఆయుష్యములేదుకదా? అయినను ఆ దూషణములను కొలది మాత్రము చెప్పెద వినుము హే వాదీ! ఏ ప్రత్యక్షాదిప్రమాణములను అనుమానప్రమాణాంతర్గతములని నీవనుచున్నావో, ఆ ప్రత్యక్షాదిసర్వప్రమాణములు ఒకే కార్యమును చేయుచున్నవా? అథవా భిన్నభిన్నములైన అనేకకార్యములను చేయుచున్నవా? అట ద్వితీయపక్షము సంభవింపదు. ఏలాగుననగా — ఏ అనుమానప్రమాణమును నీవు ప్రత్యక్షాదిప్రమాణముల సముదాయరూపమని చెప్పుచున్నావో, ఆ అనుమాన ప్రమాణమందు స్థితములైన ప్రత్యక్షాదిప్రమాణములు తమ అనేకకార్యముల కర్తృత్వరూపస్వభావమును పరిత్యాగము చేయవు. మఱేమనిన — ఆ ప్రమాణములు అనుమానప్రమాణమందు స్థితములై యుండి తమతమ కార్యములను అవశ్యముగ చేయును. కనుక సర్వప్రమాణములను,

ఒకే ప్రమాణాంతర్గతమనుట విరుద్ధము మఱియు ప్రథమపక్షమున్ను సంభవింపదు. ఎందుకనగా — ఆ సర్వప్రమాణములు ఒకే కార్యముచేయునను, నియమము నంగీకరించినపుడు అనుమానభిన్నములగు ఆ ప్రత్యక్షాదిప్రమాణములందు స్వతంత్రత ప్రమాణత నాకుండవలసియుండెను! వాది ఒకచో దీనియందును ఇష్టాపత్తి యనిన నది సంభవింపదు. ఎందుకనగా — ఆ ప్రత్యక్షాదిసర్వప్రమాణములందు అనుమాన ప్రమాణాపేక్షచే ప్రమాణత ఎప్పుడు సిద్ధించుననగా — ఎపుడా ప్రత్యక్షాదిప్రమాణము స్వతంత్రప్రమాణతగాంచుటకురాదో అపుడుగాని అట్టి ప్రసంగములేదు. మఱేమనిన ఆ ప్రత్యక్షాది ప్రమాణములందు స్వతంత్రప్రమాణత సత్వబుద్ధిమంతులకు అనుభవ సిద్ధమైయున్నది. ఇవ్విధమున ఆ ప్రత్యక్షాదిప్రమాణములకు, అనుమానప్రమాణము నందు అంతర్భావము సంభవింపదు.

అథవా — పూర్వోక్త ప్రతిజ్ఞాదిపంచావయవములందు, హేతురూప ద్వితీయావయవము వాదిచే అనుమానరూపముగ అంగీకరింపబడినది. ఆ హేతురూపాను మానమునందు ప్రత్యక్షాది సర్వప్రమాణరూపత అంగీకరించుట అత్యంత విరుద్ధము. ఎందుకనగా — ఆ హేతురూపావయవమునందు ఇతరప్రమాణముల అంతర్భావము ఘటిల్లదు మఱియు వాది ఒకచో ఆ హేతువైన అవయవమందే ఆ ప్రత్యక్షాది ప్రమాణములను అధ్యాహారముజేసి ఆ హేతురూపానుమానమునకు సర్వప్రమాణ రూపత నంగీకరించినపుడు పంచమీవిభక్తిగల లింగబోధకవచనమునకు నామము హేతువు అను నీ లక్షణముచే బోధింపబడినదైన హేతువందు సాధనరూపత యేది కలదో, ఆ సాధనరూపతకు అభావమగును

అథవా — ప్రతిజ్ఞాదిపంచావయవములందు వాక్యరూపత తుల్యముగనే యున్నది ఇట్లుండగా ఒక ప్రతిజ్ఞావాక్యమందు మాత్రము ఆగమ ప్రమాణరూపత నంగీకరించి యితరవాక్యములందు ఆగమప్రమాణరూపత నంగీకరింపకుండుట యుక్తిరహితమైయున్నది. అథవా — ప్రతిజ్ఞావయవమునకు వాదిచే అంగీకరింపబడిన ఆగమప్రమాణరూపత సంభవింపదు ఎందుకనగా — ప్రతిజ్ఞావచనమో సందిగ్ధార్థమును కథనముచేయును. ఆగమప్రమాణము సందిగ్ధార్థమును కథనముచేయదు నిశ్చితార్థ మునే కథనముచేయును. ఒకచో ఆగమప్రమాణము సందిగ్ధార్థప్రతిపాదకమైనచో నది తన ఆగమరూపతచే రహితమగును. ఈ వార్త మీ మతమందును సిద్ధము. ఇటువంటి పరస్పర విరుద్ధార్థబోధక ప్రతిజ్ఞకు ఆగమ ప్రమాణముతోటి అభేదమెఱుగుట అత్యంత విరుద్ధము. మఱియు ఉపనయవాక్యస్థిత తథాశబ్ద మేదికలదో నిగమనవాక్యమందలి తస్మాత్ శబ్దమేదికలదో యీ రెంతుశబ్దములు పక్షమందు వ్యాప్తిగల హేతువుయొక్క

సంబంధమాత్రమునే బోధనచేయుచున్నవి. కాని సాపేక్ష్యగ్రాహ్యమును కథనముచేయవు. కనుక ఉపనిషద్వాక్యమునకు అనన్యప్రమాణానపేక్షత సంభవించదు. మఱియు విమత వాక్యమునకు పూర్వోక్త సర్వ ప్రమాణాపేక్షత సంభవించదు. తర్కమునకు జీవనమునకు ఓకరీతిని ఉన్నవ్యాప్తిగలదో. ఆ వ్యాప్తి కేవలం కల్పనారూపమైయై యున్నది. కనుక ఆకల్పనారూపవ్యాప్తిని కథనముచేయునట్టి ఉదాహరణ వాక్యమునందు ప్రత్యక్షప్రమాణాపేక్షత సంభవించదు. ఈ మొదలగు అనేక ప్రకారములగు దోషముల వాదికథనమందు ప్రాప్తమగును. కనుక అనన్యప్రమాణరూప హేతువు అపేక్షచేసి. కేవలకల్పనామాత్రతర్కమందే, ఏ వాదికత్యంత ఆదరణముకలదో, ఆ వాదియొక్క విచారరూప దృష్టికి మందత్వమే గాన్పించుచున్నది.

వాది — ఓ సిద్ధాంతీ! ఆ న్యాయరూప తర్కముచేత ఒకటో ఏ అర్థమునకును సిద్ధిగాకపోయిన పక్షమందు "మంతవ్య" యీ మొదలగు శ్రుతులచే, విచార రూప తర్క విధానమునెందుకు చేయబడియె? సిద్ధాంతి — ఓ వాదీ! న్యాయరూప తర్కము విచారరూప మననమందుపయోగపడునని పెద్దలగు ఆచార్యులచే వచింపబడినది, ఆ తర్కము ప్రతిప్రమాణసహాయములేక, స్వతంత్రముగనే యర్థమందును సమర్థముకాదు. కనుక ఆచార్యులచే "మంతవ్య" అను వచనమునందు శుష్కతర్కము గ్రహింపబడలేదు. శ్రుతిసహిత తర్కము గ్రహింపబడినది. ఆ శ్రుతి స్థాలీపులాకన్యాయమగ ఒక ఆత్మయొక్క జ్ఞానముచే సకల జగజ్జ్ఞానమును కథనము చేయుచున్నదను విశిష్టార్థకల్పనమందు, ఆ కల్పన చేయువారైన మనుష్యబుద్ధియే హేతువైయున్నదా? అథవా శ్రుతి ప్రమాణజన్యబుద్ధి హేతువైయున్నదా? అథవా గురు సంప్రదాయపరంపరాసంబంధానుకూలత హేతువైయున్నదా? ఈ మూడు పక్షములలో ప్రథమపక్షమందును, తృతీయపక్షమందును అనేక దూషణము చెప్పుచూ వచ్చుచున్నాము. పరిశేషము శ్రుతిప్రమాణబుద్ధి హేతువైయున్నదనిన అది మాకు యిష్టమేకాని, వాదికది యిష్టార్థసిద్ధి కలుగజేయదు. వాది — ఓ సిద్ధాంతీ! ఆ శ్రుతి ప్రమాణ జన్యబుద్ధి తర్కములేకపుట్టునా? సిద్ధాంతి — ఓ వాదీ! వ్యాకరణాది లౌకికోపాయములచేతను కూడ శ్రుతిజన్యబుద్ధి పుట్టును. దానికి శుష్కతర్కాపేక్షలేదు. అట్టి ప్రసంగమునందును ఆస్థాలీపులాకన్యాయమును అపేక్షచేసియే ఆ శ్రుతిభగవతి మృత్పిండలోహమణి నఖనికృంతనములను యీ మూడు వచనములచే, ఉపాదానకారణస్వరూపమును కథనముచేసి, కార్యకారణముల అభేదమును వచించుచున్నది. సంభావన మాత్రము ఆ స్థాలీపులాకన్యాయము నంగీకరించదు. — వాది ఓ సిద్ధాంతీ! శ్రుతి స్థాలీపులాకన్యాయమును వదలి ఏ న్యాయము నంగీకరించుచున్నది? సిద్ధాంతి — హే వాదీ! వివర్తవాద స్థితరజ్జుసర్పాదిన్యాయము నంగీకరించి, అధిష్ఠానరూప రజ్జువు

యొక్క జ్ఞానముచే కల్పితములైన, సర్పదండమాలాదుల జ్ఞానమగుచున్నదని చెప్పఁ చున్నది. గురువు — హే శిష్య! పూర్వోక్త సర్వాభిప్రాయములను మనస్సులో నుంచుకొని ఆ అరుణి పితయగు శ్వేతకేతువునకు, మృత్తికాసువర్ణలోహముల దృష్టాంతములచే జగత్కారణమగు బ్రహ్మము నుపదేశము చేయుచున్నారు.

ఆరణి — హే శ్వేతకేతూ! ఈ ఘటశరావాది కార్యములు కేవలవాణి మాత్రముచేతనే ప్రతీతమగుచున్నవి. వాణిచే గాక వాస్తవ రూపమున ప్రతీతముకావు. ఈలాగున ఘటశరావాదులు నామ మాత్రములైయున్నవి. కనుక మృత్తిక ఘటశరావాదుల నుత్పన్న మొనర్చుచున్నదని అనుటకును వల్లపడదు ఎందుకనగా — మృత్తిక మృత్తికను ఉత్పన్నముచేయదు కార్య కారణ భేదమంగీకరించినపుడే యుత్పత్తి తటస్థించును ఎట్లనగా — నైయ్యాయికులు కపాల రూప కారణముకన్న భిన్నమగు ఘటమునకు కారణము కపాలసంయోగమని అంగీకరించుచున్నారు దీనివలన సిద్ధించినదేమనగా — ఘటశరావాది కార్యములందు, మృత్తికాకారణమునుండి యే భేదము ప్రతీతమగుచున్నదో ఆ భేదము వాస్తవముగలేదు మఱేమనిన — ఘటశరావాదినామ విశిష్టమైన ఆ ఘటాది కార్యములందు మృత్తికకు భేదము ప్రతీతమగు చున్నది విశిష్టపదార్థమందు ప్రతీతమైన ధర్మము ఒకానొకపుడు విశేష్యపదార్థమందు సంభవించని పక్షమందు ఆ ధర్మము కేవల విశేషమందే సిద్ధించుచున్నది ఇది సకల శాస్త్రకారులయొక్క నియమమైయున్నది. ఇట ఘటశరావాదినామవిశిష్ట ఘటశరావాది కార్యములందు ప్రతీతమైన యే మృత్తికాదికారణములకభేదముగలదో ఆ భేదము ఘటశరావాది విశేష్యపదార్థములందు సంభవింపదు. కనుక పరిశేషమైన ఘటశరావాది నామ రూప విశేషణములందే మృత్తికాసంబంధభేదము సిద్ధించుచున్నది (సకల కార్య కారణములందును యిదేరీతి సంభవించును) — హే శ్వేతకేతూ! ఎట్లు ఏ పటభావమును పొందిన తంతువులను పటమునుండి వేరుజేసిన పటరూప కార్యమునే బుద్ధిమంతుడైన చూచునా? చూడదు అట్లే ఘటాదికార్యములను, మృత్తికాది కారణములకన్న భిన్నముగజేసి ఘటాది కార్యములను ఏ బుద్ధిమంతుడుచూచును? ఎవడును చూడడు! హే శ్వేతకేతో! ఎట్లు గోసంబంధ దుగ్ధము దధిరూపపరిణామము పొందుచున్నదో. అట్లే మృత్తికాసువర్ణాది కారణములు, ఘటకుండలాది పరిణామమును పొందలేవు పొందుననిన ఎట్లు దధిరూపమగుటచే దుగ్ధనాశమగుచున్నదో. అట్లు ఘటకుండలాదులగుటచే మృత్తికాదుల నాశము కావలసియుండెను అట్లగుటలేదు శ్వేతకేతువు — తండ్రీ! మృత్తికాది కారణములు క్షీరాదులవలె నాశనముకాలేదని యెట్లెఱుగవలయును.

అరుణి — ఓ శ్వేతకేతో! ఘటాదికార్యభావము పొందినవైన మృత్తికాది కారణములు పూర్వమువలె అట్లే కనబడుచున్నవి. దధిభావమును పొందినదైన దుగ్ధము నాశమును పొందినట్లు తెలియబడుచున్నది. మృత్తికాదికారణములు అట్లు నాశము పొందనందుచేతనే "వాచారంభణంవికారో నామధేయం మృత్తికేత్యేవ సత్యమ్" అను శ్రుతివాక్యము మృత్తికాదికారణములు సత్యమనబడియె. శ్వేతకేతువు — తండ్రీ! యేదేది భావకార్యము పుట్టునో, అదియది ఉపాదాన నిమిత్తములను ఈ రెండు కారణములచే జన్యమగుచున్నవి. దధియును భావకార్యమై యున్నది: కనుక ఆ దధి రూప కార్యమునకును, దుగ్ధమునకన్న భిన్నమగునేదైన యుపాదానకారణము కావలసినది, అరుణి — ఓ శ్వేతకేతో! పృథ్వీజలతేజములను నీ భూతత్రయముయొక్క అవయవములు తృణధాన్యములందు కలవు. గవాదులా తృణాదుల భక్షణము చేయుటచే, ఆ భూతత్రయములు దుగ్ధాదులకును, దధితక్రఘృతాదులకును యుపాదానమగుచున్నది. హే శ్వేతకేతో! విశేషాకారముగల మృత్పిండము ఘటాది కార్యోత్పత్తి కాలమందు ఆ ఘటరూపకార్యములలో అనుగతమై ప్రతీతముకాదు. ఈ కారణము వలన యా మృత్పిండము ఘటాది కార్యోత్పత్తియందుపాదానకారణముకాదు. మఱే మనిన నిమిత్తకారణమైయున్నది. ఎట్లు పిండాది విశేషాకారరహితమైన మృత్తిక ఘట శరావాదులందనుగతమై ప్రతీతమగుటవలన, ఘటాదుల కుపాదానకారణమైయున్నదో అట్లే తృణాదులందు తేజాదిభూతత్రయము అనుగతమై ప్రతీతమగుటవలన అది దధ్యాదుల కుపాదానకారణమై యున్నది. దీనివలన సిద్ధించినదేమనగా ఏ వస్తువు తాను పరిణామముపొందినదో, ఆ వస్తువు దుగ్ధమువలె నుపాదాన కారణముకాదు. తాను పరిణామము పొందని వస్తువే యుపాదానకారణమగుచున్నది. కనుక శ్రుతియందు లోహమణిపదముచే కథనము చేయబడిన సువర్ణము, మఱియు నఖనికృంతనపదముచే కథనము చేయబడిన లోహము వాటిని పరిణామరూపముగ దృష్టాంతము చెప్పలేదు. మఱేమనిన వివర్తోపాదానరూపముచే దృష్టాంతము చెప్పబడియె. ఒకచో సువర్ణాదులను పరిణామియనినపుడు దధియందుదుగ్ధము ప్రతీతముకానట్లు కుండలమందు సువర్ణము ప్రతీతము కాకుండవలసియుండెను. కాని ప్రతీతమగుచునే యున్నది. కనుక సువర్ణాదులు పరిణామ్యుపాదానములు కావు. వివర్తోపాదానములై యున్నవి. ఈరీతిగా కారణమందుసత్యరూపతనుజెప్పి ఇపుడు కారణమందు వివాదమును చూపెదను:— సాంఖ్యమతాచార్యులు కారణకార్యములకు భేదాభేదము, నైయ్యాయికులు కేవల భేదము నంగీకరించుచున్నారు:— అది అసంగతము. ఏలాగుననగా — ఏ యే పదార్థములకు భేదమగునో, ఆ యా పదార్థములు గోయశ్వములవలె సర్వభిన్నభిన్న దేశములందు వర్తించుచున్నవి. తంతుపటములందో, మృత్తికాఘటములందో భిన్నభిన్న దేశవృత్తి కనబడదు. కనుక వీటికి పరస్పరభేదము కనబడదు.

అభిప్రాయము:— ఎట్లు అగ్నిరూప వ్యాపకమున కభావమగుటవలన ధూమరూపవ్యాపకమున కభావమగుచున్నదో అట్లే భిన్నదేశవృత్తిరూపవ్యాపకమున కభావమగుటవలన భేదరూపవ్యాపకమునకును అభావమగుచున్నది. ఇట్లు చెప్పుటచే అనుమానసిద్ధమైనదేమనగా — మృత్తికాఘటములు రెండును పరస్పరభిన్నములుం భిన్నదేశవృత్తివ్యాపకత్వాభావమగుటవలన ఏవి పరస్పరాభిన్నముగాకుండునో, అవి భిన్నదేశవృత్త్యభావముకలవిగాకుండును. (గోయశ్వములవలె) ఈ అనుమానములచే ఆకారణములకభేదము సిద్ధించుచున్నది — నైయ్యాయికుడు – ఓ సిద్ధాంతీ! పటాది కార్యము తంత్వాదిదేశమందుండుమ మఱియు తంత్వాదికారణము భూతలాదిదేశమందుండును కనుక కారణకార్యములకు భిన్నభిన్నదేశములే కలవు ఈ మీ హేతువు అవృత్తిగలదగుటవలన స్వరూపాసిద్ధమైనట్టి హేత్వాభావమైయున్నది ఆ స్వరూపాసిద్ధ హేతువుచే ఆ కారణకార్యములకు అభేదసిద్ధి కానేరదు సిద్ధాంతి – హే నైయాయికా! ఆ కారణకార్యములకు నీవు యే భిన్నబిన్నదేశములు చెప్పుచున్నావో, అవి కేవలము నీకల్పనామాత్రములేగాని వాస్తవముగ వాటికి భిన్నభిన్న అధికరణములులేవు ఏలాగుననగా – భూతలాదులందు ఘటఘటాది పదార్థముల వృత్తిని అనుభవము చేయువారైన లోకులు మృత్తికా తంత్వాదికారణములకు ఘటపటాది కార్యములకు భిన్నభిన్నాధికరణముల ననుభవముచేయరు కనుక ఆ కారణకార్యములకు భేదము కలదనుట సంభవింపదు మఱియు భేదాభేదములు పరస్పరవిరుద్ధములైయున్నవి. ఎచ్చట భేదముండునో అచ్చట అభేదముండదు అభేదముండుచోట భేదముండదు ఈ కారణమువలన భేదాభేదపక్షమున్ను సంభవింపదు కాబట్టి అభేదపక్షమే సకలవాదులు అంగీకరింపవలసినది సకలకార్యములందు కారణాద్వితీయత సకలవిద్వాంసుల కనుభవసిద్ధముగ నున్నది. అథవా లోకులకు ఘటాదికార్యములందు యే భేదభ్రమ యగుచున్నదో ఆ భేదభ్రమయు అపరోక్షరూపమై యున్నది కనుక ఆ అపరోక్ష భ్రమముయొక్క నివృత్తి కారణసంబంధపరోక్షజ్ఞానముచే కాదు కారణసంబంధాపరోక్ష జ్ఞానముచేతనే యగును ఎట్లనగా.— పూర్వాదిదిశలందు అపరోక్షమైన పశ్చిమాది దిగ్భ్రమము పూర్వాదిదిశలయొక్క అపరోక్షజ్ఞానముచేతనే నివృత్తమగును

హే శ్వేతకేతూ.—ఎట్లు ఘటశరావాది పదార్థములు పరస్పరభేదము గలవగుటవలన కార్యరూపములగునో, మఱియు కార్యరూపములగుటవలన పృధ్వీజలతేజోరూప కారణముకన్న భిన్నసత్తగలవికావో అట్లే పృధ్వీజలతేజములును పరస్పరభేదము గలవిగాన అవియును కార్యరూపములగుటవలన పరమాత్మరూపమగు తమ కారణము కన్న భిన్నసత్త గలవికావు అభిప్రాయము:— అధికారులు మొదట పృధివ్యాదుల మూడింటియందు భేదాభావ నిశ్చయముచేసి, పిదప నదేదృష్టాంతముచే ఆ పృథి

వ్యాధిక్రమమునకు పరమాత్మయందు భేదాభావనిశ్చయము చేయవలయును. శ్వేతకేతువు:— తండ్రీ! ఘటాదిపదార్థములు భేదము గలవగుటవలన కార్యరూపములవి. భేదరూపహేతువుచే నీవు యే కార్యరూపతాసిద్ధి చేయుచున్నావో, అయ్యది సంభవింపదు. ఎట్లనగా:— ఏ హేతువు తన సాధ్యపదార్థమును విడచి అన్యత్రయుండదో, ఆ హేతువుచేతనే సాధ్యపదార్థమునకు సిద్ధియగును. ఏ హేతువు తన సాధ్యమునువదలి అన్యత్రయుండునో, అటువంటి వ్యభిచారిహేతువు వలన సాధ్యసిద్ధి కానేరదు. ఆ భేదరూపహేతువున్ను కార్యస్వభావము గల ఆత్మయందుగుటవలన వ్యభిచారియై యున్నది. ఆ వ్యభిచారిత్వహేతువువలన కార్యసిద్ధి కానేరదుకదా? అరుణి — హే పుత్రా! జడతాధర్మవిశిష్టభేదమే కార్యరూపతాస్థితి జేయుచున్నది. ఆ జడతాధర్మవిశిష్టభేదము ఆత్మయందుండగాకుండుటవలన ఆత్మయందు కార్యరూపత సిద్ధింపదు. శ్వేతకేతువు — తండ్రీ! ఆ జడతాధర్మవిశిష్టభేదము అవిద్యయందు కలదు. అయినను సిద్ధాంతమందు ఆ అవిద్యకు కార్యరూపత అంగీకరింపబడలేదు. ఆ అవిద్యకు అనాది అని అంగీకరింపబడినది. కనుక ఆ జడతాధర్మ విశిష్టభేదరూపహేతువు వ్యభిచారియై యున్నది.

అరుణి — పుత్రా! ఆ అవిద్యయందు ఉత్పత్తిరూపకార్యరూపత లేకుండినను అధిష్ఠానమందు కల్పితత్వరూపకార్యత అవిద్యయందు కలదు. కనుక ఆ భేదరూప హేతువు వ్యభిచారికాదు. శ్వేతకేతువు — హే తండ్రీ! ఆత్మయందు జడతావిశిష్ట భేదరూపహేతువున కభావమయ్యుగా, ఏ వాది కార్యరూపత నంగీకరించునో, ఆ వాది నిట్లడుగవలయును. ఆత్మస్థితమగు నే కార్యతగలదో, ఆ కార్యత కారణరహితమై యున్నదా? కారణసహితమై యున్నదా? అట్టి కారణరహితమను ప్రథమపక్షము సంభవింపదు. ఎందుకనగా — ఎట్లు ఆత్మయందు స్థితమైనకార్యత కారణరహితమై యున్నదో, అట్లు ఘటపటాది జగత్తున్ను కారణరహితము గావలసియుండెను. మఱియు వాది యీ అర్థమందే యిష్టాపత్తినంగీకరించిన నది సంభవింపదు. ఏలనగా — ఘటపటాది కార్యములందు. మృత్తికాతంత్వాదుల కారణత సర్వలోకమునందు ప్రసిద్ధమైయున్నది. మఱియు ఈ ఆత్మపురాణాష్టమాధ్యాయమునందు కారణములేగాక కార్యోత్పత్తినగుటయందు అనేకదూషణములు చెప్పబడియె. ఈలాగున కారణము లేక కార్యోత్పత్తి సంభవింపదు. కారణసహితమను ద్వితీయపక్షమంగీకరించిన వాది నిట్లడుగవలయును. — ఆత్మకు కారణము అసత్యరూపముచే కలదా? సత్యరూపముచే కలదా? అట్టి ప్రథమపక్షము సంభవింపదు. ఏలనగా — ప్రసిద్ధమైన ఘటపటాదికార్యములు మృత్తికాతంత్వాది సత్యకారణములచే పుట్టుచున్నవి. అసత్య

కారణములచే నుత్పత్తి యెక్కడను కనబడదు మఱియు శ్రుతిస్మృతులచే ప్రసిద్ధమైన సత్యాత్మకు అసత్యకారణముచే నుత్పత్తి వచించుట హాస్యజనకమాత్రమై యున్నది. ఒకచో అసత్యకారణముచే ఆత్మోత్పత్తి యైన పక్షమందు ఆత్మయు అసత్యకారణము వలె అసత్యమే యగును ఆత్మకు అసత్యత చెప్పుట అత్యంత విరుద్ధము అథవా — ఆత్మయొక్క కారణమసత్యమను నీ వాక్యమందు 'అసత్య మను శబ్దమేదికలదో, దానికర్థము సత్యవస్తువునకభావమని ప్రతీతమగుచున్నది లోకమందో, ఏయే అభావములు కలదో ఆ యా అభావము తన సిద్ధికొఱకు ప్రతియోగియొక్క అపేక్ష చేయుచున్నది ప్రతియోగిజ్ఞానముగాక అభావజ్ఞానముకాదు సత్యముయొక్క అభావరూపమైన అసత్యమున్ను తన సిద్ధియందు సత్యప్రతియోగిని అవశ్యముగ అపేక్షించును అపుడు ఆ సత్యవస్తువునందే ఆత్మకుకారణత సంభవించును సత్య వస్తువుయొక్క అభావమందు కారణత వచించుట నిష్ఫలము అథవా — లోకమందు ఏ అభావమున్ను ఏ కార్యమునకును కారణముకాజాలదు ఈ విషయము అష్టమా ధ్యాయమందు విపులముగ వ్రాయబడినది ఈలాగున ఆత్మకు అసత్యకారణత సంభవింపదు —

ఇపుడు ఆత్మకారణము సత్యమను ద్వితీయపక్షమంగీకరించిన వాదినిట్లడుగ వలెను. ఆ సత్యమైనకారణము పరిచ్ఛిన్నమా? అపరిచ్ఛిన్నమా? అట పరిచ్ఛిన్న మను ప్రథమపక్షము సంభవింపదు ఎందుకనగా లోకమందేయే పదార్థము పరిచ్ఛిన్నమగునో ఆయా పదార్థము జడమగును ఏయే పదార్థము జడమగునో ఆయా పదార్థము కార్యరూపమగును ఏదేది కార్యరూపమగునో అదియది తన ఉత్పత్తియందు కారణాపేక్ష చేయును ఎట్లు పరిచ్ఛిన్నజడకార్యములగుటవలన ఘటాదిపదార్థములు కారణాపేక్షములో అట్లే ఆత్మయొక్క సత్యకారణమున్ను పరిచ్ఛిన్నరూపమగుటవలన అది జడమైన కార్యరూపమై కారణాపేక్షమగును ఒక కారణము యింకొక కారణము నపేక్షజేసిన పక్షమందు అనవస్థాదిదోషప్రాప్తి పూర్వమే చెప్పబడియె తన్నివారణార్థము ఆత్మయొక్క సత్యకారణము చైతన్యరూపమై అపరిచ్ఛిన్నమని వాది రెండవపక్షమంగీకరించినను; ఆ పక్షమందును విచారము చేయవలసినది ఆత్మయొక్క కారణము ఆత్మకన్న భిన్నమా? అభిన్నమా? అట సత్తారూపకారణము ఆత్మకన్న భిన్నమను ప్రథమపక్షము సంభవింపదు. ఎందుకనగా- లోకమందు ఏయే పదార్థము ఆత్మకన్న భిన్నమగునో ఆ యా పదార్థము అనాత్మ పదార్థమగును. (గృహాది పదార్థములవలె) ఏయే పదార్థములు అనాత్మయగునో గృహశయ్యాది ఆయా పదార్థములు ఆత్మకు సుఖదుఃఖసాధనములై జడములగును.

మఱియు ఆ గృహాదిపదార్థములు జడరూపములగుటవలన కార్యరూపములై మృత్తికాది కారణములచే జన్యములై యున్నవి. అట్లే ఆత్మయొక్క సత్తారూపకారణమున్ను ఆత్మ భిన్నమగుటవలన పరంపరచే కార్యరూపమై కారణముచే జన్యమగును. ఈ మొదలగు దోషముల నివృత్తికొఱకు, ఆ సత్తారూపకారణమును వాది ఆత్మరూపముగానే అంగీకరింపవలయును. మఱియు చైతన్యరూపముగాను, ఆనందరూపముగాను, భేదరహితముగాను అపరిచ్ఛిన్నముగాను కారణసహితముగాను అంగీకరింపవలసినది. ఇటువంటి ఆత్మరూపసత్తను యెపుడు వాది ఆత్మకు కారణమని యెంచునో అపుడా ఆత్మ సత్తారూపకారణమునకన్న భిన్నమగు ఏదైన కార్యమందో, ఆత్మరూపత సిద్ధింపదు. కనుక ఆ వాదిచే ఏ ఆత్మకు సత్తారూప కారణమంగీకరింపబడినదో, ఆ సత్తారూపకారణమునే వేదాంతులమగు మేము ఆత్మరూపముగా నెఱుగుచున్నాము. దీనివలన ఏ అర్థము సిద్ధించినదనగా — యీ ఆత్మదేవుడు యే కారణముచేతను పుట్టలేదు. అందువలననే అతనిని శ్రుతి "అజ" నామముచేతను, నిత్య సత్య, నామములచేతను కథనము చేయుచున్నది.

హే శ్వేతకేతో! ఆ శ్రుతి సచ్ఛబ్దముచే నాత్మదేవుని సత్యరూపతయే కథనము చేయుచున్నదనుట కాదు. చేతనరూపతను ఆనందరూపతను కూడ కథనము చేయుచున్నది ఏలాగుననగా — సత్, చిత్ ఆనంద ఆత్మయను నీ నాల్గు పదార్థములకు పరస్పరభేదమంగీకరించినపక్షమందు, భేదరూపవస్తువు పరిచ్ఛేదమగుటచే, ఈ హేతువువలన ఆ సత్యాది నాల్గుపదములందు, ఘటాదులవలె జడత సిద్ధించును. జడతారూపహేతువువలన, కార్యరూపత సిద్ధించును. కార్యరూపహేతువువలన, కారణాపేక్ష సిద్ధించును. ఆ కారణమున్ను యింకొక కారణము నపేక్షించుటచే, అనవస్థాది అనేక దోషములు ప్రాప్తములగును. ఈలాగున సత్యాది నాల్గుపదములందు కించిన్మాత్రమును భేదము సంభవింపదు. శ్వేతకేతువు — హే తండ్రీ! సదాది నాల్గు పదముల కొకే అర్థమైన పక్షమందు పునరుక్తిదోష ప్రాప్తియగును కదా?

ఆరుణి — ఓ పుత్రా! ఆత్మదేవునియందు భ్రాంతిబలమున ప్రాప్తమైన అసత్యత జడత దుఃఖము పరిచ్ఛిన్నత వీటికి నివృత్తి ఆ నాల్గుపదములు తమ అర్థముచే చేయుచున్నవి కనుక పునరుక్తి దోషముకాదు. హే శ్వేతకేతో! ఘటశరావాది కార్యములయందు ఒక మృత్తికారూపకారణము అనుగతమైనట్లు సకలజగత్తునందొక ఆత్మసత్తయే అనుగతమైయున్నది. శ్వేతకేతువు — తండ్రీ! ఎట్లు రజ్జురూపాధిష్ఠానజ్ఞానమగుటచే, సర్పాధ్యాసమునకు నివృత్తియగుచున్నదో, అట్లే అధిష్ఠానజ్ఞానరూప సత్తాజ్ఞానమైన పిదప సంసారరూపాధ్యాసమునకు నివృత్తికావలసియుండె, సంసారనివృత్తియో కానబడుటలేదే? ఆరుణి — హే శ్వేతకేతో! మూఢబాలునకు

మహారాజు సామాన్యమనుష్యరూపముగా జ్ఞాతమగుచున్నాడు. రాజుగ జ్ఞాతముకాడు. అయినను వృద్ధపురుషుల ఉపదేశముచే, ఆ బాలకున కా మహారాజు రాజరూపమున జ్ఞాతమగుచున్నాడు. అట్లే ఆత్మరూపసత్తయు, సర్వత్రభాసమానమైనను బ్రహ్మవేత్త యగు గురువుయొక్క ఉపదేశములేక, ఆ సత్త తన ఆత్మరూపమున ప్రతీతముకానేరదు. మఱియు యెంతవఱకధికారులకు తత్పదార్థరూపసత్త తమ ఆత్మరూపముగ జ్ఞాతము కాలేదో, అంతవఱకు మాయాకార్యరూపమగు జగత్తు నివృత్తముకాదు. గురూపదేశానంతరమే అజ్ఞానరూపమాయయు, జగత్తున్ను నివృత్తమగుచున్నవి. అపుడిక అధికారి జనులు జగద్రూపాధ్యాసము నెప్పటికి చూడరు. హే శ్వేతకేతో! ఎట్లు మాయామోహితపురుషుడు గంధర్వనగరమును చూచినను మాయారహితపురుషుడు నిర్మలాకాశమందు గంధర్వనగరమును చూడడో, అట్లే మాయాదోషముగల అజ్ఞాని ఆనందస్వరూపాత్మయందు జగత్తునుచూచినను, మాయారహితవిద్వాంసుడు ఆత్మదేవుని యందు జగత్తు నెప్పటికిని చూడడు. ఈ కారణమువలననే అజ్ఞానులకు బంధప్రాప్తి, జ్ఞానులకు మోక్షప్రాప్తి యగుచున్నది. హే శ్వేతకేతో! ఎట్లు స్వప్నావస్థయందు స్వప్నద్రష్టకు బంధమోక్షములు వాస్తవముగ లేవో, అట్లే జాగ్రదవస్థయందును ఆత్మదేవునకు వాస్తవముగ బంధమోక్షములులేవు. ఆ యాత్మదేవుడు పరమసత్యరూపుడును, దృశ్యప్రపంచము మిథ్యయు నైయున్నది. ఎట్లు మృత్తికాసువర్ణలోహములు, ఘటభూషణఖడ్గరూపకార్యముల యపేక్షచే సత్యములైయున్నవో, అట్లే యీ పరమాత్మదేవుడున్ను, పృథ్వీజలతేజోరూపజగత్తుయొక్క అపేక్షచే పరమసత్యముగా నున్నాడు. ఈ కారణమువలన శ్రుతిభగవతి ఆ యాత్మదేవుని "సత్యస్యసత్యమ్" అను నామముచే కథనము చేయుచున్నది ఇటువంటి పరమాత్మదేవుని నీవు అవశ్యముగ నెఱుగవలసి యుండెను. అయినను యిట్టి పరమాత్మదేవుని గూర్చి ప్రమాదవశమున నీవు నీ గురువును అడుగకుంటివి. ఇపుడైనను ఆ పరమాత్మదేవుని యెఱుగుటకొఱకు నీవు మఱల నీ గురుసన్నిధికి పోయి ప్రార్థన చేయుము. గురూపదేశముచే, పరమాత్మదేవుని స్వరూపము నెఱిగి మఱల త్వరగా యిచ్చటకు రమ్ము

హే శిష్య! పితయగు అరుణియొక్క ఈ ప్రకారమగు భాషణమును విని, ఆ శ్వేతకేతువు దీనముఖముతో తండ్రినిగూర్చి యిట్లనియె — తండ్రీ! ఏ పరమాత్మదేవుని జ్ఞానముచే సంపూర్ణ జగద్జ్ఞానమగుచున్నదో, ఆ పరమాత్మదేవుని స్వరూపముగా గురువెఱుగడు. ఎఱిగినపక్షమందు వారు అత్యంతప్రియపాత్రుడనై శ్రద్ధగలవాడనైన శిష్యుడనగు నాకు అవశ్యముగ ఉపదేశము చేసియుండెడివాడే. అట్లాతడు నా కుపదేశము చేయలేదు. దానివలన నంతగా జ్ఞానమెఱుగడని తెలియబడుచున్నది. నా గురువుచే

నాయెడ యే విద్యయు గుప్తముగ నుంచబడలేదు. తా నెఱిగిన సకలవిద్యలను నా కుపదేశము చేసెను. కనుక మఱల నా గురువు సమీపమునకు పోవుటయందే ప్రయోజనమున్ను సిద్ధింపదు. నేను గుర్వాజ్ఞనుతీసికొని సమావర్తనసంస్కారమును (విద్యాభ్యాసము పూర్ణమైనతర్వాత గురువుయొక్క స్తోత్ర, ప్రార్థన విధిని) పొంది యింటికి వచ్చితిని కనుక అవిశ్వాసివలె మఱల గురువు సమీపమునకుపోయి ప్రశ్న చేయుట యుచితముకాదు. కనుక ఓ తండ్రీ ! ఏ పరమాత్మదేవుని జ్ఞానముచే సకల జ్ఞాతాజ్ఞాతపదార్థముల జ్ఞానమగుచున్నదో, ఆ పరమాత్మదేవునిబోధను నీవే దయచేసి నా కుపదేశము చేయుము. నిన్నువిడచి నేను యింకొక గురువుదగ్గఱకుపోను హే శిష్యా ! యీ ప్రకారమగు శ్వేతకేతునియొక్క ప్రార్థన విని, విద్వత్పురుష శ్రేష్ఠుడైన ఆ యారుణి ఋషి శ్వేతకేతువునుగూర్చి యిట్లనియె ;—

ఆరుణి — చంద్రునివంటి దర్శనముగల ఓ శ్వేతకేతుపుత్రా ! ఏ పరమాత్మ దేవుని స్వరూపమును శ్రుతిచే కథనముచేయబడినదో, ఆ పరమాత్మదేవుని స్వరూపమును నేను నీకుపదేశముచేసెదను. నీవు గర్వపరిత్యాగముచేసి సావధానమనస్సుచే శ్రవణము చేయుము:— ఓ శ్వేతకేతో ! యీ యే నామరూపక్రియాజగత్తు గాన్పించుచున్నదో, అది క్రమముగ స్థూలసూక్ష్మములకు వాచకములైన "సత్" "అసత్" శబ్దములచే కథనముచేయుటకు యోగ్యమై యున్నది. మఱియు ఆ సదసచ్ఛబ్దములచే పుట్టినదైన యే స్థూలసూక్ష్మవిషయికబుద్ధి గలదో, ఆ బుద్ధికి విషయమై యున్నది ఆ బుద్ధిచేయుక్తమయ్యు యున్నది. ఇటువంటి ఈ దృశ్యమానమగు జగత్తు తన యుత్పత్తికంటె పూర్వము సత్తామాత్రమై యున్నది. మఱియు సదసత్ యను ఈ రెండు విధములగు శబ్దజ్ఞానములచే రహితమై యున్నది. ఆ కాలమందు యీ సంపూర్ణ జగత్తు ఆ (ఆత్మ) సత్తకన్న భిన్నము గాకుండెను. హే శ్వేతకేతో ! ఎట్లు నైయాయికుడు ఘటపటాది పదార్థములందు సత్తయను జాతినంగీకరించుచున్నాడో, అట్లే నీవు ఆ సత్తాశబ్దముచే జడజాతినంగీకరింపకుము. మఱేమనిన, నేను నీకు యే చిదానంద రూపసత్త చెప్పుచున్నానో, ఆ చైతన్యరూపసత్తనే నీవు 'సత్' శబ్దముచే గ్రహింపుము. ఎందుకనగా — జాతిరూపసత్త నంగీకరించినట్లయిన అది జడమై పరిచ్ఛిన్నమగును. ఘటమువలె కార్యరూపమగును. ఆ కార్యరూపసత్తయందు జగత్కారణత సంభవింపదు. హే శ్వేతకేతో ! సూర్యోదయమునకు పూర్వము అంధకారముండునట్లు, జగదుత్పత్తికి పూర్వము యీ సత్తయే అవశేషముగనుండును. ఈ కారణమువలన ఆ సత్తకు మాయోపాధిసంబంధముచే శ్రుతిభగవతి "అవ్యాకృత" నామముచే కథనముచేయుచున్నది. ఆ సత్తారూపకారణ వస్తువు నిర్గుణబ్రహ్మరూపమేయై యున్నది. ఆ నిర్గుణ బ్రహ్మంబునందు "యతో వాచో నివర్తన్తే అప్రాప్య మనసా సహ" యిత్యాది

శ్రుతివాక్యములచే మనోవాక్కుల నివృత్తిచెప్పబడియె. ఆ నిర్గుణబ్రహ్మంబునందు పరిచ్ఛేదత్రయమును, భేదత్రయమును, వేదవేత్తలు నిషేధించుచున్నారు. శ్వేతకేతువు - తండ్రీ! జగదుత్పత్తికి పూర్వము బ్రహ్మమునందు కార్యకారణజగత్తులేకున్నను మాయ విదమానమైయున్నది. ఆ మాయవలన బ్రహ్మమునందు సద్వితీయత సిద్ధించును గదా!

ఆరుణి — హే శ్వేతకేతో! మాయామోహితులైన అజ్ఞానిజీవులచేతనే బ్రహ్మము నందు మాయ కల్పనచేయబడియె. ఈలాగున ఆ మాయ మాయచేతనే సిద్ధించి యున్నది. ఎట్లు మనుష్యులమగు మనకు ప్రత్యక్షప్రమాణముచే ధ్యే పగలు కనబడు చున్నదో, ఆ పగటిని ఉలూకపక్షి (గుడ్లగూబ) రాత్రి యనుచున్నది. ఆ యులూక పక్షికి తన అనుభవమే ప్రమాణముగలదు. కాని యింకొక ప్రమాణములేదు అట్లే మాయయందును అజ్ఞానుల అనుభవమే ప్రమాణమైయున్నది. కాని, యింకొక ప్రమాణములేదు. హే శ్వేతకేతో! ఎపుడు సూర్యభగవంతుడు మేరుపర్వతపృష్ఠదేశ మునకు పోగా రాత్రియగునో, ఆ రాత్రియందు మూఢపురుషులు సూర్యునియందు అంధకారమును కల్పనజేయుచున్నారు. సూర్యోదయముకాగా వారికి అంధకారము కనబడదు. అట్లే బ్రహ్మవిద్గురూపదేశజన్య ఆత్మసాక్షాత్కారరూప సూర్యోదయానంత రము విద్వాంసులకు మాయారూపాంధకారము కనబడదు. ఎట్లు సూర్యభగవంతుని అంధకారము త్రికాలములందును స్పర్శముచేయదో. అట్లే ఆత్మదేవుని మాయ త్రికాల మందును స్పర్శముచేయదు. హే శ్వేతకేతో! ఎట్లు అంధకారమేఘాదులు ద్రష్టయగు పురుషుని నేత్రమును ఆచ్ఛాదనముచేసి సూర్యునికూడ ఆచ్ఛాదనముచేయుచున్నవో అట్లే యీ అజ్ఞానరూపమాయయు, అజ్ఞానిబుద్ధిని ఆచ్ఛాదనముజేసియే పరమాత్మదేవుని ఆచ్ఛాదనముచేయుచున్నది. ఇపుడు "తద్ధైక ఆహురసదేవేదమగ్ర ఆసీదేకమేవా ద్వితీయం తస్మాదసతః సజ్జాయత" అను శ్రుతివచనముచే ఖండించుటకొఱకు కథ నము చేయబడినదైన అసద్వాదిమతనిరూపణము గావింప బడుచున్నది —

హే శ్వేతకేతో! పూర్వోక్త ప్రకారముగ సకలభేదరహిత సత్తారూపకారణము సిద్ధించియుండగా, బ్రహ్మబోధరహితులైన ఎందరోపండితులు సత్తాస్థానమందు, అసత్త వంగీకరించి, వేదాంతులమైన మాతో వాదముచేయుచున్నారు. అసద్వాది — హే వేదాంతీ! నీవు జగత్కారణమని సిద్ధింపజేసిన సత్త సద్రూపమా? అసద్రూపమా? అట ప్రథమపక్షమంగీకరించినచో ఆ సత్తయందు యే సద్రూపతగలదో, అది తన స్వరూపముగ సిద్ధించినదా? యితరసత్తచే సిద్ధించినదా? స్వతస్సిద్ధమను ప్రథమ పక్షమంగీకరించిన, ఆసత్తయందు ప్రథమసత్తకన్న విలక్షణత సిద్ధింపదు. ఎందు కనగా — ఎట్లు సత్తయందు స్వతఃసిద్ధతచే సద్రూపతగలదో, అట్లు అసత్తయందును,

స్వతస్సిద్ధతయే సిద్ధించును. తన్నివృత్తిచేయుటకు యే వాదియు సమర్థుడుకాడు. మఱియు వేదాంతియిట్లనిన — ఆ సత్తయుందో, "అస్తి" యను నీ ప్రకారముగల విధిముఖప్రతీతికి విషయతకలదు. అసత్తయందావిషయతలేదు ఆ విషయతయే, సత్తాసత్తలందలి విలక్షణతయై యున్నది ఇట్లు చెప్పుటయు సంభవింపదు. ఎందు కనగా — సత్తయందు విధిముఖప్రతీతికి విషయతగలదు. అసత్తయందులేదు. అను నీ విషయమేది వేదాంతిచెప్పుచున్నాడో, అది కేవలము తన కులధర్మన్యాయముగ తమ పెద్దలసంకేతమాత్రముచేతనే సిద్ధించునుగాని ఏదోయొకవస్తువుయొక్క స్వభావాను సారముగ సిద్ధింపదు కనుక ఆ పెద్దలసంకేతము అసత్తయందు విధిముఖ ప్రతీతికి విషయత అంగీకరించుటయందు ప్రతిబంధముచేయుట కశక్యమగును. ఏకాధికరణ పదార్థములకే పరస్పరప్రతిబంధప్రతిబంధకభావమగును. కనుక సత్తయందువలె అసత్తయందును, ఆవిధిముఖప్రతీతియొక్క విషయత సంభవించునుగాని, జగదుత్ప త్తికి పూర్వము అసత్తయందు విధిముఖప్రతీతికి విషయత సంభవింపదు.

ఏలాగుననగా — చిదాభాసయుక్తాంతఃకరణవృత్తికి నామము ప్రతీతి. ఆ ప్రతీతి చిదాభాసాంతఃకరణరూపప్రమాతకు ఆశ్రితముగనుండును. ఆ ప్రమాత జగదుత్పత్తికి పూర్వము లేదు. ప్రమాతయొక్క అభావకాలమందు ప్రతీతి సంభవింపదు. కనుక జగదుత్పత్తికి పూర్వకాలమందు తానే అవిద్యమానమై యుండగా ప్రతీతి సత్తయొక్క సిద్ధి యెట్లుచేయును? చేయదు. మఱియు ఆ సత్తయందు యితరసత్తచే సిద్ధియగునను ద్వితీయపక్ష మంగీకరించినపుడు, ఆ రెండవ సత్తయందు సత్యరూప తను సిద్ధింపజేయుటకు తృతీయ సత్తకావలసినది. మఱలాతృతీయమునకు చతుర్థము ఈలాగున అనవస్థాదిదోషప్రాప్తి యగును.

అధవా — వేదాంతిచే సకలజగత్తున కుపాదానకారణముగ, యేసత్త అంగీకరింపబడినదో, ఆ సత్త నిర్వికారస్వరూపమగుటవలన ఏకరూపమైయున్నదా? అధవా పరిణామస్వభావముగలదగుటవలన అనేకరూపమైయున్నదా? అట ఏకరూపమగు ప్రధమపక్ష మంగీకరించినపుడు, ఆ యేకరూపసత్త యందు సత్తకన్న యే విలక్షణత కలదో అది సత్తుల్యమేయగును. మఱియు ఆ సత్త అనేకరూపమనినపుడు సత్తయందు ఘటాదిపదార్థతుల్యత ప్రాప్తమగును. ఘటాదితుల్యత పొందినదైన, సత్త యేదికలదో ఆ సత్తకు ఒకానొకపుడు జగత్తుకన్న పూర్వస్థితి అంగీకారము చేసినట్లయిన, ఆ కాల మందు ఘటాదిపదార్థములచే యేమి అపరాధము చేయబడినది? ఘటాదిపదార్థము లును ఆ సత్తవలె జగదుత్పత్తికి పూర్వము అవశ్యముగ నుండును. కాబట్టి ఆ పూర్వ కాలమందును వర్తమానకాలమందును పరస్పరవిశేషత గాకుండును. ఈలాగున

అనేక రూపతయు సంభవింపదు. ఈ మొదలుగాగల అనేక ప్రకార దూషణలు ఆ సత్తయందు ప్రాప్తమగును. కనుక సత్త జగత్కారణముకాదు. అసత్తయే జగత్కారణమని అసద్వాది మతము. — యిపుడు అసద్వాది మతము ఖండింపబడు చున్నది.

హే — శ్వేతకేతో! యీ ప్రకారముగ అసత్కారణసిద్ధికొఱకు ఆ మందబుద్ధు లగు వాదులు అనేక ప్రకార కుతర్కములజేసి తమ్ములను పండితులగా నెఱుగు చున్నారు. ఆ వాదుల నిట్లడుగవలయును, అసత్కారణముచే పుట్టినదైన యీ జగత్తు సద్రూపమా? అసద్రూపమా? అట ప్రథమపక్షము సంభవింపదు ఎందుకనగా – ఎట్లు సృష్టియొక్క ఆదికాలమందు అసత్కారణముచే సత్కార్యోత్పత్తియైనదో అట్లు వర్తమానకాలమందును గావలసియుండె అట్లెందుకుకాదు? పూర్వకాలమందైనట్లు యిపుడు కాకూడదనుదానికి యుక్తి చెప్పుము. మఱియు కార్యమును అసద్రూపమను ద్వితీయ పక్షమున్ను సంభవింపదు. ఎందుకనగా — అసత్కారణముచే అసత్కార్యోత్పత్తి త్రికాలమందును కానేరదు. ఎట్లనగా — అసద్వంధ్యాపుత్రునిచే అసన్నర శృంగోత్పత్తి కానేరదు. ఈలాగున అసద్వస్తువందు కారణతయు సంభవింపదు. కార్యతయు సంభవింపదు. కనుక సర్వవాదులచే కార్యము సత్యరూపముగా నంగీకరింపబడవలసినదే. సత్కార్యమునకు అసత్కారణతచే నెప్పటికిని యుత్పత్తి సంభవింపదు. కనుక సత్కార్యమునకు కారణమును సత్తాపరూముగనే అంగీకరింపవలసినది. ఈలాగున చూచినపుడు, అసత్కారణవాదిచే పూర్వము ఏయే వికల్పములు చేయబడినవో, ఆ సమస్తవికల్పములు వ్యర్థమైపోయినవి. ఇపుడు సత్తారూపకారణమందు వాదిచే చూపబడిన దూషణమునకు నివృత్తి వచింపబడుచున్నది. ఆ కారణరూప సత్త తన స్వరూపముచేతనే సత్యరూపతను పొందినది అను నీ పక్షమంగీకరించుటచే సిద్ధాంతియైన మాకు దోషమేమి? వాది – ఓ సిద్ధాంతీ! ఎట్లు సత్త తన స్వరూపము చేతనే సత్యరూపతను పొందుచున్నదో అట్లే అసత్తయు తన స్వరూపతచేతనే అసత్య రూపతను పొందును ఈ ప్రకారమగు ప్రతిబంధరూప దూషణము మీ మతమందు ప్రాప్తమగును.

సిద్ధాంతి — హే వాదీ! తర్కమందు కుశలబుద్ధిగల పురుషులు అన్యవాదుల గూర్చి ప్రతిబంధరూపదూషణను వచింపరు. మఱేమనిన — తర్కమందు కుశలత లేనిపురుషులే ప్రతిబంధిరూప దూషణమును వచింతురు. అథవా — ఆ సత్తయందు స్వరూపముగ సత్యరూపత నంగీకరించినపుడు, అసత్తయందును సత్యరూపత నంగీకరించుటయగునని వాది యే దూషణమును చూపుచున్నాడో, ఆ దూషణము వ్యాప్తి

లేనిదగును. ఎందుకనగా — ఎచ్చటెచ్చట స్వరూపముండునో, అచ్చటచ్చట సత్య రూపతయుండునను వ్యాప్తి సంభవింపదు. ఈ ప్రకారమగు వ్యాప్తి నంగీకరించినపుడు స్వరూపముగా అగ్నియందుష్ణతగలదు. కనుక స్వరూపముచే జలమందును ఉష్ణత యుండవలసియుండె. మఱియు పార్థివమగుటవలన ఘటము జలానయనక్రియను చేయునట్లు, పార్థివమగుటవలన దండమున్ను జలానయనక్రియ చేయవలసియుండును. అట్లు చేయుటలేదు ఈ మొదలగు అనేక దూషణములు వాది మతమందు ప్రాప్తము లగుచున్నవి. ఈ సర్వదూషణలు కథనము చేసిన పక్షమందు వాదికి ఉపహాసము మఱియు వక్తకు కంఠశోషణము ఈ రెండు దోషములు ప్రాప్తమగును గాని యింకే ఫలమున్నులేదు. అథవా — వాది చెప్పిన ప్రకారమే మా సత్త సిద్ధించుచున్నది. ఏలాగుననగా — అసత్తకు భిన్నమగు దానికి సత్తయనిపేరు. సత్తకన్న భిన్నమగు దానికి అసత్తయనిపేరు ఈ ప్రకారమగు సదసచ్ఛబ్దార్థము వాదిచేతనే అంగీకరింప బడియె. ఒకచో వాది దాని నంగీకరించనిచో అసత్తయు సిద్ధింపదు. అథవా — ఆ సత్తాస్థానమున వాదిచే నంగీకరింపబడినదైన ఏ యసత్తగలదో, ఆ యసత్తారూప కారణమునకు తన స్వరూపబలమున సత్యరూపత వాదిచే కథనము చేయబడియె. అది సత్కారణవాదులైన మాకు అనిష్టముకాదు. ఇష్టమే యైయున్నది. ఎందుకనగా సర్వపదార్థములకు ఆత్మయే వాస్తవస్వరూపమై యున్నది ఆ యాత్మయొక్క సత్త మాకు ఇష్టమే యైయున్నది. అథవా — "అస్తి" యీ ప్రకారమగు విధిముఖ ప్రతీతికి విషయమైనదానికి నామము సత్తయను నీ ప్రకారమగు సత్తాలక్షణమందు వాదిచే యే కులధర్మసమానత కథనము చేయబడినదో, ఆ దూషణము వాది మత మందును ప్రాప్తమగుచున్నది. ఏలాగుననగా — "నాస్తి" యీ ప్రకారమగు నిషేధముఖప్రతీతికి విషయమైనదానికి నామము 'అసత్' యని యసల్లక్షణమేది వాదిచే చెప్పబడినదో, ఆ లక్షణము కేవలము తన కులధర్మపరంపరకే అంగీకార మగును. వాది — సిద్ధాంతీ! ఒకచో సత్తకును అసత్తకును కులధర్మన్యాయముగ సిద్ధి నంగీకరించిన యెడల ఆ రెంటికిని భేదసిద్ధి కాదు.

సిద్ధాంతి — హే వాదీ! యీలాగున ఆ సత్తాసత్తలందు ఏకరూపతయైనను ఆ రెంటికిని మహాభేదము కలదు. ఏలాగుననగా — సత్త భావరూపము అసత్త అభావరూపము. ఈ ప్రకారము వానియందలి భేదము సర్వలోకానుభవ ప్రసిద్ధమై యున్నది కనుక రెంటికిని ఏకత సంభవించదు. ఇంతవరకు లోకదృష్టి ననుసరించి వాదికి సమాధానము చెప్పబడియె ఇపుడు తన సిద్ధాంతమే సమాధానము వచింప బడుచున్నది. — ఓ వాదీ! "అస్తి" యీ ప్రకారముగల విధిముఖప్రతీతి విషయ

మైన దానిని సత్తయనవలయునని నేను చెప్పిన సత్తాలక్షణము నీచేత ఖండింపబడినది. ఆనీ ఖండనము నాకంగీకారమే యైయున్నది ఎందుకనగా — నా సిద్ధాంతమందు అద్వితీయబ్రహ్మమునకు నామము సత్తయై యున్నది ఆ అద్వితీయబ్రహ్మమందో విధిముఖప్రతీతికి విషయరూపమైన లక్షణము సంభవింపదు. మఱేమనిన — ఆ బ్రహ్మరూపసత్తకు మనోవాక్కులకవిషయతారూపమే లక్షణమైయున్నది. అథవా సర్వలక్షణరహితలక్షణమై యున్నది. వాది — హే సిద్ధాంతీ! ఎట్లు సత్త మనోవాక్కుల కవిషయమో సర్వలక్షణరహితమో, అట్లు వంధ్యాపుత్రాది అసత్పదార్థము లున్ను మనోవాక్కుల కవిషయములుగాను సర్వలక్షణరహితములుగా నున్నవి ఆ యసత్ పదార్థమందు నీ సత్తకు యతివ్యాప్తియగును కదా? సిద్ధాంతి — హే వాదీ! ప్రతియోగి అనుయోగి యను రెండుపదార్థములచేతనే అభావముయొక్క నిరూపణ మగుచున్నదని సకలశాస్త్రముల సిద్ధాంతమైయున్నది. కనుక ఆయసత్పదార్థములయందు మనోవాక్కుల కవిషయత, మఱియు సర్వలక్షణరహితత, సంభవింపదు. దీనివలన నేమి సిద్ధించినదనగా — ఏ మూఢపురుషుడు సూర్యభగవంతునిపైని ధూళి ప్రసరించునో, యా మూఢబుద్ధి తానే ధూళిచే వ్యాప్తముగునుగాని, సూర్యభగవంతునకా ధూళియొక్క సంబంధము కాదు. అట్లే వేదమందు కథనము చేయబడిన ఏ సత్తారూపకారణము కలదో, ఆ సత్తారూప సూర్యునియందు మూఢబుద్ధియగు కుతర్క వాది, కుతర్కరూపధూళిని ప్రసరించినపుడు వాది తానే పరాజయము పొందుచున్నాడు. కాని, సత్తారూపసూర్యునకు, ఆ కుతర్కధూళియొక్క స్పర్శమైనను కాదు. అరుణి — హే శ్వేతకేతో! ఆ సత్తారూప బ్రహ్మమునుండి జగదుత్పత్తి యెట్లగునో వినుము — అసంగమైన సద్రూపబ్రహ్మము మాయాసంబంధమును పొంది, సృష్టియొక్క ఆదికాలమందు యీ ప్రకారమగు చింతనము చేయుచున్నది. ఒకడైన పరమాత్మదేవుడగు నేను బహురూపములు కావలెను. అట్లు బహురూపమగుట నేను జన్మమెత్తక ఘటింపదు. నేనే నానా జన్మములు ధరించవలెను. ఈ ప్రకారమగు చింతనముచేసి ఆ పరమాత్మదేవుడు క్రమముగ ఆకాశాదిపంచభూతముల పుట్టించుచున్నాడు శ్వేతకేతువు — నాయనా! తైత్తరీయోపనిషత్తునందు ఆకాశాది పంచభూతముల యుత్పత్తి చెప్పబడెను. కాని ఛాందోగ్యోపనిషత్తునందు పృథ్వీజలతేజములను నీ మూడుభూతముల యుత్పత్తి మాత్రమే చెప్పబడియె ఇది పరస్పర విరోధము కదా? అరుణి — హే శ్వేతకేతో! ఛాందోగ్యశ్రుతియందు స్థూలబుద్ధులగుపురుషులపైని అనుగ్రహముచేసి స్థూలములైన మూడు భూతములయొక్క యుత్పత్తి చెప్పబడియె. ఆ ఛాందోగ్యశ్రుతికిని పంచీకరణమందభిప్రాయము కలదుగాని. త్రికరణమందభిప్రాయము లేదు. కనుక విరోధము లేదు హే శ్వేతకేతో! యీ ప్రకారముగా పృథ్వీజలతేజములను నీ మూడు భూతముల

పుట్టించి ఆ కారణబ్రహ్మము భూతత్రయముతో తాదాత్మ్యభావమును పొందుచున్నది. సృష్ట్యాది కాలమందు ఎట్లు తేజము జలమునకు జలము పృథ్వికి కారణమైయుండెనో, అట్లే వర్తమానకాలమందును లోకులకాయనుభవమే కలదు ఉష్ణతాతిశయముచే జలవృష్టియగును. వృష్టియగుటచే పృథ్వీరూపమగు అన్నము లభించును ఈలాగున తేజాది భూతత్రయములు, సకలజగత్తునకు కారణములై యున్నవి ఆ కారణ స్వభావానుసారమే, శాస్త్రవేత్తలచే దేహధారి జీవులకు త్రివిధకారణమని చెప్పబడియె. అట జరాయుజమను జీవజాతి సర్వదేహధారి జీవులకు బీజము

ఏలాగుననగా — గర్భమును వేష్టితమొనర్చు చర్మమునకు నామము జరాయువు ఆ జరాయువు జఠరాగ్ని తేజముచే జన్యమగుటవలన తైజసపదార్థమై యున్నది అనంతరము స్వేదజము పుట్టుచున్నది. ఆ స్వేదజము ద్వివిధము ఒకటి మశకాది రూపము. అది ఉద్భిజరూపమగుచున్నది. మఱొకటి యూకాకాదిరూపస్వేదజము. అది అండజరూపమగుచున్నది. ఈలాగున ఒకే స్వేదజము, జలీయ ఉద్భిజరూపమును. పార్థివ అండజరూపమును సంగ్రహించుట సంభవించుచున్నది. హే శ్వేతకేతో! ఎట్లు లోకప్రసిద్ధ శరీరాది అధ్యాత్మ కార్యసంబంధకారణమందు జరాయుజాది భేదత్రయముచే రూపత్రయతయుండునో అట్లే ఈ సర్వజగత్తుయొక్క కారణమందును పృథ్వీజల తేజములను నీ భేదత్రయముచే రూపత్రయత యుండును.

శ్వేతకేతువు — నాయనా! తేజాదికారణముల జ్ఞానముచే అధికారి పురుషులకు ఫలమేమి? అరుణి — ఓ శ్వేతకేతూ! ఎట్లు తేజాదికారణత్రయము తమతమ కార్యమందు అనుగతమైయుండునో, అట్లే తేజాదిత్రయముమందు పరమాత్మదేవుడున్ను తన సత్తారూపమున అనుగతుడైయున్నాడు. యిటువంటి పరమాత్మ దేవుడే అధికారి జనులమగు మనచే యెఱుగుటకు యోగ్యుడైయున్నాడు. ఆ పరమాత్మరూపకారణమందు, అధికారిబుద్ధియొక్క స్థితి యెదిగలదో, ఆ స్థితియే ఆ విచారమునకు ఫలము హే శ్వేతకేతో! ఘటశరావాదికార్యములందు మృత్తికకారణరూపముగ ప్రవేశముచేయునట్లు తేజాది భూతత్రయములందు ఆ పరమాత్మదేవుడు మొదటికారణరూపముగ ప్రవేశము చేయుచున్నాడు. ఏలాగుననగా:— ఆ పరమాత్మ దేవునకు అసాధారణ ధర్మరూపమైన యీ లక్షణము "తత్తేజ ఐక్షత"మన్నగు శ్రుతులచే కథనము చేయబడియె అభిప్రాయము - యెట్లు సృష్ట్యాదికాలమందు ఒకడనైన నేను బహురూపము కావలెనని విచారముచేసి పరమాత్మ బహురూపుడగుచున్నాడో, అట్లే తేజము జలము ఈ రెండును కూడ విచారముచేసి బహురూపమైనవి. అట చైతన్యప్రదేశము లేక విచారము సంభవింపదు; దానివల్ల తెలియబడుచున్నదేమనగా - ఆ చైతన్యరూపపరమాత్మదేవుడే ఆ తేజజలములందు ప్రవేశముచేసి విచారము చేయుచున్నాడు. శ్వేతకేతువు - తండ్రీ!

ఆ పరమాత్మదేవుడు తేజమునందు మొదటనే అనుగతుడై యుండగా, శ్రుతిచే మఱల జీవరూపముగ పరమాత్మప్రవేశమెందులకు చెప్పబడియె? అరుణి - ఓ శ్వేతకేతో! సద్రూపపరమాత్మదేవుడు, కారణరూపముగ తేజాదులందు మొదటనే ప్రవిష్టుడై యున్నను, ఆతడు జీవరూపముగ తేజాదులందు పూర్వము ప్రవిష్టముకాలేదు. చూడుము. ప్రాణధారణ జేయువాని నామము జీవుడు, ఆ ప్రాణధారణాది జీవధర్మములు పూర్వకాలమందు లేవు. ఏ చైతన్యము పంచప్రాణములను ధారణము చేయుచున్నదో, మఱియు మఱల మఱల జననమరణాదిసంసారమును పొందుచున్నదో, శుభాశుభకర్మముల సుఖదుఃఖరూపఫలమును బంధమోక్షములను పొందుచున్నదో అద్దానినామము జీవుడు. హే శ్వేతకేతో! సర్వదేహధారి జీవులకు తమ తమ అంగుష్ఠపరిమాణ హృదయకమలమందు జ్ఞానశక్తి గలదైన అంతఃకరణముతో ఏ చైతన్యము తాదాత్మ్యాధ్యాసమును పొందుచున్నదో, ఆ చైతన్యమునకు నామము జీవుడు. శ్వేతకేతువు - నాయనా! అంతఃకరణమునకే జీవోపాధి అంగీకరించినట్లైన సుషుప్తియందు అంతఃకరణమునకు నాశమగుచున్నది. కనుక అచ్చట జీవునియొక్క నాశముకూడ కావలసియుండె. సుషుప్తియందో జీవునియొక్క నాశము సిద్ధాంతముచే నంగీకరింపబడలేదు. అరుణి-హే శ్వేతకేతో! సుషుప్తియందంతఃకరణమునకు సర్వదా నాశముకాదు, మఱేమనిన - సంస్కారభూతసూక్ష్మవాసనారూపముగ నుండును. ఒకచో సుషుప్తియందు అంతఃకరణము నాశమైన పక్షమందు అది మఱల జాగ్రత్తునందు వేరొక ప్రకారముగ ప్రతీతము కావలసియుండె అట్లగుటలేదు. పూర్వము జాగ్రత్తునందున్నట్లే ప్రతీతమగుచున్నది. శ్వేతకేతువు - నాయనా! అంతఃకరణమును, అంతఃకరణవాసనలను, జీవాత్మకుపాధిగ నంగీకరించిన పక్షమందు ఆ వాసనలు అనేకములైయున్నవి. కనుక జీవులు అనేకులగుదురు 'అజో హ్యేకో జుషమాణోఽనుశేతే" మున్నగు శ్రుతులందు జీవుడొకడుగనే చెప్పబడియె. అరుణి - హే శ్వేతకేతో! మాయావిశిష్టపరమాత్మదేవరూపకారణమందు యీ అంతఃకరణవాసనావిశిష్టవాసనాజీవులకు తాదాత్మ్యాధ్యాస సంబంధము శాస్త్రవేత్తలచే చెప్పబడియె. ఈ కారణమువలననే అంతఃకరణాది కార్యములతో ఆ జీవులకు తాదాత్మ్యాధ్యాసము ప్రయత్నములేకనే ప్రాప్తమగుచున్నది. అట్లు తాదాత్మ్యసంబంధము కానపుడు. అంతఃకరణోదయకాలమందు జీవునకంతఃకరణముతో తాదాత్మ్యాధ్యాసము గాకుండవలసియుండె, కాని యట్లగుచున్నది. హే శ్వేతకేతో! ఆ యంతఃకరణమునకుత్పత్తి నాశములగుటచే జీవున కుత్పత్తి నాశములుకావు మరేమనిన జీవాత్మసర్వదా ఏకరూపుడే యైయున్నాడు భిన్నభిన్నాంతఃకరణస్థితి గలజీవాత్మభిన్నభిన్నరూపములచే ప్రతీతమగుచున్నను, తదంతఃకరణస్థితమైన యేకమగు జ్ఞానముతో

తాదాత్మ్యసంబంధమును పొందుచున్నాడు. ఆ అంతఃకరణములకును వాసనలకును ఆధారభూతమగు నేయజ్ఞానముకలదో, అది ఒకటిగామున్నది ఆత్మజ్ఞానములేక ఆ అజ్ఞానమునకు నాశముకాదు. యిటువంటి అజ్ఞానరూపోపాధిని దృష్టియందుంచు కొని శాస్త్రవేత్తలచే జీవాత్మ ఒకడనబడియె నిత్యుడనబడియె. హే శ్వేతకేతో! జాగ్రదా ద్యవస్థాత్రయమునకు నిమిత్తకారణభూత సంస్కారరూపమగు యే కర్మవాసనకలదో, మఱియు వృత్తిరూపాంతఃకరణమునకు నిమిత్తకారణభూతసంస్కారరూపజ్ఞానవాసన లేవి కలవో, ఆ సకలవాసనలకు ఆశ్రయమొక అజ్ఞానమేయై యున్నది. ఆ అజ్ఞాన నాశముచే సకలవాసనలు నాశమగుచున్నవి అపుడే జీవాత్మమోక్షమును పొందు చున్నాడు. ఇపుడు అన్వయవ్యతిరేకముగ వాసనానాశమునకు మోక్షకారణత చూపబడుచున్నది —

ఓ శ్వేతకేతో! ఏ వృక్షసంబంధబీజము నాశమగునో ఆ వృక్షమే నశించునుగాని యితర వృక్షములు నశింపవు. అట్లే ఏ జీవుని అంతఃకరణము వాసనలతో సహా నాశ మగునో ఆ జీవుడే ముక్తుడగును. యితరజీవులు బద్ధులయ్యే యుందురు. శ్వేతకేతువు - తండ్రీ! పూర్వము నీవు జీవుడు ఒకడే యంటివి, యిపుడు నానాజీవులనుచున్నావేమి? ఆరుణి - హే శ్వేతకేతో! స్వప్నావస్థయందు ఒక్కడైన స్వప్నద్రష్ట అజ్ఞానవశమై నానారూపములు ధారణచేయుచున్నాడు. అందు ఎన్నియో రూపములుగ బంధనము పొందుచున్నాడు. ఎన్నియోరూపములుగ మోక్షమును పొందుచున్నాడు. స్వప్నము నివృత్తమైనపుడు ఆ ద్రష్టకు బంధమోక్షములులేనట్లు, ఆత్మసాక్షాత్కారమైనతర్వాత యీ జీవునకిక బంధమోక్షములు లేవు. దీనివలన సిద్ధించినదేమనగా - జీవులకు పర స్పరభేదము మఱియు పరమాత్మతోభేదము యేది ప్రతీతమగుచున్నదో, అది ఉపాధి భేదముచేతనేగాని వాస్తవముగ లేదు, జీవాత్మ అద్వితీయబ్రహ్మరూపుడే యైయున్నాడు. శ్వేతకేతువు - నాయనా! పరమాత్మదేవుడు జగత్తునందు ప్రవేశము చేయుచున్నాడని పూర్వము చెప్పియుంటివి. ఆ సంగతి ఘటిల్లదు. యెందుకనగా:— లోకమందు పరిచ్ఛిన్నవస్తువుయొక్కయే ప్రవేశము చూడబడుచున్నది వ్యాపకవస్తువునకు ప్రవేశ మెచ్చటను చూడబడుటలేదుకదా? ఆరుణి — హే శ్వేతకేతో! ఎట్లు సర్పము బిల మందు ప్రవేశించుచున్నదో అట్లు పరమాత్మ జగత్తునందు ప్రవేశము చేయుటలేదు. మఱేమనిన ఎట్లు వ్యాపకమైన ఆకాశము ఘటాదులందు ప్రవేశము చేయుచున్నదో, అట్లే సర్వత్రవ్యాపకుడైన ఆత్మదేవుడు తేజాదిభూతములందు ప్రవేశము చేయుచున్నాడు. మఱియు హే శ్వేతకేతో! ఎట్లు సుషుప్త్యవస్థను పొందిన పురుషుడు సామాన్యరూప ముగ శరీరమందు ప్రవేశముచేయుచున్నాడో, విశేషరూపముగ ప్రవిష్టమగుటలేదో మఱియు నాతడె మఱల జాగ్రదవస్థయందు విశేషరూపముగ ప్రవేశము చేయు

చున్నారో, అట్లే భూతములందు పరమాత్మదేవుడున్ను పూర్వము సామాన్యరూప ముగ ప్రవేశముచేసి మఱల విశేషరూపముగ ప్రవేశము చేయుచున్నారు. అపుడా పరమాత్మదేవుడిట్లు విచారణ చేయుచున్నాడు. తమతమ కార్యములందు ప్రవిష్టము లైన తేజాదిభూతములందు పరమాత్మనగునేను జీవరూపముగ ప్రవేశము చేయవల యును మఱియు నానాప్రకారజీవరూపములను స్పష్టమగునట్లు చేయవలయును. దానికుపాయమేమనగా.— తేజాదిభూతత్రయముల దేవతలందు ప్రవేశముచేసి ఆ భూతములను త్రివృత్కరణ చేయవలయును. అతడట్లే చేసెను. ఆ త్రివృత్కరణ ప్రకారము:— ఒక్కొక్కభూతమును తొమ్మిది తొమ్మిది విభాగములు చేయవలెను. అందు తనయొక్క యేడు భాగములు యితర భూత సంబంధములగు రెండు భాగములు చేరిన యొక భూతమగును ఎట్లనగా $\frac{7}{9}$ (సప్తనవమాంగ) తేజము + అధిక $\frac{1}{9}$ (ఏక నవమాంగ) జలము + $\frac{1}{9}$ (ఏకనవమాంగ) పృథ్వీచేరి ఒక తేజమగును. అట్లే జల మున్ను పృథ్వియున్ను

హే శిష్య! ఈ ప్రకారమారుణి శ్వేతకేతువునకు త్రివృత్కరణమును కథనము చేసి, కారణసత్యతను చూపుటకొఱకు నాల్గుదృష్టాంతములను చెప్పుచున్నారు. హే శ్వేతకేతో! అగ్ని ఆదిత్యుడు చంద్రుడు విద్యుత్తు యీ నాల్గింటియందు ప్రతీతమైన రక్తరూపము తేజస్సంబంధమనియు, శుక్లవర్ణము జలసంబంధమనియు. కృష్ణవర్ణము పృథ్వీసంబంధమనియు నెఱుగుము. ఈ తేజాదికారణత్రయమును అగ్న్యాదికార్యముల నుండి భిన్నముగ జేసినపుడు ఆ యగ్న్యాదికార్యములు ప్రతీతముకావు, కనుక ఆ యగ్న్యాదికార్యములు మిథ్యలే. కేవలవాఙ్మాత్రములే అట్లే తేజాదిభూతములును, కార్యరూపములగుటవలన మిథ్యలే. కార్యరూపమగుటవలన సంపూర్ణ జగత్తున్ను మిథ్యయే తత్కారణమైన పరమాత్మదేవుడొకడే సత్యముగ నున్నారు. ఆ పరమాత్మ దేవుని జ్ఞానముచేతనే సంపూర్ణజగత్తుయొక్క జ్ఞానమగుచున్నది.

హే శ్వేతకేతో! ఈ ప్రకారముగ కారణమునకు సత్యతనెఱిగి, పరమహర్ష మును పొందినవారై కొందఱు విద్వాంసులిట్లు పరస్పరభాషణము చేయుచున్నారు. విద్వాంసులమైన మాయొక్క విద్యారూపకులమందెందఱు పురుషులు జన్మింతురో, వారి యందెవరును యేయొక్క అజ్ఞాతవస్తువును కథనము చేయరు. మఱేమనిన కారణము నకు సత్యత కార్యమునకు మిథ్యతయెఱిగి, జ్ఞాతవస్తువునే కథనముచేయుదురు. ఎందు కనగా కారణముకన్న కార్యము కించిన్మాత్రము భిన్నముకాదు. కనుక ఆకారణము యొక్క జ్ఞానముచే, ఆ సమస్తపురుషులు సర్వజ్ఞతను పొందుదురు. హే శ్వేతకేతో! ఆ విద్వాంసుల సంభాషణము అన్యథాకాదు. యథార్థమే యగును. వారు పరమాత్మ దేవుని బాగుగ నెఱుగుచున్నారు. ఇటువంటి విద్వాంసులకు సకల జగత్తుయొక్క

జ్ఞానమగుట దుర్లభముకాదు హే శిష్య ! ఈ ప్రకారమాయుద్దాలకనామకుండగు ఆరుణిపిత శ్వేతకేతు పుత్రునకు బాహ్యప్రపంచమందు భౌతికతనుచూపి యిపుడు మనఃప్రాణాది ఆంతరప్రపంచమందు భౌతికతను చూపుచున్నారు ఆరుణి - హే శ్వేతకేతో ! జీవులచే గావింపబడు అన్నభక్షణ జలపానమునందలి ఆ యన్నమున్ను జలమున్ను జఠరాగ్ని సంబంధముచే పృథివ్యాదిత్రిరూపమై సూక్ష్మ మధ్యమ స్థూల భేదములచే త్రివిధమగుచున్నది అట తేజస్సంబంధ సూక్ష్మభాగము వాగ్రూపముగను, మధ్యమభాగము మజ్జారూపముగను, స్థూలభాగము అస్థిరూపముగను పరిణామము పొందుచున్నది. జలసంబంధసూక్ష్మభాగము ప్రాణము. మధ్యమభాగము రక్తము స్థూలభాగము మూత్రము. పృథ్వీసంబంధ సూక్ష్మభాగము మనస్సు మధ్యమభాగము మాంసము. స్థూలభాగము పురీషము. యీలాగున పరిణామమును పొందుచున్నది

శ్వేతకేతువు - హే తండ్రీ ! జలముచే తేజమునకు పరాభవమగుటవలన వాక్కునందు తేజఃకార్యత సంభవించునగాని ప్రాణమందు జలకార్యత మనస్సునందు పృథ్వీకార్యత అనుభవమునకు రాదు. ఆరుణి - హే శ్వేతకేతో ! పంచజ్ఞానేంద్రియ పంచకర్మేంద్రియ పంచభూత మనస్సులను షోడశతత్త్వముల సముదాయము తప్త లోహపిండ న్యాయముగ చైతన్యతాదాత్మ్యసంబంధయుక్తమైనపుడు పురుషనామమును పొందుచున్నది మఱియు ఆ సముదాయమందు, చంద్రదేవతగల మనస్సు ప్రధానమైనది. ఆ మనోమయపురుషునకు వేదవేత్తలకు షోడశకళలు కథనము చేయబడియె. దినదినమందు భోజనము చేయబడిన యే యన్నము కలదో, ఆ యన్నముచే పుట్టినదైన మనోవృత్తికి ఉపాదానకారణరూపశక్తులకు నామము కళ అట ఒక్కొక్క దినమందు అన్నభక్షణముచే ఆ మనస్సునందు ఒక్కొక్క కళ పుట్టుచున్నది. ఈ ప్రకారమగు అన్నభక్షణముచే షోడశదినములందు షోడశకళలు మనోమయపురుషునకు పుట్టుచున్నవి. అన్నభక్షణముచేయకపోయిన దినమందు ఒక్కొక్కకళ క్షీణించుచున్నది. హే శ్వేతకేతో ! యీ ప్రాణము జలములేనిచో ఒక దినమైనను శరీరమందుండదు. కనుక ప్రాణవిషయమందు అన్వయవ్యతిరేకమార్గమునకై జనవలదుగాని, పదునైదు దినములవఱకు అన్నభక్షణము చేయకుము కావలసినంత జలపానము చేయుము.

హే శిష్య ! యీ ప్రకారమగు పితృభాషణమును విని ఆ శ్వేతకేతువు పంచదశ దినములవఱకు ఉపవాసము చేసెను. పంచదశదినానంతరము పిత వాని యెదుటకు వచ్చి వానితో నిట్లనియె. హే పుత్ర ! నీవు పూర్వము అధ్యయనము చేసిన ఋగాది వేదములను అర్థసహితముగ నాయెదుట పాఠము చేయుము. అపుడా శ్వేతకేతువు పూర్వము తానధ్యయనము చేసినదానిని చింతనము చేయుచుండినను కొంచమైనను

ఆ వేదము స్మరణకు రాకుండెను ఎట్లు మూఢపురుషుడు ఏ అర్థమును స్మరణము చేయడో అట్లే శ్వేతకేతువును పూర్వాధ్యయనమును కించిన్మాత్రముకూడ స్మరణము చేయలేకుండెను. తరువాత యీతడు తన తండ్రినిగూర్చి మందస్వరముతో యిట్లని యెను నాయనా! నాచే చేయబడిన వేదాధ్యయనమంతయు పోయినది. నాకేమియు స్మరణకు రాకున్నది, ఎట్లు అభాగ్యపురుషునిచే బహుకాలము చేయబడిన మంత్రా రాధనము నిష్ఫలమగునో, అట్లే నా వేదాధ్యయనమున్ను యైనది. అరుణి — ఓ శ్వేత కేతో! నీ అధ్యయనమెక్కడికిని పోలేదు భయపడవద్దు. నీవిపుడు అన్నభక్షణము చేయుము. భోజనము చేసిన తర్వాత నీకంతయు స్మరణమగును. ప్రజ్వలితాగ్ని శాంతమై యొకస్ఫులింగమాత్రమున యవశేషమైయుండినట్లు నీ మనస్సునందును యిపుడు పంచదశకళలు క్షీణించి ఒక్కకళమాత్రము శేషించి యున్నది. భోజనముచే మఱల యొక్కొక్క కళ వృద్ధియగును. పొమ్ము. ఆ పితృవచనమును విని శ్వేత కేతువు అట్లనే భోజనముచేసి సంపూర్ణకళావృద్ధియైనపిదప, తండ్రియెదుటకువచ్చి అర్థసహితముగ సకలవేదము నధ్యయనముచేసెను.

అరుణి — శ్వేతకేతో! ఎట్లు వాక్కునందును మనస్సునందును తేజోమయత అన్నమయత అన్వయవ్యతిరేకముగ నీవు నిశ్చయము చేయుచున్నావో, అట్లే ప్రాణ మందు జలమయత నిశ్చయము చేయుము గాని జలమునువిడచి అనుభవము చూడవద్దు

ఇంతవఱకు జగత్కారణప్రతిపాదనమున్ను తత్పదార్థశోధనమున్ను చేయ బడియె. ఇపుడు "త్వం" పదార్థశోధనము చేయబడుచున్నది. అట్టి త్వంపదార్థ రూపాత్మయందు, ప్రత్యగ్రూపత. త్రివిధముగ చెప్పబడియె అందు మొదటిది, అంతఃకరణాదులందు చిదాభాసరూపముచే నున్న ప్రత్యగ్రూపత. రెండవది శరీరాధి ష్ఠాన రూపముచేనున్న ప్రత్యగ్రూపత, మూడవది యింద్రియాధిష్ఠాన రూపముచేనున్న ప్రత్యగ్రూపత — అట ప్రథమ ప్రత్యగ్రూపతకు ఈ ఛాందోగ్య శ్రుతియందు శకునిపక్షి దృష్టాంతము చెప్పబడియె. హే శిష్య! పూర్వము చెప్పిన ప్రకారముగ వాక్ప్రాణమ నాదులకుపాదానకారణమైన అద్వితీయపరబ్రహ్మమును నిశ్చయము చేయువాడైన శ్వేతకేతు పుత్రునిగూర్చి ఆరుణి పిత యిట్లనియె హే శ్వేతకేతో! పూర్వము నేను నీకు అన్నమయరూపముచే కథనముచేసిన ఏ మనస్సునకు పృథ్వీజలతేజోరూప సకల జగత్తు కార్యమై యున్నదో ఆ మనస్సుయొక్క విద్యమానతచేతనే మనుజుడు మాటి మాటికి అధ్యాసరూపమోహమును పొందుచున్నాడు. ఒకానొకపుడు మనస్సులేనపుడు మోహమును పొందడు, ఆ ప్రతిబింబరూపమోహమున కభావమైన పక్షమందు జీవాత్మకు రాగద్వేషాదివికారములున్ను ప్రాప్తములు కావు. వికారభావమైన పక్ష

మందు జీవాత్మ మలల సంసారమును పొందదు. ఈలాగున చిదాభాసయుక్త మనస్సే సకల జగత్తునకు నిర్వాహకమగుచున్నది.

శ్వేతకేతువు — హే తండ్రీ యీ మనస్సును ఉపాదానకారణతచే తన వశముగ చేయునట్టివస్తువెద్ది? అరుణి — హే శ్వేతకేతో ! కారణరూపమైన ప్రథమ శరీరమే మనస్సును తన వశముగ జేయుచున్నది. సర్వదేహధారి జీవులకు యే అజ్ఞానముకలదో, ఆ యజ్ఞానమునకు నామము కారణశరీరము. ఆ యజ్ఞానము ఒకటిగా నుండుటవలన సర్వజీవులకు సాధారణముగ నున్నది. అందుచే నా యజ్ఞానరూప కారణము స్థూలసూక్ష్మశరీరరూపకారణముకన్నను ఉత్కృష్టముగ నున్నది. శ్వేతకేతువు — నాయనా ! ఆ యజ్ఞానరూపకారణ శరీరమందు ప్రమాణమేమి? అరుణి - హే శ్వేతకేతో ! సకలదేహధారి జీవులు సుషుప్తినుండిలేచి, మేము సుఖముగ పరుంటిమి, యేమియు నెఱుగ కుంటిమని స్మరించుచున్నారు దానివలన నెఱుగబడుచున్న దేమనగా — యీ జీవుడు సుషుప్తియందు సత్వదుఃఖరహితుడై ఆనందానుభవమును, అజ్ఞానానుభవమును చేయుచున్నాడు ఆ యనుభవజన్యసంస్కారముచేతనే, జాగ్రదవస్థయందు ఆనందమునకును అజ్ఞానమునకును స్మృతియైనది. ఈలాగున స్మరణరూపహేతువుచే అనుమానరూపమగు సుషుప్తియొక్క అనుభవము కలుగుచున్నది. ఆ యనుభవముచే అజ్ఞానరూపకారణశరీరము సిద్ధించినది ఇపుడు సూక్ష్మశరీరము నిరూపింపబడుచున్నది. హే శ్వేతకేతో ! ఆ కారణజ్ఞానవిశిష్ట ఆత్మదేవునినుండి, ఆకాశాదిపంచసూక్ష్మభూతములును మనస్సున్ను యింద్రియాది భౌతికపదార్థములున్ను పుట్టుచున్నవి. అట సమష్టిసూక్ష్మపదార్థముల కభిమానియైన హిరణ్యగర్భుని శాస్త్రవేత్తలు అధిదైవమనుచున్నారు మఱియు మనస్సుప్రధానముగ గల వ్యష్టిసూక్ష్మాభిమానియైన తైజసుని అధ్యాత్మ మనుచున్నారు. ఇపుడు స్థూలశరీరము నిరూపింపబడుచున్నది. హే శ్వేతకేతో ! ఆ సూక్ష్మభూతములనుండి స్థూలభూతములును స్థూలశరీరాది భౌతికపదార్థములును పుట్టుచున్నవి. అట సమష్టిస్థూలాభిమానిదేవతయైన విరాట్టును అధిదైవమనుచున్నారు. వ్యష్టిస్థూలాభిమానిదేవతయైన విశ్వుని అధ్యాత్మ మనుచున్నారు. హే శ్వేతకేతో ! సర్వదేహధారి జీవులకు భిన్నభిన్నరూపముగ ప్రతీతమైన స్థూలశరీరము జాగ్రదవస్థకు స్థానముగాను సూక్ష్మశరీరము స్వప్నావస్థకు స్థానముగ నున్నవి. ఆ స్వప్నావస్థకు ఆశ్రయరూపమగు అంతఃకరణమునకు రెండవస్థలుగలవు. ఒకటి స్వరూపముగ అభివ్యక్తమగు అవస్థ మరొకటి సంసారరూపముచే స్థితిగల అవస్థ. యీ అవస్థాద్వయభేదముచే స్వప్నమున్ను ద్వివిధమగుచున్నది. అట ఒకటి ప్రసిద్ధ స్వప్నావస్థ, మఱొకటి స్వప్నరహితావస్థ అందు ప్రసిద్ధస్వప్నావస్థ స్వప్నా

వస్థ యనబడియె. ప్రసిద్ధమైన సుషుప్త్యవస్థ స్వప్నరహితావస్థ యనబడియె. ఆ సుషుప్త్యవస్థయందు ప్రతిబింబరూపజీవుడు తనబింబరూప పరమాత్మతోటి లయభావమును పొందుచున్నాడు ఆ పరమాత్మదేవుడు పరమానందస్వరూపుడుగాను సకలభేదరహితుడుగానున్నాడు. ఈ కారణమువలననే యాతడు క్షుధాతృషాహర్షశోకజన్మమరణములను నీ షడూర్ములచే రహితుడుగానున్నాడు అభిప్రాయము - ఎట్లు దర్పణోపాధి లయమగుటచే ప్రతిబింబము తన బింబమందు లయభావమును పొందుచున్నదో, అట్లే సుషుప్తియందును మనోరూపోపాధి లయమగుటచే ప్రతిబింబరూపజీవుడు తనబింబరూపపరమాత్మయందు లయభావమును పొందుచున్నాడు. ఓ శ్వేతకేతో! కొందఱు బుద్ధిమంతులు లౌకికదృష్టిచే సుషుప్త్యవస్థను 'స్వపితి" యనుచున్నారు. మరికొందఱు విద్వాంసులో స్వపితి శబ్దము అవస్థకు వాచకము కాదు. అది పరమాత్మకే వాచకమనుచున్నారు ఆ పరమాత్మదేవుని శ్రుతిభగవతి "స్వపితి" నామముచే కథనము చేయుచున్నది. పరోక్ష ప్రియులగు యింద్రాదిదేవతలు వానిని "స్వపితి" యని పరోక్షనామముచే కథనము చేయుచున్నారు.

హే శ్వేతకేతో! యీ జాగ్రదాద్యవస్థాత్రయము మనస్సుయొక్క పరిణామము. వాటితో జాగ్రత్స్వప్నములను రెండవస్థలందు, మనస్సు సర్వదా భ్రమణము చేసి చేసి శ్రమనుపొంది, విశ్రాంతికొఱకు లయరూపమగు సుషుప్త్యవస్థను పొందుచున్నది. ఎట్లు పంజరమందు సూత్రముచే కట్టబడిన శకునపక్షి భక్ష్యకామనచే పంజరసంబంధాంతర్దేశమందెగిరి యెగిరి తర్వాత శ్రమనుపొంది ఆ పంజరమధ్యమందున్న విశ్రాంతిస్థానము మీదకువచ్చి భ్రమణరహితమై నిశ్చలముగ కూర్చొనుచున్నదో, అట్లే యీ మనస్సున్ను పుణ్యపాపసూత్రములచే శరీరరూపపంజరమందు హృదయదేశమున కట్టబడియున్నది అచ్చట రోగక్షుధాదులచే జనించిన అధ్యాత్మాది త్రివిధతాపములచే, తప్తాయమానయైన ఈ మనోరూప శకునపక్షి విషయసుఖముకొఱకు జాగ్రత్స్వప్నావస్థలలో భ్రమణము చేసిచేసి శ్రమనుబొంది తచ్ఛ్రమనివృత్తికొఱకు హృదయదేశమందు సుషుప్తిని పొందుచున్నది. ప్రతిబింబసహితమనస్సు సుషుప్తియందేపరమాత్మదేవునితోటి లయభావమును పొందుచున్నదో ఆ పరమాత్మదేవునే నీవు అంతర్యామి యని యెఱుగుము శ్వేతకేతువు — నాయనా! పరమాత్మదేవుని ప్రాప్తిచే జీవునకు సంసారనివృత్తియగునని వేదాంతసిద్ధాంతము సుషుప్తియందు జీవునకు పరమాత్మప్రాప్తియైనను పిదప మఱల సంసారప్రాప్తి యెందుకగుచున్నది? ఆరుణి — హే శ్వేతకేతో! సుషుప్తియందు జీవునకు పరమాత్మప్రాప్తియైనను ఆ సుషుప్తికి ముక్తికంటె యింత విశేషతకలదు — సుషుప్తియందు మనస్సు కారణాజ్ఞానమున లయభావము పొందినను ఆ మనస్సంబంధసూక్ష్మసంస్కారము లవశేషముగ నుండును.

యందుచేతనే జాగ్రదాద్యవస్థలందామనస్సు మఱల పుట్టుచున్నది ముక్తావస్థయందు, ఆత్మజ్ఞానరూపాగ్నిచే ఆ మనస్సంస్కారములు అజ్ఞానము దగ్ధమగును. కనుక నా మనస్సు మఱల పుట్టదు. ఈలాగున మఱల సంసారములేదు హే శ్వేతకేతో ! ఆత్మదేవుడొక్కడైనను సకలజీవులకు మనస్సు ఒకటి కాదుకదా? అవి అనేకములై యున్నవి మఱియు సుఖదుఃఖ బంధమోక్షాది సకలధర్మములు మనస్సునందే కలవు. కనుక లోకమందు కొందఱు సుఖులైయుండుట కొందఱు దుఃఖులైయుండుట కొందఱు బద్ధులైయుండుట కొందఱు ముక్తులైయుండుట యీ మొదలగు వ్యవస్థలు నడచుచున్నవి హే శ్వేతకేతో ముక్తికంటె కించిన్న్యూనతగలదైన యే సుషుప్త్యవస్థను గూర్చి చెప్పుచున్నానో ఆ సుషుప్త్యవస్థ వాసనాయుక్త మనస్సుద్వారా, ఆత్మతో సంబంధముగలదిగాను బింబప్రతిబింబ జ్ఞానముగలదిగానున్నది. వాస్తవముగ సర్వ నామరూపకులచే రహితుడైనను, ఈ యాత్మదేవుడు స్థూలశరీరాభిమానముగల జాగ్రదవస్థయందు సూక్ష్మశరీరాభిమానముగల స్వప్నావస్థయందు 'అశనాయా యదన్యా" అను నీ రెండునామములను పొందుచున్నాడు (సుషుప్తియందు 'స్వపితి' నామమువలె) హే శ్వేతకేతో ! 'అశనాయా యదన్యా' యను యీ రెండు నామములు ఆత్మకు ప్రాణరూపోపాధిని గ్రహించుటవలననే ప్రాప్తమగుచున్నవి

ఎందుకనగా - ఈ ఆనందరూపాత్మయందు సాక్షాత్తుగా, క్షుధయులేదు. పిపాసయు లేదు క్షుత్పిపాసలు ప్రాణమందుగలవు కనుక ఈ రెండు నామములు ప్రాణమందు ముఖ్యవృత్తిచే ఘటించుచున్నవి ఆ ప్రాణముతోటి ఆత్మదేవునకు తాదాత్మ్య సంబంధమగుటవలన గౌణవృత్తిచే ఆత్మయందు ఘటించుచున్నవి విచారించి చూచి నపుడు ఆ రెండు నామములు ప్రాణమందుకూడ ముఖ్యవృత్తిచే ఘటింపవు మరేమనిన - జలతేజములందే ముఖ్యముగా ఘటించును. ఎందుకనగా - భోజనము చేయబడిన అన్నమును జలమే ద్రవీభూతముచే గైకొనిపోవుచున్నది కనుక ఆ జలమునకు 'అశనాయా'' ముఖ్యనామము. మఱియు ప్రాశము చేయబడిన జలమును శోషణము చేసి తేజము తీసుకొనిపోవుచున్నది కనుక తేజమునకు ''యదన్యా '' ముఖ్యనామము. (గోవులను తీసుకొనిపోవువానికి గోనాయ అశ్వమును తీసుకొనిపోవువానికి అశ్వనాయ నామములవలె)

ఇపుడు సద్రూపపరమాత్మయందు సర్వాంతరత వచింపబడుచున్నది. హే శ్వేతకేతో ! మొదట నీయొక్క స్థూలశరీరమున కనంతరము అన్నము దానికంటె ననంతరము పృథ్వి, దాని కనంతరము జలము దానికనంతరము తేజము వీటిని కార్యములని యెఱుగుము. ఈ శరీరాది పంచకార్యములందు కడపట, యే తేజోరూప కార్యము కలదో. ఆ తేజోరూపకార్యమునకు సద్వస్తువే మూలకారణమై యున్నది

హే శ్వేతకేతో! ఎట్లు వృక్షమునకు మొదటిది మూలము, రెండవది అంకురమునై యున్నదో, అట్లే శ్రుతిభగవతి శరీరాదివికారములను అంకురరూపముగ కథనము చేయుచున్నది. అన్నమునుండి సద్వస్తువవఱకు మూలరూపముగ కథనము చేయుచున్నది. కనుక అంకురరూపచిహ్నముచే మూలముయొక్క అనుమానమగుచున్నది అట్లే ఈ శరీరరూపకార్యమును నీవు అన్నరూపముగల కారణముగ నిశ్చయము చేయుము ఈ క్రమముననే తుదకు పరమాత్మరూపమూలకారణమును నిశ్చయము చేయుము. ఈ లాగున పరమాత్మరూపసద్వస్తువే సమస్తజగదుత్పత్తికి మూలకారణమై యున్నది ఈ హేతువువలననే శ్రుతిభగవతి ఆ సద్వస్తువును మూలనామముచే కథనము చేయుచున్నది మఱియు ఆ సద్వస్తువే జగత్తుయొక్క స్థితికి కారణమై యున్నది. ఈ హేతువువలన నా సద్వస్తువును శ్రుతిభగవతి 'ఆయతన' నామముచే కథనము చేయుచున్నది. ఆ సద్వస్తువే సమస్తజగత్తునకు లయకారణమై యున్నది. ఈ హేతువువలన అద్దానిని శ్రుతిభగవతి "ప్రతిష్ఠా" నామముచే కథనము చేయుచున్నది వాస్తవముగ నా సద్వస్తువు మూల, ఆయతన ప్రతిష్ఠాశబ్దముల మూడింటిచేతను రహితముగ నున్నది. హే శ్వేతకేతో! యిది త్వంపదార్థ శోధనము, యిపుడు తత్త్వంపదార్థాభేదము వర్ణింపబడుచున్నది అట "తత్త్వమసి శ్వేతకేతో" అను నీ మహావాక్యము తొమ్మిదిమార్లు ఉద్దాలకమునిచే శ్వేతకేతువునకుపదేశింపబడియె. అందు 'త్వం' పదమునుగూర్చి వచింపబడుచున్నది హే శ్వేతకేతో! జాగ్రదాద్యవస్థాత్రయమందు విచరించువారైన జీవాత్మ అజ్ఞానవశమున అనేక శరీరములను గ్రహణముచేయుచున్నారు. అనేకశరీరములను పరిత్యాగము చేయుచున్నారు. శ్వేతకేతువు - తండ్రీ! ఈ జీవాత్మ యే రీతిగా శరీరములను పరిత్యాగము చేయుచున్నారు? అరుణి - హే శ్వేతకేతో! ఎపుడు జీవుడు మరణావస్థను బొందుచున్నాడో, అపుడాతడు పూర్వకృతపాపకర్మలను స్మరణముజేసి పశ్చాత్తాపము నొందుచున్నారు. అట్టి సమయమందు వానిపుత్ర బాంధవాదులు వానికి కర్కశభూమిపై శయనింపజేయుచున్నారు, బాంధవులందఱు వానిని నాలుగు ప్రక్కల పరివేష్టించుచున్నారు. ఆ పురుషునకు ఎక్కిళ్ళు వచ్చుచున్నవి. ఉచ్ఛ్వాసము నాతడు విడుచుచున్నాడు. వాని రెండు నేత్రములు ఆకాశము వైపునకు తెరవబడుచున్నవి. ముఖము లాలచే యుక్తమగుచున్నది. యిటువంటి మరణావస్థనుపొందిన జీవుని నేత్రవాగాదీంద్రియసంబంధసామర్థ్యరూపవృత్తి మనస్సునందు మనస్సుయొక్క సామర్థ్యరూపవృత్తి ప్రాణమందు. ప్రాణవృత్తి అపంచీకృతభూతములచే యుక్తుడైన జీవాత్మయందు లయభావమును పొందుచున్నవి సూక్ష్మభూతములతో సహా జీవాత్మ సుషుప్తియందువలె సంస్కారపరిశేషమైన మాయోపహితానందస్వరూపాత్మయందు లయభావమును పొందు

చున్నారు హే శ్వేతకేతో ! సుషుప్త్యవస్థయందుగాని మరణావస్థయందుగాని కేవలము సంస్కారమాత్రబంధము కలదు. అటువంటి బంధముగలవారైన జీవాత్మకు లయస్థానమగు యే సద్వస్తువుగలదో, యే సద్వస్తువు జీవరూపమున సంఘాతమందు ప్రవిష్టమైనదో, యే సద్వస్తువు తేజాదిభూతములకు కారణమైయున్నదో, ఆ సద్వస్తువే నీయాత్మయైయున్నది. హే శ్వేతకేతో ! నీయాత్మయైన సద్వస్తువెట్లున్నదనగా - సూక్ష్మముకన్న సూక్ష్మముగాను మహత్తుకన్న మహత్తుగనున్నది. ఎట్టు కల్పిత సర్పదండాదులకు రజ్జువుమాత్రమే వాస్తవస్వరూపమైయున్నదో, అట్లే కల్పితమైన తేజాదిసమస్త జగత్తునకు ఆ సద్వస్తువే వాస్తవస్వరూపమైయున్నది హే శ్వేతకేతో ! యిటువంటి సకలాధిష్ఠానరూపపరమాత్మదేవుడవే నీవు, యీ దేహాదిసంఘాతము నీవు కావు. హే శ్వేతకేతో ! ఏ ఆత్మదేవుడు బుద్ధ్యాదులకును సాక్షియైయున్నాడో ఏ ఆత్మదేవుడు అద్వితీయుడై, పరమానందస్వరూపుడై, జడమును ప్రకాశింపజేయువాడై, స్వయంజ్యోతియైయున్నాడో, అటువంటి ఆత్మదేవుడే నీయొక్క వాస్తవస్వరూపమైయున్నాడు. నీవు కర్తవుగావు, భోక్తవుగావు ప్రమాతవుగావు హే శ్వేతకేతో ! ప్రియపుత్రుడవైన నీకు నేను యే హితోపదేశముచేయుచున్నానో ఆ యుపదేశము నీ గర్వదోషమును నివృత్తిచేయునదిగానున్నది. ఈ కారణమువలన నాయీ ఉపదేశమును నేను ఆదేశనామముచే కథనముచేయుచున్నాను. (దుష్టపురుషులగూర్చి రాజాదులచే చేయబడు శాసనమునకు నామము ఆదేశము) హే శ్వేతకేతో. ఏ పరమాత్మదేవుని ఉపదేశమును నేను నీకు చేయుచున్నానో, ఆ పరమాత్మ దేవునియొక్క శ్రవణముచేతను, మననముచేతను విజ్ఞానముచేతను సకల అశ్రుత, అచింత్య, అవిజ్ఞాతపదార్థముల యొక్క, శ్రవణమును, మననమును, విజ్ఞానమును అగుచున్నది. హే శిష్య ! ఈ ప్రకారముగ నెపుడు ఉద్దాలకపితచే శ్వేతకేతుపుత్రునకు, జీవబ్రహ్మైభేదోపదేశము చేయబడినదో, అపుడా శ్వేతకేతువు సంశయయుక్తుడై మరల తండ్రినిగూర్చి ఎనిమిది ప్రశ్నలు జేయుచున్నాడు. పితయు తత్సమాధానమొసగుచున్నాడు. శిష్యుడు - హే భగవన్ ! ఉద్దాలకమునిచే మహావాక్యముద్వారా జీవబ్రహ్మైభేదనిశ్చయముగావింపబడినపిదప శ్వేతకేతువునకు యెనిమిదిమార్లు సంశయమెందుకు కలిగినది ?

గురువు — హే శిష్య ! యెనిమిదిమార్లు సంశయమగుటకు కారణము కుతర్కమే గాని యింకేమియులేదు. శ్వేతకేతువుయొక్క ప్రశ్నలు ప్రథమప్రశ్న — వాయనా ? పూర్వము నీవు సుషుప్త్యవస్థయందు జీవులకు సద్వస్తుప్రాప్తియగునని చెప్పితివి, అట్లయిన పక్షమందాజీవులు మాకు సద్వస్తు ప్రాప్తియైనదని యెందు కెఱుగరు ? దీనియందు దృష్టాంతమేమి ? ద్వితీయప్రశ్న — సుషుప్త్యవస్థయందును మరణావస్థయందును. వాగాదింద్రియములకు లయమైనను అవిద్యారూప మాయ అచ్చట విద్యమానమగుట

వలన ఎట్లు లోకమందు తన గృహమునుండి బయటకువచ్చిన పురుషునకు నేను. నీ గృహమునుండి బయటకు వచ్చితినని అనుభవమగుచున్నదో, అట్లే సుషుప్త్యవస్థనుండి జాగ్రదవస్థకు వచ్చినపుడు నేను సద్వస్తువునుండి వచ్చితినను అనుభవమెందుకుగాదు? దానికి దృష్టాంతమేది?

తృతీయప్రశ్న:- ఎట్లు సమస్తనదులు సముద్రమందు లయభావమును పొందుచున్నవో, అట్లే సుషుప్తిమరణావస్థలందు జీవులకు, సద్వస్తువందు లయమగుచున్నదను దృష్టాంతమంగీకరించినపుడు సముద్రమందు లయమును పొందినవైన నదులకు సముద్రమునందు మరల యుద్భవముగాక అచటనే యెటుల నాశమగుచున్నదో, అట్లే సుషుప్తిమరణావస్థలందును జీవులు సద్వస్తువును పొందినవై అక్కడక్కడనే నాశము కావలసియుండె అట్లు నాశమైన పిదప సద్రూపబ్రహ్మప్రాప్తి యిక యెవనికగును? దానికి దృష్టాంతమేమి? చతుర్థప్రశ్న - ఆత్మదేవుడు అత్యంతసూక్ష్మముగానుండును. అట్టి సూక్ష్మరూపుడైన ఆత్మదేవుడు యీ స్థూల జగత్తున కాధారమెట్లగును? అందులకు దృష్టాంతమేమి? పంచమప్రశ్న — అధికారిపురుషులకీయాత్మదేవుడు శ్రద్ధచే ప్రాప్తుడగుచున్నాడని నీవు వచించితివి శ్రద్ధయో అనుభూతపదార్థమందే యగును. అననుభూతపదార్థమందెప్పటికిని శ్రద్ధ పుట్టదు శబ్దప్రవేశముకూడలేనిదైన ఆత్మపదార్థమందు ఏరీతిగా శ్రద్ధపుట్టును? షష్ఠప్రశ్న - ఏవస్తువుయొక్క స్వరూపము యింద్రియములచే గ్రహణముచేయుటకు యోగ్యమగునో, ఆ వస్తువే యింద్రియములచే గ్రహింపబడును. ఆత్మదేవుడు యింద్రియముల కవిషయము అట్టి ఆత్మ యింద్రియములచే నేరీతిగా నెఱుగబడును? సప్తమప్రశ్న - మరణకాలమందజ్ఞానిజీవుల యింద్రియాదులు సూక్ష్మరూపముగ స్థితమగుచున్నవి. అట్లు జ్ఞాని యింద్రియములును మరణకాలమందు సూక్ష్మరూపమైనపుడు అజ్ఞానిజీవులకు మరణానంతరము మరల జన్మము కలుగునట్లు జ్ఞానికిని మరల జన్మమెందుకు కలుగకూడదు? అష్టమప్రశ్న - మరణావస్థయందు జ్ఞానియొక్క వాగాదీంద్రియములు నిశ్శేషముగ లయమగునట్లు అజ్ఞానుల యింద్రియములు నిశ్శేషముగ లయభావము నెందుకు పొందవు? ఈ యెనిమిది ప్రశ్నలకు ఉత్తరమును దృష్టాంతములతో సహా కథనము చేయవలయునని ప్రార్థన

ప్రథమప్రశ్నకుత్తరము - మధుమక్షికలు తమ గృహమందు నానావృక్షముల రసమును సంగ్రహించి కూడబెట్టుచున్నవి అట యీరసము లెట్లు నేను ఆమ్రవృక్ష రసమును నేను జంబీరవృక్షరసమును అని యీ ప్రకారముగ తమ్ముల నెఱుగవో అట్లే సుషుప్తిమరణావస్థలయందు నానాజాతులుగల జీవులు సద్వస్తువును పొంది ఆ సద్వస్తువుతో నేకీభావమును బడసినను తమ ఆత్మను విశేషభావమున నెఱుగరు. శ్వేతకేతువు — తండ్రీ! సుషుప్త్యవస్థయందు జీవుడొకచో సద్వస్తువుతో నేకతను పొందిన

పక్షమందు సుషుప్తినుండి లేచినపుడాజీవునకు మఱల అదేజాతిగల శరీరముయొక్క ప్రాప్తిగాకుండె. అరుణి — ఓ శ్వేతకేతో! వ్యాఘ్రసర్పాది తామసజీవులును, క్షత్రియాది రాజసజీవులును, బ్రాహ్మణాది సాత్త్వికజీవులును, సుషుప్తియందు సద్వస్తువును పొంది ఆ సుషుప్తినుండి లేచినపుడు ఆయా శరీరములనే మఱల పొందుచున్నారుగాని విలక్షణశరీరములను పొందరు. వర్షాకాలము నివృత్తమైన పిదప సకలమండూకములు మృత్తికాభావమును పొందుచున్నవి. వాటియొక్క సూక్ష్మసంస్కారములు మాత్రము పృథ్వియందు నిలచుచున్నవి. మఱల వర్షాకాలము రాగానే ఆ మండూకములెట్లు తమ ఆయా పూర్వశరీరములనే పొందుచున్నవో అట్లే సుషుప్త్యవస్థయందును సర్వజీవులకు లయమైనను, అచ్చట వాసనారూపసంస్కారములుండి యుండుటచే ఆ సంస్కారముల వలన సుషుప్తినుండి లేచుటకొఱకే జీవులాయాశరీరములనే పొందుచున్నారు.

ద్వితీయప్రశ్నకుత్తరము — గంగాదినదులు తమ నామరూపములను పరిత్యాగముచేసి సముద్రభావమును పొందుచున్నవి. ఆ నదులు మఱల మేఘము ద్వారా వృష్టిరూపమున సముద్రమునుండి బయటకువచ్చి మేము సముద్రమునుండి వచ్చుచున్నామని యెట్లెఱుగవో, అట్లే జీవులున్ను సుషుప్త్యవస్థయందు సద్రూపబ్రహ్మమును పొందినను, సుషుప్తినుండి లేచినపుడు 'మేము సద్రూపబ్రహ్మమునుండి వచ్చుచున్నామ'ని యెఱుగరు. యెందుకనగా — ఆ సద్బ్రహ్మప్రాప్తికాలమందు, ఏ మూలాజ్ఞానముచే ఆ సద్బ్రహ్మసంబంధభావమునకు ప్రతిబంధము చేయబడినదో, ఆ మూలాజ్ఞానము జాగ్రదవస్థయందును విద్యమానమై యున్నది. ఆ యజ్ఞానముచే మోహితులైన జీవులు సద్బ్రహ్మము నెఱుగరు.

తృతీయప్రశ్నకుత్తరము — ఈ జీవులేజాతిగలవారైనను, సుషుప్తియందే సద్వస్తువును పొందుచున్నారో, ఆ సద్వస్తువునుండి తిరిగివచ్చినపుడు అదేజాతిగల వారగునేగాని, భిన్నజాతిగలవారుకారు. ఎందుకనగా — 'ఏయేజీవులు సుషుప్తియందు సద్వస్తువుతోటి అభేదభావమును పొందుచున్నారో, ఆయా జీవులకొకచో ఉత్థానమేకాకపోయినపక్షమందు, ఆ సుషుప్తియందు సద్వస్తువులయమగుటచే, ప్రతిదినమును ఆ జీవులకు దేహపాతముకావలసియుండె. అట్లెచ్చటను గాన్పించుటలేదు. మఱేమనిన — ఏ జీవులు సుషుప్త్యవస్థను పొందుదురో, ఆ జీవులు సుషుప్తినుండి మఱల లేచుచునేయున్నారు. అథవా జీవునియొక్కనాశమేపురుషునిచేతను చూడబడుటలేదు. మఱేమనిన — ఏ పదార్థమును జీవుడు పరిత్యాగముచేయుచున్నాడో, ఆయాపదార్థములయొక్క నాశమే గాన్పించుచున్నది. ఎట్లనగా వృక్షస్థితజీవుడు ఏయే శాఖను పరిత్యాగముచేయుచున్నాడో, ఆయాశాఖయే యెండుచున్నది. శ్వేతకేతువు - నాయనా! వృక్షస్థితజీవుడేశాఖను పరిత్యాగము చేయుచున్నాడో, ఆశాఖయందొకచో

అన్యజీవుడు ప్రవేశముచేసినపక్షమందు, ఆశాఖయెండదు. అట్లే సుషుప్త్యవస్థయందు జీవుడు సద్రూపమునుపొంది ముక్తుడైనను అన్యజీవుడెవడైన ఆ శరీరమందు ప్రవేశము చేసి యద్దానిని లేపును ఈ కారణమువలన. ప్రతిదినమందు జీవులకు పాతము కానేరదు. అరుణి - హే శ్వేతకేతో! ఆ వృక్షశాఖవలె నొకచో, సుషుప్తికాలమందు శరీరమున అన్యజీవుడు ప్రవేశించి దానిని లేపినపుడు, లోకమందే శరీరమునకును నాశనముకాకుండ వలసె ఎందుకనగా — ఏ అన్యజీవుడు సుషుప్త్యనంతరము శరీరమందు ప్రవేశముచేసి శరీరమును లేపుచున్నాడో, ఆ అన్యజీవుడు మరణానంతరమున్ను శరీరమందు ప్రవేశముచేసి శరీరమునులేపును ఈలాగున యే శరీరమునకును నాశముకాదు. ఇట్లేమోకాన్పించుటలేదు. కనుక సుషుప్తిని పొందినజీవుడే, మఱల సుషుప్తినుండి లేచుచున్నాడుగాని యితర జీవుడుకాడు. హే శ్వేతకేతో! మరణావస్థయందేజీవుడు సద్రూపమును పొందుచున్నాడో, ఆ జీవుడే పుణ్యపాపకర్మవశమున మఱల అన్యశరీరమును పొందుచున్నాడు. ఈ ప్రకారముగా జీవరూపుడైన అధికారి నిత్యమగుటవలన మోక్షశాస్త్రమునకును వ్యర్థతలేదు. కృతనాశాకృతాభ్యాగమ దోషమున్ను ప్రాప్తముకాదు.

చతుర్థప్రశ్నకుత్తరము – అత్యంత సూక్ష్మమైన వటబీజము, మహద్వటవృక్షమునకు ఆధారము. ఎందుకనగా — ఆ వటవృక్షము తనయుత్పత్తికన్న పూర్వము ఒకచో వట బీజమందు అత్యంతాసత్తైనపక్షమందు, వంధ్యాపుత్రునివలె ఆ యత్యంతాసత్పదార్థమున కెప్పటికిని యుత్పత్తికాకుండును. అలాగున ఆ మహద్వటవృక్షము స్వోత్పత్తికి పూర్వము బీజమందుగలదు అయినను బీజదశయందావృక్షము స్కంధశాఖాపత్రాది భేదములచే ప్రతీతముకాదు. అట్లే జగత్తుయొక్క సూక్ష్మసంస్కారయుక్తమగు ఏ మాయగలదో, ఆ మాయోపహితుడగు ఆత్మదేవుడు సూక్ష్మరూపుడైనను జగదుత్పత్తికి పూర్వము, సకల జగదాధారమగుచున్నాడు. కాని జగదుత్పత్తికి పూర్వమా ఆత్మదేవుడు విద్యమానమైయున్నాడను నిశ్చయము శాస్త్రదృష్టిరహితులకు కానేరదు. మఱేమనిన – 'సదేవ సౌమ్యే'' త్యాదిశాస్త్రవాక్యదృష్టిగలవారికే యగును.

పంచమప్రశ్నకుత్తరము — పరమాత్మదేవుడు ప్రత్యక్షాదిలౌకికప్రమాణములచే నెఱుగబడకున్నను, గురుశాస్త్రవచనములందలి విశ్వాసరూపశ్రద్ధచే నెఱుగబడును. ఎట్లు జలమందు స్థితమైనలవణము నేత్రాదింద్రియములచే నెట్లెఱుగ బడదో, కాని రసనేంద్రియములచే నెఱుగబడునో, అట్లే ఆత్మదేవుడు ప్రపంచమందు విద్యమానమైయుండినను శ్రద్ధారహితులు వానినెఱుగుటకు శక్యులుకారు. కాని శ్రద్ధావంతులైన పురుషులు, తత్త్వంపదార్థశోధనముద్వారా, ఆయానందరూపాత్మను సాక్షాత్కరించుకొనుచున్నారు.

షష్ఠప్రశ్నకుత్తరము — గాంధారదేశమందు నివాసముచేయువారైన ఒక పురుషుని - చోరులు మహారణ్యమునకు తీసికొనిపోయి వానియొక్క సొత్తంతయు హరణముజేసి వాని రెండుకండ్లను కట్టివేసిపోయిరి. పిదప నా పురుషుడు ఉచ్చస్వరముచే రోదనముచేయుచుండగా, అరణ్యమునుండి జనుచున్నట్టి ఒక పథికుడువచ్చి కృపచేత వాని రెండుకండ్లను విప్పి, వానికి గాంధారదేశముయొక్క మార్గము చూపి యిట్లనియె — నీవీ మార్గముగుండా పొమ్ము. అపుడు నీ దేశమును సురక్షితముగ జేరెదవు ఆ దయాళువగు పథికునెడ విశ్వాసముంచి వాని వచనానుసారముగ నా పురుషుడు ఆ మార్గముచే సుఖముగా తనదేశమునకు వచ్చిచేరెను. అలాగుననే — లోకప్రసిద్ధమైన యింద్రియాద్యుపాయములచే ఆత్మదేవుని సాక్షాత్కారముగాకుండినను, బ్రహ్మవేత్తయగు గురువుయొక్క ఉపదేశరూపమను ఉపాయముచే ఆత్మదేవుని సాక్షాత్కారమగుచున్నది. పైదృష్టాంతమునందువలెనె, యిటుచూడుము— యీ యధికారి పురుషుని కామక్రోధాదిచోరులు సంసారరూప మహారణ్యమునకుదెచ్చి వానియొక్క సాక్షిరూపనేత్రములను అజ్ఞానరూపదృఢబంధనముచే బంధించుచున్నారు. ఎపుడు బ్రహ్మవేత్తయైన గురురూపదయాళుపురుషుడు మహావాక్యరూపమగు తన హస్తముచే అధికారిపురుషుని సాక్షిరూపనేత్రముల విప్పుచున్నాడో, అపుడాతడు అజ్ఞానావరణరహితుడై అద్వితీయాత్మరూపమగు తన దేశమునకు సుఖముగా తిరిగి వచ్చుచున్నాడు.

సప్తమప్రశ్నమునకుత్తరము — మరణకాలమందు వాగాదింద్రియములకును, మనస్సునకును స్వరూపముచే లయముకాదు. మరేమనిన — తమ వృత్తిరూపముచే లయమగుచున్నవి. వాగాదుల స్వరూపము సంసారరూపముగ మరణకాలమందును ఉండును పూర్వమీవిషయమేది నీకు చెప్పియుంటినో, అది అజ్ఞానులయొక్క మరణమునుగూర్చి వచించినదైయున్నది. జ్ఞానులకో బ్రహ్మజ్ఞానప్రభావముచే మరణకాలమందు వాగాది సకల ప్రపంచము తమతమ వ్యాపారసహితముగ తమ స్వరూపము తోడనే లయభావమునుపొందుచున్నది. ఈ కారణమువలన జ్ఞానికి అజ్ఞానులకువలె మరల శరీరప్రాప్తిగానేరదు. ఇట్లు అజ్ఞానిమరణముకన్న జ్ఞానిమరణమందేవిశేషతను నీకు చెప్పియుంటినో, అదికేవలము శాస్త్రదృష్టినంగీకరించియే చెప్పినదగును. లోకదృష్టిచేతనో, అజ్ఞానియొక్కయు జ్ఞానియొక్కయు మరణపద్ధతి ఒకేప్రకారముగ తోచుచున్నది కాని అజ్ఞానికి మరల మరల జన్మము కలుగుచున్నది. జ్ఞానికి మరల జన్మమేలేదు. ఇట్లు వీరిరువురకు యెంత విశేషతగలదో చూడుము !

అష్టమప్రశ్నకు త్తరము – జ్ఞానులు సత్యస్వరూపాత్మదేవుని యెఱుగుచున్నారు. అజ్ఞానతో మిథ్యాభూతశరీరాదులనే, ఆత్మరూపముగ నెఱుగుచున్నారు. జ్ఞానులు సత్యస్వరూపులైన ఆత్మదేవుని సాక్షాత్కారము జేసుకొని మాయారూపపాశములచే రహితులై మరణకాలమందు వాగాదీంద్రియాది సమస్త ప్రపంచము లయముకాగా, పిదప మఱల జన్మమునకు రారు. అజ్ఞానులకో "పునరపిజననం పునరపి మరణం పునరపి జననీ జఠరే శయనమ్" —

హే శ్వేతకేతో! ఏ పురుషునకు సత్యమందభిప్రాయముకలదో ఆ పురుషు డొకచో మిథ్యాప్రపంచమును పొందినను సత్యవాదియగు నాతడా మిథ్యాప్రపంచము నుండిముక్తుడేయగుచున్నారు. మిథ్యావాదియో యట దుఃఖోపభోగమే చేయుచున్నారు.

హే శిష్య! ఈ ప్రకారముగ నా యుద్దాలకపిత, శ్వేతకేతుపుత్రుని గూర్చి "తత్త్వమసి" యను మహావాక్యమును తొమ్మిదిసార్లు ఉపదేశము చేసెను. ఆ పిత్రోప దేశమును శ్రవణముచేసి సంశయరహితుడై, ఆ శ్వేతకేతువు ఆత్మయొక్క వాస్తవ స్వరూపమును సాక్షాత్కరించుకొనెను.

హే శిష్య! ఆత్మజ్ఞానము పొందినవాడై మహాతేజముగలవాడైన నా శ్వేత కేతువు, కించిత్కాలమువఱకు తనగృహమందు నివాసముచేసి, అనంతర-మా శ్వేత కేతువు పరమవైరాగ్యమునుపొంది, ఉద్దాలకపితవలె తానున్ను పరమహంససన్యాస ధారణమును గావించుకొనును.

హే శిష్య! ఆ యుద్దాలకముని శ్వేతకేతుపుత్రుని అత్యంతబుద్ధిమంతునిగ నెఱింగి ఆత్మరూపసత్తయందు సుఖరూపత నుపదేశము చేయకుండె, (యితడు బుద్ధి మంతుడు గాన చెప్పకనే నెఱుగగలడను నీ అభిప్రాయముచే దానిని చెప్పకుండెను) శ్వేతకేతువున్ను దానినడుగలేదు. తండ్రి చెప్పకనే తానే యద్దానినెఱిగెను. పూర్వము నారదమునియొక్క ప్రశ్నువిని సంతోషపడినవారైన సనత్కుమారులు, నారదముని యడుగకనే భూమానామమున సుఖరూపతను కథనముచేసిరి. హే శిష్య! పూర్వము నీవు శ్వేతకేతువుయొక్క అజ్ఞానకారణమడిగితివి, దానిని నేను నీకు చెప్పితిని. మఱియు శ్వేతకేతువునకు, పిత్రోపదేశముచే ఆత్మజ్ఞానప్రాప్తి యగుట కూడ కథనము చేసితిని, యిప్పుడిక యే విషయము శ్రవణముచేయుటకు నీకు యిచ్ఛగలదో దానిని వచింపుము.

ఇతి శ్రీమదాత్మపురాణే ద్వాదశోఽధ్యాయః

సంపూర్ణం

ఆత్మపురాణము

అథ త్రయోదశాధ్యాయారంభః

త్రయోదశాఽధ్యాయము

శ్రద్ధాభక్తిగలవాడైన శిష్యుడు శ్రీగురువు నిట్లు ప్రార్థన చేయుచున్నాడు — హే భగవన్! ద్వాదశాధ్యాయాంతమందు ఉద్దాలకముని శ్వేతకేతువును బుద్ధి మంతుడని యెఱిగి ప్రశ్నింపమి ఆత్మసంబంధసుఖరూపతను చెప్పలేదు పూర్వము సనత్కుమారమునీశ్వరుడు నారదమునికి అడుగకనే ఆత్మసంబంధసుఖరూపత నుపదేశముచేసెనని తాము చెప్పితిరి. ఓ భగవంతుడా! ఆ సనత్కుమారునిచే నారదమునికి కథనముచేయబడిన బ్రహ్మవిద్య. భవదీయముఖమున శ్రవణము చేయవలయునని కోరిక కలదు. దయచేసి తామా బ్రహ్మవిద్యను నాకుపదేశము చేయుడు. ఈ ప్రకారముగ శ్రద్ధావంతుడైన శిష్యుని ప్రార్థన విని కృపాయుక్తుడగు గురువు శిష్యునిగూర్చి యిట్లనియె.. — శ్రీగురువు — హే శిష్య! పూర్వ మొకకాలమందు, సంసారతాపముచే తప్తుడైన నారదముని యేకాంతదేశమందు స్థితుడైన సనత్కుమారుని సమీపించి దీనవచనములచే నిట్లనియె — ఓ భగవంతుడా! ఏ బ్రహ్మము సకలజగదాధిష్ఠానమైయున్నదో. ఏ బ్రహ్మము సర్వముకన్న నుత్కృష్టమో, ఏ బ్రహ్మముయొక్క జ్ఞానముచే విద్వత్పురుషులు కర్తృత్వభోక్తృత్వాది అధ్యాసరూప శోకమూలము తరించుచున్నారో, ఆ బ్రహ్మముయొక్క స్వరూపమును నీవు బాగుగ నెఱుగుదువు ఓ భగవంతుడా! ఆ బ్రహ్మముయొక్క జ్ఞానమును, శిష్యుడనైన నాకు దయచేసి ఉపదేశము చేయుము.

హే శిష్య! నారదమునియొక్క ఆ ప్రార్థనవిని మందహాసముచేయుచు నారదుని యజ్ఞాననివృత్తికొఱకు సనత్కుమారుడిట్లనియె హే నారద! నీవు సకలలోకము లందు సర్వజ్ఞతచే ప్రసిద్ధుడవుగానున్నావు. కావున నీవు ఏయే విద్యల నేర్చుకొంటివో,

ఆ సమస్తవిద్యలను నాయెదుట చెప్పుము, ఆ వెనుక నేను నీకు బ్రహ్మోపదేశము చేసెదను. అపుడా నారదుడు దీర్ఘప్రణామముగావించి, తన విద్యలనన్నిటిని తెలుప నారంభించెను నారదుడు — హే భగవన్! మంత్రబ్రాహ్మణులతోగూడి, ఋగాది నాల్గువేదములను మజ్జనకులైన బ్రహ్మదేవునియొక్క అనుగ్రహమున బాగుగ నెఱిగితిని. అట్లె బ్రాహ్మణభాగమందు, కథారూపఇతిహాసములను, జగదుత్పత్త్యాదిరూపపురాణములను సాధు అసాధుశబ్దనిరూపణరూపవ్యాకరణమును, శ్రాద్ధాదికర్మప్రతిపాదకమైన పిత్ర్యశాస్త్రమున్ను, రాశినామముగల గణితశాస్త్రమున్ను, జీవోత్పత్త్యాదిప్రతిపాదకమైన దైవశాస్త్రమును, భూమియందు నిక్షిప్తమైన నిధిసంబంధశాస్త్రమును, అక్షపాదప్రణీతన్యాయశాస్త్రమును, వేదప్రతిపాదితవాక్యజ్ఞానముగల ప్రశ్నోత్తరశాస్త్రమును, ఏకాయననామకమైన నీతిశాస్త్రమును, వేదాంగరూపదేవవిద్యానామకమైన నిరుక్తశిక్షా కల్పశాస్త్రమును, భూతవిద్యానామకమైన ఆయుర్వేదమును సుశ్రుతాదివైద్యశాస్త్రమును, శాంతిపుష్టికారకములైన నానా ప్రకారమంత్రములను, అస్త్రవిద్యాసహిత ధనుర్విద్యానామకమైన క్షత్రవిద్యయును, నవగ్రహస్థితికారకమైనజ్యోతిషశాస్త్రమును నక్షత్రవిద్యయును గారుడవిద్యానామకమైనసర్పవిద్యయును, లోకమనోరంజకమైన గాంధర్వమను గానవిద్యను నేను బాగుగా నెఱుగుదును. హే భగవన్! యిట్లు ఋగ్వేదమునుండి గాంధర్వశాస్త్రమువరకు గల సమస్తవిద్యలను నేను బాగుగా నెఱుగుచున్నాను. అయినను ఆ వేదముల తాత్పర్యరూపమగు మోక్షసాధనమేదిగలదో, దానిని నేనెఱుగను, ఓ భగవంతుడా! వేదార్థమును నేను సామాన్యముగ నెఱుగుదును. కాని ఆ వేదముల తాత్పర్యవిషయభూతమగు ఏ అద్వితీయాత్మగలదో, దానిని నేనెఱుగను, కనుక నేను కేవలము మంత్రపాఠిగా నున్నాను. ఓ భగవంతుడా! ఆత్మను యెఱిగిన వాడైన పురుషుడు, మూలకారణసహితముగ శోకమును తరింపుచున్నాడని పూర్వము మీవంటి మహాత్ముడగు పురుషునివలన నేను శ్రవణము చేసితిని. ఓ భగవంతుడా! ఎట్లు త్రికోణాగ్నిగుండమందు పడిన కుంటివాడు మహాశోకమును పొందుచున్నాడో, అట్లే అధ్యాత్మాదిత్రివిధతాపములు నన్ను సర్వదా శోకవిహ్వలుని చేయుచున్నవి. ఓ దీనదయాళుడవగు సనత్కుమారా! ఎట్లు పతివ్రతయగు నొకస్త్రీ చిన్నబాలకముగలదిగాను, ధనరహితముగాను, బాంధవాదిరహితముగాను, యౌవ్వనావస్థగలదిగానుండగా పతిమృతుడగుటచే, హాదైవమా! నాగతి యేమగునని యెట్లు నిరంతరము శోకించునో, అట్లే నేను హాదైవమా! నాగతి యేమగునని నిరంతరము శోకించుచున్నాను త్రివిధతాపములకు వశమగుచున్నాను విచారహీనులగు పురుషులచే దుస్తరమైనట్టి ఈ శోకసముద్రమందు మునుగుచున్నాను. ఇటువంటి అనాథుడను దీనుడనైన నన్ను దయచేసి మీరే శోకసముద్రమునుండి దాటింపుడు. హే శిష్య!

యీ ప్రకారమగు నారదమునియొక్క దీనతాపూర్వకవచనముల శ్రవణముఁజేసి భగవంతుడైన సనత్కుమారుడు ఆ నారదునకు స్థూలారుంధతీన్యాయముగ యిట్లాత్మస్వరూపబోధనచేయ నారంభించెను

హే నారదా! పూర్వోక్తములగు యెన్నిశాస్త్రముల నే నెఱిగితినో, ఆ సమస్త శాస్త్రములు శబ్దరూపములే యైయున్నవి ఏలాగుననగా — సంపూర్ణప్రపంచమున యేకదేశరూపములగు యెన్ని వస్తువులు గలవో, ఆ సకల వస్తువులను యీ వాగింద్రియము నామముచే కథనము చేయుచున్నది ఒకచో లోకమందు నామము లేనిపక్షమందు, ఎవడైనను యేదైనవస్తువును చెప్పుటకు శక్యుడుకాడు నామముచేతనే సకల వ్యవహారములు నడచుచున్నవి కనుక నామము సకలవస్తురూపముగనున్నది. యిటువంటి నామమును నీవు బ్రహ్మరూపముగ చింతనముచేయుము హే నారద! నీ చిత్తము ద్వైతవాసనలచే నిండియున్నది ఎపుడు నీవా అపూర్వాభ్యాసస్థితములగు నామములందు బ్రహ్మభావన చేసెదవో, అపుడే నీ చిత్తము సాక్షాద్బ్రహ్మము నెఱుగుటకు యోగ్యమగును. హే నారద! యీ లోకమందు యే పురుషుడు సమస్త శబ్దరూప మంత్రములను బ్రహ్మరూపముగనుపాసనచేయునో, ఆ పురుషునకు నామసంబంధ సకల జగత్తునందు, స్వతంత్రతారూప ఫలప్రాప్తియగును. (మహారాజు తన దేశమందు స్వతంత్రుడైయుండునట్లు) నారదుడు — హే భగవన్! ఈ శబ్దరూపనామమందు బ్రహ్మదృష్టిగల్గియుండినమాత్రమున శోకనివృత్తికాదు. కనుక నామముకన్నను అధికమైన వస్తువును నాకు కథనము చేయుము. హే శిష్య! యీ ప్రకారముగ నారదముని యడిగినపుడు, భగవంతుడైన సనత్కుమారుడు నారదునిగూర్చి పూర్వపూర్వములకంటె ఉత్తరోత్తరముల యధికతను నిరూపణచేయుచు, వాగింద్రియమునుండి ఆశాపర్యంతము త్రయోదశతత్త్వముల వర్ణనము చేయుచున్నాడు. హే నారద! శబ్దరూప నామమును వాగింద్రియము చెప్పుచున్నది. కనుక శబ్దముకన్నను వాగింద్రియ మధికము. వాగింద్రియమును యిచ్ఛారూపమనస్సు ప్రేరణచేయుటవలన వాక్కుకన్నను మనస్సధికము ఆ యిచ్ఛారూపమనస్సును సంకల్పరూపాంతఃకరణవృత్తి పుట్టించునుగనుక, సంకల్పవృత్తి యిచ్ఛకంటె నధికము. అనుసంధానరూప చిత్తము సంకల్పవృత్తికన్న నధికము. చింతారూపధ్యానము స్మృతిరూపానుసంధానమునకు జనకమగుటవలన, ఆ చింతనరూపధ్యానము చిత్తముకన్ననధికము. ఏ వస్తువును విశేష జ్ఞానము విషయముచేయుచున్నదో, ఆ వస్తువుయొక్కయే ధ్యానము సంభవించును ధ్యానముకన్న విశేషజ్ఞానరూపవిజ్ఞానమధికము. అన్నభక్షణముచే పుట్టినదైన అవయవవృద్ధిరూప బలయుక్త మననముచే, విజ్ఞానము సిద్ధించుటవలన భూమిరూపాన్నము విజ్ఞానముకంటె నధికము. ఆ యన్నము జలముచే పుట్టుటవలన జలము దానికంటె

నధికము. తేజోరూప ఉష్ణత యధికమైనపుడు జలసృష్టి యగుటవలన జలముకన్నను తేజమధికము ఆకాశము తేజమునకాధారమగుటవలన. తేజముకన్నను ఆకాశమధికము (యిచ్చట వాయువు తేజమందంతర్గతము) సుషుప్త్యంతమందు పూర్వదృష్ట ఆకాశముయొక్క స్మరణమగుచున్నది గనుక ఆ స్మరణము ఆకాశముకన్న అధికము మఱియు యీ కార్య మీప్రకార మీప్రకారముగ కావలెనను నీ ప్రకారముగల యే యాశ గలదో, ఆయాశ స్మరణమునకు కారణమగుటవలన ఆయాశ స్మరణముకన్న నధికము.

హే శిష్య! ఈ ప్రకారముగ భగవంతుడైన సనత్కుమారుడు నారదునకు వాక్కునుండి ఆశపర్యంతముగల త్రయోదశతత్త్వములందు యొకదానికన్న నొకదాని యధికతచెప్పి వాటిఫలాధికతయు నిట్లు చెప్పుచున్నాడు హే నారదా? నామమునకు బ్రహ్మరూపోపాసనకు, యెట్లు సర్వత్ర స్వతంత్రతయను ఫలము గలదో, అట్లే వాగాదీంద్రియోపాసనకును, అదే స్వతంత్రతాఫలము గలదు. మనోరూపబ్రహ్మోపాసనకు దానికన్న అధికఫలముగలదు. సంకల్పవృత్తిని బ్రహ్మరూపముగ నుపాసనచేయువాడు దుఃఖరహిత, నాశరహితలోకమును పొందును. అనుసంధానరూపముచే చిత్తమును బ్రహ్మరూపముగ నుపాసనచేయువాడు దానికన్న అధికఫలమును పొందుచున్నాడు. ధ్యానముగ నుపాసనచేయువాడు, చిత్తోపాసకునికన్నను అధికఫలమును పొందుచున్నాడు. విజ్ఞానోపాసకుడు ధ్యానోపాసకునికన్నను అధికఫలమును అనగా- శాస్త్రార్థమునకు విషయముచేయునట్టి జ్ఞానమును పొందుచున్నాడు. విజ్ఞానముకన్న బలము శ్రేష్ఠమగుటవలన, బలమును బ్రహ్మరూపముగ నుపాసనచేయువాడు, బలయుక్తములగు సర్వలోకములను పొందును బలముకన్నను అన్నము శ్రేష్ఠమగుటవలన అన్నోపాసకుడు నానాప్రకార అన్నపానయుక్తమగు లోకమును పొందుచున్నాడు. జలము అన్నముకన్నను అధికమగుటవలన జలమును బ్రహ్మరూపముగ నుపాసించువాడు, సర్వకామనయొక్క విషయమును పొందుచున్నాడు మఱియు సర్వదా తృప్తిగలవాడగుచున్నాడు, జలముకన్నను తేజమధికమగుటవలన తేజోపాసకుడు, తేజోరూపుడై, శ్రీమంతుడై ప్రకాశమానుడగుచున్నాడు. మఱియు దోషరహితుడుగానగును. తేజముకన్నను ఆకాశమధికమగుటవలన ఆకాశోపాసకుడు, విస్తారప్రకాశముచే యుక్తమైన కీర్తిమంతమగు లోకమును పొందును ఆకాశముకన్నను స్మరణమధికమగుటవలన, స్మరణోపాసకుడు స్మరణమునకు విషయభూతములైన సకలపదార్థములందలి స్వాతంత్ర్యరూపఫలమును పొందును. స్మరణకన్నను ఆశఅధికమగుటవలన ఆశను బ్రహ్మరూపముగ నుపాసనచేయువాడు సకలమనోవాంఛితపదార్థములను పొంది సత్యసంకల్పుడగును.

హే శిష్య! ఆ నారదముని సనత్కుమారునిగూర్చి, నామముకన్న నధికమేది? యిత్యాది త్రయోదశప్రశ్నలను చేసెను. సనత్కుమారుడున్ను నారదుని చిత్తమందు వాసక్తి జనించుటకొఱకు ఆ వాగాదిత్రయోదశతత్త్వములకు అచ్చుటచ్చటనే ఫలమును కథనముచేసెను. అనంతరము బుద్ధిమంతుడైన నారదముని యిట్లు ప్రశ్నకుచేసెను ఓ భగవంతుడా! కామనారూపాశకన్నను అధికమేదియగును? — సనత్కుమారుడు — హే నారదా! సర్వజీవులచే నాత్మరూపముగా నిశ్చయముచేయబడినదైన ప్రాణము ఆశకన్నను అధికమగును. ఎట్లు రథసంబంధ అరము చక్రనాభికి ఆశ్రితముగనుండునో, అట్లే యీ సంపూర్ణవిశ్వము ప్రాణమున కాశ్రితముగనుండెను. ఎందుకనగా - ప్రాణమే సర్వకారణరూపమైయున్నది. చూడుము - దేవదత్తుడు అశ్వముచే గ్రామమునకు గమనము చేయుననుచోట, గమనక్రియకు కర్తయైన దేవదత్తుడును గమనక్రియకు కరణమైన అశ్వమున్ను, గమనక్రియకు కర్మమైన గ్రామమున్ను యీ మూడును ప్రాణరూపములే యైయున్నవి. మఱియు ఈ పురుషుడు, సుపాత్రుడగు బ్రాహ్మణునకు గోదానమిచ్చుచున్నాడను చోటనుగూడ, దానరూపక్రియకు కర్తయైన పురుషుడు, కరణమగు బ్రాహ్మణుడు కర్మయగుగోవు, యివన్నియు ప్రాణరూపములే యైయున్నవి. మఱియును, పితృ మాతృ అచార్య భ్రాతృ, స్వసా, స్నుషా, జాయా పుత్రాది, దేహధారులగు జీవులెందఱుగలరో, ఆ సమస్త జీవులు ప్రాణరూపులైయున్నారు. ప్రాణముకన్న భిన్నమగు యేపదార్థము లోకమందులేదు. యీ అర్థమునే అన్వయవ్యతిరేకముగ చూడుము — ఎపుడు యెవడైన పురుషుడు తన మాతాపిత్రాదుల శరీరములను, వాక్కుచే తిరస్కారము చేయుచున్నాడో, అపుడా పురుషుని యితర బుద్ధిమంతులిట్లు నిందచేయుచున్నారు నీవు మాతాపిత్రాది మహాపురుషులను, వాక్కుచే తిరస్కారముచేయుచున్నావు. గాన నీవు మహాపురుషుల వధనుచేయుచున్నావు. ఏలాగుననగా — నిరాదరముచేయుట శస్త్రరహిత వధయగును. మఱియు మాతాపిత్రులప్రాణము శరీరమునుండి నిర్గమనమైన తరువాత ఎపుడా పురుషుడు మాతాపితృల శరీరములను ప్రజ్వలితాగ్నియందు దహనముచేయుచున్నాడో, అపుడాతనిని జనులు పుణ్యకర్త పితృభక్తుడనుచున్నారు. దీనివలన ఈ ప్రాణమే పితృమాతృరూపముగ సిద్ధించుచున్నది.

హే నారదా! బాహ్యమైన చక్షురాదీంద్రియములచే, నెంతవ్యవహారమగుచున్నదో, అంతరములైన మనోబుద్ధ్యాదులచే నెంత వ్యవహారమగుచున్నదో, ఆ సంపూర్ణ వ్యవహారము ప్రాణముచే నగుచున్నట్లు యే పురుషుడు చూచుచున్నాడో, ఆ పురుషుడు యతివాదియగుచున్నాడు. అభిప్రాయము — లోకమందెపుడొక పురుషుడు మఱియొక పురుషునిగూర్చి నేను నీతండ్రిననుచున్నాడో, అపుడాతనినిగూర్చి, నీవు మర్యా

దాతి క్రమణముజేసి భాషణముచేయుచున్నావు అని యితరజనులు దోషము చెప్పుదురు. ఆ పురుషుడు నేను నీపితననుటచే ముఖ్యాతివాదికూడా కాడు మఱేమనిన గౌణాతి వాదియే అగుచున్నాడు యెందుకనగా పితకన్నకూడ అధికులైన ఆచార్యాది అనేక జనులు గలరు మఱియు ఒక పురుషుడు పితామాత్రాదిసకలజనులను 'నేను మీ ప్రాణము'ని యిట్లు పల్కినపక్షమందు అతడే ముఖ్యాతివాది అనబడును. హే నారదా! ఆ ప్రాణాత్మవాదియగు పురుషునిగూర్చి యెవ్వడైన పురుషుడు నీవు అతివాదివా? అని ప్రశ్నచేసినపుడు ఆ ప్రాణాత్మవాది 'నేనతివాదినికా'నని యెప్పటికి చెప్పడు. 'ఔనౌను నేనతివాదినే'యని నిశ్శంకముగ జెప్పును.

హే శిష్య! సనత్కుమారభగవంతునిచే నెపుడు నారదునకు ప్రాణముయొక్క ఆధిక్యత కథనము చేయబడినదో, అపుడా నారదుడు ప్రాణముకంటెను శ్రేష్ఠత్వ మడుగుట కసమర్థుడై, తూష్ణీంభావమునుపొంది ప్రశ్నచేయుటనుండి ఉపరామమును పొందుచున్నాడు. ఎందుకనగా — ఏ పురుషునకేపదార్థముయొక్క సామాన్యరూప జ్ఞానమగునో, ఆ పురుషుడాపదార్థసంబంధవిశేషరూపము నెఱుగుటకొఱకు ప్రశ్న చేయును. సామాన్యజ్ఞానముగాకున్న విశేషరూపసంబంధప్రశ్నకానేరదు. ఎట్లనగా— యితడు బ్రాహ్మణుడు యిటువంటి సామాన్యజ్ఞానమైన పిదప యితడు ద్రావిడుఁడా? గౌడుఁడా? యను విశేషజాతి సంబంధప్రశ్నయగును ఈ ప్రసంగమందును ప్రాణము కన్న పరమగు యేతత్త్వముగలదో ఆ తత్త్వము మనస్సునకును, వచనమునకును, ప్రత్యక్షాది ప్రమాణమునకును అవిషయమగుటవలన, వానివి సామాన్యరూపము చేతను నారదముని యెఱుగడు అందువలన నారదముని తత్త్వసంబంధవిశేషప్రశ్న చేయకుండె శిష్యుడు — హే భగవన్! నారదముని ప్రాణోపాసనకు ఫలమును యెందులకడుగలేదు? గురువు హే శిష్య ప్రాణోపాసనచేయుమని భగవంతుడు చెప్పలేదు నారదుడడుగలేదు. తరువాత నారదముని తూష్ణీంభావముగ నుండుట చూచి సనత్కుమారుడు కృపావిష్టుడై ఆ మునికి ప్రాణాత్పరమైన తత్త్వము ననుగ్రహించుట కారంభించుచున్నాడు — సనత్కుమారుడు — హే నారద! ప్రాణముకన్నను సద్వస్తువొకటి అధికముగనున్నది కనుక ప్రాణజ్ఞానముచే అతివాదిత కానేరదు మఱేమనిన — ఆ యత్యంతశ్రేష్ఠమైన, సత్యవస్తువుయొక్క కథనమే అతివాదితమైయున్నది. దాని కథనముచేయువాడే ముఖ్యాతి వాదియగును. హే నారద! ప్రాణముకన్నమ పరమైన సత్యవస్తువేది గలదో అదియే నీ వెఱుగుటకు యోగ్యమై యున్నది. ఆ సత్యవస్తువుయొక్క విచారములేకనే నీవునన్ను కృతకృత్యుడవని యెఱుగకుము. హే శిష్య! యీ ప్రకారముగ సనత్కుమారునిచే చెప్పబడిన విచార మును విని నారదముని ఆ భగవంతుని పూర్వమువలె ప్రశ్నచేయ నారంభించెను.

హే భగవన్! ఆ సత్యవస్తువు నెఱుగుటకై నేను కోరుచున్నాను. దయచేసి నామా సద్వస్తువుయొక్క ఉపదేశము చేయుము హే శిష్య యీ ప్రకారమగు నారదముని యొక్క ప్రార్థనవిని భగవంతుడైన సనత్కుమారుడు, (1) విజ్ఞానము (2) మననము, (3) శ్రద్ధ (4) నిష్ఠ (5) కృతి (6) సుఖము యీ ఆరుపదార్థములగూర్చిన జిజ్ఞాసను కలుగజేయునట్టి భాషణమును చేయుచున్నాడు. ఆ సనత్కుమారుని భాషణమును విని నారదముని ఆ ఆఱుపదార్థముల సంబంధమగు ఆఱు ప్రశ్నలను వేఱువేఱుగ జేయుచున్నాడు ఇట ఆనందస్వరూపసద్వస్తువు ఉపేయమైయున్నది. (ఉపాయముచే ప్రాప్తముగునది ఉపేయము) మఱియు విజ్ఞానాదులైదున్ను యుపాయములై యున్నవి వాటిలోను పూర్వపూర్వమైనవి. ఉపేయము ఉత్తరోత్తరమైనది ఉపాయము కాబట్టి ఒకేపదార్థమును ఒక్కసారి ఉపేయమనుట మరొకసారి ఉపాయమనుట విరోధము కాదు. సనత్కుమారుడు — హే నారద! (1) ఏ పురుషుడు సత్యస్వరూపబ్రహ్మమును ప్రత్యక్షముగ నెఱుగుచున్నాడో, యతడే యద్దానిని స్పష్టముగ కథనము చేయుచున్నాడు. ఇవ్విధమున ఆ సత్యవస్తువుయొక్క కథనమందు సత్యవస్తు సంబంధ ప్రత్యక్షప్రమాణరూపవిజ్ఞానమే కారణమైయున్నది (2) మఱియు నానా ప్రకార యుక్తులచేత మననముచే నెపుడు సత్యవస్తురూపప్రమేయసంబంధఅసంభావనాదుల నివృత్తముచేయుచున్నాడో, అపుడే సత్యవస్తువుయొక్క విజ్ఞానమగుచున్నది. కనుక ఆ మననము విజ్ఞానమునకు కారణమై యున్నది (3) గురుశాస్త్రోపదేశమందు విశ్వాసరూపశ్రద్ధయే మనుజుని మననమందు ప్రవృత్తము చేయుచున్నది. గనుక శ్రద్ధ మననమునకు కారణము, (4) యీ వేదాంతశాస్త్రము జీవబ్రహ్మల అభేదమును కథనము చేయుచున్నదా? అథవా భేదమును కథనము చేయుచున్నదా? అను నీ ప్రకారముగల, ప్రమాణాసంభావనను నివృత్తముచేయునట్టిదైన, అద్వైతబ్రహ్మంబునందు వేదాంతతాత్పర్యమును నిశ్చయము చేయించునట్టివైన యుక్తులకు నామము నిష్ఠ యిటువంటినిష్ఠగల పురుషుడే శ్రద్ధగలవాడగును, నిష్ఠారహితునకు శ్రద్ధగల్గదు. కనుక నిష్ఠయే శ్రద్ధకు కారణము (5) యజ్ఞాదిబహిరంగసాధనలు శమాదిఅంతరంగ సాధనలు యీ రెంటియొక్క అనుష్ఠానమునకు నామము కృతి-ఏ పురుషుడు కృతియుక్తుడగునో, ఆ పురుషుడే అంతఃకరణశుద్ధి ఏకాగ్రత గలవాడై నిష్ఠాపరుడగును. కృతిలేక నిష్ఠజరుగదు. కనుక కృతియే నిష్ఠకు కారణము. (6) మఱియు హే నారదా! లోకమందేపురుషుడు సుఖరూపపురుషార్థమును కోరుచున్నాడో, ఆ పురుషుడే బహిరంగాంతరంగ సాధనలజేయును సుఖేచ్ఛలేనివాడు వాటియందు ప్రవృత్తుడు కాడు. దుఃఖాభావమును కోరికచేతను ప్రవృత్తియగుచున్నను, ఆ దుఃఖాభావము స్వతః

పురుషార్థరూపము కాదు మఱేమనిన అది సుఖాభివ్యక్తికి సాధనమగుటవలన, జీవుల యిచ్ఛకు విషయమగుచున్నది దానివలన తెలియబడుచున్నదేమనగా సుఖమే ఆ కృతికి సాధనమైయున్నది హే శిష్య! యీ ప్రకారమగు భగవంతుని వచనము విని సాంసారిక సుఖమునుండి విరక్తుడైన ఆ నారదముని సాంసారిక సుఖమును దుఃఖరూపముగ భావించి ముఖ్యసుఖవిషయమందు తన జిజ్ఞాసను ప్రకటితమొనర్చుచున్నారు.

నారదుడు — హే భగవన్! నాకు మోక్షముకావలెనను కోరికగల పురుషులచే సుఖసంబంధవాస్తవస్వరూపము ఆవశ్యముగ నెఱుగబడవలసినది. ఓ భగవంతుడా! ఏ సుఖముయొక్క జ్ఞానముచే మోక్షప్రాప్తియగునో ఆ సుఖము సంసారమందు ప్రసిద్ధమైయుండలేదు. కనుక సంసారమందు జీవులకు విషయమునుండి ప్రాప్తమైన సుఖము సుఖరూపముగాదు అది దుఃఖరూపమే యైయున్నది. ఎలాగుననగా — ఏ వస్తువునకు యే స్వభావము కలదో, ఆ స్వభావమెప్పటికిని అన్యథా కాదు. (అగ్నియొక్క యుష్ణతాస్వభావమువలె) విషయజన్యసుఖము వాస్తవముగా సుఖరూపమైన పక్షమందు అది యే కాలమందును దుఃఖరూపముగా నుండవలసియుండె అట్లు కనబడుటలేదు విషయజన్యసుఖము తన అప్రాప్తికాలమందును వియోగకాలమందును, దుఃఖప్రాప్తిచేయుచున్నది ఏది అంతమందు దుఃఖరూపమో అది మధ్యకాలమందును దుఃఖరూపమేయగును. ఓ భగవంతుడా యిటువంటి దుఃఖరూప విషయసుఖమందు, జీవులకే సుఖప్రతీతి యగుచున్నదో, అది కేవలమజ్ఞానవశమున ప్రతీతమగుచున్నది. ఎట్లు శస్త్రసంబంధప్రహారము, దుఃఖరూపముగనుండినను పరిపక్వవ్రణముమీద ఆ ప్రహారము సుఖరూపముగ ప్రతీతమగుచున్నదో అట్లే యీ విషయజన్యసుఖమున్ను వాస్తవముగ దుఃఖరూపమైనను, అజ్ఞానవశమున జీవులకది సుఖరూపముగ ప్రతీతమగుచున్నది. ఓ భగవంతుడా! యేది వాస్తవసుఖమైయున్నదో దానినే నాకు కథనముచేయుము. సనత్కుమారుడు హే నారద దేశపరిచ్ఛేదము కాలపరిచ్ఛేదము. వస్తుపరిచ్ఛేదము అను నీ పరిచ్ఛేదత్రయము లేని వస్తువునే విద్వాంసులు సుఖరూపమనుచున్నారు ఆ పరిచ్ఛేదత్రయరహితవస్తువు శ్రుతియందు "భూమ" నామముచే కథనము చేయబడియె ఆ భూమాపదార్థమునే నీవు యెఱుగుము. ఆ భూమకన్న భిన్నములగు సకలపదార్థములు దుఃఖరూపములేయైయున్నవి హే నారద! నీవు వాస్తవసుఖనిర్ణయము కొఱకు ఆ భూమనే యిచ్ఛగింపుము.

హే శిష్య! యీ ప్రకారమగు భగవంతుని వచనమును శ్రవణముచేసి నారదముని యా సనత్కుమారునిగూర్చి భూమాసంబంధప్రశ్నయే చేయుచున్నారు. పిమ్మట సనత్కుమారుడిట్లు వచించెను హే నారద! ఏ తత్త్వమందు స్థితుడై విద్వాంసుడు

తన కన్నభిన్నరూపముగ నే పదార్థమును చూడఁడో, ఏ పదార్థమునువినఁడో, మనస్సు చేతను దేనిని నెఱుఁగఁడో, ఆ తత్త్వము 'భూమ' శబ్దమునకర్థము. మఱియు నదియే సుఖశబ్దమున కర్థమైయున్నది హే నారద! యే పదార్థాకారబుద్ధియందు ఆరూఢుఁడైన పురుషుఁడు తనకన్న భిన్నమగు బదార్థమును నేత్రముచే చూచుచున్నాఁడో, శ్రోత్రముచే వినుచున్నాఁడో మనస్సుచే నెఱుఁగుచున్నాఁడో — పదార్థము అల్పముగాను దుఃఖముగాను నున్నది శ్రుతి 'ద్వితీయాద్వైభయంభవతి,' హే నారద! నీకు నేను సుఖరూపమైన యే భూమను కథనముచేయుచున్నానో, ఆ భూమ మరణాది సకలవికారములచే రహితమగుటవలన అది అమృతరూపమై యున్నది మఱియు ఆ భూమ కన్న భిన్నములగు యెన్ని అల్పపదార్థములు గలవో, అవి మరణాది సకలవికార సహితములగుటవలన మర్త్యరూపములై యున్నవి

హే నారద! యిటువంటి సుఖరూపమగు భూమను, యెపుడధికారియగు పురుషుఁడు. గురుశాస్త్రోపదేశముచె నెఱుఁగుచున్నాఁడో, అపుడాతఁడు ముఖ్యాతివాదియగుచున్నాఁడు ఆ భూమకన్న భిన్నములైన ప్రాణాదుల జ్ఞానముచే మనుజుఁడు ముఖ్యాతివాది కానేరఁడు. — నారదుఁడు హే భగవన్! ఆ సుఖరూపభూమ యే యాధారముపై స్థితమై యున్నది? సనత్కుమారుఁడు, హే నారద! ఆ భూమకు నీవేయాధారము నడుగుచున్నావో, అది వ్యవహారమునకు నుపయోగమాత్రమైన ఆధారమా? అథవా వాస్తవమగు నాధారమా? అట ప్రథమపక్షమంగీకరించినపుడు. మాయ మొదలగు సకల ప్రపంచము భూమకు విభూతియై యున్నది. ఆ విభూతిరూపమహిమయందే ఆ భూమ స్థితమైయున్నది. కనుక ఆ మహిమయే భూమకు ఆధారమగును. నారదుఁడు హే భగవన్! లోకమందు విభూతిరూపమహిమకును విభూతిగలవానికిని పరస్పర భేదమే కన్పడుచున్నది కనుక విభూతిరూపమహిమకన్న భిన్నమైన ఆ భూమ, ఘటాదులవలె వస్తుపరిచ్ఛేదముగలదియే యగునుగదా? సనత్కుమారుఁడు—హే నారద. లోకమందు దేవదత్తుఁడను పురుషునకు గోఅశ్వహిరణ్యభార్య క్షేత్రగృహాది విభూతి యేతికలదో, ఆ విభూతిరూపమహిమ దేవదత్తునికన్న భిన్నముగాను దేవదత్తుఁడు మహిమకన్న భిన్నుఁడుగాను, ప్రతీతుఁడగుచున్నాఁడు. అట్లే యిచ్చటనుగూడ మాయా సహితప్రపంచరూపమహిమ సుఖరూపభూమకన్నభిన్నము కాదు అభిన్నమేయై యున్నది. కనుక భూమయందు వస్తుపరిచ్ఛేదములేదు నారదుఁడు — హే భగవన్. ఒకచో మహిమకన్న విభూతి అభిన్నమైన పక్షమందు ఆధారాధేయభావము కానేరదు! ఎందుకనగా లోకమందు పరస్పర భిన్నపదార్థములకే ఆధారాధేయభావమగుచున్నది కదా! సనత్కుమారుఁడు — హే నారద! ఎట్లు "స్వయందాసాస్తపస్వినః" అనగా తపస్వియగు పురుషుఁడు, తనకుదాను దాసుఁడగుచున్నాఁడు, అను నీస్థలమందు ఒకఁడే

యైన తపస్వియందు ఎట్లు స్వామిసేవకభావమగుచున్నదో, అట్లే సుఖరూపభూమకున్ను సర్వపరిచ్ఛేదరహితమైన మహిమయందు వ్యవహారదృష్టిచే స్థితి యగుచున్నది. శాస్త్రవాధారమను రెండవ పక్షమంగీకరించిన అది సంభవింపదు ఎందుకనగా — పూర్వోక్తమహిమాస్వరూపముకన్న భిన్నపదార్థమందో ఆ భూమ యెప్పటికినుండదు మహిమయందు స్థితమైయున్నదనియు వ్యవహారదృష్టిచేతనే చెప్పబడినది. ఆ వ్యవహారదృష్టిని పరిత్యాగముచేసినపుడు ఆ భూమను, నిరాధారముగానే కథనము చేయవలసినది. ఇపుడు నిరాధారమగు భూమ యేరీతిగా బుద్ధియందారూఢమగునా? యను యిటువంటి నారదుని శంకను నివృత్తము చేయుటకొఱకు మొదట ఆ భూమను తత్పదార్థరూపముగ వర్ణనము చేయుచున్నారు.

హే నారద! ఇదంతాపదార్థరూపమగు భూమ దశదిశలందు స్థితమైయున్నది. ఎట్లు నిర్మలాకాశమందు గంధర్వనగరము కల్పితమగుచున్నదో, అట్లే నిర్మలమైన నీ భూమయందు దేశకాలాది సకలసూక్ష్మస్థూలపదార్థములు కల్పితములగుచున్నవి. కల్పితవస్తువు అధిష్ఠానముకన్న భిన్నముకాదు కనుక ఆ భూమయే సకలజగద్రూపమై యున్నది. ఇటువంటి భూమను నీవు స్వబుద్ధియందు ఆరూఢముగ చేయుము. అనంతరము ఆ భూమసంబంధతటస్థరూపతను నివృత్తముచేయుటకొఱకు ఆ సర్వత్రవ్యాపకమగు భూమ "నేనుగానున్నాను" అను నీ ప్రకారము ఆ భూమను నీవు నీ ఆత్మరూపముగ నెఱుగుము. నారదుడు — హే భగవన్! పరిచ్ఛిన్నాహంకారవాచకమగు ఏ అహంశబ్దముకలదో ఆ అహంశబ్దమును వ్యాపకమైన భూమయందు ప్రయోగము చేయుట సంభవింపదు సనత్కుమారుడు — హే నారద! అహంశబ్దముచే అహంకారముయొక్క ప్రతీతియగుచున్నను అహంకారమునకు భూమతోటి సాదృశ్యముగలదు ఆ సాదృశ్యమును గ్రహణముచేసి గౌణలక్షణముచే ఆ అహంశబ్దము భూమను బోధన చేయుచున్నది ఇపుడు అహంకారమునకును భూమకును సాదృశ్యము చూడుము — అష్టదిశలందును త్రికాలమందును స్థితులైన యెందఱు దేహధారులగు జీవులుగలరో, ఆ సమస్తజీవులు మొదట "నేను" అను యీ ప్రకారమగు అనుభవమునుజేసియే వెనుక వచనోచ్చారాది వ్యవహారముచేయుచున్నారు. నేనను అనుభవము గాక యేయొక వ్యవహారమున్ను సిద్ధింపదు. దానివలన అహంకారమే సకల వ్యవహారములకు కారణమని తెలియుచున్నది యిటువంటి వ్యవహారకారణభూతాహంకారము, సకలదిశలందును, సకలభూతప్రాణులందును, వ్యాపకమైయున్నది. ఈలాగున అహంకారమునకును, భూమకును, సర్వత్రవ్యాపకతారూపసాదృశ్యముగలదు ఆ సాదృశ్యమంగీకారముజేసి ఆ అహంశబ్దము లక్షణావృత్తిచే సకలోపాధిరహిత కూటస్థాత్మను బోధనచేయుచున్నది. ఆ కూటస్థాత్మకు, తత్పదార్థరూప భూమతోటి

యభేదము, 'తత్త్వమసి' మహావాక్యముచే ప్రతిపాదనము చేయబడియె ఆ అభేద జ్ఞానమునకు ముక్తిరూపఫలము గలదు — హే నారద! ఎట్లు అజ్ఞానియగు పురుషుడు, నేత్రాదీంద్రియములచేతను, మనస్సుచేతను, నానావ్యవహారములు చేయుచున్నను తన మనుష్యతను విస్మరింపడో, అట్లే యే పురుషుడు గురుశాస్త్రోపదేశముచే, అహంకారాద్యుపాధులను విస్మరణముజేసి 'నేను ఆత్మను' 'భూమారూపుడను', అను నీప్రకారముగ సంశయ విపర్యయ రహితమైనట్టి జ్ఞానమును పొందుచున్నాడో, ఆ విద్వత్పురుషుడు, వేదాంతచర్చచింతనా కాలమందు, ఆనందరూపాత్మయందే క్రీడించుచు స్థితుడగుచున్నాడు. ఎట్లు బాలకుడు - బాలకసముదాయమందు క్రీడచేయుచుండ స్థితుడగుచున్నాడో, అట్లే యీ విద్వత్పురుషుడున్ను, స్నానభోజనాదులకాలములందును ఆనందరూపాత్మయందే, చిత్తశక్తిరూపరతిని ధారణము చేయుచు స్థితుడగుచున్నాడు. ఎట్లనగా కామియగు పురుషుడు, విదేశమందు స్థితుడైనను, చిత్తశక్తిరూపరతిని సర్వదా ప్రియస్త్రీలయందే నిలుపుచున్నాడు ఆ జీవన్ముక్త పురుషునకు ద్వివిధములగు దశలుగలవు ఒకటి సమాధిదశ, ఒకటి ఉత్థానదశ. ఆ యుత్థానదశయు ద్వివిధము — ఒకటి వేదాంతశాస్త్రచింతనరూపము. ఒకటి స్నానభోజనాది వ్యవహారరూపము అట వేదాంతశాస్త్రచింతనరూప ఉత్థానదశయందు, ఆ విద్వాంసుడు ఆత్మచింతన యేది చేయుచున్నాడో, ఆ యాత్మచింతనము శ్రుతిచే 'క్రీడా' శబ్దముచే కథనము చేయబడియె మఱియు స్నానభోజనాదిరూపమగు ఉత్థానదశయందుగల ఆత్మచింతనము శ్రుతిభగవతిచే 'రతి శబ్దముచే కథనము చేయబడియె. సమాధిదశయు ద్వివిధము. ఒకటి సవికల్పము, మరొకటి నిర్వికల్పము. అట సవికల్పసమాధియందు విద్వాంసుడు ఆత్మచింతనమేదిచేయుచున్నాడో, ఆ యాత్మచింతనము శ్రుతిభగవతిచే మిథునశబ్దముచే కథనము చేయబడియె మఱియు నిర్వికల్పసమాధియందు విద్వాంసుడు ఆత్మచింతనమేదిచేయుచున్నాడో, ఆ యాత్మచింతనమును శ్రుతిభగవతి 'ఆనంద' శబ్దముచే కథనముచేయుచున్నది ఇపుడు మిథునశబ్దార్థము చూపబడుచున్నది.

హేనారద! లోకమందు గృహసంబంధసకలవ్యవహారమును పరిత్యాగముచేసి యేకాంతదేశమందు స్థితులైన స్త్రీపురుషులకు పరస్పరమిధునీభావము కలదు ఆ మిధునీభావము పరస్పరమెట్లు విషయానందమునకు హేతువగుచున్నదో, అట్లే విద్వాంసునకు, ధ్యాతృ ధ్యాన, ధ్యేయభావముచే ఆత్మయందు యే మిథునీభావము కలదో, ఆ మిధునీభావమే విద్వాంసునకు, సవికల్పసమాధికాలమందు ఆనందమునకు హేతువగుచున్నది. మఱియు గానాదివిషయముల ప్రాప్తిమైన తరువాత, పరీక్షకపురుషునకు, గీతసంబంధమగు యేయానందరూపానుభవమగు

చున్నదో, ఆ యానందానుభవము నిర్వికల్పమేయగుచున్నది అట్లే విద్వాంసునకు నిర్వికల్పసమాధికాలమందు, ఏనిరతిశయానందానుభవమగుచున్నదో, ఆ యానందానుభవమున్ను ధ్యాతృధ్యానధ్యేయాది త్రిపుటిరహితవికల్పరహితమగు నిర్వికల్పమేయగుచున్నది హే నారద! ఆ విద్వాంసునకు ఆత్మయందు ఆనందమగుటకు కారణమేమనగా అద్వితీయాత్మను సాక్షాత్తుగ ననుభవముచేయుచుండ ఆ విద్వాంసుడు జన్మమరణాదిసకలదుఃఖనివృత్తియందు, రెండవదైన దేనియొక్కయు అపేక్షచేయడు. ఈ కారణమువలన ఆ విద్వాంసుడు విరాడ్భగవంతునివలె స్వరాట్ సంజ్ఞను బొందుచున్నాడు మఱియు నా విద్వాంసుడు బ్రహ్మరూపమగుటవలన సమస్తశ్రేష్ఠలోకములందు కామచారుడగుచున్నాడు. (ప్రతిబంధరహితముగ సకలలోకప్రాప్తియగుటకు నామము కామచారము) యిది భూమాత్మజ్ఞానఫలము — యిపుడు జ్ఞానరహితునకు అనర్థప్రాప్తి వచింపబడుచున్నది

హే నారద! ఏ మూఢపురుషులు భూమను ఆత్మరూపముగ నెఱుగరో, మోహవశులై భూమను తమకన్న వేరుగా నెఱుగుచున్నారో, ఆ మూఢపురుషులు సర్వదా పరాధీనతను పొందుచున్నారు నాశముగలలోకములకు పోవుచున్నారు మఱల మఱల జన్మమరణాదిదుఃఖములను పొందుచున్నారు.

ఇపుడు విద్వాంసుని యొక్క (అనగా జ్ఞానియొక్క) జగత్కర్తృత్వరూపమగు యీశ్వరత్వవర్ణనము గావింపబడుచున్నది. ఏ పురుషుడు పూర్వోక్తప్రకారముగ తత్పదార్థరూపమైన భూమను తన ఆత్మరూపముగ నెఱుగుచున్నాడో, ఆ పురుషుని వలననే రజ్జుసర్పన్యాయముగ నామము మొదలుకొని ప్రాణపర్యంతమగు పూర్వోక్త యావత్తత్వములు పుట్టుచున్నవి ఆ విద్వత్పురుషునిచేతనే యజ్ఞాదికర్మసహితమగు స్వర్గాదిఫలమును, మంత్రబ్రాహ్మణరూపములగు నాల్గువేదములున్ను పుట్టుచున్నవి. వేయేల - స్థూలసూక్ష్మసంపూర్ణజగత్తున్ను, ఆ విద్వత్పురుషునిచేతనే పుట్టుచున్నవి. హే నారద! భూమాసాక్షాత్కారపురుషునకు జన్మమరణాది నివృత్తిరూపఫలమేది నేను చెప్పుచున్నానో తద్విషయమందు వేదవేత్తలు మంత్రరూపమున నీ శ్లోకమును చెప్పుచున్నారు. 'న పశో మృత్యుం పశ్యంతి నరోగం నో నదుఃఖతాం సర్వం హపశ్య పశ్యతి సర్వమాప్నోతి సర్వశః' భావార్థము—జీవాత్మ జ్ఞానబలమున శుభాశుభసర్వ సంస్కారములను, మోక్షమును చూచుచున్నాడు యీకారణమువలన శ్రుతిభగవతి జీవాత్మను ' పశ్య" నామముచే కథనముచేయుచున్నది. మృత్యువని మరణమునకు నామము ఆ మృత్యుశబ్దముచే జ్వరాదిరోగములుతప్ప, జన్మాదిశరీర ధర్మములెన్నిగలవో అవన్నియు గ్రహింపబడుచున్నవి. జ్వరాదివ్యాధులకు రోగమని పేరు నారదుడు, హే భగవన్! మంత్రమందుగల మృత్యుశబ్దముచే, ఎట్లు జ్వరాది-

వికారములని గ్రహింపబడుచున్నదో, అట్లు జ్వరాదిరోగములనియు గ్రహింపబడు చున్నది. యిట్లుండ శ్రుతిచే రోగాదులు వేఱుగా యెందుకు చెప్పబడినవి? సనత్కుమారుడు - హే నారద! మరణము అల్పకాలస్థాయి జన్మమున్ను అల్పకాలస్థాయికాని జ్వరాదిరోగములు బహుకాల స్థాయియైయున్నవి. అందువలన జ్వరాదులు వేఱుగ చెప్పబడినవి. మఱియు జరాయుజాది చతుర్విధప్రాణులకు నానాప్రకారవిలక్షణబుద్ధులు కలవు. ఆ బుద్ధులందు ప్రతిబింబరూపములచే నానాప్రకారభేదముగల జీవులు గలరు ఆ జీవులకు జన్మాది నానాధర్మములుగల శరీరముతోటి అహంమమాధ్యాసరూప సంబంధము కలదు ఆ సంబంధముచే నానాదుఃఖములు సంప్రాప్తించుచున్నవి ఇటువంటి మరణాదివికారములను జ్వరాదులను పశ్యనామకుడైన విద్వత్‌జీవుడు చూడడు హే నారద! ఆ పశ్యనామకుడైన విద్వజ్జీవుడు మృత్యువు మొదలగువాటిని చూడకుండుటయందు కారణమేమనగా — స్థూలసూక్ష్మరూపముచే ప్రసిద్ధమైన యెంత ప్రపంచము గలదో, ఆ సంపూర్ణద్వైతప్రపంచము ఆత్మయందు కల్పితమై యున్నది ఆ కల్పితప్రపంచమును కల్పితమని యెంచునట్టి జ్ఞానమెంతవఱకు పుట్టలేదో, అంతవఱకు ఆ ద్వైతప్రపంచమునకు స్థితిగలదు. ప్రపంచము కల్పితమనునట్టి జ్ఞానము పుట్టినతర్వాత ఆ ప్రపంచమునుగూర్చిన దర్శనము మఱల కాదు ఈ ప్రకారముగ సకలద్వైతప్రపంచమును అధిష్ఠానాత్మయందు కల్పితరూపముగ చూచువాడైన విద్వత్పురుషుడు, మరణాది వికారములను చూడడు. భూమాత్మజ్ఞానానంతరము యీ సంపూర్ణజగత్తు ఆ భూమయందే అనన్యభావమును పొందుచున్నది ఆ అనన్యభావమే యీ జీవాత్మకు సకలజగత్ప్రాప్తిరూపమై యున్నది. ఎందుకనగా — సకల విషయములకు తాత్పర్యభూతమైన యే భూమాత్మగలదో, ఆ భూమాత్మయందే యీ సంపూర్ణ యజ్ఞాదిలోకాదిరూపవేదార్థము అంతర్భూతమైయున్నది. ఈ భూమకన్న భిన్నమగు యేయొక అర్థమున్ను వేదమునకులేదు. కాబట్టి యీ భూమయొక్క జ్ఞానముచే జీవాత్మ సకలపదార్థములను పొందుచున్నాడను నీ విషయము సంభవించుచున్నది

ఇపుడు ఉపాధిభేదముచే విద్వత్పురుషుల నానారూపత నిరూపణ గావింపబడుచున్నది. నేను భూమారూపుడనను నీప్రకారజ్ఞానముగల విద్వాంసుడు భూమాస్వరూపములో ఏకీభావము పొందినను, తనమాయచే నానారూపుడగుచున్నాడు. అట ఆ విద్వాంసుడు ఆత్మ మాయ మఱియు మాయాకార్యము ఈ మూడురూపములను గ్రహణముచేసినపుడు మూడుప్రకారములుగాను, ఆకాశాదిపంచభూతములను గ్రహణముచేసినపుడు అథవా శ్రోత్రాదిపంచజ్ఞానేంద్రియరూపములను గ్రహణముచేసినపుడు పంచరూపములుగాను, భూరాది సప్తలోకములను గ్రహణముచేసినపుడు

సప్తరూపములుగాను, ఆదిత్యాది నవగ్రహములను గ్రహణముచేసినపుడు నవరూపములుగాను ఏకాదశేంద్రియరూపములను గ్రహణముచేసినపుడు ఏకాదశరూపములుగాను ఒక్కొక్క యింద్రియమును దశదశవృత్తిరూపములుగ గ్రహణముచేసినపుడు దశాధికశతరూపములుగాను, శ్వాసోచ్ఛ్వాసరూపములను గ్రహణముచేసినపుడు ఏకవింశతి సహస్రషట్శతరూపములుగాను యగుచున్నాడు. ఈ ప్రకారముగ ఆ బ్రహ్మవిద్వత్పురుషుడు, వాస్తవముగ నొకే అద్వితీయబ్రహ్మరూపుడైయుండినను ఉపాధిభేదముచే నానాప్రకారమగుచున్నాడు — ఇపుడు ఆత్మజ్ఞానసంబంధఆహారశుద్ధ్యాదుల నిరూపణము గావింపబడుచున్నది. హే నారద! ఏ పురుషుడు, బాహ్యమున పుణ్యకర్మానుష్ఠానము చేయుచున్నను, మనస్సున సర్వదా పాపవాసనలు గలవాడో, అటువంటి పురుషునకు శతకోటిజన్మలందును అటువంటి సర్వాత్మజ్ఞానము అత్యంతదుర్లభముగ నున్నది ఎపుడు అంతరపాపవాసనా యుక్తుడగు పుణ్యపురుషునకే ఆత్మజ్ఞానమింత దుర్లభమై యున్నదో, అపుడు బాహ్యాంతరములందును సర్వదా పాపాచరణగల పురుషునకు ఆత్మజ్ఞానము దుర్లభమని వేరుగ చెప్పనేల? ఏ అధికారి పురుషులు ఆత్మసాక్షాత్కారజ్ఞానమును కోరుచున్నారో, వారు మొదట తమయొక్క చిత్తశుద్ధిగావించుకొనవలసినది. నారదుడు — హే భగవన్! చిత్తశుద్ధి యేరీతిగా నగును?

సనత్కుమారుడు — హే నారద! తమతమ వర్ణానుసారముగ ప్రాప్తములైన ఏ అన్నపానాది విషయములుగలవో ఆ విషయముల గ్రహించుటకు నామము ఆహారము, ఆ ఆహారము రాగద్వేషాదిరహితమగు బుద్ధిచే పాపరహితమై శుద్ధమైనపుడు, దానిచే ఆ పురుషునిచిత్తము శుద్ధమగుచున్నది ఆహారశుద్ధికాకున్న చిత్తశుద్ధి కానేరదు హే నారద! యెట్లు ఆహారశుద్ధిగల పురుషునకు, పాపకర్మమందు ప్రవృత్తిగానేరదో, అట్లే యే పురుషుడు బీజ యోని వ్యవహారములను నీమూడింటియొక్క శుద్ధిగలవాడగునో ఆ పురుషునకు ఆపత్కాలమందును పాపకర్మమందు ప్రవృత్తిగాదు ఇట పితృకులమునకు నామము బీజము, మాతృకులమునకు నామము యోని పదార్థగ్రహణత్యాగమునకు నామము వ్యవహారము, ఈ ప్రకారముగ ఆహార, వ్యవహార బీజ, యోనులను నీనాల్గింటియొక్క శుద్ధివలన మనుజుని చిత్తము శుద్ధియగుచున్నది ఏ పురుషునకు యెప్పటికిని పాపకర్మమందు ప్రవృత్తికాదో. మఱియు పాపకర్మమేచిత్తైకాగ్రతకు ప్రతిబంధకమగుచున్నదో ఆ పురుషుడెపుడు ఆహారాదుల శుద్ధిగావించునో, అపుడు పాపకర్మమునుండి రహితుడగును. అపుడే వానిచిత్తము ఏకాగ్రతను పొందును. ఇటువంటి చిత్తశుద్ధిగల పురుషుడు, బ్రహ్మవేత్తయగు గురువుయొక్క ఉపదేశముచే, శీఘ్రముగనే తన భూమాస్వరూపాత్మను సాక్షాత్కరించుకొనును.

ఎట్లు భిల్లులచే పాలనము చేయబడువాడైన ఒకానొక క్షత్రియరాజపుత్రుడు, మహాత్ము డగు పురుషునిముఖమున నీవు క్షత్రియ రాజకొమారుడవను నీ ప్రకారమగు వచనము వినుటతోడనే, తత్కాలముననే తన క్షత్రియస్వరూపమును స్మరణముచేయుచున్నాడో, అట్లే 'నీవు బ్రహ్మరూపుడవ'ను యీ ప్రకారమగు బ్రహ్మవేత్తయైన గురువుయొక్క వచనశ్రవణముచే, ఆ శుద్ధ చిత్తముగలవాడైన పురుషుడు శీఘ్రముగ తన బ్రహ్మ స్వరూపమును స్మరణము చేయుచున్నాడు. హే నారదా! ఏ పురుషుడు పూర్వపుణ్య ప్రభావముచే బ్రహ్మవిద్గురూపదేశమున, భూమాత్మయొక్క స్మృతిని పొందునో, ఆ పురుషుడాత్మజ్ఞానరూపఖడ్గముచే కామక్రోధాదిగ్రంథులను శీఘ్రముగ భేదనము చేయును. కనుక అధికారిపురుషులు భూమాజ్ఞానము నవశ్యముగ సంపాదనము చేయవలయును, ఇపుడా నారదముని యందలి బ్రహ్మవిద్యాధికారసంబంధ విశేష ముల నిరూపణము గావింపబడుచున్నది

హే శిష్య! ఆ నారదముని పూర్వోక్తమగు యాహారాదుల శుద్ధిచే శుద్ధచిత్తము గలవాడాయెను. కామక్రోధాధి రహితుడాయెను హే శిష్య! హరీతకి మొదలగు పదార్థములనుండి పుట్టినదైన రససంబంధముచే కుసుంభాదులయొక్క రంగు అత్యంత దృఢమగుచున్నది. ఆ రసమును బుద్ధిమత్పురుషులు కషాయమనుచున్నారు. ఆ కషాయరసమువలె యీ కామక్రోధాదివికారములున్ను చిత్తరూపవస్త్రమును రంజిత మొనర్చుచున్నవి. ఈ కారణమువలన కామక్రోధాదులను శాస్త్రవేత్తలు, కషాయనామ ముచే కథనము చేయుచున్నారు. వస్త్రస్థితకషాయరసమునకు క్షాలనాదులచే యెట్లు నివృత్తియగుచున్నదో, అట్లే కామక్రోధాదికషాయములకున్ను, బ్రహ్మచర్యాది సాధనములచే నివృత్తియగుచున్నది. నారదమునియో, బ్రహ్మచర్యాదిసాధనలచే సంపన్నులైయున్నాడు వైరాగ్యమున్ను గలవాఁడై యున్నాడు ఈ కారణమువలన శ్రుతిభగవతిచే యా నారదముని మృదితకషాయనామముచే కథనము చేయబడియె యిటువంటి నారదమునికి సనత్కుమారుడు, మూలాజ్ఞానరూపతమమునుండి భూమా రూపతటమును జూపుచున్నాడు. ఏ భూమయొక్క దర్శనముచే అధికారిపురుషులు మఱల సంసారశోకమును పొందరో, అటువంటి భూమాదర్శనమును నారదునకు కలుగజేసెను.

హే శిష్య! యే సనత్కుమారభగవంతుడు, నారదమునికి బ్రహ్మవిద్యోపదేశము చేసెనో, ఆ సనత్కుమారభగవంతుడే ద్వితీయజన్మమందు కార్తికేయస్వామియొక్క అవతారమును ధారణముచేసెను. ఈ యితిహాసమెఱిగినవారైన బ్రాహ్మణులు ఈ

దివ్యకథను చెప్పుచున్నారు శ్రవణముచేయుము. ఒకానొకకాలమందు యేదో ఒక నిమిత్తముచే అనేక మునిజనులు శ్రీ కాశీపురక్షేత్రమునకు వచ్చిరి. అచ్చట ఆ మునిజనులు ప్రాతఃకాలమున స్నానాదినిత్యకర్మములుకొలకై శ్రీ గంగాతటముమీద స్థితులై యుండిరి మఱియు అచ్చట ఆ మునిజనులు తమతమ బుద్ధ్యనుసారముగ పరబ్రహ్మ చింతనము చేయుచుండిరి ఆ కాలమందు శ్రీ భగవాన్ దేవీసహితముగ శ్రీ మహాదేవు డచటకేతెంచెను. శ్రీ మహాదేవుడు మునిజనుల ధ్యానమునకు విషయముగాకున్నను, మాంసమయనేత్రములకున్ను విషయముగాకపోయినను, దయగల్గి ఆ మునిజనుల మాంసమయనేత్రములకు విషయమాయెను. ఆ భవానీసహిత మహాదేవునిచూచి సకల మునిజనులు తమతమ ఆసనములనుండి లేచిరి అత్యంతహర్షమును వారు ప్రాప్తి నొందిరి ఎట్లు ప్రాణప్రవేశమగుటచే శరీరము లేచుచున్నదో, అట్లే హర్షనిర్భరులై శ్రీమహాదేవునిచూచి వారందఱును లేచి నిలువబడిరి. ఆ సకలమునిజనులందును ఒక్క సనత్కుమారుడే తన ఆసనమునుండి లేవలేదు. ఎందుకనగా — ఆ సనత్కుమారభగవంతుడు సర్వకాలమున్ను యొక అద్వితీయాత్మనే అంతర్బాహ్యములందు సర్వత్రపరిపూర్ణముగ చూచుచున్నారు. మఱియు నా కాలమందో యాతడు విశేషముగ సమాధియందు స్థితుడైయుండెను ఈ కారణమువలన ఆ సనత్కుమారుడు, మహాదేవునిచూచియు అభ్యుత్థానముచేయకుండె. సనత్కుమారుని వదలి యితర సర్వ మునిజనులు శ్రీ మహాదేవుని చూడగానే అభ్యుత్థానమొనర్చిరి భవానికిని శ్రీ మహాదేవునకును నమస్కారములు చేయదొడగిరి కొందఱు మునిజనులు వేదపారములు చేయ నారంభించిరి కొందఱు మునిజనులు స్తుతిచేయ నారంభించిరి. కొందఱు క్రొత్తక్రొత్త స్తోత్రములుచేయ నారంభించిరి కొందఱు ప్రాచీనపురుషులచే రచితములైన స్తోత్రముల పాడ నారంభించిరి ఈ ప్రకారము సకలమునిజనులు శ్రీ భవానీసహితుడగు శ్రీ మహాదేవుని ప్రసన్నునిగజేసి తమతమ ఆసనములపై కూర్చుండిరి ఆ మునిజనుల శ్రద్ధాభక్తినిచూచి అత్యంతప్రసన్నుడై శ్రీ మహాదేవుడు వారికి మనోవాంఛితవరముల నిచ్చెను అనంతరము భవానితోసహ శ్రీ మహాదేవుడు ఆ స్థానమునుండి వెడలుటకు సిద్ధుడై, సర్వమునిజనులను వారివారి స్థానములందు చూచిపోవుచుండగా, ఆ సమాజమందు సనత్కుమారుని ధ్యానమందు స్థితుడై యుండుటమచూచి, భగవంతుడైన మహాదేవుడు పరమహర్షమును పొందెను. ఐనను అభ్యుత్థానరహితుడైన యా సనత్కుమారునిజూచి శ్రీ భవానీదేవి హర్షమును పొందలేదు. మఱేమనిన ఆమె తన మనస్సులో విపరీతవిచారముచేసుకొని స్త్రీ స్వభావానురీతిగా కామక్రోధమును పొందెను. శ్రీ భవానీదేవి విచారమిది.

యితడు భగవంతుడైన మహాదేవుడు, అనాదిపురుషుడు ఈ మహాదేవుడు సర్వదా యోగులయొక్క హృదయమందు స్థితుడైయున్నాడు అష్టాంగయోగముచే యుక్తులగు పురుషులచే సర్వదా ధ్యానముచేయబడుటకు యోగ్యుడైయున్నాడు. ఈ మహాదేవుడు సకలవిద్యలకు పరమగురురూపుడుగానున్నాడు. మఱియు యెట్లు రాజాదిపురుషులు గృహములలో గర్భదాసులుగలరో అట్లే బ్రహ్మవిష్ణ్వింద్రలోకపాలాది సకలదేవతలును, యీ మహాదేవునకు గర్భదాసులుగ నున్నారు (కొని తీసుకొనినదాసియొక్క పుత్రాదులకు నామము గర్భదాసులు) యీ మహాదేవుడు తన సత్తాస్ఫూర్తిరూపధనమిచ్చి మాయారూపదాసిని తనవశముగ చేసికొనెను ఆ మాయా దాసియొక్క బిడ్డలగు బ్రహ్మాదిదేవతలు, ఆ మహాదేవునకు గర్భదాసులుగనున్నారు. మఱియు ఆ మహాదేవుడే మహదాదితత్త్వములకును స్థావరజంగమభూతములకును జనకుడుగానున్నాడు ఇట్లు మహదాదిభూతములను పాలనచేయువాడుగాను సంహారము చేయువాడుగానున్నాడు. ఈ మహాదేవునితో సమముగ పూర్వము ఎవడునులేడు. ముందు యెవడును ఉండబోడు, యిపుడు యెవడునులేడు సమానమగువాడే యెవడు లేడనిన యిక అధికుడెవడుండును ? మఱేమనిన మహాదేవుడే సర్వమునకన్న అధికుడుగనున్నాడు ఈ మహాదేవునిచే కామదేవుడు నాశనము చేయబడియె కనుక నీతడెపుడును బ్రహ్మచర్య ధర్మముగలవాడుగనున్నాడు ఇటువంటి జగద్గురువులైన మహాదేవుని స్త్రీయైన నాయొక్క సహితముగజూచి సనత్కుమారుడాతనిని స్త్రీ అధీనుడుగ నెఱుగుచున్నాడు ఈ సనత్కుమారుడు తన్ను బ్రహ్మచారిగా నెఱిగి మహాగర్వయుక్తుడైయున్నాడు ఈ కారణమువలననే యీతడు శ్రీమహాదేవునిజూచియు అభ్యుత్థానమును నమస్కారమును చేయకుండెను. కాబట్టి యీ సనత్కుమారునకు నేనే ఒక దారుణశాపమివ్వవలసినది.

హే శిష్య ! యీ ప్రకారముగ శ్రీ భవానీదేవి, సనత్కుమారునకు శాపమిచ్చుటకు నిశ్చయము చేయుచున్నది లోకమందు మహాదుఃఖకారకములగు యే స్థానములు గలవో, ఆ స్థానములందు నివాసముచేయువారైనే అనేక జీవులుండినను, ఆ సకల జీవులందు అశ్వసేవచే జీవనము జేయువారైన పురుషులు ప్రముఖులుగానున్నారు. ఎలాగుననగా — అశ్వశాల దుర్గంధముచే యుక్తమైయుండును అటువంటి ఆ దుర్గంధశాలయందాపురుషులకు నివాసమగుచున్నది. మఱియు బహుసేవజేసినను అల్పధనప్రాప్తియే యగుచున్నది. ఈలాగున అశ్వసేవకపురుషులు సకలమనుష్యులయందు నీచులుగానున్నారు ఇటువంటి అశ్వసేవకుల కులమందు యీ సనత్కుమారుడు జన్మింపవలసినది. ఈ ప్రకారముగు విచారముచేసి, ఆ భవానీదేవి సనత్కుమా

రుని కిట్లు శాపమొసంగెను — హే సనత్కుమారా! నీవు నా భర్తయైన శ్రీమహాదేవుని అవమానముచేయుచున్నావు, గనుక అశ్వసేవ చేయువారి కులమందు నీకు జన్మమౌ గాక! యెప్పుడు భవానీదేవి సనత్కుమారునికి ప్రకారమగు శాపమివ్వదొడగెనో అపుడు మహాదేవుడాపెను శాపమిచ్చుటనుండి నివారణచేయ యత్నించెను. కాని, క్రోధావేశిత యైన యాభవానీదేవి మహాదేవుని వచనమంగీకరింపజాలక శాపమిచ్చివైచెను.

హే శిష్య! భవానీదేవియొక్క శాపానంతరము ఆ సనత్కుమారుడు, ప్రకృత శరీరమును పరిత్యాగముచేసి, అశ్వసేవకశరీరమును పొందెను. ఆ శరీరమందును సనత్కుమారుడు పరమానందమును పొందుచుండెను. ఎందుకనగా — పూర్వము బ్రాహ్మణశరీరమందు స్నానసంధ్యాది నిత్యనైమిత్తిక కర్మాచరణమందు యే క్లేశము లుండెనో, ఆ క్లేశములు అశ్వసేవకశరీరమందు నివృత్తమైనవి. మఱియు, అశ్వములకు భక్షణయోగ్యమైన చణకాదులు సహజముగనే ప్రాప్తములగుచున్నవి. ఆ చణకాదుల భక్షణముచే శరీరమత్యంత పుష్టమగుచున్నది. దానివలన నా సనత్కుమారుడు అశ్వసేవకశరీరమున చాల సోమరియై వర్తించుచుండెను. వాని అధికారి వానిని సోమరిగా చూచి, అశ్వసేవనుండి వానిని విడిపించి, అశ్వశాలాద్వారరక్షణసేవమాత్రము వానికొప్పజెప్పెను. పిదప ఆ సనత్కుమారుడు అధికారి ఆజ్ఞానుసారముగ, అశ్వశాలా ద్వారముపై రాత్రిం దినములు సుఖరూపముగ స్థితుడైయుండెను.

హే శిష్య! యీ ప్రకారముగ కొంతకాలము గడచినపిదప, శ్రీమహాదేవుని సహితముగ శ్రీ భవానీదేవి ఆయశ్వశాల సమీపమునకువచ్చెను అపుడా భవానీదేవి సనత్కుమారుని, నీచదేహమందు పరమానందప్రాప్తుడైయుండుట చూచి ప్రసన్నయై వానితో నిట్లనియె. హే సనత్కుమారా! నేను నీ యెడ ప్రసన్నయైతిని. కనుక నీకు యేది యిచ్ఛితమగునో, అట్టి వరమునడుగుము. నేను దానినిచ్చెదను భవానీదేవి యొక్క యావచనమును విని సనత్కుమారుడిట్లనియె. ఓ దేవీ! నీవు దయచేసి నాకు యే శరీరమిచ్చితివో, పూర్వ బ్రాహ్మణ శరీరముకన్న శ్రేష్ఠమైయున్నను, యీ శరీరమందు మలమూత్రాదిపరిత్యాగముకొఱకు లేచి దూరముగపోవుట సంభవించుచున్నది. దాని వలన నాకు కష్టమగుచున్నది. కనుక నీవు కృపగల్గి యే శరీరమందు కూర్చుండియే, మలమూత్ర పరిత్యాగముచేయుటకు వీలుపడునో, ఆ మలమూత్రములు నన్ను స్పర్శింపక దూరముగ పడునో అటువంటి శరీరము నాకు కలుగునటుల వరమిమ్ము. హే శిష్య! సనత్కుమారుడా వరమడిగినపుడు, భవానీదేవి మఱల క్రోధావిష్టయై, ఈ శాపమిచ్చెను హే సనత్కుమారా! ఉష్ట్ర (ఒంటె) శరీరమందు మలమూత్రములు దూరముగపోయి పడుచున్నవి. కనుక నీవు ఉష్ట్రశరీరమును పొందుదువుగాక!

యీ ప్రకారమాభవానీకాపానంతరమాసనత్కుమారుడు అశ్వసేవకశరీరమును పరిత్యాగముచేసి రాజగృహమందు ఉష్ట్రశరీరమును పొందెను. అప్పుట ఉష్ట్రమును శిక్షచేయువారైన అధికారులచే, నా ఉష్ట్రమెంత శిక్షింపబడినను అది కించిన్మాత్రము కూడ శిక్ష నెఱుగకుండెను, నాయధికారులాయుష్ట్రమును, మూఢముగాను, సోమరిగాను యెఱిగి అరణ్యమున వదలివేసిరి ఆ యరణ్యమున ఆ యుష్ట్రము పరమసుఖమును పొందుచుండెను ఎందుకనగా అట, కరీరాది కంటకవృక్షములుగలవు గాన యథేష్టముగ నాకంటకముల భక్షణముచేయుటయు గంగాజలము పానముజేయుటయు, కూర్చున్నచోటనే మలమూత్రవిసర్జనచేయుటయు సంభవించుచుండెను అథవా సృష్టియొక్క ఆదికాలమందు బ్రహ్మదేవునిచే పశుశరీరములుత్పన్నము చేయబడినపుడు. ఆ సకలశరీరములందు యుష్ట్రశరీరమే సుఖరూపమని యెఱిగి అద్దానినే మొదట పుట్టించెను. కనుక ఉష్ట్రశరీరము సకలశరీరములకన్న శ్రేష్ఠముగనున్నది. ఈ ప్రకారముగ ఉష్ట్రశరీరమందలి శ్రేష్ఠతను విచారముచేసి ఆ సనత్కుమారముని తన ఉష్ట్రశరీరమందు పరమానందమును పొందెను.

హే శిష్య! యీ ప్రకారముగ కొంతకాలము వ్యతీతమైన తర్వాత, శ్రీ మహాదేవసహితముగ శ్రీ భవానీదేవి ఆ వనమునకు వచ్చెను. ఆ సనత్కుమారుడు ఉష్ట్రశరీరమునందుమ పరమానందభరితుడుగనుండుట చూచి, వానితో నిట్లనియె. హే సనత్కుమార! నీయెడనేను ప్రసన్నయైతిని, నీకు కావలసిన వరమడుగుము. ఈ ప్రకారముగు భవానీవచనమును శ్రవణముచేసి సనత్కుమారముని యా దేవితో నిట్లనియె. హే దేవీ! నీచే దయతో యివ్వబడిన యీ యుష్ట్రశరీరముకన్న అధికమేమియు నాకు కనబడుటలేదు. ఈ యుష్ట్రశరీరమందే నేను కృతకృత్యుడనుగానున్నాను, ఓ దేవీ! యీ ఉష్ట్రశరీరమందు నాకు వేదమువలనగాని, లోకులవలనగాని భయప్రాప్తిగాని లజ్జాప్రాప్తిగాని కానేరదు. ఈ ఉష్ట్రశరీరముననేను కూర్చున్నచోట మలమూత్రవిసర్జన చేసినను దూరముగ పడుచున్నవి. అవి నన్ను స్పర్శింపవు. ఓ దేవీ! యీ ఉష్ట్రశరీరమందు నేను పరమసుఖానుభవము చేయుచున్నాను. కాబట్టి ఒకచో పరమేశ్వరుడు నాకు మున్ముందు మరొక శరీరప్రాప్తిచేయనున్న, యీ ఉష్ట్రశరీరమే నాకొసంగవలెనని, నాతనిని ప్రార్థనచేయుచున్నాను. ఓ దేవీ! యీ అనాది సంసారమందు నేను పూర్వము అనేకప్రకారములగు నీచ శరీరములను అనుభవించితినిగాని, యీ ఉష్ట్రశరీరసమానముగ సుఖకారణమైన మరొకశరీరము బ్రహ్మాండమందెచటను నేను చూడలేదు. ఓ దేవీ! యీ ఉష్ట్రశరీరముకన్న అన్యమగు యే వరమును నేను కోరను.

హే శిష్య! యీ ప్రకారమగు వచనములను సనత్కుమారముని భవానీదేవికి చెప్పినపుడు, ఆ దేవి సనత్కుమారుని నిష్కాముునిగా నెఱింగి, శ్రీమహాదేవునితో విచారముచేసి, యా సనత్కుమారునితో నిట్లనియె. ఓ సనత్కుమారమునీ! సకలకామనచే రహితమగుటవలన నీవు మమ్ము వరమడుగవు. గాన నీవే మాకు మనోవాంఛిత వరమిమ్ము! హే శిష్య! యీ ప్రకారమగు భవానీవచనమును శ్రవణముచేసి ఆ సనత్కుమారముని నా వచనము నంగీకరించెను. అనంతరము శ్రీ భవానీదేవి నీవు నా పుత్రుడవగుము అని వరమడిగెను ఆ వరమునుబట్టి భగవంతుడైన సనత్కుమారుడు భవానీదేవికి స్కందనామకుడైన పుత్రుడాయెను. ఆ స్కందునే శాస్త్రవేత్తలు కార్తికేయస్వామి యను నామముచే కథనము చేయుచున్నారు. ఎవడు కామమును వశముచేసికొనునో యాతడు స్కందుడనబడును. ఆ సనత్కుమారుడు స్కందావతారమందును పూర్వమువలెనే, బ్రహ్మచర్యధర్మముననే స్థితుడైయుండెను హే శిష్య! యీ సనత్కుమార భగవంతునిచే పూర్వము నారదునకు సుఖరూపమైన భూమయొక్క ఏ యుపదేశముచేయబడినదో, ఆ సంపూర్ణోపదేశమును నేను నీకు కథనము చేసితిని.

హే శిష్య! ఎట్లు అరుణి ఋషి శ్వేతకేతువునకు సనత్కుమారముని నారదునకు, ఆనందరూపాత్మయొక్క ఉపదేశముచేసిరో అట్లే బ్రహ్మదేవుడున్ను ఇంద్రవిరోచనుల కుపదేశముచేసెను. కాని ఆ యిద్దరియందును, దేవరాజేంద్రుడో శుద్ధాహారము శుద్ధచిత్తముగలవాడై కామక్రోధాదులను పరిత్యాగము చేయువాడైయుండెను. కనుకనా యింద్రుడు జాగ్రదాది అవస్థాత్రయముకన్న భిన్నమగు ఆత్మదేవుని సాక్షాత్కారమును పొందెను. విరోచనుడు ఆహారాదుల శుద్ధిలేనివాడగుటవలన అవస్థాత్రయముకన్న భిన్నమైన ఆనందరూపాత్మ నెఱుంగడాయెను. మఱేమనిన, ఆ విరోచనుడు స్థూలదేహమునే ఆత్మయని యెఱుగుచున్నాడు. హే శిష్య! యీ త్రయోదశాధ్యాయారంభమందు నీవు ఆత్మయొక్క సుఖరూపత నడిగితివి. దానిని నేను విస్తారముగ కథనము చేసితిని ఇక నిపుడు యే విషయము శ్రవణముచేయుటకై నీకు యిచ్ఛగలదో దానిని వచింపుము చెప్పెదను.

ఇతి శ్రీమదాత్మపురాణే త్రయోదశోఽధ్యాయః

సంపూర్ణః

శ్రీ

ఆత్మపురాణము

అథ చతుర్దశాధ్యాయారంభః

చతుర్దశాఽధ్యాయము

శ్రద్ధాభక్తిగలవారైన శిష్యులు శ్రీగురువునిట్లు ప్రార్థన చేయుచున్నారు:—

హే భగవన్! ఆత్మపురాణత్రయోదశాధ్యాయాంతమందు నీవు ప్రజాపతియైన బ్రహ్మదేవుడు ఇంద్రవిరోచనులకు అవస్థాత్రయాతీతభూమాత్మయొక్క ఉపదేశము చేసెననియు ఇంద్రుడాభూమాత్మ నెఱిగెననియు, విరోచనుడు యెఱుగలేదనియు చెప్పితివి ఓ భగవంతుడా! ఆ పవిత్రవ్యాఖ్యానమును భవదీయముఖమున శ్రవణము చేయుటకు కోరుచున్నాను తాము దయచేసి ఆ సకలవృత్తాంతమును నాకు కథనము చేయుడు. ఈ ప్రకారముగ సచ్ఛిష్యుడు ప్రార్థనచేయగా కృపామూర్తియైన శ్రీగురువు వారికి ఛాందోగ్యోపనిషదష్టమాధ్యాయమందు కథనము చేయబడిన విషయమును యిట్లు చెప్పనారంభించెను.

శ్రీగురువు — హే శిష్య! యింద్రవిరోచనులకు ఉపదేశముచేసిన బ్రహ్మదేవుడు ఏ బ్రహ్మలోకమందు నివాసముచేయుచున్నారో, ఆ బ్రహ్మలోకమెట్లున్నదనగా అత్యంతవిస్తీర్ణముగాను, సకలదుఃఖములను వినాశము చేయునట్టిదిగా నున్నది, మఱియును ఆ బ్రహ్మలోకము శుద్ధాంతఃకరణముకలవారైన సన్న్యాసులకు అర్చురాది మార్గమున ప్రాప్తమగుటకు యోగ్యమైయున్నది. భృగు మొదలగు ప్రజాపతులకు ఏ మహదాదిలోకములుగలవో, ఆ సకలలోకములకన్నను పైన నది స్థిరమైయున్నది. ఆ బ్రహ్మలోకమునందు "ఐరంమదీయ" నామకమైన ఒక సరోవరముకలదు. ఆ సరోవరము నానా ప్రకారకమలములచే శోభితముగాను, త్రివిధతాపనివృత్తికరముగా నున్నది. అల్పఫలమిచ్చునట్టి పుణ్యపాపకర్మముల క్షయమైన తర్వాత యుపాసక పురుషుల కా సరోవరప్రాప్తియగుచున్నది. ఆ సరోవరము ఇరానామకమగు అన్నము యొక్క రసరూపముగ నున్నది. మఱియు మదమునకు హేతువుగనున్నది. ఈ కారణమువలన శాస్త్రవేత్తలా సరోవరమును, "ఐరంమదీయ" నామముచే కథనము చేయుచున్నారు. ఆ బ్రహ్మలోకమందు అశ్వత్థవృక్షాకారమగు సోమరసవనమున్న

కల్పద్రుమమొకటికలదు. ఆ కల్పవృక్షము తల్లివలె సకలభూతకోట్లకు మనోవాంఛిత పదార్థముల నిచ్చును. ఆ వృక్షమునుండి సర్వదా అమృతము స్రవించుచుండును. ఈ కారణమువలన శాస్త్రవేత్తలా వృక్షమును 'సోమరసవన' నామముచే కథనము చేయుచున్నారు. మఱియు నా బ్రహ్మలోకమునందు 'అర' యను నొక సరోవరము కలదు. "ణ్య" నామకమైన మరొక సరోవరముకలదు. ఈ రెండు సరోవరములు సముద్రతుల్యముగ విస్తృతములుగానున్నవి. మఱియు, నవి, దుగ్ధ, దధి, ఘృతములను, మూడు రసములచే పూర్ణముగానున్నవి. ఎట్లు రాచభృత్యులు రాజును ఆదరపూర్వకముగ రాజసభకు తీసుకొనిపోవుచున్నారో, అట్లే విద్యుల్లోకమును పొందిన ఉపాసకపురుషులను, అమానవపురుషులు అటనుండి బ్రహ్మలోకమునకు తీసుకొని పోవుదురు బ్రహ్మలోకమును పొందిన ఉపాసకపరులసమ్ముఖమునకు బ్రహ్మదేవునిచే ప్రేరితులైన పంచశతఅప్సరసలు వచ్చెదరు. ఆ అప్సరసలు యెట్లుందురనగా — సూర్యసమానతేజస్కులుగాను. షోడశవర్షావస్థగలవారుగను, రూపయౌవనసంపన్నలుగాను, వివిధవాద్యత్రయములయొక్క మధురశబ్దసహితులుగాను, ఉపాసకపురుషులను చూచుటయందు ఉత్కంఠకలవారుగనుందురు. వారు ఉపాసకపురుషుని శరీరమును అలంకారాదులచే బ్రహ్మసమానముగ శోభాయమానమగునట్లు చేయుదురు. ఆ యప్సరసలు శ్రుతియందు 'అంబా అంబాలీయ' అను నీ రెండు నామములచే కథనము చేయబడిరి. ఇటువంటి పంచశత అప్సరసలు ఆయుపాసకపురుషునియెదుటకు వచ్చుదురు. వారిలో యేకశత అప్సరసలు ఆ ఉపాసకునికొఱకు నానా ప్రకారసుగంధపుష్పమాలలను, ఏకశతఅప్సరసలు వానికి లేపనము చేయుటకొఱకు నానా ప్రకార అంజనములను, ఏకశతఅప్సరసలు సుగంధచూర్ణములను, ఏకశతఅప్సరసలు నానా ప్రకార వస్త్రములను, ఏకశత, అప్సరసలు నానా ప్రకార భూషణములను చేతియందు గైకొని వాని యెదుటకు వచ్చుదురు. (యిట శరీరమునకు చాకచక్యహేతువైన సుగంధ తైలాదులకు నామము అంజనము. శరీరమును మర్దనచేయుటకు యోగ్యమైన పదార్థములకు నామము చూర్ణము.) మఱియు నా బ్రహ్మలోకమందు 'అర' యను హ్రదము గలదు. దుస్తరమైన 'విరజా' యను నది గలదు. ఆ హ్రదమునకును, నదికిని మధ్యయందు 'యష్టిహ' నామకులైన ముహూర్తాభిమానమైన దేవతలు గలరు. ఆ దేవతలనా యుపాసకపురుషుడు తన వివేక యుక్తమనస్సుచే దూరము పరుగెత్తించుచున్నాడు. ఎపుడా యుపాసకపురుషుడు ఆ హ్రదమును, నదిని, దాటి "ఇలయ" మను వృక్షసమీపమునకు పోవునో అపుడాతనికి, బ్రహ్మదేవునిచే గ్రహణయోగ్యమైన దివ్యగంధము ప్రాప్తమగుచున్నది. మఱియు యుపాసకుడెపుడు శాలజ్యమను సంస్థానమును పొందునో, అపుడు బ్రహ్మదేవునిచే పొందయోగ్యమైనట్టి దివ్యరసము ప్రాప్తమగుచున్నది.

ఉపాసకుడెపుడు 'అపరాజితమ'ను ఆయతనమును పొందునో అపుడు దివ్య రూపముగలుగగా ఆ ఉపాసకునియందు బ్రహ్మదేవుని తేజము ప్రకాశించుచున్నది. ఆ బ్రహ్మలోకమందు మహాతేజముగలవారైన యింద్రప్రజాపతులను యిరువురు ద్వారపాలకులు గలరు. ఆ ద్వారపాలకులు ఉపాసక పురుషుని బ్రహ్మతేజముచే యుక్తముగ జూచి భీతిపొంది, శీఘ్రముగ వానికి లోపలికిపోవుటకు మార్గము నిచ్చుచున్నారు. ఆ బ్రహ్మలోకమందు 'హిరణ్మయమ'ను బ్రహ్మదేవుని ప్రాసాదము కలదు. ఆ ప్రాసాదము మహావిస్తీర్ణముగాను, అనేక ప్రకారరత్నములచే జటితము గాను, సభాస్థానముచే యుక్తముగనున్నది. ఆ ప్రాసాదమందు ఒక 'విచక్షణ' యను పేరుగల బుద్ధిరూపవేదిక యొకటికలదు. ఆ వేదిక సకలశుభలక్షణములచే సంపన్నము గాను, సకలజగత్తునకు కారణముగనున్నది. మఱియు ఆ ప్రజ్ఞారూపవేదికయందు, అమితౌజసమను ఒక ప్రాణరూప పర్యంకమొకటి గిలదు. ఆ ప్రాణమును, వాజసనేయ శాఖగల బ్రాహ్మణులు ఉద్గాతృరూపముచే నుపాసనచేయుచున్నారు. ఆ ప్రాణ పర్యంకమెట్లున్నదనగా — దాని పూర్వదిశయందలి రెండుపాదములు భూతభవిష్య జ్జగద్రూపమైయున్నవి. లక్ష్మిపృధ్వియను రెండు పాదములు ఆ పర్యంకమునకు పశ్చిమదిక్కునగలవు. దాని దక్షిణోత్తరపు ప్రక్క బృహత్సామ, రథంతరసామములను కాష్ఠమయములైన దీర్ఘములగు రెండు పటికలు గలవు. మఱియు పూర్వపశ్చిమదిక్కున భద్రసామ, యజ్ఞాయజ్ఞీయసామములను సూత్రమయదీర్ఘపటికలు గలవు. మంత్రరూప యజుర్వేదము, ఆ పర్యంకమునకు దక్షిణోత్తరమున సూత్రమయ అల్పపటికలు గలవు. మఱియు నా పర్యంకమునకు చంద్రకిరణ సమానమగు ఉపస్తరణము (పరుపు పైని గుడ్డ) కలదు. 'ఉద్గీథ'మను సామవేదము ఆయుపస్తరణముపై ప్రసరించుటకు యోగ్యమైన శ్వేతవస్త్రమైయున్నది. లక్ష్మి ఆ పర్యంకమునకు తలదిండుగానున్నది. ఇటు వంటి ప్రాణరూపపర్యంకముపై బ్రహ్మదేవుడు సర్వదా విరాజమానుడుగా నుండును. ఆ హిరణ్యగర్భరూపబ్రహ్మ జగద్రూపపటముచే నావృతుడుగా నున్నారు. వాని శరీరము పృధివ్యాది పంచభూతములచే పుష్టముగ నున్నది. మఱియు నా హిరణ్యగర్భుడు సకల జీవుల సమష్టిరూపముగనున్నాడు. శ్రుతియందు 'అంబయా' నామముచే కథనము చేయబడిన ఉపాసనారూప నదీసంబంధజలమును ఆ బ్రహ్మదేవుడు సర్వదా పానము చేయును. ఆ బ్రహ్మదేవునకు ప్రియురాలైన యిద్దరు స్త్రీలు గలరు. అందొకతె 'ప్రతి రూప' యను పేరుగలది ఆ ప్రతిరూపాప్రియ సమష్టిరూపతేజఃపుంజమును, తన అభిమానవిషయముగా జేసికొని విరాజమానమై యున్నది. మరొకతె సకల చక్షురింద్రి యములకు ఉపాదాన కారణరూపమై 'మానసి' యను పేరుగలది. ఆ మానసీప్రియ

'సరస్వతీ' నామముచే ప్రసిద్ధమైయున్నది. ఇటువంటి యిద్దరు భార్యలతోగూడ నా బ్రహ్మదేవుడు తన సభయందు స్థితుడగుచున్నారు. ఆ బ్రహ్మదేవుడు యింద్రాది సకలదేవతలకును దేవతగా నున్నారు. మఱియు సకలబ్రహ్మాండమందును వ్యాప్తుడుగా నున్నారు. ఇంద్రాదిదేవతలు వాని విభూతులైయున్నవి. ఆ సకలదేవతలచే నా బ్రహ్మ దేవుడు ఉపాసనచేయబడుటకు యోగ్యుడుగానున్నారు. ఇటువంటి బ్రహ్మదేవుడు సకలజీవుల హితముకొఱకై యేదో యొక ప్రసంగమునుబట్టి. యీ ప్రకారమగు వచనముల పలుకుచున్నారు. — ఏ వస్తువత్యంతదుర్లక్ష్యరూపముచే కథనము చేయబడినదో. యే వస్తువు భూమారూపముచే వర్ణనము చేయబడినదో. ఏ వస్తువు సకలదేహధారులగు జీవులకు ప్రత్యగ్రూపముగ ప్రసిద్ధమైయున్నదో. ఆ వస్తువు సకలా నాత్మపదార్థములకన్న నిరతిశయమగు ప్రీతికి విషయమైయున్నది.

ఈ కారణమువలన నా వస్తువు ఆత్మశబ్దముచే కథనము చేయబడియె. మఱియు నా ఆత్మవస్తువు అహంకారాదులకన్న పరముగను వచింపబడియె. అనిత్యఫలమును కలుగజేయునట్టి కర్మము "పాప్మ" యనుపేరుచే కథనము చేయబడియె ఆ పాప్మ నామకర్మమునకు ఆశ్రయభూతమగు యే స్థూలసూక్ష్మశరీరములు గలదో, ఆ శరీర ద్వయసంగముచే, ఆత్మదేవుడు రహితుడుగానున్నారు. ఈ కారణమువలన నా ఆత్మ దేవుడు "అపహతపాప్మ" నామముచే కథనము చేయబడియె జరామరణ. శోక మోహములను మానసధర్మములు, క్షుత్పిపాసలను ప్రాణధర్మములు, యేవియు నా ఆత్మకు లేవు. ఈ కారణమువలన ఆ యాత్మదేవుని విజర విమృత్యు విశోక. విజిఘత్స. అపిపాస యిత్యాది నామములచే శ్రుతిభగవతి కథనము చేయుచున్నది ఆ యాత్మదేవుని యిచ్ఛారూపకామమున్ను జ్ఞానరూపసంకల్పమున్ను సత్యమై యున్నవి. ఈ కారణమువలన శ్రుతిభగవతి ఆత్మదేవుని "సత్యకామ సత్యసంకల్ప" నామములచే కథనము చేయుచున్నది. ఆత్మజ్ఞానముచే నెపుడు దేహమనః ప్రాణాదులు బాధితములగుచున్నవో, అపుడు యిచ్ఛాసంకల్పాదులు పుట్టవు. ఒకచో బాధితాను వృత్తిచే యిచ్ఛాదులు పుట్టినను అవి మిధ్యకావు. సత్యరూపములే యగును. ఎందు కనగా — జ్ఞానకాలమందు విద్వత్పురుషుడు యిచ్ఛా సంకల్పాది సకలజగత్తును ఆత్మరూపముగ అనుసంధానము చేయుచుండును అధిష్ఠానాత్మకన్న భిన్నరూపముగ ఆ యిచ్ఛాదులను చూడడు. కనుక యిచ్ఛాసంకల్పాదులు తమ యుత్పత్తికన్న పూర్వమును, సన్మాత్రమే యై యున్నవి. ఈ కారణమువలన ఆత్మదేవుని యిచ్ఛా సంకల్పాదులు సత్యరూపములై యున్నవి. మఱియు ఆ యాత్మదేవుడు సంసార సంబంధ సకలరహితుడుగాను, బుద్ధ్యాదులకన్నను విలక్షణుడుగా నున్నారు. ఇటువంటి ఆత్మదేవుని అధికారిపురుషులు అవశ్యముగ నెఱుగవలసినది, ఆ యాత్మదేవుని

యెఱుగు ప్రకారము వచింపబడుచున్నది. ఆ అధికారిపురుషులు మొదట బ్రహ్మచర్యాదిసాధనసంపన్నులై. బ్రహ్మవేత్తయగు గురువుయొక్క సమ్ముఖమునకు పోవలయును అనంతరము గురుముఖమున వేదాంతవచనముల శ్రవణము చేయవలయును. పిదప వినిన అర్థమును మననము చేయవలయును పిమ్మట ఆ మననము చేసిన అర్థమును, నిదిధ్యాసము చేయవలయును. ఆ శ్రవణమువలన ప్రమాణాసంభావనయు, మననము వలన ప్రమేయాసంభావనయు, నిదిధ్యాసమువలన విపరీతభావనయు నివృత్తమగుచున్నవి. వేదాంతశాస్త్రము భేదప్రతిపాద్యమా? అభేదప్రతిపాద్యమా? అను నీ సంశయము ప్రమాణాసంభావన యనబడును. ప్రత్యగాత్మ బ్రహ్మముకన్న అభిన్నమా? భిన్నమా? అను నీ సంశయము ప్రమేయాసంభావన యనబడును. పరిపూర్ణాత్మను పరిచ్ఛిన్నముగ యెఱుగుట విపరీతభావన. ఈ ప్రకారముగ అధికారిపురుషులు శ్రవణాదిసాధనలచే నా యాత్మదేవుని సాక్షాత్కరించుకొనుచున్నారు. అట్టి విద్వత్పురుషులే సర్వాత్మభావమునుపొంది, సర్వభేదరహితులై భూరాదిసర్వలోకములను పొందుదురు మఱియు ఆ లోకసంబంధ సర్వభోగములను తమ ఆత్మయని యెఱుగుచున్నారు. ఈ సర్వాత్మజ్ఞానమే సర్వపదార్థప్రాప్తిరూపమై యున్నది.

హే శిష్య! ఈ ప్రకారమగు వచనము లెపుడు ప్రజాపతిబ్రహ్మచే. తన సభయందు కథనము చేయబడినదో, అపుడా బ్రహ్మదేవుని వచనములను దేవతలు అసురులందఱును శ్రవణము చేసిరి. శిష్యుడు — హే భగవన్! తమతమ లోకములందు స్థితులైన దేవతలు అసురులు బ్రహ్మదేవుని వచనము లెట్లు వినగల్గిరి?

గురువు — హే శిష్య! ఆ బ్రహ్మదేవుని సభయందు దేవతలు అసురులును అనేక వేలమంది సర్వదా యుందురు. అసురులు దేవతలకన్న జ్యేష్ఠులగుట వలన యట కుడిప్రక్కగాను, దేవతలు కనిష్ఠులగుటవలన యెడమప్రక్కగాను నిలుచుందురు శ్రుతి "ద్వయాహవై ప్రాజాపత్యా జ్యాయాంసోఽసురాః" "కనీయాంసో దేవాః" భావార్థము — అసురులును దేవతలును ప్రజాపతిచేతనే పుట్టుచున్నారు. వీరిలో అసురులు జ్యేష్ఠులుగాను, దేవతలు కనిష్ఠులుగానున్నారు. ఆ దేవతాసురులు, అత్యంత ఉగ్రతేజముగలవారైయుందురు. వారు బ్రహ్మయందే ఏకాగ్రదృష్టిగల్గియుందురు. పరస్పర విరోధులగుటవలన దేవతలు అసురులను చూడరు. అసురులు దేవతలను చూడరు. కాని యెపుడాసభయందు బ్రహ్మదేవుని ముఖమునుండి మోక్షసాధనము గూర్చిన వచనమువచ్చునో, అపుడా వచనమును సభావాసులగు యిరువురును విందురు. అనంతరము దేవతాధిపతియగు యింద్రుడు సర్వదేవతలనుగూర్చి యిట్లనియె. ఓ దేవతలారా! బ్రహ్మముఖమునుండి యేవార్త బయటకువచ్చునో దానిని మన

శత్రువులగు అసురులు యెఱుగకూడదు, దానికై మీరు ప్రయత్నము చేయవలయును. అసురరాజగు విరోచనుడున్ను అసురులనుగూర్చి యట్లనే చెప్పెను.

హే శిష్య! యీ ప్రకారముగ యింద్రవిరోచను లిరువురును తమ తమ అనుచరులకు బ్రహ్మోక్తవార్తను ప్రకటితమొనర్చు విషయమందు నివారణముచేయ వచించిరి. అనంతరము ఆ యింద్రవిరోచనులు దేవతాసురులతోటి రహస్యవిచారను చేయుచు నిట్లనిరి. ఓ బుద్ధిమంతులగు అనుచరులారా! యే ఆత్మజ్ఞానముచే మనము ప్రయత్నములేకయే సర్వలోకములను సకలలోకములందలి భోగ్యపదార్థములను పొందుదుమో అటువంటి ఆత్మజ్ఞానమును మనము సంపాదనము చేయుట ఉచితము. కాని ఆ యాత్మజ్ఞానప్రాప్తికొఱకు ఒకచో మనమందరము మన మనలోకములను పరిత్యాగముచేసి బ్రహ్మసభకు వచ్చినపక్షమందు, మన ఛిద్రమును సర్వదా చూచువారైన మన శత్రువులు మనరాజ్యము నాక్రమింతురు. అపుడు ధనవృద్ధికొఱకు వ్యాపారము చేయువాడైన వ్యాపారియొక్క మూలధనమే పోయినచో యెట్టిస్థితికలుగునో అట్టిస్థితి మనకు గలుగును. కనుక రాజ్యపరిపాలనమును విడిచి బ్రహ్మలోకమునకు పోవుట మనకుచితముకాదు. మఱేమనిన మనయందొక బుద్ధిమత్పురుషుకు బ్రహ్మలోకమునకు పోవలెను. అతడు బ్రహ్మదేవుని ఉపదేశమును గ్రహణముచేసి మన కందఱకు గురురూపముగ నుపదేశము చేయవలయును. హే శిష్య! యీ ప్రకారముగ దేవతలును, అసురులును, తమతో పరస్పరవిచారము చేసికొనిరి. అపుడు దేవతలలో యింద్రుడున్ను, అసురులలో విరోచనుడున్ను, బ్రహ్మదేవుని యొద్దకు పోవుటకు సిద్ధులైరి. బలబుద్ధ్యాదిగుణములుగలవారై ధైర్యశాలురై, యశముగలవారై, బ్రహ్మవిద్యాప్రాప్తీచ్ఛగలవారై, అత్యంతాభిమానయుక్తులై, పరస్పరము జయించుటకు యిచ్ఛగలవారైనట్టి యింద్రవిరోచను లిరువురును. సమిధాది పదార్థములను హస్తము లందు గ్రహణముచేసి, ఒకేకాలమందు ఘటకుటీప్రభాతన్యాయముగ బ్రహ్మదేవుని సన్నిధికి వచ్చిరి. (రాజకరభారము గ్రహణము చేయుటకొఱకు కొందఱు నది తటాకము మొదలగు స్థానములందు చిన్న ఒక కుటీరముకట్టుకొని కొందఱు రాజభృత్యులు యుందురు. ఆ కుటికి పేరు ఘటకుటి, ఒక వ్యాపారివాల పదార్థములతోటి అచటికిరా నారంభించి యిట్లు విచారము చేయదొడగెను నేనీమార్గముననే పోయిన పక్షమందు చాల కరభార మియ్యవలసియుండును. కాన వేరుమార్గముచేపట్టుట ఉచిత మని విచారముచేసి వేఱుమార్గమున నడచుచుండెను. కాని ఆ మార్గముతప్పి చీకటి రాత్రియందు తిరిగి తిరిగి ఉదయ సంధ్యాకాలమునకా ఘటకుటికే వచ్చెను. దీనికి ఘటకుటీప్రభాతన్యాయమనిపేరు) అట్లే యింద్రుడును, విరోచనుడును ఒకేకాలమందు బ్రహ్మదేవుని సమీపమునకు వచ్చిరి. నేనుపోయిన సంగతి నా శత్రువైన విరోచమనకు

తెలియగూడదని యింద్రుడున్ను, నేను పోయినసంగతి నాశత్రువునకు తెలియగూడదని విరోచనుడున్ను తమతమ మనస్సులలో ననుకొనిరి. కాని వారి యిచ్ఛపూర్ణము కాలేదు

హే శిష్య! ఆ యింద్రవిరోచనులు తమతమ కార్యసిద్ధియందు అత్యంత బుద్ధిమంతులగుటవలన,మనస్సులో శత్రుభావముండినను, బాహ్యమున సోదరులవలె పరస్పర స్నేహమున వర్తనము చేయదొడగిరి. సకలభూత కోట్లకన్నను పూర్వము పుట్టినవారైన మన్వాదులకన్నను మొదటనే పుట్టినవాడు బ్రహ్మదేవుడు. అట్టి బ్రహ్మదేవుడు వారిరువురియొక్క అంతరాభిప్రాయమెఱిగి వారి గర్వాదిదోషములను నివృత్తిచేయుటకొఱకు ముప్పదిరెండు సంవత్సరములవఱకు (ఏదోయొక కార్యమందు సంలగ్నమైన చిత్తముగల పురుషునివలె) వారి ప్రార్థనావచనము శ్రవణముచేయుచునే శ్రవణముచేయనట్లు స్థితుడైయుండెను. హే శిష్య! లోకమందు మహారాజుయొక్క స్నేహపాత్రుడగు పురుషుని మహాపరాధిగజూచి, యెపుడా మహారాజు పురుషుని ఉపేక్షచేయునో, అపుడా పురుషుడు నిరాదరమునుపొంది సన్మానసంబంధ సకలభోగములచే రహితుడై, రాజు ముఖమును సర్వదాచూచుచు, చిన్నమనస్సుచే రాజసమ్ముఖమున యెట్లు నివాసముచేయునో, అట్లే ఇంద్రవిరోచనులిద్దరును, బ్రహ్మదేవుని సమీపమున నివాసము చేయుచుండిరి. ప్రాతఃకాల సాయంకాల భోజనాదిక్రియలును వారికి నియమము ప్రకారము సరిగా నడవకుండెను. ఇక సంభోగాదులమాట చెప్పనేల? హే శిష్య! యీ ప్రకారముగ నా యింద్రవిరోచను లిద్దరును, ముప్పదిరెండు సంవత్సరములు బ్రహ్మచర్యధర్మమును చేయదొడంగిరి. ఆ బ్రహ్మదేవుడెపుడు మామీద అనుగ్రహము చేయునోయని, వారు సర్వదా బ్రహ్మదేవుని ముఖమే చూచుచు నిలువబడియుండిరి. 32 సంవత్సరములు గడచిన తర్వాత, వారిరువురివంక నుచూచి యిట్లనియె. హే యింద్రవిరోచనులారా! మీకు ఏ భోగముచేయుటకు యోగ్యములైన, యే స్వర్గాదిలోక సంబంధ స్థూలభోగములుగలవో, ఆ భోగములచే రహితమైనట్టిదియు, మహాకష్టముచే ప్రాప్తమగునట్టిదియునైన యీ బ్రహ్మలోకమునకువచ్చి మీరిరువురు యే ప్రయోజనములకొఱకు ఇట నివాసము చేయుచున్నారు?

ఇంద్రవిరోచనులు:—("ఆత్మా అపహతపాప్మా" యిత్యాది బ్రహ్మదేవుని పూర్వోక్తవచనములను పాఠముచేసి వానితో నిట్లు పలుకుచున్నారు) ఓ భగవంతుడా! అధికారి పురుషులకు ఆత్మయొక్క జ్ఞానముచే, సకలలోకములును సకలభోగ్య పదార్థములును ప్రాప్తమగుచున్నవను నీ ప్రకారవచనము నీచే పూర్వము సభయందు చెప్పబడియె. ఆ వచనమును శ్రవణముచేసి ఆ యాత్మజ్ఞానప్రాప్తికొఱకు మేము మీ సమీపమున 32 సంవత్సరములు నివాసము చేసితిమి. దయచేసి తాహా ఆత్మజ్ఞానము

యొక్క ఉపదేశమును మాకు చేయవలయునని ప్రార్థన — హే శిష్య! యీ ప్రకార మగు యింద్రవిరోచనుల భాషణమును విని, మందహాసముచేయుచు, ఆ బ్రహ్మదేవుడు వారికి మొదట జాగ్రదవస్థకు సాక్షియైన ఆత్మను, చక్షుస్థితరూపముచే నుపదేశము చేయ దొడగెను — బ్రహ్మదేవుడు – హే యింద్రవిరోచనులారా! అధికారిపురుషులచే శాస్త్రసంస్కారయుక్తబుద్ధిచే, యే దక్షిణచక్షుస్థిత పురుషుడు చూడబడెనో ఆ చక్షుస్థితపురుషుడే అపహతపాప్మ, విరజ, విమృత్యు, సత్యకామ, సత్యసంకల్పాది స్వరూపమై యున్నాడు మఱియు నా చక్షుస్థపురుషుడే భయరహితనిర్గుణరూపుడుగానున్నాడు. హే శిష్య! ఎట్లు గుడస్వభావము మాధుర్యమైయుండినను పిత్త దోషముగలవారికది కటువుగా ప్రతీతమగుచున్నదో అట్లే బ్రహ్మదేవుని వచనము ఆత్మయొక్క వాస్తవస్వరూపప్రతిపాదకముగ నుండినను విషయసంస్కారదోషవశమున, యింద్రవిరోచనులా బ్రహ్మవచనమునకు విపరీతార్థమును కల్పనజేసి వానితో నిట్లనుచున్నారు.

హే భగవన్! శరీరముయొక్క ప్రతిబింబరూపచ్ఛాయ యేదిగలదో, ఆ చ్ఛాయయే చక్షువందు చూడబడినది. తామాఛాయనే చక్షువందు ఆత్మరూపముగ కథనము చేయుచున్నారు. ఆ ఛాయారూప ఆత్మస్వరూపమును మేము స్వబుద్ధిబలమున చక్షుర్భిన్నస్థలమందును యెఱుగుచున్నాము. ఎట్లు చక్షువందు ఛాయారూపాత్మ ప్రతీతమగుచున్నదో, అట్లే స్వచ్ఛదర్పణమందును, జలమందును, ఖడ్గమందునుకూడా ప్రతీతమగుచున్నాడు. హే భగవన్! దక్షిణచక్షువందు యే పురుషుడు కనబడుచున్నాడో, అతడే యాత్మయను తమవచనము ద్రష్టయొక్క అభిప్రాయమునుబట్టి సంభవింపదు. ఎందుకనగా — లోకమందు యే పురుషునకు తన ఛాయచూచుట కిచ్ఛయగునో, ఆ పురుషుడు దర్పణాదులులేక, కేవలము తన చక్షువందు తన ఛాయను చూచుటకు శక్యుడుకాడు మఱేమనిన, దర్పణాదులందే తన ఛాయను చూచుటకు శక్యుడగును. కనుక మేము కథనముచేసిన దర్పణజలాదులందు స్థితమైన ఛాయారూపాత్మ మఱియు తాము కథనముచేసిన చక్షుస్థితాత్మ ఈ సకలఛాయలందేఛాయను ఆత్మయని యెఱుగనగును?

హే శిష్య! యీ ప్రకారముగ తమ పాండిత్యాభిమానముచే యింద్రవిరోచనులెపుడు చెప్పిరో, అపుడా బ్రహ్మదేవుడు వారిద్దరియొక్క భ్రాంతి నెఱిగినను దానినుపేక్షచేసి, తాను యథార్థానుసారముగ నిట్లు భాషణముచేయదొడగెను. హే ఇంద్రవిరోచనులారా! ఆ యానందస్వరూపాత్మ దర్పణాది సర్వోపాధులందు సాక్షిరూపముగ ప్రతీతమగుచున్నాడు కనుక నాతడు దర్పణాద్యుపాధులందు విద్యమానుడైయున్నాడు. హే శిష్య! ఆ బ్రహ్మ, యింద్రవిరోచనులకిట్లు ఆత్మోపదేశముచేసి తన మనస్సులో

నీ ప్రకారముగ విచారము చేయుచున్నారు ఈ యింద్రవిరోచనులకు నేను ఆనంద రూప. స్ఫురణమునే ఆత్మరూపముగ కధనముచేయుచున్నాను. అట్లైనను వీరికి తమ బుద్ధిదోషమువలన ప్రధమోపదేశముచే నెట్లు ఆత్మబోధ కాకుండెనో, అట్లే ద్వితీయోప దేశముచేతను, ఆత్మయొక్క బోధ కాలేదు. మఱేమనిన రెండుమార్లును వీరు ఛాయనే ఆత్మయని యెఱుగుచున్నారు. ఈ ప్రకారముగ విచారముచేసి ఆ బ్రహ్మదేవుడు వారిద్దరితో నిట్లనియె. హే యింద్రవిరోచనులారా! మీ రిద్దరు పోయి జలముచే పూర్ణమైన ఆ శరావమందే 'వస్తువు'ను మీరు చూచుదురో దానిని నాకు కథనము చేయుడు. హే శిష్య! యిట్లు చెప్పుటయందు బ్రహ్మదేవుని అభిప్రాయమేమనగా — దర్పణజలాదులయందు స్థితమైన ఛాయ నిత్యముకాదు. ఉపాధులభేదముచే పరగామియై యున్నది. కనుక ఘటపటాదిపదార్థములవలె ఆ ఛాయయందు అనాత్మరూపత స్పష్టమై యున్నది. మఱి స్ఫురణరూపసాక్షియో, సర్వత్ర పరిపూర్ణమైయున్నాడు. కనుక ఆ స్ఫురణరూపసాక్షియే ఆత్మరూపమగును. ఈ ప్రకారముగ సాక్షియగు ఆత్మ, స్ఫురణరూపఛాయ యీ రెంటియందును చాల విశేషతకలదు, ఆ విశేషత వీరిద్దఱు గ్రహణము చేయజాలరు. ఎందుకనగా — వీరికి పండితాభిమానముకలదు. మఱియు పరస్పరద్వేషముచే వీరి చిత్తము మలినమైనది. ఈ కారణమువలన వీరు నా ఉప దేశముచేతను సాక్షియాత్మ నెఱుగలేదు. పైగా ఆత్మనే ఛాయయని యెఱుగుచున్నారు. ఇపుడు నా ఉపదేశమును మీరు యథార్థముగ గ్రహణము చేయలేదు, విపరీతముగ గ్రహణముచేసితిరి. అని యిట్లని నపుడు వీరికి మానభంగమగును. మానభంగముచే లజ్జితులుకాగా వీరి బుద్ధికుంఠితమగును. బుద్ధికుంఠితమైన తరువాత నా వచనముల యర్థమును కొంచెమైనను యెఱుగజాలరు. కాన యిటువంటి అనధికారులకు ఉపదేశమే లేకున్నది. వీరికి యేరీతిగా ఆత్మబోధ చేయవలెను! శాస్త్రమందీ నియమముగలదు. శిష్యునిబుద్ధి యేప్రకారముండునో. ఆ ప్రకారముగానే గురువు ఉపదేశము చేయవలయును. అభిప్రాయము — ఉత్తమ, మధ్యమ మందభేదములచే శిష్యులు త్రివిధములు, ఆట ఏ శిష్యునియందు సత్వగుణమధికముగాను, రజస్తమోగుణములు అల్పాల్పముగ నుండునో. ఆ శిష్యుడు ఉత్తముడు. ఏ శిష్యునియందు రజోగుణ మధికముగను సత్వతమములు అల్పాల్పముగనుండునో వాడు మధ్యముడు. మఱియు తమోగుణమధికముగాను. సత్వరజములు అల్పాల్పముగనుండునో, అతడధముడు. ఈ ప్రకారముగ శిష్యుల పరీక్షజేసి వారివారి బుద్ధ్యనుసారముగ వారి వారికి ఉపదేశములు చేయవలసినది. హే శిష్య! యీ ప్రకారమగు అభిప్రాయమును మనస్సులో మంచుకొని ఆ బ్రహ్మ దేవుడు, యింద్రవిరోచనులకు దర్పణజలచక్షువాదిసకలోపాధులందు, ఆ యాత్మ వ్యాపకుడుగా నున్నాడని ప్రత్యుత్తరము చెప్పుచున్నాడు. — నేను మీకు ప్రత్యక్

వస్తువుయొక్క ఉపదేశము చేయుచున్నాను. అది మీరెఱుగక అనాత్మయైన ఛాయ నెందులకు ఆత్మగా నెఱుగుచున్నారు! అని యిట్లడుగక, మీరు జలముచే పూర్ణమైన శరావమందు మిమ్ములను చూచుకొండని యీ ప్రకారముగ నుపదేశము చేయు చున్నాడు.

హే శిష్య! ఆ యుపదేశమును గ్రహణముచేసి, వారిద్దరును శరావమందు తమ్ముల జూచుకొని మఱల బ్రహ్మదేవుని యెదుటకు వచ్చిరి. అపుడు వారికి ఆ బ్రహ్మ దేవుడిట్లడిగెను — మీరు జలయుక్తశరావమందు ప్రతిబింబములను చూచుటచే, నే తత్త్వమును నిశ్చయము చేసితిరి? — హే శిష్య! యీ ప్రకారముగ నెపుడు బ్రహ్మదేవుడు వారినడిగెనో, అపుడు యెట్లు మూఢబాలకుడు తన అభిప్రాయమును పితకు కథనము చేయుచున్నాడో, అట్లే ఆ యింద్రవిరోచనులును బ్రహ్మదేవుని యెదుట తన అభిప్రాయమును యిట్లు కథనము చేయుచున్నారు. — హే భగవన్! పాదమునుండి మస్తక పర్యంతము యే నాశరీరముగలదో, ఆ శరీరరూపాత్మను మేము శరావమందు చూచితిమి — యీ వచనమును విని బ్రహ్మదేవుడు మనస్సులో యిట్లు విచారము చేయుచున్నాడు. ఈ యింద్ర విరోచనుల బుద్ధియందు మోహము గలుగ జేయునట్టి యేదో ఒక విచిత్రదోషముకలదు. ఆ దోషముచే వీరు నా ఉపదేశమును విపరీతముగ గ్రహణము చేయుచున్నారు. నేను చక్షువందు ఆత్మను బోధనచేయుచుండ వీరు ఛాయనే యాత్మగా నెంచుచున్నారు, అనంతరము నేను మధ్యమరీతిగా దర్పణ జలాది సకలోపాధులందు ఆత్మనుగూర్చిన ఉపదేశము చేయుచుండ మఱల వీరు ఛాయనే ఆత్మగా నెంచుచున్నారు పిమ్మట నేను మృదురీతిగా శరావమందు చూచుట యుపదేశముచేయగా వీరికి పూర్వముకన్న కొంచమధికముగా బోధయైనది. అపుడు శరావమందు చూచుటచే ఛాయయొక్క పరిత్యాగముచేసి, తమ స్థూలశరీరమునే ఆత్మగ నెంచుచున్నారు. వీరిట్లు విచారము చేయుచున్నారు భేదరహితమైన యీ ద్రష్టయగు పురుషుని శరీరమేదికలదో, ఆ శరీరమే యితర పురుషుల చక్షువందును, దర్పణమందును, జలమందును, ప్రతీతమగుచున్నది. కనుక ఆ ద్రష్టయగు పురుషుని శరీరమందు భేదములేదు. మఱియు చక్షుదర్పణాద్యుపాధులందు, ప్రతిబింబరూపఛాయ యేది ప్రతీతమగుచున్నదో, అది పరిమాణభేదముచే ఉపాధిభేదము కలదగుచున్నది. ఈ కారణమువలన ఛాయ ఆత్మగాదు. స్థూలశరీరమే ఆత్మ. యీ విచారముచే ఛాయారూపాత్మయొక్క పరిత్యాగమైనది. కనుక యెట్లు ఛాయయందు నానారూప తను చూచుటచే, ఛాయయొక్క పరిత్యాగమైనదో, అట్లే శరీరములందును నానారూప తను చూచుటచే. శరీరాత్మబుద్ధి పరిత్యాగముచేయునట్టి ఉపాయమును నేను గావింప వలయును. ఈ యిద్దఱు జలశరావములం దేశరీరములను చూచుచున్నారో, ఆ వీరి

యొక్క శరీరము, నఖకేశాదులచే యుక్తముగాను, మలినవస్త్రయుక్తములుగా నున్నవి. ఇపుడు స్నానము చేయించి మఱల జలశరావాదులందు చూచుటకై చెప్పవలయును. ఈ ప్రకారముగ విచారముచేసి భగవంతుడైన బ్రహ్మదేవుడు వారితో నిట్లనియె.

ఓ యింద్ర విరోచనులారా! మీరిద్దరు నఖకేశాదుల ముండనము చేయించుకొని, స్నానముచేసి సుందరవస్త్రభూషణముల ధారణముజేసి, మఱల జలశరావమందుచూచి నాకు చెప్పుడు అపుడా యింద్రవిరోచనులు బ్రహ్మదేవుని వచనములను స్వీకారము చేసి, ముండనముచేయించుకొని, స్నానముచేసి వస్త్రభూషణాదుల ధారణముచేసి,మఱల జలశరావమందు చూచుచున్నారు. అట్లు చూచినను మఱల శరీరమందే ఆత్మను దృఢముగ గ్రహణముచేసి బ్రహ్మదేవుని యెదుటకువచ్చి యిట్లు పలుకుచున్నారు: హే భగవన్! మా కిద్దరికిని, యీ స్థూలశరీరమందే ఆత్మత సిద్ధించుచున్నది. కాన స్థూలశరీరమే ఆత్మయై యున్నది. హే శిష్య! అపుడా బ్రహ్మదేవుడు మఱల వారి భ్రాంతియొక్క దృఢతనుచూచి తన మనస్సులో యిట్లు విచారము చేయుచున్నాడు. నా శిష్యులగు వీరిద్దరు అల్పబుద్ధిగలవారైయున్నారు. వీరికి అన్వయవ్యతిరేకరీతిగా ఆత్మను బోధించుటకు నేనుపక్రమించెదను. వీరిద్దరు తమ బుద్ధిదోషముచే శరీరము కన్న ఆత్మను భిన్నముగ నెఱుగరు, పైగా స్థూలశరీరమే ఆత్మయని నిశ్చయము చేయుచున్నారు. కనుక వీరి భ్రాంతి నివృత్తికొఱకు యేదోయొక ఉపాయము చేయవలసినది. ఈ శరీరమందు ఉత్కృష్టతను విషయము చేయునట్టి బుద్ధి నంగీకరించి వీరి శరీరమందే ఆత్మరూపతను దృఢము గావించుకొనిరి. కనుక వీరియొక్క ఆ బుద్ధినే అంగీకారముచేసి నేను, శరీరమందు గల వీరియొక్క ఆత్మబుద్ధిని విడిపించి స్ఫురణ రూప ముఖ్యాత్మయందు వీరిబుద్ధిని నియోగింపజేయవలసినది, హే శిష్య! యీ ప్రకారముగ విచారముచేసి బ్రహ్మదేవుడు వీరితో నిట్లనెను. ఓ యింద్రవిరోచనులారా! యీ స్ఫురణరూపాత్మ మరణరహితముగాను భయరహితముగాను పరిచ్ఛేదరహితము గాను, బ్రహ్మరూపుడుగా నున్నాడు. ఇటువంటి ఆత్మదేవుని స్ఫురణస్వరూపతయు నేను చేయు సర్వోపదేశములందు సామాన్యముగ ననుభవమగుచున్నది. హే శిష్య! యీ ప్రకారముగ బ్రహ్మదేవుడు చెప్పినతర్వాతకూడ ఆ యింద్రవిరోచనులు శరీరము నందే ఆత్మరూపతను నిశ్చయము చేయుచున్నారు. మఱియు బ్రహ్మదేవునిచే చెప్ప బడిన ఆత్మసంబంధ అమరత్వాభయత్వాది ధర్మములను స్థూలశరీరమందే యెంచు చున్నారు. హే శిష్య! ఈ స్థూలశరీరమందు అమరత్వాభయత్వాదిధర్మములు సంభవింపకున్నను. యింద్రవిరోచనులచే నా ధర్మములు స్థూలశరీరమందే యేరీతిగా

అంగీకరింపబడినవో చూడుము. లోకమందు జరారోగాదులను, నివృత్తిచేయునట్లు రసాయనరూప ఔషధములును, నానా ప్రకార మంత్రకల్పాది ఉపాయములును గలవు. ఆ సమస్తోపాయములచే జరామరణాదులు దూరమగుచున్నవి. ఆ రసాయనాద్యుపాయములచేత, స్థూలశరీరమందు అమరత్వాదులు సంభవించుచున్నవి. కనుక స్థూలశరీరమునే అజరామరణముగ జేయుటకొఱకు, రసాయన మంత్రకల్పాది ఉపాయముల చేయవలసినది. మఱియు, నెపుడు మా శరీరములందు ఆ రసాయనాదులచే అజరామరత్వములు సిద్ధించునో, అపుడే యీ శరీరములందిక, అభయతయు ప్రయత్నములేక సిద్ధించును. ఏలాగుననగా లోకమందే జీవులు మరణముగలవారై యున్నారో, ఆ జీవులచే తమ మరణ కారణమువలన భయప్రాప్తి యగుచున్నది. ఏ పురుషుడమరుడో, అతడు తన శత్రువుచేతను యెప్పటికిని భయమును పొందడు. మఱియు యెప్పుడు శరీరము నిర్భయమగునో, అపుడు దానియందు బ్రహ్మరూపతయు సంభవించును. ఏలాగుననగా — వ్యాకరణరీతిగా బ్రహ్మశబ్దమున కర్థము వృద్ధిగలది యగును. సంకోచాభావమునకు నామము వృద్ధి. ఆ సంకోచప్రాప్తి జీవులకు భయముచే నగుచున్నది. భయరహితునకు సంకోచములేదు. అథవా నానా ప్రకారరూపముల ధారణచేయునట్టి సామర్థ్యశక్తికి వృద్ధి యని పేరు. ఈ ప్రకారమగు శక్తియును శరీరమందు సంభవించును. ఎందుకనగా — మనుజుడు యోగబలముచేతను దివ్యౌషధబలముచేతను, మృగాశ్వ హస్తి మహిషాది శరీరములను ధారణ చేయుటయందు సమర్థుడగును. ఈ కారణమువలన శరీరమందే బ్రహ్మరూపత సంభవించుచున్నది. అథవా — ఉపదేశారంభకాలమందు బ్రహ్మదేవునిచే ఆత్మకు ఉపహతపాప్మ, విరజ, అవిమృత్యు, విశోక, సత్యకామ, సత్యసంకల్పాది లక్షణములు కథనము చేయబడియె. ఆ సర్వలక్షణములు యోగాద్యుపాయములచే యీ శరీరమందు సంభవించుచున్నవి. ఏలాగుననగా — ఈ శరీర రూపాత్మ రసాయనాద్యుపాయములచే యెపుడు జరామరణరహితుడగునో, అపుడు శోకరహితుడును నగును. ఎందుకనగా — లోకమందు భయమరణములుగలవానికే, సర్వదా శోకమగుచున్నది. మఱియు మంత్రౌషధాదుల బలముచే, ఈ శరీరరూపాత్మ క్షుత్పిపాసలచేతను రహితుడగుచున్నాడు. ఈ ప్రకారముగనే అధికారి పురుషులు. తమ శరీరరూపాత్మను రసాయన మంత్రాద్యుపాయములచే అమరఅభయాది రూపముగజేయుచున్నారో, ఆ యధికారి పురుషులు తమ బలప్రభావమున. భూతాదిసర్వలోకములను ఆ లోకమందలి సకల భోగ్యపదార్థములను పొందుచున్నారు. ఇవ్విషయమున కించిన్మాత్రమునకూడ సంశయములేదు. అథవా. యీ బ్రహ్మదేవునిచే పూర్వము మాకుఁ చక్షువందును శరావమందును, మామాఛాయ చూచునట్టి యే ఉపదేశము చేయబడినదో; ఆ ఉపదేశమును

ఛాయయొక్క దృష్టాంతముచే శరీరాత్మనే, జరా మరణ పాప శోక భయాది వికార ములచే రహితముగ చెప్పుచున్నది ఆ బ్రహ్మదేవుని భాషణముయొక్క అభిప్రాయ మిట్లున్నది యీ ఛాయ శస్త్రముచేతను అగ్నిచేతను నాశమును పొందదు. మఱియు ఛాయకు పాపశోక భయాది వికారములున్ను ప్రాప్తముకానేరవు. స్థూలశరీరమునకు పూర్వోక్తయుపాయములచే పాప భయ శోకాదులు దూరమగుచున్నవి. అథవా ఎట్లు ప్రాతఃకాలమందును సాయంకాలమందును ఛాయ వృద్ధిపొందుచున్నదో, అట్లే ఈ శరీరమున్ను ఉపాయములచే వృద్ధిపొందుచున్నది. ఈ కారణమువలన యీ శరీరమే ఆత్మ, అథవా — ఎట్లు స్వభావముగా నాశరహితమగు ఛాయ, కారణనాశ ముచే నాశనము పొందుచున్నదో, అట్లే స్వభావముగా నాశరహితమగు ఈ శరీర మున్ను నాశనమును పొందుచున్నది.

అథవా! ఎట్లు ఛాయకు యీ శరీరరూపాత్మ కారణమైయున్నదో, అట్లే శరీరరూపాత్మకును. త్వగాది సప్తధాతువులు కారణమైయున్నవి. శస్త్రప్రహారాది బాహ్యనిమిత్తములచేతను. రోగాద్యంతర్నిమిత్తములచేతను, వాతాది దోషత్రయముల చేతను, క్షోభితమై దానివలన సప్తధాతువులు, క్షోభితములై. శరీరరూపాత్మను నాశనము చేయుచున్నవి. కనుక ఎట్లు శరీరరూపబింబముయొక్క స్థిరతచే ప్రతిబింబరూప ఛాయకుస్థిరతయగునో, అట్లు యీ అధికారిపురుషులెపుడు మంత్రౌషధాదుల సేవన ముచే, శస్త్రాగ్న్యాది బాహ్యనిమిత్తములను. రోగాద్యంతర్నిమిత్తములను జనింప నివ్వరో అపుడు వారియొక్క వాతాదిదోషములను, త్వగాదిధాతువులను క్షోభమును చెందవు. అపుడు శరీరరూపాత్మ కెప్పటికిని నాశముకాదు. అథవా — యోగ మంత్ర రసాయనాద్యౌషధ రూపోపాయములచే సిద్ధిని బడసిన శరీరము, అగ్నియందు జలమువలె శీతలముగ నుండును. జలమునందు శిలవలెనుండును, ఆకాశమునందు పక్షివలె నుండును. అథవా — యోగాభ్యాసకాలమందు ఏ మనుజుడెపుడు పృధివ్యాది పంచభూతములను ధారణచేయునో, అపుడు వాని శరీరము పంచభూత సదృశముగ వగును. ఈ కారణమువలన ఆ శరీరము శస్త్రాదులచే భేదింపబడదు. ఒకవేళ అట్టి శస్త్రఘాతాదులచే భేదింపబడినను, ఎట్లు జలము పూర్వవత్తుగా నేకమగునో, అట్లే యోగసిద్ధి శరీరమున్ను మఱల పూర్వవత్తుగానగును. ఈలాగున మంత్రౌషధయోగా ద్యుపాయములచే స్థూలశరీరమందు అజరత్వ, అమరత్వ, అభయత్వాది ధర్మములు సంభవించును హే శిష్య! యీ ప్రకారముగ తమ మనస్సునందు విచారముచేసికొని, కుబుద్ధిగలవారై, అర్థశాస్త్ర, కామశాస్త్ర సంస్కారములచే దూషితమైన చిత్తము గలవా రైనట్టి ఆ యింద్ర విరోచనులు స్థూలశరీరమునే ఆత్మగా నెంచుచున్నారు. బ్రహ్మదేవుని ఉపదేశముచే మేము స్థూలశరీరరూపాత్మను నెఱుగుచున్నామని ప్రసన్నులై తమ్ము

కృతకృత్యులుగా నెంచుకొనుచున్నారు. అనంతరమా యింద్రవిరోచనులు బ్రహ్మదేవునకు నమస్కారములుచేసి. తమ తమ లోకములకు పోదొడగిరి. అక్కాలమందు బ్రహ్మదేవుడు మౌనమును ధరించి యూరక ఉండెను. వారికి పోవుటకుగాని నిలుచుటకుగాని యేమియు చెప్పకుండెను. హే శిష్య! యీ ప్రకారముగ నెపుడా యింద్రవిరోచనులు, బ్రహ్మలోకమునుండి తమ గృహములకు వెడలుచుండిరో, అపుడా బ్రహ్మదేవుడు వారు పోవుచుండుటను చూచి తనమనస్సులో నిట్లు విచారము చేసికొనుచున్నాడు. ఈ దేవపతియగు యింద్రుడు మఱియు అసురపతియగు విరోచనుడు తమ్ములను పండితులుగా వెలుగుచున్నారు. మఱియు లోకమందిద్దరును, మహాబలవంతులని, మహాబుద్ధిమంతులని, ప్రసిద్ధులైయ్యేయున్నారు. వారికి పరస్పరము చాల స్పర్ధకలదు. పర్వతసమానముగ వీరికి అభిమానముగలదు. ఈ కారణమువలన మఱల నన్ను ప్రశ్న చేయలేదు. మఱేమనిన శరీరమునే ఆత్మగానెఱిగి, నమస్కారము చేసి త్వరగా తమ తమ లోకములకు పోవుచున్నారు. ఇపుడు అనుచరులనుబంపి 'మీకు ఆత్మయొక్క యథార్థబోధ కాలేదు గనుక మీరిపుడు మీలోకములకుపోవలదు.' అని యీరీతిగ వీరిని నివారణ చేసిన పక్షమందు, యీ యింద్రవిరోచనులు రాజసప్రకృతి గలవారగుటవలన, తమకు మానభంగమైనదని యెంచి క్రోధావిష్టులై జీవితాశచే కూడ రహితులగుదురు. మానభంగకారకమగు అల్పవచనమునువిని, క్రోధావిష్టులై నాయెదుటకు వచ్చుదురు. ఆ యిద్దఱు యెట్లున్నారనగా దేవతాస్త్రీయొక్క అథవా అసురస్త్రీయొక్క పతినిజంపి వానిమాంసముచే గృధ్రాదులను సంతోషపెట్టువారుగాను, సాధుపురుషులకు భయప్రాప్తి కలుగజేయువారుగానున్నారు. ఈ యింద్రవిరోచనులిద్దఱు, చతురంగసేనను నాశముచేయునట్టి యుద్ధము చేయగలవారు. కనుక వీరియొక్క ఆత్మజ్ఞానప్రసంగమందు, ఏ యొకనిమిత్తము లేకయు అకస్మాత్తుగా అనేక భూతములయొక్క నాశమగును. కనుక వీరిని నివారణము చేయుటుచితముకాదు. శిష్యుడు — హే భగవన్! యుద్ధభయముచే బ్రహ్మదేవుడు యింద్రవిరోచనులను పోవుటనుండి నివారణ చేయలేదను సంగతి శ్రేష్ఠముగ తోచదు. ఆ యింద్రవిరోచనులెపుడు తమ తమ లోకములకు పోవుదురో అపుడు సర్వజీవులకు దేహాత్మవాదమునే ఉపదేశము చేయుదురు. ఆ దేహాత్మవాదమును నిశ్చయముచేసి సర్వజీవులును అనర్థమును పొందుదురు కదా? గురువు — హే శిష్య! యీ దేహాత్మవాదమునుండి నివృత్తము చేయుటకొఱకు బ్రహ్మదేవుడు ఆ దేహాత్మవాదులకు శాపమిట్లిచ్చుచున్నాడు. దేవతలకు అసురులకు మనుష్యులకు యీ యింద్రవిరోచనులు సాక్షాద్గురువులై, అథవా పరంపరగా గురువులై, దేహాత్మవాదోపదేశములను చేయబోవుదురు. కాన వీరియొక్క శిష్యులు ప్రతిశిష్యులు అందఱు యీ జన్మమందును భావిజన్మమందును,

శ్రేయోమార్గమునుండి భ్రష్టులగుదురు. ఎందుకనగా, ఆ మూఢపురుషులు దేహమునే ఆత్మగా నెఱిగిదానిరక్షణముకొఱకై నా నా ప్రకారములగు నుపాయముల చేయుదురు. ఆ యుపాయములన్నియు నిష్ఫలములగును. అపుడా మూఢపురుషులు మహాదుఃఖమును పొందుదురు. ఎట్లు పరిపక్వమైన అన్నము నా నా యుపాయములచేతను కూడ రక్షింపబడక నాశనమునే పొందునో, అట్లే యీ స్థూలశరీరమున్ను నా నా యుపాయములచేతకూడ, అవశ్యముగ నాశమునే పొందును. సకల భూతకోట్లను ధారణము చేయునదియు మహాపర్వతములను కూడ ధారణము చేయదగినదియగు పృథ్వికూడ నాశమగును. జలముచే పూర్ణమైన మహాసముద్రమున్ను యెండిపోవును. తేజోవాయ్వాకాశాది మహాభూతములును నాశమగును అట్టిచో జలబుద్బుదవత్తుగానున్న యీ స్థూలశరీరమేరీతిగా స్థితమగును. అవశ్యముగ నాశము పొందును. అథవా — జరావ్యాధిరూప మృత్యురూపశత్రువు ఏ యన్నజలముతో చేరియున్నదో, ఆ ఐక్యమైన అన్నము అవశ్యముగ నాశము పొందును. అంతర్దేశమందు జరరాగ్ని సర్వదా కాల్చుచున్నది. బాహ్యదేశమందు వృశ్చికాది భూతములు కాల్చుచున్నవి. శస్త్రాస్త్రములచే మృత్యుసంబంధ భయము సర్వదా యుండనేయున్నది. ఇటువంటి స్థూలశరీరమేరీతిగా నిలచును? కదళీవృక్షత్వచవలె, నిస్సారమైన శరీరమేరీతిగా అమతమగును. సర్వ జీవుల స్థూలశరీరములు పుణ్య పాప కర్మ నిమిత్తముచే పృథివ్యాదిపంచభూతములచే పుట్టుచున్నవి.

ఆ భూతములయొక్క నాశమైన పిదప ఆ శరీరమిక యెట్లుండును? ఈ శరీరమునకు కారణమైన యే కర్మముకలదో, దానిచే యీ శరీరమునకు, శతవర్షములవఱకు ఆయుష్యమివ్వబడినది. ఆ శతవర్షానంతరము యింకను అధికముగ ఆయుష్యము నా కర్మమివ్వదు. యెందుకనగా — సృష్టియొక్క ఆదికాలమందు ఈశ్వరుని సంకల్పమట్లేయుండెను. అథవా — వైద్యశాస్త్రమందు ఋషిజనులచే, రసాయనాది యే ఔషధములు చెప్పబడినవో, అవి కేవల శరీరసంబంధరోగనివృత్తికొఱకే చెప్పబడియె. దేహమును అమరముగ చేయుటకొఱకు చెప్పలేదు. ఒకచో రసాయనాది ఔషధములచే, దేహము అమరమైనపక్షమందు ఆ ఔషధముల చెప్పువారైన ఋషులు తాము మొదట అమరులు కావలసియుండె. కాని ఆ ఋషులుకూడా మృత్యువును పొందుచున్నారు. అథవా లోకమం దేపదార్థము జన్మముగలదగునో, ఆ యా పదార్థము నాశముగలదగును. (ఘటపటాదులవలె) అథవా మనుష్యశరీరమునకు పంచవర్షములవఱకు బాల్యావస్థ, షోడశవర్షములవఱకు కుమారావస్థ, అనంతరము షష్టివర్షములవఱకు యౌవ్వనావస్థ, పిదప వృద్ధావస్థ సంభవించుచున్నది. ఈరీతిగా సకలదేహధారి జీవులకు, తమతమ శరీరములయొక్క నాశమున్ను అనుభవసిద్ధమే యైయున్నది

ఇటువంటి దేహము నిత్యమెట్లగును? అథవా జీవుని మరణము యీ దేహముతోడనే పుట్టుచున్నది. ఆ మరణమును నివృత్తిచేయుటకు యే ఒక ఉపాయమున్ను లేదు. —

ఈ విషయము పురాణమందు వ్యాసభగవంతునిచే చెప్పబడియె —

"మృత్యుర్జన్మవతాం వీర! దేహేన సహ జాయతే।
అద్యవాఽబ్దశతాన్తే వా మృత్యుర్వై ప్రాణినాంధ్రువః॥"

భావార్థము — హే వీర! జన్మముగల ప్రాణియొక్క మృత్యువు దేహముతోడనే పుట్టుచున్నది ఆ మృత్యువు నేడుగాని, శతవర్షానంతరముగాని అవశ్యముగ నగును. అథవా మృత్యువును నివృత్తిచేయుటకొఱకు యుపాయము కలదు ఆ యుపాయమేమనగా — మఱల దేహమే గ్రహణము చేయకూడదు. ఈ యొక్క యుపాయమునుగాక, మృత్యునివృత్త్యుపాయము మఱియెద్దియు త్రైలోక్యమందునులేదు.

"మృత్యోర్బిభేషి కిం మూఢ! భీతం ముంచతి కిం యమః।
అజాతం నైవ గృహ్ణాతి కురు యత్నమజన్మని॥"

భావార్థము — హే మూఢా! మృత్యువునకై నీవెందులకు భయపడుచున్నావు? నిన్ను భయయుక్తునిగాచూచి యమధర్మరాజు నిన్ను విడచునుకాబోలు! విడువనే విడువడు. ఏ పురుషునికి జన్మముకాదో, ఆ పురుషుని యమధర్మరాజు గ్రహణమే చేయడు. కాబట్టి నీకు యమధర్మరాజునుండి విడిపింపబడుటకు యిచ్ఛయుండిన పక్షమందు జన్మరాహిత్యమును కలుగజేయునట్టి ఆత్మజ్ఞానమును సంపాదనచేయుమా! యిటువంటి జన్మమరణ నివృత్తికరమగు ఆత్మజ్ఞానము దేహాత్మవాదులకు అత్యంత దుర్లభమైయున్నది. ఎందుకనగా — యీ స్థూలదేహము మరణానంతరము శ్వానాదులచే భక్షింపబడుటవలన విష్టారూపమగుచున్నది అగ్నియందు దహనముచేసినపుడది భస్మరూపమగుచున్నది భూమియందు పాతిపెట్టిన నది మృత్తికారూపమగుచున్నది. ఇటువంటి నాశముగలదేహమెవరిచే ఆత్మరూపముగ జూడబడునో, అటువంటి దేహాత్మవాదిపురుషులు, సద్రూపాత్మజ్ఞాన ప్రాప్తికొఱకు మనఃపూర్వకముగ యత్నము చేయరు. అథవా — ఆ దేహాత్మవాదులకు గురురూపులైన ఏ ప్రహ్లాదపుత్ర విరోచనుని యొక్కయు మఱియు దేవరాజేంద్రునియొక్కయు దేహములుకూడ మరణానంతరము విష్టాభస్మపృధ్వీరూపములవశ్యముగనగును ఎపుడు గురురూపులైన వీరియొక్క దేహములకే యిట్టిగతియగుచున్నదో, అపుడు శిష్యులైన యితర జీవులయొక్క దేహ సంబంధవిషయమేమని చెప్పవచ్చును? అథవా — మూఢపురుషులు ఈ దేహమునే ఆత్మయని యెంచి వివేకసంతోషాది గుణరహితులై కేవలము పాపకర్మములే చేయుదురు. ఆ పాపకర్మములచే ఆ దేహాత్మవాదులు కించిన్మాత్రముకూడ సుఖమును

పొందరు. కేవలము దుఃఖమునే పొందుదురు. ఆదారుణదుఃఖమును వాణిచే వర్ణించుటకుకూడ అశక్యము. దీనివలన సిద్ధించినదేమనగా — యీ యింద్రవిరోచనులచే నుపదేశము చేయబడిన దేహాత్మవాదము, యెవనిబుద్ధియందు ప్రవేశముచేయునో, ఆ సర్వజీవులు ఉభయలోకములందును దుఃఖమునే పొందుదురు. కనుక యీ దేహాత్మవాదము మహామోహమయముగ నున్నది. హే శిష్య! ఈ ప్రకారముగ దేహాత్మవాదముచే లోకులకు అనర్థప్రాప్తియగుటను చింతనముచేసియు, యుద్ధభయమునను బ్రహ్మదేవుడు వారిద్దరితోను కొంచెమైనను భాషణముచేయకుండెను. ఇపుడా యింద్రవిరోచనులు తమ తమ లోకములకు పోయినతర్వాత జరిగినవారియొక్క వృత్తాంతము వచింపబడుచున్నది.

హే శిష్య! దేహరూపాత్మ నెఱిగి అత్యంతప్రసన్నుడైన విరోచనుడు బ్రహ్మలోకమునుండి శీఘ్రముగ తమ యసురసభనుపొందెను. ఆ యసురులు స్వభావముగ తామసులు, మఱియు రజోగుణముచే నావృతులు, లేశమాత్రమైన సత్యములేనివారు, విచారరహితులు. ఇటువంటి అసురులయొక్క సభకు విరోచనుడు వచ్చిచేరెను. ఆ సభయందు అసురులచే బహుసన్మానము పొందినవాడై, సూర్యసమానతేజముగలవాడైన విరోచనుడు ఉచ్చాసనముపై కూర్చుండెను. అనంతరము ఆ మూఢాత్ముడైన విరోచనుడు, బ్రహ్మలోకమందు మహాకష్టముచే, నే దేహాత్మజ్ఞానమును తాను సంపాదనముచేసెనో, ఆ దేహాత్మజ్ఞానమును నా అసురులకుపదేశముచేయనారంభించెను. ఆ యసురులు వాని యుపదేశముకన్న పూర్వమందును, నానా కుతర్కములచే దేహమునే ఆత్మగా నెఱిగినవారు. ఆ దేహాత్మవాదమునే యిపుడు గురుసాంప్రదాయముగ నెఱిగి వారు చాల సంతోషపడిరి. (సహజముగనే బిడ్డ నృత్యముచేయునదైయుండ, కాలునకు గజ్జలుకట్టిన పిదప యికదాని నృత్యమును చూడవలెనా?) విరోచనుడు — ఓ యసురులారా! మీరు దేహరూపాత్మనే సర్వదా పూజనము చేయుడు. ఈ దేహరూపాత్మకన్న భిన్నములగు అగ్ని బ్రాహ్మణాదులెందఱుగలరో, వారియొక్క పూజనము మీరు యెప్పటికిని చేయకుడు. ఎందుకనగా — ఈ శరీరములకన్న భిన్నులగు దేవబ్రాహ్మణాదులెందఱుగలరో వారందఱును యీ దేహముమీదనే ఉపకారము చేయువారుగా నున్నారు. కనుక వారందఱును దేహరూపాత్మకు శేషభూతులై యున్నారు. మఱియు ఈ దేహరూపాత్మయో, ఆ యందఱికిని శేషిభూతమై యున్నది. ఇటువంటి దేహరూపాత్మయొక్క సర్వోత్కృష్టమగు జ్ఞానమేదికలదో, ఆ జ్ఞానమే, ఆ యాత్మయొక్క పూజనమై యున్నది. మఱియు ఓ అసురులారా! ఏ అధికారి పురుషులకు యుభయలోకసంబంధ సుఖేచ్ఛకలుగునో, ఆ పురుషులు తమ గురువులవలె ఈ దేహరూపాత్మను నా నా ప్రకారదుకూలాదులచేతను, సువర్ణజటిత నా నా రత్న

ములచేతను, సూర్యసమానతేజముగల నానా అలంకారములచేతను కోమలస్పర్శముగల సుందరసుగంధపుష్పముల విచిత్రమాలలచేతను, కర్పూర చందనాదులచేతను, శయ్యాసనాన్నపానాదిపదార్థములచేతను, పూజనము చేయవలయును. ఈ ప్రకారముగ నేపురుషులు శ్రద్ధాభక్తిపూర్వకముగ దేహరూపాత్మయొక్క పూజనముచేయుదురో వారుభయలోకములందును సుఖమును పొందుదురు. అసురులు — ఓ భగవంతుడా! ప్రత్యక్షనాశముగల యీ దేహముయొక్క పూజనముచే సుఖప్రాప్తి యెట్లగును? కాదు. విరోచనుడు — ఓ అసురులారా! రసాయనాద్యుపాయములచే సిద్ధినిపొందినదైనచో, ఆ దేహరూపాత్మకిక నెప్పటికిని మరణము గలుగదు. మఱియు నే దేహరూపాత్మ యీ యుపాయములచే సిద్ధిపొందలేదో, అద్దానికి విచారహీనులగు మూఢపురుషులచే మరణావస్థ అంగీకరింపబడినను, వివేకపురుషులు అట్లే మరణమైనపిదప దేహరూపాత్మను దహనము చేయకూడదు. ఎందుకనగా — సంగ్రామకాలమందు శస్త్రాస్త్రప్రహారములచే, పీడితుడైన ఒకానొక శూరవీరుడు కించిత్కాలమువఱకు సర్వచేష్టారహితుడై, మూర్ఛితుడై యెట్లు శయనము చేయుచున్నాడో, అట్లే యీ దేహరూపాత్మయు రసాయనాదిసిద్ధులచే ప్రాప్యమైనచో, కించిత్కాలమువరకు మరణించిన వానివలె శయనము చేయుచున్నాడు కాని మరణముపొందదు. అతడు మరణించెనని తలంచి కాల్చకూడదు. మఱేమనిన ఆ దేహరూపాత్మ మొదట శ్రేష్ఠజలములచే స్నానముచేయించి సుగంధ పుష్పచందనాదులచే శోభితముగజేసి నానా ప్రకార వస్త్రభూషణములచే నలంకరించి, బంధుజనులద్దానిని విమానమందు కూర్చుండబెట్టి నానా ప్రకార వాదిత్రసహితముగ బయటకు తీసుకొనిపోవలయును.

మఱియు భక్ష్య, భోజ్య, లేహ్య, చోష్యములను నీచతుర్విధ అన్నములను, సుగంధశీతలజలముచే పూర్ణమైన కలశమును తోడనే బయటకుతీసుకొని పోవలయును. ఆ తరువాత ఆ దేహరూపాత్మకు నివాసయోగ్యమైన భూమియందు, గర్త (గొయ్యి) రూపగృహమును తయారుజేసి ఆ గృహమును అన్నిప్రక్కల శుద్ధము చేయవలయును. పిదప అందు కోమలమగు యాసనముపఱచి దానిపై ఆ దేహరూపాత్మనుంచి సంరక్షించుచు, రెండుప్రక్కల ఆ భక్ష్యభోజ్యాది పదార్థములను జలకలశమును నుంచవలయును. ఎట్లు మహారాజుయొక్క భృత్యులు మహారాజుకొఱకు, నానా ప్రకార సామాగ్రుల, సిద్ధముచేయుదురో, అట్లే బంధుజనులాదేహరూపాత్మకొఱకు నానా ప్రకారభోగ్య పదార్థములను సిద్ధము చేయవలయును. ఆ గృహమెంత విస్తీర్ణత కలిగి యుండవలయుననగా — దానివలన నా దేహరూపాత్మకు నిద్రాభంగము కాకూడదు. ఆ భూగృహము చిరకాలమువఱకు నాశముగాకుండుటకై యొక కాష్ఠరూపవేదికవా గృహముపై రచింపవలయును. దానిచే వృష్టి, తాపములయొక్కయు, మాంసభక్షక

జంబుకాదిప్రాణులయొక్కయు - ప్రవేశముగాకుండును అపుడా - దేహరూపాత్మ మహారాజువలె బహుకాలమువఱకు సుఖముగా శయనముచేయును

ఓ అసురులారా దేహాత్మమతమునకు ఆదిగురువైన బ్రహ్మదేవుడు తన శిష్యులను చూచుటకొఱకై యెపుడువచ్చునో అపుడు వాయువుచే సర్వత్రవ్యాపకమగు బ్రహ్మదేవుని దేహసంబంధ సుగంధముచే సర్వదేహరూపాత్మలు ఆ దీర్ఘనిద్రనుండి లేచుదురు ఎట్లు శస్త్రప్రహారములచే మూర్ఛను పొందినవారైన శూరవీరుడు- వాయు స్పర్శచేలేచి తన శత్రువులను నాశము చేయుచున్నాడో అట్లే దేహరూపాత్మలున్ను ప్రాజాపత్య వాయుస్పర్శముచే దీర్ఘనిద్రనుండిలేచి పూర్వసంస్కారవశమున మఱల రసాయనాద్యుపాయముల చేయుదురు

ఓ అసురులారా యీ ప్రకారమగు ప్రయత్నము చేయుచుండ కొంతకాల మునకా దేహరూపాత్మలు అమరులగుదురు కాన దేహరూపాత్మను అమరము చేయుటకొఱకు మీరందఱు దైత్యులును రసాయనాదుల సిద్ధముచేయుడు యోగ పరాయణులగుడు దయారహితులై మన శత్రువులైన - దేవతల నాశముచేయుడు ఓ అసురులారా ఆ వివేకపురుషులచే పూజ్యులైన ఏ బ్రాహ్మణగోదేవతాసాధువులు గలరో, వారి శరీరములితరశరీరములకన్న విలక్షణములు కావు బ్రాహ్మణునకు రెండుకాళ్ళు అట్లే శూద్రునకును రెండుకాళ్ళు ఆవునకు నాల్గుకాళ్ళు అట్లే గుఱ్ఱమున కును నాల్గుకాళ్ళు ఆలాగున అందఱును సమానులే ఇటువంటి సమానస్వభావము గల శరీరములందు బ్రాహ్మణులు పూజ్యులు శూద్రులపూజ్యులను నీ ప్రకారవిషయ కల్పనయుచితముగాదు ఎట్లు బ్రాహ్మణాదుల శరీరమందు విశేషతలేదో అట్లే వారి శరీరకారణమందును విశేషతలేదు ఏలాగుననగా — ఎట్లు బ్రాహ్మణుల శరీరములు కామయుక్త మాతాపితృల శుక్లశోణితములచే పుట్టుచున్నవో శూద్రాదుల శరీరములును అట్లే పుట్టుచున్నవి ఓ అసురులారా ఒకవేళ మీరు — జగత్కర్త ఈశ్వరుడై యున్నాడు ఆ యీశ్వరునకు బ్రాహ్మణులందు పక్షపాతము గలదు కనుక బ్రాహ్మ ణునియందు విశేషతకలదు. అని అనిన అట్లనుటయు సంభవింపదు ఎందుకనగా శాస్త్రవేత్తలచే ఈశ్వరలక్షణమేది కథనము చేయబడినదో ఆ లక్షణము కామదేవుని యందును ఘటించుచున్నది కనుక కామదేవునికన్న భిన్నమగు యింకొక యీశ్వరుడు లేదు. - ఇపుడు ఈశ్వరలక్షణము కామదేవునియందు చూడుడు కాముడే - సకల జీవులకు జననియు జనకుడును అగును కాముడే బ్రాహ్మణుడుగాను కాముడే గోవు గాను - కాముడే దేవతగాను, కాముడే భ్రాతృరూపముగాను కాముడే ధాతృరూపము గాను కాముడే గృహితృరూపముగా నున్నాడు కాముడుతప్ప జగత్తునకింకొక

కారణము లేదు. ఓ అసురులారా! పృథ్విపై యెక్కడెక్కడ జలాశయములుగలవో, అవి అంశరూపముగాను, సముద్రము వానికి అంశిరూపముగ నున్నవి. కనుక సముద్రము సకల జలముకన్న శ్రేష్ఠము. అట్లే లోకమందు దేహముకన్న భిన్నమైనట్టి పదార్థములను, విషయము చేయునట్టి కామము లెన్నిగలవో, ఆ సకలకామముల కన్నను యీ దేహవిషయకకామమే శ్రేష్ఠము. ఎందుకనగా — బ్రహ్మాండమందెందఱు దేవతాఋషిదైత్యమనుష్యాది ప్రాణులుగలరో, వారందఱు ఆయా భోగ్యపదార్థములను కామనచేసియే తమ తమ దేహసంబంధవ్యాపారముల చేయుచున్నారు. కామనలేక ఏ ప్రాణియు, ఏ వ్యాపారమందును వర్తింపదు. దానివలన నభోగ్యపదార్థ విషయమైన అన్ని కామములును తమ దేహముకొఱకేనని తెలియుచున్నది. కనుక ఆ సకలకామములకన్నను భోగ్యపదార్థములకన్నను దేహమే అత్యంత శ్రేష్ఠమై యున్నది. కనుక ఓ అసురులారా! ఆస్తికమనుజులకు పూజ్యులైనట్టి, బ్రాహ్మణ గోసాధువులకన్నను, దేహమే శ్రేష్ఠమై యున్నది. మఱియు ఆ అందఱును దేహమునకే ఉపకారకులై యున్నారు. కనుక మీరు మీదేహమునే, బ్రాహ్మణగోసాధు రూపముగా నెఱింగి రక్షణము చేయుడు.

మఱియు ఓ అసురులారా! లోకమందు సుఖప్రాప్తిచేయునట్టి కర్మము పుణ్యమనియు, దుఃఖప్రాప్తిచేయునట్టి కర్మము పాపమనియు అనబడియె. పశ్వాదుల హింస, పరస్త్రీగమనము, పరవిత్తహరణము యిత్యాది కర్మములు జీవులకు ప్రసిద్ధముగ సుఖప్రాప్తి కారకములు. కనుక యివి పుణ్యకర్మములే యగును ప్రాతః స్నానము, అగ్నిహోత్రము, చాంద్రాయణాది వ్రతములు జీవులకు ప్రసిద్ధముగ దుఃఖకారకములు, కనుక యివి పాపకర్మములే యగును. ఇటువంటి పాపకర్మములను మీరెన్నటికి చేయకూడదు. మఱేమనిన హింసాదిపుణ్యకర్మములే మీరు సర్వదా చేయుడు. ఓ యసురులారా! దేహరూపాత్మకు అనుకూలముగా వర్తనము చేయువారిని మీరు దేవతలనియు, సాధువులనియు యెఱుగవలయును. మఱియు దేహరూపాత్మకు ప్రతికూలముగ వర్తనముచేయువారు, అసురులని యెఱుగవలెను. ఇటువంటి అసురులను మీరు అవశ్యముగ చంపవలయును.

ఓ అసురులారా! ఒకచో మీ పితృాదులు దేహరూపాత్మకు ప్రతికూలముగ వర్తనముచేసినచో వారినికూడ మీరు చంపవలయును. ఎందుకనగా — పితృమాతృ భ్రాతృజాయాపుత్రాదులయందెవడును తనకు ప్రతికూలుడైన జనులతోటి మిత్రత నెఱుగరు శత్రుతయే యెఱుగుదురు. కనుక దేహరూపాత్మకు ప్రతికూలమైనవారిని మీరవశ్యముగ చంపుడు. ఇంతవఱకు విరోచనుడు అసురులకు తన మతమునుగూర్చి కథనము చేసెను. ఇకనిపుడు వైదికమతమందు దోషనిరాపణచేయుచున్నాడు —

ఓ అసురులారా! బ్రాహ్మణాదులను చంపుటయందు పరస్త్రీగమనమందు పరధన హరణమందు వైదికపురుషులచే పాపము కథనము చేయబడియె. ఆ సకలవచనములు మిథ్యగనున్నవి. ఎందుకనగా ఏ కర్మముచే పురుషునకు దుఃఖప్రాప్తియగునో అదియే పాపకర్మము. అట్టి పాపకర్మలక్షణము బ్రాహ్మణవధాదులందు ఘటింపదు. తమ విరోధులగు బ్రాహ్మణాదుల వధానంతరము మనుజులకు సుఖమేయగుచున్నది. పరస్త్రీ సంభోగముచేతను, పరధనహరణముచేతను సుఖమేయగును. కనుక నవ్వియవి పాపకర్మములుకావు. పుణ్యకర్మములే. ఓ అసురులారా! — వైదికులిట్లందురు. హింసాదికార్యములు వర్తమానకాలమందు సుఖప్రాప్తిచేసినను, కాలాంతరమందు దుఃఖప్రాప్తియే చేయును. కాని యిట్లనుటకూడ సంభవింపదు. ఎందుకనగా — ఏది కార్యోత్పత్తికి అవ్యవహితపూర్వకాలమందుండునో, అదే యుత్పత్తియందు కారణమగును. మృత్తికా, కులాలాదులు ఘటరూపకార్యోత్పత్తికి అవ్యవహిత పూర్వక్షణమందుండును. కనుక అవి ఘటమునకు కారణమగును. ఈ ప్రకారమగు లక్షణము హింసాదులందు ఘటింపదు. ఎందుకనగా — హింసాదికర్మములు వాట్ల లక్షణములుమాత్రముండును. అట్టివి భావికాలమందు పుట్టదగిన దుఃఖపర్యంతముగ నుండవు మఱియు పూర్వనష్టకర్మము భావిదుఃఖమునకు కారణమనిన, పూర్వనష్ట కులాలాదులచేతను, భావిఘటము పుట్టవలసియుండెను. అట్లు పుట్టుటలేదు — మఱియు ఆ వైదికులిట్లందురు. — ఆహింసాది కర్మములు అపుడు - నష్టమైనను, వాటిచే పాపరూపాదృష్టము పుట్టును. ఆ యదృష్టముచే భావిదుఃఖముపుట్టును. యిట్లనుటయు సంభవింపదు. ఎందుకనగా — ఏ స్థలమందు దృష్టకారణము సంభవింపదో, ఆ స్థలమందే అదృష్టకారణమును కల్పనచేయవలసినది. దృష్టకారణము సంభవింపుచుండగా అదృష్టకారణకల్పన సంభవింపదు. భావిదుఃఖోత్పత్తియో, కుపథ్యసేవనాది దృష్టకారణములచేతనే సంభవింపుచున్నది. కనుక పాపరూపాదృష్ట కారణ మంగీకరించుట నిష్ఫలము. అహింసాసత్యబ్రహ్మచర్యాది తపములు యజ్ఞ యాగాదికర్మములు జీవులకు క్లేశకారణములేయై యున్నవి. కనుక వాటిని పాప కర్మములని యెఱిగి మీరు పరిత్యాగముచేయుడు. ఓ అసురులారా! ఆ తపోయజ్ఞా దులకు మేముమాత్రమే, పాపరూపతను కథనము చేయుటలేదు. ఆ వైదికవచనముల చేతనే. తపోయజ్ఞాదులందు పాపకర్మత హింసాపరస్త్రీగమనాదులందు పుణ్యకర్మత విచారముచే సిద్ధించుచున్నవి. కాబట్టి మీరందఱును తపోయజ్ఞాదిపాపకర్మలను పరిత్యాగముచేసి, హింసాపరస్త్రీగమనాదిపుణ్యకర్మాదులనే యాచరణము చేయుడు. ఓ అసురులారా! సృష్టియొక్క ఆదికాలమునుండి పరంపరోపదేశముగ వచ్చుచున్న వేదములయొక్క సంప్రదాయము ద్వివిధముగా ప్రవర్తమగుచున్నది. అందు హింసా

పరస్త్రీగమనాదులచే నూతవర్గ ప్రాప్తియగుననెడు నీ ప్రకారమగు దూషితమైన చిత్తము గలవారైన భీరుపురుషులకొఱకు, శీఘ్రముగ సుఖప్రాప్తిచేయునట్టి హింసాదులు పాపకర్మమనియు శీఘ్రముగ దుఃఖప్రాప్తిచేయునట్టి తపోయజ్ఞాదులు పుణ్యకర్మమనియు నొక సంప్రదాయముకలదు. మఱియు భయదోషరహితులైన, వీరపురుషులకు తపోయజ్ఞాదులు పాపకర్మమని, హింసాపరస్త్రీగమనాదులు పుణ్యకర్మమని యొక సంప్రదాయముకలదు. ఓ అసురులారా! యిట్టి సృష్టియొక్క ఆదికాలమునుండి. యింతవఱకు భీరుసంప్రదాయము, వీరసంప్రదాయమున్ను విద్యమానములై యున్నవి. అట భీరుసంప్రదాయమో బ్రాహ్మణదేవతాదులందు వర్తమానమైయున్నది. వీరసంప్రదాయ మొకటి మనయందే వర్తమానమైయున్నది. ఇంకెక్కడనులేదు

ఓ అసురులారా! యీ వీరసంప్రదాయమును బ్రహ్మదేవుడొకడును, నేనొకడును యెఱుగుచున్నాము. మేమిద్దరముగాక యింకెవడును యీ వీరసంప్రదాయము నెఱుగడు. ఎందుకనగా; మేమిద్దరముగాక యితరులైన బ్రాహ్మణదేవతాదులెందఱుగలరో వారందఱును దుష్టసంగమముచేతను, అసామర్థ్యముచేతను దూషితులుగానున్నారు. ఈ కారణమువలన వారు యీ వీరసంప్రదాయమున కధికారులుకారు. పైగా ఆ బ్రాహ్మణాదులు మోహవశులై వీరసంప్రదాయమును నిందచేయువారై యున్నారు. ఇటువంటి ఉత్తమసంప్రదాయము పూర్వపుణ్యప్రభావముచే మనకు ప్రాప్తమైనది ఓ అసురులారా! సకలసుఖసాధనమైన పుణ్యకర్మలకు కారణమగు యీ వీరసంప్రదాయమును మీ అసురులందఱు తమ భుజబలమున లోకత్రయమందు ప్రవృత్తముగ జేయుడు. ఓ అసురులారా! ఎంతవఱకు వీరసంప్రదాయవిరోధులైన బ్రాహ్మణదేవతలను మీరుహననముచేయరో, అంతవఱకు వీరసంప్రదాయమునకు ప్రవృత్తికాదు. ఓ అసురులారా! మా ఉపదేశమంగీకరించి దయారహితులై యెపుడు మీరు బ్రాహ్మణదేవతలను హననము చేయుదురో, అపుడే మీకు యిహలోకమందును పరలోకమందును సుఖప్రాప్తియగును. — హే శిష్య! యీ ప్రకారముగ నెపుడు విరోచనునిచే ఉపదేశము చేయబడినదో, అపుడా అసురులదే ప్రకారముగ సకలజగత్తునకు, దుఃఖప్రాప్తి జేయ నారంభించిరి. దయారాహిత్యము క్రూరకర్మము, బ్రాహ్మణాదులతోటి విరోధము, సర్వదా స్థూలదేహముయొక్క సంతోషము, మరణానంతరపు నానాలంకారము, సర్వదా హింసాకర్మము చేయుటయును నీ యసురుల సంప్రదాయము వర్తమానకాలమందును బహుజనులందు కాన్పించుచున్నది. మరణానంతరము మృతదేహమును పూజనముచేయుటచే, ఆ దేహరూపాత్మకు పరలోకమందు జయమగుచున్నదను, నీ ప్రమాణవచనమును ఆ మూఢపురుషులే రచించిరి. దానివలన ఆ మందబుద్ధులగు పురుషులందు ఆశ్చర్యరూపమగు మూర్ఖత విద్యమానమైయున్నదని తెలియుచున్నది.

మొదటిది, స్థూలశరీరమును ఆత్మగా నెఱుగుట, రెండవది దేహరూపాత్మయొక్క ప్రేతమును అలంకరించుటచే, ఆ దేహరూపాత్మకు పరలోకమందు శ్రేష్ఠఫలప్రాప్తి యగునని తలంచుట ఇంత మూఢత యెక్కడుండును? హే శిష్య! ఆ దేహాత్మవాదుల మతమందు లేశమాత్రమైన యుక్తిలేదు. మరణానంతరము భూమియందు పూడ్చబడునదై ప్రేతమున్నగుచున్నది. అట్టి ప్రేతము మఱల యేరీతిగాలేచును? ఇంత విచారమైన వారికిలేదు హే శిష్య! తమ మతమును సిద్ధింపజేయుటకై దేహాత్మవాదులు వచియింపు యుక్తినిచూడుము — ఎట్లు జలపూరితతటాకమందు స్థితములైన మండూకములు జలమెండినతర్వాత మృత్తికయందులయించి వర్షాకాలమందు ఆ తటాకము జలపూర్ణమగునపుడు మఱల జీవితములై లేచుచున్నవో, అట్లే మరణానంతరము పృథ్వియందు లయభావమును పొందినవైన ఆ దేహరూపాత్మలును, బ్రహ్మదేవుని సుగంధముచే మఱల లేచుచున్నారు. ఈ దృష్టాంతము సంభవింపదు. ఎందు కనగా తటాకజలము యెండినతర్వాత మండూకములు సర్వదానాశనము చెందవు. మఱేమనిన సర్వాంగముల సంకోచముచేసి, అవి జలవియోగముచే మూర్ఛాభావమును పొంది మృత్తికయందు జీవమానముగ నిలుచుచున్నవి. వర్షాకాలమందు జలసంబంధముచే మఱల లేచుచున్నవి. వానిలోనూ యే మండూకమును కాకాదిపక్షులు భక్షణము చేయుచున్నవో, అవి వర్షాకాలమందు లేవవు అట్లే పృథ్వియందు నాశమైన మృతదేహమున్ను మఱలలేవదు. లేచుననుట అత్యంతవిరుద్ధము. అథవా మన్నయిన దేహములు ప్రాజాపత్యవాయువు సంబంధప్రభావముచే మఱల లేచుచున్నవను, విరోచనునివచనము ఉష్ట్రలగుడన్యాయమున తన యుక్తిచేతనే ఖండింపబడుచున్నది. (కాష్ఠభారముగల ఉష్ట్రమును ఆ కాష్ఠభారమందలి ఒక కాష్ఠముతో కొట్టుట ఆ న్యాయమునకర్థము) — ఆ విరోచనునిచే వైదికమతఖండనము కొఱకు పూర్వ మీ యుక్తి చెప్పబడియె — ఎంతవఱకు దృష్టవస్తువుయొక్క సంభవమగునో అంతవఱకు ఆ దృష్టవస్తువుయొక్క కల్పన అయోగ్యమగును. కనుక భావిదుఃఖమందు పాపరూపాదృష్టము కారణముకాదు. మఱేమనిన కుపథ్యసేవనాది దృష్టనిమిత్తములే భావిదుఃఖములకు కారణములు — యీ దృష్టార్థకల్పనా రూపదూషణము ఆ విరోచనుని మతమందే ప్రాప్తించుచున్నది. ఏలాగుననగా —. పృథ్వియందు లయమైన శరీరమునకు ప్రాజాపత్యవాయుసంబంధముచే ఉత్థానమొందుట అదృష్టకల్పనయే యైయున్నది. నష్టమైన దేహమునకు మఱల యుత్థానమెచటను కాన్పించదు. అథవా — విరోచనునిచే వైదికసంప్రదాయము భీరుసంప్రదాయమనబడియె. లోకమందు నారదముని భృగుఋషి దేవరాజేంద్రుడు స్వాయంభువమనవు మొదలగు మహాపరాక్రమశీలురును మహాబుద్ధిగలవారునగు మహాపురుషులను ఏరీతిగా భీరువు

లనవచ్చును నారదాది మహాపురుషులను భీరువులనుట అత్యంత అనుచితము. దైత్య సభయందు స్థితుడైన విరోచనుడు మూఢులైన అసురులగూర్చి పైనదెల్పిన విధమున యేదేది వచించెనో, ఆ యన్నివచనములున్ను మిథ్యయై యున్నవి కాబట్టి ఆస్తిక పురుషులు ఆ విరోచనుని కామమోహితుడని యెఱుగవలసినది. ఇటువంటి సర్వ ప్రమాణ విరుద్ధమగు విరోచనమతమును ఉన్మత్తపురుషుని వచనముతోటి సమానముగ నెఱిగి ఆస్తికపురుషులు సర్వథా పరిత్యాగము చేయవలసినది.

హే శిష్య! ఏ కామాతురపురుషులు నరకమార్గరూపమగు ఆ అసురమతము నంగీకారముజేసి పూర్వోక్తకుతర్కములచే హింసాదిపాపకర్మములను పుణ్యరూపముగ నెఱిగి ఆచరణచేయుచున్నారో, అట్టి పాపాత్ములు యిహలోకమందపకీర్తినిబొంది పరలోకమందు మహాదుఃఖముల ననుభవించుచున్నారు. ఈ విషయము శ్రీగీతాది శాస్త్రములయందు శ్రీకృష్ణాదిశ్రేష్ఠపురుషులచే కథనము చేయబడియె. కాన యే పురుషులకు సుఖేచ్ఛగలదో అట్టి అధికారపురుషులు కంఠమందు ప్రాణముండువఱకు విరోచనసంప్రదాయమందు ప్రవేశము చేయకూడదు

ఇంతవఱకు విరోచనుని వృత్తాంతము చెప్పబడియె. ఇపుడు యింద్రుని వృత్తాంతము వచింపబడుచున్నది. హే శిష్య! బ్రహ్మలోకమునుండి యింద్రవిరోచను లిరువురును తమతమ లోకములకు పోవుటకు వెడలినపుడు అర్ధమార్గమందు దేవరాజేంద్రుడు విరోచనుని తామసిగాచూచి మెల్లమెల్లగనడచు కారణముచే యాతనిని విడచి మార్గమందు ఒక యేకాంత స్థానమందు స్థితుడై విచారముచేసి పూర్వము తాను గ్రహించిన ఆత్మయందు రెండుప్రకారములగు దోషములను చూచుచున్నాడు. దేవతలు మనుష్యులు, అసురులు, వీరుమువ్వురు ప్రజాపతిని తమ తమ శ్రేయమునకు గాను సాధనమడిగినట్లు బృహదారణ్యకోపనిషత్తునందు గలదు. వారికి ప్రజాపతి "ద" అను అక్షరమును వచించెను. అపుడు తమ తమ భావనానుసారముగ యీ "ద" కారమును దేవతలు యింద్రియనిగ్రహరూపదమమనియు, మనుష్యులు గోసువర్ణాదులదానమనియు, అసురులు దయయనియు, అర్థముగ గ్రహించిరి. అట్లే యింద్ర విరోచనులకు బ్రహ్మదేవునిచే "య ఏషోఽక్షిణి పురుషో దృశ్యత ఏష ఆత్మా" అను నీ ప్రకారమగు వచనము చెప్పబడియె విరోచనుడావచనమునకు లక్షణముచే ఛాయా సదృశదేహమునే ఆత్మగా నెఱిగెను. ఈ ఛాయనే ఆత్మగా నెఱిగెను. కాని యింద్రుడు ఛాయయందు రెండు దోషములను చూచెను. ఈ ఛాయకు స్వరూపసిద్ధిని జేయునట్టి దేహములకే జననమరణాద్యనేక వికారములు గలవు. ఆ వికారములు విద్యమానమై యుండగా యీ దేహము అమృతత్వ అభయత్వాది ధర్మము గలదిగా యేరీతిగావగును?

యేరీతిగాను కాదు. జన్మమరణాది వికారములుగల ఘటాదిపదార్థమెట్లు ఆత్మకాదో అట్లే దేహమున్ను ఆత్మకాదు. బింబరూప దేహమందే ఆత్మరూపతసిద్ధింపనపుడు ప్రతిబింబరూప ఛాయయందు ఆత్మరూపత యెట్లు సిద్ధించును? ప్రాతఃకాల సాయంకాలమం దభివృద్ధినొందుటవలన ఛాయవలన బ్రహ్మరూపత సంభవించినను దేహమువలె ఛాయయు పరిత్యజింప యోగ్యమైనది. ఎందుకనగా ఆ ఛాయ సర్వదా దేహముయొక్క గుణదోషములను తనయందు ధారణచేయుచున్నది. ఈ ప్రకారముగ ప్రతిబింబమైన ఛాయారూపాత్మ జడమున్ను నాశవంతమునగును. మఱియు బ్రహ్మదేవుడు ఆత్మజ్ఞానముచే సకలభోగప్రాప్తి వచించెను. ఆ ఛాయారూపాత్మయొక్క జ్ఞానముచే సర్వభోగములప్రాప్తిని నేను చూచుటలేదు. కనుక ఛాయ ఆత్మకాదు. మఱేమనిన ఛాయకన్న భిన్నమగు యేదోయొకటి ఆత్మయైయుండును. అథవా-బింబరూపదేహమునకు నాశమగునపుడు ఛాయకును నాశమగును. అపుడు పుణ్యపాప కర్మ సంబంధసుఖదుఃఖఫలోపభోగముకొఱకు ఛాయకు పరలోకగమనము సంభవింపదు. కాన యీ విషయమై బ్రహ్మదేవుని మఱల నడుగవలయును. ఈ ప్రకారముగ విచారముచేసుకొని, ఆ సాత్త్వికస్వభావముగల యింద్రుడు మఱల సమిధాది పదార్థములు హస్తమందు గ్రహించి బ్రహ్మదేవుని యెదుటకుపోయెను.— ఇంద్రుడు మఱల వచ్చుచుండుటచూచి మందమందముగ హాస్యముచేయుచుండ బ్రహ్మదేవుడు దేవరాజేంద్రునితో యిట్లనియె హే ఇంద్ర! నీవు విరోచనునితోగూడ ప్రసన్నమనస్కుడవై యిటనుండి పోయితివి. మఱల యెందులకు వచ్చితివి? హే శిష్య! యీ ప్రకారముగ బ్రహ్మదేవుడడిగినపుడు ఛాయయందును శరీరమందును చూడబడిన దోషములను యింద్రుడు బ్రహ్మదేవునకు విన్నవించెను. అది విని బ్రహ్మదేవుడిట్లనియె:— హే ఇంద్ర! దేహము ఛాయ యీ రెంటిని జడమను చున్నావు. మఱియు వీటికి భోక్తృత సంభవింపదనుచున్నావు. అది యథార్థమే యైనను ఏ ఆత్మయొక్క ఆ విజ్ఞానముచే నీ వింతపరిశ్రమచేయుచున్నావో ఆ యాత్మను విరోచనునితో సహా నేను నీకు యథార్థముగ నుపదేశించితిని. దానికి విపరీతార్థముచేసి వాకుపాలంభన మొసంగుచున్నావు. (యిది వచనసంక్షేపరూప ఆమక్తోపాలంభము.) ఇంత పరిశ్రమ తీసుకొనుచున్నావు హే ఇంద్ర! యిపుడు నీవు మఱల ముప్పదిరెండు సంవత్సరముల బ్రహ్మచర్యము చేయుము. ఆ పిదప ఉపదేశము చేసెదను. హే శిష్య! మఱల యిట్లే బ్రహ్మచర్యముచేసి, యింద్రుడు బ్రహ్మదేవుని యెదుటకువచ్చి నమస్కారముచేసిన పిమ్మట బ్రహ్మదేవుడు వానితోనిట్లనియె. హే ఇంద్ర! పూర్వము నేను చక్షువునందు శరావమునందు, యే పురుషునిగూర్చి ఉపదేశముచేసితినో,

ఆ పురుషుడే స్వప్నావస్థయందు తన విభూతిరూప నానాప్రకార విషయములను సాక్షిరూపముగ అనుభవము చేయుచున్నాడు. ఆ పురుషుని నీవు ఆత్మరూపముగా నెఱుగుము.

హే శిష్య! అపుడింద్రుడు బ్రహ్మవచనములబట్టి అంతఃకరణ విశిష్ట తైజస నామ జీవుని ఆత్మగా నెఱిగి చాలప్రసన్నుడై పూర్వమువలె బ్రహ్మదేవునకు నమస్కారముచేసి, మఱల తనలోకమునకు పోతొడగెను. అర్ధమార్గము జనినపిదప యేకాంతదేశమందు స్థితుడై మఱల విచారముచేసిచేసి, స్వప్నపురుషునియందుకూడ దోషమును చూచుచున్నాడు. ఈ స్వప్నద్రష్ట స్థూలదేహసంబంధదోషములను ప్రాప్తముగాకున్నను, వీనియందు మహాదోషములు కనబడుచున్నవి - అవేమనగా — స్వప్నావస్థయందు స్వప్నద్రష్టయగు పురుషుని శత్రువెవడో హననముచేయుచున్నాడు. మఱియు నెట్లు జాగ్రత్తునందు ప్రమత్తగజము క్రోధావిష్టయై తన తొండమును పైకెత్తి బాలకునకు భయమును చూపుచున్నదో, అట్లే స్వప్నావస్థయందును, స్వప్నద్రష్టకు వ్యాఘ్రసర్పాది అనేకజీవులు భయమును చూపుచున్నవి. మఱియును స్వప్నద్రష్టయగు పురుషుడు ఆప్తజనుల వియోగముచే పరమదుఃఖమును పొందుచున్నాడు. రోదనము చేయుచున్నాడు. ఈ మొదలగు అనేక దోషములు స్వప్నద్రష్టయందు చూడబడుచున్నవి. బ్రహ్మదేవునిచేతనో అమృతాభయ బ్రహ్మరూపముచే ఆత్మలక్షణము కథనము చేయబడియె. ఆ లక్షణము స్వప్నద్రష్టయందు ఘటింపదు. కనుక, స్వప్నద్రష్ట ఆత్మకాదు. వీనికన్న వేఱైనదేదియో ఆత్మయై యుండవలసినది. ఈ ప్రకారముగ విచారముచేసి యింద్రుడు, మఱల బ్రహ్మదేవునియొద్దకు వెళ్ళెను. అప్పుడు యింద్రునిచూచి బ్రహ్మదేవుడిట్లనియె — హే దేవరాజేంద్రా! మఱల యేల వచ్చితివి? హే శిష్య! అపుడా యింద్రుడు స్వప్నద్రష్టయందు చూడబడిన దోషములను బ్రహ్మదేవునకు విన్నవించెను. బ్రహ్మదేవుడు వానికి మఱల ముప్పదిరెండు సంవత్సరములు బ్రహ్మచర్యమాచరించుటకై ఆజ్ఞయొసగెను. తదనుసారముగ బ్రహ్మచర్యముచేసి మఱల నాతడు బ్రహ్మదేవుని యెదుటకువచ్చి నమస్కారపూర్వకముగ ఆత్మసంబంధప్రశ్ననడిగెను. అది విని బ్రహ్మదేవుడిట్లనియె. హే ఇంద్రా! ఏకాలమందు మనుజుడు సకలవిశేషజ్ఞానరహితుడై శయనము చేయుచున్నాడో, అపుడాతడు, హృదయాకాశరూప బ్రహ్మలోకమందు, ఆత్మతో నైక్యభావమునుపొంది సకల దుఃఖరహితుడగుచున్నాడు. మఱియు సకలేంద్రియరహితుడగుచున్నాడు. కాని ఆ హృదయాకాశబ్రహ్మలోకము నెఱుగకనే బయటకువచ్చుచున్నాడు. ఆ మాయామాత్రోపాధిగల బ్రహ్మలోకమే అమృతాభయ బ్రహ్మరూపముగుటవలన నీ ఆత్మయై యున్నది. ఈ ఆత్మనే నేను పూర్వమున్ను ఉపదేశము చేసియుంటిని.

హే శిష్య ! యీ ప్రకారముగ బ్రహ్మదేవుడు చెప్పినపుడు యింద్రుడు, అజ్ఞాన విశిష్టప్రాజ్ఞనామకజీవుని ఆత్మగా నెఱిగి, బహుప్రసన్నుడై బ్రహ్మదేవునకు నమస్కారముచేసి తన లోకమునకు పోవుచు అర్థమార్గము జనినపిదప యేకాంతప్రదేశమందు కూర్చొని విచారముచేసికొని, ప్రాజ్ఞనామాత్మయందుకూడ దోషమును చూచుచున్నాడు. ఈ ప్రాజ్ఞుడు స్వప్నద్రష్టవలె. భయాదులను పొందకున్నను, యీతడు తన్నెఱుగడు, ఇతరుని యెఱుగడు. ఎట్లు మదిరాపానముచే మూఢుడైన పురుషుడు స్వపరముల నెఱుగడో, అట్లే ప్రాజ్ఞుడున్ను మృతపురుషునివలె స్థితుడగుచున్నాడు. కనుక బ్రహ్మదేవునిచే చెప్పబడిన అమరత్వాది లక్షణములు ప్రాజ్ఞునియందు ఘటింపవు. ఆ ప్రాజ్ఞునికంటె వేరైన యేదో యొకటి ఆత్మయైయుండవలసినది. ఇట్లాలోచించి మఱల వెనుకకు తిరిగివచ్చి బ్రహ్మదేవునకు నమస్కారముచేసెను. ఇంద్రునిజూచి బ్రహ్మదేవుడు మఱల్ యేలవచ్చితివని అడుగ అపుడింద్రుడు, ప్రాజ్ఞునియందు చూపబడిన దోషమును కథనము చేసెను. అత్తఱి బ్రహ్మదేవుడు యైదుసంవత్సరములు బ్రహ్మచర్యము చేయ వాని కాజ్ఞాపించెను. ఇంద్రుడున్ను అట్లే చేసెను. అప్పటికి మొత్తము యింద్రుని బ్రహ్మచర్యము ఏకాధికశత సంవత్సరము లాయెను. —

బ్రహ్మచర్యమహత్వము

హే శిష్య ! లోకమందే యే పదార్థము అత్యంతదుర్లభమో, ఆ యా పదార్థము బ్రహ్మచర్యముచేత ప్రాప్తించుచున్నది. ఎందుకనగా వేదవేత్తలు, బ్రహ్మచర్యమునే సర్వయజ్ఞరూపమనుచున్నారు. ఏ పురుషుడానందరూపాత్మ నెఱుగుచున్నాడో, అతడు బ్రహ్మచర్యముచేతనే నట్లెఱుగ గల్గుచున్నాడు. బ్రహ్మచర్యములేక ఆత్మజ్ఞానము కలుగదు. హే శిష్య ! దర్శపౌర్ణమాస్యాది యిష్టకర్మమున్ను, బ్రహ్మచర్యమే యైయున్నది. ఎందుకనగా — అత్యంతప్రియరూపత ఇష్టశబ్దమున కర్థము. ఇష్టమైన ఆత్మను అధికారిపురుషులు బ్రహ్మచర్యముచేతనే యెఱుగుచున్నారు. కనుక వేదవేత్తలు బ్రహ్మచర్యమును యిష్టమనుచున్నారు. కోశాదులందు యజ్ఞశబ్దమునకును. ఇష్టశబ్దమునకును, అర్థసామ్యత వచింపబడుచున్నది. మీమాంసులచేమాత్రము కొంచెము భేదము చెప్పబడియె. సోమము పశువు యిత్యాదులచే సిద్ధించుజ్యోతిష్టోమాదులు యజ్ఞమనబడును. పశ్వాదులు లేక కేవలము ఔషధాదులచే సిద్ధించు దర్శాదులు ఇష్టమనబడును అనేక పురుషులు చేయుయాగమునకు సత్రాయణమనిపేరు. ఆ సత్రాయణరూపమున్ను బ్రహ్మచర్యమే యైయున్నది. ఎందుకనగా — అధికారి పురుషులు సత్యస్వరూపాత్మను బ్రహ్మచర్యముచేతనే జన్మమరణాదిసంసారమునుండి

రక్షణము చేయుచున్నారు. కనుక వేదవేత్తలు బ్రహ్మచర్యమును సత్రాయణమను చున్నారు. మఱియు హే శిష్య! మననశీలున కేభావముకలదో దానికి మౌనమని పేరు. ఆ మౌనశబ్దమునకు ప్రసిద్ధార్థము వాఙ్నిరోధరూపమైయున్నది అథవా సన్యాసాశ్రమమై యున్నది. ఆ మౌనశబ్దమున్ను బ్రహ్మచర్యవాచకమే యైయున్నది ఎందుకనగా అధికారిపురుషులు బ్రహ్మచర్యప్రభావముచేతనే. ఆత్మసంబంధ మననము చేయుటకు సమర్థులగుచున్నారు. కనుక వేదవేత్తలు బ్రహ్మచర్యమునే మౌనమను చున్నారు. మఱియు లోకప్రసిద్ధ ఉపవాసపరాయణతకు వాచకమైన యే యనాశ కాయనపదము కలదో, ఆ పదమున్ను బ్రహ్మచర్యమునకే వాచకమైయున్నది. ఎందు కనగా బ్రహ్మచర్యముచే ప్రాప్తమైన ఆత్మ నాశము నెప్పటికిని పొందదు. కనుక వేదవేత్తలు బ్రహ్మచర్యమునే అనాశకాయనమనుచున్నారు.

మఱియు హే శిష్య! లోకప్రసిద్ధవనవాసవాచకమగు, ఏ యరణ్యాయన శబ్దముకలదో, అదియు బ్రహ్మచర్యవాచకమేయైయున్నది. ఎందుకనగా – సముద్ర సమాన విస్తీర్ణమగు "అరణ్య" నామముగల రెండు సరోవరములచే యుక్తమైన యే బ్రహ్మలోకముకలదో, అద్దానిని అధికారిపురుషులు బ్రహ్మచర్యముచేతనే పొందుదురు. ఈ కారణమువలన వేదవేత్తలు బ్రహ్మచర్యమును అరణ్యాయనమనుచున్నారు. హే శిష్య! బ్రహ్మచర్యముయొక్క ప్రభావముచే మనుజుడు ప్రతిబంధరహితుడై స్వేచ్ఛాపూర్వకముగ సర్వలోకములందును విచరింపగల్గుచున్నాడు. (నారదమునివలె) హే శిష్య! బ్రహ్మచర్యసంపన్నులైన బ్రాహ్మణాది యధికారిజనులు ఋగాదివేదముల నధ్యయనముచేసి క్షీర, మధు, ఘృత, దధి, అమృత, సోమరసాది పదార్థములచే, అగ్న్యాది దేవతలను తృప్తిపరచుచున్నారు మఱియు ఆ దేవతల ప్రసాదమగు క్షీరాదుల తామున్ను పానము చేయుచున్నారు.

హే శిష్య! సర్వలోకములందు స్వతంత్రముగ విచరించుట, క్షీరాది పదార్థ ముల పానముచేయుట, యివి బ్రహ్మచర్యమున కవాంతర ఫలముగను, ఆనంద స్వరూపాత్మ నెఱిగి మృత్యురూపసంసారమును దాటుట బ్రహ్మచర్యమునకు ముఖ్య ఫలముగనున్నది, వేయేల? లోకమందెన్ని సాధనలు విద్యమానమైయున్నవో, ఆ యన్ని సాధనలు బ్రహ్మచర్యమునందే అంతర్భూతములైయున్నవి. ఆ బ్రహ్మచర్యము కన్న నధికమగు నింకొక్కసాధనమేలేదు. హే శిష్య! అధికారికి శుద్ధిగలుగజేయునదైన శౌచము, స్వర్గప్రాప్తి గలుగజేయునదైన తపము, యివి రెండును బ్రహ్మచర్యమే యైయున్నవి. ఇటువంటి బ్రహ్మచర్యసంపన్నబ్రాహ్మణులు, దివిలోకమును పొందుదురు. ఆ బ్రహ్మచర్యసంపన్నపురుషులు కేవలము దివిలోకమునే

పొందరు. మఱేమనిన వారు పునరావృత్తిరహితదేవయానమార్గమున బ్రహ్మలోకమును పొందుదురు కర్మకాండోపదేశకులైన 88 వేల మునులు దక్షిణమార్గమందెట్లు స్థితులగుదురో, అట్లే ఉపాసనోపదేశికులైన 88 వేల మునులు, దేవయానమార్గమందు స్థితులగుదురు. ఈ లోకమందు యితరసాధనసంపన్నులును, విద్యయందు కుశలురగు పురుషులును గలరు కాని బ్రహ్మచర్యసాధనరహితులైనచో, ఆ పురుషులు మోక్షమును పొందజాలరు. మఱేమనిన ఆ విషయాసక్తపురుషులు జననమరణరూపక్లేశమునే పొందుదురు. ఈ విషయమందు సౌరభి మొదలగు కోటిపురుషులు దృష్టాంతముగ గలరు.

హే శిష్య ! ఎట్లు సముద్రతరణమునకు ఒకనౌకయే సాధనమైయున్నదో. అట్లే భవసముద్రమును దాటుటకు ఒకబ్రహ్మచర్యమే సాధనమైయున్నది ఈ బ్రహ్మచర్యముచే మనుజుడు, స్వర్గమును పొందుచున్నాడు మోక్షమును పొందుచున్నాడు దీర్ఘాయువును బడయుచున్నాడు. మహాసుఖమును మహాయశమును పొందుచున్నాడు. సకలరోగరహితుడగుచున్నాడు. సుందరకాంతి గలవాడగుచున్నాడు. సకలదుఃఖముల చేతను, సకలపాపములచేతను రహితుడగుచున్నాడు. ఏ పురుషుడీప్రకారము మాహాత్మ్యమునెఱిగియు, బ్రహ్మచర్యస్థైర్యము చేయుటయందు. సమర్థుడు కాడో ఆ పురుషుడిట్లు విచారము చేయవలయును — మాతృశరీరమందును, భార్యశరీరమందును యేమి విశేషతగలదు ! యిద్దరి శరీరములందును కించిన్మాత్రమైన విలక్షణతలేదు. సకలస్త్రీలకును పాంచభౌతిక శరీరము సమానమేయైయున్నది. ఈలాగున సకల స్త్రీలను మాతృసమానులుగ నెఱిగి బ్రహ్మచర్యరక్షణము చేయవలయును. అథవా — మూత్రప్రాయమై అపానవాయువుచే దూషితమగు స్త్రీయోనియందు గమనముచేయువాడనైన నాకు యేమి సుఖముకల్గును ! కించిన్మాత్రమును సుఖము కలుగదు. పైగా కండూయనము (గోకుట) చేయుటచే హస్తమునకు యెట్లు నొప్పియగుచున్నదో, అట్లే కామికి ఆ విషయభోగముచే కేవలదుఃఖప్రాప్తియే యగుచున్నది.

హే శిష్య ! యీ ప్రకారముగ విచారముచేసినను మనుజునకెపుడు పూర్వపాపకర్మవశమున స్త్రీత్యాగమందు బుద్ధి కలుగదో, అపుడా అధికారిపురుషుడు, త్యాగబుద్ధి కొఱకై అంతర్యామి యగు పరమేశ్వరుని ప్రార్థన చేయవలయును. ఓ అంతర్యామీ ! సకల బ్రాహ్మణక్షత్రియాదుల ఆత్మరూపమైన ఏ బ్రహ్మముకలదో, ఆ బ్రహ్మమును పొందుటకై, నేను సర్వదా కోరుచున్నాను. అందువలననే ఆ సన్మార్గ స్థితిరూపమగు బ్రహ్మచర్యమును నే నభిలషించుచున్నాను. బ్రహ్మచర్యము లేక బ్రహ్మభావప్రాప్తి కాదు. కనుక నాపై అనుగ్రహముచేయుము. అనుగ్రహమేమన — స్త్రీయోనియందు

మఱలనే నెప్పటికి గమనముచేయగూడదు. ఆ యోనిని నేను మాత్రోదరమునుండి బయటకువచ్చినపుడు అనేకమార్లు అనుభవము చేసితిని. సర్వదా, మూత్రముచే ఆర్ద్రముగాను, రోమములచే యుక్తముగను, పురుషుని బలవివేకవైరాగ్యాది గుణములను నష్టము చేయునదిగను, పక్వవ్రణ సమానముగ రక్తవర్ణముగలదిగను, అత్యంతదుర్గంధముగను, దుఃఖకారకముగ నున్నది. ఇటువంటి నింద్యయోనియందు యేరీతిగ నాకు మఱల గమనముకాకుండునో దానిని అనుగ్రహింపుము! హే శిష్య! ఎపుడధికారి పురుషుడు పరమేశ్వరుని గుఱించి యిట్లు ప్రార్థనచేయునో అపుడు పరమేశ్వరుడా యధికారిపురుషునకు, స్త్రీ సంబంధమైథునమందు వైరాగ్యమును గలుగజేయును.

హే శిష్య! మైథునమునకు, కేవలస్త్రీసంభోగమని అర్థముకాదు మైథున శబ్దార్థములు యెనిమిదిగలవు. 1. సంభోగము, 2. స్మరణము, 3. కీర్తనము, 4. కేళి, 5. ప్రేక్షణము, 6 గుహ్యాభాషణము, 7. సంకల్పము, 8. అధ్యవసాయము. వాటిలో ప్రజాహేతువైన సాక్షాత్ మైథునము సంభోగము. మనస్సునందు స్త్రీ చింతనము చేయుట స్మరణము. సౌందర్యాదిగుణానువాదమును ముఖముచే వర్ణనము చేయుట కీర్తనము. స్త్రీలతోనాడుచు కూర్చుండుట కేళి, రాగపూర్వకముగ పలుమారు స్త్రీలను చూచుట ప్రేక్షణము. ఏకాంతమందు స్త్రీలతో భాషణముచేయుట అథవా గుహ్యశరీర వర్ణనముచేయుట గుహ్యాభాషణము, స్త్రీలయందు రమణీయబుద్ధిచేయుట సంకల్పము, యీ స్త్రీతో నేనవశ్యముగ సంభోగము చేయవలయుననునట్టి నిశ్చయము అధ్యవసాయము. ఈ అష్టప్రకార మైథునము స్త్రీలందు ప్రీతిజనించుటకు హేతువైయున్నది. ఆ యష్టప్రకార మైథునపరిత్యాగమునకు నామము బ్రహ్మచర్యము. ఆ బ్రహ్మచర్యముచే యుక్తుడగు పురుషుడు అనాయాసముగ సకలదుఃఖరహితమైన ఆనందరూపాత్మను పొందును. కాబట్టి సకల ముముక్షుజనులును బ్రహ్మచర్యధర్మ మవశ్యముగ సంపాదన చేయవలయును. ఏ పురుషుడు విషయాసక్తుడై బ్రహ్మచర్యమును పరిత్యాగముచేయునో, ఆతడు నానా యోనుల (జన్మల) నవశ్యముగ పొందును. అట్టి విషయాసక్తపురుషునకు అత్యంత సమీపమైన. హృదయదేశస్థితమైన సాక్షియగు ఆత్మ యెప్పటికిని ప్రతీతముకాదు. ఆ విషయాసక్తపురుషుని చిత్తమందు విష్టామూత్రాది మలసహితమగు కామినియే సర్వదా ప్రతీతమగును. స్వప్నమనోరథమందును కామినినే చూచుచున్నాడు. ఈ ప్రకారము సర్వదా విషయమును ధ్యానము చేయువాడైన, విషయాసక్తపురుషుడు ఈ లోకమందుగాని. అథవా పరలోకమందుగాని ఆ స్త్రీ యుదరమందే జననము పొందును. అథవా జాతీయ విజాతీయ స్త్రీ యుదరమందుగాని, పశుస్త్రీ యుదరమందుగాని జన్మము నందుచున్నాడు. మఱల ఆ జన్మమునందును

పూర్వసంస్కారబలమున స్త్రీ లందే యాసక్తుడగుచున్నాడు. ఇకవానికి బ్రహ్మజ్ఞాన మెక్కడిది? మాటిమాటికి జననమరణరూపసంసారమునే పొందుచుండును. ఈలా గున అన్వయవ్యతిరేకముగ బ్రహ్మచర్యమే బ్రహ్మవిద్యయందు కారణమైయున్నది. అందువలననే బ్రహ్మదేవుడు యింద్రునకు మూడుసార్లు 32 సంవత్సరముల ప్రకార ముగ బ్రహ్మచర్య మాచరింప నాజ్ఞాపించెను. నాల్గవమారు అల్పదోషమునుచూచి ఆ పంచసంవత్సర బ్రహ్మచర్యముజేసి, యింద్రుడు బ్రహ్మదేవుని యెదుటకు వెళ్లెను. తరువాత బ్రహ్మదేవుడు ఆ యింద్రునకిట్లుపదేశముచేసెను. హే ఇంద్రా! స్థూలసూక్ష్మ కారణ శరీరములకన్న విలక్షణమైన ఆనందస్వరూపాత్మను నీకు పూర్వము చక్షురాది స్థానములందు యుపదేశము చేసితిని. కాని స్వాజ్ఞానవశమున, నీ వాయాత్మను అన్యథా గ్రహణము చేసితివి. ఇపుడా మూడుశరీరములకన్న వేరైన ఆత్మను బోధిం చుటకొఱకు తత్తద్ధర్మసహితముగ ఆ మూడుశరీరముల వర్ణనము గావించుచున్నాను. శరీరవిశిష్టాత్మ స్థూలసూక్ష్మకారణ భేదములచే త్రివిధము. ఆ మూడుప్రకారములగు శరీరములు, కేవలము అజ్ఞానముచే సిద్ధించినవి. అజ్ఞానాభావమైనపుడు కార్యకారణ రూపముచే నా మూడు శరీరములకు సిద్ధికాదు.

హే ఇంద్ర! ఆ మూడుశరీరములు అవిద్యచే కల్పితములగుటవలన, మరణ ధర్మ మా మూడింటియందు సమానమే. స్థూలశరీరము సర్వదా మరణధర్మము గలదిగా నున్నది. ఎట్లు సర్పము తనకు భక్ష్యరూపమగు మండూకమును గ్రహణము చేయు చున్నదో, అట్లే ప్రమాదరూపమృత్యువు తనకు భక్ష్యరూపమగు యీ స్థూలశరీరమును సర్వదా భక్షణము చేయుచున్నది. ఇటువంటి యీ స్థూలశరీరమందు, అజరాభయా మరత్వాది ఆత్మలక్షణములు సంభవింపవు. కనుక స్థూలశరీర మాత్మకాదు. మఱే మనిన ఆత్మ స్థూలశరీరముకన్న విలక్షణమైయున్నది. మఱియు ఎట్లు స్థూలశరీరము ఆత్మకాదో, అట్లే సూక్ష్మశరీరమున్ను ఆత్మకాదు. ఎందుకనగా - అనుకూలరూప ప్రియత, ప్రతికూలరూప అప్రియత, యీ రెండు ధర్మములు స్థూలశరీరమందెట్లు కలవో, అట్లే ప్రియతాఽప్రియతాధర్మములు సూక్ష్మశరీరమందునుగలవు. ఆత్మయో ప్రియతాఽప్రియతాధర్మములచే రహితముగా నున్నది. ఈ లాగున సూక్ష్మ శరీర మున్ను ఆత్మ కాదు. మఱియు హే ఇంద్ర! ఎట్లు స్థూల సూక్ష్మశరీరములు రెండును ఆత్మకావో, అట్లే మూడవదగు కారణశరీరమును ఆత్మకాదు. ఎందుకనగా - కారణ శరీరమందు సుషుప్తికాలమందు దుఃఖములు లేకున్నను, భావికాలమందు పుట్టనున్న, సకలదుఃఖములు బీజరూపముగా నాశరీరమందుండును. కనుకది ఆత్మకాదు. హే దేవ రాజేంద్ర! - ఎట్లు ఆత్మ శరీరత్రయసంబంధ ప్రియాప్రియదుఃఖములచే రహిత ముగానుండునో, అట్లు ఆత్మ, విషయజన్యసుఖముకన్నను విలక్షణముగానుండును.

ఎందుకనగా - విషయజన్యములగు సుఖములు దుఃఖములు రెండును సమానముగనె నుండును. ఇంద్రుడు - హే భగవన్! ఆత్మయందెప్పటికిని దుఃఖములేని పక్షమందు నేను సుఖిని నేను దుఃఖిని, అను యీ ప్రకారముగ ఆత్మయందు సుఖదుఃఖములెందుకు ప్రతీతములగుచున్నవి? - బ్రహ్మదేవుడు - హే ఇంద్ర! ఆత్మయందు సుఖదుఃఖములేవి ప్రతీతములగుచున్నవో, అవి కేవలము శరీరమును గూర్చిన తాదాత్మ్యాధ్యాసముచే ప్రతీతమగుచున్నవి. తాదాత్మ్యాధ్యాసములేక ప్రతీతములుకావు అట్లు తాదాత్మ్యాధ్యాసములేకయు ప్రతీతమైనపక్షమందు సమాధియందును జ్ఞానులకు సుఖదుఃఖప్రతీతి కావలసియుండె అట్లగుటలేదు. కాన నా సుఖదుఃఖములు, శరీరతాదాత్మ్యాధ్యాసము చేతనే ప్రతీతమగుచున్నవని తెలియుచున్నది హే ఇంద్ర! వాయ్వగ్నివిద్యున్మేఘాది భౌతికపదార్థములు ఘనీభూతావయవయుక్తముగా, దేహరహితములై యున్నవి. కనుక, యీ కారణముల వలన అవి ప్రియాప్రియతచేతను రహితములైయున్నవి. ఎందుకనగా మనకున్నట్లు ఘనీభూతదేహము వాటికిలేదు జీవుని పుణ్యపాపాదృష్టాది కారణవశమున అవి అకస్మాత్తుగా ప్రకటితములై వృష్ట్యాదికార్యముల జేయుచున్నవి. ఈలాగున శరీరసంబంధమే సుఖదుఃఖములకు కారణమైయున్నది. మఱియు హే ఇంద్ర! ఆ వాయుమేఘాదికార్యములు, అద్వితీయబ్రహ్మరూపకారణమును పొంది సకలభేదరహితాద్వితీయబ్రహ్మరూపముగ స్థితమగుచున్నది. అట్లే సుషుప్తియందు స్థితుడగుచున్నాడు. హే ఇంద్ర! ఎట్లు ఆవాయ్వాదికార్యములు, చైతన్యాత్మయందు లయమగుచున్నవో, అట్లే ఘటాదికార్యములున్ను మృత్తికాద్యుపహితచైతన్యమందు లయమగుచున్నవి. కేవల మృత్తికయందు లయముగావు. అథవా ఎట్లు తామ్రాది ధాతువులకు యెఱుపురంగుండునంత వఱకు, సువర్ణభావప్రాప్తికాదో, అవి సర్వథా నష్టమైనను సువర్ణభావ ప్రాప్తికాదో, తమ పూర్వ రూప త్యాగానంతరమే సువర్ణభావము ప్రాప్తమగునో, అట్లే యీ ఘటాదిపదార్థములున్ను తమఘటాదుల స్వరూపమున నెప్పటికిని తమకారణమును పొందజాలవు. ఎందుకనగా - ఆత్మస్వరూపముకన్న భిన్నమైన, ఆ ఘటాదికార్యములు శశశృంగాదులన్యాయమున నిస్స్వరూపతను పొందుచున్నవి. మఱియు, నిస్స్వరూపశశశృంగాదులకో యే యొక పదార్థమందును లయము కాన్పించుటలేదు. అట్లే అనాత్మరూప పటమందును, అనాత్మరూపఘటమునకు లయముకాదు. కాన ఘటాదికార్యములు తమ నామరూపములను పరిత్యాగముచేసి, బ్రహ్మముతోటి లయభావమును పొందును. హే ఇంద్ర! ఘటాది జడపదార్థములున్ను తమ లయకాలమునందు బ్రహ్మభావమును ప్రాప్తమగుచున్నవన నిక సర్వదాబ్రహ్మముతోటి, యభేదభావముగలవాడైన యీ జీవాత్మ లయకాలమందు బ్రహ్మభావనపొందునని వేఱుగ చెప్పనేల!

ఇంద్రుడు - హే భగవన్! జీవాత్మకు బ్రహ్మముతోటి సర్వదా అభేదమై నపుడు యికసంసారదశకన్నవానికి మోక్షదశయందు విశేషతయేమికలదు? బ్రహ్మదేవుడు హే ఇంద్ర! ఈ 'త్వం' పదార్థరూప జీవాత్మయందు, 'నేను కర్తను' 'నేను భోక్తను' యిత్యాదిధర్మములు ప్రతీతములగుచున్నవి. ఆ ధర్మములు అవిద్యచే కల్పితములగుట వలన, మిధ్యయైయున్నవి. మఱియు స్వయంప్రకాశతా, అద్వితీయానంద రూపతయో జీవాత్మకు వాస్తవస్వరూపమై యున్నది. ఆ వాస్తవస్వరూపమే, తత్పదార్థరూపబ్రహ్మమునకును కలదు. కనుక వాస్తవముగ జీవుడును బ్రహ్మమును రెండును అభేదములై యున్నవి. మఱియు సంసారదశయందు జీవబ్రహ్మభేదమేది ప్రతీతమగుచున్నదో అద్దానికి హేతువు శరీరసహితకారణాజ్ఞానమై యున్నది. తన్నివృత్తియైన తర్వాత, ఆ కల్పితభేదమున్ను నివృత్తమగుచున్నది. అపుడు జీవాత్మ పరిపూర్ణబ్రహ్మరూపముగ స్థితుడగుచున్నాడు. ఇంతియే సంసారదశకన్న మోక్షదశయందు విశేషతయై యున్నది శిష్యుడు - హే భగవన్. శ్రుతియందు జీవాత్మయొక్క బ్రహ్మభావ ప్రాప్తియందు విద్యుల్లతాది దృష్టాంతము లేవి వచింపబడినవో అవి అసంగతమగును. ఎందుకనగా - కించిన్మాత్రవిలక్షణత నంగీకరించియే, ఉపమానోపమేయభావమగుచున్నది. కనుక జీవబ్రహ్మలయందు, కించిన్మాత్ర విలక్షణత చెప్పవలసినదికదా! గురువు హే శిష్య! శ్రుతిచే లయావస్థయందెట్లు, జీవాత్మకు బ్రహ్మభావన చెప్పబడినదో, అట్లే విద్యుదాది జడపదార్థములకును, బ్రహ్మభావప్రాప్తి చెప్పబడినను ఆ దృష్టాంత దార్ష్టాంతములందు, కార్యాకార్యతారూపముచే, విలక్షణత ప్రసిద్ధమైయున్నది. అచ్చట విద్యుల్లతాది దృష్టాంతములందు కార్యత్వధర్మము కలదు. జీవాత్మరూపదార్ష్టాంతమందు కార్యత్వధర్మములేదు, అకార్యత్వ ధర్మము కలదు. కనుక దృష్టాంతదార్ష్టాంతములందు విలక్షణత సంభవించుచున్నది. శిష్యుడు — హేభగవన్! విద్యుల్లతాదులందువలె జీవాత్మయందును కార్యరూపత యెందుకుండదు?

గురువు — హే శిష్య! విద్యుల్లతాదులవలె జీవాత్మయందు కార్యరూపత నంగీకారము చేసినపుడు, ఏ పదార్థము కార్యరూపమగునో, ఆ యా పదార్థము కార్యమైన దేహాదులవలె నాశనముకలవగును. కాన జీవాత్మయు నాశముగలదగును. అపుడు అజర అమర బ్రహ్మరూపమని కధనము చేయువాడైన ప్రజాపతి మిథ్యావాది యగును. అధవా పూర్వము మూడుమార్లు ఆత్మయందు వినాశమునుచూచి యింద్రుడు, ప్రజాపతివద్దకు వచ్చెను. ఇపుడు నాల్గవమారున్ను యింద్రునకు అవినాశియగు ఆత్మయొక్క లాభము కాని పక్షమందు ఆతనిరాక నిరర్థకమగును. మఱియు పూర్వమువలె ఆత్మయందు వినాశతనుచూచి యింద్రుడు మఱలవచ్చును. అధవా

జీవాత్మకు నాశమంగీకరించిన పక్షమందు బ్రహ్మదేవునిచే యింద్రునకు, స్వయం జ్యోతి పరిపూర్ణ బ్రహ్మరూపముచే. అద్దానికి స్థితియగువను ఫలమేది చెప్పబడినదో, అదియును అసంగతమగును. ఎందుకనగా – ఆ నష్టమైన జీవునకు సామాన్యముగ నే పదార్థముయొక్కయు ప్రాప్తికానేరదు. అపుడా నష్టజీవునకు, బ్రహ్మప్రాప్తి యేరీతిగా నగును ? కానేరదు. ఇత్యాది అనేక ప్రకారదోషములు ప్రాప్తములగును. ఇవ్విధమున జీవాత్మయందు కార్యరూపత సంభవింపదు. అథవా — వాస్తవ విచారముచే చూచి నపుడు, మేము విద్యుల్లతాది దృష్టాంతములందు, జీవాత్మరూప దార్ష్టాంతమందు, కార్యాకార్యరూప విలక్షణత అపేక్షితముకాదు. వ్యక్తిభేదము మాత్రముచేతనే దృష్టాంతము సంభవించును. ఆ మేఘవిద్యుల్లతాది దృష్టాంతములందు నైయ్యాయిక మతప్రకారముగ వాస్తవస్వరూపత యుండిన పక్షమందు అనాశముగల మేఘాది దృష్టాంతములందు శ్రుతిచే సమానధర్మముగ కథనముచేయబడినవైన, సముత్థాన ప్రాప్తి, స్వరూపావస్థితులను నీ మూడుధర్మములు సంభవింపకుండును. అయినను మేఘాదులందు, కారణమునుండి వేఱుగ సత్తారూప వాస్తవకార్యత యుండలేదు. మఱేమనిన కారణమే కార్యరూపముగ స్థితమైనది. ఆ కార్యమునకు కారణముకన్న భిన్నరూపముగ సత్తలేదు. ఎందుకనగా, కారణముకన్న భిన్నమగు కార్యము మిథ్యయైనది. ఒకచో నైయాయికమతప్రకారము, ఆ కార్యము కారణముకన్న భిన్న రూపముగ స్థితమైనపుడు, ఆ కార్యము తన వినాశముకొఱకే అసత్తును పొందినదగును. దానివలన పూర్వోక్త సర్వదోషములు ప్రాప్తములగును. కనుక ఆ మతమును నే నంగీకారము చేయను.

శిష్యుడు — హే భగవన్! మేఘాది దృష్టాంతమందు స్థితమగు కార్యతను మిథ్యయని యెఱిగిన యపుడు దార్ష్టాంతరూప జీవునియందును మిథ్యత సిద్ధించునుకదా?

గురువు — హే శిష్య ! దృష్టాంతస్థితకార్యత మిథ్యయైనట్లు, జీవునియందును మిథ్యతయగునను తుల్యతావిషయమున నీకు పట్టుదలయుండిన పక్షమందు ఆ విష యము మాకు అనిష్టముకాదు. ఎందుకనగా — జీవత్వమును మేము కూడ మిథ్య యనుచున్నాము. 'మాయాభాసేన జీవేశౌ కరోతి" అను శ్రుతిచే జీవేశ్వరుల స్థితి మాయాధీనముగ కథనము చేయబడియె. ఘటాకాశరూప సంఘాతమందు, విశేష్య రూపముచే స్థితమైన ఆకాశము సత్యరూపమైనట్లు జీవరూపసంఘాతమందు స్థితమైన ఏ ఆనందరూపాత్మగలదో, ఆ యాత్మ సత్యరూపమైయున్నది. అందువలన, మేఘాది దృష్టాంతములందును, జీవరూప దార్ష్టాంతమందును, స్థితమైన యే నామరూప లక్షణ మాయాంశముగలదో, ఆ మాయాంశమందు ఏ వాదియైనను మిథ్యారూపత కథనము

చేసినపుడు ఆ మిథ్యతనట్లే యుండనిమ్ము. ఆ మాయాసంబంధ నామరూపాంశమును మేముకూడ సత్యమనము. మఱేమనిన, యే పరమాత్మ దేవుడు, అస్తి భాతి ప్రియా రూపముచే సకలవస్తువులందు అనుగతముగనున్నారో, ఆ పరమాత్మదేవునే మేము సత్యరూపముగ నంగీకరించుచున్నాము. శరీరత్రయవిశిష్టజీవుడు, ఆ యానంద రూపాత్మయొక్క సత్తను అంగీకరించియే, తాను సత్యరూపుడగుచున్నాడు. స్వభావ ముగ జీవునియందు సత్యరూపతలేదు. ఈ ప్రకారమే మేఘాదులను ఆత్మదేవుని సత్త నంగీకరించియే, సత్యరూపముగ ప్రతీతములగుచున్నది స్వభావముగ వాని యందును సత్యరూపతలేదు. ఈ అంశమాత్రమందు సమానత నంగీకరించియే, ఆ మేఘాదులందు ఉపమానరూపత, జీవాత్మయందుపమేయరూపత కథనముచేయ బడియె. ఐనను మేఘాదిదృష్టాంతములందు స్థిరమైన కార్యతాంశమందు జీవాత్మకు దృష్టాంతసమానతలేదు. ఒకచో మేఘాదులవలె జీవుని యందును కార్యరూపతయైన పక్షమందు ఏ యే పదార్థము ఉత్పత్తికలదగునో, ఆయాపదార్థము నాశము గలదగును. (ఘటాది పదార్థములవలె) జీవాత్మ కార్యరూపమైనపక్షమందు, వానియొక్కయు నాశ మగును. దానివలన కృతానాశాకృతాభ్యాగాది దోషములు సంప్రాప్తించును. మఱియు నాశముగల ఆత్మయొక్క ఉపదేశము చేయుటచే, బ్రహ్మదేవుడు మిథ్యావాదిగ సిద్ధించును.

శిష్యుడు — హే భగవన్! మేఘాది పదార్థములవలె ఘటాదిపదార్థము లును కార్యరూపములై యున్నవి. ఇట్లుండ ప్రసిద్ధఘటాదులనువదలి మేఘాది దృష్టాంతము లెందులకు వచింపబడినవి?

గురువు — హే శిష్య! బ్రహ్మదేవుని వచనమునకు కార్యరూపతాబోధన యందు తాత్పర్యములేదు ప్రియతాఽప్రియతలరహితము జేయునట్టి, శరీరాభావమును బోధనచేయుటయందు తాత్పర్యము కలదు. ఘటాదిపదార్థములతో, మేఘాదులవలె శరీరరహితస్థితి సంభవింపదు. ఈ కారణమువలన బ్రహ్మదేవునిచే; ఘటాది దృష్టాం తములు వచింపబడలేదు. బ్రహ్మదేవుని అభిప్రాయమేమనగా — ఘనీభూతావయవ ములుగల శరీరము లేనందున మేఘాదిపదార్థములు ప్రియాఽప్రియభావమునను యెట్లు పొందవో అట్లే ఈ జీవాత్మయు. శరీరత్రయరహితుడై, ప్రియాఽప్రియ భావ మును పొందడు. మఱియు ఎట్లు ప్రళయకాలమందు శరీరరహితములైన మేఘాదులు పరంజ్యోతిరూపకారణమును, పొంది మఱల సంసారమును యెట్లు పొందవో. అట్లే శరీరాభిమానముచే రహితమై, యీ జీవాత్మయు పరంజ్యోతిరూప పరమాత్మనుపొంది పరిపూర్ణరూపమున స్థితుడై మఱల సంసారమును పొందడు.

హే శిష్య! సూర్యచంద్రాది జ్యోతులెన్నిగలవో, ఆ జ్యోతులు తమ సిద్ధికొఱకు యితరజ్యోతుల నపేక్షించుచున్నవి. పరమాత్మదేవుడో తన సిద్ధికొఱకు యితర జ్ఞానాపేక్షచేయడు ఈ కారణమువలన శ్రుతిభగవతి పరమాత్మదేవుని "పరంజ్యోతి" నామముచే కథనము చేయుచున్నది ఇటువంటి పరంజ్యోతియగు పరమాత్మదేవుని పొంది, జీవాత్మ తన పరిపూర్ణాద్వితీయరూపమున స్థితుడగుచున్నాడు శిష్యుడు — హే భగవన్! జీవాత్మకు పరంజ్యోతిరూప ప్రాప్తి యేదిగలదో, ఆ ప్రాప్తియే స్వస్వరూపమందలి స్థితిరూపమైయున్నది కనుక ' సంపత్తి" శబ్దముచే ప్రాప్తిని 'స్వరూపాభినిష్పత్తి' శబ్దముచే స్థితిని కథనము చేయునట్టి ' పరంజ్యోతీరూపం సంపద్య స్వేన రూపేణాభినిష్పద్యతే" అను శ్రుతికి పునరుక్తిదోషప్రాప్తియగును కదా!

గురువు — హే శిష్య! మహావాక్యముచే జనించిన దైన "నేను బ్రహ్మరూపుడ" నని నీ ప్రకారజ్ఞానమునకు నామము 'సంపత్తి' మఱియు జీవబ్రహ్మాభేదజ్ఞానముచే జనించినదైన సకలద్వైతరహితతారూపఫలమునకు నామము స్వరూపాభినిష్పత్తి యైయున్నది కనుక శ్రుతియందు పునరుక్తిదోషము లేదు

బ్రహ్మదేవుడు — హే ఇంద్ర! ఆ యద్వితీయభావరూపఫలప్రాప్తికాలమందు ఏ జీవబ్రహ్మాభేదస్వరూపమగుచున్నదో, ఆ యభేదస్వరూపము, సకల కార్యకారణరూప ప్రపంచముకన్న శ్రేష్ఠమై యున్నది మఱియు సర్వోపాధులచే పరిపూర్ణమైయున్నది. ఈ కారణమువలన శ్రుతి భగవతి ఆ జీవబ్రహ్మాభేదస్వరూపమును "ఉత్తమపురుష" నామముచే కథనము చేయుచున్నది. ఆ యభేదస్వరూపముకన్న శ్రేష్ఠమైనట్టి, యింకొక యే యుత్తమ పదార్థమున్ను లేదు

ఇపుడు జీవన్ముక్తపురుషుని లక్షణము నిరూపింపబడుచున్నది. హే ఇంద్ర! మహావాక్యముచే జీవబ్రహ్మాభేదము నెఱిగినవాడైన. ముక్త పురుషుడు తన ప్రారబ్ధ సమాప్తి పర్యంతము యేరీతిగా వసించుచున్నాడో వినుము. నిర్వికల్పసమాధియందు స్థితుడైన ఆ జీవన్ముక్తపురుషుడు సర్వదా అద్వితీయబ్రహ్మమునే చూచుచున్నాడు. అనాత్మ పదార్థములను చూడడు. మఱియు సమాధినుండి వ్యుత్థానమైన దశయందు, సర్వజగత్తును తన ఆత్మగచూచుచు సర్వలోకములందు యిచ్ఛాపూర్వకముగ స్వతంత్రముగ విచరించుచున్నాడు. (మహారాజు స్వతంత్రుడై తన దేశమందు విచరించునట్లు హే ఇంద్ర! ఆ సర్వాత్మరూపుడైన జ్ఞాని సర్వప్రాణులవలెనే, భక్ష్యపదార్థముల భోజనముచేయును. బాలకునివలెనే నానాప్రకార క్రీడలను చేయును. మఱియు మహాపురుషులచే ఆదరమును పొందును. మఱియు నానాప్రకార రథాది వాహనము

ందారూఢుడగుచున్నాడు తన్న బంధుజనులతోటి విరాజమానుడగుచున్నాడు. ఈ ప్రకారముగ అనేక వ్యవహారములు చేయుచున్నను, ఆ విద్వాంసుడు, ఆ వ్యవహార సహితమగు నా దేహమునెప్పటికిని స్మరింపడు. (సుప్తపురుషునివలె.)

ఇంద్రుడు — హే భగవన్ ! దేహాదిసకలపదార్థములను, విస్మరణము చేయుచున్నందున, ఆ విద్వాంసుడు మందబుద్ధియని యనిపించవచ్చును కదా:—

బ్రహ్మదేవుడు — హే ఇంద్ర ! ఎట్లు ఒక పురుషుడు ఉన్మత్తుడుకాగా, ఆ ఉన్మత్తదశ నివృత్తమైనపిదప, తద్దశాసంబంధ సకలవ్యవహారములను విస్మరణము చేయుచు మందబుద్ధియని యనిపించడో, అట్లే విద్వాంసుడున్ను అవిద్యాసంబంధ సకలవ్యవహారముల విస్మరణము చేయుచుండ మందబుద్ధియని యనిపించడు. పైగా అవిద్యావ్యవహారస్మరణముచేతనే మందబుద్ధియని యనిపించును.

ఇంద్రుడు — హే భగవన్ దేహాది సర్వపదార్థముల విస్మరణమైనపుడు విద్వాంసుని శరీరమునకు స్థితి నేయే ప్రకారమగును ?

బ్రహ్మదేవుడు — ఇంద్రా ! ఎట్లు సుప్తపురుషునకు సుషుప్తికాలమందు శరీరరక్షణను గూర్చిన చింతలేనపుడు ప్రాణము తచ్ఛరీర రక్షణను చేయుచున్నదో, అట్లే ముక్తశరీరమునున్ను ప్రాణమే రక్షణచేయుచున్నది.

హే ఇంద్ర! రథముమీద సారథిపండుకొనినను రథసంబంధములగు శిక్షితములైన అశ్వములు ఆ రథమును పూర్వమువలె నియమితస్థలమునకెట్లు తీసుకొని పోవుచున్నవో, అట్లే విద్వాంసుడు ఉపరతినొందినను వానిశరీరమును, ప్రాణము నియమపూర్వకముగా నడిపించును హే ఇంద్ర ! మహారాజు పరుండినపుడు ఎట్లు మంత్రి పూర్వమువలెనే రాజ్యరక్షణము చేయుచున్నాడో అట్లే ముక్తపురుషుడు ఉపశామము పొందినపుడు ప్రాణము వాని శరీరరక్షణము చేయుచున్నది. హే ఇంద్ర! ఎట్లుముక్త పురుషుని శరీరరక్షణకు హేతువు ప్రాణమగుచున్నదో అట్లు వానిభోగమునకు హేతువు మనస్సహితజ్ఞానేంద్రియములగుచున్నవి.

ఇపుడు విషయోపభోగకాలమందు అజ్ఞానిజీవులకన్న విద్వాంసునియందు ఏ విశేషతకలదో నిరూపింపబడుచున్నది హే ఇంద్ర ! ఎట్లు మూఢబాలకుడు అథవా ఉన్మత్తపురుషుడు శ్రోత్రాద్యేకాదశేంద్రియములచే శబ్దాదివిషయముల గ్రహణము చేయుచున్నను వెనుక నా విషయములయొక్క స్మరణమునుచేయడో అట్లే జీవన్ముక్త

పురుషుడును విషయగ్రహణము చేయుచున్నను ఆత్మకన్న భిన్నమగు నేయొక పదార్థము నెఱుగడు. శబ్దాదివిషయములందు అసక్తిరహితుడైన ఆ విద్వాంసుడు బ్రహ్మలోకాదులందు వర్తమానభోగములను సూర్యాదిదేవతలచే ప్రేరితములైన నేత్రాదీంద్రియములచే గ్రహణము చేయుచున్నాడు. కాని ఆసక్తిపూర్వకముగ గాదు ఈ కారణమువలన ఆ విద్వాంసుడు సర్వదుఃఖరహితుడగుచున్నాడు. ఇపుడావిద్వాంసుని (జ్ఞాని) యందు బ్రహ్మరూపతాస్పష్టికరణముకొఱకు మొదట సకలదేవతలచే ఉపాస్యమైన బ్రహ్మముయొక్క ధర్మమును విద్వాంసునియందు చూపెదను. — హే ఇంద్ర! ఏ బ్రహ్మవేత్తను నేను ఉత్తమపురుషనామముచే కథనము చేయుచున్నానో ఆ సర్వాత్మరూపుడగు విద్వాంసుని శమదమాదిసాధనలచే యుక్తులైన దేవతలు యెంతవఱకు తమ ఆత్మరూపముగ సాక్షాత్కరింపలేదో అంతవఱకు ఆ దేవతలు ఆ విద్వాంసుని నానా ప్రకారములుగ ఉపాసనచేయుచున్నారు ఆ సర్వాత్మరూపుడగు విద్వాంసునియొక్క ఉపాసనచేతనే ఆ దేవతలకు సర్వలోకములందును, సర్వభోగములందును స్వాతంత్ర్యము కలుగుచున్నది. హే ఇంద్ర! యిపుడును యే యధికారిపురుషులు ఆ సర్వాత్మరూపవిద్వాంసుని తమ ఆత్మరూపముగ ఉపాసన చేయుదురో వారున్ను సర్వలోకములందలి భోగ్యపదార్థములను పొందుదురు ఇవ్విషయమున నీవు కించిన్మాత్రమును సంశయముచేయకుము — హే ఇంద్ర! సర్వజగదధిష్ఠానరూపముచే నే తత్పదార్థరూపమగు పరమాత్మదేవుని నేను నీకు కథనము చేయుచున్నానో, ఏ పరమాత్మదేవుడు ప్రాణులయొక్క హృదయాకాశమందు త్వంపదార్థజీవరూపముగ స్థితుడగుచున్నాడో, మఱియు సంఘాతరూపోపాధిసంబంధముచే నే పరమాత్మ శబలసంజ్ఞను పొందుచున్నాడో ఆ యానందస్వరూపపరమాత్మదేవుని యే యధికారిపురుషులు తన ఆత్మరూపముగ సాక్షాత్కరించుకొనుచున్నారో అట్టి విద్వత్పురుషులు మహాపాపములచేతనుఁకూడ లిప్తులుకారు హే ఇంద్ర! అజ్ఞానులను పాపకర్మము స్పర్శముచేయకుండుటకు కారణమేమనగా — ఆ విద్వత్పురుషులకు సర్వకాలములందు సత్యమగు సాక్షియే ఆత్మయైయున్నాడను నీ ప్రకారమగు ఆవరణరహితమైన ఆత్మజ్ఞానముకల్గియుండ అట్టివారు యెట్లు పాపకర్మము చేయుదురు? చేయనేచేయరు. ఎందుకనగా — పాపకర్మమందు ప్రవృత్తికి హేతువైన ద్వైతదర్శనమేదికలదో అది వారికి నివృత్తమైనది. హే ఇంద్ర! ఏ విద్వత్పురుషులు సర్వదా సుఖరూపాత్మనే ప్రియరూపముగ నెఱుగుదురో ఆత్మభిన్నవిషయసుఖములను ప్రియముగ నెఱుగరో ఆ విద్వత్పురుషులు విషయసుఖముకొఱకు పాపకర్మమేలాగున చేయుదురు? చేయనేచేయరు — హే ఇంద్ర! సాక్షిరూపాత్మయగు నేను జన్మమరణాదివికారములు గలవాడనుగాను, నేను శుభాశుభ కర్మముల కర్తను

గాను. తత్ఫలమైన సుఖదుఃఖముల భోక్తనున్నకాను. ఈ ప్రకారము సర్వదా తమ అసంగతను యెఱిగియున్న ఆ విద్వాంసులు పుణ్యకర్మముల కర్తయనికూడ యెపుడు తమ్మెఱుగరో అపుడిక వారు పాపకర్మముచేయరని వేరు చెప్పనేల

ఇంద్రుడు — హే భగవన్! వ్యవహారమందు స్థితులైనజ్ఞానులకింత మహిమ యెట్లుగల్గును?

బ్రహ్మదేవుడు — హే ఇంద్ర! జ్ఞానులు సకలప్రాణులకు ఆత్మయగుచు మఱియు సకలప్రాణులతోటి యభిన్నులగుచున్నారో, అటువంటి ఆ వేదవేత్తలగు పురుషులయొక్క నిష్ఠారూపమార్గమందు అనేక బుద్ధిమంతులున్ను విమోహమును పొందుదురు. దేవతలును తమ ధన్యతకొఱకు వారినిష్ఠారూపమార్గమునే కోరుచున్నారు. హే ఇంద్ర! పుణ్యపాపకర్మములచే రహితులైన యే బ్రహ్మవేత్తలగు పురుషోత్తములు గలరో వారియందు యితరు పుణ్యవంతుడు, యితరు పాపియనుభావమెన్నటికిని యుండదు — హే ఇంద్ర! ఈ ప్రకారముగ నే అధికారిపురుషులు పూర్వపుణ్య ప్రభావముచే ఆనందస్వరూప అద్వితీయబ్రహ్మమును తమ ఆత్మస్వరూపముగ సాక్షాత్కరించుకొనుచున్నారో ఆ విద్వాంసులు అవశ్యముగ మోక్షమును పొందుదురు. ఈ విషయమందు నీవు కించిన్మాత్రము కూడ సంశయము చేయకుము.

గురువు — హే శిష్య! యీ ప్రకారముగ ఆ సర్వజ్ఞుడైన బ్రహ్మదేవుడు దేవ రాజేంద్రునకు అవస్థాత్రయరహితమైన భూమాబ్రహ్మమును ఆత్మరూపముగ నుపదేశము చేసెను. ఆ భూమాబ్రహ్మమెట్టిదనగా — సకలప్రాణుల హృదయాకాశరూపమై నామరూపాత్మకమగు సకలజగత్తునకు తన సత్తాస్ఫూర్తినిచ్చి నిర్వహించునదైయున్నది. మఱియు సర్వదా ఆ నామరూపాత్మక జగత్తుకంటె పరముగను, తత్సంబంధరహితము గానునున్నది. ఇటువంటి భూమారూపబ్రహ్మమును ఆ దేవరాజేంద్రుడు తన ఆత్మ రూపముగ నెఱుగుచున్నాడు.

హే శిష్య! ఈ ప్రకారముగ గురుశిష్యపరంపరారూపవిద్యయొక్క సంప్రదా యము ద్వివిధముగ ప్రవృత్తమగుచున్నది — అట ఒక సంప్రదాయము దేవరాజేం ద్రునినుండి ప్రవృత్తమగుచున్నది. మఱియొకటి స్వాయంభు మనువు మొదలగువారి నుండి ప్రవృత్తమగుచున్నది. బ్రహ్మదేవునిచే నెట్లు దేవరాజేంద్రునకు బ్రహ్మ విద్యోపదేశముచేయబడినదో అట్లు స్వాయంభు మనువునకును బ్రహ్మవిద్యోపదేశము చేయబడినది. ఆమనుభగవంతుడు భూలోకమందు ఆదిగురుడై అధికారిపురుషులకు ఆ బ్రహ్మవిద్యనుపదేశించుచున్నాడు మఱియు ఆ బ్రహ్మవిద్యయందు అధికారసిద్ధి

చేయునదైన ఏ అంతఃకరణశుద్ధికలదో అదిలేనట్టి బ్రాహ్మణ, క్షత్రియ వైశ్యులను చూచి ఆ మనుభగవంతుడిట్లు ఉపదేశము చేయుచున్నాడు ఓ త్రైవర్ణిక జనులారా! మీ కెంతవఱకు అంతఃకరణశుద్ధిపూర్వకముగ ఆత్మజ్ఞానము కలుగలేదో అంతవఱకు నాలుగు ఆశ్రమములందలి యేదోయొక ఆశ్రయమునుగైకొని తమ తమ యజ్ఞాది కర్మములను సావధానులై చేయుడు! ఆ నిష్కామకర్మముచే అంతఃకరణశుద్ధియై తద్వారా యెపుడు మీకు వైరాగ్యప్రాప్తియగునో, అపుడు మీరు పరమహంస సన్యాసము గ్రహణముచేయుడు వైరాగ్యములేకయే సన్న్యాసగ్రహణము చేయకుడు.

హే శిష్య! ఈ ప్రకారముగ మనుభగవంతుడు అధికారిజనులగూర్చి అధికార విద్యోపదేశము చేసెను మఱియు దేవరాజేంద్రుడును బ్రహ్మదేవునినుండి దుర్లభమైన బ్రహ్మవిద్యను పొంది ఆ బ్రహ్మవిద్యను అగ్నివాయ్వాది దేవతలకు కథనము చేసెను. భూమారూప బ్రహ్మవిద్యయొక్క అనుగ్రహముచే అగ్న్యాదిదేవతలున్ను అవస్థాత్రయ రహిత భూమారూపబ్రహ్మమును తమ ఆత్మరూపముగ సాక్షాత్కరించుకొనుచున్నారు.

హే శిష్య! ఆ దేవతలు సాత్త్వికస్వభావముగలవారైరి. కనుక ఆ దేవతలందు పరమేశ్వరునకు మహాప్రీతికలదు — యీ కారణమువలన ఆ ఇంద్రాదిదేవతలు బ్రహ్మమును తమ ఆత్మరూపముగ సాక్షాత్కరించుకొనుచున్నారు.

హే శిష్య! ఈ అధ్యాయముయొక్క ఆద్యంతములందు నీవు అవస్థాత్రయ రహితమగు భూమయొక్క స్వరూపమేదియడిగితివో, ఆ భూమయొక్క స్వరూపము నంతయు నేను నీకు విస్తారముగా కథనము చేసితిని ఇక యిపుడేవిషయమును శ్రవణము చేయుటయందు నీకు యిచ్ఛగలదో వచింపుము

ఇతి శ్రీమదాత్మపురాణే చతుర్దశోఽధ్యాయః

సంపూర్ణః

శ్రీ

ఆత్మపురాణము

అథ పంచదశాధ్యాయారంభః

పంచదశాధ్యాయము

శ్రద్ధావంతులైన శిష్యులు శ్రీ గురుదేవునిగూర్చి యిట్లు ప్రార్థనచేయుచున్నారు. హే భగవన్! ఈ ఆత్మపురాణముయొక్క చతుర్థశాధ్యాయాంతమందు నీవుకృపజేసి ఇంద్ర అగ్ని వాయ్వాదిదేవతలకు బ్రహ్మవిద్యారూపిణియగు ఉమాదేవియొక్క అనుగ్రహముచే విశేషరూపముగ బ్రహ్మజ్ఞానము కలిగెనని తాము దయచేసిచెప్పితిరి. అట్లు చెప్పుటచే యీ ప్రసంగమందేదో యొక ఆశ్చర్యవిషయముండునని నాకు తోచుచున్నది. ఆ విషయమును శ్రవణముచేయుటకు నాకు తీవ్రేచ్ఛగలుగుచున్నది. ఓ భగవంతుడా! నీవు దయచేసి ఆ అద్భుతవిషయమును నాకు కథనముచేయుము. ఈ ప్రకారమగు సచ్ఛిష్యుని ప్రార్థనవిని, కృపామూర్తియైన శ్రీ గురువు శిష్యునకు కేనోపనిషద్గత ఉమాదేవీ సంబంధ కథను చెప్పనారంభించెను.

శ్రీ గురువు — హే శిష్య! ఆ శుద్ధాంతఃకరణముగలవారైన అగ్నివాయ్వాది దేవతలు దేవరాజేంద్రునినుండి బ్రహ్మవిద్యను పొందగోరి ఆ దేవేంద్రుని సమీపమునకువెళ్లి యిట్లనిరి.

దేవతలు - హే దేవరాజేంద్ర! శ్రోత్రాదిజ్ఞానేంద్రియములను, వాగాది కర్మేంద్రియములను, ప్రాణమును తమ తమ కార్యములయందు ప్రేరణజేయువాడెవ్వడు? జీవుడే ప్రేరణజేయువాడనినపుడు అది సంభవింపదు. ఎందుకనగా—యింద్రియములెప్పటికిని తమ తమ వ్యాపారముల చేయకూడదను సంకల్పముకూడా ఒకానొకప్పుడు జీవుడు మనస్సులోచేయును ఎట్లు భూతావేశముచే యుక్తుడైనపురుషుడు తనకు ప్రతికూల వ్యాపారముచేయునో అట్లే జీవుడున్ను తనకు ప్రతికూలమైనట్టి, వ్యాపారసంకల్పము చేయును. దానివలన ఈ జీవుడు స్వతంత్రుడుకాడనియు పరతంత్రుడనియు తెలియబడుచున్నది. ఇటువంటి పరతంత్రజీవునియందు ఇంద్రియాదులకు ప్రేరకత సంభవింపదు మఱియు ఓ భగవంతుడా! సుప్తసారథి రథాశ్వన్యాయముగ, ఎట్లు జీవన్ముక్తపురుషుని శ్రోత్రాదింద్రియములు, తమ తమ వ్యాపారముచేయుచున్నవో, అట్లే సర్వప్రాణుల యింద్రియములున్ను తమ తమ వ్యాపారముల చేయుచున్నవనుటయు, సంభవింపదు

ఎందుకనగా—లోకమందు బహుజనులు ఏ వస్తువందు, తమకు అనుకూలత నెఱుగు చున్నారో, ఆవస్తువందే ప్రవృత్తులగుచున్నారు. ప్రతికూలవస్తువునుండి నివృత్తులగు చున్నారు ఆ అనుకూలతా ప్రతికూలతా విచారమైననో, జడములైన యింద్రియములందు సంభవింపదు మఱేమనిన చైతన్యమందే సంభవించును ముక్తపురుషుల యింద్రియ వ్యాపారమున్ను, చక్రభ్రమణన్యాయముగ వ్యవహితచేతనవ్యాపారమనియే అను మానితమగుచున్నది కనుక పరతంత్రేంద్రియములకు వ్యాపారమునంగీకరించునట్టి యేదైనచైతన్యము నంగీకరింపవలసియున్నది. ఓ భగవంతుడా! యీ శ్రోత్రాదీంద్రియ ములే చైతన్యమనుటయు సంభవింపదు ఎందుకనగా - ఇంద్రియములను చైతన్య మనినపుడు ఒకేశరీరములందు అనేక చైతన్యాత్మలగుదురు. ఆ యనేకాత్మలును భిన్న భిన్నమతముగలవారగుదురు. దానివలన ఒకేగ్రామమందు భిన్న భిన్న మతము గల వారైన అనేక ప్రధాన పురుషులు గ్రామమునకు నాశనముగలుగజేయునట్లు. అనే కాత్మలున్ను ఒకేశరీరమునకు నాశనమునుగలుగజేయుదురు ఓ భగవంతుడా! పుణ్య పాప కర్మములు యింద్రియాదులను తమ తమ వ్యాపారమందు ప్రవర్తింపజేయుచున్న వనుటయు సంభవింపదు. ఎందుకనగా - ఎట్లు యింద్రియములు జడమగుటవలన స్వతంత్రములుకావో అట్లు కర్మమున్ను జడమగుటవలన స్వతంత్రముకాదు. ఓ భగవం తుడా! లోకమందు సకలప్రాణులో తమ అనుకూలతావిచారమందే ప్రవృత్తులగు చున్నారు. ప్రతికూలతావిచారమునుండి నివృత్తులగుచున్నారు. ఆ యనుకూలతా ప్రతి కూలతావిచారము దేహేంద్రియాదిజడసంఘాతమందు సంభవింపదు దానివలన సంఘాతముకన్న భిన్నమైనట్టి యేదో ఒకచైతన్యము సంఘాతమును ప్రవర్తింపజేయు చున్నదని తెలియబడుచున్నది. ఆ చైతన్యమేదియో తాము దయచేసి చెప్పవలయును.

ఇంద్రుడు - ఓ దేవతలారా! యీ ఆత్మదేవుడు యింద్రియములకు యింద్రి యముగాను, మనస్సునకు మనస్సుగాను, ప్రాణమునకు ప్రాణముగానున్నాడు. మఱియు ఏ ఆత్మదేవుడు బ్రహ్మదేవునిచే జాగ్రదాద్యవస్థారహితుడని చెప్పబడెనో, ఆ యాత్మదేవుడే తన సమీపతా మాత్రముచే సకలదేహధారిజీవుల శ్రోత్రాదీంద్రియ ములకు ప్రేరకుడగుచున్నాడు ఓ దేవతలారా! ఆ యాత్మదేవుడే మనస్సునకును ప్రేరకుడుగానున్నాడు. ఎందుకనగా - లోకమందేజీవుడున్ను ప్రాణముచేతగాని, అపానముచేతగాని జీవింపడు. మఱేమనిన - ఏ ఆత్మదేవుని ఆశ్రితముగ ప్రాణా పానములుండునో, ఆయాత్మదేవరూపప్రాణముచేతనే, సకలప్రాణులు జీవించు చున్నారు. ఈ కారణమువలననే ఆ యాత్మదేవుడు శ్రుతిభగవతిచే ప్రాణమునకు ప్రాణ మనబడియె. ఇంద్రియములకును యింద్రియమనబడియె మనస్సునకును మనస్సన బడియె. ఓ దేవతలారా! యీ ప్రకారముగనే అధికారిపురుషులు బ్రహ్మవేత్తయగు

గురుముఖమున యింద్రియాదుల ప్రవర్తకుడైన యాత్మదేవునిగూర్చిన శ్రవణముచే శుద్ధమనస్సుగలవారై విచారముచేయుదురో ఆ యధికారిపురుషులు జాగ్రదాద్యవస్థా రూప బంధనమునుండి విముక్తులై అంతర్యామియగు అద్వితీయాత్మను నిశ్చయముచేసి జన్మమరణాదివికారనివృత్తిపూర్వకముగా బ్రహ్మభావప్రాప్తిరూపామృతత్వమును పొందుదురు. మఱల సంసారమునకు రారు.

ఓ దేవతలారా! ఏ ఆనందరూపాత్మదేవునియందు మనస్సుతోసహా యింద్రియ ములు ప్రవర్తకములుకావో, అటువంటి ఆనందస్వరూపాత్మదేవునిగూర్చి నేను బాగుగ నెఱుగుదును. ఐనను లోకప్రసిద్ధ సామాన్యరూపముగా, విశేషరూపముగా ఆ యాత్మదేవుని కథనము చేయుటను నే నెఱుగను. ఓ దేవతలారా! లోకవాసనచే యుక్తులైన దేవతలైనమీకు, సామాన్యవిశేషరూపముగ ఆత్మదేవునిగూర్చిన ఉపదేశము అపేక్షితమై యున్నది. ఆ యాత్మదేవుడో సామాన్యవిశేషభావరహితుడై యున్నారు. మానసేంద్రియములకవిషయమైయున్నారు ఇటువంటి ఆత్మదేవుని సాక్షాత్తుగా నేను మీకు ఉపదేశించుటకు యేరీతిగా శక్యుడనగుదును? నాకందుసామర్థ్యములేదు అందు వలన నిషేధముఖముగా, ఆత్మోపదేశము మీకు చేసెదను మీరు సావధానులై శ్రవణము చేయుడు ఓ దేవతలారా! యే యాత్మదేవుని మీరడుగుచున్నారో, ఏ ఆత్మ దేవుని ప్రతిపాదనము చేయుటకు నేనుద్యమించుచున్నానో, ఆ యాత్మదేవుడు విదిత పదార్థముల కన్నను అవిదితపదార్థములకన్నను వేఱుగానున్నారు. లోకమందే పదార్థము పృథివీత్వాదిసామాన్యరూపముచే, ఘటత్వాది విశేషరూపముచే నెఱుగ బడునో, ఆయా పదార్థము విదితమనబడును. ఆ సకల విదితపదార్థములు ఘటాదుల వలె అనాత్మరూపములగుటవలన త్యాజ్యములైయున్నవి మఱియు ఏ పదార్థమెప్పటికిని ప్రతీతముకాదో అది యవిదితమనబడును. ఆ యవిదితపదార్థము వంధ్యాపుత్ర న్యాయ ముగ అత్యంతాసత్తగుటవలన అనాత్మరూపమే యైయున్నది. కాన అదియును త్యాజ్యమే. ఓ దేవతలారా! యీ ప్రకారముగ విదితావిదితపదార్థములకన్న భిన్నమగు నాత్మస్వరూపమును నేను ఆచార్యముఖమున శ్రవణముచేసితిని. ఆచార్యుడు నాకే రీతిగా నుపదేశముచేసెనో శ్రవణము చేయుడు ఏ ప్రత్యక్ చైతన్యము జ్ఞానేంద్రియ ములచేతను, కర్మేంద్రియములచేతను, మనస్సుచేతను ప్రాణముచేతను, కూడ యెఱుగబడదో, ఆ ప్రత్యక్చైతన్యము సాక్షిరూపమున సకలేంద్రియములను, మనస్సును, ప్రాణమును, తత్తద్వ్యాపారములను యెఱుగుచున్నది మఱియు ఆ ప్రత్యక్చైతన్యము తన సమీపతామాత్రముచే ఆ యింద్రియాదులను తమ తమ వ్యాపారములందు ప్రవృత్తముచేయుచున్నది. ఆ ప్రత్యక్చైతన్యమునే మీరు బ్రహ్మ

రూపముగ నెఱుగుడు· ఏవస్తువును మీరు పరాక్రూపముగ ఉపాసనచేయుచున్నారో ఆపరాక్వస్తువు బ్రహ్మరూపముకాదు ఓ దేవతలారా! దేవతలగు మేము ప్రతిదినము ఆ యాత్మదేవుని స్వరూపమును ఉపాసనము చేయుచున్నాము. కనుక ఆ యాత్మ దేవుని స్వరూపమును మేము సులభముగా నెఱుగగలమని మీరు మనస్సులో నుంచ కూడదు. ఎందుకనగా ఏ యాత్మయొక్క దహరాకాశరూపమును, మీరుపాసనచేయు చున్నారో, ఆ దహరాకాశరూపము కేవలము ధ్యానమునకే యోగ్యమైయున్నది. ఇటు వంటి దహరాకాశనామకధ్యేయరూపమును మీరు జ్ఞేయరూపముగ నెంచుట చాల ఆశ్చర్యముగ నున్నది.

ఓ దేవతలారా! అధికారిపురుషులచే యెఱుగబడుటకు యోగ్యమైన ఏ యాత్మ యొక్క స్వరూపముకలదో, ఆ యాత్మ స్వరూపమైనను, త్వమ్, అహమ్, ఇదమ్, ఇత్యాది సర్వనామశబ్దములచే, రహితమైయున్నది· ఇటువంటి బుద్ధ్యాదులకున్ను సాక్షి యైన యిటువంటి ఆత్మయొక్క ప్రాప్తికొఱకు మీరందఱును పరస్పరముకలిసి విచా రముచేయుడు· ఓ దేవతలారా. శ్రుత్యర్థము నెఱిగిన వారైన విద్వాంసు లెవరు గలరో ఆ విద్వాంసులాత్మదేవుని అవిజ్ఞేయ, విజ్ఞేయ, సువిజ్ఞేయ, దుర్విజ్ఞేయములను నీ నాలుగు నామములచే కథనముచేయుచున్నారు. ఓ దేవతలారా! దేహాభిమానులగు జీవులెందఱు గలరో, ఆ జీవులాయాత్మదేవుని సచ్చిదానందరూపముగ నెఱుగుట కెపుడును శక్యులు గారు. ఈ కారణమువలన వేదవేత్తలచే ఆ యాత్మదేవుడు 'అవిజ్ఞేయ' నామముచే కథనము చేయబడియె మఱియు దేహధారిజీవులు ఆ యాత్మదేవుని 'అహమస్మి' యను నీప్రకారముగ నెఱుగుచున్నారు, యీ కారణమువలన వేదవేత్తలచే ఆ యాత్మ దేవుడు 'విజ్ఞేయ' నామముచే కథనముచేయబడియె అధికారిపురుషులు బ్రహ్మవేత్త యగు గురువుయొక్క ఉపదేశముచే, ఆ యాత్మదేవుని అద్వితీయ బ్రహ్మరూపముగ నెఱుగుచున్నారు ఈ కారణమువలన వేదవేత్తలచే ఆ యాత్మదేవుడు 'సువిజ్ఞేయ' నామముచే కథనము చేయబడియె శ్రుతిప్రతికూలతర్కముచే ఆ యాత్మదేవుడెప్పటికిని యెఱుగబడడు. ఈ కారణమువలన వేదవేత్తలచే ఆ యాత్మదేవుడు 'దుర్విజ్ఞేయ'నామ ముచే కథనము చేయబడియె.

ఓ దేవతలారా! యీ అర్థమును స్పష్టరీతిగా చూడుడు. ఈ సచ్చిదానంద స్వయంజ్యోతియగు ఆత్మ సకలప్రాణుల హృదయకమలమందు విరాజమానుడుగా నున్నాడు మఱియు సుషుప్త్యవస్థయందు సర్వజీవులకు ప్రాప్తుడగుచున్నాడు. ఐనను, సంసారక్లేశముచే తప్తులై పరమేశ్వరుని మాయచే మోహితులైన ఈ జీవులు ఆ యాత్మ దేవుని యెఱుగుటకు శక్తులుకారు. ఎట్లు జన్మాంధపురుషులు తమహస్తమందున్న

నిధినికూడ చూడజాలరో, అట్లే యీ అజ్ఞానులగు జీవులు హృదయస్థాత్మదేవునిని యెఱుగరు. పైగా ఆ యాత్మదేవునికన్న భిన్నములైన అనాత్మపదార్థములనే సర్వదా చూచుదురు. ఆ యనాత్మపదార్థదర్శనముచే ఆ జీవులు మఱలమఱల జన్మమరణము లనే పొందుచున్నారు. ఈలాగున ఆత్మదేవుడు అవిదితముగనున్నాడు. మఱియు ఓ దేవతరాలా! ఆ యాత్మదేవుడు 'అహమస్మి' యను నీ ప్రకారశబ్దములకును ఆ శబ్దజన్య జ్ఞానమునకును విషయముగ ప్రతీతమగుచున్నాడు ఈ కారణమువలన ఆత్మదేవుడు సకల ప్రాణులకు విదితముగనున్నాడు. అథవా - ఈ ఆత్మదేవుడు 'అహమస్మి' యను నీ ప్రకారప్రతీతిచేమాత్రము విదితము కాదు మఱేమనిన జాగ్రత్తునందు స్వప్నమందు అస్తిభాతిప్రియేత్యాదుల ప్రతీతిచేతకూడ విదితమగుచున్నాడు అస్తిభాతి ప్రియేత్యా దుల అంశముల పరిత్యాగముచేసినపుడు ఘటాదిపదార్థములకు కించిన్మాత్రమున్ను వ్యవహారము కాదు. ఈ కారణమువలన వేదవేత్తలచే ఆ యాత్మదేవుడు విజ్ఞేయ నామ ముచే కథనము చేయబడియె మఱియు ఓ దేవతలారా! అధికారిపురుషులు అనేక జన్మ పుణ్యకర్మముచే బ్రహ్మచర్యాది సాధనలచే ఎపుడు బ్రహ్మవేత్తయగు గురువు యొక్క యుపదేశముచే తమ ఆత్మను బ్రహ్మరూపముగ సాక్షాత్కరించుచున్నారో, అపుడు వారు తమ హృదయకమలమందు స్థితుడైన స్వయంజ్యోతిరాత్మను సులభ ముగ పొందుదురు. ఈ కారణమువలన వేదవేత్తలచే యీ ఆత్మదేవుడు సువిజ్ఞేయ నామముచే కథనము జేయబడియె. ఓ దేవతలారా! ఏ పదార్థమందు జ్ఞానసుఖాది గుణములు సమవాయసంబంధముచే నుండునో ఆ పదార్థమునకు నామము ఆత్మ. ఈ ప్రకారమగు నైయాయికునితర్కము నంగీకరించి ఎపుడు మనుజుడు ఆత్మసంబంధ నిశ్చయముచేయుటకు ప్రవృత్తుడగునో అపుడాయాత్మయందు జ్ఞానరూపతను ఆనంద రూపతను సిద్ధింపజేయునట్టి శ్రుత్యనుకూలమైన తర్కములజూచి అతడు ఆత్మజ్ఞాన సుఖాదిగుణములు కలవాడా? అథవా - జ్ఞానసుఖాదిస్వరూపుడా? యను నీ ప్రకార మగు సంశయము పొందుచున్నాడు. ఇటువంటి సంశయయుక్తపురుషునకు యీ యాత్మదేవుడు అత్యంతదుర్విజ్ఞేయుడుగా నున్నాడు. - దేవతలు - హే భగవన్! మహాబుద్ధిగల శాస్త్రజ్ఞులైన యలౌకికపురుషులు గురూపదేశములేకనే స్వబుద్ధిబలముచే ఆ యాత్మదేవుని యెందులకెఱుగరు?

ఇంద్రుడు - ఓ దేవతలారా! అధికారిపురుషులు బ్రహ్మవేత్తయగు గురువు యొక్క ఉపదేశములేక కేవలస్వబుద్ధిబలమున ఆ యాత్మదేవుని యెఱిగినకూడ వానిని వాస్తవస్వరూపముచే నెఱుగరు. మఱేమనిన లోకప్రసిద్ధమగు విశేషరూపముగ అథవా సామాన్యరూపముగా నెఱుగుదురు.

ఓ దేవతలారా! ఈ యాత్మదేవుడు, సామాన్యవిశేషరూపరహితుడై నిర్విశేషరూపముగనున్నాడు, అందువలన ఆ నిర్విశేషాత్మను విశేషరూపముగ నెఱిగినవారైన ఆభ్రాంతపురుషులు, యదార్థరూపముగ ఆత్మను యెఱుగరు. ఎట్లు సర్పభావరహితమైన రజ్జువును, సర్పరూపముగ చూచువాడైన పురుషుడు, రజ్జుస్వరూపమునెఱుగడో అట్లే నిర్విశేషాత్మను సవిశేషముగగాంచుపురుషులున్ను ఆత్మస్వరూపము నెఱుగరు ఓ దేవతలారా! యీ ఆత్మదేవుడు నిర్విశేషరూపాపేక్షచేయునట్టి సామాన్యరూపమున్ను లేనివాడై యున్నాడు అందువలన సామాన్యభావరహితుడైన ఆత్మను యే పురుషులు సామాన్యరూపముగనెఱుగుచున్నారో, ఆభ్రాంతపురుషులున్ను, ఆత్మస్వరూపము నెఱుగరు. కాన బ్రహ్మవేత్తయగు గురువుయొక్క ఉపదేశములేకున్న యాత్మయొక్క యథార్థజ్ఞానమెప్పటికిని కానేరదు అధికారిపురుషులెపుడు బ్రహ్మవిద్గురుముఖమున, శ్రవణాదిసాధనములుచేయుదురో, అపుడే ఆత్మయొక్క యథార్థస్వరూపమును, అవశ్యముగ నిశ్చయముచేయుదురు. ఆత్మస్వరూపము శ్రుతిచే సామాన్యవిశేషభావరహితముగ చెప్పబడియె. ఎట్లన —

"యస్యామతం తస్యమతం, మతం యస్య న వేద సః
అవిజ్ఞాతం విజానతాం విజ్ఞాతమవిజానతామ్" ॥

ఓ దేవతలారా! ఎవరిసిద్ధాంతమందు ఈ ఆత్మరూపబ్రహ్మము మాతృ మానమేయరూపత్రిపుటిగోచరజ్ఞానమునకు విషయమైయున్నదో, వారు ఆ బ్రహ్మముయొక్క అద్వితీయస్వభావముకంటె విపరీతమైనట్టి త్రిపుటిరూపభేదమును చూచుచున్నారు. కనుక ఆ భేదదర్శులు బ్రహ్మము నెఱుగరు ఇట్లు చెప్పుటచే పై శ్రుతియొక్క 'మతం యస్య న వేద సః" అను ద్వితీయపాదమున కర్థము వచింపబడినది ఇపుడు "యస్యామతం తస్యమతం' అను పై శ్రుతియొక్క ప్రథమపాదమున కర్థము వచింపబడుచున్నది. ఏ అధికారిపురుషులు బ్రహ్మవేత్తయగు గురుముఖముగ త్రిపుటీరూపద్వైతరహితమైన అద్వితీయబ్రహ్మమును సాక్షాత్కరించుకొని, 'అద్వితీయబ్రహ్మము నెఱుగుచున్నాన'ను నీ ప్రకారముగ సిద్ధాంతముచేయుచున్నారో, ఆ విద్వాంసులు బ్రహ్మముయొక్క వాస్తవస్వరూపము నెఱుగుచున్నారు దేవతలు — హే భగవన్! తామాబ్రహ్మజ్ఞానముయొక్క అప్రమాణమందు, భేదవిషయతారూపహేతువును, బ్రహ్మజ్ఞానముయొక్క ప్రమాణతయందు భేదావిషయతారూపహేతువును వేటిని చెప్పుచున్నారో అది సంభవింపదు

ఇంద్రుడు — ఓ దేవతలారా! ఆ బ్రహ్మజ్ఞానముయొక్క ప్రమాణతయందు, నేను యే ద్వివిధహేతువు చెప్పుచున్నానో, ఆ హేతువు శ్రుతిచే కథనము చేయబడియె.

"అవిజ్ఞాతం విజానతామ్'' అను శ్రుతియొక్క తృతీయపాదముచే, బ్రహ్మజ్ఞానము యొక్క అప్రమాణత్వమునకు హేతువు చెప్పబడియె ఓ దేవతలారా! ఏ పురుషులు మాయచే మోహితులై, ప్రమాతృప్రమాణప్రమేయేత్యాది రూపములచే, ఆ యద్వితీయ బ్రహ్మమును నానావిధముగ నెఱుగుచున్నారో, ఆ భేదదర్శులగు పురుషులకు, ఆ యద్వితీయబ్రహ్మము సర్వదా అజ్ఞాతమేయగుచున్నది ఎందుకనగా — సర్వదా అభిన్నస్వభావముగల ఆ బ్రహ్మము యెప్పటికిని ఆ భేదముగలదికానేరదు. ఇటువంటి అద్వితీయబ్రహ్మంబునందు భేదమును విషయముచేయునట్టి, ఏ భేదవాదులయొక్క జ్ఞానముకలదో, ఆ జ్ఞానము అప్రమాణరూపమే యైయున్నది ఇపుడు విజ్ఞాతమవిజానతామ్'' అను పై శ్రుతియొక్క చతుర్థపాదముచే ఆ బ్రహ్మజ్ఞానసంబంధ ప్రమాత్వమునకు హేతువు వచింపబడుచున్నది. ఏ అధికారిపురుషులు ఆ యానంద స్వరూపనిర్గుణబ్రహ్మమును జ్ఞాతృ, జ్ఞాన, జ్ఞేయాది త్రిపుటీరూపముచే నానావిధముగ నెఱుగరో, ఆ యభేదదర్శులగు విద్వాంసులకు ఆ యద్వితీయబ్రహ్మము సర్వదా జ్ఞాతమే యైయున్నది. ఇటువంటి విద్వత్పురుషులయొక్క ఆ బ్రహ్మజ్ఞానమున్ను ప్రమారూపమే యైయున్నది.

ఓ దేవతలారా! ఏ అధికారిపురుషులు నేను బ్రహ్మరూపుడనను నీ ప్రకార బోధచే క్షణక్షణమందు తన్ను ఆత్మరూపముగ చింతనము చేయుచున్నారో అటువంటి మహాత్ములకు తన ఆత్మయొక్క స్వరూపజ్ఞానము కలదు ఎందుకనగా — నేను బ్రహ్మరూపుడనను నీ ప్రకారముగల అభేదజ్ఞానముచేత అధికారిపురుషులు, ఆ యానందస్వరూపాత్మను పొందుదురు అభేదజ్ఞానముచే తప్ప మఱియే యుపాయము చేతను, ఆత్మదేవుని ప్రాప్తికానేరదు జన్మమరణాదివికారరహితముగుటవలన వేద వేత్తలు, ఆ యాత్మదేవుని ''అమృత" నామముచే కథనము చేయుచున్నారు. అమృత భావప్రాప్తియందు యుక్తిని చూడుడు. — ఓ దేవతలారా! ఏ అధికారిపురుషులు బ్రహ్మచర్యాదిసాధనసంపన్నులై కార్పణ్యాదిదోషరహితులై, బ్రహ్మవేత్తయగు గురుముఖముగ, బ్రహ్మవిద్యారూపవీర్యమును సంపాదించెదరో, ఆ వీర్యముచేతనే యా అధికారిపురుషులు, ఆ యాత్మరూపామృతమును పొందుదురు. ఆ మోక్షరూపామృతభావమునుపొంది, మఱల మరణమును ప్రాప్తింపనేరరు. ఈలాగున అధికారి పురుషులు, అల్పప్రయత్నమందే ఆత్మానందరూపమహత్ఫలమును పొందుదురు. తాము ఆనందసముద్రరూపులై, మాయచేతను మఱియు తత్కార్యభూతసకల దుఃఖ రూపఫేనబుద్బుదాదులచేతను రహితులగుదురు. ఈ ఆత్మానందరూపఫలముకన్న అధికమగు నే పదార్థమున్ను, అధికారికి ప్రాప్తింపదగినది లేదు. ఈ ఆత్మానంద లాభముకన్న అధికమగు యింకొక లాభము లేదు.

ఓ దేవతలారా! కామక్రోధాదులచే పరాజయము పొందినవాడైన మనుజుడు నిందాపాత్రుడగుటవలన మృతకసమానుడగును. మఱలమఱల జన్మమరణాదిదుఃఖములను పొందును ఆశారూపములగు అనేకపాశములచే కట్టబడినవాడై ఆ యజ్ఞాన పురుషుడు కాలకర్మవశమున అనేకప్రకారములగు ఉచ్చనీచశరీరములను పొందును. అట నానా ప్రకార దుఃఖానుభవమును చేయుచు ఆ యజ్ఞానజీవుడు వినష్టతుల్యుడగును. కనుక ధైర్యవంతులైన మనుజులు ఈ యధికారిశరీరమందు ఆనందరూపాత్మను అవశ్యముగ నెఱుగవలసినది. ఓ దేవతలారా! ఆ మోక్షరూపఫలసహితాత్మజ్ఞానము ఈ శరీరమందు లభించుటదుర్లభమని, సంశయించి మీరు ప్రయత్నమందు శైథిల్యము కావింపకుడు. ఎందుకనగా — ఆ ఫలసహితాత్మజ్ఞానము ఈ యధికారిశరీరమందే ప్రాప్తమగును. ఈ విషయము సకలవిద్వత్పురుషులకును అనుభవసిద్ధముగనున్నది. ఏలాగుననగా — ఆ విద్వత్పురుషులు తాము ప్రయత్నముచేసి అమృతభావమును పొందుచున్నారు ఓ దేవతలారా! ఎట్లు వాస్తవముగ ఒకడైన చంద్రుడు జలపాత్ర భేదములచే, బహురూపముగా ప్రతీతుడగునో అట్లే ఒకడైన పరమాత్మదేవుడు ఉపాధి భేదముచే, బహురూపముగ ప్రతీతుడగును. ఇటువంటి సర్వత్రవ్యాపకపరమాత్మ దేవుని, యే యధికారిపురుషులు తమ ఆత్మరూపముగ నెఱుగుచున్నారో ఆ యధికారి పురుషులు సర్వలోకులను, సర్వభోగ్యపదార్థములను తమ ఆత్మరూపముగ పొందు చున్నారు. ఈ ప్రకారముగల ఫలమందు మీరు కొంచెమైనను సంశయము చేయకుడు. ఎట్లు మృష్టాన్నభోజనమునకు ముఖ్యఫలము క్షుధానివృత్తియు, అవాంతరీయ ఫలము పుష్టియునైయున్నదో, అట్లే బ్రహ్మజ్ఞానమునకు ముఖ్యఫలము అమృతభావ ప్రాప్తియు శత్రుజయాదులు అవాంతరీయఫలమునునైయున్నది. (ఇట ముఖ్యఫలప్రాప్తి కొఱకు చేయబడిన ప్రయత్నముచేతనే యే యితరఫలముయొక్క సిద్ధియగునో, దానికినామము అవాంతరీయఫలము)

హే శిష్య! యీ ప్రకారముగ ఆ యగ్న్యాదిదేవతలు దేవేంద్రముఖమున బ్రహ్మవిద్యను శ్రవణముచేసి బ్రహ్మభావమునుపొందిరి. మఱియు ఆ బ్రహ్మవిద్యా ప్రభావముచే, వారు సర్వలోకములను, సర్వకామములను, పొందిరి. జయములను పొందిరి ఈ ప్రకారముగు బ్రహ్మవిద్యాఫలమునుపొంది, స్వర్గభోగములందు స్థితు లైనను యా దేవతలు సర్వదా బ్రహ్మచింతనాపరాయణులేయైయుందురు. హే శిష్య! యీ లాగున ఆత్మసాక్షాత్కారప్రభావముచే, బ్రహ్మరూపత పొందినవారైన ఆ యింద్రాదిదేవతల సామీప్యముచే, సకల అసురులు క్షయమునొందిరి. (దీపసమీపతచే పతంగము నాశమొందినట్లు) ఎట్లు అగ్నిచే తప్తమైన లోహపిండము, శుష్కతృణమును దహనముచేయుచున్నదో, అట్లే బ్రహ్మరూపాగ్నిచే ప్రకాశమానులైన దేవతలు అసురు

లను దహనముచేయజొచ్చిరి. సాముద్రికశాస్త్రమందు కథనముచేయబడిన ఏ శ్రేష్ఠ లక్షణములుకలవో ఆ శ్రేష్ఠలక్షణములయొక్క బలముచేతనే మనుజులకెట్లు ధనాది పదార్థములు ప్రాప్తించుచున్నవో, అట్లు బ్రహ్మముయొక్క బలముచేతనే దేవతలకు విజయముప్రాప్తించినది.

శిష్యుడు - హే భగవన్! బ్రహ్మబలము దేవతలజయమునకును, అసురుల పరాజయమునకును కారణమైనపుడు అస్మదాదిజీవులవలె, బ్రహ్మమందు విషమతా దోషప్రాప్తియగునుగదా? — గురువు - హే శిష్య! ఎట్లు సర్వప్రకాశమానుడైనను సూర్యభగవంతుడత్యంతనిర్మలసూర్యకాంతమణియందు విశేషముగ ప్రతిబింబభావ మును పొందుచున్నాడో, అట్లే సర్వత్రవ్యాపకమైనను ఆ బ్రహ్మము సత్వగుణ ప్రధాన దేవతలందు విశేషముగ సంబంధమునుపొందుచున్నది. ఈ కారణమువలన ఆ దేవ తలు తేజముగలవారగుచున్నారు హే శిష్య! ఎట్లు బొమ్మలనృత్యము చేయించు వారైన సూత్రధారుడు, సూత్రముచే కాష్ఠచిత్రములను చలింపజేయుచు వాటి యందెన్నియో చిత్రములకు జయప్రాప్తిచేయుచు యెన్నియో చిత్రములకు పరాజయ ప్రాప్తిచేయుచున్నాడో, అట్లే యీ జగద్రూపలీలజేయుటయందు ప్రవృత్తుడైన సూత్ర ధారియగు పరమాత్మదేవుడు, ఆ దేవతాసురరూపచిత్రములయందెన్నియో చిత్రము లకు జయమవశ్యముగ సమకూర్పవలసియున్నది. కనుక అశోకవనికాన్యాయముగ, ఆ పరమాత్మదేవుడు దేవతలకు జయప్రాప్తిచేయుచున్నాడు. ఈ లాగున యీశ్వరుని యందు పక్షపాతదోషములేదు. (రావణుడు లంకకు సీతాదేవిని తీసుకొనిపోయిన తర్వాత, ఆమెనెచ్చటనైనను ఒకచోట నుంచవలసివచ్చును. కాని దైవయోగమున అశోక వనమందుంచెను దీనికి అశోకవనికాన్యాయమనిపేరు) ఎట్లు క్రీడించుబాలకుడు, ఆ క్రీడాసాధనరూపపదార్థములందెన్నిటినో నుత్కృష్టముగచూచి, వాటియందు అభి మానముచేయుచున్నాడో, కొన్నిపదార్థములందభిమానముచేయడో, అట్లే పరమాత్మ దేవుడును, దేవతావిషయమున అభిమానముచేయుచున్నాడు. అసురులందభిమానము చేయలేదు. ఇట్లు బాలకన్యాయముగ ఈశ్వరునియందు విషమతాది దోషప్రాప్తి కానేరదు.

హే శిష్య! బ్రహ్మసంబంధమహిమచేనే యింద్రాదిదేవతలు బలవంతులైయుద్ధమం దసురులను జయించుచున్నారో, ఆ బ్రహ్మవేత్తలైన ఇంద్రాదిదేవతలును, యేదోయొక కాలమందు పరమేశ్వరుని మాయచే, మోహితులై, విషయభోగమందాసక్తులై బ్రహ్మ ప్రభావముచేతనే తమకు జయము కలిగినదను ఆ బ్రహ్మదేవుని ఉపకారమును, విస్మరణము చేయుచున్నారు పైగా ఆ ఇంద్రాదిదేవతలు తమకు, తమ బలప్రభావము చేతనే జయము కలిగినదని నిశ్చయముచేయుచున్నారు. హే శిష్య! ఎట్లు మహాదుఃఖ

మును పొందినవారైన ఒకపురుషుడు, దేవతామునుల అనుగ్రహముచే, తద్దుఃఖ నివృత్తియైనపిదప, ధనాదులగూర్చినమదముచే దూషితుడై, ఆ దేవతామునులను విస్మరించుచున్నాడో, అట్లే యీ దేవతలున్ను, బ్రహ్మానుగ్రహముకంటె పూర్వము, అనేకమార్లు దైత్యులచే పరాజయముపొంది, పిదప బ్రహ్మానుగ్రహముచే అసురులను జయించుచు, అనంతరము రజోగుణముచే యుక్తులై, తమ జయమునకు కారణమగు బ్రహ్మమును విస్మరణముచేయుచున్నారు. మఱియు తమబలప్రభావముచేతనే తామసురులను పరాజయము చేయుచున్నామని తలంచుచున్నారు.

హే శిష్య! ఎట్లు లోకమందు కృతఘ్నుడు తనపై యుపకారముచేయువాడైన పురుషుని, విస్మరించుచున్నాడో, అట్లే బ్రహ్మానుగ్రహముచే కృతార్థతను పొందిన వారైన ఇంద్రాదిదేవతలున్ను పరమేశ్వరుని విస్మరణముచేయుచున్నారు. వారు కేవలము కృతఘ్నులైరి. దేవతలయొక్క అభిమానమిది - దేవతలమగు మేము మనోనిగ్రహరూపశమముగలవారముగా నున్నాము. ఇంద్రియనిగ్రహరూపదమము గలవారముగానున్నాము; గొప్పకులమున పుట్టినవారముగా నున్నాము. సౌందర్యముచే యవ్వనయుతులముగా నున్నాము; విద్యావినయములచే యుక్తులమైయున్నాము. మహాసత్కీర్తిగలవారముగానున్నాము మహాభాగ్యవంతులముగా నున్నాము;సకలభోగ్యపదార్థములుగలవారముగానున్నాము మేము మా శక్తిచే త్రైలోక్యపాలనము చేయుచున్నాము; ఇటువంటి మాబలమెదుట ఈ అసురులబలమునకు లెఖ్ఖయేమి? మా బలమెదుట వీరిబలము తుచ్ఛముగనున్నది. అసురులు అంజనపర్వతమువలెగాను కాలాంతకుడగు యమునివలెనున్నారు మఱియు మహామాయావులుగను యుద్ధమందత్యంతకుశలురుగా నున్నారు. అత్యంత పరాక్రమముగలవారుగను మహావీర్యముగలవారుగానున్నారు. త్రిలోకములగ్రాసముచేయుటకు సమర్థులుగానున్నారు. ఇటువంటి అసురులతో దేవతలైన మేము తప్ప యింకెవడైన యుద్ధముచేయుటకు సమర్థుడగునా ? ఎవడును సమర్థుడుకాడు. ఇటువంటి అసురులను మేము మా యొక్క బలప్రభావముచే జయించుచున్నాము. కాబట్టి మాతోసమానముగ యింకెవడున్నాడు ? ఇది వారి సర్వసాధారణాభిమానము ఇపుడువారిలో నొక్కొక్కని విశేషాభిమానమును చూడుము. ప్రథమమున ఆ దేవేంద్రుని అభిమానము-చూపబడుచున్నది. "వజ్రహస్తః పురందరః" వజ్రము ఎవనిహస్తమందుకలదో అటువంటి యింద్రుడనునేను. నేను స్వబలమున యీ వజ్రముచే పెద్ద పెద్ద పర్వతములను చూర్ణముచేసెదను, నావజ్రము ఏకశత గ్రంథులు గలదిగాను, ఏకశత తీక్ష్ణధారలు గలదిగానున్నది ఇటువంటి యీ వజ్రము యెపుడైన నిష్ఫలమగునా ? ఎప్పటికిని నిష్ఫలముకాదు. ఇటువంటి వజ్రపాణియైన నేను, అందఱికంటె నధికబలవంతుడనుగానున్నాను. వాయుదేవతాభిమానము -

వాయుదేవతనగు నేను యీ సకల జగత్తును నా కుక్షియందిడుకొని తృణతూల న్యాయముగ బ్రహ్మాండగోలకమునుండి బయటకు పారవైచెదను ఇంతసమర్థుడను నేను. నాతోసమానమైన బలవంతుడింకెవరున్నారు ? అగ్నిదేవతాభిమానము - శుష్క రూపమున్ను ఆర్ద్రరూపమున్నుగాని, యిట్టి ఘనీభూతమైన సంపూర్ణజగత్తును అగ్ని దేవతనగు నేను తృణతూలన్యాయముగ క్షణమందు భస్మమొనర్చివైచెదను. నాతో సమానమైన బలవంతుడింకెవడైనయుండునా ? వరుణదేవతాభిమానము - నాబల మింతింతకాదు. క్షణములో సకల జగత్తును మహాబ్రహ్మాండములను ముంచివైచెదను. ఒకపర్యాయము సమస్తము నీటియందు మునిగినపుడు యికదాని సమాచారమేమైనను తెలియునా ?

ఈ ప్రకారముగ రజోగుణప్రభావముచే సకలదేవతలు గర్వనిర్భరులైరి. గర్వము సకల పాపములకు కారణమున్ను సకలపరాక్రమమును నాశముచేయు నదియు సకలానిష్టప్రాప్తిచేయునదియు, సకలకీర్తివినాశము చేయునట్టిదై యున్నది. అటువంటి గర్వముతో గూడినట్టి సకలదేవతలనుచూచి ఆ పరబ్రహ్మము తండ్రివలె ఆ దేవతలయొక్క హితేచ్ఛచేయుచు యీ ప్రకారముగ చింతనము చేయదొడగెను. ఈ యింద్రాదిదేవతలు నా అనుగ్రహముచేతనే సర్వలక్షణయుక్తులైరి. నా అనుగ్రహ ముచేతనే వీరికి జయముగలిగినది. మఱియు వర్తమానకాలమందు ఈ దేవతలు నా అనుగ్రహముచేత మహాపరాక్రమశీలురైయున్నారు. ఇటువంటి ఈ దేవతలు పర బ్రహ్మమగు నా యొక్క మాయచే మోహితులై కృతఘ్నునివలె నన్ను విస్మరణము చేయుచున్నారు. ఈలాగున ఈ దేవతలు అత్యంతమూఢబాలకునివలె నున్నారు. (ఇపుడు కృతఘ్నతా దోషముచేనగు అనర్థము నిరూపింపబడుచున్నది.) లోకమం దెవడు యెవని యనుగ్రహముచే నుత్కృష్టతను పొందుచున్నాడో, అతడు నొకా నొకపుడు మోహమునకువశుడై, ఆ యుపకారకర్తయగు పురుషుని విస్మరణముచేసిన పక్షమందు శతాయుత జన్మముల పర్యంతముగ మహాదుఃఖమును పొందును. అథవా- ఏ మూఢుడు ఉపకారకర్తయగు పురుషుని సన్మానింపడో, అతడు కోటికల్పముల పర్యంతము విష్ఠయందు క్రిమిశరీరమునుపొందును. అథవా ఏ పురుషుడు ఎవనిచే చేయబడిన అల్పోపకారమునైన గణనచేయడో, ఆ కృతఘ్నుడు బ్రహ్మఘాతకుని కన్నను అధికపాపిగా నున్నాడు. ఏలాగుననగా - బ్రహ్మహత్యానివృత్తికొఱకు మన్వాదులచే ప్రాయశ్చిత్తవిధానము చేయబడియెకాని, కృతఘ్నుని కొఱకు మాత్రము ప్రాయశ్చిత్తవిధానము చేయబడలేదు. దానివలన కృతఘ్నతాదోషనివృత్తికి ఏ యొక ప్రాయశ్చిత్తము లేదని తెలియుచున్నది. ఈ దేవతలందు కృతఘ్నతాదోషమొకటి మాత్రమేకాదు, ఆత్మస్తుతి, పరనిందలచే ఆత్మఘాతతా విశ్వాసఘాతతలను నీ రెండు

దోషములున్ను విద్యమానములై యున్నవి. ఏ లాగుననగా — ఏ భేదదర్శియగు పురుషుడు గర్వముచే యుక్తుడై తన కర్మమును స్తుతిచేయునో, మఱియు ఇతరులనింద చేయునో, ఆ యవివేకి అభేదదృష్టిచే తన్నును యితరులను హననముచేయుచున్నాడు.

ఎందుకనగా - శాస్త్రవేత్తలచే భేదదృష్టిపూర్వకముగ, ఆత్మస్తుతిచేయువాడు ఆత్మహత్య యొనర్చినవాడనిన్ని, పరనిందచేయువాడు పరహత్యయొనర్చినవాడనియు కథనము చేయబడెను. కృతఘ్నతకువలె ఆత్మహత్యకును ప్రాయశ్చిత్తములేదు. ఈ దేవతలు సర్వదా ఆత్మస్తుతి పరనింద చేయుచునే యున్నారు. కనుక ఈ దేవతలకు దినదినమందు ఆత్మహత్య విశ్వహత్య ప్రాప్తమగుచున్నది. ఆక్షేపము - హే భగవన్ ! ఇటువంటి ఆత్మహత్యాది అనర్థరూప కర్మములందు జీవులెందుకు ప్రవర్తించుదురు ? సమాధానము - పరమాత్మదేవుడనైన నాయొక్క మాయచే మోహితులై కాలపాశమునకు వశులై ఈ అజ్ఞానిజీవులు తన అల్పకార్యసిద్ధికొఱకు ఆత్మహత్య, కృతఘ్నత, విశ్వహత్యాది కర్మముల చేయుచున్నారు. అందు ఏమి ఆశ్చర్యమున్నులేదు. ఇపుడు కృతఘ్నతాది పాపములందు ప్రీతిగలవారైన ఈ దేవతలను అసురులవలె దండింపవలసినది. ఐనను ఈ దేవతలను అసురులవలె దండించుట నా కుచితము కాదు. ఎందుకనగా - తన హస్తముచే నాటబడినదైన వృక్షమును తాను ఛేదించుట యుచితముకాదు. అది అమృతవృక్షముగానీ విషవృక్షముకానీ నేనింతవఱకు రక్షించినట్టి ఈ దేవతలను యిపుడు దండించుటెట్లు ? అథవా - పాపిని దండించువాడు మొదట తన్ను పాపములనుండి రక్షించుకొనవలసినది. ఎందుకనగా - ఏ పురుషుడు పాపాచరణముచేయుచున్నాడో, అతడు తానే ఆ పాపకర్మముచే హతుడైనాడు. ఇటువంటి పాపాత్ముని యెవడైన సాధుస్వభావముగల పురుషుడు దండనముచేసిన పక్షమందు ఆతనికి రెండు విధములగు దోషములు ప్రాప్తించును. ఒకటి, స్వకీయ సాధుస్వభావముయొక్క పరిత్యాగము రెండు, పిష్టపేషణన్యాయము, (చనిపోయిన వానిని మఱల చంపుట) అథవా యీ సర్వదేవతలు పరమాత్మదేవునినైన నా యొక్క పుత్రులైయున్నారు. ఇట్టి వీరిని నేనింతవఱకు చక్కగపాలించితిని; అసురులనుండి రక్షించి జయప్రాప్తికలుగ జేసితిని. ఇటువంటి దేవతలను హననము చేయుట పాపకర్మమే యగును కనుక ఆత్మహత్యాది పాపములను చేయించునట్టి గర్వమేది కలదో, ఆ గర్వదోషమును పరమాత్మనగు నేను యేదో ఒక ఉపాయముచే యీ దేవతలనుండి నివృత్తము చేయవలసినది. తద్గర్వనివృత్తిచే దేవతలకు కల్యాణమగును. ఇట్టి విచారమును పరమాత్మదేవుడు గావించుకొనెను.

హే శిష్య ! అరుననకు శ్రీకృష్ణభగవంతునిచే నుపదేశింపబడిన గీతాశాస్త్రమును ఆ యర్జునుడు కొంత కాలమునకు విస్మరణముచేయుగా, కృష్ణభగవంతుడు

మఱల ఉత్తరగీతయొక్క ఉపదేశముచేసి అర్జునుని విస్మృతిని నివృత్తమొనర్చెను. అట్లే ఈ పరమాత్మదేవుడును దేవతలకు మఱల తన స్వరూపస్మృతిని కలుగచేయుట కొఱకును, వారియొక్క అభిమానమును నివృత్తముచేయుటకొఱకును, విచార పూర్వక ముగ నొక అద్భుతయక్షస్వరూపమును ధారణముచేసి ఆ దేవతలకుగన్పించెను. ఆయక్షునకు అసంఖ్యాకమస్తకములు అసంఖ్యాకనేత్రములు సర్వజాతి జీవుల ముఖ ములును సర్వజీవులనేత్రములును సకలభూత భౌతికపదార్థములును గలవు. అతడు సకలాయుధములధారణచేసి అనేకమాలల ధరించి సకల వస్త్రములధారణమొనర్చి స్త్రీ పురుష నపుంసక చిన్హములుగలిగి యొప్పుచుండెను. ఇటువంటి అద్భుతరూపముగల యక్షునిజూచి ఆ సభావాసులగు దేవతలు మహదాశ్చర్యమును బొందిరి. ఇతడెవడు? ఇతడెవడు! అని ఈ ప్రకారముగ పరస్పరము అడుగదొడగిరి. హే శిష్య! అన్యుని ఆకారముచూచినంతనే ఆ పురుషుని మనోవృత్తాంతము నెఱుగగలబుద్ధిగల యా దేవత లున్ను ఆ యక్షస్వరూపమునుజూచి ఈతడిట్టి వాడని నిశ్చయముచేయుటకు సమర్థులు గాకపోయిరి. ఇటువంటి అద్భుతయక్షునిజూచి విస్మయావిష్టులై మనఃకమలము చలితముకాగా, నేత్రములుచకితములైయుండ రోమాంచముగల్గియుండిరి. ఇట్టిదేవత యెవడు? యెవడను నీప్రకారవచనములనే మాటిమాటికి పలుకదొడగిరి. హే శిష్య! జరాయుజాది చతుర్విధ లక్షణములచే యుక్తమైన యీయక్షస్వరూపమును పూర్వ మెవ్వడును గాంచియుండలేదు. అటువంటి అపూర్వయక్షదర్శనముచే ఆ దేవతల సభయందు మహాక్షోభయు జనించెను. యక్షస్వరూపమునుచూచి భయకంపిత హృదయముగలవారై తమ ప్రభావమును విస్మృతినొందినవారై ఆ దేవతలు తద్యక్ష సమీపమునకు పోవుటకసమర్థులైరి.

అనంతరము యింద్రాది సకలదేవతలు అగ్నిదేవతకిట్లాజ్ఞయొనర్చిరి. ఓ అగ్ని దేవతా! నీ వాయక్షుని సమీపమునకుబోయి అతడెవడో, దేవతలకనుకూలుడో, ప్రతి కూలుడో పరిశోధించి రమ్ము ఆ యగ్నిదేవత సకలదేవతలకన్న కనిష్ఠుడుగాను, సకలదేవతలచే ప్రథమపూజ్యుడుగాను, సకల తేజస్సముదాయరూపముగనున్నాడు. శ్రుతి "అగ్నిరవరో దేవానాం. విష్ణుః పరమోదేవతా" భావార్థము - అగ్నిదేవత సర్వ దేవతలకన్న కనిష్ఠుడును, విష్ణువు సకలదేవతలకన్న శ్రేష్ఠుడునై యున్నాడు. ఇటు వంటి అగ్నిదేవత సకలదేవతలనాజ్ఞ నంగీకరించి నిశ్శంకముగ నాయక్షుని సమీప మునకుపోయెను. ఆ అగ్నిదేవత నా యక్షుడు నీవెవ్వడవని యడిగెను. అపుడగ్ని దేవత నేనుజాతవేదునను నామముచే ప్రసిద్ధికెక్కిన అగ్నినని చెప్పెను. ఇట "జాతం వేదో ధనం యస్మాత్ స జాతవేదా" యను నీ ప్రకారమగు వ్యుత్పత్తిచే ఆ జాతవేద శబ్దము ధనదాతకు వాచకమైయున్నది. మఱియు "జాతే జాతే విద్యతే స జాతవేదా"

అను నీ ప్రకారమగు వ్యుత్పత్తిచే ఆ జాతవేద శబ్దము వ్యాపకత్వమునకు వాచకమై యున్నది. ఈ ప్రకారమగు వచనమెపుడు అగ్నిచే యక్షునకు చెప్పబడెనో, అపుడా యక్షుడు అగ్నినిట్లడుగుచున్నాడు.

హే జాతవేదా! నీ యందెంతబలముకలదు? యక్షుని ఆ ప్రశ్నవిని అగ్నిదేవత యిట్లనియెను. హే యక్షా! మూర్తిమంతమగు యెంతవిశ్వముకలదో, ఆ సకలవిశ్వమును నేనొకక్షణమందే దహింపజేయగలను ఇంతసామర్థ్యము నాకు కలదు. ఈ ప్రకారమగు అగ్నిభాషణమువిని, ఆయక్షుడు మందమందహాసముచేయుచు, ఆ యగ్నిదేవతయెదుట కించిత్‌శుష్కతృణమునుంచి యిట్లనెను ఓ అగ్నిదేవతా! నీ యందు అంతసామర్థ్యముండినపక్షమందు యీ శుష్కతృణమును నీవుకాల్చుమా! యీ ప్రకారమగు యక్షుని భాషణమును వినగానే, అగ్నిదేవత తన సర్వబలముచే, సర్వప్రయత్నముచే, ఆ తృణమును కాల్చుట కుద్యమించెను. కాని ఆ శుష్కతృణమును కాల్చుటకతడు అశక్తుడాయెను. ఈ ప్రకారముగ నెపుడు అగ్నిచే తృణదహనముకాలేదో, అపుడాయగ్నిదేవత గర్వరహితుడై లజ్జితుడై దేవతలసభకు వచ్చి ఇంద్రాదిదేవతల గూర్చి యిట్లనియె ఈ యక్షుడు సర్వబలమును నాశముచేయుచున్నాడు. ఇతడు దేవతలమగు మనకు. అనుకూలమా? ప్రతికూలమా? యనువిషయము నాకేమి తెలియదు. మీరింకెవరినైన దేవతలమపంపి శోధనముచేయుడు. ఈ ప్రకారముగ ఆ యగ్నిదేవతచెప్పుటవిని, సకలదేవతలు వాయుదేవతను యక్షునికడకు పంపిరి. ఆ వాయుదేవత యక్షునిసమీపమునకు పోగా, యతడు నీవెవ్వడవనియడిగెను. అపుడా వాయుదేవత, మాతాశ్వనామముచే ప్రసిద్ధికెక్కిన వాయుదేవతను నేననెను. ఈ ప్రకారమగు నుత్తరముచెప్పిన తరువాత ఆ యక్షుడిట్లనెను. ఓ వాయుదేవతా! నీయందెంత బలముకలదు?

వాయుదేవత - ఎట్లుబాలకుడు తనముఖముచే సూక్ష్మతృణమును తీసుకొని పోవునో, అట్లే నేను సకలవిశ్వమును, ఒకప్రక్కకు తీసుకొనిపోయి బ్రహ్మాండము నుండి బయటకుపారద్రోలుటకు సమర్థుడనుగా నున్నాను. ఇంతసామర్థ్యము గలవాడను నేను. ఈ ప్రకారమగు వచనమెపుడు వాయువునిచే యక్షునకుచెప్పబడెనో, అపుడా యక్షుడు అగ్నికివలెనే, వాయువునియెదుట కించిత్‌శుష్కతృణమునుంచి యిట్లనియె. నీ యందు అంతబలముండినపక్షమందు యీ శుష్కతృణమును తీసుకొని పొమ్ము. యీ ప్రకారమగు యక్షునివచనమును శ్రవణముచేసి, ఆ వాయుదేవత తన సకల బలముచే ఆ తృణమును లేపుటకు ప్రయత్నముచేసెను. కాని ఆ వాయుదేవతకు, కించిన్మాత్రమైన తృణమును లేపుటకు శక్తిలేకపోయెను. ఎంతవేగముగ వీచినకూడ, ఆ శుష్కతృణము కదలలేదు. పిదప ఆ వాయుదేవత అగ్నిదేవతవలె గర్వరహితుడై

లజ్జితుడై దేవతలసభకుపోయి యిట్లు పలికెను. ఆ యక్షుడు నన్ను హతవీర్యునిగా చేయుచున్నాడు. ఇతడు దేవతలమగు మనకు అనుకూలమా? ప్రతికూలమా? అను విషయము నాకేమి తెలియదు మీరింకెవరినైన పంపించి శోధనముచేయుడు. ఈ ప్రకారమగు వాయుదేవుని వచనమునువిని సభావాసులగు సకలదేవతలు దేవరాజేంద్రు నిట్లు ప్రార్థించిరి. హే దేవరాజేంద్రా! ఈ యక్షునియెదుటకు నీవుపోయి, యిత రనుకూలమా? ప్రతికూలమా? శోధనము చేయవలయును. అపుడు సర్వదేవతల ప్రార్థనవిని, దేవరాజేంద్రుడు తానే యక్షుని సమీపమునకు పోయెను. అపుడాయక్షుడు ఇంద్రుడు తనసమీపమునకు వచ్చుటచూచి, అక్కడక్కడనే అంతర్ధానమాయెను. యక్షుడు కనబడనందువలన, ఇంద్రుడు నాల్గుదిశలందును వానికై పరిశోధనచేసెను. అపుడంతర్ధానమైన ప్రదేశమందొక అపూర్వమగు స్త్రీని యతడుచూచెను. ఆమె హిమాచలపర్వతుని పుత్రికగాను, సకలకల్యాణగుణములచేతను, సకల శ్రేష్ఠలక్షణ ములచేతను, విరాజమానముగనున్నది. తనకాంతిచే శోభాయమానమైనట్టి నిరుపమాన మైనదేహమును ధరించియుండెను. మఱియు దేవరాజేంద్రునియెడ తల్లివలె భగినివలె కృపారూపస్నేహమును ధరించియుండెను. ఆ భవానీదేవిని శాస్త్రవేత్తలు బ్రహ్మవిద్యా నామముచే కథనము చేయుచున్నారు మఱియు ఆ యుమాదేవియొక్క అనుగ్రహ ముచే త్రిలోకస్థితజనులకు అద్భుతసౌందర్యమున్ను, మనోవాంఛితసంపదయు ప్రాప్తమగుచున్నది. ఆ యుమాదేవియొక్క అనుగ్రహముచే బ్రహ్మచారులకు అఖండిత బ్రహ్మచర్యమున్ను; నాల్గువేదములున్ను ప్రాప్తించుచున్నవి. ఆమెయొక్క అనుగ్రహముచే, వానప్రస్థులకు తపస్సు సిద్ధించుచున్నది. మఱియు సన్యాసులు స్వధర్మమునుపాలించి బ్రహ్మలోకమునకు జెందుదురు. మఱియు బ్రహ్మవిద్యారూపిణి యగు నా యుమాదేవి మాలాన్యాయమువలె పరమహంససన్యాసులకు తన బ్రహ్మ విద్యాస్వరూపమును ప్రాప్తింపజేయుచున్నది. ఆ బ్రహ్మవిద్యయొక్క దర్శనముచే సన్యాసులయొక్క అవిద్యారూపబంధగృహమునకును, కామక్రోధాదిశృంఖలములకును. నాశమగుచున్నది. మఱియు ఏ యుమాదేవి శ్రీ మహాదేవుని ముఖసౌందర్యమునుగాంచి, తనసౌందర్యతచే సర్వజీవులమనస్సును మోహితముగ శేయుచున్నదో. యే యుమాదేవి యొక్క శరీరప్రభ కోటిసూర్యసమానమైయున్నదో. ఏ యుమాదేవియొక్క శీతలగుణము కోటిచంద్రసమానముగ నున్నదో. ఏ యుమాదేవి నానా ప్రకారైశ్వర్యముచే కోటి లక్ష్మిసమానముగనున్నదో. యే యుమాదేవియొక్క అనుగ్రహముచే ప్రసిద్ధదేశమందు గాని, అప్రసిద్ధదేశమందుగాని స్థితులైనదేహధారులగు జీవులు. ఆ యా సామర్థ్య ములను పొందుచున్నారో. ఆ యుమాదేవి భక్తజనుల దుఃఖనివృత్తికొఱకు, సౌమ్య రూపిణియై, అభక్తజనులకు తేజోఽతిశయముచే దుర్విజ్ఞేయమగుచున్నది. ఈ కార

ణమువలననే ఇంద్రుని గర్వనివృత్తికొఱకు, ఆ యుమాదేవి తన దర్శనముచే, ఆ ఇంద్రుని సహస్రనేత్రములందు స్థితమైనతేజమున హరణము చేయుచున్నది. మఱియు అటువంటిమూర్తిని దేవరాజేంద్రుడు ముల్లోకములందును పూర్వము గాంచియుండ లేదు ఏ యుమాదేవి దివ్యగంధములను, దివ్యమాలలను దివ్యవస్త్రములను, ధరించి యున్నదో, ఏ యుమాదేవితనదర్శనముచే సర్వప్రాణుల నేత్రములకును మనస్సున కును, ఆనందప్రాప్తి చేయుచున్నదో, ఏ యుమాదేవి మందమందహాసపూర్వకముగ వచనోచ్చారణ మొనర్చునో, ఏ యుమాదేవి బ్రహ్మవిద్యారూపముచే, ఉపనిషత్తులందు స్థితమైయున్నదో, మఱియు బ్రహ్మచర్యాది సాధనసంపన్నులగు పరమహంసల మనస్సులందు స్థితమైయున్నదో, కామదేవుని వినాశముచేయువాడును, యక్షరూప ధారణ మొనర్చువాడును, పరబ్రహ్మరూపుడును, త్రిలోచనుడును తన భర్తయునగు మహాదేవునకు వామభాగమందు స్థితమగుచున్నదో, అటువంటి ఆ యుమాదేవినిజూచి, దేవరాజేంద్రుడు నమస్కారపూర్వకముగ విట్లడిగెను.

హే మాతా! ఈ స్థానమందు ఏ యక్షుడు పూర్వము ప్రాదుర్భూతుడై అంత ర్ధానమయ్యెనో, ఆ యక్షుడెవ్వడు? వానిస్వరూపమును నెఱిగినపక్షమందు, దయచేసి నాకు కథనము చేయుము. హే శిష్య! ఈ ప్రకారముగ ఇంద్రుడడిగినపిదప ఆ యుమాదేవి ఇంద్రునకు పరబ్రహ్మరూపుడగు మహాదేవుని వాస్తవస్వరూపమును కథనము చేసెను. మఱియు ఏ ప్రయోజనముకొఱకు, మహాదేవుడు యక్షరూపమును ధరించివచ్చెనో, ఆ సంపూర్ణప్రయోజనమున్ను ఇంద్రునకు వచించెను.

ఆ ఉమాదేవియొక్క వచనమునువిని దేవరాజేంద్రుడు సకలగర్వరహితు డాయెను. మఱియు పూర్వము విస్మరించిన మహాదేవుని బ్రహ్మభావరూప వాస్తవ. స్వరూపమును మఱల స్మరణముచేసెను. ఆ పరబ్రహ్మమే సకలజయకారణమనియు నెఱిగెను. హే శిష్య! ఈ ప్రకారముగ నా భవానీదేవి, ఇంద్రునకు సకలబ్రహ్మోప దేశముచేసి, ఆ యాకాశమందే అంతర్ధానమయ్యెను. అనంతరమాదేవరాజేంద్రుడు అంతర్ధానమైన మహాదేవ భవానీదేవులకు నమస్కారముచేసి, దేవతల సభకు వచ్చెను. అట్లువచ్చి సకలదేవతలగూర్చి యక్షయుమాదేవుల సకలవృత్తాంతము నివేదనము చేసెను. ఆ వృత్తాంతమంతయు శ్రవణముచేసి అగ్నివాయ్వాది సకలదేవతలు గర్వరహితులైరి.

హే శిష్య! ఆ ఇంద్రాదిదేవతలు సాత్త్వికులగుటవలన స్వభావముగ గర్వ క్రోధాదిరహితులు, ప్రమాదరహితులు; విచారపూర్వకముగ కార్యముచేయువారు, తమ హితాహితములెఱిగినవారైయుండిరి. ఇటువంటి దేవతలున్ను ఏదోయొక కాలమందు

పరమేశ్వరుని మాయచే మోహితులగుచున్నారు. అటువంటి దేవతలకు బ్రహ్మవిద్యా రూపిణియగు దేవి బ్రహ్మవిద్యోపదేశముచేసి వీరిని పూర్వమువలె సావధానముగ జేసెను హే శిష్య! ఆ బ్రహ్మవిద్యయొక్క అనుగ్రహముచే, ఇంద్రాదిదేవతలు పర బ్రహ్మమే సకలజగత్తుయొక్క ఉపాదానకారణమనియు, నిమిత్తకారణమనియు, నెఱుగుచున్నారు, హే శిష్య! ఏ పరబ్రహ్మము యితరదేవతలకును మనుష్యులకును అత్యంతదుర్లభమో ఆ యక్షరరూపపరబ్రహ్మమును ఇంద్రాగ్నివాయుదేవతలు అత్యంత సమీపముగ పొందుదురు ఈ కారణమువలన ఆ ఇంద్రాదిదేవతలు ఇతరదేవతలకన్న నధికులుగనున్నారు ఆ త్రివర్గమందును దేవరాజేంద్రుడు, సాక్షాత్ ఉమాదేవియొక్క ముఖముచే వాస్తవబ్రహ్మస్వరూపమును సాక్షాత్కరించుకొనెను గనుక శ్రేష్ఠుడై యున్నాడు.

హే శిష్య! ఏ పరబ్రహ్మమును ఇంద్రాదిదేవతలు నెఱిగిరో, ఆ పరబ్రహ్మ మును వేదవేత్తలగు బ్రాహ్మణులు అధిదైవ అధ్యాత్మములను నీ రెండురూపములుగ ఉపాసనచేయుచున్నారు. ఇపుడు అధిదైవరూపనిరూపణ గావింపబడుచున్నది. — ఏ హిరణ్యగర్భ భగవంతుడు విరాడ్భగవంతుని జనకుడో, ఈ సంపూర్ణవిశ్వము ఏ హిరణ్యగర్భభగవంతునకు శరీరమైయున్నదో, అట్టి హిరణ్యగర్భభగవంతునియొక్క సమష్టిశరీరాంతరగతమైన ఏ విద్యుత్సమానతత్త్వముగలదో ఆ తత్త్వము చైతన్యరూప మగుటవలన, జడమైన విద్యుత్తుకన్నను విలక్షణమైయున్నది అది తన సాన్నిధ్య మాత్రముచే, సకలప్రాణుల ఇంద్రియములను, మనస్సును ప్రేరణచేయునదై యున్నది. ఆ తత్త్వమే పరబ్రహ్మసంబంధ అధిదైవరూపమైయున్నది.

ఇపుడు అధ్యాత్మరూపవర్ణనము గావింపబడుచున్నది. ఏ తత్త్వము దేహధారు లగు జీవుల ప్రత్యేకశరీరములందు స్థితమై సంఘాతమందున్న బుద్ధిసంబంధ జాగ్రదా ద్యవస్థలను సాక్షిరూపముగ ప్రకాశము చేయుచున్నదో, ఆ సాక్షిరూపతత్త్వము పర బ్రహ్మరూపసంబంధ అధ్యాత్మస్వరూపమైయున్నది. ఆ సాక్షిరూపతత్త్వము ఈ సంసారవనమునందు ప్రతిష్ఠితమైన సర్వాంతర్యామి పరబ్రహ్మరూపమైయున్నది మఱియు ఆ సాక్షిరూపతత్త్వము సర్వజనుల నిరతిశయప్రీతికి విషయమగుటవలన, సర్వజనులకును భజనీయమై యున్నది. ఈ కారణమువలన ఆ ప్రత్యక్సాక్షిరూపా త్మను వేదవేత్తలు "వనమ్" అనునామముచే కథనము చేయుచున్నారు.

హే శిష్య! ఏ పురుషులు "వనమ్" నామముచే ఆ పరమాత్మదేవుని యుపా సనము చేయుచున్నారో, వారిని సర్వజనులు ఆరాధింపగోరుదురు. హే శిష్య! ఏ బ్రహ్మవిద్యను నేను నీకుపూర్వము కథనము చేసియుంటినో, ఆ బ్రహ్మవిద్యయొక్క

సాధనలను సావధానుడవై శ్రవణముచేయుము. సకలదేహధారి జీవులకు, తమవర్ణాశ్రమానుసారముగ వేదభగవంతునిచే నిత్యనైమిత్తిక కర్మములు విధింపబడియున్నవి. ఆ కర్మములను నిష్కామముగచేయుటచే నవి అంతఃకరణశుద్ధిద్వారా, బ్రహ్మవిద్యకు సాధనమై యున్నవి మఱియు కృచ్ఛ్రచాంద్రాయణాది తపస్సులును బ్రహ్మవిద్యకు సాధనములై యున్నవి. వేదమందు కథనముచేయబడిన నానా ప్రకారములగు ఉపాసనలున్ను, విక్షేపనివృత్తిద్వారా బ్రహ్మవిద్యకు సాధనములే యైయున్నవి. వేదమందు కథనము చేయబడిన వేదవాణీరూప కామధేనువుయొక్క ఉపాసనయు, ఆత్మజ్ఞానార్థులగు పురుషులు అవశ్యముగ చేయవలసినది. ఆ వాగ్రూపధేనువునకు ఋగాది నాలుగువేదములును నాల్గుపాదములైయున్నవి. శిక్షాదివేదాంగములు ఆ కామధేనువునకు శిరాది అవయవములై యున్నవి. మఱియు స్వాహాకార, వషట్కార, హంతకార, స్వధాకారములను ఈ నాల్గుమంత్రములు నాల్గు స్తనములైయున్నవి, శ్రుతియందు సత్యశబ్దముచే కథనము చేయబడిన ఏ బ్రహ్మముకలదో, అది ఆ ధేనువునకు భూమిరూపాధారమైయున్నది మనోవృత్తిరూపబోధ యేదిగలదో అది వత్సమై యున్నది. హే శిష్య! ఈ ప్రకారముగ, నే పురుషులు ఆ వాగ్రూపధేనువును ఉపాసన చేయుదురో, ఆ పురుషులు చిత్తశుద్ధిద్వారా ఆత్మజ్ఞానమును పొందుదురు. ఆ విద్వత్పురుషులు అద్వితీయానందస్వరూపబ్రహ్మమునందు స్థితులగుదురు. మఱల జన్మమరణసంసారము నెప్పుడును పొందరు.

హే శిష్య! పూర్వమున చతుర్దశాధ్యాయమందు ఏ ఇంద్రుడు, ప్రజాపతి బ్రహ్మయొక్క శిష్యుడుగ వర్ణనముచేయబడెనో, ఆ ఇంద్రుడు బ్రహ్మవిద్యారూపిణి యగు ఉమాదేవియొక్క అనుగ్రహముచే. అద్వితీయబ్రహ్మమును తన ఆత్మరూపముగ నెఱిగెను. హే శిష్య! ఎట్లు ప్రజాపతికి దేవరాజేంద్రుడు శిష్యుడాయెనో, అట్లే యథర్వుడను ప్రజాపతియొక్క జ్యేష్ఠపుత్రుడును శిష్యుడాయెను. ఏ యథర్వనామ బ్రహ్మపుత్రునిచే ప్రవృత్తమైన సంప్రదాయముగ ఆ బ్రహ్మవిద్య బహువిస్తారము పొందుచున్నది. హే శిష్య! ఉమాదేవియొక్క అనుగ్రహముచే, ఇంద్రాదిదేవతలేవిధముగ బ్రహ్మవిద్యను పొందిరని నీవు పూర్వము ప్రశ్నించియుంటివి. ఆ బ్రహ్మవిద్యాప్రసంగమునుగూర్చిన సకలవిషయములను నేను నీకు కథనము చేసితిని. ఇక ఇపుడేవిషయమును శ్రవణము చేయగోరుదువో దానినడుగుము చెప్పెదను.

ఇతి శ్రీమదాత్మపురాణే పంచదశోఽధ్యాయః

సంపూర్ణః

శ్రీ

ఆత్మపురాణము

అథ షోడశాధ్యాయారంభః

షోడశాధ్యాయము

శ్రద్ధాభక్తిగల్గిన శిష్యుడు శ్రీ గురువునిగూర్చి యిట్లు ప్రార్థన చేయుచున్నాడు. హే గురో ! ఈ ఆత్మపురాణ పంచదశాధ్యాయాంతమందు శ్రీ ప్రజాపతికి దేవరాజేంద్రుడు శిష్యుడైనట్లే, అథర్వనాముకుడైన ప్రజాపతియొక్క జ్యేష్ఠ కుమారుడున్ను శిష్యుడయ్యెననియు, అతడును శిష్యసంప్రదాయము గావించెననియు తాము దయచేసి చెప్పితిరి. ఆ యథర్వశిష్యునకు ప్రజాపతిచే నొనర్పబడిన బ్రహ్మవిద్యోపదేశమున్ను, ఆ యథర్వుడు నెవనిని తన శిష్యునిగ గావించుకొనినది, ఈ మొదలగు ఇతిహాసములను భవదీయముఖమున శ్రవణముచేయ నాకు కోర్కె గలదు. కావ తాము దయచేసి నాయీకోర్కెను పూర్ణమొనర్పవలెను. ఈ ప్రకారమగు శ్రద్ధావంతుడైన శిష్యుని ప్రార్థనవిని, ముండకోపనిషత్తునందు కథనము చేయబడిన ఆ యథర్వ వృత్తాంతమును శ్రీ గురువు శిష్యున కిట్లు వచింప నారంభించెను.

హే శిష్య ! ఈ సంపూర్ణ కార్యరూప జగత్తు, తన యుత్పత్తికి పూర్వము, తమోరూపముగ నుండెను ఆ తమము జగదుత్పత్తికి పూర్వము ప్రత్యక్షప్రమాణమున కవిషయమై అనుమాన ప్రమాణమునకున్ను నయోగ్యమై, కుతర్కములకు నయోగ్యమై, శబ్దముచే కథనము చేయుటకును నయోగ్యమై, సుప్తపురుషునివలెనే నేకార్యము చేయుటకును అసమర్థమై యుండెను. ఇట తమము తోటి సమానముగ ఆవరణము చేయునదైన, అవ్యాకృతమాయ, అవిద్య, ఇత్యాదిశబ్దముల వాచ్యార్థరూపాజ్ఞానమేది గలదో, నా యజ్ఞానోపహితసత్యవస్తువునకు నామము తమము.

" నాపదాసీ న్నోసదాసీత్తదానీం, కింత్వభూత్తమః "

హే శిష్య ! లోకమందు అసత్‌శబ్దముచే కథనము చేయుటకు యోగ్యమైన ఏ యభావము గలదో, ఆ యభావమున్ను జగదుత్పత్తికి పూర్వము లేకుండెను. మఱియు లోకమందు, సచ్ఛబ్దముచే కథనము చేయుటకు యోగ్యమైన ఏ భావపదార్థముగలదో, ఆ భావపదార్థమున్ను జగదుత్పత్తికి పూర్వము లేకుండెను. లోకమందు

తేజమునకు విరోధియైన ఏ ప్రసిద్ధాంధకారముకలదో, ఆ అంధకారమున్ను జగదుత్పత్తికి పూర్వము లేకుండెను. ఆకాశాది పంచభూతములున్ను, దినరాత్రిరూప కాలమున్ను, ప్రాతఃకాల సాయంకాలములున్ను, తత్సంధియున్ను, సూర్యచంద్రాదులున్ను, జగదుత్పత్తికి పూర్వము లేకుండెను. ప్రసిద్ధతమమువలె, ఆత్మస్వరూపము నాచ్ఛాదనము చేయునట్టి కారణతత్త్వమే, జగదుత్పత్తికి పూర్వముండి యుండెను. ఈ కారణతత్త్వము మృత్యురూపముచేతను జ్ఞాతముగాదు అమృతరూపముచేతను జ్ఞాతముగాదు (ఇట సంహారముచేయు దానికి పేరు మృత్యువు. వృద్ధిచేయు దానికి పేరు అమృతము) ఆ మృత్యు అమృతములు రెండును, ద్వైతదశయందే యుండును. అద్వైతదశయందుండవు మఱల నా కారణతత్త్వము, జగదుత్పత్తిపూర్వకాలమందు, అస్పష్టమగు నామరూపములుగల్గి యుండును. ఈ కారణమువలన వేదాంతశాస్త్రమందు ఆ తత్త్వము అవ్యాకృత నామముచే కథనము చేయబడియె ఆ అవ్యాకృత తత్త్వమే, నామరూపసహిత సకలజగత్తునకు కారణమైయున్నది. మఱియు నది తనకు కారణము నపేక్షింపక, ఏకమై అద్వితీయ రూపముగనుండును. కేవలము శ్రుతివాక్యము చేతనే యది గమ్యమై యుండును. మఱియు సర్వలక్షణరహితమయ్యి యుండును. లోకమందు వాస్తవమైనట్టి విద్యమానమైనట్టి పదార్థమే కారణమగును అవాస్తవావిద్యమానపదార్థము కారణము కానేరదు. అవ్యాకృతతత్త్వమో, అవాస్తవావిద్యమానముగనుండినను జగత్కారణమైనది. మఱియు లోకమందు అనాదిభావరూపపదార్థమునకు అవినాశిత ప్రసిద్ధమైయున్నది. ఎట్లనగా అనాదిభావరూపపదార్థము ఆత్మ. ఈ అవ్యాకృతతత్త్వమో అనాదిభావరూపముగనుండినను ఆత్మజ్ఞానముచే నాశముపొందుచున్నది. ఈ అవ్యాకృతతత్త్వము జడరూపముగుటవలన పరతంత్రముగనుండును అట్లైనను అక్రియాసంగమైన ఆత్మయొక్క కర్మసంగాదులకు కారణమగును. ఈ మొదలగు అనిర్వచనీయతాబోధకములగు బహువిధదుర్ఘటలక్షణములచే నీయవ్యాకృతతత్త్వము యుక్తమై యున్నది శుద్ధబ్రహ్మముయొక్క ప్రతిబింబసహితమగు అవ్యాకృతకారణమునుండి హిరణ్యగర్భభగవంతుడు పుట్టెను. హిరణ్యగర్భభగవంతుడు సకలవ్యష్టిజీవులకు ఈశ్వరుడై యున్నాడు సమష్ట్యభిమానరూపముచే నాతడు "జీవఘన" నామముచే కథనము చేయబడియె అంతఃకరణము, దశేంద్రియములు, ప్రాణము, పంచసూక్ష్మభూతములు, అను నీ సప్తదశతత్త్వ సముదాయరూప శరీరమందు ఏ హిరణ్యగర్భరూపాత్మ నివాసము చేయుచున్నాడో, ఆ హిరణ్యగర్భభగవంతునిచే ఆకాశాది పంచస్థూలభూతములు పుట్టుచున్నవి. ఆ స్థూలభూతముల అభిమానముచే, ఆ భగవంతుడు 'విరాట్' సంజ్ఞను పొందుచున్నారు. అనంతర మా స్థూలభూతములందు నివాసముచేయుచు, ఆ హిరణ్యగర్భుడు తననివాసముకొఱకు బ్రహ్మాండ

రూపగోలకమును సృష్టింప నిచ్ఛగించెను. అతని సత్య సంకల్పవశమున ఆకాశాది పంచభూతములు జలముపై స్థితములై సువర్ణరూప అండముగా పరిణామమును పొందినవి.

ఆ బ్రహ్మాండము, కోటిసూర్యసమాన ప్రకాశముగలదై, భూరాదిసప్తలోకము లును పాతాళాది సప్తలోకములును గలదై యున్నది. సంవత్సరాదికాలమును అందు కల్పితమైయున్నది. మఱియు ఆబ్రహ్మాండమందు భూమిరూప పద్మము గలదు. ఆ పద్మమునకు కర్ణికారూపమగు యే మేరువుగలదో, ఆ మేరువునుండి హిరణ్యగర్భ భగవంతుడు చతుర్ముఖ బ్రహ్మరూపమున ప్రకటితమాయెను. ఇంద్రాది సకలదేవతల కన్న ప్రథమమున జనించినవాడై, ఆ ఇంద్రాది సకలదేవతలచే పూజ్యుడుగానున్నాడు. మఱియు సంపూర్ణ జగత్తునకు కర్తగాను, పాలనముచేయువాడుగాను, సంహారము చేయువాడుగా నున్నాడు. ఇటువంటి బ్రహ్మదేవునకు అధర్వనామకుడైన కుమారుడు ప్రథమమున పుట్టెను ఆ యథర్వుడను జ్యేష్ఠపుత్రునకు బ్రహ్మదేవుడు బ్రహ్మవిద్య నుపదేశించెను ఆ బ్రహ్మవిద్య మూలాజ్ఞానమును నాశముచేయునదిగా నుండుటవలన సకల విద్యలకు ఆధారభూతమైయున్నది. ఇటువంటి బ్రహ్మవిద్య ప్రాప్తమైనపుడు ఇతర విద్యలయొక్క అపేక్షయు కాదు ఎందుకనగా - యితరములైన యే విద్యలు గలవో అవి కొంచెము కొంచము అర్థమును మాత్రమే ప్రకాశింపజేయునవై యున్నవి. బ్రహ్మవిద్యయో సకలార్థ ప్రకాశముగనున్నది. ఈలాగున సకలవిద్యలు బ్రహ్మవిద్యకు అంతర్భూతములై యున్నవి ఇటువంటి బ్రహ్మవిద్యను ఆ బ్రహ్మదేవుడు అథర్వుడను శిష్యునకొసగెను. ఆ యధర్వఋషికి అంగిరుడను ఋషి శిష్యుడాయెను. ఆ అంగిర ఋషికి భారద్వాజుడను ఋషి శిష్యుడాయెను. (భారద్వాజునికి సత్యవహుడనియు పేరుకలదు.) ఆ భారద్వాజఋషికి అంగిరసుడను ఋషి శిష్యుడయ్యెను ఆ యంగి రసఋషికి శౌనకుడనుఋషి శిష్యుడయ్యెను ఆ శౌనకఋషి బహు అన్నదానాదు లచే మహాగృహస్థ లక్షణమును పొందెను. అతనికనేక బ్రాహ్మణులు శిష్యులైరి. హే శిష్య. ఈ ముండకోపనిషత్తునందు బ్రహ్మవిద్య మొదట బ్రహ్మదేవునిచే అధర్వు డను తనపుత్రునకు కధనము చేయబడినట్లు కలదు. అధర్వఋషిముఖమున నది అనేకశిష్యులకు పరంపరగా ప్రాప్తమయ్యెను. ఆ బ్రహ్మవిద్యను నేను నీకు కధనము చేసెదను. సావధానుడవై శ్రవణము చేయుము.

హే శిష్య! పూర్వ మొకదినమున ఆ యంగిరసఋషి ప్రాతఃస్నానాది నిత్య కర్మలనుజేసి ఏకాంతప్రదేశమందు స్థితుడయ్యెను. ఆ యంగిరసఋషి సకలవేదముల తెలిసినవాడును, వేదప్రతిపాదితమైన అద్వితీయబ్రహ్మము నెఱిగినవాడును, నిష్కాము డునునై యుండెను. ఇటువంటి శ్రోత్రియబ్రహ్మనిష్ఠుడగు అంగిరసఋషినిచూచి

శౌనకఋషిసమిదాదిపదార్థములను హస్తమందు గ్రహణముచేసి విధిపూర్వకముగ నా ఋషిసన్నిధికి పోయి నమస్కారపూర్వకముగ నిట్లు ప్రశ్నచేసెను. హే భగవన్! ఏయొక వస్తువుయొక్క జ్ఞానముచే సకలజగత్తుయొక్క జ్ఞానము కలుగుచున్నదో, ఆ యొకవస్తువును దయచేసి తాము నాకు కథనము చేయుడు. అంగిరసుడు - హే శౌనక! అద్వితీయబ్రహ్మరూపమగు నొక ఆత్మవస్తువుయొక్క జ్ఞానముచే సకల జగత్తుయొక్క జ్ఞానము కలుగును. ఆ బ్రహ్మప్రాప్తి కొఱకు బ్రహ్మబిందూపనిషత్తు నందు శబ్దబ్రహ్మముయొక్క జ్ఞానమే శ్రేష్ఠోపాయమని చెప్పబడియె. శిక్షాదిషడంగ సహితములగు నాల్గు వేదములు ఏ బ్రహ్మమునకు శరీరమైయున్నవో, ఆ బ్రహ్మమునకు శబ్దబ్రహ్మమని పేరు. ఇటువంటి శబ్దబ్రహ్మమునందు ఏ పురుషుడు కుశలుడై యుండునో ఆ పురుషుడే పరబ్రహ్మమును పొందును. ఈ కారణమువలన ముముక్షు జనులు ద్వివిధవిద్యలను సంపాదనము చేయవలసినది. వాటిలో ఒకవిద్య సాధన రూపమగుటవలన అపరానామము గలదిగాను, మఱియొకవిద్య ఫలరూప మగుట వలన పరానామము గలదిగానున్నది. ఆ రెండు విద్యలందును మొదట అపరావిద్యను శ్రవణము చేయుము. హే శౌనక! షడంగసహిత చతుర్వేద రూపమగు ఏ అపరా విద్యగలదో, ఆ అపరావిద్యచేతనే పరావిద్య ప్రాప్తమగుచున్నది. పిదప ఆ పరావిద్య అద్వితీయబ్రహ్మమును విషయము చేయుచున్నది. ఏ బ్రహ్మమును పరావిద్య కథనముచేయుచున్నదో, ఆ బ్రహ్మము శ్రుతియందు అక్షరనామముచే కథనము చేయబడియె. ఆ యక్షరబ్రహ్మసంబంధలక్షణమును వేదవేత్తలిట్లు చెప్పుచున్నారు. ఆ యక్షరబ్రహ్మము మనోరహితముగను, దశేంద్రియవర్జితముగను, ప్రాణభూత, ఆకాశాది భూతరహితముగను, శబ్దాదివిషయశూన్యముగను నున్నది. ఈ కారణము వలన నా అక్షరబ్రహ్మము ఇంద్రియములచే గ్రహింపబడదు. మఱియు నా అక్షర బ్రహ్మము నామరూప క్రియారహితమైయున్నది. సాధనారహితులగు మనుజులకు దుర్విజ్ఞేయమగుటవలన అది సూక్ష్మమయ్యునున్నది. ఆ యక్షరబ్రహ్మము ఆకాశము వలె సర్వత్రవ్యాపకమగుటవలన దేశకృతపరిచ్ఛేదరహితముగాను, ఉత్పత్తినాశ రహితమగుటవలన కాలకృత పరిచ్ఛేద రహితముగాను, మాయావశమున జగత్తునకు కారణమైనను వాస్తవముగ జగద్రూపద్వైతముకన్న వేఱగుటవలన, వస్తుపరిచ్ఛేద రహితముగనున్నది. ఏ యక్షరబ్రహ్మమును, బ్రహ్మచర్యాది సాధన సంపన్నులు మాత్రమే తమచిత్తమునందు గాంచుచున్నారో సాధనారహితులు గాంచుటలేదో, అటువంటి అక్షరబ్రహ్మమునే, నీవు నీయాత్మరూపముగ నెఱుగుము. ఆ యక్షర బ్రహ్మముకన్న భిన్నమైన కులవర్ణాదులను నీవు ఆత్మరూపముగ నెఱుగకుము. ఆ యక్షరబ్రహ్మముయొక్క జ్ఞానముచేతనే సర్వజగత్తుయొక్క జ్ఞానమగును.

హే శౌనక ! ఈ అక్షరబ్రహ్మమే జగదుత్పత్తిస్థితిలయములకు, ఊర్ణనాభివలె అభిన్ననిమిత్తోపాదానకారణమై యున్నది. ఈ జగత్తునందు కొందఱు సుఖులు, కొందఱు దుఃఖులు, కొందఱు ధనికులు, కొందఱు నిర్ధనులు, యుండియుండుటచే అనేకప్రకార విలక్షణత ప్రతీతమగుచున్నది. ఇటువంటి విలక్షణమైన జగత్తునకు ఒకఅక్షరబ్రహ్మమే కర్తయనిన ఆ యక్షరబ్రహ్మమునందు విషమత, నిర్దయతాదిదోషములు ప్రాప్తించునను సంశయమును నివారించుటకుగాను వేదవేత్తలు భూమియొక్క దృష్టాంతము నిట్లు చెప్పియున్నారు. ఎట్లు స్థావరజంగమాద్యనేక ప్రకారశరీరములు ఒకే భూమియందు పుట్టుచున్నవో, అట్లే ఒకే అక్షరబ్రహ్మమునుండి నానా ప్రకారమగు జగత్తు పుట్టుచున్నది. అభిప్రాయము — బీజములయొక్క విలక్షణతచే నానా ప్రకార స్థావరజంగమశరీరములు పుట్టినటు ఒకే అక్షరబ్రహ్మమునుండి జీవుల పుణ్యపాపరూపకర్మముల సంస్కారముయొక్క విలక్షణతచే, నానా ప్రకారమగు జగత్తు పుట్టుచున్నది. కనుక ఆ యక్షరబ్రహ్మమునందు విషమత నిర్దయత సిద్ధింపవు. మఱియు హే శౌనక ! లోకమందు సమానస్వభావముగల మృత్తికాఘటాదిపదార్థములకు కారణకార్యభావము గాంచబడుచున్నది. విలక్షణపదార్థములకు కారణకార్యభావము గాంచబడుటలేదు. ఈలాగున చేతనబ్రహ్మముచే జడజగదుత్పత్తి సంభవింపదను నీ సంశయనివృత్తికొఱకు ఆ వేదవేత్తలీదృష్టాంతమును చెప్పుచున్నారు. ఎట్లు జీవితావస్థయందు చేతనరూపముచే ప్రసిద్ధుడైన మనుజునినుండి నఖ, కేశ, లోమాది అచేతనకార్యములు పుట్టుచున్నవో, అట్లే చేతనరూపాక్షరబ్రహ్మమునుండి జడజగత్తు పుట్టుచున్నది. కనుక సర్వదా సమానస్వభావముగల పదార్థములందే కారణకార్యభావమగునను నియమము సర్వత్రసంభవింపదు.

హే శౌనక ! అక్షరబ్రహ్మమునుండి జగదుత్పత్తి ఎట్లాయెనో వినుము. ఆ అక్షరబ్రహ్మము జగదుత్పత్తికిపూర్వము, ఉత్పన్నముచేయుటకు యోగ్యమై, జగత్తును విషయము చేయునట్టి జ్ఞానరూప తపమొనర్చెను. వేదముచే ప్రసిద్ధములైన నానా ప్రకార నామరూపములు దేనికిగలవో, జగద్విషయకమైన జ్ఞానరూప తపానంతరము, ఆ పరబ్రహ్మము జగదుత్పత్తికి అనుకూలమైన స్థూలత్వమును పొందెను. తదనంతరమా అక్షరబ్రహ్మమునుండి క్రమముగ ఆకాశాదిపంచభూతములు పుట్టెను ఆ భూతములనుండి సంపూర్ణజగత్తు పుట్టుచున్నది. ఆ పంచభూతములు శ్రుతియందు, అన్నశబ్దముచే కథనము చేయబడియె. అన్నశబ్దముచే నిట అవ్యాకృతమని గ్రహింపవలెను. ఆ అవ్యాకృతాజ్ఞానము, సిద్ధాంతమతమందు అనాదియైయున్నను, జగదుత్పత్తికాలమందు ప్రధానరూపజన్మమును బడయుచున్నది. ఆ చైతన్యప్రతిబింబయుక్త అవ్యాకృతాన్నమునుండి, మనః ప్రాణాదియుక్త సమష్టి సూక్ష్మశరీరముగలవాడైన హిరణ్యగర్భుడు

పుట్టుచున్నాడు. ఆ హిరణ్యగర్భుడు బృహదారణ్యకోపనిషత్తునందు మృత్యునామముచే కథనము చేయబడియె. అతనినుండి సమష్టి స్థూలశరీరముగలవాడైన విరాట్టు పుట్టెను. ఆ విరాట్టు శ్రుతియందు సత్యనామముచే కథనము చేయబడియె అనంతరమా విరాట్టునందు స్థితముగునట్టి, భూరాదిసప్తలోకములు పుట్టుచున్నవి. పిదప ఆ లోకస్థితాధికారి జనులకొఱకు వేదోక్తకర్మలు పుట్టుచున్నవి. తర్వాత ఆ కర్మలకుగాను స్వర్గాది ఫలములు పుట్టుచున్నవి. కర్మఫలమవశ్యముగ అధికారికి ప్రాప్తమగుచున్నది. ఈ కారణమువలన ఆ కర్మఫలమును శ్రుతిభగవతి అమృతనామముచే కథనము చేయుచున్నది ఇది పరావిద్య.

ఇపుడు అపరావిద్య నిరూపణ గావింపబడుచున్నది — హే శౌనక! ఈ అక్షరబ్రహ్మమును సామాన్యముగ సకలజగత్తు నెఱుగుచున్నది. ఈ కారణమువలన వేదవేత్తలీ అక్షరబ్రహ్మమును, 'సర్వజ్ఞ' నామముచే కథనము చేయుచున్నారు. మఱియు విశేషరూపముగ జగత్తు నెఱుగుటవలన, "సర్వవిత్" నామముచే కథనము చేయుచున్నారు. ఇటువంటి సర్వజ్ఞ సర్వవిద్బ్రహ్మమునుండి సమష్టి సూక్ష్మశరీరాభిమానియగు హిరణ్యగర్భుడున్ను, ఆ హిరణ్యగర్భునినుంచి విరాట్టున్ను పుట్టుచున్నారు. హే శౌనక! ఆ హిరణ్యగర్భశరీరరూపమగు సూక్ష్మసమష్టి విశ్వమెంతగలదో, మఱియు విరాట్ శరీరరూపమగు స్థూలసమష్టి విశ్వమెంతగలదో, ఆ సకలవిశ్వమున్ను వేదవేత్తలచే కర్మఫలరూపముగ కథనము చేయబడియె. ఆ కర్మఫలము జీవులకు అవశ్యముగ ప్రాప్తమగుచున్నది. ఈ కారణమువలన శ్రుతియందు ఆ కర్మఫలము 'సత్య'శబ్దముచే కథనము చేయబడియె

శౌనకుడు – హే భగవన్! ఆ హిరణ్యగర్భాదులయైశ్వర్యమే కర్మమునకు ఫలము. అంగిరసుడు — హే శౌనక। వేదభగవంతునిచే విధానముచేయబడిన దర్శపౌర్ణమాస్యాది ఏ అగ్నిహోత్రాది కర్మలుగలవో, అవి దధి, ఘృత యజమాన, మంత్ర, దేశ, కాలాది, పదార్థభేదముచే నానా ప్రకారములైయున్నవి. ఇటువంటి అగ్నిహోత్రాది కర్మములచే, ఆ యా యధికారిపురుషులకు ఆ యా యైశ్వర్యరూప ఫలము ప్రాప్తియగుచున్నది. హే శౌనక! ఏ పురుషులు వేదవిహితకర్మములను చేయరో, రూపాదివిషయములందు ఆసక్తులగుదురో, ఆ యధమపురుషులకు అధోగతియే ప్రాప్తమగుచున్నది. నిషిద్ధకర్మపరిత్యాగముచేయువారై విషయాసక్తిరహితులైన అధికారిపురుషులకే, స్వర్గాది ఉత్తమలోకములందు దేవతాశరీరములు ప్రాప్తమగుచున్నవి. హే శౌనక! వేదవిహితములైన అగ్నిహోత్రాది కర్మములు కేవలస్వర్గాది సుఖములకే కారణములుకావు. నిష్కామముగా చేయబడిన ఆ అగ్నిహోత్రాదికర్మములు, అంతఃకరణశుద్ధిద్వారా ఆత్మజ్ఞానమునకున్ను హేతువులైయున్నవి.

నిష్కామకర్మములకు, వైరాగ్యరూపఫలము నిరూపింపబడుచున్నది — హే శౌనక! శరీరత్రయరహితమగు ఏ మోక్షముకలదో, అది కర్మియగుపురుషునకు ప్రాప్తమగునను ఆశ నీవెప్పటికిని చేయవలదు. ఎందుకనగా — కర్మజన్యములగు ఏయే ఫలములుగలవో, ఆయా ఫలములు అనిత్యములే యగును. ఎట్లన, కర్మజన్యము లైన స్వర్గాదిఫలములు అనిత్యములేకదా! ఇటువంటి కర్మముచే మోక్షము గలిగిన పక్షమందు ఆ మోక్షమున్ను అనిత్యమేయగును వేదవేత్తల చేతనో మోక్షము అనిత్య మని వచింపబడలేదు. సకల విద్వాంసులు మోక్షము నిత్యమనియే పల్కుచున్నారు. - హే శౌనక! జ్యోతిష్టోమ అగ్నిహోత్రాది కర్మములెన్నిగలవో. ఆ సర్వకర్మములు అధికారిపురుషులను ఈ సంసారసముద్రమును దాటించి మోక్షనగర ప్రాప్తిచేయించు టకు సమర్థములు కావు. మహాసముద్రము ప్లవముచే, (చేపలు పట్టుకొనుటకుపయోగించు చిన్ననౌకచే) దాటుటకు శక్యముకాదుకదా! తాన పరమేశ్వరునిచే ఈ కర్మరూప ప్లవము సంసారసముద్రమును దాటుటకు రచింపబడలేదు. సంసారసముద్రమునందు స్థితములైన స్వర్గసుఖాదిమత్స్యముల పట్టుకొనుటకయ్యే రచింపబడియె.

శౌనకుడు = హే భగవన్! ఎట్లులోకప్రసిద్ధ సముద్రమునందు ప్లవమును నడిపించుటకు ధీవరుడెట్లుగలడో, అట్లు సంసారసముద్రమందగ్నిహోత్రాదిరూపప్లవ మును నడిపించు ధీవరుడెవడు?

అంగిరసుడు - హే శౌనక! అధ్వర్యుడు మొదలగు షోడశఋత్విజులు, యజ మానుడు, యజమానునిభార్య, ఈ పదునెనిమిది మంది జనులు అగ్నిహోత్రాది రూప ప్లవమును నడిపించువారై యున్నారు. యజ్ఞకర్మమును నడిపించువారైన బ్రాహ్మణుల పేరు ఋత్విజులు. వారిలో యజుర్వేదము నెఱిగినవారు అధర్యుడు, ప్రతిప్రస్థాత, నేష్టా, నేత అనునలుగురు ఋగ్వేదము నెఱిగినవారు, హోత, మైత్రావరుణ, అచ్ఛా వాక, గ్రావస్తుతులను నలుగురు సామవేదము నెఱిగినవారు, ఉద్గాత, ప్రస్తోత, ప్రతిహర్త, సుబ్రహ్మణ్యులను నలుగురు. ఋగ్యజుస్సామములను నీ వేదత్రయాధ్యా యులు బ్రహ్మ, బ్రాహ్మణ, ఛాందసి అగ్నీధ్రపోత, అను నీనలుగురు. అందరుచేరి పదునారుగురు. యజమానుడు, యజమానస్త్రీ, మొత్తం అష్టాదశధీవరులు. హేశౌనక! ఈ సంసారసముద్రమందే కర్మరూపప్లవముకలదో, ఆ ప్లవమందు శ్రోత్రియ బ్రహ్మ నిష్ఠుడగు గురురూపధీవరుడెవడును లేడు మఱియు బ్రహ్మచర్యాది సాధనరూపమగు అనుకూల వాయువున్ను లేదు. ఆ కర్మరూపప్లవమో, స్వభావముగ క్షణక్షణమందు నాశముగలదై దృఢత్వరహితమై శిధిలముగనున్నది. ఇటువంటి కర్మరూపప్లవము నాశ్రయించి ఏ బుద్ధిమంతుడు నిశ్శంకుడై ఈ సంసారసముద్రమందు ప్రవేశించును? బుద్ధిమంతుడగువాడీ మార్గమునకేరాడు. విచారహీనులగు మూఢపురుషులే, అప్లవము

నాశ్రయింతురు. మోక్షేచ్ఛగల అధికారిపురుషులు ఆ ప్లవమును నెప్పటికిని నాశ్ర యింపగూడదు.

హే శౌనక ! విచారహీనపురుషులు నాకర్మరూపప్లవము నాశ్రయించి, తమ్ముల కృతకృత్యులుగా నెఱుగుచున్నారు. ఆ కర్మిపురుషులెప్పటికిని ఈ సంసార సముద్రమును దాటజాలరు. పైగా కామక్రోధాది తరంగములచే ఆ ప్లవము సంసార సముద్రసంబంధ జననమరణరూపజలమందే పలుమారు మునుగుచున్నది. కాన దాని వలన నెప్పటికిని సుఖప్రాప్తికాదు. హే శౌనక ! అవిద్యారూపజలముచే నిండబడిన ఈ సంసారసముద్రమందు కర్మిపురుషులు, లోకప్రసిద్ధధీవరునివలె తమకును యితర జీవులకును క్లేశప్రాప్తిచేయుచు స్థితులైయున్నారు. ఆ కర్మిపురుషులు తమకున్ను తమశిష్యులకును అనర్థప్రాప్తియే చేయుచున్నారు. ఇటువంటి కుబుద్ధిగలవారైన కర్మి పురుషులు తమ్ముల పండితులుగా నెంచుకొనుచున్నారు. మఱియు అనేకప్రకార రోగాద్యనర్థములచే విక్షేపములను పొంది వారు మాయారచిత మోహరూపగర్తమందు పలుమారు పడుచున్నారు. ఈ లాగున ఆ కర్మిపురుషులు మహామూర్ఖులుగానున్నారు. వారు వివేకరహితులై యున్నారు వారి గురువులున్ను వివేకరహితులే యైయున్నారు. ఎట్లు నేత్రహీనుడగు అంధుడు మరియొక అంధునిచే నడపబడుచుండిన పలుమారు గర్తమందుపడునో, అట్లే వివేకరహితులై స్వర్గసుఖమును కోరినవారైన కర్మిపురుష లున్ను వివేకహీనులగు కర్మిష్ఠులైన గురువులవెనుక నడుచుచు మాయాజలయుక్త సంసారసముద్రమందు మహాదుఃఖమును పొందుచున్నారు. ఎట్లు భూతావేశము గలవారైన మనుజులు తమ దుఃఖము యొక్కగాని, యితరుని దుఃఖము యొక్కగాని నివృత్త్యుపాయము నెఱుగరో, అట్లే కామక్రోధాది పిశాచముల యావేశము గలవారైన ఆ కర్మిపురుషులున్ను తమ దుఃఖనివృత్త్యుపాయమునుగాని, ఇతరుని దుఃఖనివృత్త్యు పాయమునుగాని యెఱుగరు. పైగా ఆ యల్పబుద్ధిగల కర్మిపురుషులు అగ్నిహోత్రాది కర్మములచే తాము కృతార్థులమైతిమనియు, అంతకుపైగా యిక యే కర్తవ్యమున్ను లేదనియు నెఱిగి పిశాచమువలె నృత్యము, హాస్యము చేయుచున్నారు. వారు కామ రూపపిశాచమునకు వశులై పరమేశ్వరుని మాయచే మోహితులై ఈ పాంచభౌతిక శరీరమందే పరమసుఖబుద్ధిని చేయుచున్నారు. మఱియు ఆ కర్మిపురుషులు ఈ ప్రకా రము చింతనము చేయుదురు ఈ శత్రువును మేము మాబలముచేతనే హననము చేయుచున్నాము. ఈ నాశత్రువు మఱలలేచుచున్నాడు ఇప్పుడు వీనిని హననము చేసెదము. ఈ నామిత్రుడు మహాబలవంతుడుగా నున్నాడు. ఇపుడు మాకేమియు భయములేదు, ఈ మొదలగు అనేకప్రకార చింతనలచే వ్యాప్తమైన చిత్తముగలవారై ప్రమాదరూపగృహమును పొంది వారు తమహృదయదేశమందు స్థితమైన ఆనంద

రూపాత్మను యెఱుగుటకును సమర్థులుగాకయున్నారు. ఈ కారణమువలన కర్మి పురుషులు మాటిమాటికి జన్మమరణముల పొందుచున్నారు.

హే శౌనక ! ఆ కర్మిపురుషులు సంసారసుఖమునందాసక్తులై స్వర్గమందు పుణ్య కర్మఫలమునుపభోగించి పుణ్యక్షయమైన కొంతకాలమునకు శోకయుక్తులై ఆ స్వర్గము నుండి క్రిందకు పడుచున్నారు. ఎట్లు లోకమందు ధనికుడగు పురుషుడుగాని, రాజు గాని మృత్యుకాలమందు మహాదుఃఖమును పొందుచున్నారో, అట్లే ఆ కర్మిపురుషు లున్ను స్వర్గమునుండి అధఃపతనమొందు కాలమందు దుఃఖమును పొందుచున్నారు. మరణకాలమందు సకలదేహధారి జీవులకు దుఃఖప్రాప్తి యగుచున్నను ధనవంతున కును రాజునకును బహుభోగాసక్తిచే మరణకాలమందు ఇతరజీవులకన్న నధికదుఃఖ ప్రాప్తి యగుచున్నది ఈ కారణమువలన స్వర్గవాసులగు పురుషులకు ధనవంతుని యొక్కయు రాజుయొక్కయు దృష్టాంతము చెప్పబడియె. హే శౌనక ! ఆ కర్మిపురుషు లకు స్వర్గమందు ఇంద్రాదిదేవతలకు పరతంత్రులగుటచేతను, అధికభోగముల అప్రాప్తివలనను, దుఃఖప్రాప్తియగుచున్నది. మఱియు ధనికుడగు పురుషునకు, అక స్మాత్తుగ ధననాశమగుటచే దుఃఖమైనట్లు స్వర్గస్థపురుషులకున్ను పుణ్యక్షయమగుటచే దుఃఖమ్ము ప్రాప్తమగుచున్నది. హే శౌనక ! స్వర్గమునుండి పతనము నొందిన జీవు నకు, ఏ శరీరము ప్రాప్తమగును ? ఉత్తమమా ? మధ్యమమా ? అధమమా ? అను సంగతి సర్వజ్ఞుడగు నొక ఈశ్వరునికి తప్ప మరెవరికిని తెలియదు. అతడే దాని నెఱిగినవాడు. హే శౌనక ! ఇది అగ్నిహోత్రాది ఇష్టకర్మముల చేయువారును, వాపీకూపాదిపూర్తకర్మముల చేయువారును నగు కర్మపురుషులకు స్వర్గప్రాప్తి గలుగచేయునట్టి దక్షిణమార్గము.

ఇపుడు దేవయానమను ఉత్తరమార్గమును శ్రవణముచేయుము - హే శౌనక ! దక్షిణమార్గమెట్లు సంసారమున కంతర్భూతమో, అట్లు ఉత్తరమార్గమును సంసార మున కంతర్భూతమే ఐనను, ఉత్తరమార్గమైన దేవయానము సంసారసముద్రము యొక్క ఆవలితీరమునకు సమీపముగ నున్నది. ఈ కారణమువలన దేవయాన మార్గము బహుజనులకు ప్రాప్తముకాదు. వైరాగ్యశీలురగు జనులకే ప్రాప్తమగును. హే శౌనక ! మేమెప్పటికిని వీర్యపరిత్యాగము చేయము స్త్రీ సంగమొనర్పము. ఇటు వంటి వ్రతముగలవారైన నైష్ఠికబ్రహ్మచారులే ఈ మార్గమున బోవుదురు. మఱియు దహరాద్యుపాసనల చేయువారు పంచాగ్న్యుపాసనచేయువారు మాత్రమే ఈ మార్గమున బోవుదురు. (పంచాగ్న్యాద్యుపాసనల చేయువారైన గృహస్థులుకూడ, ఈ మార్గముననే పోవుదురు.) ఆ బ్రహ్మచర్యాది సాధనములు మహాగహనములుగానున్నవి. హే శౌనక !

దేవయానమార్గగమ్యమగు బ్రహ్మలోకమందును సర్వజనులకు ఆత్మజ్ఞానముకానేరదు. బ్రహ్మలోకాధికారులందు దైవయోగముచే నే యధికారికి ఆత్మజ్ఞానమైనదో, ఆ యధికారియే హిరణ్యగర్భునికన్న పరమైన యద్వితీయాత్మను పొందుచున్నాడు. భూలోకమందుగాని బ్రహ్మలోకమందుగాని, సంపాదించిన ఆత్మజ్ఞానముచే మోక్షప్రాప్తి సమానముగానే యున్నది. ఏ అధికారులకు బ్రహ్మలోకమందు ఆత్మజ్ఞానము కాలేదో, ఆ యధికారిపురుషులు ఆ బ్రహ్మలోకము నుండిఁ మఱల మనుష్యలోకమునకు వచ్చుచున్నారు. ఐనను ఆ యధికారిపురుషులు ఈ మన్వంతరముననే, అథవా — ఈకల్పముననే మనుష్యలోకమునకురారు. మఱియొక మన్వంతరమందు అథవా కల్పమందు వచ్చుచున్నారు. అలాగున దక్షిణమార్గమువలెనే దేవయానమార్గమున్ను పునరావృత్తి గలదిగానున్నది కనుక ముముక్షుజనులచే దక్షిణమార్గమువలె ఉత్తరమార్గమున్ను పరిత్యాగయోగ్యమై యున్నది,

హే శౌనక ! బ్రహ్మలోకమందుగాని, స్వర్గలోకమందుగాని, భూలోకమందుగాని, పాతాళలోకమందుగాని, నరకలోకమందుగాని, బ్రహ్మాత్మజ్ఞానమే ముక్తికి కారణమైయున్నది బ్రహ్మజ్ఞానముగాకున్న ఏలోకమందును మోక్షప్రాప్తిగానేఱదు. ఈ విషయమున నీవు కించిన్మాత్రమును సంశయము చేయకుము. హే శౌనక ! ఏ లోకమందును బ్రహ్మజ్ఞానముగాకున్న యెట్లు మోక్షప్రాప్తిగాదో, అట్లే ఏ లోకమందును శరీరము సుఖప్రాప్తి గలుగజేయదు. సర్వలోకములందును శరీరము దుఃఖకారణమేయైయున్నది మనుష్యదేవతా పశ్వాది భేదములచే శరీరములందు విలక్షణత ప్రతీతమగుచున్నను శరీరజన్య దుఃఖరూపఫలము సర్వత్ర సమానముగనే యున్నది. ఎట్లు మహారాజుయొక్క నివాసముకొఱకు రచితమైన యేడంతస్తులుగల ఎత్తైనగృహముయొక్క పై అంతస్థుపై నివాసముచేయువారైన పురుషునకును క్రిందఅంతస్థులో నివాసము చేయువారైన పురుషునకును జ్వరసంబంధ పీడ సమానముగనేయున్నదోఁ అట్లే స్వర్గాదిలోకములందున్న దేవతలకును, భూలోకమందున్న మనుష్యపశ్వాదులకును శరీరసంబంధదుఃఖము సమానముగనే యున్నది. ఆ దుఃఖమందు కించిన్మాత్రమున్ను విలక్షణతలేదు. ఎట్లు సువర్ణశృంఖలమందును లోహ శృంఖలమందును బంధకారణత సమానముగనేయున్నదో అట్లే దేవతాశరీరమందును మనుష్యాదుల శరీరమందును దుఃఖకారణత సమానమై యున్నది. హే శౌనక ! సర్వోత్తమమైన హిరణ్యగర్భశరీరమందును సర్వనికృష్టమైన శ్వానశరీరమందును అవిద్యాకార్యతయు పాంచభౌతికతయు సమానమేయైయున్నది. విచారించి చూచినపుడు రెండు శరీరములందును కించిన్మాత్రభేదమున్ను సిద్ధింపదు. మఱియు ఎట్లు శరీరములందు భేదము సిద్ధింపదో. అట్లు ఆ రెండు శరీరములకు సంబంధించిన అభిమానిజీవులందును భేదము సిద్ధింపదు,

హే శౌనక ! ఏయే జీవునిచే నేయేశరీరము గ్రహింపబడుచున్నదో, ఆయా జీవునకాయాశరీరము సకలశరీరములకన్న నధికముగ ప్రతీతమగుచున్నది. మఱియు ఇతర సర్వశరీరములు నికృష్టముగ ప్రతీతమగుచున్నవి. అందువలన నభిమానకృతమగు నుత్కృష్టతయు బ్రహ్మదేవునినుండి శ్వానపర్యంతము సర్వశరీరములందును సమానమేయైయున్నది. ఏ శరీరమందుజీవునిచే నధికత యెఱుగబడుచున్నదో ఆ శరీరము ఆధివ్యాధిజన్య సకలదుఃఖములకు కారణమై సకలదుర్గంధయుక్తమై సర్వదా అశుచివంతమైయున్నది ఇటువంటి మలినశరీరమును జీవునకు ఏదైవముయొక్క ప్రభావముచే దుఃఖకారణముగను, దుర్గంధముగను, అశుచిగను. ప్రతీతముకాదో; ఆ విచిత్రదైవము బుద్ధిమంతులకు భేదయోగ్యమైయున్నది. హే శౌనక ! ఈ శరీరము దుర్గంధాది దోషములచే యుక్తమైయున్నమ కర్మము, కామము అవిద్య. ఈ మూడింటియొక్క ప్రభావముచే జీవులకది అమృతసమానముగ ప్రియముగ ప్రతీతమగుచున్నది. (ఇట ప్రారబ్ధకర్మసంబంధఫలమునకు కర్మమనియు, రాగమునకు కామమనియు, అధ్యాసమునకు అవిద్యయనియు పేర్లు.) హే శౌనక ! ఏ కర్మకామావిద్యల బలముచే. ఈ మలినశరీరమున్ను అమృతసమానముగ ప్రతీతమగుచున్నదో, ఆ కర్మమునకు ధిక్కారము, కామమునకు ధిక్కారము అవిద్యకు ధిక్కారము. హే శౌనక ! ఏయధ్యాసరూపావిద్యచే మోహము నొందినవారైన ఈజీవుడు సర్వదా తనముఖమందు స్థితమైన లాలను పానముచేయుచు నెప్పటికిని నసహ్యము నొందడో, ఆ యవిద్య యెంతనీచముగ నుండవలయునో విచారము చేయుము. ఏ విష్టామూత్రరుధిర కఫాది పదార్థములు వైతరణీ మొదలగు నదులందు విద్యమానములైయున్నవో, ఆ విష్టామూత్రాది పదార్థములే ఈ శరీరమందును సర్వదా విద్యమానములైయున్నవి. ఈ రెంటికిని కించిన్మాత్రమున్ను భేదములేదు. ఇట్లుండగా జీవులకు పాపాదిదోషవశమున ఆ సకల అసహ్యపదార్థములున్ను సుందరముగ మనోహరముగ ప్రతీతములగుచున్నవి. కాన జీవులకు పాపాదుల మహిమ ఆశ్చర్యకారకముగ నున్నది. శ్రుతి "పరీక్ష్యలోకాన్ కర్మచితాన్ బ్రాహ్మణో నిర్వేదమాయాత్" భావార్థము - పూర్వోక్తరీతిగా కర్మరచిత సర్వలోకములందును అనిత్యత్వ, అశుద్ధత్వాది దోషములు గలవని యెఱిగి అధికారి పురుషులు ఆ లోకమునుండి వైరాగ్యమును పొందుచున్నారు.

హే శౌనక ! చూడుము. భూమ్యంతరిక్షస్వర్గములను నీ లోకత్రయమునకంతర్గతములగు నెన్నిలోకములుగలవో ఆ లోకములు యజ్ఞాదిశారీరిక కర్మములచే ప్రాప్తములగుచున్నవి. మఱియు ఈ లోకములకన్న బాహ్యములైన యే బ్రహ్మలోకాదులుగలవో అవి ఉపాసనారూపమానసకర్మముచే ప్రాప్తములగుచున్నవి. ఈ ప్రకారమగు నియమము ఏ కాలమందును మఱియొకవిధముగ నగునదికాదు. ఈలాగున

సమస్తలోకములు కర్మజన్యములే యైయున్నవి. ఆ యా లోకములందు ఏ యే సుఖ పదార్థములుగలవో, అవన్నియుకూడ కర్మజన్యములే, ఘటాదిపదార్థములు కర్మజన్యము లగుటవలన యెట్లు అనిత్యములో అట్లే సకలలోకములును వాటియందున్న సకల పదార్థములున్ను కర్మజన్యమగుటవలన అనిత్యములే యగును. మఱియు లోకమందు ఏ యే పదార్థమనిత్యమో ఆ యా పదార్థము తన వియోగకాలమందెట్లు అవశ్యముగ దుఃఖప్రాప్తిచేయుచున్నదో, అట్లు స్వర్గాది సకలలోకములున్ను వాటియందుగల సుఖపదార్థములున్ను అనిత్యములగుటవలన తన వియోగకాలమందు జీవులకవశ్యముగ దుఃఖప్రాప్తిని జేయుచున్నవి. ఈ కారణమువలన అధికారిజనులచే తత్పరిత్యాగమే యుచితమగును. హే శౌనక ! ఎట్లు స్వర్గాదిలోకములు కర్మజన్యములో అట్లు మోక్షము కర్మజన్యముకాదు. ఎందుకనగా — మోక్షము కర్మజన్యమైన పక్షమందు అదియు స్వర్గాదిలోకములవలె అనిత్యమగును. మోక్షమనిత్యమైన పక్షమందు ముముక్షుజనుల సకలప్రయత్నము వ్యర్థమగును. అథవా మోక్షము కర్మజన్య మనినపుడు స్వర్గాదిలోకములకంటె మోక్షమందు విశేషతయుండదు. ఏలాగుననగా— విశ్వజిత యజ్ఞముచే స్వర్గప్రాప్తియగును. జ్యోతిష్టోమయజ్ఞముచేతను, స్వర్గప్రాప్తి యగును. ఈ రెండు విధములగు స్వర్గములందును కించిత్ అవాంతరవిశేషముండినను స్వర్గత్వరూపముచేతను, అనిత్యత్వరూపముచేతను వాటియందు విశేషత యుండదు. సమానతయే యుండును. ఇట్లు మోక్షమందును అనిత్యత్వము సిద్ధించినపుడు "న స పునరావర్తతే" అనగా ముక్తపురుషులకు పునరావృత్తిలేదని వచించు నీ శ్రుతి వచనము వ్యర్థమగును. మఱియు సకలశాస్త్రములకును ఆచార్యులకును మోక్షవిషయ మందే నిత్యతాభిప్రాయము ప్రసిద్ధమైయున్నదో, ఆ ప్రసిద్ధియు నిరర్థకమగును. ఈ కారణమువలన మోక్షమందనిత్యత్వము సిద్ధింపదు. అథవా "నాన్యః పంథా విద్యతే ఒయనాయ" మోక్షప్రాప్తికొఱకు ఆత్మజ్ఞానముతప్ప యింకొకమార్గములేదు. "బ్రహ్మ వేద బ్రహ్మైవ భవతి" భావార్థము — ఏ అధికారిపురుషులు అద్వితీయ బ్రహ్మమును తమ ఆత్మరూపముగా నెఱుగుదురో, ఆ యధికారిపురుషులు బ్రహ్మరూపులే యగుదురు. మోక్షమునకు కర్మజన్యత అనిత్యతకలదనినపుడు ఈ పై రెండు శ్రుతులున్ను వ్యర్థ మగును శ్రుతికి వ్యర్థత నే యాస్తికవాదియు నంగీకరింపడు.

హే శౌనక ! అజ్ఞానరూపావరణ రహితమైన ఏ యానందరూప బ్రహ్మముకలదో ఆ బ్రహ్మమునే వేదవేత్తలు మోక్షనామముచే కథనము చేయుచున్నారు. ఇటువంటి అజ్ఞాననివృత్తి కేవలజ్ఞానముచేతనే యగుచున్నది. ఎందుకనగా — ఏ వస్తువిషయక మగు నజ్ఞానము, ఆ వస్తువిషయకజ్ఞానముచేతనే నివృత్తమగును. కర్మాది ఇతరో పాయములచే నివృత్తముకాదు. మఱియు నెపుడు రజ్జువిషయకజ్ఞానముచే రజ్జువిషయక

అజ్ఞానముయొక్క నివృత్తియగునో, అపుడు అజ్ఞానకార్యరూప సర్వము తనంతటతానే నివృత్తమగును. ఈ విషయము లోకానుభవముచేతను సిద్ధించుచున్నది. అట్లే బ్రహ్మాత్మ విషయక అజ్ఞానము బ్రహ్మాత్మవిషయక జ్ఞానముచేతనే నివృత్తియగుచున్నది. బ్రహ్మాత్మజ్ఞానముచే తప్ప కర్మోపాసనాద్యుపాయములచే, నజ్ఞానమునకు నివృత్తి సంభవింపదు. మఱియు బ్రహ్మాత్మజ్ఞానముచే నెపుడు అజ్ఞాననివృత్తియగుచున్నదో, అపుడు అజ్ఞానజన్య దుఃఖమున్ను తనంతటతానే నివృత్తమగుచున్నది. అథవా — ఏ వాది సంసారదుఃఖ మజ్ఞానజన్యమని యెఱుగడో, న్యాయమతానుసారముగ ఆత్మ రూపసమవాయికారణాదులసహితమై ఆ దుఃఖమును సత్యరూపముగ నెంచుచున్నాడో, ఆ వాదియొక్క మతమందాదుఃఖము ఆత్మవలె సర్వదా విద్యమానమగును దానివలన దుఃఖనివృత్తిరూప మోక్షప్రాప్తికొఱకు అధికారిపురుషుల ప్రయత్నము వ్యర్థమగును. ఒకచో వాది ఘటాదిపదార్థములవలె ఆ దుఃఖమును సత్యమని అంగీకరించి అనిత్య మనినపుడును ఆ దుఃఖనివృత్తిరూప మోక్షప్రాప్తికొఱకు అధికారిపురుషుల ప్రయత్నము వ్యర్థమగును. ఎందుకనగా — లోకమందు ఏ యే భావపదార్థములనిత్యములగునో, ఆ యా పదార్థము లేదోయొక కాలమందు తమంతటతామే నాశమొందును. కొట్టు యందుంచబడిన ధాన్యము యేదోయొక కాలమందు తమంతటతామే నాశమగునట్లు, ఆ యనిత్యదుఃఖమున్ను తనంతటతానే నాశమును పొందును. అటువంటి అనిత్యదుఃఖ నివృత్తికొఱకు ప్రయత్నము వ్యర్థము. అథవా — నైయాయికులు ఆ దుఃఖమును అవిద్యాజన్యమని అంగీకరింతురు. ఆ మతమందు దుఃఖమునకు అత్యంతనాశము సంభవింపదు. ఎందుకనగా — ఆ నైయాయికులు దుఃఖమునకు సమవాయి కారణమైన ఆత్మను నిత్యమనుచున్నారు కనుక ఒకసారి దుఃఖమునకు నివృత్తియైనను ఆ నిత్యా త్మచే మఱల దుఃఖోత్పత్తి యగును. కారణము విద్యమానమైయుండగా కార్యోత్పత్తి నెవడును నివారణ జేసుకొనజాలడు.

అథవా — దుఃఖమునకు కారణమైన యే ద్వైతప్రపంచముగలదో, ఆ ద్వైత ప్రపంచము ఒకచో సత్యమైనపుడు సాక్షాత్ ఈశ్వరుడును ఆ దుఃఖనివృత్తియందు సమర్థుడుకాడు. ఎందుకనగా — ఈశ్వరుడు ఒకచో, సత్యవస్తువుయొక్క నివృత్తి చేసినపక్షమందు నీ మతమందు సత్యరూపముచే ప్రసిద్ధమైన యే జగత్తుగలదో తత్సం హారముజేసి ఈశ్వరుడు మఱల జగదుత్పత్తి చేయకుండును. అట్లు కాన్పించుటలేదు. ఈలాగున నైయాయికునిచే నంగీకరింపబడిన ఆ సత్యద్వైతమందు దుఃఖమునకు కారణత సంభవింపదు. ఆత్మయొక్క అజ్ఞానముచేతనే దుఃఖమునకు కారణత సంభవించును. ఎపుడాత్మజ్ఞానముచే ఆ యజ్ఞానముయొక్క నివృత్తియగునో, అపుడాదుఃఖము మఱల యెప్పటికిని పుట్టదు. ఇటువంటి ఈ యుక్తి ఉపనిషన్మత

మును అంగీకరించుచున్నది. అట దృష్టాంతము — రజ్జ్వాదిజ్ఞానముచే పుట్టినదైన సర్పాదిదర్శనజన్య భయకంపాది దుఃఖమేదిగలదో ఆ దుఃఖము రజ్జుసంబంధాజ్ఞానము నివృత్తమైన పిదప మఱల ఉత్పన్నముకాదు దీనివలన అనర్థనివృత్తిపూర్వక బ్రహ్మానంద ప్రాప్తిరూపమోక్షమేదిగలదో ఆ మోక్షము ఆత్మజ్ఞానముచేతనే ప్రాప్తమగునుగాని కర్మోపాసనలచే ప్రాప్తముకాదని సిద్ధించుచున్నది. "నాస్త్యకృతః కృతేన" భావార్థము — కార్యభావముచే రహితమైన నిత్యమోక్షమేదిగలదో ఆ మోక్షము కర్మోపాసనలచే ప్రాప్తముకాదు. ఆత్మజ్ఞానమొకదానిచేతనే ప్రాప్తమగును.

ఇపుడాబ్రహ్మజ్ఞానప్రాప్తియొక్క ప్రకారము వచింపబడుచున్నది హే శౌనక! ఆ బ్రహ్మజ్ఞానము అధికారిపురుషులకు బ్రహ్మవేత్తయగు గురూపదేశముచేతనే యగును.

శ్రుతి॥ "తద్విజ్ఞానార్థం స గురుమేవాభిగచ్ఛేత్
సమిత్పాణిః శ్రోత్రియం బ్రహ్మనిష్ఠం"

భావార్థము — వివేకాదిసాధనసంపన్నులగు అధికారిపురుషులు సమిధాది పదార్థముల హస్తమందుగ్రహించి బ్రహ్మాత్మజ్ఞానప్రాప్తికొఱకు శ్రోత్రియ బ్రహ్మనిష్ఠుడగు గురువు సమీపమునకు పోవలయును. ఏ గురువు శాస్త్రోక్తమైన అనేక ప్రకార యుక్తులచే శిష్యుని సంశయము నివృత్తిచేయుటకు సమర్థుడగునో, ఆ గురువునకు శ్రోత్రియుడనిపేరు. ఏ గురువునకు బ్రహ్మమునందు నిష్ఠయగునో. ఆ గురువునకు బ్రహ్మనిష్ఠుడనిపేరు. ఇటువంటి శ్రోత్రియ బ్రహ్మనిష్ఠుడగు గురువును విధిపూర్వకముగ శరణాగతుడైన శ్రద్ధావంతుడైన శిష్యునకు ఆ గురువు సకలదుఃఖముల నాశనము చేయదగినదైన బ్రహ్మవిద్యయొక్క యుపదేశమును చేయును.

ఇపుడు పూర్వము సంక్షేపముగ చెప్పబడిన బ్రహ్మవిద్యయే విస్తారముగ కథనము చేయబడుచున్నది. హే శౌనక! విరక్తులైన ముముక్షుజనులు శ్రోత్రియ బ్రహ్మనిష్ఠుడైన గురుముఖమున యే బ్రహ్మమును సత్యరూపముగ నెఱుగుచున్నారో, మఱియు ఏ బ్రహ్మముకన్న భిన్నమైన సకలజగత్తును అసత్యరూపముగ నెఱుగుచున్నారో ఆ సత్యబ్రహ్మమునుండియే జగదుత్పత్తిస్థితిలయములగుచున్నవి. ఎట్లు ప్రజ్వలితాగ్నిచే తత్సమానరూపముగల విస్ఫులింగములు పుట్టుచున్నవో, మఱియు విరుద్ధధర్మముగల ధూమము పుట్టుచున్నదో, అట్లే అక్షర బ్రహ్మమునుండి సమాన రూపముగల చైతన్యపదార్థములును, విరుద్ధధర్మముగల జడపదార్థములును పుట్టుచున్నవి. హే శౌనక! ఏ పరబ్రహ్మమునుండి జడచేతనరూప జగత్తు పుట్టుచున్నదో ఆ పరబ్రహ్మము సకలజగత్తుకన్న విలక్షణముగ నున్నది. ఈ కారణమువలన శ్రుతి భగవతి ఆ పరబ్రహ్మమును "దివ్య" నామముచే కథనము చేయుచున్నది. మఱియు

ఆ పరబ్రహ్మము ఆకాశమువలె సర్వత్రవ్యాపకమై యున్నది. ఈ కారణమువలన శ్రుతిభగవతి ఆ పరబ్రహ్మమును "అమూర్త" నామముచే కథనము చేయుచున్నది. సకలదేహాద్యుపాధులందు బాహ్యాంతరముల పూర్ణమైయున్నది. గాన శ్రుతిభగవతి ఆ పరబ్రహ్మమును "పురుష' నామముచేతను కథనము చేయుచున్నది. స్థూలశరీర రహితమగుటవలన శ్రుతిభగవతి యద్దానిని "అజ" నామముచే కథనము చేయుచున్నది. సూక్ష్మశరీర రహితమగుటవలన "అప్రాణ అమనాః" అను నామముచే వచించుచున్నది. మాయారూపకారణ శరీర రహితమగుటవలన "శుభ్ర" నామముచే కథనము చేయుచున్నది. ఆకాశాది జగద్రూపకార్యాపేక్షచే చిరకాలముండుటవలన ఆ మాయ అక్షరంబనబడియె. మఱియు జగద్రూపకార్యాపేక్షచే ఆ కారణరూప మాయ "పర" మనబడియె. ఇటువంటి పరరూపాక్షరమైన మాయకన్నను ఆ పర బ్రహ్మము పరమగుటవలన శ్రుతిభగవతి ఆ పరబ్రహ్మమును "అక్షరాత్పరతః పరః" యను నామముచే కథనము చేయుచున్నది. ఇవ్విధమున పరమాత్మదేవుని స్వరూపము వచింపబడినది.

ఇపుడు అద్వితీయతాసిద్ధికొఱకుగాను ఆ పరమాత్మదేవునినుండి జగదుత్పత్తి ఎట్లాయెనో వచింపబడుచున్నది. — హే శౌనక ! ఆ మాయోపహితపరమాత్మదేవుని నుండి ప్రాణము, మనస్సు, పంచజ్ఞానేంద్రియములు, పంచకర్మేంద్రియములు, పంచభూతములు అను నీ సూక్ష్మములైన సప్తదశతత్త్వములు పుట్టుచున్నవి. ఇదే హిరణ్యగర్భోత్పత్తి. ఇపుడు విరాడుత్పత్తి వచింపబడుచున్నది. స్వర్గలోకము శిరస్సుగాను, సూర్యచంద్రులు నేత్రములుగాను, దశదిశలు శ్రోత్రములుగాను, ఋగాది నాల్గువేదములు వాగింద్రియముగాను, సంపూర్ణవాయువు ప్రాణముగాను, సంపూర్ణ జగత్తు హృదయముగాను, పృథ్విపాదరూపముగాను, ఈ ప్రకారము శరీరముగల సకలవ్యష్టిభూతముల ఆత్మరూపమగు యే పరమేశ్వరుని స్వరూపముగలదో, ఆ స్వరూపమును వేదవేత్తలు "విరాట్" నామముచే కథనము చేయుచున్నారు. ఇపుడా విరాడ్భగవంతునినుండి లోకవృద్ధిని చేయునట్టిదైన పంచాగ్నియొక్క యుత్పత్తిని గూర్చి వినుము. హే శౌనక ! ఈ విరాట్స్వరూపమునుండి ఈ లోకప్రసిద్ధమగు అగ్నియు అధిదైవరూప స్వర్గరూపాగ్నియు ఉత్పన్నమయ్యెను. ఆ యగ్ని ఆహవనీయ, గార్హపత్యాది రూపములచేతను స్వర్గాదిఫలరూపముచేతను అగ్నిహోత్రాది సకలకర్మములకు కారణమగుచున్నది మఱియు ఆ యగ్ని సంబంధమగు ఆదిత్యరూపసమిధ మొదలుకొని జ్వాలాధూమ విస్ఫులింగ అంగారాది సర్వపదార్థములు పుట్టుచున్నవి. (ఆ పంచాగ్నులగూర్చియు తత్సంబంధములగు పదార్థములగూర్చియు షష్ఠాధ్యాయమందు తెలుపబడెను)

ఆ స్వర్గరూపాగ్న్యనంతరము చంద్రుడను పేరుగల సోముడుపుట్టెను. ఆసోముడు సూర్యభగవంతునినుండి ఉత్పన్నమాయెను. మఱియు కళారూపముచే పరిణామమును పొందిన అగ్నిహోత్రసంబంధమగు ఆహుతులచే వానిశరీరము వృద్ధియయ్యెను. ఈ కారణమువలన నా సోమరూపచంద్రుడు అగ్నిహోత్రాది కర్మలజేయు పురుషులకు ప్రాప్తమగుచున్నాడు. ద్రవభావమును పొందిన నా సోమునినుండి పర్జన్యుడను ద్వితీయాగ్నియు, ఆ మేఘరూపపర్జన్యవృష్టిద్వారా పృథ్వీరూప తృతీయాగ్నియు, దానినుండి వ్రీహియవాదిసకలౌషధులున్ను పుట్టుచున్నవి. మఱియు పురుషరూపచతుర్థాగ్నిని పొందిన ఆవ్రీహియవాది ఓషధులవలన పురుషునియందు వీర్యరూపరేతము పుట్టుచున్నది. ఆ వీర్యరూపరేతము యోషిద్రూపపంచమాగ్నిని పొంది గర్భరూపముచే ప్రాదుర్భావమగుచున్నది. దానిచే పుత్రాదిఅనేకప్రజ పుట్టుచున్నది. ఆ పుత్రాదిప్రజచే లౌకిక వైదిక సర్వవ్యవహార సిద్ధియగుచున్నది.

హే శౌనక ! ఏ పరమాత్మదేవునినుండి పూర్వోక్తమగు విరాట్ పుట్టెనో, ఆ పరమాత్మదేవునినుండియే శ్వాసప్రశ్వాసములవలె ఋగాది వేదములున్ను పుట్టెను. ఈ కారణమువలననే వేదవేత్తలచే వేదములు 'అపరబ్రహ్మ'మని చెప్పబడియె. మఱియు ఆ పరమాత్మదేవుని నుండియే దర్శపౌర్ణమాస్యాది యజ్ఞములున్ను, జ్యోతిష్టోమాది క్రతువులున్ను, వసంతాది ఋతువులున్ను, గోసువర్ణాది ధనములున్ను పుట్టుచున్నవి. మఱియు కర్మకర్తలగు పురుషులకై నానాప్రకార నియమరూప దీక్షయున్ను పుట్టుచున్నది అట్లే స్వర్గాదుల కామనగల యజమానుడున్ను, లతారూపరససోమద్రవ్యమున్ను, స్వర్గలోకసంబంధ శరీరారంభకసోమరూపఫలమున్ను పుట్టుచున్నవి. స్వర్గాదిలోకసహిత సూర్యభగవంతుడున్ను పుట్టుచున్నాడు. ఈ మొదలగు స్థూల సూక్ష్మ సమస్తపదార్థములు ఆ పరమాత్మదేవునినుండియే పుట్టుచున్నవి.

హే శౌనక ! ఆ పరమాత్మదేవునినుండియే వస్వాదిదేవతలు, సాధ్యాదిదేవతలు, మనుష్యపశ్వాది సకలప్రాణులు, ప్రాణాపానాది వాయువులు, వ్రీహియవాది అన్నములు, కృచ్ఛ్రచాంద్రాయణాది తపములు, ఆస్తికతారూప శ్రద్ధాదులు, అవశ్యకర్తవ్య కర్మములకు ఫలరూపసత్యమున్ను పుట్టుచున్నవి. యథార్థభాషణరూప సత్యమున్ను పుట్టుచున్నది. మఱియు ఉపస్థేంద్రియ సంయమరూప బ్రహ్మచర్యమును, వేదవిహిత కర్మరూపవిధియు పుట్టుచున్నవి. ఆ పరమాత్మదేవునినుండియే సప్తప్రాణ, సప్తార్చిష, సప్తసమిధ, సప్తహోమ, సప్తలోకములను నీసమస్తము పుట్టుచున్నది మస్తకమువ స్థితములగు రెండుశ్రోత్రములు, రెండు చక్షువులు, రెండు ఘ్రాణములు, ఒకవాక్కు, ఈ సప్తేంద్రియములకు సప్తప్రాణములని పేరు. ఆ సప్తప్రాణముల

వలన పుట్టినవైన సప్తప్రకార వృత్తులకు పేరుసప్తార్చిషము. మఱియు ఆ సప్తప్రాణముల విషయములకు నామము సప్తసమిధలు. మఱియు ఆ విషయములను ప్రాణమందు లయము చేయుటయను చింతనరూపోపాసనకు నామము సప్తహోమము. ఆ ప్రాణముల నివాసమునకు స్థానమైన గోళకములకు నామము సప్తలోకములు) ఇటసమస్త సప్తసప్త పదార్థములు ఆ పరమాత్మ దేవునినుండియే పుట్టుచున్నవి. ఆ పరమాత్మ దేవునినుండియే సప్తసముద్రములును హిమాచలాది పర్వతములును. గంగాదినదులును వృక్షాదిస్థావర శరీరములును మనుష్యపశ్వాది జంగమశరీరములును త్రికాలమందుండు జగత్తులన్నియును పుట్టుచున్నవి. ఇంత విస్తారముగ వచించిన దానిచే పరమాత్మదేవునినుండి జగదుత్పత్తిరూపాధ్యాసమెట్లాయెనో వర్ణింపబడినది.

ఇపుడు అపవాదము గావింపబడి పరమాత్మదేవునియందు అద్వితీయ శుద్ధరూపత వర్ణింపబడును. — హే శౌనక ! పరమాత్మదేవునినుండి జనించినవైన ఈ సంపూర్ణజగత్తు పరమాత్మదేవునికన్న భిన్నముకాదు పరమాత్మరూపమే యగును. ఈ జగత్తు తప, కర్మ, వేదమని త్రివిధముగా నున్నది. (ఇట ఉపాసనయొక్క ఫలమునకు నామము తపము, యజ్ఞయాగాదికర్మఫలమునకు నామము కర్మము. మఱియు రెంటిని ప్రకాశింపజేయు అపౌరుషేయవచనమునకు నామము వేదము) ఈ మూడున్ను పరబ్రహ్మముకంటె కించిన్మాత్రమైన భిన్నముగాకుండుటవలన ఆ పరమాత్మదేవుడు ఒకడుగాను, అద్వితీయస్వరూపుడుగానున్నాడు. ఇటువంటి పరమాత్మదేవుని ఏ యధికారిపురుషులు తన ఆత్మగా నెఱుగుచున్నారో, వారు "నేను అజ్ఞానిని" యను నీయవిద్యాగ్రంధిచే రహితులగుదురు కావున అధికారిపురుషులు పరమాత్మదేవుని అవశ్యముగ నెఱుగవలసినది. ఉక్తరీతిగా అక్షరబ్రహ్మబోధనందలేని అధికారిజనులగు కొందఱికి ఇంకొకతీరున అక్షరబ్రహ్మోపదేశము గావింపబడుచున్నది.

హే శౌనక ! ఏ అక్షరబ్రహ్మము స్వప్రకాశతారూపముచే సర్వదా ఆవిర్భూతముగనున్నదో, బుద్ధిరూపగుహయందు స్థితమగుటవలన అత్యంతసమీపమై యున్నదో. మఱియు ఏ అక్షరబ్రహ్మము సర్వోత్కృష్టమైయున్నదో, ఆ యక్షరబ్రహ్మము అధికారియొక్క శరీరమందే గలదు. బయటనుండి వచ్చెడిదికాదు ఎట్లు రధచక్రమందు స్థితములైన యరలకు నాభి అధిష్ఠానమైయున్నదో అట్లే ప్రాణేంద్రియములకు అక్షరబ్రహ్మము అధిష్ఠానమైయున్నది. ఆ యక్షరబ్రహ్మము తన సమీపతామాత్రముచే ప్రాణేంద్రియసర్వవ్యాపారములకు కారణమైయున్నది. సనాతనమును బుద్ధ్యాద్యుపాధులకంటె పరమును నైయున్నది. ఆ యక్షరబ్రహ్మము

వివేకులచే ప్రార్థింపబడుటకు యోగ్యమై, సర్వదేహధారిజీవులకు అత్యంత ప్రియమై దుర్లక్ష్యపదార్థములకన్నను అత్యంతదుర్లక్ష్యమై యున్నది. మఱియు నా యక్షర బ్రహ్మమందు ఇంద్రాదిలోకపాలకుల సహితసకలలోకములున్ను స్థితములైయున్నవి. హే శౌనక! నీవు పూర్వమడిగిన ప్రకారముగ ఏ యొకవస్తువుయొక్క జ్ఞానముచే సర్వజగత్తుయొక్క జ్ఞానమగునో ఆ వస్తువు యొక అక్షరబ్రహ్మమేయగును ఆ అక్షర బ్రహ్మమును వేదవేత్తలు ప్రాణరూపముచేతను ఇంద్రియరూపముచేతను కథనము చేయుచున్నారు. ఆయక్షరబ్రహ్మమునే స్వర్గరూపముచేతను మోక్షరూపముచేతను కూడా కథనము చేయుచున్నారు.

ఇపుడు ఆత్మజ్ఞానప్రాప్తికొఱకు ధ్యానరూపోపాయము వచింపబడుచున్నది. ఎట్లు ఎవరైన శూరపురుషుడు తన ధనుర్బాణమునుసంధించి ఏదో ఒక లక్ష్యవస్తువును వేధనచేయుచున్నాడో, అట్లే ధైర్యయుక్తులై కామక్రోధాది శత్రువులకు భయము చూపువారైనట్టి అధికారిపురుషులచే పూర్వోక్తాక్షరపరబ్రహ్మము లక్ష్యరూపముగ వేధనచేయబడవలసినది. హే శౌనక! మహావాక్యరూప వేదాంతము దేనికి యుదర మందుగలదో, అటువంటి ప్రణవమంత్రము ధనుస్స్వరూపమైయున్నది. ధ్యానకర్త యొక్క కూటస్థాత్మ బాణరూపమైయున్నది. మఱియు 'నేను బ్రహ్మరూపుడన'ను నీ ప్రకారముగల మహావాక్యచింతనము ఆ ప్రణవరూప ధనుస్సుయొక్క ఆకర్షణమై యున్నది. శుద్ధబ్రహ్మము లక్ష్యరూపమైయున్నది. ఆ శుద్ధబ్రహ్మరూపలక్ష్యమును పొందిన ఏ కూటస్థాత్మరూప బాణముగలదో, ఆ బాణము లక్ష్యస్వరూపమే యగు చున్నది. హే శౌనక! ఏ అక్షరబ్రహ్మమందు భూరాదిసప్తలోకములును, ఆకాశాది పంచభూతములును, మనఃప్రాణేంద్రియములును, ఋగాదివేదములును, స్థితములై యున్నవో అటువంటి సకలజగదధిష్ఠానరూపఅక్షరబ్రహ్మమే అధికారిపురుషులెఱుగు టకు యోగ్యమైయున్నది. ఆ యధిష్ఠానబ్రహ్మముకన్న భిన్నమైన యనాత్మపదార్థము లెఱుగుటకు యోగ్యములుకావు. అవి పరిత్యాగయోగ్యములే యగును. అట్లు ఆ అనాత్మపదార్థ ప్రతిపాదకవచనములున్ను పరిత్యాగయోగ్యము లగును. ఆ వచనములు వాక్, తాలు, కంఠాములకు శ్రమకారకములేగాని ఇంకొకఫలమును చేకూర్చలేవు. అధికారిపురుషులు వేదాంతవచనములదప్ప ఇతరవచనములు ఉచ్చారణ చేయకూడదు. వినకూడదు, ఆ వచనములకు ధర్మార్థకామదుఃఖములను నీ నాలుగే ఫలములై యున్నవి. ధర్మార్థకామములు విచారహీనులకు సుఖరూపముగ ప్రతీతమగుచున్నను అవి తమ వియోగకాలమందు జీవులకు అవశ్యముగ దుఃఖప్రాప్తిని చేయుచున్నవి. ఈ కారణమువలన విద్వత్పురుషులచే ఆ వచనములు ఉచ్చరింపబడకూడదు. అంత మాత్రమే కాదు. ఇతరపురుషుడు తదుచ్చారణచేసినపుడు వానిని తదుచ్చారణమునుండి

నివారణము చేయవలయును. ఇదే శ్రేష్ఠపురుషుని ఆచారము శ్రుతిభగవతికూడ అర్థానిని నిషేధము చేయుచున్నది.

"తమేవైకం జానథ ఆత్మానమన్యా వాచో విముంచథ"

భావార్థము:— ఓ యధికారీ! వేదాంతవచనములచే నొక అద్వితీయాత్మనే యెఱుగుము! ఆ వేదాంతవచనములకన్న భిన్నములైన అనాత్మవస్తుప్రతిపాదకము లగు ఇతరవచనములను పరిత్యాగము చేయుము. అన్యశాస్త్రములందును ఇట్లు వచింపబడినది

"కాకస్య కతివా దంతా మేషస్యాండం కియత్పలమ్,
గర్దభే కతి రోమాణీత్యేషా మూర్ఖవిచారణా"

భావార్థము — ఈ కాకికి ఎన్నిదంతములు గలవు? ఈ మేకయొక్క వృషణము యెన్ని పలముల బరువుగలదగును? ఈ గాడిదయొక్క శరీరముపై యెన్ని రోమములుగలవు? ఈ ప్రకారమగు విచారము మూర్ఖులే చేయుదురు హే శౌనక! ధర్మార్థకామములు ద్వివిధములు — ఒకటి శాస్త్రానుసారము. మఱియొకటి శాస్త్ర విరుద్ధము. అట శాస్త్రానుసారములైన ధర్మార్థకామములు తమయొక్క అప్రాప్తి కాలమందు ఇచ్ఛయొక్క యుత్పత్తిద్వారా జీవులకు దుఃఖప్రాప్తి చేయుచున్నవి.

మఱియు, తనప్రాప్తి కాలమున రక్షణగూర్చిన చింతద్వారా దుఃఖప్రాప్తిని చేయుచున్నవి. తమనాశకాలమందు వియోగజన్యదుఃఖప్రాప్తిని చేయుచున్నవి. ఈ ప్రకారముగ శాస్త్రానుసారమైన అర్థకామములు జీవునకు త్రికాలమందును దుఃఖ ప్రాప్తిని చేయుచున్నవి. అట్టిచో శాస్త్రవిరుద్ధములైన అర్థకామములు దుఃఖకారణము లని వేఱు చెప్పవలయునా? కనుక ఆ అర్థకామప్రతిపాదకవచనములను జీవులకు దుఃఖకారణములే యైయున్నవి. కాని ఈ విశేషతమాత్రముగలదు. — శాస్త్రవిహితార్థ కామములో నిందద్వారా దుఃఖ ప్రాప్తిని కలుగజేయవు. పరలోకమందు నరకప్రాప్తిన్ని కలుగజేయవు శాస్త్రనిషిద్ధార్థకామములు జీవులకు ఈ లోకమందు నిందను, పరలోక మందు నరకవాసమును గలుగజేయించుచున్నవి. తత్ప్రతిపాదకవచనములున్ను అట్లే దుఃఖకారణములై యున్నవి. ఇటువంటి దుఃఖకారకవచనముల నేబుద్ధిమంతుడు ఉచ్చారణము చేయును? యెవడును చేయడు.

హే శౌనక! ఇటువంటి అనాత్మప్రతిపాదక వచనోచ్చారణము నధికారిపురుషు లెప్పటికిని చేయకూడదు. మోక్షరూపామృతప్రాప్తిని కలుగజేయు వేదాంత వచనములనే, వారు సర్వదా అభ్యానము చేయవలయును. ఈ విషయము అన్యశాస్త్రముల యందును చెప్పబడినది.

"అసుప్తేరామృతేఃకాలం నయేద్వేదాన్తచిన్తయా,
దద్యాన్నావసరం కించిత్కామాదీనాం మనాగపి"

భావార్థము:— అధికారిపురుషులు ప్రాతఃకాలమునుండి నిద్రించు కాలము వఱకు మఱియు విద్యాప్రాప్తి కాలమునుండి మరణకాలపర్యంతముగ వేదాంతశాస్త్ర చింతనముచేతనే కాలము గడుపవలయును. కామాదివికారములకు కించిత్కాల మందును చిత్తమందు సావకాశము కలుగజేయకూడదు. హే శౌనక! ఎట్లు సేతు రూపమార్గముచే నదియొక్క ఆవలితటము ప్రాప్తించుచున్నదో అట్లు ఆత్మజ్ఞానరూప సేతువుచేతనే సంసారసముద్రముయొక్క మోక్షరూపమగు ఆవలితటము సంప్రా ప్తించుచున్నది. ఈలాగున ఈ ఆనందస్వరూపాత్మ మోక్షరూపామృతప్రాప్తియందు సేతువువలెనున్నాడు. ఆ యాత్మస్వరూపానందమును గ్రహించియే విద్వాంసులు భయరహితులగుదురు.

శ్రుతి॥ "ఆనందం బ్రహ్మణో విద్వాన్న బిభేతి కుతశ్చనేతి"

భావార్థము — అధికారి పురుషులు అద్వితీయ బ్రహ్మానందమెఱిగి దేనిచేతను భయమును పొందరు.

హే శౌనక! ఈ ఆనందస్వరూపాత్మ సర్వప్రాణుల హృదయాకాశమందు విరాజమానుడై యున్నాడు ఈ కారణమువలన శ్రుతిభగవతి ఆ యాత్మదేవుని దహరాకాశ నామముచే కథనము చేయుచున్నది. ఈ ప్రకారమగు ఆత్మదేవుని ఉప దేశముచేతను ఏ యధికారిపురుషులేదోయొక పాపకర్మ ప్రతిబంధవశమున 'నేను పరబ్రహ్మరూపుడన'ని ఈ ప్రకారముగ ఆ యాత్మనెఱుగుటకు సమర్థులుకారో, ఆ యధికారిపురుషులు ప్రణవమంత్రమును చింతనము చేయవలయును. ఆ ధ్యానరూప దీపముయొక్క బలముచే నా యధికారిపురుషులు ప్రతిబంధకమైన పాపరూపాంధ కారమునుండి విముక్తులై బ్రహ్మజ్ఞానమునుపొంది అవిద్యారూపసముద్రమునుదాటి మోక్షరూపమగు ఆవలి తటమునుచేర గల్గుదురు. హే శౌనక! ఆత్మయొక్క ధ్యాన ముచే నెట్లు ప్రతిబంధకమైన పాపము నివృత్తమగుచున్నదో అట్లు బ్రహ్మవేత్తయగు గురువుయొక్క ఆశీర్వాదముచేతను పాపము నివృత్తమగుచున్నది. ఈ కారణము వలన మహాత్ముడైన దయాళువగు గురువు తమ శిష్యులను హే శిష్యులారా! మీకు ఆత్మజ్ఞానప్రాప్తివిషయమునందు సర్వవిఘ్నములు నివృత్తియగుగాక! యని ఈ ప్రకారముగ ఆశీర్వదించి మఱల మఱల ఆత్మోపదేశము చేయవలసినది. కావున అధికారిపురుషులు బ్రహ్మవేత్తయగు గురువుయొక్క ప్రసన్నతను అవశ్యముగా సంపాదన చేయవలయును. ఇపుడా పరమాత్మదేవుని స్వరూపవర్ణనము గావింపబడు చున్నది. హే శౌనక! ఏ పరమాత్మదేవుడు సర్వజగత్తును సామాన్యరూపముగాను,

విశేషరూపముగాను యెఱుగుచున్నారో, ఆ పరమాత్మదేవుని జగదుత్పత్తిస్థితిలయరూప విభూతి సర్వలోకప్రసిద్ధమైయున్నది. ఆ పరమాత్మదేవుడు ఈ శరీరరూపపురమందు స్థితమగు దివ్యవ్యోమమందు స్థితుడైయున్నాడు. ఈ కారణమువలన శ్రుతిభగవతి ఈ శరీరమును 'బ్రహ్మపుర' నామముచే కథనము చేయుచున్నది ఇటువంటి తన స్వరూపమందు స్థితుడైన పరమాత్మనుగూర్చి శ్రుతిభగవతి ఇట్లు వచించినది

"స భూమా కుత్ర ప్రతిష్ఠితః స్వేమహిమ్ని"

అనగా ఈ భూమ దేనియందు స్థితమైనది అను నీ జిజ్ఞాసాప్రశ్నకు తన స్వరూపభూతమహిమయందు స్థితమైనదని శ్రుతిచే నుత్తరము చెప్పబడియె.

ఇపుడు అజ్ఞాతాత్మయొక్కయు, జ్ఞాతాత్మయొక్కయు, స్వరూపవర్ణనము గావింపబడుచున్నది. ఏ కాలమందు ఈ ఆనందరూపాత్మదేవుడు అజ్ఞాతముగనుండునో ఆ కాలమందు ఈ ఆత్మదేవుడు మనస్సుయొక్క తాదాత్మ్యాధ్యాసముచే మనోమయ సంజ్ఞనుపొంది ప్రాణేంద్రియములను తమ తమ వ్యాపారమందు ప్రవృత్తముగ జేయుచుండును. మఱియు యెంతవఱకు బ్రహ్మజ్ఞానము ప్రాప్తముకాలేదో, అంతవఱకు ఆ మనోమయాత్మ సకల జగత్తునకు బీజరూపమైన మూలాజ్ఞానమందు తాదాత్మ్యాధ్యాసమున స్థితుడగుచుండును. మఱియు నే కాలమందు బ్రహ్మచర్యాదిసాధనసంపన్నజనులు ఆత్మదేవుని వాస్తవరూపముచే నెఱుగుచున్నారో, ఆ కాలమందు ఆ యధికారిజనులు ఆత్మదేవుని పరమానందస్వరూపమును గాంచుచున్నారు. జన్మమరణాది సకల సంసార ధర్మములచే రహితులగుచున్నారు. మఱియు జ్ఞాతృజ్ఞానజ్ఞేయాది - త్రిపుటి రహితులగుచున్నారు.

ఇంకను ఆత్మజ్ఞానమునకు ఫలము వచింపబడుచున్నది. —

శ్రుతి॥ భిద్యతే హృదయగ్రంథిశ్ఛిద్యన్తే సర్వసంశయాః,
క్షీయన్తే చాస్యకర్మాణి తస్మిన్ దృష్టే పరావరే"

భావార్థము — కామక్రోధాదులకు కారణమైన ఆత్మానాత్మాధ్యాసమునకు నామము హృదయగ్రంథి. త్వంపదార్థ తత్పదార్థములందు అల్పజ్ఞతా సర్వజ్ఞతాది ధర్మములనుజూచి ఈ జీవుడు బ్రహ్మరూపుడా? భిన్నుడా? ఇత్యాద్యసంభావన నొందుటకు నామము సంశయము. ఏ పుణ్యపాపకర్మములచే ఈ శరీరము ప్రారంభించబడినదో ఆ ప్రారబ్ధకర్మమునువిడిచిన తక్కిన సంచితక్రియమాణకర్మములకు నామము కర్మము. ఈ సర్వకర్మలును హృదయగ్రంథియు సర్వసంశయములును సర్వాత్మ రూపముగ బ్రహ్మసాక్షాత్కారమైనపుడే నివృత్తమగుచున్నవి. కార్యసహితా విద్యయున్ను నివృత్తమగుచున్నది.

హే శౌనక! ఏ ఆత్మదేవుని సాక్షాత్కారముచే కార్యసహితావిద్య నివృత్తమగుచున్నదో, ఆ యాత్మదేవుడు అన్నమయాది పంచకోశములందు పుచ్ఛప్రతిష్ఠాభూత బ్రహ్మరూపముగ స్థితుడైయున్నాడు. మఱియు ఆ యాత్మదేవుడు ఆవరణము చేయునట్టి మాయారూపరజముచే రహితుడుగానున్నాడు. ఈ కారణమువలన శ్రుతి భగవతి ఆ యాత్మదేవుని "విరజా" నామముచే కథనము చేయుచున్నది. మఱియు ఆ యాత్మదేవుడు మాయారూపకళారహితుడుగా నున్నాడు. ఈ కారణమువలన శ్రుతి భగవతి ఆ యాత్మదేవుని "నిష్కళ" నామముచే కథనము చేయుచున్నది. ఇంకను ఆతడు స్వప్రకాశరూపుడుగాను, లోకప్రసిద్ధ సూర్యచంద్రాది జ్యోతులకును ప్రకాశకుడుగా నున్నాడు ఈ కారణమువలన శ్రుతిభగవతి యాతనిని "జ్యోతిషాంజ్యోతిః" అను నామముచే కథనము చేయుచున్నది. మఱియు నా యాత్మదేవుడు అద్వితీయతా రూపముచే పరమానందస్వరూపుడై యున్నాడు. ఈ కారణమువలన శ్రుతిభగవతి ఆ యాత్మదేవుని "శుభ్ర" నామముచే కథనము చేయుచున్నది.

ఇపుడు ఆ యాత్మదేవునియందు స్వప్రకాశతా వర్ణనము గావింపబడుచున్నది. లోకప్రసిద్ధమైన సూర్యచంద్రతారావిద్యుల్లతాగ్నులు, బాహ్యతేజఃపదార్థములు, మనో బుద్ధ్యాదులు, అంతరతేజః పదార్థములు, వీటిచే ఈ ఆత్మతత్త్వము ప్రకాశింపబడదు. ఆ యాత్మతత్త్వము ననుసరించియే ఈ జడచేతన సకలజగత్తు ప్రకాశమానమగుచున్నది. ఆ యాత్మతత్త్వమును విద్వత్పురుషులు స్వప్రకాశమనుచున్నారు

శౌనకుడు — హే భగవన్! ఎట్లు లోకమందు "తాతం గచ్ఛన్త మనుగచ్ఛతి పుత్రః" అనగా గమనము చేయువాడైన పితను అనుసరించియే వెనుక పుత్రుడు గమనము చేయుచున్నాడు. అను నీ వాక్యముచే పితయొక్క గమనరూప క్రియకన్న పుత్రునిగమనరూపక్రియ యెట్లు భిన్నముగా ప్రతీతమగుచున్నదో, అట్లే "తమేవ భాంత మనుభాతి సర్వం" అను శ్రుతివచనముచేతను ఆ యాత్మప్రకాశము కన్న జగత్ప్రకాశము భిన్నముగానే సిద్ధించుచున్నది కదా?

అంగిరసుడు — హే శౌనక! నీవు చెప్పిన విషయము శ్రుతియొక్క తాత్పర్యముకాదు. శ్రుతితాత్పర్యమేమనగా — ఎట్లు తప్తమైన లోహము అగ్నిచే ప్రకాశితమైనను, ఆ లోహము అగ్నిలేకున్న ప్రకాశమానముకాదో, అట్లే పరమాత్మదేవుని ప్రకాశముచే ఈ జగత్తు ప్రకాశమానమైనను ఆ యాత్మదేవుని ప్రకాశములేక ఈ జగత్తు స్వయముగా ప్రకాశమానముకాదు. ఈ ప్రకారముగ తన ప్రకాశముచే సర్వజగత్తును ప్రకాశమానము చేయువాడైన ఏ ఆనందస్వరూపాత్మదేవుడు గలడో ఆ యాత్మదేవుని విద్వత్పురుషులు స్వప్రకాశనామముచే కథనము చేయుచున్నారు.

ఇపుడాత్మదేవుని సర్వాత్మతావర్ణనము గావింపబడుచున్నది. — హే శౌనక ! ఏ స్వప్రకాశజ్యోతియగు బ్రహ్మము పూర్వాదిసకల దిశలందు వ్యాపకమగుటవలన పూర్వాదిదిశాసహిత సర్వవిశ్వరూపమై యున్నదో, ఏ పరబ్రహ్మము త్రికాల స్వరూపమైయున్నదో, మఱియు ఏ పరబ్రహ్మము స్థూలసూక్ష్మకారణాత్మక సకల జగద్రూపమై యలరుచున్నదో, ఆ పరబ్రహ్మముకన్న భిన్నమగుకించిన్మాత్రవస్తువున్ను లేదు

ఇపుడు త్వంపదార్థనిరూపణము గావింపబడుచున్నది హే శౌనక ! ఎపుడధికారిపురుషుడు శ్రుతివచనముచే మహావాక్యరూపబ్రహ్మాత్మను యెఱుగడో, అపుడా యధికారియగు శిష్యునిగూర్చి బ్రహ్మవేత్తయగు గురువు ఈ ప్రకారముగ త్వంపదార్థమును కథనము చేయును. (ఇట ఒకవృక్షముపైనున్న రెండు పక్షులయొక్క దృష్టాంతము చెప్పబడియున్నది ఆ సంగతి పూర్వము అనేక చోట్ల చెప్పబడియె. కాన ఇట వివరింపబడలేదు.) హే శౌనక ! ఎట్లు తత్పదార్థరూప పరమాత్మదేవునియందు కర్తృత్వభోక్తృత్వాది ధర్మములులేవో అట్లే త్వంపదార్థ జీవునియందును వాస్తవముగ కర్తృత్వభోక్తృత్వాదిధర్మములు లేవు. అంతఃకరణోపాధిసంబంధముచేతనే యవి జీవునియందు ప్రతీతమగుచున్నవి ఏ కాలమందు త్వంపదార్థరూప జీవాత్మ, తత్పదార్థరూప ఈశ్వరుని తన ఆత్మరూపముగా చూచుచున్నాడో, ఆ కాలమందే ఈ జీవాత్మ పరమాత్మదేవుని యద్వితీయరూపమహిమను పొందుచున్నాడు, ఆ యానందస్వరూప పరమాత్మదేవుడు జీవుల పరమప్రేమకు విషయమై యున్నాడు. ఇటువంటి పరమాత్మదేవుని మహిమను పొందినవారైన ఈ జీవుడు సకలదుఃఖరహితుడగుచున్నాడు. మఱియు నామరూపరహితుడై విద్వద్భావమును పొందుచున్నాడు. 'అతివాది' సంజ్ఞను పొందుచున్నాడు.

హే శౌనక ! ఎట్లు బాలుడు నానాప్రకార క్రీడలచేయునో, అట్లే ఈ విద్వాంసుడున్ను అద్వితీయాత్మయందు సర్వదా క్రీడించుచు రమించుచున్నాడు. మఱియు యెట్లు యాజ్ఞికుడు నానా ప్రకారక్రియలు చేయుచున్నాడో, అట్లే ఈ విద్వాంసుడున్ను అద్వితీయాత్మయందు నానా ప్రకారక్రియలు చేయుచున్నాడు. ఈ ప్రకారముగ విద్వాంసుడు సర్వదా ఆత్మయొక్క చింతనమే చేయుచుండును. ఈ కారణమువలన వేదవేత్తలు విద్వాంసుని "అతివాది" నామముచే కథనము చేయుచున్నారు. ఈ అతివాదియగు విద్వాంసుడు సకలబ్రహ్మవేత్తలయందును శ్రేష్ఠుడుగా నున్నాడు

ఇపుడు ఏ బ్రహ్మవిద్యచే అతివాదిలక్షణము ప్రాప్తమగుచున్నదో ఆ బ్రహ్మవిద్యయొక్క సాధనములు వచింపబడుచున్నవి. హే శౌనక ! సత్య, తప, బ్రహ్మచర్యములను, నీ సాధనాత్రయ సహితమగు పూర్వోక్తతత్త్వంపదార్థశోధనారూపజ్ఞానము

చేతనే అధికారిపురుషులకు ఆత్మదేవుడు ప్రాప్తించుచున్నాడు. ఆ యాత్మదేవుని కామక్రోధాదిసహితులైన సన్న్యాసులు సర్వదా తమచిత్తములందు గాంచుచున్నారు తాత్పర్యము — ఎట్లు సత్యాదిసాధనాసహిత తత్త్వంపదార్థశోధనము ఆత్మజ్ఞానమునకు కారణమో, అట్లు సన్న్యాసమున్ను ఆత్మజ్ఞానమునకు కారణమగును. (ఇట మిథ్యా వచనపరిత్యాగమునకు నామము సత్యము. మనస్సహితముగ ఇంద్రియముల యేకాగ్రతకు నామము తపము. ఉపస్థేంద్రియ సంయమమునకు నామము బ్రహ్మచర్యము.) హే శౌనక! ఎట్లు సత్యము బ్రహ్మచర్యమునకు కారణమగుటవలన ఉత్కృష్టమో అట్లు భూలోకమందును, స్వర్గలోకమందును, బ్రహ్మలోకమందును, సుఖకారణ మగుటవలన సత్యమున్ను యుత్కృష్టముగా నున్నది

ఇపుడు ఆత్మయొక్క దుర్విజ్ఞేయతా నిరూపణము గావింపబడుచున్నది. హే శౌనక! ఏ సత్యబ్రహ్మము అధికారిపురుషులకు మహావాక్యజన్యజ్ఞానముచే ప్రాప్తమగుచున్నదో, ఆ సత్యబ్రహ్మము ఆకాశాది మహాపదార్థములకును ఆధారరూపమైయున్నది. ఈలాగున ఆ సత్యబ్రహ్మము మహత్తుకన్నను మహత్తుగా నున్నది. మఱియు ఆ పరబ్రహ్మము పరమాణ్వాది సూక్ష్మపదార్థములకును అంతర్వ్యాపకమై యున్నది. ఈలాగున నది సూక్ష్మపదార్థములకన్నను అత్యంతసూక్ష్మమై యున్నది. ఆ పరబ్రహ్మము స్వప్రకాశరూపముచే సర్వలోకములకన్న విలక్షణమై యున్నది. ఈ కారణమువలన నా పరబ్రహ్మము దివ్యరూపమై యున్నది మఱియు మనస్సుచే చింతింపనలవిగానందున అది అచింత్యరూపమున్ను నైయున్నది. ఆ పరబ్రహ్మము బహిర్ముఖజనులకు దుర్విజ్ఞేయముగాన దూరపదార్థములకన్నను అత్యంతదూరమై యున్నది. సాధనసంపన్నుల కత్యంత సులభముగాన సమీపవస్తువులకన్నను అత్యంత సమీపమైయున్నది. మఱియు నా పరబ్రహ్మము సర్వజీవుల బుద్ధిరూపగుహయందు స్థితమై యున్నది. సర్వపదార్థములకును ప్రకాశకమైయున్నది. ఇటువంటి పరబ్రహ్మము మహావాక్యజన్య జ్ఞానముచేతనే అధికారిపురుషులకు తమ యాత్మరూపముగ ప్రాప్తమగుచున్నది. ఇతరోపాయములచే ప్రాప్తముకాదు.

హే శౌనక! ఇటువంటి పరమాత్మదేవుడు దేహధారులగు జీవులకు అత్యంత దుర్లభమైయున్నను, వానిప్రాప్తినిగూర్చిన యుపాయము శాస్త్రవేత్తలచే కథనము చేయబడియె. ఆ యుపాయమేమనగా — రాగద్వేషాది దోషరహితులై శాస్త్ర సంస్కార యుక్తులై శ్రవణాదిసాధనసంపన్నులైన యధికారిపురుషులు ఆ యానందస్వరూపాత్మను సాక్షాత్కరించుకొందురు.

శ్రుతి॥ "ఏషోఽణురాత్మా చేతసా వేదితవ్యః"

భావార్థము — ఈ దుర్విజ్ఞేయాత్మ శుద్ధచిత్తముచే యెఱుగ గలుగుటకు యోగ్యమైయున్నాడు. హే శౌనక ! ఏ శుద్ధచిత్తముగల పురుషుడు తన ఆత్మను బ్రహ్మరూపముగ సాక్షాత్కరించుకొనుచున్నాడో ఆ విద్వత్పురుషుడు బ్రహ్మరూపుడే యగుచున్నాడు. కాబట్టి ఆ బ్రహ్మరూపవిద్వత్పురుషుడు సకల జగదుత్పత్తి లయముల చేయుటకు సమర్థుడై యున్నాడు. ఆతడే సర్వజీవులకు పుణ్య పాప రూప సంబంధ సుఖదుఃఖరూప ఫలము నిచ్చువాడుగా నున్నాడు. మఱియు జీవులకు ప్రాప్తమగుటకు యోగ్యములైన యెన్ని భోగములుగలవో అవన్నియు నా విద్వాంసుని యాజ్ఞచేతనే వర్తించుచున్నవి. జీవుల ప్రాణబుద్ధీంద్రియాదులున్ను ఆ విద్వాంసుని ఆజ్ఞయందే వర్తించుచున్నవి. ఆ బ్రహ్మరూప విద్వాంసుడు జీవులకు శాపమిచ్చుటయందును అనుగ్రహము చేయుటయందును సమర్థుడుగా నున్నాడు ఇటువంటి బ్రహ్మవేత్తను పూజించువారైన జనులు వావిపుణ్యమును పొందుచున్నారు. సుఖమునున్ను పొందుచున్నారు. వానినవజ్ఞ చేయువారైన జనులు పాపమును, దుఃఖమును పొందుచున్నారు. కనుక ఏ పురుషులకు పుత్ర ధనాది పదార్థరూప యైశ్వర్యప్రాప్తినిగూర్చిన ఇచ్ఛ గలదో, ఆ సకామపురుషులున్ను, ఆ బ్రహ్మవేత్తయొక్క పూజవార్చనాదుల సర్వదా చేయవలసినది బుద్ధిమంతుడా బ్రహ్మవేత్త నెన్నటికిని నవజ్ఞచేయకూడదు. స్వప్నమందైన నవజ్ఞ చేయకూడదు.

శ్రుతి' "ఆత్మజ్ఞం హ్యర్చయే ద్భూతికామః"

భావార్థము — ధనాద్యైశ్వర్యకామనగలపురుషుడు బ్రహ్మవేత్తయొక్క పూజనార్చనముల చేయవలయును.

హే శౌనక ! ఏ వివేకపురుషులు నిష్కాములై బ్రహ్మవేత్తను సేవించుదురో ఆ వివేకపురుషులు సకలదుఃఖరహితులై బ్రహ్మభావన పొందుదురు. ఎందుకనగా — ఆ బ్రహ్మవేత్త శరీరమందుండగనే ఆనందరూప బ్రహ్మమును ఆత్మరూపముగ నెఱుగుచున్నాడు. మఱియు పరబ్రహ్మమును అభేదరూపమున యుపాసన చేయుచున్నాడు. పరబ్రహ్మమునందే అభేదరూపముగ స్థితినొందుచున్నాడు. ఇటువంటి బ్రహ్మరూపుడగు బ్రహ్మవేత్తయెడ ఏ యధికారిజనులు శ్రద్ధాపూర్వకముగ భక్తిగల్గియుందురో, ఆ భక్తజనులును, ఆ బ్రహ్మవేత్తయొక్క అనుగ్రహముచే తామున్ను బ్రహ్మవేత్తలై ఆ బ్రహ్మవేత్తతోటి సమానతను పొందుదురు. ఇక ఇపుడు సకామత్వముయొక్క నిందగావింపబడి నిష్కామత్వముయొక్క శ్రేష్ఠత నిరూపింపబడుచున్నది - ఏ సకామపురుషులు స్త్రీ పుత్ర ధనాది విషయముల కోరుదురో, ఆ సకామపురుషులు నానా ప్రకార శరీరములగ్రహించి నా యా శరీరములందు నానా ప్రకార దుఃఖముల పొందు

దురు. ఇందువలన నా కామనయే సకలదుఃఖములకు కారణమని తెలియుచున్నది. ఏ వివేకులు సకలకామనాపరిత్యాగముజేసి బ్రహ్మాత్మజ్ఞానమును పొందుదురో, ఆ నిష్కామపురుషులు ఈ లోకమందును పరలోకమందును కించిన్మాత్రదుఃఖమును పొందరు. ఈలాగున నిష్కామతయే సకలసుఖప్రాప్తికి కారణమై యున్నది

ఇపుడు ఆత్మజ్ఞానప్రాప్తికి ప్రధానసాధనము వచింపబడుచున్నది. హే శౌనక! ఈ ఆనందస్వరూపాత్మదేవుడు అధికారిపురుషులకు బ్రహ్మవేత్తయగు గురువుయొక్క అనుగ్రహముచే గాక కేవలవేదాధ్యాపనము చేయించుటచేతను, వేదాధ్యయనము చేయుటచేతను, తీక్ష్ణబుద్ధిచేతను ప్రాప్తింపడు. కేవలము బ్రహ్మవేత్తయగు గురువు యొక్క యుపదేశముచేతనే ప్రాప్తమగును. హే శౌనక! బ్రహ్మజ్ఞానముచే బ్రహ్మ భావమును పొందినవారైన గురువు ఏ శిష్యునిపై అనుగ్రహము చేయుచున్నాడో, ఆ శిష్యునిపై పరబ్రహ్మమే అనుగ్రహము చేయుచున్నది. (శిష్యునిచిత్తమందు అద్వితీయ స్వరూపమును ప్రాదుర్భావము చేయుటయే పరబ్రహ్మముయొక్క అనుగ్రహము.) అందువలన అధికారిపురుషులచే బ్రహ్మాత్మజ్ఞానప్రాప్తికొఱకు బ్రహ్మవేత్తయగు గురువుయొక్క అనుగ్రహము అవశ్యముగ సంపాదింపబడవలసినది.

శ్రుతి॥ 'నాయమాత్మా ప్రవచనేన లభ్యో, న మేధయా న బహునా శ్రుతేన,
యమేవైష వృణుతే, తేన లభ్యస్తస్యైష ఆత్మా వివృణుతే తనూం స్వామ్."

ఇపుడు జ్ఞానమందు సహకారిసాధనములు వచింపబడుచున్నవి. హే శౌనక! కామక్రోధాదిశత్రువులను దమనమొనర్చునట్టి మనసాదీంద్రియాదుల ధైర్యమునకు నామము బలము. బలరహితునకు ఆత్మదేవుడు ప్రాప్తముకాడు. బలవంతునకే ప్రాప్తమగును. కనుక అధికారిపురుషులు ధైర్యబలమును సంపాదనము చేయవలయును. ప్రమాదముచేతను ఆశ్రమరహితపాషండముచేతను ఆత్మదేవుడు ప్రాప్తముకాడు. (విషయము సమీపించినపుడు ధైర్యముయొక్క నాశమగుట ఇచ్చట ప్రమాదమన బడినది) ఇందుచే ఆ ప్రమాదరూపధైర్యముచేతను, స్వాశ్రమధర్మరూపతపస్సుచేతను, ఆత్మజ్ఞానము ప్రాప్తమగునని సిద్ధించుచున్నది. పూర్వము ఏ యే మహాత్ములగు మునిజనులు ఈ ఆనందరూపాత్మను సాక్షాత్కరించి ఆ యాత్మస్వరూపానందమునందు నిమగ్నులైయుండిరో, ఆ మునిజనులు మఱల సంసారమును పొందరు. మఱియు ఏ పరమహంససన్న్యాసులకు బ్రహ్మలోకేచ్ఛారూపప్రతిబంధముచే ఈ జన్మమందు బ్రహ్మసాక్షాత్కారము కాలేదో, ఆ సన్న్యాసులకు బ్రహ్మలోకమందు బ్రహ్మజ్ఞానము ప్రాప్తమగును. మఱియు ఏ సన్న్యాసులచే ఈ జన్మమందు మహావాక్యరూప వేదాంత వచనములు బాగుగా విచారము చేయబడినవో, ఎవనియంతఃకరణము రాగాదిదోష

ములచే రహితమైనదో, అటువంటి సన్న్యాసులున్ను బ్రహ్మలోకమునకు పోయి హిరణ్యగర్భ బ్రహ్మదేవునితో సహ కల్పాంతమందు బ్రహ్మభావమును పొందుదురు.

హే శౌనక ! ఈ లోకమందుగాని, బ్రహ్మలోకమందుగాని, అన్యలోకమందుగాని బ్రహ్మవేత్తయగు పురుషుడు యెపుడు ప్రారబ్ధకర్మముపభోగించి విదేహమోక్షమును పొందుచున్నాడో, అపుడా విద్వత్పురుషుని దేవదత్తాదినామములు తప్ప ఇతరములైన ప్రాణాది పంచదశ కళలును తమ తమ కారణమందు లయభావమును పొందుచున్నవి.

"ప్రాణః శ్రద్ధా ఖాదిభూతపంచకం చేంద్రియం మనః,
అన్నంవీర్యం తపోమంత్రాః కర్మలోకాశ్చతాః కలాః"

ప్రాణశ్రద్ధాది పంచదశకళలు. అధ్యాత్మరూపవాగాదీంద్రియములయొక్క అగ్న్యాదిదేవతలు అపుడు తమ తమ అధిదైవతములను పొందుదురు. మఱియు బ్రహ్మవేత్తయొక్క శరీరమందున్న బుద్ధివిశిష్టవిజ్ఞానమయుడగు నే జీవాత్మగలడో, ఆ జీవాత్మ శుద్ధపరమాత్మదేవునియందు లయభావమును పొందుచున్నాడు. ఈ ప్రకారముగ సర్వకార్యకారణోపాధుల లయమైన పిదప ఆ విద్వత్పురుషుడు అద్వితీయ బ్రహ్మరూపముగ స్థితుడగుచున్నాడు. హే శౌనక ! ఎట్లు పూర్వాదిసర్వదిశలందు విద్యమానములైన నదులన్నియు తమ తమ రూపముల పరిత్యాగముజేసి సముద్రమును పొందుచున్నవో, అట్లే ఈ విజ్ఞానమయపురుషుడున్ను తమ నామరూపముల పరిత్యాగముజేసి అద్వితీయబ్రహ్మమునందు లయభావమును పొందుచున్నాడు. హే శౌనక ! ఆ బ్రహ్మవేత్తయొక్క పంచదశకళల లయముమాత్రము కథనము చేయుట యందభిప్రాయమేమనగా — శుకవామదేవాది మహాపురుషులు పూర్వమే ముక్తులైయున్నను ఆ ముక్తపురుషుల శుకవామదేవాది నామములను నేటికిని లోకవాణి ఉచ్చారణము చేయుచున్నది. ఈలాగున ఆ శుకవామదేవాది నామములు నాశము కావు. ఇటువంటి ఏ బుద్ధి లోకులకుకలదో, ఆ లోకుల యా బుద్ధిననుసరించియే ప్రాణాదిపంచదశకళలకు లయము కథనము చేయబడియె నామములకు లయము కథనము చేయుబడలేదు. మఱియు హే శౌనక ! ఎట్లు పూర్వము బ్రహ్మవేత్తలు బ్రహ్మజ్ఞానబలమున అద్వితీయ బ్రహ్మమును పొందిరో, అట్లు ఈ కాలమందు ఏ అధికారిపురుషులు గురుశాస్త్రోపదేశమున బ్రహ్మమును తన ఆత్మరూపముగ సాక్షాత్కరించుకొందురో ఆ యధికారిపురుషులున్ను బ్రహ్మజ్ఞాన ప్రభావమున బ్రహ్మభావమును పొందుదురు. ఆ బ్రహ్మవేత్తయొక్క విద్యామయవంశమందు స్థితులైన యే శిష్యప్రశిష్యులుగలరో, పుత్ర పౌత్రాదులుగలరో ఆ శిష్యాదులును, పుత్రాదులును, బ్రహ్మజ్ఞానముచే రహితులుకారు. వారందఱును బ్రహ్మనిష్ఠగలవారే యగుదురు.

శ్రుతి॥ "నాస్యాబ్రహ్మవిత్కులే భవతి"

భావార్థము — బ్రహ్మవేత్తయొక్క కులమందు పుత్రుడుగాని, శిష్యుడుగాని, యెవడును బ్రహ్మజ్ఞాన రహితుడుకాడు. అందఱును బ్రహ్మవేత్తలే యగుదురు.

హే శౌనక ! బ్రహ్మవేత్త బ్రహ్మజ్ఞాన ప్రభావముచే కారణాజ్ఞానసహితముగ సకలపాపకర్మలను నాశముచేసి కామక్రోధాది సకలదోషరహితుడై సర్వశోకరహితుడై ఆనందస్వరూపాద్వితీయబ్రహ్మమును అభేదముగా పొందుచున్నాడు. ఇపుడు పూర్వోక్త బ్రహ్మవిద్యకు అధికారి వచింపబడుచున్నాడు. హే శౌనక ! ఈ యే బ్రహ్మవిద్యను నీకుపదేశముచేసితినో, ఆ బ్రహ్మవిద్యను నీవు యే అనధికారి పురుషునకును కథనము చేయకుము. శాంత్యాదిగుణయుక్తుడైన యధికారికే ఉపదేశము చేయుము. హే శౌనక ! ఏ పురుషులచే విధిపూర్వకముగ వేదాధ్యయనము చేయబడునో, వేదోక్త కర్మానుష్ఠాన మాచరింపబడునో, మఱియు నే పురుషులచే ఏకర్షి నామాగ్ని ఆరాధింపబడునో, బ్రహ్మచర్యాశ్రమమందు అగ్నిధారణవ్రతము చేయబడునో, ఏ పురుషులు శమదమాది సాధనములచే యుక్తులై యుందురో, మఱియు బ్రహ్మవేత్తయగు గురువుయెడ అత్యంతశ్రద్ధాభక్తిగలవారైయుందురో అటువంటి అధికారులకే ఈ బ్రహ్మవిద్య నొసంగవలెను. ఈ బ్రహ్మవిద్య సర్వదా శ్రేష్ఠమనుజులచే సేవింపయోగ్యమై అత్యంత దుర్లభమై యున్నది.

శ్రీగురువు — హే శిష్య ! ఏ బ్రహ్మవిద్యనుగూర్చి నీవు నన్నడిగితివో, ఏ బ్రహ్మవిద్యను నేను నీకిపుడు కథనము చేసితినో ఆ బ్రహ్మవిద్య పూర్వము అంగిరసుడను ఋషికి బ్రహ్మదేవునినుండి పరంపరగా ప్రాప్తమైనది. ఆ బ్రహ్మవిద్యను అంగీరసఋషి శౌనకఋషికి ఉపదేశించెను. అట్లే పిప్పలాదమునియు సంసార దుఃఖముచే పీడితులైన సుకేశాది యార్గురుశిష్యులకు నుపదేశించియుండెను. ఆ బ్రహ్మవిద్య ఈ యుత్తరాధ్యాయమందు ఆఱు ప్రశ్నలచేతను, ఆఱు ప్రత్యుత్తరములచేతను, స్పష్టీకరింపబడనున్నది. హే శిష్య ! ఈ షోడశాధ్యాయముయొక్క ఆదియందు అథర్వమునిచే ప్రోక్తమైన యే బ్రహ్మవిద్యనుగూర్చి నీవు నన్నడిగితివో, ఆ బ్రహ్మవిద్యయంతయు నేను నీకు కథనము చేసితిని. ఇక ఇపుడే విషయమును శ్రవణము చేయుటకై నీవిచ్ఛగించుచున్నావో, అద్దానిని నాకు చెప్పుము, నేనుపదేశించెదను.

ఇతి శ్రీమదాత్మపురాణే షోడశోఽధ్యాయః

సంపూర్ణః

శ్రీ

ఆత్మపురాణము

అథ సప్తదశాధ్యాయారంభః

సప్తదశాధ్యాయము

శ్రద్ధావంతులైన శిష్యుదు శ్రీగురువునుగూర్చి ఇట్లు ప్రార్థన చేయుచున్నారు. హే భగవన్! షోడశాధ్యాయాంతమందు తాము పిప్పలాదముని సుకేశాది యార్గురు ఋషులకు బ్రహ్మవిద్యను కథనము చేసెనని వచించితిరి. ఓ భగవంతుడా! ఆ బ్రహ్మవిద్యను శ్రవణముచేయుటకై నాకుయిచ్ఛజనించుచున్నది, దయచేసి తాము దానిని పూర్ణమొనర్పవలయును. ఈ ప్రకారమగు శిష్యుని ప్రార్థనవిని గురువు అధర్వణవేదసంబంధ శౌనకీయ శాఖయందుగల ప్రశ్నోపనిషత్తునందు కథనము చేయ బడిన సంగతిని వానికుపదేశింప నారంభించెను.

శ్రీగురువు — హే శిష్య! పూర్వమొకానొక కాలమున నొకానొక దేశమందు యేదోనొక నిమిత్తముచే నార్గురు మునీశ్వరులు సమావేశమైరి. వారి నామములు వినుము. (1) భారధ్వాజ సంజ్ఞగల సుకేశ ఋషి (2) శైభ్యసంజ్ఞగల సత్యకామ ఋషి (3) గార్గ్యసంజ్ఞగల సౌర్యాయణిఋషి (4) కౌశలనీ సంజ్ఞగల అశ్వలాయన ఋషి (5) వైదర్భిసంజ్ఞగల భార్గవఋషి (6) కాత్యాయన సంజ్ఞగల కబంధిఋషి. ఈ ఆర్గురు ఋషులు వ్యాకరణాది షడంగసహిత చతుర్వేదాధ్యయనముచేసి వేదోక్త నిత్య కర్మాదులను సగుణబ్రహ్మోపాసనను చేయువారైయున్నారు. వారు కర్మోపాసన ప్రభావముచే శుద్ధాంతఃకరణముగలవారై నిర్గుణబ్రహ్మము నెఱుగుటకు నిచ్ఛగించు చుండిరి వారట్లు సమావేశమై యివ్విధమున విచారముచేయ దొడగిరి. ఏ విద్వత్పురుషుడు విద్యాదిగుణములచే మనకంటె నధికుడగునో, మఱియు శ్రోత్రియబ్రహ్మనిష్ఠుడై యుండునో, ఆ విద్వాంసుడే మనకు నిర్గుణబ్రహ్మోపదేశము చేయగల్గును. అటువంటి శ్రోత్రియబ్రహ్మనిష్ఠుడగు విద్వాంసుడెవడో, వానినే మనము శరణుపొందవలెను. ఈ ప్రకారముగ చింతనచేయుచుండగా భగవంతుడైన పిప్పలాదముని స్వేచ్ఛాను సారముగ సంచరించుచు సంచరించుచు ఆ స్థానమునకే వచ్చిచేరెను. ఆ వచ్చుచున్న పిప్పలాదమునిని దూరమునుండియే చూచి ఆ ఋషులు పరస్పరమిట్లు సంభాషించు కొన దొడగిరి. పిప్పలాదముని వచ్చుచున్నారు. ఈ మునీశ్వరుడు మనసర్వప్రశ్నల

కును యుత్తరమును చెప్పును. ఇంతలో నమ్మునీశ్వరుడు సమీపమునకు వచ్చునపుడు నా యార్దురు ఋషులును తమతమ స్థానములనుండి లేచి వారికి పూజనార్చనాదుల గావించిరి అనంతరము వారు సమిధాది పదార్థములను హస్తములందు ధరించి మునీంద్రునకు దీర్ఘప్రణామముజేసి యిట్లు ప్రార్థనచేసిరి.

హే భగవన్! ఈ సంసారసంబంధ జన్మమరణాది దుఃఖములచే భయమును పొందినవారమైన మేమందరమును మీకుశరణాగతుల మగుచున్నాము. దయచేసి మాకు బ్రహ్మవిద్యోపదేశము చేయుము హేశిష్య! ఈప్రకారమగు నాఋషులప్రార్థనను విని ఆ పిప్పలాదముని వారందఱిని గూర్చి ఇట్లనెను. ఓ ఋషులారా! వివేకాది సాధన సంపన్నుడును, గురుశాస్త్రములందు శ్రద్ధావంతుడును నగు శిష్యుడు ఒక సంవత్సరము వఱకు గురుసమీపమున వాసము చేయవలయును. లేని పక్షమందు గురువు ఆ శిష్యునకు బ్రహ్మవిద్యోపదేశము చేయకూడదు. ఒక వత్సరపర్యంతము శిష్యుని పరీక్షచేసి ఆ తర్వాత వానికుపదేశము చేయవలయునని శాస్త్రమర్యాదగలదు. ఆ శాస్త్రమర్యాదను మీతెఱింగియే యున్నారు. మీరందఱు స్వభావముగనే తపస్వులై యున్నారు, మఱియు సర్వదా బ్రహ్మచర్యాదిసాధనయుక్తులై యున్నారు. కాన మీరు బ్రహ్మవిద్యకు అధికారులేయైయున్నారు. ఐనను శాస్త్రమర్యాదాపాలనము కొఱకు మీరు బ్రహ్మచర్యమును ధారణముచేసి నా సమీపమున నివాసముచేయుడు అనంతరము మీకు లెస్సగా బ్రహ్మవిద్యోపదేశమును చేసెదను. ఈ నావచనము మీకు అంగీకారమైన పక్షమందు మీరట్లే చేయుడు. ఈ ప్రకారమగు పిప్పలాదిముని యొక్క భాషణము విని ఆ ఋషులందఱు శ్రద్ధాభక్తి పూర్వకముగ నొకసంవత్సరము బ్రహ్మచర్యమును పాలించిరి. అటుపిమ్మట మొమ్మొదట కాత్యాయనఋషి పిప్పలాద ముని సమీపమునకువచ్చి దీర్ఘప్రణామముచేసి ఇట్లు ప్రశ్నించెను.

(పూర్వము ముండకోపనిషత్తునందు పరాపరములను ద్వివిధవిద్యలు కథనము చేయబడినవి. కర్మోపాసనా భేదముచే అట్టి అపరావిద్యయు ద్వివిధమైయున్నది. ఆయుప రావిద్యయొక్క ఫలనిర్ణయము చేయుటకొఱకు ఆ కాత్యాయన ఋషి మొదట జగదుత్పత్తి సంబంధప్రశ్నను చేయుచున్నాడు)

హే భగవన్! ఈసమస్త ప్రజ యేకారణమువలన జన్మమును పొందుచున్నది? ఆ ప్రజోత్పత్తియొక్క కారణమును నాకు చెప్పుము. హే శిష్య! ఈ ప్రకారమగు కాత్యాయనుని ప్రశ్నవిని పిప్పలాదముని ప్రజాపతియైన విరాట్టువినుండి జనించినదైన ఆకాశాదిపంచభూతరూపహిరణ్యగర్భాదిరూప మహాస్పృష్టినే వచింపనెంచినను కాత్యాయనునిచేత ఆస్పృష్టిక్రమము పూర్వము శాస్త్రములద్వారా బాగుగా నెఱుగ

బడియె ననివిచారముచేసి మహాస్సృష్టిచెప్పక, విరాడ్భగవంతునినుండి యుత్పన్నమైన సృష్టిని కథనము చేయుచున్నాడు పిప్పలాదుడు - హే కాత్యాయన! పూర్వము జగద్వృద్ధిని గూర్చిన యిచ్ఛతోనర్చుచు విరాడ్భగవంతుడు, అగ్ని, సోమము. ఈ రెండిటిచే నానా ప్రకారసృష్టియగునని విచారించి భోక్తరూపాగ్నిని భోగ్యరూప సోమమును ఉత్పన్నము చేసెను. ఇపుడు భోక్తరూపాగ్నియొక్క సర్వాత్మరూపత వర్ణింపబడుచున్నది. హే కాత్యాయన! ఆ భోక్తరూపాగ్ని అధ్యాత్మాధిదైవరూప ములచే ద్వివిధము. అట సంఘాతమందు స్థితమైన ప్రాణము అధ్యాత్మరూపాగ్నియై యున్నది. ఆ ప్రాణరూపాధ్యాత్మాగ్నికి సంఘాతమును వశముచేయునట్టి భోక్తృత స్పష్టమే యైయున్నది. మఱియు ఆదిత్యరూపాధిదైవము గలదు. ఆ యాదిత్యరూపాగ్ని తన ఉదయాస్తభావముచే పూర్వపశ్చిమాది సకలదిశలను విభాగము చేయువారై యున్నారు. మఱియు సకల ప్రకాశ్యవస్తువులకును భోక్తయై యున్నారు. సర్వవిశ్వ మున కాత్మయగుటవలన సర్వవిశ్వరూపమైయున్నారు. తప్తసువర్ణసమానప్రభగలవారై యున్నారు. ఏ యాదిత్యునిచే, సర్వవస్తువిషయక జ్ఞానరూపధనము పుట్టుచున్నదో, ఏ యాదిత్యరూపాగ్ని తన సహస్రకిరణములచే ప్రకటితమగు జ్యోతీరూపమై యున్నదో, ఆ యాదిత్యరూపాగ్ని జీవులకు బాహ్యప్రాణమగును. మఱియు నా యాదిత్యరూపాగ్ని అనేకవృష్టిరూపములచే వర్తించుచున్నాడు. ప్రాణరూపాగ్ని యందు కాలరూపముచే సృష్టికర్తృత వచింపబడుచున్నది. హే కాత్యాయన! ద్వాదశమాసము లొక సంవత్సరము. షణ్మాసము లొక ఉత్తరాయణము. ఆ యుత్త రాయణమున్ను అగ్నిరూపమైయున్నది. ఈ కారణమువలన ఆ యుత్తరాయణమార్గ ముచే బ్రహ్మచర్యాది సాధనసంపన్నులైన యుపాసకపురుషులు ఆ యాదిత్యమండల మును భేదించి పైకిపోవుచున్నారు. హే కాత్యాయన! సూర్యమండలమును భేదించి అధికారిపురుషులు ఏ స్థానమును పొందుచున్నారో ఆ స్థానము సమష్టిప్రాణరూప హిరణ్యగర్భుని నివాసస్థానమైయున్నది ఈ కారణమువలన వేదవేత్తలు ఆ స్థానమును "ప్రాణాయతన" నామముచే కథనము చేయుచున్నారు. మఱియు ఆ స్థానము మృత్యుభయ రహితమగుటవలన దానిని "అమృత, అభయ" మను రెండునామము లచే కథనము చేయుచున్నారు. హిరణ్యగర్భ బ్రహ్మదేవుని వాసస్థానమగుటవలన ఆ స్థానమును బ్రహ్మలోకమనియు ననుచున్నారు. ఆ బ్రహ్మలోకము సూర్యమండల మున కావలకలదు

హే కాత్యాయన! ఏ అధికారిపురుషులచే సగుణబ్రహ్మము, అభేదరూపముగ నుపాసనచేయబడినదో, మఱియు నే యధికారిపురుషులు బ్రహ్మచర్యాది ధర్మములచే యుక్తులైయున్నారో, ఆ అహంగ్రహోపాసకులైన అధికారిపురుషులు ఉత్తరాయణ

మార్గముగ బ్రహ్మలోకమునకుబోయి మఱల ఈ లోకమునకు రాకయుందురు. వారా బ్రహ్మలోకమందే మోక్షమును పొందుదురు. హే కాత్యాయన! ఎట్లు ఉత్తరాయణము ఉపాసకులకు సూర్యమండలప్రాప్తి గావించుటవలన ప్రాణాగ్నిరూపముగ కథనము చేయబడినదో, అట్లే ఉత్తరాయణ ఘటకమైన శుక్లపక్షమునున్ను, శుక్లపక్షఘటకమైన దివసమునున్ను వేదవేత్తలు ప్రాణాగ్నినామముచే కథనము చేయుచున్నారు.

ఇపుడు భోగ్యరూపమగు సోమము వర్ణింపబడుచున్నది. భోగ్యరూప చంద్రుడు అమృతరూపమగుటవలన సోమరూపుడగును. మఱియు షణ్మాసరూప దక్షిణాయనము కర్మిపురుషులకు ఆ చంద్రరూపసోమమును ప్రాప్తింపజేయుచున్నది. ఈ కారణము వలన దక్షిణాయనమునున్ను వేదవేత్తలు సోమనామముచే కథనము చేయుచున్నారు. ఎట్లు దక్షిణాయనము సోమరూపమో అట్లు దక్షిణాయనఘటక కృష్ణపక్షమున్ను రాత్రియు సోమరూపమేయైయున్నవి. రాత్రియందు తమ స్త్రీతోటి సంభోగము చేయువారైన గృహస్థుని బ్రహ్మచర్యము భంగముకాదు. ఇట్లు చెప్పుటచే దివసము ప్రాణాత్మకమగు అగ్నిరూపమైయున్నది గాన అట్టి దివసమందు తమ స్త్రీతోటి సంభోగము చేయువారైన పురుషునకు కేవలము బ్రహ్మచర్యము మాత్రమే హానియగుట కాదు, వాని ప్రాణమునకును హానియగునని సిద్ధించుచున్నది. మఱియును నే గృహస్థులు స్త్రీ సంభోగము చేయుదురో అట్టివారు గృహస్థ బ్రహ్మచర్యధర్మమును పాలనము చేయువారే యగుదురు.

శ్రుతి॥ "ప్రాణం వా ఏతే ప్రస్కందన్తి యే దివా రత్యా సంయుజ్యన్తే.
బ్రహ్మచర్యమేవ తద్యద్రాత్రౌ రత్యా సంయుజ్యన్తే"

హే కాత్యాయన! ఉత్తరాయణము శుక్లపక్షము దివసము యను నీ త్రివిధ రూపాగ్ని, మఱియు దక్షిణాయనము, కృష్ణపక్షము రాత్రి నీ త్రివిధరూపసోమ మునకు ఆ యగ్నికి యే పరస్పరమిథునీభావమేర్పడినదో, దానికి సంవత్సరమని పేరు ఆ సంవత్సరము ప్రజాపతిరూపమైయున్నది ఆ సంవత్సరరూప ప్రజాపతి వసంతాది షడృతురూపపాదములచే యుక్తముగాను మార్గశిరాదిమాసములచే యుక్తముగానుండి షడృతరూపముచే యుక్తమైన శింశుమారచక్రమున సూర్యరూపముచే స్థితుడై యున్నాడు. మఱియు స్వర్గలోకమునకుపరిభాగమున స్థితి గల్గియున్నాడు. వృష్టి యుక్తమేఘాదులకారణరూపమగుటవలన సర్వజగత్తునకు జనకుడుగానున్నాడు. యెందుకనగా సూర్యచంద్ర ఉత్తరాయణాది రూపములచే యుక్తయగు అగ్నిసోమాది రూపప్రజాపతివలననే వృష్టిద్వారా వ్రీహియవాది నానాప్రకారాన్నము పుట్టుచున్నది ఆ యన్నము పురుషుని జఠరాగ్నియందు పక్వముకాగా దానిచే వీర్యముజనింప

అద్దానివలన నానాప్రకార ప్రజ పుట్టుచున్నది. ఈ ప్రకారముగా అగ్నిసోమముల ద్వారా ప్రజాపతియే జగత్కారణమై యున్నాడు. ఇంతవరకు ప్రథమప్రశ్నకు సంబంధించినట్టి యుపాసన చేయుటకు యోగ్యమైన ప్రాణసూర్యాది అధిదైవ ప్రజ వర్ణింపబడెను. ఇపుడు ప్రాణాదిసంబంధాత్మప్రభావనిర్ణయముకొఱకు ద్వితీయప్రశ్నకుత్తరము వచింపబడుచున్నది. హే శిష్య! తన ప్రశ్నకు యుపర్యుక్తమగు ప్రత్యుత్తరమును శ్రవణముజేసి కాత్యాయనఋషి శాంతుడైనపుడు భార్గవఋషి ఆ పిప్పలాదునిట్లు ప్రశ్నించెను.

హే భగవన్! ఈ అధ్యాత్మసంఘాతరూప జగత్తును ధారణచేయువారైన యెందఱు దేవతలుగలరో, ఆ దేవతలందు ప్రకాశము చేయువారైన దేవతలెందఱు? మఱియు ఆ దేవతలందు కీర్త్యతిశయతాది గుణములు గలవారైన శ్రేష్ఠదేవతయేది? పిప్పలాదుడు - హే భార్గవ! ఆకాశాది పంచభూతములు శ్రోత్రాదిపంచ జ్ఞానేంద్రియములు, వాగాది పంచకర్మేంద్రియములు మనస్సు, ప్రాణము, సప్తదేవతలు, సర్వ శరీరములను ధారణముచేయువారగుదురు. వారిలో ప్రాణాపానాది ప్రాణములు సకల దేవతలందును శ్రేష్ఠులుగనున్నారు. ఎందుకనగా శ్రోత్రాదీంద్రియములు నష్టములైనను బధిరాంధాదులకు శరీరస్థితి గనిపించుచునేయున్నది. కాని ప్రాణము బహిర్గతమైన తర్వాత శరీరస్థితి కనిపించుటలేదు. కాబట్టి ప్రాణదేవత ఆ సకలదేవతలందు శ్రేష్ఠమైనది. హే భార్గవ యెట్లు మధుమక్షికలందలి మధుకరరాజను ప్రధానమక్షిక ఎపుడు మధుప్రదేశము విడిచిపోవునో, అపుడన్ని మక్షికలు అచటినుండి వెడలిపోవును. ఈ విషయము లోకప్రసిద్ధము అట్లు యెంతవఱకు శరీరమందు ప్రాణముండునో అంతవఱకు సకలేంద్రియములును స్థితములగును. ప్రాణము బయటకు పోయిన సకలేంద్రియములును బయటకు పోవును. ఈ ప్రకారము అన్వయవ్యతిరేకముగ ప్రాణమునకు సర్వాధారతారూపశ్రేష్ఠతనుచూచి ఆ శ్రోత్రాదీంద్రియముల అభిమానిదేవతలు ప్రాణమును నిట్లు స్తుతిచేయ నారంభించిరి ప్రాణదేవత! అగ్ని, సూర్య, పర్జన్య, విద్యుత్తు, వాయు, ఇంద్ర, ఆకాశాదిపంచభూత, సోమ, సత్, అసత్, అమృత, ఋగాది చతుర్వేదాది నామరూపక్రియాస్వరూపవిశ్వమెంతగలదో, నీవద్దానిరూపముగ నున్నావు (ఇచట పర్జన్యశబ్దముచే వృష్టిగలమేఘమని, సోమశబ్దముచే భోగ్యపదార్థములని, సత్‌శబ్దముచే మూర్తపదార్థములని, అసత్‌శబ్దముచే అమూర్తపదార్థములని అమృతశబ్దముచే దేవతలభోగ్యపదార్థములని గ్రహించవలెను.)

ఓ ప్రాణదేవతా! ఎట్లు రథచక్రముయొక్క నాభియందు అరములు స్థితములగుచున్నవో, అట్లే ఈ సంపూర్ణవిశ్వమందు స్థితమగుటవలన ప్రాణదేవతవగు నీవు

సకలవిశ్వమునకు ఆత్మగానున్నావు. జరాయుజాది చతుర్విధ ప్రాణులను నీవే పుట్టించుచున్నావు. మఱియు హిరణ్యగర్భ విరాడ్రూపములను నీవే సృజించుచున్నావు. నీకన్న వేరుగ ఇంకెవరును శ్రేష్ఠుడుగాడు. ప్రాణదేవతా! దేవతలందగ్ని, పితరులందు నాందీముఖము, ఋషులందు సత్యపరాయణ అంగీరస అథర్వాదులు ఈ మొదలగు యెందఱు ప్రాణులుగలరో, వారిలో నీవేశ్రేష్ఠుడవు. మఱియు ఐశ్వర్యములుగలవారైన అగ్న్యాది దేవతలప్రసన్నము చేయునట్టి స్వాహాశబ్దముచే యుక్తముగాను, పితరుల ప్రసన్నముచేయునట్టి స్వధాశబ్దముచే యుక్తముగాను నగుమంత్రములన్నియు నీ స్వరూపములే. ఓ ప్రాణదేవతా! నీ మూర్తియే చక్షురాది సకలేంద్రియములందు బలమునుధారణజేసి స్థితమైయున్నది. ఆ నీమూర్తిని నీవు సర్వదా అనుకూల పరిణామముగలదిగా జేయుము. మేమందరము నీయొక్క కింకరులముగా నున్నాము. కాబట్టి మా అపరాధమును క్షమించి నీవీశరీరమునుండి బయటకు గమనము జేయకుము. హే ప్రాణదేవతా! స్వర్గాంతరిక్ష భూములను నీ మూడు లోకములందు స్థితములైన భూతభౌతిక పదార్థములెన్నిగలవో ఆ సమస్తపదార్థములు నీకు వశవర్తులైయున్నవి. ఇటువంటి నీ స్వరూపము నెఱిగినవారమైన పుత్రులమైనమమ్ములను మాతవలె నీవు రక్షణము చేయుము. మఱియు మాకు చతుర్వేదరూపబ్రాహ్మణధనమును పొందజేయుము. ఈ ప్రకారముగ ఇంద్రియసంబంధ సకలదేవతలు ప్రాణదేవతయొక్క స్తుతి చేయుచున్నారు. ఈలాగున ప్రాణమే సకలదేవతలందు శ్రేష్ఠముగనున్నది. ఇది ద్వితీయప్రశ్నకుత్తరము — ఇపుడు తృతీయప్రశ్నకుత్తరము వచింపబడుచున్నది.

అశ్వలాయనుడు — హే భగవన్! ప్రాణముయొక్క యుత్పత్తి నే వస్తువుచేనైనది? ఏ నిమిత్తముచే ప్రాణమునకు శరీరముతోటి సంబంధము జనించినది? ఈ ప్రాణము తన్ను భిన్నభిన్నముగజేసి యే ప్రకారముగ శరీరమందు స్థితమైయున్నది? ఈ ప్రాణము శరీరమునుండి బయటకేద్వారముచే, యే వృత్తివిశేషముచే, యే నిమిత్తముచే నుత్క్రమించుచున్నది? ఈ ప్రాణము బాహ్యమైన అధిభూత అధిదైవరూప సకలజగత్తును యే ప్రకారముగ ధరించుచున్నది? ఈ ఆఱుప్రశ్నలచే యుక్తమైన నా ప్రశ్నకుత్తరము దయచేసి తాము చెప్పవలయును. పిప్పలాదుడు —— హే అశ్వలాయన! నీవు అత్యంత సూక్ష్మమగు ప్రశ్న చేయుచున్నావు. కనుక సకలముని సమాజమందును నీవు బ్రహ్మిష్ఠుడవుగా నున్నావు. (అతిశయముగ బ్రహ్మపరాయణుడైన వానికి బ్రహ్మిష్ఠుడనిపేరు) ఇటువంటి ఉత్తమాధికారివగు నీకు నేను ఉత్తరము చెప్పెదను సావధానుడవై వినుము ప్రథమప్రశ్నకుత్తరము — ఎట్లు స్థూలదేహమునుండి దర్పణాదుల సమీపతా నిమిత్తముచే ప్రతిబింబరూప ఛాయపుట్టుచున్నదో, అట్లే పరమార్థసత్యస్వరూపమైన ఆత్మరూపబింబమునుండి ఈ జీవరూపమైన ప్రాణరూప

ప్రతిబింబము పుట్టుచున్నది ఆ దర్పణాదిస్థిత ప్రతిబింబములకు ముఖాదిబింబముల తోటి భిన్నసత్తలేకపోవుటవలన ఆ ప్రతిబింబము లెట్లు బింబములనే ఆశ్రయించి యున్నవో, అట్లే ఈ ప్రాణమున్ను ఆత్మనే ఆశ్రయించియున్నది.

ద్వితీయప్రశ్నకు త్తరము — ఏ నిమిత్తముచే ప్రాణమునకు శరీరముతోటి సంబంధమగుచున్నదో ఆ సంబంధమున విజ్ఞానముచే నొనర్పబడిన పుణ్యాపాపకర్మముతే నిమిత్తకారణములైయున్నవి ఆ మనఃకృతకర్మములచేతనే ఈ జీవరూప ప్రాణము ఆ యా శరీరములను పొందుచున్నది. ఎందుకనగా — ఆత్మ ప్రతిబింబమును గ్రహించి చేతనభావమును పొందిన చిదాభాసయుక్తమనస్సు ఈ ప్రపంచమున పుణ్య పాప కర్మముల చేయుచున్నది. ఆ మనస్సే కర్మఫలమునుపభోగించుచున్నది. ఈలాగున మనస్సే కర్తయు భోక్తయు నైయున్నది మనస్సుయొక్క కార్యరూపమైన యే మానసకర్మము కలదో, ఆ మానసకర్మముచేతనే ఈ జీవరూపప్రాణము ఆ యా శరీరములను పొందుచున్నారు.

అశ్వలాయనుడు — హే భగవన్! ఇతర శాస్త్రములందు శరీరకృత వాక్కృత మనఃకృతములగు నీమూడు పుణ్యాపాపకర్మములే సంసారమునకు నిమిత్తకారణములని చెప్పబడియె. తామో కేవలమానసకర్మమునకే సంసారకారణత కథనము చేయు చున్నారు.

పిప్పలాదుడు — హే అశ్వలాయన! ఈ వాగాదీంద్రియములుగాని, శరీరము గాని, ప్రాణముగాని మనస్సులేక స్వతంత్రములై ఏ కార్యములందును సమర్థములు కావు. మనస్సుయొక్క ఆశ్రయముచేతనే సకలశుభాశుభకర్మములందు సమర్థములగు చున్నవి. కనుక శరీరవాక్కృత కర్మములందును మనస్సునకే ప్రధానతకలదు. ఆ ప్రధానత నంగీకరించియే నేను మానసకర్మములకు సంసారకారణతను వచించు చున్నాను అశ్వలాయనుడు — హే భగవన్! మనోవ్యాపారములేక కేవలశరీరేం ద్రియములచే చేయబడిన పాపముయొక్క నివృత్తికి ఏకగుణప్రాయశ్చిత్తమున్ను, విజ్ఞానవ్యాపారపూర్వకముగా చేయబడిన పాపములకు త్రిగుణప్రాయశ్చిత్తమున్ను విధానము చేయబడియున్నది. అది అసంగతమగునుగదా? పిప్పలాదుడు — హే అశ్వలాయన! ధర్మశాస్త్రమందు అబుద్ధిపూర్వక, బుద్ధిపూర్వక పాపములకు, న్యూనా ధిక ప్రాయశ్చిత్తము విధానము చేయబడియున్నను ఆ ప్రాయశ్చిత్తము మానసవ్యాపా రముచేతనే యగును. ఎందుకనగా — ఏ పురుషుడు తాను బుద్ధిపూర్వకముగా పాపకర్మముచేయలేదో, ఆ పురుషుడు నేను అబుద్ధిపూర్వకముగ పాపముచేసితినని నిశ్చయప్రకారముగ తన మనస్సులో యెపుడు విచారముచేయునో, అపుడే అతడు ప్రాయ శ్చిత్తమున కధికారియగును. మానసవిచారముగాకున్న అధికారికాడు. ఈలాగున

మనోవ్యాపారముచేతనే బుద్ధిపూర్వకాబుద్ధిపూర్వకకర్మయు, తత్ప్రాయశ్చిత్తమున్ను యగును. మనోవ్యాపారములేక యేయొక న్యూనాధికతయు, పుణ్యపాపమున్ను సిద్ధింపదు. అథవా శుభాశుభముల కర్తృత భోక్తృత శుద్ధాత్మయందుకలవా? దేహేంద్రియాదులందుకలవా? అథవా మనస్సునందుకలవా? అను నీ విచారము చేయవలయును. అట శుద్ధాత్మయో అసంగము, నిర్వికారము, కాన దానియందు కర్తృత భోక్తృత సంభవింపవు. దేహేంద్రియాదులో జడములు, పరతంత్రములు గాన వానియందును కర్తృత్వాదులు సంభవింపవు. పరిశేషముగా మనస్సునందే కర్తృత్వాదులు సిద్ధించుచున్నవి, అందువలన చిదాభాసయుక్తమనస్సే కర్తయు భోక్తయు నగును. ఆ మనస్సుచేతనే దేహేంద్రియాదిసంఘాతము పుట్టుచున్నది. ఆ మనఃకృత పాప పుణ్యకర్మవశముననే ఈ జీవరూపప్రాణము ఆ యా శరీరములతోటి సంబంధము పొందుచున్నది.

ఇపుడశ్వలాయనుని తృతీయ ప్రశ్నకుత్తరము వచింపబడుచున్నది — హే అశ్వలాయన! ఎట్లు మహారాజు మంత్రులను వారివారి కార్యములందు ప్రేరణజేయుచున్నాడో, అట్లే ఈ క్రియాశక్తిగల ప్రాణమున్ను తన్ను ప్రాణాపానాదులను పంచ విధములుగా జేసుకొని నేత్రాదిసకలేంద్రియములను తమతమ వ్యాపారములందు ప్రేరణ జేయుచున్నది. ఆ పంచప్రాణములందు ప్రధానమైన ప్రాణము శిరస్సునందు స్థితమైన రెండు నాసికలందును, రెండు శ్రోత్రములందును, రెండు నేత్రములందును, ముఖమందును (సప్తఛిద్రములందు) స్థితమైయున్నది. మఱియు ముఖనాసికముల ద్వారా బయటకు గమనము చేయుచున్నది. రెండవదైన అపానము పాయూపస్థలను రెండుస్థానములందుండి, విష్టామూత్ర విభాగము చేయుచున్నది. మూడవదైన సమానము భుజింపబడిన అన్నమును జలమును సమానముగ నొనర్చుచున్నది కనుక ఆ సమానము సర్వశరీరమందు వ్యాపకమై పూర్వోక్త సప్తఛిద్రములకును, ఆధారచక్రమునకును మధ్యదేశమందు స్థితమగుచున్నది ఇప్పుడు వ్యానమను చతుర్థప్రాణమునుగూర్చి వచించుటకుమునుపు, మొదట నాడీ సంఖ్యను చెప్పెదను. ఈ దేహధారియగు జీవుని హృదయదేశమందు డెబ్బైరెండుకోట్ల పదివేలనూటయొక్క (720010101)నాడులుగలవు. (ఈ నాడుల వివరము పూర్వము యేకాదశాధ్యాయమందు తెలుపబడినది) అందు ఒక సుషుమ్నానాడినివదలి ఇతరనాడులన్నిటియందు ఆ వ్యానము వర్తించుచున్నది. ఆ వ్యానము శ్రుతియందు ప్రాణాపానసంధిరూపముగ వర్ణింపబడియె. మఱియు బలిష్ఠకర్మములకు సాధకరూపముగను కథనము చేయబడియె. సుషుమ్నానాడియందు ఒక ఉదానప్రాణమొకటియే వర్తించుచున్నది. ఆ యుదానమునకు సర్వదా యూర్ధ్వ గమనము స్వభావమైయున్నది.

హే అశ్వలాయన! మరణకాలమందు యే జీవుల అగ్నిహోత్రాది పుణ్యకర్మములు ఫలమొసంగుటకు సమ్ముఖమగునో ఆ జీవులకాయుదానము స్వర్గాదిలోకప్రాప్తిని గలుగజేయుచున్నది ఏ జీవుల పాపకర్మము ఫలమొసంగుటకు సమ్ముఖమగునో ఆ జీవుల కాయుదానము నరకాదులప్రాప్తి నొనర్చుచున్నది. పుణ్యపాపమిశ్రిత ఉభయకర్మఫలమొసంగుటకు సమ్ముఖమైనపక్షమందు మనుష్యలోకప్రాప్తి నొనర్చుచున్నది. మఱియు నేపురుషులకు పుణ్యపాపములు రెండును ప్రతిబంధకములుగావో, వారికి ఆ యుదానము సుషుమ్నానాడీద్వారా బ్రహ్మలోకప్రాప్తి నొనర్చుచున్నది. ఏ పురుషులకు ఆత్మసాక్షాత్కారమైనదో ఆ విద్వత్పురుషుల ఉదానము శరీరమునుండి గమనముచేయదు. ఇపుడు బాహ్యమైన అధిభూతాధిదైవప్రపంచమునకు అంతరమైన అధ్యాత్మరూపజగత్తును ప్రాణమేరీతిగా ధారణచేయుచున్నదను అశ్వలాయనుని పంచమ షష్ఠ ప్రశ్నలకుత్తర మొసంగబడుచున్నది. హే అశ్వలాయన! ఈ ప్రాణము బాహ్యమైన ఆదిత్యపృధివ్యాదిరూపములచే అధిభూతఅధిదైవరూపజగత్తును ధారణము చేయుచున్నది. మఱియు ప్రాణాపానాదిముఖ్యమైన పంచరూపముల చేతను. చక్షురాదిగౌణరూపములచేతను అంతరాధ్యాత్మజగత్తును ధరించుచున్నది. ఈ విషయమే స్పష్టీకరింపబడుచున్నది.

హే అశ్వలాయన! చక్షువు, ఆదిత్యుడు ఈ రెండును ప్రాణస్వరూపమైయున్నవి. కనుక ఈ రెంటికిని అభేదముకలదు. ఈలాగున ప్రాణవాయువునకు బాహ్యరూపము ఆదిత్యుడైయున్నాడు. పృధివీదేవతచేతనే అపానవాయువునకు ఆకర్షణయగుచున్నది కనుక అపానమునకు పృథివి బాహ్యరూపమైయున్నది. ఎట్లు సమానము శరీరమునకు మధ్యదేశమందుండునో, అట్లు భూలోకము. స్వర్గలోకము ఈ రెంటికిని మధ్యమందు ఆకాశముండును. కనుక సమానమునకు ఆకాశము బాహ్యరూపమగును. మఱియు యెట్లు వ్యానము సర్వనాడులకు వ్యాపకమైయున్నదో, అట్లు ఈ బాహ్యవాయువున్ను వ్యాపకమైయున్నది. కనుక వ్యానమునకు ఈ బాహ్యవాయువు బాహ్యరూపమగును మఱియు నెట్లు ఉదానమునకు ఊర్ధ్వగమనస్వభావము గలదో, అట్లు అగ్నిరూపతేజమునకున్ను ఊర్ధ్వగమనస్వభావము గలదు. కనుక ఉదానమునకు తేజము బాహ్యరూపమై యున్నది. హే అశ్వలాయన! శరీరమందు స్థితమైన అంతఃకరణవృత్తిరూపమగు, మఱియు ఉష్ణతారూపమగు ఏ తేజము కలదో ఆ తేజము ఏ కాలమందు శమించునో ఆ కాలమందే జీవుడు ఊర్ధ్వశ్వాసరూపప్రాణవృత్తిగలవాడగును. ఆ ప్రాణము "ఆపోమయః ప్రాణః" అను శ్రుతిచే జలమయరూపముగ కథనము చేయబడియున్నను, మరణకాలమందది తేజోరూపమైన యుదానవృత్తిచే యుక్తమై జీవుని లోకాంతరమునకు తీసుకొనిపోవుచున్నది.

తాత్పర్యము — తేజములేకున్న ఉదానమునకు శరీరమందు స్థితి కానేరదు. ఈలాగువ తేజము ఉదానరూపమేయైయున్నది. మరణకాలమందేజీవుడు కర్మవశమున భావిప్రాప్తశరీరముయొక్క జ్ఞానజన్యసంస్కారముగలవాడగునో, మఱియు నే జీవుడు ఇంద్రియమనఃప్రాణములతో తాదాత్మ్యసంబంధమును పొందుచున్నాడో అటువంటి జీవునే ఆ క్రియాశక్తిగల ప్రాణము లోకాంతరమునకు తీసికొనిపోవుచున్నది

ఇపుడు అపూర్వమైన బ్రహ్మవిద్యకు ఫలము వచింపబడుచున్నది హే అశ్వలాయన! ఏ ప్రాణము పూర్వోక్తరీతిగా పరమాత్మదేవునిచే నుత్పన్నమైనదో, ఏ ప్రాణము శుభాశుభకర్మవశమున అనేకశరీరములతోటి సంబంధమును పొందుచున్నదో, ఏ ప్రాణము నాడీమొదలగు స్థానములందు నివాసముచేయుచున్నదో, ఏ ప్రాణము సర్వమునకు ప్రేరకమైయున్నదో, నేప్రాణము అధ్యాత్మాధిదైవరూపమైయున్నదో, ఆ ప్రాణమునే 'నేను' అను నీ ప్రకారముగ నెవరు ప్రాణము నభేదరూపముగ నుపాసనము చేయుచున్నారో, ఆ యధికారిపురుషులకు శిష్యప్రశిష్యపరంపరారూపవిద్యా వంశము, పుత్రపౌత్ర పరంపరారూపసంతతివంశము ఎప్పటికిని నష్టముకావు. సర్వదా స్థిరముగనే యుండును. హే అశ్వలాయన! ఆ ప్రాణోపాసకులకు కేవలవంశవృద్ధి మాత్రమే ఫలముకాదు. అంతఃకరణశుద్ధిద్వారా ఆత్మసాక్షాత్కారరూపఫలమున్ను వారికి ప్రాప్తమగును ఆ మోక్షరూపామృతమునుత్రాగి ఆ యుపాసకులు మఱల సంసారదుఃఖమును పొందరు.

ఇట పూర్వప్రసంగమందు కాత్యాయన భార్గవ అశ్వలాయనులను నీ ముప్వురు ఋషులయొక్క మూడుప్రశ్నలచే సగుణబ్రహ్మవిద్యాసంబంధవిషయము నిరూపణము చేయబడియె. ఇపుడు నిర్గుణబ్రహ్మవిద్యా సంబంధవిషయనిశ్చయము చేయుటకొఱకు చతుర్థప్రశ్నకుత్తరము నిరూపింపబడుచున్నది. హే శిష్య! ఈ ప్రకారమగు పిప్పలాదమునియొక్క సంభాషణమను శ్రవణముచేసి ఆ యాశ్వలాయనఋషి శాంతిభావమునొందినపిదప గార్గ్యఋషి చతుర్థప్రశ్న చేయుచున్నాడు:— గార్గ్యుడు — హే భగవన్! (1) ఈ శరీరమందు తమ తమ వ్యాపారముయొక్క ఉపరతిరూప శమనము నెవరు పొందుచున్నారను నీ ప్రథమప్రశ్నకు, జాగ్రదవస్థాసంబంధమగు ఆశ్రయతా నిర్ణయము ప్రయోజనమగును. ఎందుకనగా వ్యాపారమున కుపరామమై జాగ్రన్నివృత్తిరూపశమనమెవనికగునో, వానికే జాగ్రత్సంబంధ ఆశ్రయత సిద్ధించును. మఱియు హే భగవన్! (2) ఈ శరీరములోన సర్వదా తమ తమ వ్యాపారమందు స్థితులై యెవరు జాగ్రత్తును పొందుచున్నారను నీ ద్వితీయప్రశ్నకు. శరీర రక్షణము చేయువానియొక్క నిర్ణయము ప్రయోజనము. ఎందుకనగా — ఏ వస్తువు సర్వదా సావధానముగానుండునో, దానియందే రక్షకత్వము సంభ

వించును. అసావధానవస్తువందు సంభవింపదు. (3) మఱియు హే భగవన్ ! ఈ సంఘాతమందు నానాప్రకార స్వప్నములను యెవరు చూచుచున్నారను నీ తృతీయ ప్రశ్నకు స్వప్నావస్థాసంబంధమగు యాశ్రయము ప్రయోజనము. ఎందుకనగా — ఏ వస్తువు స్వప్నమందు సావధానముగనుండునో ఆ వస్తువునందే స్వప్నాశ్రయత సంభవించును. (4) హే భగవన్ ! ఈ సంఘాతమందు సుషుప్తిసుఖము నుపభోగించువాడెవరు ? ఈ చతుర్థప్రశ్నకు సుషుప్త్యవస్థాశ్రయ నిర్ణయము ప్రయోజనము. ఎందుకనగా — ఏ వస్తువు సుషుప్తి సుఖానుభవముచేయునో, ఆ వస్తువందే సుషుప్తికి ఆశ్రయత సంభవించును (5) హే భగవన్ ! సుషుప్త్యవస్థయందు ఈ సమస్తప్రాణాదులు ఏ ఆధారమందు స్థితమగుచున్నవి ? ఈ పంచమప్రశ్నకు తురీయమైన అక్షరాత్మయొక్క నిర్ణయము ప్రయోజనము.

హే శిష్య ! ఈ ప్రకారముగ నెపుడు గార్గ్యఋషిచే పిప్పలాదమునివిగూర్చి ప్రశ్నలు చేయబడినవో, అపుడా పిప్పలాదముని గార్గ్యునకు యథాక్రమముగ నాయైదు ప్రశ్నలకిట్లుత్తరములు చెప్పనారంభించెను. పిప్పలాదుడు — హే గార్గ్య ! స్వప్నావస్థయందు చక్షురాదిజ్ఞానేంద్రియములును, వాగాది కర్మేంద్రియములును, తమ స్వస్వవ్యాపారనివృత్తిరూపశమనమును ప్రాప్తమగుచున్నవి. మఱియు సుషుప్త్యవస్థయందు ఆ దశేంద్రియసహితమనస్సున్ను శమనమును పొందుచున్నది. కనుక ఇంద్రియవిశిష్ట మనస్సే జాగ్రదవస్థకు ఆశ్రయమగును.

(2) హే గార్గ్య ! సుషుప్తియందు ఇంద్రియములతోసహా మనస్సు లయమైనపుడు పంచప్రాణములు జఠరాగ్నిసహితముగ తమతమ వ్యాపారములందు జాగ్రత్తగలిగియుండును ఈ కారణమువలననే సుషుప్తియందు జీవునియుదరమున స్థితమైయున్న అన్నము పరిణామమును పొందుచున్నది. కనుక సుషుప్తియందు ప్రాణసహితజఠరాగ్నియే శరీరమునకు రక్షకమై యున్నది. (3) ఇటసుషుప్త్యవస్థాస్థిత విద్వాంసులకు అగ్నిహోత్రప్రాప్తికథనము చేయబడియె. ఎట్లు లోకప్రసిద్ధమైన అగ్నిహోత్రముగల పురుషునకు గార్హపత్యాగ్ని సర్వదా స్థిరముగనుండునో, మఱియు హోమమునకై ఆహవనీయాగ్ని గార్హపత్యమునుండి తీయబడి ప్రజ్వలితము చేయబడినదో, అట్లే ఈ ప్రసంగమునందును అంతఃప్రవేశము చేయునట్టి అపానవాయువునుండి బాహ్యగమనము చేయునట్టి ప్రాణవాయువు లేచుచున్నది ఈ ప్రకారముగల సమానతను గ్రహించియే శ్రుతిభగవతి విద్వాంసుల (జ్ఞానుల)యొక్క ప్రాణమున్ను ఆహవనీయాగ్ని రూపముగ చెప్పుచున్నది మఱియు అపానమును గార్హపత్యాగ్నిరూపముగ చెప్పుచున్నది. విద్వాంసుని వ్యానవాయువు అనవాహార్యపచనరూపమైయున్నది. (ఓదనవిశేషమునకు నామము అనవాహార్యము) ఆ యనవాహార్యరూపఓదనము

ఏ యగ్నియందు పచనమగుచున్నదో, ఆ యగ్నికి నామము అనవాహార్యపచనము. దీనినే వేదవేత్తలు దక్షిణాగ్నియనుచున్నారు వ్యానవాయువు ఆ దక్షిణాగ్నిరూపమై యున్నది. ఎందుకనగా— ఎట్లు ప్రసిద్ధాగ్నిహోత్రశాలయందు దక్షిణాగ్ని దక్షిణ కుండమందు స్థితమగునో, అట్లే వ్యానవాయువున్ను హృదయసంబంధ పంచఛిద్ర ములలో దక్షిణఛిద్రమందు స్థితమగుచున్నది. ఈ ప్రకారమగు సమానతచూచియే శ్రుతిచే వ్యానము దక్షిణాగ్ని యనబడియె. మఱియు సమానవాయువు ఆ గార్హ పత్యాద్యగ్నులందు పక్షపాతరహితమై, హోతృరూపమైయున్నది. ఎట్లు ప్రసిద్ధాగ్ని హోత్రకార్యమందు యజమానుడెపుడేదోయొక ఇతరకార్యమందు సంలగ్నుడగునో అపుడు హోత యజమానుని ప్రతినిధిరూపమగుచున్నాడో, అట్లే ఈ విద్వాంసుని ప్రాణరూపాగ్నిహోత్రమునందు ఆ సమానవాయువు హోతయై ప్రతినిధిగానున్నది. ఏలాగుననగా — సమానవాయువుచే ఉచ్ఛ్వాస నిశ్శ్వాస రూపములగు రెండు ఆహుతులకు న్యూనాధికభావరహితముగ సమానత యొనర్పబడియె. ఉదానవాయువో విద్వాంసుని ప్రాణాగ్నిహోత్రమునకు ఫలరూపమైయున్నది. ఎందుకనగా — ప్రసిద్ధాగ్నిహోత్రమందును యజమానునకు ఆ ఉదానవాయువుయొక్క ఉత్క్రమణము చేతనే స్వర్గాది ఫలప్రాప్తియగుచున్నది. మఱియు ప్రాణాగ్నిహోత్రమందు యజ మానునిమనస్సు యజమానరూపమైయున్నది. ఎట్లు ప్రసిద్ధాగ్నిహోత్రమందు ప్రసిద్ధ మైన గార్హపత్యాద్యగ్నులు యజమానునకు స్వర్గప్రాప్తి యొనర్చుచున్నవో అట్లే ప్రాణరూపాగ్నులుకూడా మనోరూప యజమానునకు సుషుప్త్యవస్థయందు హృదయ కమలమున ఆనందరూపస్వర్గప్రాప్తి నొనర్చుచున్నవి. ఈ ప్రకారముగ బ్రహ్మవేత్త యగు విద్వాంసుని అగ్నిహోత్రము సర్వదా స్థిరముగనే యున్నది.

ఇపుడు గార్గ్యుని తృతీయ చతుర్థ పంచమప్రశ్నలకుత్తరము వచింపబడు చున్నది హే గార్గ్య! ఏమనస్సు స్వప్నావస్థయందు జాగరూకమై సుషుప్త్యవస్థ యందు ప్రాణాగ్నిహోత్రమునకు యజమానరూపమైయున్నదో, ఆ మనస్సేచైతన్య ప్రతిబింబమును గ్రహణముచేసి ప్రకాశమానమై నానాప్రకార స్వప్నముల గాంచు చున్నది. ఈ కారణమువలన నా చిదాభాసయుక్తమనస్సే స్వప్నావస్థకు ఆశ్రయమై యున్నది. (4) హే గార్గ్య! ఆ మనస్సే సుషుప్తిసుఖమును పొందుచున్నది. సుషుప్తియందు ప్రపంచము స్పష్టరూపముగ ప్రతీతముగాకున్నను అది సూక్ష్మబీజ రూపముగ యెట్లు నిలుచుచున్నదో, అట్లే సుషుప్తియందు మనస్సు స్పష్టరూపముగ ప్రతీతము గాకపోయినను సూక్ష్మబీజరూపముగ నిలుచుచున్నది. అందువలన ఆ సూక్ష్మబీజరూపమున స్థితమైనమనస్సే సుషుప్తికి ఆశ్రయమైయున్నది. (5) హే గార్గ్య! ఏ చైతన్యస్వరూపాత్మ మనస్సునందు ప్రతిబింబరూపముగ స్థితమైయున్నదో,

ఆ చైతన్యాత్మయే ప్రాణాదిసర్వజగత్తునందు స్థితమైయున్నది. ఎట్లు సాయంకాలము అనేకదిశలనుంచి వచ్చినవైన అనేకపక్షులు ఏదోయొక మహావృక్షముపై స్థితమగు చున్నవో, అట్లే పృథివ్యాది పంచభూతములున్ను, తత్సంబంధ గంధాదిగుణములున్ను, చక్షురాదీంద్రియములున్ను, చతుర్విధ అంతఃకరణమున్ను, పంచవిధప్రాణమున్ను ఈ సమస్తపదార్థములు ఆ చైతన్యాత్మయందే స్థితమైయున్నవి. హే గార్గ్య! ఆ చైతన్యాత్మయందు కేవలజడప్రపంచమే స్థితముకాదు. సకలవ్యాపారవిశిష్టులైన జీవుడున్ను స్థితుడైయున్నాడు. కనుక ఆ యాత్మదేవుడే సర్వమునకాధారుడై యున్నాడు. హే గార్గ్య! ఈ ఆత్మదేవుడు చక్షురాదీంద్రియములతోచేరి దర్శనాదివ్యాపారముల గావించుచున్నాడు. కనుక ఆ యాత్మదేవుడు ద్రష్టశ్రోత ఇత్యాదిరూపములు గలవాడై జీవసంజ్ఞను పొందినవాడైనను వాస్తవముగ పరమాత్మరూపుడేయై యున్నాడు. జీవ పరమాత్మలందు కించిన్మాత్రభేదమున్ను లేదు

ఇపుడు నిర్గుణ బ్రహ్మవిద్యకు ఫలనిరూపణము గావింపబడుచున్నది. హే గార్గ్య! ఏ ఆత్మదేవుడు సర్వత్రవ్యాపకుడైనను శుద్ధమనస్సునందే విశేషముగ అభివ్యక్తుడగుచున్నాడో, ఏ యాత్మదేవుడు సకలజగత్తునకు అధిష్ఠానరూపమైయున్నాడో, మఱియు శరీరత్రయరహితుడైయున్నాడో, ఏ ఆత్మదేవుడు స్వప్రకాశానందస్వరూపుడైయున్నాడో, అటువంటి ఆ యాత్మదేవుని ఏ అధికారిపురుషులు బ్రహ్మవేత్తయగు గురూపదేశమున సాక్షాత్కరించుకొనుచున్నారో, ఆ యధికారిపురుషులు సర్వజగత్తును సామాన్యరూపముగాను, విశేషరూపముగాను సాక్షాత్కరించుకొనుచున్నారు మఱియు సంసారసంబంధ జన్మమరణాదిసకలతాపములనుండి ముక్తులగుచున్నారు. హే గార్గ్య! ఆ యక్షరపరమాత్మదేవుని ఏ యధికారిపురుషులు తన ఆత్మరూపముగ సాక్షాత్కరించుకొనుచున్నారో, ఆ యధికారిపురుషులు సర్వజ్ఞులై బ్రహ్మభావరూప పరమపదమును పొందుచున్నారు.

ఇపుడు ఒకసారిగావించిన ఉపదేశముచే అక్షరాత్మనెఱుగుటకు అశక్తులైన యధికారులకుగాను ప్రణవోపాసన వచింపబడుచున్నది.

హే శిష్య! ఈ ప్రకారముగల యుత్తరముచే గార్గ్యఋషి తూష్ణీభావము నొందిన పిదప సత్యకామర్షి ఇట్లు ప్రశ్నచేయ నారంభించెను. — హే భగవన్! ఏ

యధికారి ఆమరణముగ ఓంకారరూప ప్రణవముయొక్క ధ్యానముచేయునో ఆ యధికారి భూమ్యాదిలోకములందేలోకమును పొందుచున్నాడో, కృపతో తెలుపవలెను. పిప్పలాదుడు, హే సత్యకామ! ఏ వర్ణమును వేదవేత్తలు (అ ఉ మ్ అర్ధమాత్రావర్ణస్వరూప) ఓంకారనామముచే కథనము చేయుచున్నారో, ఆ ఓంకారము అక్షరస్వరూప పరబ్రహ్మముయొక్క నామమై యున్నది. మఱియు ప్రాణస్వరూపమైన అపరబ్రహ్మముయొక్కయు నామమైయున్నది కాన ఓంకారము పరబ్రహ్మముతోడను, అపరబ్రహ్మముతోడను అభిన్నముగానున్నది. ఎందుకనగా – వాచ్యార్థమునకును, వాచకనామమునకును వేదవేత్తలచే నభేదమే కథనము చేయబడియె. అథవా దేవతాప్రతిమవలె ఓంకారము ఆ పరాపరబ్రహ్మములకు ప్రతీకరూపమైయున్నది. ఈ కారణమువలన నాయోంకారము పరాపరబ్రహ్మల కభిన్నమైయున్నది. హే సత్యకామ! ఏ యధికారులు ఈ ఓంకారరూపప్రణవమును పరాపరబ్రహ్మరూపముగ చింతనముచేయుదురో, ఆ యధికారులు తద్ధ్యానభావముచే పరాపరబ్రహ్మమునే పొందుదురు. హే సత్యకామ! ఆ ఫలభేదమందు కేవలము మనుజుల కామనాభేదమే కారణము కాదు. ప్రణవసంబంధమాత్రలయొక్క భేదమున్ను ఫలభేదమందు కారణమైయున్నది. ఏలాగుననగా — ఆ ప్రణవమంత్రమందు అకార, ఉకార, మకార, అర్ధమాత్రలను మూడున్నర మాత్రలుగలవు. ఏ పురుషులు ప్రథమ అకారమాత్రను ఋగ్వేదరూపముగ చింతనముచేయుదురో, ఆ పురుషులకు ఋగ్వేదాభిమానిదేవత ఈ భూలోకప్రాప్తి గావించుచున్నది. ఏ పురుషులు అకార ఉకారములను నీ రెండుమాత్రలను యజుర్వేద రూపముగ చింతనముచేయుదురో ఆ పురుషులకు యజుర్వేదాభిమానిదేవత స్వర్గలోకప్రాప్తి యొనర్చుచున్నది. ఏ పురుషులు అకార ఉకార మకారములను నీమూడు మాత్రలను సామవేదరూపముగ చింతనముచేయుదురో ఆ పురుషులకు సామవేదాభిమానిదేవత బ్రహ్మలోకప్రాప్తి యొనర్చుచున్నది. ఆ బ్రహ్మలోకమును పొందిన యుపాసకులు మఱల భూలోకమునకు రారు. ఈ కారణమువలన ముముక్షువులు మూడుమాత్రలను ధ్యానముచేయవలసినది. హే సత్యకామ! యెట్లు మూడు మాత్రలకు వేఱువేఱైనఫలములు చెప్పబడినవో అట్లే యే పురుషులు అర్ధమాత్రప్రధాన ప్రణవమును చింతనచేయుదురో వారు అద్వితీయబ్రహ్మభావమును పొందుదురు. ఈ ప్రకారముగ నధికారిపురుషులకు ఆ యోంకారరూప ప్రణవమంత్రముచేతనే సకలభోగపదార్థములును, మోక్షమును ప్రాప్తములగుచున్నవి. కనుక ఈ ప్రణవ

మంత్రము సకలమంత్రములకన్న శ్రేష్ఠముగనున్నది. ఇంతవరకు వచించినదానిచే పంచమప్రశ్నకుత్తరము గావింపబడినది.

చతుర్థప్రశ్నయందు కథనముచేయబడిన అక్షరబ్రహ్మమునందు ప్రత్యగ్రూపతను నిశ్చయము చేయుటకొఱకు షష్ఠప్రశ్నకుత్తరము వచింపబడుచున్నది హే శిష్య ! పిప్పలాదమునిచే చెప్పబడిన యుత్తరముచే సత్యకామఋషి తూష్ణీభావమును పొందిన పిదప సుకేశభారద్వాజఋషి ప్రశ్నచేయ నారంభించెను. — హే భగవన్ ! వేదవేత్తలచే షోడశకళలుగల యే పురుషుడు కథనము చేయబడెనో ఆ పురుషుని నిర్ణయముకొఱకు నేననేక మారులు విచారము చేయుచున్నాను ఐనను వానిస్వరూపమును నేనింతవఱకు నిశ్చయము చేయలేదు. హే భగవన్ ! పూర్వము యేదోయొక కాలమందు కోసలదేశాధిపతియగు హిరణ్యనాభుడనురాజు నా సమీపమునకువచ్చి బహువినయపూర్వకముగ ఆ షోడశకళాత్మకపురుషుని స్వరూపమునుగూర్చి నన్నడిగెను. రాజుయొక్క ఆ ప్రశ్నవిని వానితో నేనిట్లంటిని. హే రాజన్ ! ఆ షోడశకళాత్మక పురుషుని నేనెఱుగను, లోకమందు మోహమునకువశుడై ఏ పురుషుడు మిథ్యావచన మొనర్చుచున్నాడో, ఆ మిథ్యావాది పురుషరూపవృక్షము ఉభయలోక సంబంధ సుఖరూప ఫలమును పొందక భోగ్యరూప మూలసహితముగ నాశమును పొందుచున్నది. ఈ ప్రకారముగ మిథ్యావచనము మహాదుఃఖకారకమనియెఱిగి నేను స్వప్నమందైనను మిథ్యావచనము గావించులేదు. ఇక జాగ్రత్తనందెట్లొనర్చెదను ? కనుక ఈ సుకేశఋషి తానెఱిగియు నాకు షోడశకళాత్మక పురుషునిగూర్చి చెప్పలేదను సంశయము నీవు నీమనస్సున యెన్నటికిని గావింపకుమను నీ ప్రకారమగు నా వచనమువిని ఆ హిరణ్యనాభరాజు తూష్ణీభావమునుపొంది తనదేశమునకు వెడలెను. ఆ దినము మొదలుకొని ఆ షోడశకళాత్మక పురుషుని యెఱుగుటకై నా చిత్తమందు ఉత్కట జిజ్ఞాస కలిగినది. కాన దయచేసి తామాషోడశకళాత్మకపురుషుని నాకు చెప్పుడు.

హే శిష్య ! ఈ ప్రకారమగు సుకేశఋషియొక్క ప్రార్థనమువిని పిప్పలాదముని యిట్లు వచించెను. — హే సుకేశ ! ఏ షోడశకళాత్మక పురుషునిగూర్చి నీవడుగుచున్నావో ఆ పురుషుడు దూరముగలేడు. నీ శరీరమందే ప్రత్యగాత్మరూపమున స్థితమై యున్నాడు. ఆ షోడశకళాత్మక పురుషుడు జగద్రూపషోడశకళలకు అధిష్ఠానమగుట వలన సర్వజగత్తునకు నియంతగా ఉన్నాడు. హే సుకేశ ! ఏ పరమాత్మదేవుడు ప్రత్యగ్రూపమున శరీరమునందు స్థితుడైయున్నాడో ఆ పరమాత్మదేవుడే జగదుత్పత్తికి పూర్వము జరాయుచర్మమువలె బంధించునట్టి ఉపాధిపుట్టుటకొఱకిట్లు విచార

మొనర్చెను. పరమాత్మదేవుడనగు నేను ఈ శరీరమందు స్థితమైయుండియు సర్వత్ర వ్యాపకముగా నున్నాను. మఱియు క్రియారహితముగా నున్నాను ఇటువంటి పరమాత్మదేవుడనగునేను, ఉత్క్రమణ గమనాగమనాది గుణములుగల సంసారమును ఏ యుపాయముచే ఏ యుపాధిచే పొందగలను? అను నీ ప్రకారమగు విచారముచేసి, ఆ పరమాత్మదేవుడు మొదట పంచప్రాణరూప ప్రథమకళను సృజించెను. అనంతరము శ్రద్ధారూప ద్వితీయకళను సృజించెను (శుభకర్మప్రవృత్తియందు ఆస్తికబుద్ధి ఇచ్చుట శ్రద్ధయనిపేరు.) అనంతరమా పరమాత్మదేవుడు ఆకాశాది పంచభూతరూప పంచమకళను, పిదప పంచజ్ఞానేంద్రియ పంచకర్మేంద్రియరూప అష్టమకళను, ఆ తర్వాత మనోరూప నవమరూపకళను పుట్టించుచున్నారు. తదుపరి అన్నరూప దశమకళను, తర్వాత వీర్యరూప యేకాదశకళను పిదప తపోరూప ద్వాదశకళను. మంత్రరూప త్రయోదశకళను, (వేదాధ్యయనమునకు నామము మంత్రము) లౌకిక వైదిక కర్మరూప చతుర్దశకళలను సృష్టించెను, (ఇట మంత్రశబ్దముచే వేదాధ్యయనమందు లక్షణ గావింపబడినది. దానికి కారణము మంత్రరూపములగు బ్రాహ్మణ భాగవేదములు. అవి సాక్షాత్ప్రాణముచేతనే ప్రకటితమైనవి.

శ్రుతి॥ "అస్య మహతో భూతస్య నిఃశ్వసితమేతద్యదృగ్వేదోయజుర్వేదః,
సామవేదోఽథర్వాంగిరస ఇతి."

భావార్థము:— ఋగాది నాల్గువేదములు ఈ మహాభూతరూప పరమాత్మ దేవునియొక్క శ్వాసరూపములై యున్నవి. ఈ శ్రుతిచే సాక్షాత్ ప్రాణమునుండి, వేదముల ప్రకటత్వము కథనము చేయబడెను. కనుక సామర్థ్యరూప వీర్యమునుండి వేదోత్పత్తి కాలేదు. ఐనను అన్నాదికారణములుగల సామర్థ్యరూప వీర్యమేదికలదో, మఱియు తపమేదికలదో, ఆ వీర్యముచేతను తపముచేతను, ఆ వేదము అధ్యయనాది రూప విస్తారమును పొందుచున్నది. ఈలాగున ఆ వేదము అధ్యయనముద్వారానే ప్రకటితమగుచున్నది సాక్షాత్తుగా ప్రకటితముకాలేదు. కాబట్టి మంత్రపదమునకు వేదాధ్యయనమునందు లక్షణయోగ్యమైయున్నది.) మఱియు కర్మానంతరమా పరమాత్మదేవుడు లోకమను పంచదశకళను సృజించెను. (కర్మమునకు ఏ సుఖదుఃఖాది రూపఫలము కలదో దానికి నామము లోకము) ఆ పిదప నామరూపములను షోడశ కళలను జనింపజేసెను. (ఇట శరీరావచ్ఛిన్నచైతన్యమునకు దేవదత్తయజ్ఞదత్తాది యే సాంకేతికశబ్దములుకలవో, ఆ శబ్దములు నామమనబడినవి. ఈ కారణమువలన శ్రుతి భగవతి ఆ నామమును అనంతనామముచే కథనము చేయుచున్నది.)

శ్రుతి॥ "స ప్రాణమసృజత, ప్రాణాచ్ఛ్రద్ధాం, ఖంవాయుర్జ్యోతిరాపః పృథ్వీంద్రియం, మనోఽన్నమన్నాద్వీర్యం తపో మంత్రాః, కర్మ లోకా లోకేషుచ నామచ."

హే సుకేశ! ఎవనికి ఆత్మసాక్షాత్కారమైనదో, అట్టి ముక్తపురుషుల దృష్టియందు, ఈ ప్రాణాదిషోడశకళలు తమ అధిష్ఠానమైన నిర్గుణచైతన్యముయొక్క సమీపమునకుపోగా, తమ నామరూపములను పరిత్యజించుచున్నవి. శ్రీగంగా యమునాది నదులు సముద్రమును పొందనంతవఱకు తమతమభిన్నభిన్న నామరూపములను ధారణము చేయుచున్నవి. కాని సముద్రమును పొందునపుడు తమతమ నామములను, రూపములను పరిత్యాగముచేసి, ఆ సముద్రుని నామరూపములను ధరించుచున్నవి. అట్లే ప్రాణాదిషోడశకళలు యెపుడు ముక్తుడగు నిర్గుణపురుషుని పొందుచున్నవో, అపుడు తమతమ భిన్ననామరూపములను పరిత్యజించి నిర్గుణ బ్రహ్మముయొక్క నామరూపములను ధరించుచున్నవి.

హే సుకేశ! ఏ పురుషునియందు షోడశకళలు లయభావమును పొందుచున్నవో, ఆ పురుషుడు వాస్తవముగ నామరూపరహితుడై, నిరవయవుడై, ఆనంద స్వరూపుడై, స్వయంజ్యోతిరూపుడై, అమృతస్వరూపుడై యుండును. మఱియు యెట్లు రథచక్రముయొక్క నాభియందు అరములు స్థితమగుచున్నవో, అట్లే ఆతనియందు ఈ షోడశకళలు స్థితమగుచున్నవి. ఇటువంటి యే పురుషులు పరమాత్మదేవుని తమ ఆత్మరూపముగ సాక్షాత్కరించుకొనుచున్నారో, వారికి శరీరనాశానంతరము మఱల ప్రమాదరూపమృత్యువునుండి భయమెప్పటికిని ప్రాప్తింపనేరదు. హే శిష్య! ఈ ప్రకారముగ ఆ పిప్పలాదముని సుకేశఋషికి ఆత్మోపదేశముచేసి మఱల సర్వఋషుల గూర్చి ఈ ప్రకారముగ పలికెను:—

పిప్పలాదుడు:— ఓ బ్రాహ్మణులారా! ఈ ఏ అద్వితీయ బ్రహ్మస్వరూపమును నేను మీకు కథనము చేసితినో, ఇంతమాత్రమే నే నెఱుగుదును. దీనికన్న వేఱగు యే వస్తువును నేనెఱుగను. అభిప్రాయము — బ్రహ్మముయొక్క వాస్తవ స్వరూపమేది నేను మీకుపదేశించితినో, దానికన్నవేరైన యే వస్తువున్ను ఉపదేశింప యోగ్యముకాదు, నేనుపదేశించిన అద్వితీయబ్రహ్మమునే మీరందఱును ఆత్మరూపముగ నిశ్చయము చేయుడు. హే శిష్య! ఈ ప్రకారముగ నెపుడు పిప్పలాదమునిచే

నాషడృషులకు బ్రహ్మవిద్యోపదేశము చేయబడెనో, అపుడా సర్వఋషులు పిప్పలాద మునిని దేవతనువలె అర్చనము, పూజనముచేసి ఇట్లనిరి. హే భగవన్! తాము కృపజేసి మాయందఱియొక్క సంశయములను ఛేదనము చేసితిరి, మఱియు మాకు మాయకంటె పరమైన నిర్గుణబ్రహ్మయొక్క సాక్షాత్కారమును మాచే చేయించి మమ్ముల కృతార్థుల గావించితిరి.

హే భగవన్! తమ ఉపదేశముచే బ్రాహ్మభావమును పొందినవారైన మేమందఱము తమకు బ్రహ్మవిద్రూపముచే జనించితిమి. ఏలాగుననగా — 'బ్రహ్మజానాతి బ్రాహ్మణః'' ఇత్యాది శ్రుతులందు బ్రహ్మవిద్యాప్రాప్తిచేతనే బ్రాహ్మణభావప్రాప్తి చెప్పబడియె కాబట్టి మాకు తామే పితగాను, తామే మాతగానున్నారు. తమకన్న వేరైన మఱియొక మాతాపితరులులేరు. ఎందుకనగా — లోకప్రసిద్ధమైన యే మాతాపితరులుగలరో వారు శరీరరూప మిథ్యాత్మయొక్క యుత్పత్తిచేయువారే అగుదురు. ఈ శరీరసంబంధముచే మాకు అనేక ప్రకారముగ దుఃఖప్రాప్తియగుచున్నది. ఈ విషయము భగవంతుడైన మనువుచేతను చెప్పబడియె.

''ఉత్పాదకబ్రహ్మదాత్రోర్గరీయాన్ బ్రహ్మణఃపితా,
బ్రహ్మ జానీహి విప్రస్యప్రేత్యచేహ చ శాశ్వతం''

భావార్థము — ఈ స్థూలశరీరమునుత్పత్తిచేయువారైన యే పితగలడో, మఱియు బ్రహ్మభావమును ప్రాప్తింపజేయువారైన యే గురువుగలడో వారిరువురియందు బ్రహ్మభావమొసంగిన గురురూపపితయే శ్రేష్ఠుడగును. ఎందుకనగా — అధికారికి ఆ బ్రహ్మోపదేష్టయగు గురువుచే నే బ్రహ్మవిద్రూపజన్మమైనదో, ఆ బ్రహ్మవిజ్జన్మము జీవితావస్థయందును మరణానంతరమును, సర్వకాలములందును నిత్యమైయున్నది. ఆ బ్రహ్మవిజ్జన్మమునకు యెప్పటికిని నాశము కలుగదు. ఈ విషయము అన్యశాస్త్రములందును చెప్పబడియె

''శరీరమేతౌ కురుతః పితామాతా చ భారత!
ఆచార్యదత్తా యా జాతిః సా నిత్యా సాఽజరాఽమరా.''

భావార్థము — హే భారత! లోకప్రసిద్ధమైన మాతాపితరులేశరీరమును పుట్టించుచున్నారో, ఆ శరీరము జరామరణములచే యుక్తమైయున్నది. బ్రహ్మవేత్త

యైన గురువు అధికారులకే బ్రహ్మవిద్రూపజ్ఞాతిని ప్రాప్తింపజేయుచున్నాడో, ఆ బ్రహ్మవిజ్ఞాతి నిత్యముగాను, అజరామరముగా నున్నది. కాబట్టి బ్రహ్మవిద్యోపదేశము చేయువాడైన గురువు ప్రసిద్ధమాతాపితరులకన్న అత్యంతశ్రేష్ఠుడుగా నున్నాడు.

హే భగవన్! కామక్రోధాదిమకరములచే యుక్తమైన యే అవిద్యారూప సముద్రముగలదో, ఆ అవిద్యారూపసముద్రమునుండి బ్రహ్మవిద్యారూపమహానౌకచే మమ్ముల దాటించితిరి. తమచే చేయబడిన ఈ మహోపకారమును తీర్చుటకుత్రైలోక్య మందేయొక పదార్థమున్ను మాకు కనబడుటలేదు. కాబట్టి బ్రహ్మవేత్తయగు గురువైన తమయొక్క ప్రసన్నతకొఱకు మేము సర్వదా నమస్కారము చేయుచున్నాము. మా నమస్కారమును మాత్రము నంగీకరించి తాము ప్రసన్నులుకండు. ఇట్లని సమస్త ఋషులు అనేకనమస్కారములు చేసిరి. ఈ ప్రకారము ఆ షతృషులయొక్క శ్రద్ధా భక్తులచూచి పిప్పలాదమునీశ్వరుడు పరమప్రసన్నుడై వారలకు ఆశీర్వాదపూర్వకముగ పోయివచ్చుటకై ఆజ్ఞ చేసెను. తానున్ను తన స్వస్థానమునకేగెను.

హే శిష్య! మోక్షప్రాప్తిచేయించదగిన ఏ ఆత్మజ్ఞానముకలదో, ఆ యాత్మజ్ఞానమును మహానుభావుడైన బ్రహ్మవేత్తయగు గురువుచే నుపదేశింపబడినను కూడ శుద్ధచిత్తముగల అధికారికి నది ప్రాప్తమగుచున్నదేకాని అశుద్ధచిత్తులకు ప్రాప్తము కానేరదు. చిత్తమునకు శుద్ధియో ఉపాసనచే ప్రాప్తమగుచున్నది. ఉపాసనలేకున్న చిత్తశుద్ధి కానేరదు. ఎట్లనగా — పూర్వము నృసింహభగవంతునియొక్క ఉపాసనచే శుద్ధచిత్తముగలవారైన దేవతలు ప్రజాపతియొక్క గురూపదేశముచే బ్రహ్మజ్ఞానమును పొందియుండిరి.

హే శిష్య! ఈ సప్తదశాధ్యాయారంభమునందు పిప్పలాదమునిచే చెప్పబడిన ఏ బ్రహ్మవిద్యనుగూర్చి నీవడిగితివో, ఆ బ్రహ్మవిద్యను సంపూర్ణముగ నేను నీకు కథనము చేసితిని. ఇక ఇపుడేవిషయమును శ్రవణముచేయుటకై నీవిచ్ఛగించుచున్నావో వచింపుము, దానిని నేను చెప్పెదను

ఇతి శ్రీమదాత్మపురాణే సప్తదశోఽధ్యాయః
సంపూర్ణః

శ్రీ

ఆత్మ పురాణము

అథ అష్టాదశాధ్యాయారంభః

అష్టాదశాధ్యాయము

శ్రద్ధావంతుడైన శిష్యుడు శ్రీ గురువునుగూర్చి యిట్లు ప్రార్థనచేయుచున్నాడు — హే భగవన్! సప్తదశాధ్యాయాంతమందు శ్రీ నృసింహభగవంతుని ఉపాసనచే శుద్ధ చిత్తము గలవారైన దేవతలు, ప్రజాపతిబ్రహ్మయొక్క యుపదేశముచే బ్రహ్మాత్మ జ్ఞానమును పొందిరని తాము తెలవిచ్చిరి ఓ భగవంతుడా! ఆ బ్రహ్మాత్మజ్ఞానమును శ్రవణముచేయుటకై నేను కోరుచున్నాను. దయచేసి తామా బ్రహ్మాత్మజ్ఞానమును నాకుపదేశము చేయుడు ఈ ప్రకారము సచ్ఛిష్యునిచే ప్రార్థింపబడిన యా గురువు అథర్వణవేదమందలి నృసింహభగవంతుని విషయము నాతనికి కథనము చేయ నారంభించెను.

శ్రీ గురువు — హే శిష్య! పూర్వము నేను నృసింహభగవంతుని యుపాసకులైన ఏ దేవతలగూర్చి కథనము గావించితినో, వారు చక్షురాదులకు అధిష్ఠాతలైన సూర్యాది దేవతలేయని యెఱుగుము. ఇపుడు నృసింహభగవంతుని స్వరూపమును గూర్చి వినుము — హే శిష్య! ఎవరు మనుష్యరూపుడును, సింహరూపుడునగునో, వానికి నృసింహుడని నామము. ఇటువంటి నృసింహభగవంతునే అధికారులుపాసన చేయుటకు యోగ్యమగును. ఆ నృసింహభగవంతుడు క్రోధవంతుడై సర్వప్రాణుల సంహారము చేయుటవలన రుద్రరూపముగాను, సర్వజగత్తును పుట్టించుటవలన బ్రహ్మరూపముగాను, సకల జగత్తును పాలనజేయుటవలన విష్ణురూపముగానున్నాడు.

శ్రుతి॥ "స బ్రహ్మ స శివః స హరిః"

మఱియు అథర్వశిరనామోపనిషద్గ్రంథమందు కథనము చేయబడిన యే రుద్ర భగవంతుడుగలడో, ఆ రుద్రభగవంతుడున్ను ఈ నృసింహభగవంతుని స్వరూపమే యగును. ఆ రుద్రభగవంతుడు శరణాగతజీవుల పాలనజేయువాడుగను, కైలాసరూప స్వర్గమును అథవా సత్వవృత్తి రూపస్వర్గమును పొందిన సర్వదేవతలకు గురురూపుడుగ నున్నాడు. అతడు తన దేవతలకు తన సర్వవ్యాపకస్వరూపమునుపదేశించి తన ప్రత్యగ్భావమును దెల్పి వారు చూచుచుండగనే అంతర్ధానమొందెను. ఏ యుమాపతి

భగవంతునకు బ్రహ్మవిష్ణ్వాదిదేవతలు విభూతిరూపమై యుందురో, ఆ యుమాపతి యగు రుద్రభగవంతుని ఆత్మరూపముగ జూచి ప్రపన్నమనస్కులై ఆ సర్వదేవతలు సర్వలోకులపై అనుగ్రహము చేయుటకొఱకు తమ సమీపస్థితులైన యధికారిజనుల గూర్చి యిట్లనిరి:—

ఓ అధికారి జనులారా! దేవతలమగు మేము ఉమాదేవీసహిత మహాదేవ రూపామృతమును మా నేత్రరూపపాత్రముచే పానము చేయుచున్నాము. కనుక మేము మహాభాగ్యవంతులముగా ఉన్నాము. మరణరహితులమై అమరులముగా నున్నాము. మఱియు మేము శ్రద్ధాభక్తి పూర్వకముగా రుద్రభగవంతుని ఆరాధన చేయుచున్నాము. ఈ కారణమువలననే మేము ఆ పరంజ్యోతియగు ఆనందస్వరూపాద్వితీయభగవంతుని ఆత్మరూపముగ పొందుచున్నాము ఆ రుద్రభగవంతుని ప్రాప్తిచే మేము జన్మమరణాది సకలదుఃఖరహితులమైనాము. కాబట్టి మేమిపుడు మా ఇంద్రాదిదేవతాస్వరూపమును ఆత్మరూపముగ నెప్పటికిని యెఱుగము. ఆ యుమాపతి రుద్రభగవంతునే మా యాత్మగా నెఱుగుదుము. అథవా — కామదేవుని చంపినవాడైన యుమాపతియగు రుద్రభగవంతుని ఆత్మరూపముగ నెఱుగుటవలన మాకా కామరూపశత్రువు మఱియు క్రోధరూపశత్రువు, కించిన్మాత్రముకూడ అనర్థప్రాప్తిచేయుట కశక్తులగుదురు. ఎట్లు లోకమందు కపటియైనజూదరి తాను కొంచము ధనమును మధ్యమందుంచి లోకుల యొక్క సకలధనమును హరణము చేయుచున్నాడో, అట్లే ఈ కామరూపజూదరియు అత్యంత తుచ్ఛమగు నారీశరీరముచూపి లోకులయొక్క ధర్మాదిరూప సర్వధనమును హరణము చేయుచున్నాడు. అథవా — సర్వదేవతల ఆత్మరూపుడైన యే రుద్రభగవంతుడుగలడో, ఆ భగవంతుడు దేవతలమైన మా హృదయదేశమందు సర్వదా నివాసము చేయుచున్నాడు. అందువలన సర్వదేవతలును మా హృదయమందు నివాసము చేయుచున్నారు. మఱియు ఆ రుద్రభగవంతుడు మా ప్రాణాపానముల మధ్యమందు స్థితుడై ఆ ప్రాణాపానములను తమ తమ కార్యములందు ప్రవృత్తము చేయుచున్నాడు. స్థూలసూక్ష్మ కారణములను నీ మూడు వాచ్యార్థములతో తాదాత్మ్య భావమును పొందినవాడైన ఓంకారరూప ప్రణవముకన్నను యావల తురీయరూపుడైన రుద్రభగవంతుడు వర్తించుచున్నాడు. మఱియు మనఃప్రధానమైన ప్రాణేంద్రియాది సముదాయరూప లింగశరీరమునున్ను ఆ రుద్రభగవంతుడు సాక్షిరూపమున ప్రకాశము చేయుచున్నాడు. ఎటుల ప్రసిద్ధమైన పటము నానా చిత్రముల కాధారమగుచున్నదో అట్లే సూక్ష్మమైన లింగశరీరరూప పటమున్ను స్థూలజగద్రూప చిత్రములకు ఆధారమై యున్నది. ఆ లింగశరీరమందు క్షుధా తృష్ణా కామక్రోధాది సూక్ష్మరూపములగు

అనేకకోటి వాసనలు గలవు ఇటువంటి లింగశరీరమునున్ను ఆ రుద్రభగవంతుడే ప్రకాశము చేయుచున్నాడు. ఆ రుద్రభగవంతుని అష్టాదశనామములు — (1) ఓంకారము, (2) ప్రణవము (3) సర్వవ్యాపి, (4) అనంతము, (5) తారకము (6) సూక్ష్మము (7) శుక్లము (8) వైద్యుతుడు, (9) పరబ్రహ్మము, (10) ఏకము (11) ఏకోరుద్రుడు, (12) ఈశానుడు, (13) భగవానుడు, (14) మహేశ్వరుడు, (15) మహాదేవుడు, (16) విష్ణువు (17) బ్రహ్మ, (18) ప్రజాపతి. ఈ యష్టాదశ నామముల కర్థము — (1) ఉచ్చారణ చేయబడిన రుద్రరూప ప్రణవము లోకుల ప్రాణమునకు శరీరరూప ఊర్ధ్వస్థానమొసంగుటవలన అథవా — ఉత్కృష్టలోక ప్రాప్తిచేయుటవలన ఆ రుద్రభగవంతుడోంకార మనబడెను. (2) ఆ రుద్రభగవంతుడు బ్రాహ్మణాది భక్తజనులకు ఋగాదిచతుర్వేదరూప శబ్దబ్రహ్మమును ప్రాప్తింపజేయుట వలన అథవా — భూలోకమునుండి బ్రహ్మలోకపర్యంతము సర్వలోకములందు విద్యమానములైన నానాప్రకార ఆనందముల ప్రాప్తింపజేయుటవలన అథవా భక్త జనుల దుఃఖపాపాది వికారముల లయమునకు హేతువగుటవలన ప్రణవమనబడెను. (3) ఎట్లు పిండిచేయబడిన తిలపిండమును అథవా ఘనీభావముగల దధి పిండమును తైలఘృతాదులు తమ స్వరూపముగా నొనర్చి అంతర్బాహ్యముల వ్యాప్తమొనర్చు చున్నవో అట్లే రుద్రభగవంతుడును తన అస్తి భాతి ప్రియరూపముచే జగత్తునందంత ర్బాహ్యముల వ్యాపకమై యుండుటవలన సర్వవ్యాపి యనబడెను. (4) దేశకాలవస్తు పరిచ్ఛేదరహితుడై అధికారిపురుషులకు హృదయదేశమందు ప్రతీతమగుటవలన ఆ రుద్రభగవంతుడు అనంతమనబడెను (5) రుద్రభగవంతుడు భక్తజనులను సంసార సముద్రమునుండి దాటించి ఆవల జేర్చుటవలన తారకమనబడెను. (6) సర్వశరీరము అందు అత్యంతసూక్ష్మమైనట్టి జీవరూపముగ స్థితుడగుటవలన సూక్ష్మమనబడెను. అథవా — పరకాయప్రవేశముచేయు యోగియొక్క తత్ప్రవేశమునకు కారణమైన ప్రాణము, ఆ పరశరీరసంబంధ నాడ్యాదిసూక్ష్మాంగములందు ప్రవేశము చేయు చున్నది గాన సూక్ష్మమగును. ప్రాణముకన్నను రుద్రభగవంతుడు సూక్ష్మముగాన యాతడు సూక్ష్మమనబడెను (7) రుద్రభగవంతుడు తన భక్తజనులయొక్క అవిద్యాది పంచక్లేశముల నివృత్తిచేయుటవలన శుక్లమనబడెను. (8) నిర్గుణసాక్షిరూపముచే ఈ సంఘాతమునకు అంతరప్రకాశమై మఱియు సగుణసూర్యాదిరూపములచే బాహ్యప్రకాశము చేయుటవలన వైద్యుతుడనబడెను. (9) రుద్రభగవంతుడు ఆకాశాది జగత్తుకన్నను మహత్తరుడై తనసత్తాస్ఫూర్తిచే సర్వజగత్తుయొక్కయు వృద్ధికి కారణ మగుటవలన పరబ్రహ్మమనబడెను. (10) జగత్కారణమైన రుద్రభగవంతుడు అజ్ఞాన వశముచే కల్పితభేదముగలవాడై అనేకరూపముగ ప్రతీతమైనను వాస్తవముగ

భేదరహితుడగుటవలన ఏకమనబడెను. (11) సర్వభేదరహితాద్వితీయరూపముగలవారై తన మాయాశక్తిచే సర్వజగత్తును పాలనము చేయుటవలనను. భక్తజనులకు తురీయపదప్రాప్తిజేయించి సర్వదుఃఖనివృత్తి గావించుటవలనను ఏకోరుద్రుడనబడెను. (12) పటము ఒక్కొక్కసారి సంకోచవికాసముల పొందునట్లు రుద్రభగవంతుడున్ను ప్రళయకాలమందు సంకోచరూపమై ఉత్పత్తికాలమందు వికాసరూపమై జగత్పాలకుడై, జీవులబుద్ధికి కారకుడై రాగద్వేషాదిబుద్ధిధర్మములచే రహితుడగుటవలన ఈశాను డనబడెను.

తాత్పర్యము — జగత్తునకు అభిన్ననిమిత్తోపాదానమగుటవలనను, విషమతాది దోషరహితమగుటవలనను రుద్రభగవంతుని విషయమున ఈశానశబ్దమునకు ముఖ్యార్థమైయున్నది. మఱియు "అనీశయా శోచతి ముఖ్యమానః" అను శ్రుతియందు జీవులు పరతంత్రులని చెప్పబడియె కనుక జీవుల విషయమున ఈశానశబ్దమునకు గౌణార్థమైయున్నది. ఆ రుద్రభగవంతుడే సర్వజగత్తును తమ తమ కార్యములందు ప్రవృత్తము చేయుటవలన వేదవేత్తలాతని నిట్లుస్తుతి చేయుచున్నారు ఈ రుద్రభగవంతుడు అసురులతో యొనర్చు యుద్ధప్రసంగమందు అనేక గుణములచే యుక్తుడగుటవలన మహాశూరవీరుడుగానున్నారు అథవా — ఆ రుద్రభగవంతుడు ఆత్మసాక్షాత్కార బలమున కామక్రోధాది అంతశ్శత్రువులను భక్షణచేయుటవలనను మహాశూరవీరుడుగానున్నారు. కామరూప శత్రువుయొక్క దేహమును దహించుటవలనను ఆ రుద్రభగవంతుని స్మరాంతక నామముచే కథనము చేయుచున్నారు వేదవేత్తలాతని నిట్లు స్తుతింతురు. ఓ రుద్రభగవంతుడా! అధికారిజనులమగు మేము స్తుతిరూపవచనములచే నీయారాధనము చేయుచున్నాము. నీవు సర్వజీవుల హృదయకమలమందు సర్వదానివాసము చేయువాడవుగానున్నావు. స్తుతియే నీయొక్క ప్రీతికి హేతువై యున్నది. ఓ రుద్రభగవంతుడా! ఘటమువలె విశాలమైన పొదుగుగలదియు, నూతనముగ ప్రసవించినదియు, పితుకబడని దుగ్ధముగలదియునగు గోవు హుంకారరూప స్నేహశబ్దముచే తన వత్సము నెట్లు పిలుచుచున్నదో, అట్లే పరమానందరూప దుగ్ధముచే యుక్తమగు నీస్తుతిరూప గోవు యేదిగలదో ఆ గోవు ఆనందరూప దుగ్ధమిచ్చుటకై వత్సలమైన మమ్ము ప్రేమతో పిలుచుచున్నది. అట్టి మాయొక్క ప్రయత్నమును నుపేక్షచేయకుడు. ఈ ప్రకారమగు నీయొక్క స్తుతిరూపమగు గోవు వత్సములైన మాయొక్క సర్వదుఃఖమును నాశము చేయునట్టిదిగానున్నది. ఈ ప్రకారముగ వేదవేత్తలు ఈశానుడను రుద్రభగవంతుని సర్వదా స్తుతి చేయుదురు. (13) ఈ రుద్రభగవంతుడు సంపూర్ణ, సమస్తైశ్వర్యము, ధర్మము, యశము, శ్రీ, జ్ఞానము వైరాగ్యము యీ షడ్గుణములకు ఆశ్రయుడగుటవలన భగవంతుడనబడెను.

(14) లోకమందెందరు రాజులుగలరో వారు కించిద్దేశమందు స్థితులైన ప్రాణులకు ఈశ్వరులై ఆ ప్రాణులతోటి భిన్నులగుచున్నారు. ఈ రుద్రభగవంతుడో ఆకాశాది భూతములకును ఈశ్వరుడై ఆ భూతముల యుత్పత్తి స్థితి లయములకు అభిన్ననిమిత్తో పాదాన కారణమై యున్నాడు. కనుక నాతడు మహేశ్వరు డనబడెను. (15) ఈ యానంద స్వరూపాత్మ సర్వముకన్నను నధికుడై స్వప్రకాశాద్వితీయరూపుడై సచ్చిదానంద స్వరూపుడై సకల భేదరహితుడైయున్నాడు ఇటువంటి మహానాత్మదేవుని బ్రహ్మవిద్యారూపిణియైన యుమాదేవియొక్క పతియైన రుద్రభగవంతుడు సర్వదా తన ఆత్మరూపముగ చూచుచున్నాడు. కనుక నాతడు మహాదేవుడనబడెను. (16) సర్వ జగత్తునకు సత్తాస్ఫూర్తి నొసంగువాడైన రుద్రభగవంతుడు జగత్తునందు సత్తాదిరూపములచే ప్రవేశించుటవలన విష్ణువనబడెను. అథవా యోగులు రుద్రభగవంతునియందు అభేదరూపముగ ప్రవేశము చేయుచున్నారు కనుక విష్ణువనబడెను. మఱియు రుద్రభగవంతుడు సర్వవ్యాపకతారూపబ్రహ్మతత్త్వముచే సర్వముకన్న నధికుడై సర్వప్రకాశమునకు నియంతయై యున్నాడు. ఈ కారణమువలన నా రుద్రభగవంతుడు నృసింహపూర్వతాపనీయుపనిషత్తునందు మహావిష్ణునామముచే కథనము చేయబడియె. అట

''ఉగ్రం వీరం మహావిష్ణుం జ్వలన్తం సర్వతోముఖమ్.
నృసింహం భీషణం భద్రం మృత్యుమృత్యుం నమామ్యహమ్.''

అను నీ యేకాదశపదములుగల మంత్రమునందు ఆ మహావిష్ణురూప నృసింహ భగవంతుడే ప్రతిపాదనము చేయబడియె. ఆ మంత్రము ముప్పది రెండక్షరములుగల అనుష్టుప్ ఛందోరూపమైయున్నది ఆ మంత్రమునకు స్వరవిశేషరూప సామముచే ఉచ్చారణమగుచున్నది. ఆ మంత్రము ప్రణవాది అంగమంత్రములచే యుక్తమై యున్నది మఱియు నాలుపాదములచే యుక్తమైయున్నది. ఇటువంటి మంత్రముచే కథనము చేయబడిన యే నృసింహభగవంతుడుగలడో ఆ నృసింహభగవంతుడు అధికారిపురుషులచే నవశ్యముగ నుపాసనచేయుటకు యోగ్యమైయున్నాడు. ప్రణవ రూపమే రుద్రరూపమైనట్టి నృసింహభగవంతుడు కేవలమంత్రార్థ రూపముచేమాత్రము ఉపాస్యుడుకాడు మహాచక్రముయొక్క నాభిరూపముచేత ఉపాసించుటకు యోగ్యుడైయున్నాడు

హే శిష్య! ఆ మహాచక్రముయొక్క స్వరూపమున్ను ఆచార్యులచే ఈ ప్రకారముగ వర్ణింపబడినది. మొదట ఓంకారరూప ప్రణవమువ్రాసి ఆ ప్రణవమునకు బాహ్యదేశమందు అష్టాక్షరమంత్రముయొక్క అష్టాక్షరములచే యుక్తమగు అష్టకోణ కమలమును వ్రాసి, దానికి బాహ్యప్రదేశమందు ద్వాదశాక్షర మంత్రసంబంధ ద్వాదశ

వర్ణయుక్త కమలమునువ్రాసి దానికి బాహ్యదేశమందు మాతృకాదిషోడశ స్వరములచే యుక్తమైన షోడశ కోణములుగల కమలమునువ్రాసి. దానికి బాహ్యదేశమందు పూర్వోక్తఅనుష్టుప్ ఛంద స్సంబంధ ముప్పదిరెండు అక్షరములచే యుక్తమై ముప్పది రెండు కోణములుగల కమలమునువ్రాసి తదనంతరము మాయాబీజముచే, మఱియు భూవలయముచే, మాతృకావర్ణములచే ఆ చక్రమును బాహ్యమునుండి వేష్టనముచేసి షట్కోణమునుండి షోడశకోణ పర్యంతము ఒక్కొక్క కోణరూపగణమును బిందుసహిత ముగ అట్లే వేష్టనము చేయుటకు పేరు నృసింహాఖ్య మహాచక్రము

"షట్కోణస్థ సుదర్శనం వసుదలప్రోల్లాసితాష్టాక్షరం,
బాహ్యే ద్వాదశవర్ణపత్రకమలం తత్షోడశార్ణచ్ఛదమ్
ద్వాత్రింశన్మనువర్ణపత్రకమలం వృత్తోల్లసన్మాతృకం,
మధ్యస్థధ్రువము ర్విబీజవలయం చక్రం నృసింహాహ్వయమ్ ॥"

ఇటువంటి మహాచక్రమందు రధచక్రనాభివలె స్థితమైన యే నృసింహ భగ వంతుడుగలడో. అతని నే యధికారిపురుషులు నిరంతరముపాసన చేయుదురో, ఆ యధికారిపురుషులు ఈ సంసార మహాసముద్రమును గోపదస్థితజలమువలె అత్యల్ప ముగ నెఱిగి దాటుచున్నారు. (17) విశ్వోత్పత్తిచేయువారైన యే చతుర్ముఖరుద్రభగ వంతుడుగలడో, ఆ భగవంతుని వేదవేత్తలు బ్రహ్మనామముచే కథనము చేయు చున్నారు. (18) ఆ బ్రహ్మదేవుడే సమష్టి సూక్ష్మరూపముచే స్థూలశరీరములనుత్పన్న మొనర్చుచున్నాడు. ఈ కారణమువలన వేదవేత్తలా బ్రహ్మదేవుని ప్రజాపతి నామ ముచే కథనము చేయుచున్నారు. సువర్ణమయమైన బ్రహ్మాండగోళకమందు స్థితమైన యే భూరూప కమలముకలదో, ఆ కమలమునకు మేరుపర్వతము కర్ణికారూపమై యున్నది. దానియందును, సత్యలోకమందును, యే బ్రహ్మదేవుడు దేవతలకుపకారము చేయుటకొఱకు స్థితుడైయున్నాడో, ఆ బ్రహ్మప్రజాపతియు రుద్రభగవంతునియొక్కయే స్వరూపమై యున్నాడు. ఇంత విస్తారముగ వచింపబడిన దానినే ఓంకారాది అష్టా దశనామ నిరూపణప్రసంగమున, ప్రణవము గౌణముగాను, పూర్వోక్తఅనుష్టుప్ ఛంధోరూప మంత్రము ప్రధానముగాను గల నృసింహపూర్వతాపిన్యుపనిషత్తునందు తెలుపబడినదైన సగుణబ్రహ్మవిద్యయొక్క స్వరూపము నిరూపణజేయబడినది. ఇపుడా యనుష్టుప్ ఛందోరూపమంత్రము గౌణముగాను ప్రణవము ప్రధానముగాను గల సగుణబ్రహ్మవిద్యయొక్క స్వరూప కధనము చేయునట్టిదియు, కేవల ప్రణవప్రధాన సగుణ విద్యాస్వరూప కథనము చేయునట్టిదియు, తురీయ ప్రణవము ప్రధానముగాగల నిర్గుణ బ్రహ్మవిద్యయొక్క స్వరూపమును కథనము చేయునట్టిదియు నైన ఏ నృసింహ ఉత్తరతాపనీయోపనిషత్తుగలదో, తదర్థ నిరూపణము జేయుటకుగాను మొదట ఆ

నృసింహభగవంతుని ఉపాసకులైన దేవతలయొక్క జిజ్ఞాస వర్ణింపబడుచున్నది. హే శిష్య! పూర్వమొక కాలమందు అగ్న్యాదిసకలదేవతలు ప్రజాపతి సమీపమునకు వచ్చిరి. అపుడా ప్రజాపతి యెట్లుండెననగా — తనుమానసి యను క్రియాసహిత ముగ అమితౌజసమను పర్యంకముపై స్థితుడైయుండెను. మఱియు సర్వోత్కృష్టశోభ గలవాడైయుండెను. ఆ యగ్న్యాదిదేవత లెట్లుండిరనగా — ఆ ప్రజాపతి సంబంధ సమష్టి స్థూల విరాట్ శరీరమునందు స్థితులైయుండిరి. మఱియు ప్రణవ ప్రధాన మైన బ్రహ్మాత్మభావమును బోధనచేయునట్టి విద్యను కోరినవారై. పూర్వోక్తవిద్యచే శుద్ధమనస్సుగలవారై యుండిరి. అటువంటివారైన యగ్న్యాదిదేవతలు ప్రజాపతికి దండవత్ప్రణామముజేసి హస్తద్వయము ముడిచి యిట్లు ప్రార్థన చేయుచున్నారు. హే భగవన్! పూర్వము తాము మాకు సర్వమంత్రములందు రాజా రూపమగు ఏ అనుష్టుప్ఛందమంత్రము. ప్రణవాది అంగమంత్రముల సహితముగ బీజసామో పాసన మహాచక్రసహితముగా కధనము చేసితిరో. ఆ మంత్రరాజము మృత్యు భయనివృత్తి చేయునట్టిదిగా నున్నది. ఆ మంత్రరాజ నిరూపణమునందు తాము సంక్షేపముగ నాల్గుపాదములుగల ప్రణవమంత్రమును కధనము చేసితిరి. ఆ నాల్గు పాదములకు వాచ్యరూపమైన ఏ ఆత్మగలదో ఆ యాత్మతోటి ప్రణవమంత్రము అభిన్నమైయున్నది. ఓ భగవంతుడా. ఈ సంసారరూపాగ్నిచే తప్తులమైన మాకు దయచేసి తామా ప్రణవమును ఉపదేశముచేయుడు మఱియు ఆ ప్రణవముచే ప్రతి పాదితమైన యే యత్యంతదుర్విజ్ఞేయాత్మగలదో, ఆ యాత్మయొక్కయు యుపదేశము చేయుడు

ప్రజాపతి — ఓ దేవతలారా! మీకు పూర్వము యే మంత్రరాజోపాసన చెప్పబడినదో, ఆ మంత్రరాజము నాల్గుపాదములచే యుక్తముగనున్నది. ఆ మంత్ర రాజమందు స్థితమైన ఏకాదశపదముల, సవిశేషార్థముచే కధనము చేయబడిన ఆ నృసింహభగవంతుని సర్వపదార్థరహితముగను, తురీయలక్ష్యస్వరూపముగా నెఱిగి యథాక్రమముగ ఆ ప్రణవమంత్రసంబంధ నాల్గు మాత్రలకును నాల్గుపాదములకును వాచ్యార్థరూపమగు నాత్మయొక్క కల్పితములగు నాల్గుపాదములతోటి అలక్ష్యమగు అభేదమును చింతనము చేయవలయును. మఱియు అధికారిపురుషులు ఆ నృసింహ భగవంతుని బ్రహ్మ, విష్ణు, రుద్ర, సర్వేశ్వరులను నీ నాల్గు రూపములచే కల్పనజేసి యథాక్రమముగ నాభి, హృదయ, భ్రూమధ్య, దశమద్వారములను నీ నాల్గు స్థానము లందు ఆ మంత్రములచే యా నృసింహభగవంతుని పూజనము చేయవలయును. ఓ దేవతలారా! ఆ ఓంకారరూపప్రణవమునకు అకార, ఉకార, మకార, నాదములను నాల్గుమాత్రలుగలవు. ఆ యకారాది నాల్గుమాత్రలయందొక్కొక్కమాత్ర స్థూలసూక్ష్మాది.

భేదములచే నాల్గు నాల్గు ప్రకారములగుచున్నది. అట ఆ యకారాది వర్ణములకు వైఖరియను స్థూలావస్థ వాక్కునందు నిలుచుచున్నది. మఱియు రెండవదైన మధ్యమ యను సూక్ష్మావస్థ హృదయ దేశమందును, మూడవదైన పశ్యంతియను బీజావస్థ కుండలిని యందును నిలుచుచున్నది. నాల్గవదైన పరాయను అవస్థ సాక్షిరూపముచే సర్వత్ర వ్యాపకముగానున్నది. ఈ ప్రకారముగ అకారాది నాల్గుమాత్రలు నాల్గు నాల్గు ప్రకారములగుటవలన, ఆ మాత్రాసముదాయరూపప్రణవము షోడశావయవములు గలదిగా సిద్ధించుచున్నది అథవా — ఆ యకారాది నాల్గుమాత్రలు ప్లుత, దీర్ఘ, హ్రస్వ, సాక్షి అను నాల్గుభేదములచే నాల్గు నాల్గు ప్రకారములగుచున్నవి. కనుక మాత్రాసముదాయరూప ప్రణవము షోడశావయవములు గలదిగా చెప్పబడినది

ఇపుడు షోడశభేదములచే ఆత్మయొక్క వర్ణనము గావింపబడుచున్నది. ఓ దేవతలారా ! ఎట్లు ప్రణవమునకు అకారాది నాల్గుపాదములుగలవో, అట్లే ఆత్మకున్ను నాల్గు పాదములుగలవు అట వ్యష్టిస్థూలోపాధిగల విశ్వుడు ప్రథమపాదము. వ్యష్టి సూక్ష్మోపాధిగల తైజసుడు ద్వితీయపాదము వ్యష్టికారణోపాధిగల ప్రాజ్ఞుడు తృతీయ పాదము. సాక్షిరూప తురీయాత్మ చతుర్థపాదము. ఈ నాల్గు పాదములు అధ్యాత్మ రూపములై యున్నవి అట్లే ఆత్మకు అధిదైవపాదములున్ను నాలుగుగలవు. అట సమష్టి స్థూలోపాధిగలవిరాట్టే ప్రథమపాదము. సమష్టి సూక్ష్మోపాధిగల హిరణ్య గర్భుడు ద్వితీయపాదము, సమష్టి కారణోపాధిగల ఈశ్వరుడు తృతీయపాదము సాక్షి చతుర్థపాదము. ఓ దేవతలారా ! ఆత్మసంబంధ విశ్వాది నాల్గుపాదములున్ను తీవ్ర, మధ్యమ, మంద, తురీయములను నాల్గుభేదములచే నాల్గు నాల్గు ప్రకారములగుచున్నవి. అట జాగ్రత్తునందు నేత్రాదీంద్రియములచే రూపాది విషయముల గ్రహణమేది చేయ బడినదో అది విశ్వునకు తీవ్రమను ప్రథమపాదము. ఏది మనోరథము చేయుచున్నదో అది మధ్యమ యను ద్వితీయపాదము ఏది మోహముచే తూష్ణీభావము పొందు చున్నదో అది మందమను తృతీయపాదము. మఱియు సర్వోపాధిరహితమైన నిర్విశేష తురీయ స్వరూపమేదిగలదో అది విశ్వుని చతుర్థపాదము. ఇదేతీరున స్వప్నద్రష్ట యగు తైజసుడున్ను నాల్గు ప్రకారములు. అట తైజసుని యే స్వరూపము సత్యమంత్రా దుల ధారణచేయుచున్నదో అది తీవ్రమను ప్రథమపాదము. ఏది స్వప్నమును స్వరూప ముచే వెలుగుచున్నదో అది మధ్యమమను ద్వితీయపాదము. ఏది స్వప్నమందు మోహముచే మూఢభావము పొందుచున్నదో అది మందమను తృతీయపాదము. నిర్విశేషతురీయరూపము చతుర్థపాదము. ఇదేతీరున ప్రాజ్ఞునకును నాల్గుపాదములు గలవు. సాత్త్వికవృత్తి ప్రధానమైన ప్రాజ్ఞుని స్వరూపము తీవ్రమను ప్రథమపాదము. రాజసవృత్తి ప్రధానముగాగల స్వరూపము మధ్యమమను ద్వితీయపాదము. తామస

వృత్తి ప్రధానముగాగల స్వరూపము మందమను తృతీయపాదము. నిర్విశేషతురీయ రూపము ప్రాజ్ఞుని చతుర్థపాదము నాదమను ప్రణవసంబంధమాత్రకు బీజ బిందు. శక్తి శాంతములను నాల్గవస్థలు గలవు ఆ నాల్గింటికి తురీయాత్మయొక్క క్రమముగా ఓత అనుజ్ఞాత అనుజ్ఞ అవికల్పములను నివి నాలుగు పాదార్థరూపములైయున్నవి. ఎట్లు కాష్ఠమందగ్ని అనుగతమైయుండునో అట్లే ఈ ఆత్మదేవుడు స్థూలసూక్ష్మకారణ శరీరములందు సాక్షిరూపముగా అనుగతుడై సర్వజీవులకు ఆత్మరూపుడైయున్నాడు. ఆత్మదేవునిచే ఈ సర్వప్రపంచము ఆ యా రూపములచే వెలుగబడుచున్నది ఆ అంతర్యామియగు ఆత్మదేవుని నామము ఓతము ఆ యోతనామాత్మ తురీయాత్మకు ప్రథమపాదము ఏ ఆత్మదేవుడు ధ్యాతృ ధ్యాన ధ్యేయ జ్ఞాతృ జ్ఞాన జ్ఞేయాది జగత్తును తన సత్తాస్ఫూర్తిచే రహితముగచూచి యా సత్తాస్ఫూర్తి జగత్తునకు కావలెనని విచారముచేసి తన సత్తాస్ఫూర్తిని జగత్తునందు ప్రవిష్టము చేయుచున్నాడో ఆ యాత్మదేవుని నామము అనుజ్ఞాత ఆ యనుజ్ఞాతాత్మ తురీయాత్మదేవుని మధ్యమమను ద్వితీయపాదము ఏ యాత్మదేవుడు కల్పితజగత్తునుండి తన సత్తాస్ఫూర్తి నాకర్షణము చేసి ఆ కల్పిత జగత్తును లయమొనర్చి కేవలము తన అద్వితీయరూపమునే యెఱుగుచున్నాడో ఆ యాత్మకు అనుజ్ఞయని పేరు ఆ యనుజ్ఞనాత్మ తురీయాత్మదేవుని మందమను తృతీయపాదము మఱియు ఏ ఆత్మదేవుని స్వరూపమందు కల్పితమైన ద్వైతప్రపంచముయొక్క స్ఫురితిలేదో, ఆ యాత్మదేవుని స్వరూపము యోగులకు అనేక జన్మల పుణ్యకర్మలచే ప్రాప్తమగుచున్నదో ఆ యాత్మస్వరూపమునకు అవికల్పమని పేరు ఆ యవికల్పాత్మ తురీయాత్మకు చతుర్థపాదమై యున్నది

ఓ దేవతలారా ఏ అవికల్పమను తురీయానందస్వరూపము నాల్గవస్థలందును అధిష్ఠానరూపముచే అనుగతమై ప్రతీతమగుచున్నదో ఆ యవికల్పాత్మయొక్క సత్తాస్ఫూర్తిచే పూర్వోక్తషోడశప్రకారముగల ఆత్మస్వరూపము ప్రతీతమగుచున్నది తురీయస్వరూపమందు కల్పితరూపత సంభవింపకున్నను ఆ తురీయాత్మయందు తురీయతారూప ధర్మము తనకన్న భిన్నమైనవస్తువుల అపేక్షచే కలదు ఆ యపేక్షచేతనే యది తురీయ మనబడినది ఈలాగున తురీయతాధర్మము కల్పితమైనను, తదాశ్రయరూపాత్మ కల్పితముకాదు ఓ దేవతలారా ఎట్లు నిర్మలాకాశమందు గంధర్వనగరము కల్పితమో అట్లే అవికల్పమైన శుద్ధాత్మయందు సర్వజగత్తున్ను కల్పితముగా నున్నది అవికల్పాత్మదేవుడో సర్వభయరహితుడై జన్మాది సకలవికార రహితుడైయున్నాడు మఱియు ఆ యాత్మదేవుడు సూక్ష్మముకన్నను సూక్ష్మముగాను మహత్తుకన్నను మహత్తుగా నున్నాడు. ఇటువంటి ఆత్మదేవుని సాక్షాత్కారముచేతనే మోక్షప్రాప్తి యగును

ఇపుడు ఆత్మజ్ఞానాధికారియొక్క వర్ణనము గావింపబడుచున్నది. ఓ దేవతలారా! ఈ అవికల్పానందాత్మను యెఱుగగోరిన బ్రాహ్మణాది అధికారిజనులు, వేదవిహితమైన అగ్నిహోత్రాదికర్మముల నాచరించి, హింసాదినిషిద్ధకర్మముల పరిత్యజించి సత్య, తప, దయా, దాన, బ్రహ్మచర్య, అహింసాది శుభకర్మములను ఆచరించుచున్నారు. ఇది మందమధ్యమాధికారుల లక్షణము. ఇపుడుత్తమాధికారి లక్షణము వచింపబడుచున్నది. ఓ దేవతలారా! ఉత్తమాధికారులు ఈషణత్రయముల (పుత్రేషణ, విత్తేషణ, లోకేషణ) పరిత్యాగముచేసి పరమహంస సన్న్యాసగ్రహణపూర్వకముగ సకలకర్మముల పరిత్యాగముచేసి, కేవలము భిక్షావృత్తిని ధారణము చేయుచున్నారు. ఇటువంటి ఉత్తమాధికారులు ఆనందస్వరూపాత్మను సాక్షాత్కరించుకొని అనంతరమందు సర్వజ్ఞులై బాహ్యమందు అంధమూక న్యాయమున పృధ్విపై విచరించుచున్నారు. ఈ కారణము వలననే అవివేకులు అవిద్వాంసుల నెఱుగరు (పూర్వము సంవర్తకాది సన్న్యాసులవలె)

ఇపుడు పూర్వోక్తమంత్రసహిత ప్రణవోపాసన, కేవలప్రణవోపాసన వచింపబడుచున్నది. ఓ దేవతలారా! ఏ అధికారి ఒకచో పాపకర్మప్రతిబంధవశమున ఆ యాత్మదేవుని అవికల్పరూపముగ నెఱుగడో, అతడాపాపప్రతిబంధనివృత్తికొఱకు ఏదోయొక యుపాయము చేయవలసినది. ఆ యుపాయమైననో, పూర్వము చెప్పబడిన నాల్గు పాదములు గల మంత్రరాజసంబంధ నాల్గుపాదములకును, విశ్వాది ఆత్మసంబంధ నాల్గుపాదములకును, అకారాది ప్రణవసంబంధ నాల్గుమాత్రలతోటి యభేదమును చింతనచేయుటయే. ప్రణవమంత్రమాత్రలయొక్క విభూతిప్రకారము శ్రుతిచే నిట్లు వచింపబడినది - బ్రహ్మ, వసువు, గాయత్రి, గార్హపత్యము, పృధ్వీ, ఋఙ్మంత్రము, ఋగ్వేదము ఈ సమస్తము అకారరూపము. విష్ణువు, రుద్రుడు త్రిష్టుప్, దక్షిణాగ్ని, యజుర్మంత్రము, యజుర్వేదము, అంతరిక్షము ఈ సమస్తము ఉకారరూపము. రుద్రుడు, ఆదిత్యుడు, జగతి ఆహవనీయము, స్వర్గము, సామమంత్రము, సామవేదము ఈ సమస్తము మకారరూపము. విరాట్టుమరుత్తు, ఏకర్షిరూపాగ్ని, ప్రణవము, అధర్వణమంత్రము, అధర్వణవేదము, సంవర్తకాగ్ని, సోమలోకము ఈ సమస్తము నాదరూపము. ఈ ప్రకారముగు విభూతిసహితముగ, పూర్వోక్తములగు నాల్గు పాదములు సహితముగ అకారాదిమాత్రలకు అభేదమును చింతన చేయవలయును. అనంతరము మంత్రసహితముగ, నాల్గుపాదముల సహితముగ అకారాది మాత్రలను చింతనము చేయవలయును. కేవలము అకారాదిమాత్రలచే చింతనముచేయు ప్రకారము శాస్త్రవేత్తలచే నిట్లు చెప్పబడియె —

అకారాది పూర్వపాదములను ఉకారాది ఉత్తరపాదములందు, ఉకారాది పాదములను మకారాది పాదములందు, ఈ ప్రకారము తురీయ పర్యంతము లయ చింతనము చేయవలయును. అనంతరము బీజ, బిందు, శక్తి, శాంతలను నాల్గవస్థలు గలదైన తురీయరూప ప్రణవమును చింతనము చేయవలయును. ఓ దేవతలారా! ఆ ప్రణవమంత్ర వాచ్యార్థరూపపురుషునకు ఈ పాదరూప షోడశకళలు కథనము చేయబడియె. ఆ షోడశ కళలు యథాక్రమముగ పూర్వోక్త షోడశావయవములు గల ప్రణవమంత్రమందే తాదాత్మ్య సంబంధముచే స్థితములైనవి. సర్వభేదరహిత శుద్ధ పరమాత్మ దేవునియందు కళలులేవు. కనుక యట సర్వకళలకు లయము సంభవించుచున్నది. ఇంకొక ప్రకారముగ చూడుడు. పూర్వోక్తరీతిగా నాల్గునాల్గు అవయవములుగల ఏ అకారాది నాల్గుమాత్రలతో యథాక్రమముగా పూర్వోక్త మంత్రరాజ సంబంధనాల్గు పాదములు చేరినపుడు, ఆమంత్రరాజమునకును షోడశావయవములు సిద్ధించుచున్నవి. అపుడు ఆ మంత్ర సంబంధమగు రెండు రెండు అక్షరములకు ఒక్కొక్క అవయవముయొక్క వాచకత సిద్ధించుచున్నది. ఆ యవయవరూప షోడశ భూమికలను అధికారులు మెల్లమెల్లగా జయించవలెను. (చిత్తమునందు ఆ భూమికల యొక్క దృఢప్రతీతియొనర్చు కొనుటయే ఆ భూమికలను జయించుట యగును.) అధికారులు ఏయే భూమికను జయించుచున్నారో ఆయాభూమికను పరిత్యజించి ఉత్తరోత్తర భూమికనాశ్రయింపవలెను. ఈ ప్రకారముగ మెల్లమెల్లగా నభ్యాసము చేయగా ఎపుడు పుణ్యప్రభావముచే ఆయవికల్పతురీయాత్మయొక్క ప్రాప్తియగునో అపుడా యధికారి పురుషుల కార్యసహితాజ్ఞానము నివృత్తమగును. పిదప కించిన్మాత్రము కూడా కర్తవ్యముండదు.

బ్రహ్మభావాభివ్యక్తికి యుక్తులు వచింపబడుచున్నవి ఓ దేవతలారా! శుద్ధాత్మ యింద్రియములకును, మనస్సునకును అవిషయమై యున్నాడు. కావున ఆయాత్మ దేవుని విషయమందు ప్రశ్నచేయుటకు యెవడును సమర్థుడుకాడు. ఉత్తరమిచ్చుటకును సమర్థుడుకాడు. ఈ కారణమువలననే శ్రద్ధావంతులైన శిష్యులడిగినపుడు కొందఱు బ్రహ్మవేత్తలు ఆ శిష్యులకు సచ్చిదానందావికల్పాత్మను మౌనముచేతనే యుపదేశించుచున్నారు. ఎందుకనగా — ఏయేవస్తువు వాక్కుచే వచింపబడుచున్నదో, ఆయావస్తువందు నేత్రాదీంద్రియములకును మనోబుద్ధ్యాదులకును విషయతకలదు. ఇంద్రియాదులకు విషయతగాకున్న కేవలవాక్కునకే విషయత సంభవింపదు. కనుక ఇంద్రియాదులవిషయత వ్యాపకముగాను, వాక్కుయొక్క విషయత వ్యాప్యముగను యున్నది మఱియు ఎచ్చట వ్యాపకమున కభావమగునో అచ్చట వ్యాప్యమునకును యభావమగును, (అగ్న్యభావముచే ధూమాభావమువలె) ఈ ప్రసంగమందు సర్వావస్థాను

గతమైన ఏ అద్వితీయాత్మగలదో ఆయాత్మదేవునియందు నేత్రాదీంద్రియములును, మనోబుద్ధులును, ప్రవృత్తములగుటకు శక్యములుగావు కనుక ఆత్మదేవునియందు వాటికి విషయత సంభవింపదు. అథవా - ఈ అధిష్ఠానాత్మచే ప్రేరితములై నేత్రాదీంద్రియములును, మనోబుద్ధ్యాదులను తమతమ కార్యములందు ప్రవృత్తములగుచున్నవి. ఐనను ఆ మనేంద్రియాదులు తమప్రవర్తకులైన ఆత్మయందు ప్రవర్తకములుగావు. తాత్పర్యము — తనసమీపతా మాత్రముచే సర్వవ్యవహారములయొక్క సిద్ధికి కర్తయైన ఏ ఆత్మగలదో, ఆయాత్మయందే మనేంద్రియాదుల విషయతారూప కర్మము నంగీకరించినపుడు ఒకే యాత్మయందు కర్తృతయు, కర్మతయు ప్రాప్తమగును. అది అత్యంత విరుద్ధము. ఈ కారణమువలనను ఆత్మయందు మనేంద్రియ సంబంధ విషయత సంభవింపదు.

అథవా, నేత్రాదీంద్రియములలో నియమముగ రూపస్పర్శాది ధర్మములను, తదాశ్రయమైన ఘటాదులను విషయము చేయుచున్నవి. మనోబుద్ధిలో సుఖదుఃఖాది ధర్మములను విషయము చేయుచున్నవి. ఆ ధర్మములు ఆత్మయందు లేవు. కనుక ఆత్మదేవునియందు ఇంద్రియాదులకు ప్రవృత్తి సంభవింపదు. అథవా — "అహం సుఖీ, అహం దుఃఖీ" అను ప్రతీతిచే ఆత్మయందు సుఖదుఃఖములు ప్రతీతమగుచున్నను, అవి ఆత్మయందు వాస్తవముగ లేవు. రజ్జుసర్పన్యాయమున ఆత్మయందు కల్పితములై యున్నవి. ఆ కల్పిత వస్తువులయొక్క జ్ఞానము ఇంద్రియములచేతను కాదు, మనస్సుచేతనుకాదు. అది సాక్షిభావము. ఓ దేవతలారా ! కల్పిత పదార్థమునకుపాదానకారణమైన అజ్ఞానమేదికలదో తదాశ్రయమునకు నామము అధిష్ఠానము. ఆ అధిష్ఠానము సకల కల్పిత పదార్థములందు యొకటేయైయున్నది. ఎట్లు సర్వదండమాలాది అనేకకల్పిత పదార్థములకు రజ్జువొకటే అధిష్ఠానమో అట్లే సకల పదార్థములకును ఒక ఆత్మయే అధిష్ఠానము.

దేవతలు — హే భగవన్ ! కల్పిత రజతాదులకు శుక్త్యాదులు, కల్పితసర్పాదులకు రజ్జ్వాదులు. ఈలాగున అధిష్ఠానములు వేఱువేఱుగా కనబడుచున్నవికదా? — ప్రజాపతి - ఓ దేవతలారా ! అవిచారకాలమందు రజతాదులకును, సర్పాదులకును అధిష్ఠానములు వేఱువేఱుగా ప్రతీతమగుచున్నను, విచారించిచూచినపుడు శుక్తిరజ్జ్వాదులకు అధిష్ఠానత సంభవింపదు. శుక్తి రజ్జ్వాదులందు అనుగతమైన సామాన్య చైతన్యమే రజతాదులకును, సర్పాదులకును అధిష్ఠానమై యున్నది. ఎందుకనగా — కల్పితవస్తు సంబంధ ఉపాదాన కారణమునకు విషయమైనది అధిష్ఠానమనబడును. ఉపాదానకారణమైన అజ్ఞానము స్వభావముగ ఆవృతమైయున్న శుక్తిరజ్జ్వాది జడ

పదార్థములను విషయము చేయదు. తదనుగత చైతన్యమునే విషయము చేయు చున్నది. ఈలాగున ఆయొకచైతన్యమే సర్వత్ర అధిష్ఠానమైయున్నది. భ్రమకాలమందు కల్పిత పదార్థములతో తాదాత్మ్యసంబంధముచే ప్రతీతమైన వస్తువే ఆ కల్పిత పదార్థమున కధిష్ఠానమగుచున్నది ఈ యధిష్ఠానలక్షణము శుక్తిరజ్జ్వాదులందు సంభవింపదు. ఆ శుక్తిరజ్జ్వాదులందు అనుగతమైన ఇదంతారూప సామాన్యాంశమందే యధిష్ఠానలక్షణము సంభవించుచున్నది. ఏలాగుననగా — భ్రమకాలమందు "శుక్తిః రజతం రజ్జుః సర్పః" ఈలాగున ప్రతీతముకాదు. "ఇదం రజతం, అయం సర్పః" ఈలాగున ప్రతీతమగును. కనుక కల్పిత రజతాదులతో తాదాత్మ్య సంబంధముచే ప్రతీతమైనట్టి 'ఇదం' యను సామాన్యాంశరూపచైతన్యమే సర్పాదుల కధిష్ఠానమై యున్నది.

దేవతలు — హే భగవన్! బాధసామానాధికరణ్యము, అధ్యాససామానాధికరణ్యము, విశేషసామానాధికరణ్యము, ఐక్యసామానాధికరణ్యము ఈలాగున చతుర్విధ సామానాధికరణ్యములు శాస్త్రమందు చెప్పబడియె. అట స్థాణువందలి చోర భ్రమయొక్క ఉత్తరకాలమందు, మఱియు రజ్జువందలి సర్పభ్రమయొక్క ఉత్తర కాలమందు స్థాణురజ్జుజ్ఞానానంతరము "చోరోఽయం స్థాణుః, సర్పోఽయంఽరజ్జుః" అను నీప్రతీతికి నామము బాధసామానాధికరణ్యము. "అయం సర్పః, ఇదం రజతమ్" అనుదానికి నామము అధ్యాససామానాధికరణ్యము. "నీలోఘటః" అనుదానికి నామము విశేషణసామానాధికరణ్యము. మఱియు "సోఽయం దేవదత్తః" అనుదానికి నామము ఐక్యసామానాధికరణ్యము. అట అధ్యాససామానాధికరణ్యమందు ఇదంతాంశమునకు కల్పితసర్పముతో తాదాత్మ్యసంబంధము ప్రతీతమగుచున్నది. కనుక ఆ ఇదంతాంశమందు కల్పితసర్పాదులకు అధిష్ఠానత సంభవింపదుకదా? ప్రజాపతి — ఓ దేవతలారా! అధ్యాససామానాధికరణ్యమందు రజ్జ్వాదులకు సర్పాదులతో తాదాత్మ్య సంబంధము ప్రతీతమగుచున్నను, బాధసామానాధికరణ్య కాలమందు ఆ కల్పిత సర్పాదులచ్చటలేవు. కనుక ఆ బాధకాలమందు శాస్త్రవేత్తలకు యే "సర్పోఽయం రజ్జుః" అను నీప్రకార జ్ఞానమగుచున్నదో, ఆజ్ఞానము వంధ్యాపుత్ర విషయకజ్ఞానము వలె వికల్పమాత్రమేయైయున్నది. ఆ వికల్పజ్ఞానముచే రజ్జ్వాదులందు సర్పాదులకు అధిష్ఠానరూపత సిద్ధింపదు. ఒకచో వికల్పజ్ఞానముచేతను వస్తువుయొక్క సిద్ధియైన పక్షమందు 'వంధ్యాపుత్రుడు కలడు' అనునీ వికల్పజ్ఞానముచేతను, వంధ్యాపుత్రుని సిద్ధికావలసి యుండె! అట్లగుటలేదు. ఈలాగున చూచినపుడు చైతన్యమైనట్టి ఇదంతా రూప సామాన్యాంశమే సర్పాదులకధిష్ఠానమని సిద్ధించుచున్నది. ఆ అధిష్ఠాన రూప ఇదంతాంశమందు బ్రహ్మరూపతా సిద్ధికొఱకు మొదట భేదరహితతా నిరూపణము

గావింపబడు చున్నది. ఓ దేవతలారా! ఇదంతా రూపసామాన్యాంశమందు మన కేభేదము ప్రతీతమగుచున్నదో, ఆ భేదము కేవల శబ్దమాత్రముచేతనేయై యున్నది. వాస్తవముగా ఇదంతా రూపపదార్థమందు కించిన్మాత్రమును భేదములేదు.

దేవతలు - హే భగవన్! ఆ శబ్దభేదముచే అర్థభేదమెందులకు కాకూడదు.

ప్రజాపతి - ఓ దేవతలారా! లోకమందు శబ్దమునకు భేదమైనను అర్థమునకు ఏకత కనబడుచున్నది. ఎట్లు ఒకడేయైన దేవదత్తుని ఒకడు 'అయందేవదత్తః'' అని, ఒకడు ''త్వందేవదత్తః'' అని, ఒకడు ''సఃదేవదత్తః'' అని యింకొక మిత్రుడు ''దేవదత్తోఽయ మేవ'' అని ఈ ప్రకారముగ ఒకేదేవదత్తుని అనేకులు అనేకప్రకారముగ నుచ్చారణ చేయుచున్నారో, ఆ అనేకశబ్దములచే ఒకడైన దేవదత్తునియందు భేదము యెట్లు ఘటిల్లదో, అట్లే ఇదంతావాచకములగు అనేకశబ్దములచేతను ఇదంతా రూపసామాన్యార్థమందు భేదము సిద్ధింపదు. అథవా, లోకమందు యెన్నిపదార్థములు గలవో ఆ సకల పదార్థములందు ఏకత్వము స్వభావముగావే సిద్ధించియున్నది. ఆ స్వభావసిద్ధమైన యేకత్వము విద్యమానమై యుండగా, ఆ పదార్థములందు ఆ శబ్దముల భేదముచే నెప్పటికిని నానాత్వముకాదు. ఒకచో స్వభావసిద్ధపదార్థమందును నానాత్వము ప్రతీతమైనపుడు ఆ నానాత్వము గంధర్వనగరమువలె మిథ్యయేయగును. ఆ మిథ్యానానాత్వముచే వాస్తవమైన ఏకత్వమునకు హానిలేదు. అథవా, లోకమందు ప్రమాణముచేతనే వస్తుసిద్ధి యగుచున్నది. ప్రమాణముగాకున్న వస్తుసిద్ధి కాదు. ఇదంతా రూపార్థమునకు భేదము యే ప్రమాణముచే సిద్ధించినది? అను నీవిచారమే చేయవలసినది. అట భేదరూపరాజుయొక్క సేనాపతియగు శబ్దమో ఇదంతా రూపార్థముచే పరాజయము పొందుచున్నది. ఏలాగుననగా ఇదంతార్థమందుగల స్వభావసిద్ధ యభేదముచే భేదముయొక్క నివృత్తియైనది. కనుక ఆ సేనాపతి అర్థమందు ప్రవేశముచేయుట కశక్యుడాయెను. ఆశబ్దరూపసేనాపతి కల్పితభేదమాత్ర మంగీకరించియే సంతోషమును పొందుచున్నాడు సత్యభేదము నపేక్షింపదు — అథవా, ఎట్లు ఆ శబ్దము ఇదంతారూపార్థముయొక్క భేదమును గ్రహణము చేయదో, అట్లే చక్షురాదీంద్రియములును ఆ భేదమును గ్రహణము చేయవు. ఇంద్రియములు వస్తుస్వరూపమాత్రమును గ్రహణముచేసియే కృతకృత్యములగుచున్నవి. ఎట్లనగా — దోషయుక్తచక్షువు శుక్తియందు, రజతమాత్రగ్రహణముచేతనే కృతకృత్య మగుచున్నది. ఆ చక్షువు శుక్తియందు రజతభేదమును గ్రహణము చేయదు. ఒకచో ఆ దుష్టచక్షువు భేదగ్రహణము చేసినపక్షమందు భ్రమకులోపమగును. అథవా — చక్షురింద్రియములచే నెప్పుడు స్వప్నేంద్రియములవలె ఇదంతయు సిద్ధింపలేదో, అపుడా ఇంద్రియము

లచే ఇదంతా సంబంధభేదము యేరీతిగా సిద్ధించును? సిద్ధింపదు. ఎందుకనగా — దేనికి త్రికాలమందును బాధకాదో అటువంటి యేసత్తకలదో, ఆ సత్తయే ఇదంతా రూపమైయున్నది. ఈ కారణమువలననే లోకమందు "ఇదంసత్, ఇదంసత్" అను నీప్రకారము సర్వదా ప్రతీతియగుచున్నది. ఆ ప్రతీతివలన ఇదంశబ్దార్థమునకును, సత్‌శబ్దార్థమునకును అభేదసిద్ధియే యగుచున్నది. కాబట్టి సత్తారూపఇదంతను, భేదమును ఈ చక్షురింద్రియము గ్రహణముచేయుట కశక్యమైయున్నది. అథవా పూర్వోక్తయుక్తులచేతను యెపుడు ఇదంతయందు భేదము సిద్ధింపలేదో, అపుడు పరమాత్మదేవునియొక్క ఆ ఇదంతవిశేషరూపమై యున్నదో అటువంటి సర్వత్రానుగత పరమాత్మదేవునియందు భేదము యే ప్రమాణముచే సిద్ధించును? యే ప్రమాణము చేతను సిద్ధింపదు.

ఇపుడు సత్తకు స్ఫురణముతోటి అభేదసిద్ధిని చూడుము దృష్టిసృష్టిసిద్ధాంతమందు భాసముకానిదైన పదార్థమునకు సత్తలేదు. భాసమానపదార్థమునకే సత్తకలదు. ఈ కారణమువలన సత్త స్ఫురణముకన్న భిన్నముకాదు. స్ఫురణమాత్రమేయై యున్నది. మఱియు ఆ స్ఫురణము స్వప్రకాశరూపమేయైయున్నది. (ఈ విషయము అనేకమార్లు కథనము చేయబడినది) కనుక తదభిన్నమగు ఆసత్త స్వప్రకాశరూపమే యని సిద్ధించుచున్నది. ఇంకను ఇట యుక్తినిగాంచుము. లోకమందు యేయేవస్తువు చైతన్యతచే రహితమై అచేతనస్వరూపమై యున్నదో, ఆయావస్తువు చైతన్యముచేతనే సిద్ధించుచున్నది. ఈ విషయమందేవాదికిని వివాదములేదు. ఇది సర్వసమ్మతమే. ఒకచో అచైతన్యము చైతన్యముచేతనే ప్రతీతమగుచున్నదని అంగీకరించినపుడు అట ఈ విచారము చేయవలయును.

ఏ చైతన్యము చైతన్యముచే ప్రతీతమగునో, నా ప్రతీతికి విషయరూపమగు నా చైతన్యము స్ఫురణముకన్న విలక్షణమా? స్ఫురణరూపమా? అట ప్రథమపక్షము సంభవింపదు. ఎందుకనగా — స్ఫురణముకన్న విలక్షణమైన వస్తువందు చైతన్యరూపత నంగీకరించుటయందు కించిన్మాత్రప్రమాణమున్ను లేదు. ప్రయోజనమున్ను లేదు. ఏలాగుననగా — ఆ స్ఫురణరూపచైతన్యమును ప్రకాశముచేయునట్టి యేచైతన్యము గలదో ఆ చైతన్యముచేతనే సర్వనిర్వాహము శక్యమైయుండగా, స్ఫురణరూపచైతన్యము నంగీకరించుట వ్యర్థమగును. మఱియు ఆ చైతన్యస్ఫురణరూపమును రెండవపక్షము సంభవింపదు. ఎందుకనగా — ఆ చైతన్యమునకెపుడు వాది స్ఫురణరూపమంగీకరించునో, అపుడా స్ఫురణరూపచైతన్యము సర్వబుద్ధివృత్తులకు సాక్షిరూపమగు ఆత్మ యనియే సిద్ధించును. ఆ స్ఫురణరూపసాక్షికి తనప్రకాశమందు ఇతరముయొక్క అపేక్ష సంభవింపదు. ఒకచో ఇతరముయొక్క అపేక్షఅయినపుడు, ఆ స్ఫురణరూప

చైతన్యమందు. ఘటాదులవలె అనాత్మరూపతసిద్ధించును. ఇవ్విధమున స్ఫురణరూప చైతన్యాత్మ స్వప్రకాశరూపమని సిద్ధించుచున్నది.

ఇంతవఱకు ఆత్మదేవుని సచ్చిద్రూపత నిరూపింపబడినది. ఇపుడు ఆనంద రూపత నిరూపింపబడుచున్నది. ఓ దేవతలారా! ఆ ఆత్మదేవుడు సకల దేహధారిజీవులకు అత్యంత ప్రియమగుటవలన పరమానంద స్వరూపుడుగానున్నాడు. ఏలాగుననగా — అజ్ఞానిజీవులచే ఆత్మరూపముగా సంగీకరింపబడినదైన, శరీరరూపాత్మ నాశప్రసంగమెపుడైన వచ్చును. విషయసుఖనాశ ప్రసంగ మెపుడైన వచ్చునని యెఱిగి బుద్ధిమంతుడు ఆ శరీరరూపాత్మయొక్క రక్షణముకొఱకు. విషయసుఖ పరిత్యాగము చేయుచున్నాడు. లోకమందో అధికసుఖము కొఱకు అల్పసుఖముయొక్క పరిత్యాగము కనబడుచున్నది. అల్పసుఖముకొఱకు అధికసుఖ పరిత్యాగము కనబడదు. కనుక వ్యవహారదృష్టిచే విషయసుఖముకన్నను, తత్సాధనముకన్నను, ఆత్మయందే పరమానందరూపత సిద్ధించుచున్నది ఓ దేవతలారా! పూర్వోక్తాభిప్రాయబోధన చేయునట్టిదైన యేవిద్వత్పురుషుని మౌనముగలదో, ఆ మౌనముచేతను ఆ బ్రహ్మవేత్తలు స్వశిష్యులకు సచ్చిదానంద స్వరూపాత్మయొక్కయే యుపదేశము చేయుచున్నారు. ఏ అల్పబుద్ధిగల శిష్యులు ఆ మౌనరూపోపదేశముచే సచ్చిదానందరూపాత్మను తెలియగరో ఆ శిష్యుల ఆ బ్రహ్మవేత్తలగు గురువులు కృపగల్గి ఆ యద్వితీయాత్మయందు కొన్ని ధర్మముల నారోపణము చేయుచున్నారు. లోకమందేవస్తువు వచనముచే స్పష్టముగ చెప్పుటకు వీలగునో, ఆ వస్తువును "సత్" నామముచేతను, కేవలము మనస్సుచే చింతనము చేయదగిన వస్తువును "అసత్" నామముచేతను కథనముచేయుచున్నారు. ఈ ఆత్మదేవుని స్వరూపమో సదసత్తుల రెంటికన్నను విలక్షణముగ నున్నది. ఇటువంటి ఆత్మదేవునియందు వేదవేత్తలగు గురువులు సత్, అసత్, ఈ రెండు ధర్మముల నారోపణముచేసి, శిష్యులకిట్లుపదేశము చేయుచున్నారు — హేశిష్య! అనుభవముచే సిద్ధించిన యేసచ్చిదానందస్వరూపాత్మ గలదో, ఆ సర్వక్లేశరహితుడగు ఆత్మదేవుడు నీవేయైయున్నావు. ఆ మందబుద్ధియగు శిష్యుడు అసత్‌యొక్క స్వరూపమేమి? అని ప్రశ్నచేసినపుడు ఆ గురువులు వానికి యిట్లు చెప్పుదురు — ఏ వస్తువు సర్వపదార్థములందు "ఇదం, ఇదమ్" ఈలాగున ప్రతీతమగునో, ఆ వస్తువునే నీవు సద్రూపముగా నెఱుగుము. అటపూర్వము స్థూలారుంధతీన్యాయమున, ఆ యిదంతయందు కథనము చేయబడిన ఆత్మతను ముఖ్యాత్మయందు జేర్చుచున్నారు.

హే శిష్య! దేనియందు యిదంతయు కల్పితమైనదో, అట్టి మనోవాక్కులకవిషయమైన, మనవాణికవిషయమైన స్ఫురణమునే నేను నీకు సన్నామముచే కథనము చేయుచున్నాను. ఆ స్ఫురణము విద్వత్పురుషులు అనుభూతినామముచే

కథనము చేయుదురు. హే శిష్య! ఈ సద్రూపానుభూతిగలదా? అను నీప్రకారమగు ప్రశ్నను నీవుచేసిన పక్షమందు, నేననీకు స్థావసహితముగ తత్స్వరూపమును చెప్పెదను వినుము.

హే శిష్య! సర్వజీవుల బుద్ధియందు ప్రతిబింబభావమును పొందునట్టిదియు, సర్వవిషయములందు "ఇయంచిత్, ఇయంచిత్" ఈ ప్రకారముగ అనుగతమై ప్రతీతమగునట్టిదియునగు ప్రసిద్ధమైన యే చిత్తుగలదో, దానికి అనుభూతి యనిపేరు. ఆ చిత్తుయొక్క స్వరూపమందు పూర్వోక్తమైన యిదంతయు బాధితమగుచున్నది. కనుక ఆ బుద్ధియే ఆ అనుభూతియొక్క యుపలబ్ధికి స్థానమైయున్నది.

ఓ దేవతలారా! ఈ ప్రకారముగ యెపుడాశ్రద్ధగల శిష్యుడు, బ్రహ్మవేత్తయగు గురువును ఆత్మస్వరూపమును గూర్చి యడిగెనో, అపుడాతడాశిష్యునకు, అద్వైతి యాత్మయందు వాగాదీంద్రియయోగ్యమైన సత్తాదిధర్మముల నారోపించి ఆత్మదేవుని యుపదేశించుచున్నాడు.

ఓ దేవతలారా! వాస్తవముగ మనోవాక్కులకవిషయమైన ఆత్మదేవునియందు మనోవాక్కులకు ప్రవృత్తి, అధ్యాసములేక కానేఱదు కాబట్టి పూర్వమునాచే కథనము చేయబడిన సచ్చిదానందాత్మస్వరూపము అధ్యాసములేక వాక్కుచే వచింపబడదు. మనస్సుచే యెఱుగబడదు. ఇపుడీవిషయమే కైముత్యకన్యాయముచే స్పష్టీకరింపబడుచున్నది.

ఓ దేవతలారా! లోకమందు జీవులకు సుఖదుఃఖప్రాప్తికరములగు యెన్ని భావపదార్థములుఁగలవో, అవి తమ సాధనసహితముగ క్షణక్షణమందును పరిణామమును పొందుచున్నవి. ఇటువంటిపదార్థములను యెవడును వర్ణించుటకు శక్తుడు కాడు. ఎట్లు ముత్యము, దుగ్ధము, చంద్రుడు, కుందపుష్పము ఈ నాలుపదార్థముల రూపమందు శ్వేతత్వధర్మముసమానముగ నుండినను, ఆ నాల్గింటియొక్క రూపములందవాంతరవిశేషత ఏదికలదో దానిని చెప్పుటకెవడును సమర్థుడుకాడు, ఎప్పుడు నేత్రాదీంద్రియములచే ప్రత్యక్షగ్రహణయోగ్యమైన ఈ భావపదార్థమున్ను వాక్కుతో చెప్పుటకు వలనుపడదో, అపుడు సకలేంద్రియములకవిషయమైన ఆత్మ వాక్కుచే చెప్పబడదని వేఱు వచింపనేల? అథవా విషయేంద్రియసంబంధముచే జనించినదైన విషయసుఖమే మనస్సునకు విషయమగును. ఆత్మస్వరూపసుఖమో అధికారికి, తపాది అనేకోపాయములచే ప్రాప్తమైనది. అట్టి ఆత్మస్వరూపసుఖము, మనోవిషయతను పొందనేఱదు. ఎపుడు ఆత్మస్వరూపసుఖమందు మనస్సునకు కూడా ప్రవృత్తి కాలేదో, అపుడు వాక్కునకు ప్రవృత్తి కాదని వేఱుచెప్పనేల? అథవా — విషయ

సుఖము మనస్సునకు అనుభవముచే తెలియబడుచున్నది. గాని, వాక్కుచే చెప్పుటకు వీలుపడదు. అపుడిక మనోవాక్కులకవిషయమైన ఆత్మస్వరూపసుఖము చెప్పుటకు వీలుపడదని వేఱు వచింపనేల?

ఓ దేవతలారా! ఈ ప్రకారముగ ఆ యాత్మదేవుడు వాక్కుచే సాక్షాత్తుగా చెప్పబడడు. కావున బ్రహ్మవేత్తలగు గురువులు ఆ యానందస్వరూపాత్మయందు భావాభావధర్మములను ఆరోపణ జేసియే తమశిష్యులకు ఆత్మోపదేశము చేయు చున్నారు. సత్యత్వ, చైతన్యత్వ, ఆనందత్వాది ధర్మములు భావరూపములుగాను, అస్థూల, అనణు, అహ్రస్వ, అదీర్ఘాది ధర్మములు అభావరూపములుగా నున్నవి. ఓ దేవతలాలా! ఈ ప్రకారముగ బ్రహ్మవేత్తయగు గురుముఖమున ఆత్మస్వరూపమును శ్రవణముచేసి యెపుడాత్మసంబంధమనననిధిధ్యాసములు చేయుదురో, అపుడా శ్రద్ధావంతులైన శిష్యులు స్వానుభవముచే భావాభావరహితమైన శుద్ధాత్మను సాక్షాత్కరించుకొందురు. ఇపుడు సర్వజీవాత్మలందు నిష్ప్రపంచత్వరూప బ్రహ్మధర్మము నిరూపింపబడుచున్నది. ఓ దేవతలారా! సర్వదేహధారిజీవులకేయాత్మగలదో, ఆ యాత్మదేవుడు సర్వదా ప్రపంచరహితుడై యున్నాడు. — దేవతలు – హే భగవన్! జాగ్రత్ప్రపంచము విద్యమానమైయుండగా ఆత్మదేవునియందు నిష్ప్రపంచత్వమేలాగున సంభవించును? — ప్రజాపతి – ఓ దేవతలారా! ఈ జాగ్రత్ప్రపంచము రజ్జుసర్పన్యాయముగ మిధ్యయేయైయున్నది. ఈ మిథ్యాప్రపంచము ఆత్మదేవుని వాస్తవమైన నిష్ప్రపంచతను నివృత్తిచేయుట కశక్యమగును. ఇపుడు జగన్మిథ్యాత్వ సిద్ధికొఱకు దృష్టిసృష్టివాదము వచింపబడుచున్నది.

ఓ దేవతలారా! ఈ యాత్మదేవుడెపుడు జాగ్రదవస్థను పొందుచున్నాడో, అపుడే ఆ యవస్థను స్థూలశరీరమును పుట్టించుచున్నాడు. మఱియు స్వప్నావస్థను పొందినపుడు సూక్ష్మశరీరమును రథాదిపదార్థములను పుట్టించుచున్నాడు. మఱల జాగ్రదవస్థకు వచ్చినపుడు స్వప్నపదార్థములను చూడడు. ఈలాగున ఆత్మదేవుడు స్వప్నప్రపంచమును జాగ్రత్తునందు, జాగ్రత్ప్రపంచమును స్వప్నమందు సంహారముచేయుచున్నాడు. సుషుప్త్యవస్థను పొందినపుడు ఆ రెండు ప్రపంచములను సంహారము చేయుచున్నాడు. మఱియు నీయాత్మదేవుడు సమాధ్యవస్థను పొందినపుడు సుషుప్తిసంబంధతమోరూపాజ్ఞానమును చూడడు. ఈలాగున సమాధియందు అజ్ఞానమునున్ను సంహారము చేయుచున్నాడు. ఆ తమోరూపాజ్ఞానముచే మోహితుడైన జీవాత్మ తన స్వరూపానందము నెఱుగడు. సాక్షిరూప జ్ఞానమునున్ను యెఱుగడు. — ఓ దేవతలారా! హిరణ్యగర్భాది ఈశ్వరులకును ఆత్మజ్ఞానప్రాప్తి స్వతంత్రముగా గలుగలేదు,

వేదభగవద్రూపుడైన గురువుయొక్క వచనమును స్మరణముచేసిన పిదపనే వారికి ఆత్మజ్ఞానమైనది. ఈలాగున అజ్ఞాననివృత్తిచేయునట్టి ఆత్మజ్ఞానమునకు బ్రహ్మవేత్త యగు గురువే కారణమైయున్నాడు. గురువులేకున్న ఆత్మజ్ఞానము కలుగదు.

ఓ దేవతలారా ! ఎట్లు హిరణ్యగర్భాది ఈశ్వరులకు స్మరణము చేయబడిన వేదరూప గురువుచే ఆత్మజ్ఞానమైనదో అట్లు ఈ కాలమందు స్మరణము చేయబడిన వేదరూపగురువుచే మనుజులకు ఆత్మజ్ఞానముకాదు. అందు ఈశ్వరతయొక్క అభావము కారణముకాదు. చిత్తశుద్ధియొక్క అభావమే కారణము. ఈ కాలమందును ఈ లోకమందును ఎపుడు మనుజుడు హిరణ్యగర్భునివలె శుద్ధచిత్తము గలవాడగునో, వానికి హిరణ్యగర్భునివలెనే ఆత్మజ్ఞాన ప్రాప్తియగును. కాని అంతచిత్తశుద్ధియగుట అత్యంత దుర్లభము. కాన ఈ యొకసంగతిని విడిచిన జగదుత్పత్త్యాదులకు కారణత హిరణ్యగర్భునియందెట్లు గలదో, అట్లు జీవాత్మయందును పూర్వోక్తదృష్టివాదము రీతిగా జగదుత్పత్త్యాదుల కారణత కలదు. కనుక జీవాత్మ పరమేశ్వరరూపుడేయై యున్నాడు. — ఓ దేవతలారా ! జగదుత్పత్త్యాదులకు ఈశ్వరుడే స్వతంత్రకారణమై యున్నాడు. ఇంకొకడులేడు. అను నీ ప్రకారమగు వచనము వేదాంతశాస్త్రమందు గలదు. ఆ వచనము మిధ్యకాదు యథార్థమే యైయున్నది. కాని ఆ వచనమునకు ఈశ్వరుడే సర్వజీవులకు, మనకు ఆత్మయై యున్నాడని అభిప్రాయమగును.

శ్రుతి॥ "నాన్యోతోఽస్తి ద్రష్టా"

భావార్థము — పరమాత్మదేవునికన్న భిన్నమగు ఇంకొకద్రష్టలేడు. ఈ అభిప్రాయముచేతనే శ్రుతియందు ఈశ్వరుడు జగత్కారణ మనబడియె.

ఇపుడు ఆత్మయొక్క ఏకత్వవర్ణనము గావింపబడుచున్నది. ఒకే ఈశ్వరుడు రావణునితోటి శత్రుభావ మంగీకరించినపుడు శ్రీరామచంద్రుడని, కంసునితోటి శత్రుభావ మంగీకరించినపుడు శ్రీకృష్ణుడని అనబడినట్లు ఒకటేయగు పరమాత్మదేవుడు వ్యష్ట్యజ్ఞానరూపోపాధి సంబంధముచే జీవుడని, సమష్ట్యజ్ఞానరూపోపాధి సంబంధముచే ఈశ్వరుడని యనబడియె. ఈలాగున ఒకే ఈశ్వరునియందు కర్మభేదముచే ఈశ్వరతయు అనీశ్వరతయు ఈ ద్వివిధవ్యవహారమున్ను అగుచున్నది. ఎట్లు దశరధపుత్రుడైన శ్రీరామచంద్రుడు రావణుని చంపుటయందు సమర్థుడగుటవలన ఈశ్వరుడనబడెనో, క్షీరసముద్రమందు శేషశయనుడైయున్న శ్రీవిష్ణుభగవంతుడు రావణుని చంపుట కసమర్థుడు కనుక అనీశ్వరుడనబడెనో, అట్లే ఒకేపరమాత్మదేవుడు సమష్టివ్యష్ట్యుపాధియోగముచే ఈశుడనియు, అనీశుడనియు అనబడుచున్నాడు. ఓ దేవతలారా ! రావణవధాదికార్యములు చేయకుండినను ఆ శేషశాయి యగు విష్ణుభగవంతుడు తన విచిత్రకార్యముల యపేక్షచే ఈశ్వరుడే యనిపించుచున్నాడు.

అట్లే జీవులున్ను తమతమ విచిత్రకార్యాపేక్షచే ఈశ్వరులే యైయున్నారు. ఇపుడు జీవుల విచిత్రశక్తియొక్క నిరూపణము గావింపబడుచున్నది. — ఓ దేవతలారా! దేహధారిజీవులందొకడు రెండవవానియొక్క అపేక్షచే విచిత్ర శక్తి గలవాడుగా ప్రతీతుడగుచున్నారు ఈలాగున ఆ సర్వజీవులు తమ తమ కార్యములందు ఆశ్చర్యకారకులే యగుదురు. చూడుడు — స్పష్టవచనోచ్చారణశక్తి కేవలము మనుష్యులందే కలదు. పశుపక్ష్యాదులందు లేదు. ఆకాశగమనశక్తి కేవలము పక్షులందేకలదు. మనుష్యాదులందులేదు. లేశమాత్రఛిద్రములందు ప్రవేశించుశక్తి కేవలము సర్పమునందేకలదు. మనుష్యాదులందు లేదు. నిశ్చలముగా స్థితమగుశక్తి వృక్షమునందే కలదు. మనుష్యాదులందులేదు. అకస్మాత్తుగా ప్రకటితమై అంతర్ధానమగునట్లు శక్తి దేవతలందు కలదు. మనుష్యాదులందు లేదు ఈ ప్రకారముగ యితరములైన జాతి గోత్రకులాదుల భేదముచే భిన్నభిన్నతను పొందిన నానాప్రకారజీవులు నానాప్రకార శక్తులచే యుక్తులుగా నున్నారు. ఎట్లనగా — మనుష్యులందు కొందఱు మహాశూర వీరులైయున్నారు. కొందఱు సకల ప్రజలను తమ ఆజ్ఞయందు వర్తింపజేయువారైయున్నారు ఇంక కొందఱు మంత్రవేత్తలైయున్నారు. అట్లే కొందఱు వేదవేత్తలుగను, కొందఱు శాస్త్రకర్తలుగను, కొందఱు శాస్త్రార్థవేత్తలుగను, కొందఱు వేదశాస్త్రానుష్ఠానము గలవారుగను, కొందఱు ధర్మనాటకాది ఉపవిద్యావేత్తలుగను, కొందఱు కామక్రోధాది ఆసురీసంపదగల వారుగను, కొందఱు శాంతిదాంత్యాది దైవీసంపదగల వారుగనున్నారు. ఈ ప్రకారముగ పరమేశ్వరునిశక్తి ఆయా యుపాధులందు విచిత్ర భావమునున్నేపొందుచున్నది ఆ ఈశ్వరశక్తియే శాపానుగ్రహ సమర్థులైన ఋషులశరీరమందును కలదు. ఆ ఈశ్వరశక్తియే స్త్రీపురుషాదిశరీరములందును గలదు.ఆ ఈశ్వరశక్తియే స్త్రీపురుషాదిశరీరములందును గలదు మఱియు సకలేంద్రియములందునుగలదు. ఏలాగుననగా — శరీరమందలి నాసికాకర్ణముఖాదిచ్ఛిద్రములు బాహ్యమునకు సమానముగనే ప్రతీతమగుచున్నవిగాని వాటి అంతరమున విశేషతాసిద్ధిచేయునట్టి యేదో ఒకశక్తి కలదు. ఆ శక్తియొక్క బలముచే ఆ నాసికాదులకు గంధగ్రహణాది కార్యములు పరస్పరము విలక్షణముగ నగుచున్నవి. ఒక యింద్రియ కార్యము ఇంకొక యింద్రియము చేయుటకు శక్యముకాదు ఈలాగున చూచినపుడు లోకమందు సర్వపదార్థములు అచింత్యశక్తిగలవిగా నున్నవి. ఈ కారణమువలన ఆ సర్వపదార్థములు అనిర్వచనీయ స్వభావము గలవిగాను, విచిత్రశక్తిగలవాడైన ఒక ఈశ్వరుని ఆశ్రితములుగాను నున్నవి. కనుక ఆ యొకడైన ఆ యానందస్వరూపాత్మదేవుడు శరీరాద్యుపాధిభేదములచే ఈశ, జీవ, పురుష, స్త్రీ, విప్ర, పండిత, మూర్ఖ, గో, వృక్ష, పక్షి, చతుష్పాద ద్విపాద, అనేకపాద, ఇత్యాది అనేకనామములను పొందుచున్నారు.

ఓ దేవతలారా! అవిచారకాలమందు ఆ సర్వనామములు పరమాత్మదేవునికే నవి గోచరించునుగాని విచారకాలమందు స్థూలశరీరమునకేనని సిద్ధించును. శరీర సాక్షియైన ఆత్మకు యేయొకనామమున్ను లేదు. ఓ దేవతలారా! వాస్తవముగ అయానందస్వరూపాత్మ స్వయంజ్యోతిరూపుడై సర్వభేదరహితుడై యున్నాడు అతడు కల్పితభేదముచే సత్యజ్ఞానాదిగుణములు*లవాడైనను వాస్తవముగ నిర్గుణ స్వరూపుడై సకలోపాధిరహితుడై యున్నాడు. ఇటువంటి పరమాత్మదేవుడు అనాది మాయాసంబంధమున నానాప్రకార కార్యములను చేయుచున్నాడు. మఱియు జీవేశ్వ రాది నానాభేదము గలవాడుగా ప్రతీతుడగుచున్నాడు. ఎట్లు స్తంభధారణాదిగృహాకాశ కార్యమును ఘటాకాశము చేయజాలదో, అట్లే ఈశ్వరుని కార్యమును జీవుడు చేయ జాలడు. ఎట్లు గృహాకాశ, ఘటాకాశభేదము నామమాత్రమో, అట్లే జీవేశ్వరభేదమున్ను నామమాత్రమేగాని వాస్తవముగలేదు. ఈశ్వరరూపతనుగ్రహించి సకలజీవులు మనుష్యాది సకలోపాధులందు స్థితులైనను దృష్టిసృష్టివాదమురీతిగా తమదర్శనము చేత నీ జగదుత్పత్తిని చేయుచున్నారు. (దృష్టి సృష్టి వాదరీతి ద్వితీయాధ్యాయమందు విస్తారముగ నిరూపింపబడినది)

దేవతలు — హే భగవన్! శారీరక మీమాంసాచతుర్థాధ్యాయ చతుర్థపాద మందు "జగద్వ్యాపారవర్జమ్" అనుసూత్రమందు వ్యాసభగవంతునిచే, సగుణ బ్రహ్మసంబంధ అహంగ్రహోపాసన చేయువారైన మనుజులకు ఒక జగదుత్పత్త్యాది వ్యాపారము తప్ప ఇతర సకలైశ్వర్యప్రాప్తి కథనము చేయబడితె. ఇచ్చట తామో సకలజీవులకు జగదుత్పత్త్యాదుల కారణతను కథనము చేయుచున్నారే?

ప్రజాపతి — ఓ దేవతలారా! ఆ వ్యాసభగవంతుని సూత్రవచనముచే ఉపా సనారూప యోగఫలనియమము కథనము చేయబడెనుగాని, ఉపాధులందు ప్రవిష్టు లైన ఈశ్వరునిశక్తినియమము కథనము చేయబడలేదు. అధికారిపురుషులెపుడు అహంగ్రహోపాసనారూప యోగఫలమును పొందుదురో, అపుడా యుపాసకులు జగదుత్పత్త్యాది వ్యాపారమునుతప్ప ఇతరసర్వైశ్వర్యమును పొందుదురు. ఈలాగునే ఉపాసనాఫలపరిచ్ఛేదమునే ఆ వచనము కథనము చేయుచున్నది ఆ వచనమున కిదియే తాత్పర్యము. మఱియు యెట్లు శరీరాది సర్వోపాధులందు స్థితుడైన ఈశ్వరుడు జగదుత్పత్త్యాదులందు ప్రవృత్తుడై విశేషరూపముచేతను, సామాన్యరూపముచేతను జగదుత్పత్త్యాదుల చేయుచున్నాడో. అట్లే అంతఃకరణాద్యుపాధులందు స్థితుడైనను ఈ జీవుడు వామదేవునివలె నేను సర్వరూపుడనను నీ ప్రకారముగల శాస్త్రజన్య బ్రహ్మదృష్టిచే యుక్తుడై జగత్తును సామాన్యవిశేషరూపములచే నుత్పన్నము చేయు చున్నాడు.

తాత్పర్యము — కర్మోపాసనల ఫలమునకు సృష్టియొక్క ఆదికాలమందు ఈశ్వరునిచే నియమము చేయబడెను. కనుక కర్తృత్వాభిమానపూర్వకముగ కర్మోపాసకులు నియమముగ నంత ఫలమును పొందుదురు. అధికఫలము వానికి దొఱకదు. మఱియు ఏ అధికారిపురుషులు సర్వత్ర పరిపూర్ణబ్రహ్మమునెఱిగి పరిచ్ఛిన్నతాభిమానమును విడుచుదురో, వారికి భేదనివృత్తియగుటవలన ఈశ్వరునికర్మమే వానికర్మమగును. ఈశ్వరుడైననో వ్యష్టిశరీరమందు స్థితుడై సమష్టికార్యముచేయుటకు సమర్థుడు. ఎట్లనగా — ఆ పరమేశ్వరుడు విశ్వామిత్రుని శరీరమందు ప్రవిష్టుడై త్రిశంకుకొఱకు రెండవస్వర్గమును రచించెను. (కృష్ణావతారమందు పదునాఱువేల భార్యలతో ఒకేరాత్రి క్రీడించుట వ్యష్టిశరీరశక్తియా? కాదు సమష్టి శరీరశక్తియే వ్యష్టిశరీరశక్తి చూచినపుడు ఒక్కొక్క భార్యతో క్రీడించుట కొకనిమిషమైనను దొఱకదు) కాబట్టి ఈ జాగ్రదవస్థాసంబంధసృష్టియు ఈశ్వరునియొక్కయే కర్మయగును. ఈ విషయము నేవాదియు నివారణ చేయజాలడు

అథవా — "జగద్వ్యాపారవర్జమ్" అనుసూత్రాభిప్రాయమిదియునగును. — యోగులకు బ్రహ్మవిద్యాబలమున ఈశ్వరునితోటి అభేదమైనను ఆ యోగులకన్నను ఈశ్వరుడు అధికముగనున్నాడు. ఏలాగుననగా — ఈశ్వరుడో సర్వదాజగత్కర్తగానున్నాడు. యోగులందు బ్రహ్మవిద్యకన్న పూర్వము జగత్కర్తృత్వములేదు. కనుక వారు సర్వదా జగత్కర్తలుకారు. ఈలాగున పరమేశ్వరుని అధికత పైసూత్రమందు వ్యాసభగవానునిచే చెప్పబడినదిగాని యోగి మొదలగు జీవులస్వయమేవ ఈశ్వరతను వ్యాసభగవంతుడు నివారణచేయలేదు. అథవా దేహధారులుగ నెందరో జీవులు బహుపదార్థముల ఉత్పత్తిసంహారము చేయువారుగను, ఎందఱో జీవులు అల్పపదార్థముల యుత్పత్తి సంహారము చేయువారుగను ప్రతీతులగుచున్నారు. ఆ న్యూనాధికతాధర్మము కేవలము జీవులదికాదు ఈశ్వరునిదే. — చక్రవర్తియొక్క ప్రజాపాలనవ్యవహారము మండలేశ్వరరాజులకును గ్రామాధికారులకును కలుగుచున్నది. అదేవ్యాపారము భృత్యజనులకునగుచున్నది. అట మండలేశ్వరులనుండి భృత్యపర్యంతముగల ప్రభుత్వమేది కలదో, ఆ సకలప్రభుత్వమందు యెట్లు చక్రవర్తియొక్క ప్రభుత్వమనుగతమైయున్నదో, అట్లే సర్వజీవుల కర్తృతయందును పరమేశ్వరుని కర్తృత అనుగతమైయున్నది అజ్ఞానబలమున తనస్వరూపభూతఈశ్వరునిమండియు భేదభావమును పొందినవారైన జీవులకు జాగ్రదాది మూడవస్థలు కార్యరూపములైయున్నవి. ఈ ప్రకారముగ సాక్షాత్తుగాగాని, పరంపరగాగాని ఈశ్వరుడే జగత్కారణమైయున్నాడు.

ఓ దేవతలారా! ఈ జీవాత్మ ఏయే అవస్థనుచూచుచున్నాడో, ఆ యా యవస్థను జనింపజేయుచున్నాడు. ఏ యే అవస్థను చూచుటలేదో, ఆ యా అవస్థను తనయందు

లయము చేయుచున్నాడు. ఈ దృష్టిసృష్టివాదము రీతిగా, జీవాత్ముడే యుత్పత్తిలయములకు కారణమగును. ఈ స్థూలశరీరము మాతాపితరుల శుక్లశోణితములచేతను, సూక్ష్మశరీరము పంచభూతములద్వారా మాయావిశిష్టఈశ్వరునిచేతను పుట్టుచున్నదని లోకమందును, శాస్త్రమందును ప్రసిద్ధమైయున్నను, ఆ ప్రక్రియమందబుద్ధులగు జనుల బోధనకొఱకే యగును. ఉత్తమాధికారికొఱకో, ఈ దృష్టిసృష్టి ప్రక్రియయే మోక్షనగరికి మార్గమైయున్నది. ఆ మోక్షమార్గప్రక్రియ వేదాంతమందు గుప్తముగా నుంచబడియె. కాబట్టి తమ దర్శనకాలమందు పుట్టుట, అదర్శనకాలమందు లయమగుట ఇటువంటి శ్రుత్యనుభవసిద్ధప్రక్రియయే బుద్ధిమంతులచేనంగీకరింపదగినది. దేవతలు — హే భగవన్ ! దర్శనాదర్శనకాలమందు ఉత్పత్తి లయములైనపుడు ఆ యుత్పత్తిలయములు జీవులకెందుకు ప్రతీతములుకావు ?

ప్రజాపతి – ఓ దేవతలారా ! శరీరాది పదార్థములు దర్శనాదర్శన కాలములందు పూర్వశరీరాదులతోటి సమానాకారముగ పుట్టుటవలన, జీవులు వాటి ఉత్పత్తినాశమెఱుగరు. చూడుము. — వాస్తవముగ జన్మమరణ రహితుడైన ఆత్మదేవునకు ఈ స్థూలశరీరముతోటి తాదాత్మ్యాధ్యాసమగు అభిమానమే ఆత్మదేవుని జన్మము. మఱియు అభిమాననివృత్తియే ఆత్మదేవుని మరణము. అట్లే శరీరాది దృశ్యపదార్థముల దర్శనమే జన్మము. అదర్శనమే మరణము. ఈ ప్రకారమగు దృష్టి సృష్టివాదము రీతిగా, ఈ జీవాత్మ జాగ్రదాది మూడవస్థలయందు శరీరాది పదార్థముల ఉత్పత్తిసంహారములచేయుచు, తన్ను ఈశ్వరరూపముగ నెఱుగకుండును. ఈ కారణమువలననే జీవసంజ్ఞను పొందుచున్నాడు. గురుకృపచే ప్రాప్తమైన యాత్మజ్ఞానమువలన, అజ్ఞానము నివృత్తమైనపుడు అధికారిపురుషులు అవస్థాత్రయ రహితమైన, తురీయమైన పరమపదమును పొందుచున్నారు. కాబట్టి అధికారిపురుషులు ఆత్మజ్ఞానము నవశ్యముగ సంపాదన చేయవలసినది.

ఇపుడు పూర్వోక్త ప్రణవమంత్రముయొక్క ఉపదేశము గావింపబడుచున్నది హే శిష్య ! అగ్న్యాది దేవతలు ప్రజాపతిని యిట్లు ప్రార్థించిరి ఓ భగవంతుడా పూర్వము తాము ప్రణవోపాసనను చెప్పితిరి ఇపుడా ప్రణవోపాయముచే ప్రాప్తింప యోగ్యమైన నిర్విశేషశుద్ధాత్మను మాకుపదేశముచేయుడు

ప్రజాపతి — ఓ దేవతలారా ! మనోవాక్కుల కవిషయమైన శుద్ధాత్మదేవుని సాక్షాదుపదేశమందెవడును సమర్థుడుకాడు. కనుక ఆ యాత్మదేవునియందు నానాప్రకారధర్మముల నారోపణజేసి నేను మీకు వానిని కథనము చేసెదను – పూర్వము నేను మీకు యే సచ్చిదానంద స్వరూప నృసింహ పరమాత్మదేవుని కథనము చేసితినో

ఆ పరమాత్మదేవుడే త్వంపదార్థములైన మీతోటి యేకతనుపొంది తనసమీపతామాత్ర ముచే సర్వబుద్ధులకు ద్రష్టరూపుడైయున్నాడు. ఓ దేవతలారా! ఈ సంఘాతమందు జీవుని మనస్సు యెపుడు శుభాశుభకర్మముల చేయుచున్నదో అపుడాద్రష్టయైన ఆత్మ దేవుడు ఆయా కర్మముల కనుమతి యొసంగుచున్నది. (ప్రవృత్తమైన దానిని నివృత్తము చేయకుండుటకు నామము అనుమతి) ఎందుకనగా — ఆ యాత్మదేవుడు పంగు పురుషుని సామర్థ్యరహితుడగుటవలన ఉదాసీనుడుగానున్నాడు. దేవతలు — హే భగవన్! ఆ యాత్మదేవుడు మనోవృత్తికి అనుమతి యొసంగినపక్షమందు వికారవంతుడగునుకదా?

ప్రజాపతి — ఓ దేవతలారా! ఆ యాత్మదేవుడు చైతన్యరూపుడుగాను, సకల వికారరహితుడుగాను, సుఖదుఃఖరహితుడుగాను. బుద్ధ్యాదులకు సాక్షిరూపుడుగాను, సచ్చిదానందరూపుడుగాను, సకలజగత్తునందేకరూపుడుగానున్నాడు. మఱియు ఈ సంపూర్ణద్వైతప్రపంచము ఆత్మదేవునియందు వాస్తవముగలేదు. కల్పితమగుటవలన ఆ ప్రపంచమునకు స్వతంత్రసత్త సిద్ధింపదు. ఓ దేవతలారా! యే మాయచే పరమాత్మ దేవునియందు జగత్కల్పన చేయబడినదో ఆ మాయాస్వరూపము. వేదవేత్తలచే నిట్లు కథనము చేయబడియె. ఏది తాను ప్రత్యక్షాది ప్రమాణములచే ప్రతీతముకాకుండునో, దేనికార్యము ప్రమాణముచే ప్రతీతమగునో, అది దుర్ఘటమాయ అనబడియె. ఆ మాయ తానే సద్రూపముకాదు. ఇక నపుడు తన్మాయాకార్యమైన జగత్తు యే రీతిగా సద్రూప మగును? కాదు. అది అసద్రూపమేయగును. ఐనను ఆ జగత్తు దుర్ఘట మాయా ప్రభావముచే సద్రూపముగా ప్రతీతమగుచున్నది. ఆకాశమందు గంధర్వనగరమువలె ఆత్మయందు ప్రపంచము తోచుచున్నది. ఓ దేవతలారా! సర్వజీవులకు జాగ్రదాది మూడవస్థలంను అనుగతమైన ఆ దేవుడు సచ్చిదానంద స్వరూపమైయున్నాడు. కనుక ఆ త్వంపదార్థరూపార్థదేవుడు తత్పదార్థపరబ్రహ్మరూపమే యైయున్నాడు.

దేవతలు — ఓ భగవంతుడా! ఈ ఆత్మదేవుడు సకలదుఃఖరహితుడైన పక్ష ముందు జీవులకు 'అహందుఃఖీ' యను ప్రతీత యెందుకు కలుగుచున్నది? ప్రజాపతి — దేవతలారా! సర్వదుఃఖరహితమగు పరబ్రహ్మముతోటి యభిన్నుడగుటవలన ఆత్మ దేవునియందును, వాస్తవముగ దుఃఖములేదు. ఇటువంటి దుఃఖరహితాత్మదేవునియందు దుఃఖప్రతీతి కేవలమవిద్యచేతనే గలిగినది. చూడుడు! "నేను బ్రహ్మరూపుడ"నమనీ యభేదజ్ఞానమును, విద్వాంసులు విద్యానామముచే కథనము చేయుచున్నారు. అవిద్య "నేను ఈ శరీరమందు స్థితుడను, సర్వత్రవ్యాపకుడనుగాను" అను నీ ప్రకారముగ సర్వదేహధారిజీవుల కనుభవసిద్ధమైయున్నది. అది సద్రూపమనిగాని, అసద్రూపమని గాని చెప్పనలవికాదు. మఱియు నది సంసారరహితాత్మయందు సంసారకారణతను

జూపునట్టిది. ఈ కారణమువలననే విద్వాంసులచే నా అవిద్య దుర్ఘటనామముచే కథనము చేయబడియె. ఆ దుర్ఘటావిద్య జడమగుటవలన ఆత్మకన్న భిన్నమైయున్నను అట్లాత్మభిన్నముగ ప్రతీతముకాదు. అధిష్ఠానాత్మాశ్రితమైయే ప్రతీతమగుచున్నది. వాస్తవముగ అస్వతంత్రమైనను, శత్రువువలె ఆత్మదేవున కనేకప్రకారదుఃఖముల ప్రాప్తింప జేయుటవలన వేదవేత్తలా యవిద్యను స్వతంత్రమనుచున్నారు. ఈ స్వయం జ్యోతిరానందస్వరూపనిర్గుణాత్మదేవుడు వాస్తవముగ అద్వైతరూపుడైనను అవిద్యా బలమున భేదముగలవారుగా ప్రతీతుడగుచున్నాడు. ఈలాగున భేదదృష్టిద్వారా ఈ యవిద్యయే సర్వదుఃఖములకు కారణమైయున్నది.

ఓ దేవతలారా! జ్ఞాతసుఖమందే సకలజీవులకు ప్రీతియగుచున్నది గాని, అజ్ఞాతసుఖమందేజీవులకును ప్రీతికాదు. ఈ విషయము లోకప్రసిద్ధము. మఱియు సకలజీవులకు తమ ఆత్మయందే ప్రీతి కనబడుచున్నది. అందుచే ఈ సకలజీవులు తమ ఆనందస్వరూపాత్మను యెఱుగుచున్నను, అవిద్యచే నావృతులైన ఈ జీవులు ఆత్మస్వరూపానందమును విశేషరూపముగా నెఱుగరు. అల్పవిషయములయందలి సుఖబుద్ధిచే, సర్వదా దుఃఖమును పొందుదురు. ఓ దేవతలారా! జాగ్రత్స్వప్నావస్థ లందు జీవుడు ఆనందస్వరూపాత్మను యెఱుగకుండుటయనునది కార్యరూపావిద్యా బలము, సుషుప్త్యవస్థయందు ఆనందరూపాత్మ నెఱుగకుండుటయనునది కారణావిద్యా బలము. ఈలాగున కార్యకారణరూపములచే నీ యవిద్యయే సకలజీవులకు మోహ ప్రాప్తి నొనర్చుచున్నది. మఱియు సుషుప్తియందు, చైతన్యరూపాత్మయందు అజ్ఞత్వ మేది ప్రతీతమగుచున్నదో, దానికి చైతన్యనాశము కారణము కాదు. సకల ద్వైత ప్రపంచాభావమే కారణమగును.

శ్రుతి॥ "నహి ద్రష్టుర్దృష్టేర్విపరిలోపో విద్యతే, అవినాశిత్వాత్"

భావార్థము॥ ద్రష్టాత్మయొక్క స్వరూపభూతచైతన్యదృష్టి నాశరహితముగ నున్నది. ఆ చైతన్యదృష్టి సుషుప్తియందు, నాశమైనపక్షమందు, అట ఆత్మదేవుడు తమోరూపాజ్ఞానమును నెఱుగకుండవలసియుండె. కాని ఆత్మదేవుడు సుషుప్తియందు తమోరూపాజ్ఞానము నెఱుగుచునే యున్నాడు. చూడుడు. సుషుప్తినుండి మేల్కొనిన పురుషుడు, "నేను కొంచెమైన నెఱుగనైతి"నని స్మరణము చేయుచున్నాడు. జాగ్రత్తు నందలి యా స్మరణము సుషుప్తి స్థితాజ్ఞానమునే విషయము చేయుచున్నది. అను భూతవస్తువుయొక్కయే స్మరణమగునుకదా! ఇపుడాయజ్ఞానముయొక్క తుచ్ఛత్వ నిరూపణము గావింపబడుచున్నది.

ఓ దేవతలారా! సుషుప్తియందలి అనుభూతాజ్ఞానము, ఆత్మకన్న భిన్నమై జడ రూపమైయున్నది. ఆ తమోరూపాజ్ఞానము ప్రత్యక్షాదిప్రమాణములచే గ్రహింపబడును.

ఈ కారణమువలన విద్వాంసులు ఆ యజ్ఞానమును తుచ్ఛమనుచున్నారు. లోకమందే పదార్థము త్రికాలమునందును సత్తారహితమై స్వరూపరహితమైయుండునో, నామ మాత్రముచే ప్రతీతమగునో, అటువంటి వంధ్యాపుత్ర నరశృంగాది పదార్థములను తుచ్ఛమనుచున్నారు. అట్లే అజ్ఞానమున్ను త్రికాల సత్తారహితమై, అజ్ఞానము, అవిద్య, మాయ, ఇత్యాదినామమాత్రములచే ప్రతీతమగుచు తుచ్ఛమైయున్నను, అది సకల సంసారమునకు కారణమగుటవలన, వేదవేత్తలచే దుర్ఘటమనబడినది. మఱియు వంధ్యాపుత్రన్యాయముగ తుచ్ఛరూపమై, భావరూపముగ ప్రతీతమైనట్టి జగత్తునకు కారణమగుటవలన వేదవేత్తలు ఆ యజ్ఞానమును భావరూపమనుచున్నారు.

ఓ దేవతలారా! తుచ్ఛరూపత మఱియు భావరూపత ఈ రెండుధర్మములు పరస్పరవిరుద్ధములగుట వలన, ఒకేవస్తువందుండవు. ఈ ప్రకారమగు అనుపపత్తియొక్క విచారముచేసి, విద్వాంసులు ఆయజ్ఞానమును అనిర్వచనీయనామముచే కథనము చేయుచున్నారు మఱియు ఈ యజ్ఞానము చైతన్యరూపాత్మకన్న భిన్నమై జడజగత్తునకు కారణరూపమై చైతన్యాత్మను ఆవరణము చేయుటవలన, విద్వాంసులద్దానిని జడమనుచున్నారు. ఘటాది పదార్థములు, స్వోత్పత్తికి పూర్వము మృత్తికాదులందు స్థితమైన ప్రాగభావమునకు ప్రతియోగిత్వరూపమగు అంతముగలవైయున్నవి. అజ్ఞానము అట్లు కాలపరిచ్ఛేదరూపమగు అంతముకలదికాదు. ఈ కారణమువలన విద్వాంసులజ్ఞానమును అనంతనామముచే కథనముచేయుచున్నారు. ఓ దేవతలారా! ఎట్లు ఘటాదిపదార్థములకు మృత్తికాదులు కారణమగుచున్నవో అట్లు అజ్ఞానమునకును ఏదోయొక కారణమంగీకరించిన పక్షమందు ఆ కారణమునకును యింకొక కారణము కలదా? లేదా? అని విచారింపవలయును. అట ప్రథమపక్షమంగీకరించిన ఆ ద్వితీయ కారణమునకును తృతీయకారణము, తృతీయకారణమునకును చతుర్థకారణము, ఈలాగున అనవస్థాదిదోషములగును. ద్వితీయపక్షమంగీకరించిన అజ్ఞానముయొక్క కారణముచేతనే సకలవ్యవహారసిద్ధి యగుటవలన ప్రథమజ్ఞానమందు వ్యర్థతయగును. కనుక అజ్ఞానము ఏకారణముచేత నుత్పన్నము కానట్లు అంగీకరించుట యుచితము. ఈ అభిప్రాయముచేతనే విద్వాంసులు అజ్ఞానమును అనంతమనుచున్నారు. అథవా - ఈ ప్రపంచముయొక్క అంతము ఏ పురుషుడును యెఱుగడు. ఈ కారణమువలన ప్రపంచము అనంతమైయున్నది. ఆయనంతప్రపంచము యేదోయొక పరిచ్ఛిన్న కారణమువలన పుట్టదు. అనంతమైన అజ్ఞానముచేతనే పుట్టుచున్నది. ఈ కారణమువలనను వేదవేత్తలు అజ్ఞానమును అనంతనామముచే కథనము చేయుచున్నారు. అథవా —

ఈయజ్ఞానము బ్రహ్మజ్ఞానముచేకాక ఇతర సహస్రోపాయములచేతను నాశమును పొందదు. ఈ కారణమువలనను దానిననంతమనుచున్నారు.

ఓ దేవతలారా! మోహరహిత స్వయంజ్యోతిరానంద స్వరూపాత్మదేవుని ఈ యజ్ఞానము ఆవృతముచేయుచున్నది. ఈ కారణమువలననే వేదవేత్తలాయజ్ఞానమును మోహనామముచే కథనముచేయుచున్నారు. మఱియు ఈ అజ్ఞానరూపావిద్య స్వయం జ్యోతిరాత్మయందు పూర్వమెపుడును యుండలేదు. ముందును యెప్పటికిని యుండదు. ఇపుడునులేదు. ఈ ప్రకారమాత్మస్వరూపము నుండి నిత్యనివృత్తమై, తన అచింత్య శక్తిరూపబలముచే ఆ స్వయంజ్యోతిరాత్మకు నానాప్రకారమోహప్రాప్తి నొనర్చు చున్నది.

ఇప్పుడు అవిద్యాకృతమోహము వర్ణింపబడుచున్నది — ఓ దేవతలారా! ఆకా శాది పంచభూతాది కార్యరూపములగు స్థూలసూక్ష్మములను రెండుశరీరములందు ఈ యానందరూపాత్మ అహంబుద్ధి మమత్వబుద్ధి చేయుచున్నారు. ఆత్మదేవుడు యేభూత కార్యములను ప్రత్యగ్రూపముగ నెఱుగుచున్నాడో, ఆ భూతకార్యములందు అహం బుద్ధిని ఏ భూతకార్యమును బాహ్యముగ నెఱుగుచున్నాడో, ఆకార్యమందు మమత్వ బుద్ధి చేయుచున్నాడు. సకలద్వైతప్రపంచముచే మోహము పొందినవాడైన ఆత్మ దేవుడు, ఆ ప్రపంచమును తనయందు యెఱుగుచున్నాడు. ఓ దేవతలారా! ఆత్మ దేవుని మోహమునకు కారణరూపముగ జడరూపముచే, జగత్కారణరూపముచే, అనాది అనంతరూపములచే కథనము చేయబడిన ఏ మాయారూపాజ్ఞానముకలదో ఆ యజ్ఞానము సిద్ధత్వధర్మముచే విశిష్టమై ప్రతీతమగుటవలన వేదవేత్తలద్దానిని సత్యరూపముగ కథనము చేయుచున్నారు. మఱియు ఆ యజ్ఞానము అసిద్ధత్వరూప ముచే విశిష్టమై ప్రతీతమగుటవలన అసత్యనామముచేతను కథనము చేయుచున్నారు.

సిద్ధత్వాసిద్ధత్వములు — ఇంద్రియాదుల విషయతకు నామము సిద్ధత్వము ఆ సిద్ధత్వము కార్యరూపమగు అజ్ఞానమందు గలదు. కనుక ఆ యజ్ఞానమున్ను సిద్ధమనబడును, స్వరూపముగ అజ్ఞానమందు ఇంద్రియాదుల విషయతలేదు. కనుక అసిద్ధమనబడును. అథవా — ''నేను అజ్ఞానిని'' ఈ రీతిగా సర్వజీవుల అనుభవ మునకు విషయమగుటవలనను అజ్ఞానము సిద్ధమనబడును. విచారముచే నివృత్త మగుటవలన అసిద్ధమనబడును. అథవా లోకమందు స్వతంత్రుని సిద్ధుడనుచున్నారు. పరతంత్రుని అసిద్ధుడనుచున్నారు. ఆ స్వతంత్రతయు అస్వతంత్రతయు అజ్ఞానమందు గలదు. ఈ కారణమువలన అజ్ఞానమును కూడా సిద్ధాసిద్ధమనుచున్నారు. ఇపుడజ్ఞాన మునకు స్వతంత్రత చూడుడు. ఈ యజ్ఞానము స్వరూపముగ జడమై తుచ్ఛమై యుండినను అనాది అనంతరూపముచే ప్రసిద్ధమైయున్నది. వాస్తవముగ మోహరహిత

మగు ఆత్మకు మోహప్రాప్తిని జేయుచున్నది. కనుక స్వతంత్రమనబడెను. అథవా— మధ్యాహ్న సూర్యునియందు అంధకారస్థితి దుర్ఘటమైనట్లు స్వయంజ్యోతిరాత్మయందు అజ్ఞానస్థితియును అత్యంతదుర్ఘటము. అట్లయినను ఈ అజ్ఞానము తనబలముచే స్వయంజ్యోతిరాత్మయందు స్థితమగుచున్నది. గనుక స్వతంత్రమనబడెను. అథవా— ఈ మాయారూపాజ్ఞానము స్వయంజ్యోతిరాత్మదేవుని ఆశ్రయించి ఆ యాత్మదేవుని అధీనమై యున్నది. ఇట్లుండియు ఆ యాత్మదేవునే తనవశముగ జేసుకొనుటవలన స్వతంత్రమనబడెను. మఱియు ఆత్మసంబంధాశ్రయత విషయతచేతనే సిద్ధించుచున్నది. కనుక పరతంత్రమనబడెను.

దేవతలు — ఓ భగవంతుడా! ఆ యవిద్య స్వరూపముచేతనే ఆశ్రయవిషయమును పొందును. దానికి రెండవదైన ఆశ్రయవిషయాపేక్ష సంభవింపదుకదా? ప్రజాపతి — ఓ దేవతలారా! ఎట్లు అంధకారము అంధకారమునకు విషయము కాదో, అంధకారభిన్న గృహాదిపదార్థములు అంధకారమునకు విషయములగుచున్నవో, అట్లే అవిద్యయు అవిద్యకు విషయముకాదు. అతిశయతారూపఫలోత్పత్తి తనకన్న భిన్నపదార్థమందే యొనర్పనగును. తనయందే తాను అతిశయతాఫలోత్పత్తి చేయుటకు నేపదార్థమును సమర్థముకాదు. ఈలాగున అవిద్యయొక్క విషయత అవిద్యయందు సంభవింపదు. మఱియు 'నేను అజ్ఞానిని నేను దుఃఖిని' ఈ ప్రకారానుభవముచే సిద్ధించిన ఆవరణవిక్షేపరూప ఫలమును ఆ అవిద్య ఆనందరూపాత్మయందే నుత్పన్నము చేయుచున్నది. కనుక నవిద్య ఆత్మదేవునకు విషయమగును. ఓ దేవతలారా! ఎట్లు అవిద్యకు అవిద్య విషయముకాదో, అట్లే అవిద్యకు అవిద్య ఆశ్రయముకాదు. (అంధకారమువలె) ఈలాగున అవిద్యకు తనకన్న భిన్నమైన ఆత్మదేవుడే ఆశ్రయమగును. (ఆశ్రయమందు ఆశ్రితముకన్న అధికతయు కావలసినదే. అది కూడా ఆత్మయందుగలదు.) — దేవతలు — ఓ భగవంతుడా! శుక్తివిషయిక అజ్ఞానమునకు ఆశ్రయము భ్రాంతపురుషుడు. విషయము శుక్తి. అట్లే ఆ యవిద్యకును ఆశ్రయవిషయములు భిన్నభిన్నములు కావలసినదికదా? — ప్రజాపతి — ఓ దేవతలారా! విచారించి చూచినపుడు అజ్ఞానమునకు విషయము శుక్తికాదు. శుక్త్యవచ్ఛిన్న చైతన్యాత్మయే విషయమగును. చూడుడు శుక్త్యాది జడపదార్థములో స్వరూపముగానే ఆవృతములై యున్నవి. ఇక వాటిలో అజ్ఞానకృతావరణము సంభవింపదు. పరిశేషముగ ఆ యజ్ఞానము పూర్వము ఇదంతారూపముచే కథనము చేయబడినదైన శుక్త్యవచ్ఛిన్నచైతన్యమునే విషయము చేయుచున్నది. (ఆవరణముచేయుటయే విషయముచేయుట) — దేవతలు — హే భగవన్! ఆ యజ్ఞానము చైతన్యమునే విషయము చేసినపక్షమందు శుక్తియందు జ్ఞానవిషయత ప్రతీతము కాకుండవలసియుండె.

ప్రజాపతి — ఓ దేవతలారా! పూర్వము ఇదంతారూపముచే వర్ణనము చేయబడిన యే స్ఫురణరూపసామాన్యచైతన్యమందు ఈ శుక్త్యవచ్ఛిన్నవిశేష చైతన్యము తాదాత్మ్యసంబంధముచే నుండునో, ఆ విశేషచైతన్యమునే అజ్ఞానము ఆవరణము చేయుచున్నది. సామాన్యచైతన్యమును ఆవరణచేయదు. కనుక ఆ యజ్ఞానము అవచ్ఛేదకతారూపముచే ఆ శుక్తినిన్ని విషయము చేయుచున్నది. ఈ అభిప్రాయము చేతనే శుక్తివిషయిక అజ్ఞానమని వ్యవహారముకలదు. ఆ స్ఫురణరూపచైతన్యము అంతరాత్మకన్న భిన్నముకాదు. దానినే వేదవేత్తలు అంతరాత్మరూపముగ కథనము చేయుచున్నారు. ఆ యంతరాత్మయే అజ్ఞానమునకు విషయమైయున్నది. ఈలాగున అజ్ఞానము ఆత్మాశ్రితమనుటయందు ఏ వాదికిని వివాదములేదు. అజ్ఞాన విషయమందో వాదులకు పరస్పర వివాదముకలదు కొందఱు వాదులు — అనాత్మ పదార్థములను, అజ్ఞానమునకు విషయమనుచున్నారు. ఆ వాదుల భ్రమమును పూర్వోక్తయుక్తులు నివృత్తము చేయుచున్నవి. దీనివలన వాస్తవముగ నవిద్యారహిత మగు ఏ సచ్చిదానందాత్మగలదో, ఆ యాత్మదేవుడే అవిద్యకు ఆశ్రయముగాను విషయముగానున్నాడని సిద్ధించుచున్నది ఈ విషయము అన్యశాస్త్రములందును చెప్పబడియె.

"ఆశ్రయత్వ విషయత్వభాగినీ నిర్విభాగచితిరేవ కేవలా।
పూర్వసిద్ధ తమసో హి పశ్చిమో నాశ్రయో భవతి నాపి గోచరః" ॥

ఓ దేవతలారా! ఎట్లు ఆశ్రయవిషయాపేక్షచే పరతంత్రత సిద్ధించునో, అట్లు జడత్వధర్మముచేతను అవిద్యయందు పరతంత్రత సిద్ధించుచున్నది. ఎలాగుననగా లోకమందు జడత్వరూపముచే ప్రసిద్ధమైన రథాదిపదార్థములు చైతన్యములేక స్వతంత్రముగ ప్రవృత్తములుకావు. అశ్వ వృషభాది చైతన్యపదార్థసంబంధముచేతనే రథాదులందు క్రియయగుచున్నది. ఈలాగున సర్వజడపదార్థములు అస్వతంత్రములేయై యున్నవి. ఈ యజ్ఞానరూపావిద్యయు రథాదులవలె జడమగుటవలన పరతంత్రమేయై యున్నది. ఇట్లు చెప్పుటచేత నీయనుమానము సిద్ధించుచున్నది. జడమగుటవలన రథాదులవలె అవిద్య పరతంత్రమగుటకు యోగ్యము, ఈ ప్రకారమవిద్యయందు పరతంత్రత సిద్ధించుచున్నది. లోకమందు అస్వతంత్రపదార్థము అసిద్ధమనబడినది. ఈలాగున అస్వతంత్రమగుటవలన అవిద్యయు అసిద్ధమైయున్నది. మఱియు ఏ పదార్థము అసిద్ధమగునో ఆ పదార్థము అసద్రూపమగును. (నరశృంగ, వంధ్యాపుత్రాదుల వలె) దేవతలు — హే భగవన్! ఈ అవిద్య అస్వతంత్ర, అసిద్ధ, అసత్యాది ధర్మములు గలదైనపుడు పూర్వము తామవిద్యయందు స్వాతంత్ర్య, సిద్ధత్వ, సత్యత్వముల నెందుకు కథనము జేసితిరి? ప్రజాపతి — ఓ దేవతలారా! లోకమందేయేపదార్థము

అసద్రూపమగునో ఆయా పదార్థము వంధ్యాపుత్రాదులవలె యేయొక కార్యమును ఆరంభముచేయదు కనుక అసత్యధర్మము వ్యాప్యమైయున్నది కార్యారంభకత్వము వ్యాపకమైయున్నది. ఎచ్చట వ్యాపకమునకభావమగునో అచ్చట వ్యాప్యమునకును అభావమగును (అగ్న్యభావముచే ధూమాభావమువలె) అట్లే ఈ ప్రసంగమందును సకలజగదారంభము చేయునట్టిదై అసంగనిర్గుణాత్మదేవుని మోహింపజేయునట్టిదైన ఏ యవిద్యకలదో దానియందు కార్యారంభకత్వ వ్యాపకధర్మము లేదు. కనుక ఈ యవిద్యను పూర్వము నేను సత్యనామముచే కథనము చేసితిని. మఱియు అసత్య ధర్మము అసిద్ధత్వధర్మమునకు వ్యాపకమైయున్నది. ఆ యసత్యరూపవ్యాపకధర్మ మున కభావమగుటచే అసిద్ధత్వరూప వ్యాప్యధర్మమునకును అభావమగును. కనుక ఆ యవిద్యను సిద్ధనామముచే కథనము చేసితిని. మఱియు ఆ యసిద్ధత్వధర్మము అస్వతంత్రత్వ ధర్మమునకు వ్యాపకము. అసిద్ధత్వ వ్యాపకధర్మమున కభావమగుట వలన అస్వతంత్రరూప వ్యాప్యధర్మమునకును అభావమగును. అందువలన దానిని స్వతంత్రనామముచే కథనము చేసితిని ఈ ప్రకారముగ ఆ అవిద్యయందు సత్యా సత్య, సిద్ధత్వాసిద్ధత్వ. స్వాతంత్ర్యాస్వాతంత్ర్యాది సర్వధర్మములు సంభవించుటకు శక్యమైయున్నది. ఈ కారణమువలన వేదవేత్తలు ఆ విద్యను అనిర్వచనీయ, దుర్ఘట, ఇత్యాదినామములచే కథనము చేయుచున్నారు. ఇపుడవిద్యాకృత వ్యామోహము వర్ణింపబడుచున్నది. ఓ దేవతలారా! జీవులందు "నేను అజ్ఞానిని. నేను దుఃఖిని" ఈ ఈ ప్రకారమగు బోధ సర్వదాకాదు. ఒకానొకప్పుడు మాత్రమే యగుచున్నది. లోక మందేయేపదార్థము నొకానొకప్పుడగునో, ఆయాపదార్థము ఘటమువలె కార్యరూపమై యేదోయొక కారణముచే జన్యమగును. అట్లే స్వయంప్రకాశానందాత్మయందు "అహం అజ్ఞః అహం దుఃఖీ" ఈ ప్రకారమగు విపరీతబోధకు అవిద్యగాక యితర కారణము సంభవింపదు. అఘటిత ఘటనా పటీయసీయగు అవిద్యయే ఆబోధకు కారణమగుట సంభవించును. ఓ దేవతలారా! ఎట్లు లోకమందాదరమును పొందిన నీచపురుషుడు ఆదరము చేయువాని మస్తకముపై నెక్కుచున్నాడో, అట్లే కల్పనచే సిద్ధింపబడిన యా నీచావిద్యయు తన ఆశ్రయరూపాత్మను తిరస్కారముజేసి తానే విలాసమును పొందు చున్నది. మఱియు ఆ యవిద్యచే తిరస్కారము పొందినవాడైన జగదధిష్ఠానరూప చైతన్యదేవుడు అద్దానియొక్క ప్రభావముచే అసత్యసమానుడుగా నాయెను.

ఓ దేవతలారా! అనేక ప్రకార విలాసములచే యుక్తమైన ఆ యవిద్యకు "కూటస్థాత్మలేదు" ఈ ప్రకారమగు అసత్యాపాదకత్వము ప్రథమవిలాసము. ఆ విలా సముచే ఈ యాత్మదేవుడు తన స్వయంజ్యోతి ఆనందస్వరూపమును విస్మరించు చున్నారు. ఆత్మదేవుడింకను అనేకప్రకారవిక్షేపరూపవిలాసములను చూచుచున్నారు.

వినుడు. నేనుపుట్టుచున్నాను, నేనుబాలకుడను, నేను యవ్వనుడను. నేను వృద్ధుడను, నేను మృతుడను, నేను సుఖిని, నేను దుఃఖని, నేను స్త్రీని, నేను పురుషుడను, నేను షండుడను, నేనుపాపిని, నేను ధర్మిష్టుడను, మొదలగు అనేక ప్రకార అహంతారూప విలాసములను ఆత్మదేవుడు చూచుచున్నాడు. మఱియు ఇతడు నా పిత, ఇది నా మాత, ఇతడు నా పుత్రుడు, ఇది నా భార్య ఇతడు నా బంధువు. ఇది నా ధనము, ఇది నా గృహము, ఈ మొదలగు నానాప్రకార మమతారూప విలాసములను ఆత్మ దేవుడు చూచుచున్నాడు. ఈ యవిద్యావిలాసములు సంసారస్థితికి కారణములై యున్నవి. ఇటువంటి అవిద్యావిలాసప్రాప్తి కనంతరము దేహరూప కారాగృహమును పొంది కామక్రోధాది శృంఖములచే కట్టబడినవారై 'నేను సర్వదా యుండవలయును, నాయభావమెప్పటికిని కాకూడదు.'' ఈ ప్రకారముగ ప్రార్థనచేసి తనశరీరమును రక్షణజేయుచు ఈ మూఢజీవుడు అనేకజన్మలను పొందుచున్నాడు, ఆ యనేకజన్మ లందు ఈ మూఢజీవుడు స్వయంజ్యోతి ఆనందస్వరూపాద్వితీయాత్మను గాంచక, అనేక దుఃఖములనుభవించుచు, నిరంతరము సంసారచక్రమందు భ్రమణము చేయు చున్నాడు. దానివలన విద్యమానుడైనను ఈ జీవాత్మ అసత్యసమాను డగుచున్నాడు. ఈలాగున ఈ మాయారూపావిద్య అత్యంత విచిత్రమై, అత్యంత దుర్ఘటమై, దుఃఖ దాయకమై, సంసారరూప వృక్షమునకు మూలమై, విచారహీనులకు దుర్విజ్ఞేయమై యున్నది. ఇటువంటి అవిద్యయొక్క ప్రభావముచే జీవాత్మ అనేక ప్రకార విపరీత జ్ఞానములచే యుక్తమై ఈ సంసారసముద్రమందు మాటిమాటికి మునుగుచున్నాడు. ఈ యవిద్య సంసార వృక్షమునకు బీజరూపముగాను, అనేకకోటి వాసనా సంస్కార యుక్తముగాను, వస్త్రమువలె సంకోచ వికాస స్వభావముగలదిగా నున్నది. సుషుప్తి, మూర్ఛ, మరణ, ప్రళయాది కాలములందు ఈ యవిద్య సంకోచభావమును పొందుచు జాగ్రదాది కాలములందు వికాసమును జెందుచున్నది.

ఓ దేవతలారా ! ఈ జీవాత్మ నానాప్రకారశరీరములలో జాగ్రత్స్వప్నావస్థలందు, పరతంత్రుడై ఆ యవిద్యావికాసభావముచే అనేక ప్రకార దుఃఖములను పొందు చున్నాడు. ఈలాగున అవిద్యావికాసము జీవులకు దుఃఖకారణమై యున్నది. మఱియు జాగ్రదాద్యవస్థలందు భోగమొసంగు కర్మమునకెపుడు క్షయమగునో, అపుడే అవిద్య సంకోచభావమును పొందును. ఆ సుషుప్త్యాది సంకోచకాలములందు ఈ జీవాత్మ ఆకాశమందెగురుటచే పరిశ్రమమును పొందినదైన పక్షి ఆ శ్రమను వదలి తనగూటిలో సుఖముగ శయనించినట్లు జాగ్రదాద్యవస్థాసంబంధ విక్షేపమును పరిత్యాగముచేసి సుషుప్త్యాదులందు శయనము చేయుచున్నాడు. ఆ కాలమందీజీవాత్మ దుఃఖమును పొందకున్నను, భావిదుఃఖసంబంధ బీజరూపావిద్య సుషుప్త్యాదికాల

మందును విద్యమానమైయున్నది. కనుక ఆ యవిద్యాసంబంధముచే జీవాత్మ అచ్చట దుఃఖియే యనబడుచున్నాడు. ఈ ప్రకారముగ సంకోచవికాస స్వభావములచేత ఈ యవిద్యయే సంసారమునకు కారణమైయున్నది.

ఓ దేవతలారా! పూర్వోక్త నానాప్రకార విలాసములచే యుక్తమైన అవిద్య యెట్లు జీవుల సంసారమునకు కారణమైయున్నదో, అట్లే గురు శాస్త్రోపదేశములచే తెలియఁబడిన ఈ యాత్మదేవుడు జీవుల మోక్షమునకున్ను కారణమై యున్నాడు. మఱియు యెట్లు సంసారదశయందు జీవులకానందస్వరూపాత్మయొక్క అప్రతీతి అథవా, విపరీతప్రతీతి యగుచున్నదో, అట్లే మోక్షదశయందు విద్వాంసులకు ఆ యవిద్య యొక్క అప్రతీతియగుచున్నది. దేవతలు — హే భగవన్! ఒకటియైన అవిద్య అనేక జీవుల అనేక వ్యవహారముల నేరీతిగా సిద్ధింపజేయును?

ప్రజాపతి — ఓ దేవతలారా! ఆ మాయారూపఅవిద్య వాస్తవముగ ఒకేరూప మైనను వటబీజమువలె నానారూపమై ప్రతీతమగుచున్నది. వటబీజములందనుగతమైన జాతిరూపసామాన్యతయే ఆ వటవృక్షమునకు కారణమైయున్నది. మఱియు నావట బీజరూపవ్యక్తులు నాశముగలవగుట వలన సర్వత్రానుగతములు కావు. కనుక ఆ బీజ రూప వ్యక్తులు సర్వత్రకారణతకు యోగ్యములుకావు. అట్లే ఘటపటాది సర్వకార్య ముల మృత్తికా తంత్వాది సర్వకారణములందనుగతమైన యేసామాన్యత కలదో, ఆ సామాన్యతనే వేదవేత్తలు అవిద్య, మాయ, అజ్ఞానము, శక్తి ఇత్యాదినామములచే కథనము చేయుచున్నారు. ఆ యవిద్యయే సర్వకార్యములకు కారణమై యున్నది. అది సుషుప్త్యాదులందును నాశమును పొందదు. మఱియు నెట్లు వటబీజములందు స్థితమైన సామాన్యరూపజాతియొక్క నాశము కాకుండినను వృక్షోత్పత్త్యనంతరము బీజవ్యక్తులకు నాశమగుచున్నదో అట్లే మాయయొక్క నాశము గాకుండినను కార్యో త్పత్త్యనంతరము సంస్కారములకు నాశమగుచున్నది. మఱియు ఎట్లు ఒకేబీజము నుండి వటవృక్షరూప పరిణామమున వసంతఋతువునందు అనేకకోటి బీజవ్యక్తులు పుట్టుచున్నవో, ఆ సర్వబీజవ్యక్తులందు మఱల ఒక్కొక్క బీజవ్యక్తి వటవృక్షోత్పత్తి ద్వారా అనేక కోటిరూపములగుచున్నవో, అట్లే ఈసామాన్య రూపమాయయు తన సంస్కారరూప వ్యక్తులచే అనేకప్రకారములగు ఉత్పత్తిని చేయుచున్నది. ఈలాగున సంసారమందు అనంతరూపత సిద్ధించుచున్నది. ఓ దేవతలారా! ఆ సామాన్యరూప మాయయొక్క విశేషవ్యక్తిరూప సంస్కారము అనంతమైయున్నను, వేదవేత్తలచే సంక్షేపముగ దేహేంద్రియక్రియాభోగభేదములచే చతుర్విధమనబడితు. ఎట్లు బీజము నుండి అంకురము, మఱల ఆ అంకురమునుండి బీజము, మఱల నా బీజమునుండి అంకురము పుట్టుచు ఈ ప్రకారముగ - బీజమునకును, - అంకురమునకును నిరంతర

ప్రవాహము నడచుచున్నదో అట్లే సంస్కారములకును, దేహాదులకును నిరంతర ప్రవాహము నడచుచున్నది. ఆ సంస్కారములందును, దేహాదులందును ఏయొక వ్యక్తియు స్థిరముగాలేదు.

ఓ దేవతలారా! నానాప్రకార అవాంతరభేదములచే యుక్తములైన జరాయుజాది చతుర్విధప్రాణులందు దేహేంద్రియ, క్రియా భోగములను నీచతుర్విధకార్యములు, ఉత్తమ, మధ్యమ అధమభేదములచే త్రివిధములైయున్నవి. లోకమందాయా జాతిగల జీవులనంతములు. వారందఱియందు ఉత్తమాదిరూపములు కథనము చేయుటకు శక్యముకాదు. కనుక సర్వవర్ణములయందు శ్రేష్ఠమైన బ్రాహ్మణజాతియందు ఉత్తమభావ నిరూపణము గావింపబడుచున్నది ఓ దేవతలారా! బ్రాహ్మణజాతిగల భూదేవరూప బ్రాహ్మణులు భూలోకమందు పుట్టుచు సుఖదుఃఖముల ననుభోగించుచున్నారు. కనుక ఈ బ్రాహ్మణశరీరమున్ను పుణ్యాపాపములచే రచితమైయున్నది. ఆ బ్రాహ్మణ శరీరమందు యే యుత్తమతగలదో ఆ యుత్తమత అనేక నిమిత్తములచే నగుచున్నది. అట్టి పిత, మాత, ఆచార్యుడు, ఈ ముగ్గురియొక్క కులముచేతను, విద్య శ్రమము మొదలగువాని యుత్కృష్టతచేతను పుత్రాదులందు ఉత్తమత ప్రాప్తించుచున్నది. మఱియు పిత, మాత యొక్క అంశరూపమైన వీర్యమునకు అవస్థావిశేషముచే ఏ పరిపాకము కలదో దానివలనను పుత్రునియందు ఉత్తమత యగుచున్నది. మఱియు దశమాసములైన తర్వాత ప్రసవించుటవలనను పుత్రునియందు ఉత్తమత సిద్ధింపుచున్నది. సుందర గౌరవర్ణ, లావణ్య, సదాచార, శ్రేష్ఠలక్షణాదిగుణముల చేతను శరీరమందుత్తమత సిద్ధించుచున్నది. ఇపుడు ఇంద్రియముల ఉత్తమత వర్ణింపబడుచున్నది. ఓ దేవతలారా! రూపాదివిషయముల గ్రహణముచేయుటయందు స్పష్టత నేత్రాదీంద్రియములందు ఉత్తమతయగును. సుందరరచనా విశేషముచేతను ఇంద్రియములకు ఉత్తమతయగును. విస్తారాది పరిణామములచేతను ఉత్తమత యగును. ఇపుడు క్రియాసంబంధ ఉత్తమత వచింపబడుచున్నది. ఓ దేవతలారా! క్రియాస్వరూపములైన యేకర్మములుకలవో, ఆకర్మములందు దేవతాధ్యానాదుల బుద్ధిచే క్రియకు ఉత్తమతయగుచున్నది. మఱియు శాస్త్రవిహిత దానాదులచేతను నిషిద్ధకర్మ పరిత్యాగముచేతను కర్మములందుత్తమత ప్రాప్తించుచున్నది. ఇపుడు భోగములయందుత్తమత చూపబడుచున్నది. మాతాపితరుల విద్యమానతచేతను, నానాప్రకార విద్యాప్రాప్తిచేతను, బుద్ధికుశలతచేతను భోగమందుత్తమత ప్రాప్తమగుచున్నది.

ఓ దేవతలారా! కొందఱు శాస్త్రవేత్తలు ఆచార్య పితృమాతృ బంధువులను జీవుని భోగకారణమనిరి. కొందఱు శ్రుత్యనుసారముగ స్త్రీ పురుషులిద్దరినే పరస్పర భోగకారణమనిరి. యాజ్ఞవల్క్య మైత్రేయీ సంవాదము —

శ్రుతి॥ "నవా౽రేపత్యుః కామాయ పతిః ప్రియో భవతి
ఆత్మనస్తుకామాయ పతిః ప్రియోభవతి।
నవా౽రే జాయాయైకామాయ జాయా ప్రియా భవతి
ఆత్మనస్తు కామాయ జాయా ప్రియా భవతి"

ఈ శ్రుతియందు యాజ్ఞవల్క్యముని స్త్రీ పురుషులిద్దరియందు భ్రాంతిచే సంభవించిన భోగసాధనతను నివారణచేయుచున్నారు. అథవా — ఏకశరీరమందు భోగసాధనత సంభవింపమిచే రెండు శరీరములు అపేక్షితములు. కొందఱు శాస్త్రకారులు శిష్యాదుల పుణ్యరూపాదృష్టముచేతనే ఆచార్యాదులు పుట్టుచున్నారనిరి. ఏ పదార్థము ఏ జీవుని అదృష్టముచే పుట్టినదో ఆపదార్థమాజీవుని భోగహేతువగుటవలన ఆచార్యాదులను శిష్యాదులకు భోగహేతువనిరి. మఱికొందఱిట్లనిరి — గురుశిష్యులిద్దరికి పితాపుత్రులిద్దరికి పరస్పర ఉపకార్య ఉపకారక భావము కనబడుటవలన ఆ ఇద్దఱును పరస్పరభోగమునకు హేతువులే. (ఇట్లు స్థూలబుద్ధి గలవారనుచున్నారు. సూక్ష్మబుద్ధిగల పురుషులో, ఆచార్యాదులను సాక్షాద్భోగ సాధనమనరు. ఆచార్యాదులను ధర్మము, అర్థము, కర్మోపాసన, యనునీ ద్రైవధనమునకు హేతువనుచున్నారు. దేహేంద్రియాది నాల్గింటియందు ఉత్తమ, మధ్యమ, అధమరీతిగాను, మృదుత్వ, మద్యత్వ, ఉత్కటత్వ రీతిగాను, కృతత్వ, కారితత్వ, అనుమోదితత్వరీతిగాను ఇన్నూటనలుబది మూడు (343) భేదములగును. ఇంకను విచారించిచూచినపుడు అనంతావధి భేదములు సిద్ధించును. దేహసంబంధ సంస్కారముచే మఱల దేహము, ఆ దేహముచే మఱల దేహేంద్రియ క్రియాభోగముల నాల్గింటియొక్క జనకమైన సంస్కారము పుట్టుచున్నది కనుక దేహమునుండియే ఇంద్రియాదులు మూడును ప్రకటితమగుచున్నవి. ఈ విషయమందు వేదవేత్తలీయుక్తి చెప్పుచున్నారు. ఏ పురుషుడు మొదట దేహయుక్తుడగుచున్నాడో ఆ దేహియగు పురుషుడే వశమైన ఇంద్రియముల సహితముగ యాగాదికర్మములకు కర్తయగుచున్నాడు. ఆ కర్త సంబంధ ఫలములకు భోక్తయగుచున్నాడు. దేహములేకున్న కర్తృత భోక్తృత సంభవింపవు. ఇపుడు కర్మములచే సర్వసంభవము వచింపబడుచున్నది.

ఓ దేవతలారా! పుణ్య పాప రూప కర్మములచే యుక్తమైన పురుషుడే దేహేంద్రియములచే నానాభోగములను పొందుచున్నాడు. కర్మములేక పొందడు. కనుక పుణ్యపాప కర్మములచేతనే దేహాదిసర్వమునకు సంభవమగుచున్నది. జీవుడు నేయే భోగముల ననుభవముచేయుచున్నాడో, వాయా భోగములయందు వైరాగ్యమును

పొందరు. మరేమనిన దినదినము ఆభోగములందు కుశలురగుచున్నారు. యోగ భాష్యమందిట్లు చెప్పబడియె. "భోగాభ్యాసమనువివర్ధంతే కామః కౌశలానిచేంద్రియాణామ్" ఓ దేవతలారా! భోగముచే కామవృద్ధి యగుటయందు కామి, బలవంతుడు, ధనికుడు, యీ ముగ్గురు దృష్టాంతరూపులు. చూడుడు — ఈ ముగ్గురు అనేకభోగములను పొంది ఆ భోగములందు కుశలులైరి. మఱల మఱల నా భోగముల నిచ్ఛగించువారైరి. ఈ లాగున బహుభోగములచే కామమభివృద్ధియగుచున్నది. (ఘృత పించనముచే యగ్నివృద్ధియగునట్లు) మఱియు అనుభూత భోగము స్వవిషయక ఇచ్ఛోత్పత్తిద్వారా దేహేంద్రియ కర్మాది సంస్కారముల కెట్లు కారణమో అట్లే దేహేంద్రియ కర్మములున్ను స్వవిషయక ఇచ్ఛోత్పత్తిద్వారా సంస్కారమునకు కారణమగును. ఆ సకల సంస్కారములందనుగతమైన ఏ సామాన్యముకలదో ఆ సామాన్యమును వేదవేత్తలు మాయా నామముచే కథనము చేయుచున్నారు. ఆ మాయ సకలజగత్తునకును కారణముగాను అనాదిగానున్నది. ఆ మాయ దేహాదులును సంస్కారములును నాశమైనను బ్రహ్మజ్ఞానాగ్ని యుత్పన్నముగాకున్న నాశము పొందదు దేవతలు — ఓ భగవంతుడా! మాయయే సర్వకార్యములందు సమర్థమైన పక్షమందు ఇక బ్రహ్మము నంగీకరించుట యెందులకు?

ప్రజాపతి - ఓ దేవతలారా! సర్వకార్యములందును, కారణములందును అనుగతమైన పరిణామభాగమును వేదవేత్తలు మాయ యనుచున్నారు. మఱియు ఆ పరిణామ భాగమును ప్రకాశము చేయునట్టి స్ఫురణరూప సద్వస్తువును వేదవేత్తలు బ్రహ్మము ఆత్మ ఈ మొదలగు నామములచే కథనము చేయుచున్నారు. ఓ దేవతలారా! లోకమందెన్ని స్థూలసూక్ష్మపదార్థములుగలవో ఆ సర్వపదార్థములందు పరిణామరూపముచే మాయకు అనుగతత, సత్తారూపముచే బ్రహ్మమున కనుగతత గాన్పించుచున్నది. కనుక మాయయు బ్రహ్మమును రెండును జగత్తునకుపాదానకారణములగుచున్నవి. ఐనను బ్రహ్మము వివర్తోపాదాన కారణముగాను, మాయ పరిణామ్యుపాదాన కారణముగాను యైయున్నవి. ఓదేవతలారా! సర్వదా ఏకరూపసత్తయే ఒకచో కేవలము సర్వకార్యములందు అనుగతముగా కనబడినపుడు మాయకు కారణత సిద్ధింపదు. మఱియు ఒకచో పరిణామియైన మాయయే కేవలమనుగతమై ప్రతీతమైనపుడు బ్రహ్మమునకు కారణత సిద్ధింపదు. కాని కేవలమాయయే అనుగతమై ప్రతీతము కాదు. మఱేమనిన బ్రహ్మము తనసత్తారూపముచే సర్వత్రానుగతమై ప్రతీతమగుచున్నది. కనుక బ్రహ్మము, మాయ ఈ రెండును జగత్కారణములై యున్నవి.

ఓ దేవతలారా! ఎట్లు సర్వ వటబీజములందనుగతమైన సత్తారూపమగు సామాన్యము తనస్వరూపముకన్న భిన్నమగు నానావృక్షములను పుట్టించునట్లు బ్రహ్మశక్తి

యగు మాయయు దేహాదివిశ్వమును పుట్టించుచున్నది. ఇపుడు సర్వవ్యాప్య వ్యాపక మాయకు మూడు స్వరూపములు వచింపబడుచున్నవి. ఓ దేవతలారా! ఒక్కొక వటవృక్షమందనుగతమైన సామాన్యము, మఱియు ఒక్కొక బీజమందనుగతమైన కారణశక్తియను ద్వితీయసామాన్యము, అట్లు వృక్షము బీజము ఈ రెంటియందనుగతమైన రెంటికి కారణమైన పృథ్వీరూప తృతీయసామాన్యముయను మూడుసామాన్యములు గలవు ఆ పృథ్వీరూప సామాన్యమెట్లు బీజసంబంధముచేతను, వృక్షసంబంధముచేతను ద్వివిధమో అట్లే మాయాశక్తికూడ కార్యకారణసంబంధముచే ద్వివిధమై కార్యకారణములరెంటిలో అనుగతమై ఏకరూపముగ స్థితమగుచున్నది. ఆ మాయ వ్యాపకరూపముచే నొకొకటియైనను కార్యమందును, కారణమునందును స్థితమగుట వలన భిన్నముగానున్నటుల కనబడుచున్నది. ఆ యొకేమాయ కార్యావచ్ఛిన్న శక్తిరూపముచేత జీవునిభేదమునకు కారణమున్ను, కారణావచ్ఛిన్నశక్తిరూపముచే ఈశ్వరునిభేదమునకు కారణమున్నుయైయున్నది. ఓ దేవతలారా! ఒకే భూమి ఘటరూపమున్ను గృహరూపమున్నుపొంది ఘటాకాశ గృహాకాశ భేదమునకు కారణమైనట్లు ఒకే మాయ జీవేశ్వరులిద్దరి భేదములకు కారణమగుచున్నది. మఱియు ఒకేభూమి ఇల, ధాత్రి, కుహువు పృథ్వి, ధరణి క్షమ, ఇత్యాది అనేక నామములను పొందినట్లు పరిణామియైన యొకేమాయ శక్తి, దుర్ఘట, అవిద్య, తమము, మోహము, అజ్ఞానము, భ్రాంతి, విపర్యయము, సనాతని, యిత్యాది అనేకనామములను పొందుచున్నది. ఆ మాయయొక్క చిత్రతచూడుడు. జీవేశ్వరభేదమును చేయునట్టి సామాన్యరూపిణియగు మాయ అత్యంతాద్భుతశరీరముగలదిగాను, నానా ప్రకారసంస్కారరూప విచిత్రములచే యుక్తముగ నున్నది.

మఱియు ఎట్లు రంజకుడు వస్త్రములను నీలపీతాదిచిత్రరంగులచే రంజితముగ చేయుచున్నాడో, అట్లే ఈ మాయయు విచిత్ర ప్రపంచమును తనసంస్కారరూప విచిత్రరంగులచే రంజితముగ జేయుచున్నది. ఇపుడా మాయయొక్క దృఢతను చూడుడు — ఈ మాయ ఆత్మజ్ఞానముచేగాక, మఱి దేనిచేతను నాశనము పొందదు. కనుకనే యది దృఢమనబడినది. — చూడుడు. సర్వజగత్తుకన్న బలిష్ఠులై ఉత్కృష్టులైన ఈశ్వరుడును ఈ మాయను నాశముచేయడు. ఎందుకనగా ఆ మాయయొక్క బలముచే యుక్తుడై యుండినచో, జగదుత్పత్త్యాదుల సామర్థ్యము ఈశ్వరునకు ప్రాప్తమగుచున్నది. మాయలేకున్న ఈశ్వరతయే సిద్ధింపదు. ఇటువంటి ఉపకారము చేయునట్టిదైన మాయను, ఈశ్వరుడెట్లు నాశముచేయును? చేయడు. ఓ దేవతలారా! లోకమందు శాస్త్రవేత్తలు మాయను అనర్థకారణమని యెఱిగి, దానిని నాశము చేయుటకు సమర్థులగుదురు. కాని ఆ మాయ తన ప్రభావముచే ఆ శాస్త్రవేత్తలబుద్ధిని,

స్త్రీ పుత్ర ధనాదులందు ఆసక్తముగ చేయుచున్నది. కనుక వారా మాయను నాశము చేయుటకు శక్యులు గాకున్నారు.

ఇపుడు మాయా మహాటవీవర్ణనము గావింపబడుచున్నది. ఓ దేవతలారా! ఈ మాయారూప ఘోరారణ్యము నానాప్రకారచిదాభాసరూప మృగములచే వ్యాప్తము గాను. పంచమహాభూత వృక్షములచే పూర్ణముగాను, విషయరాగరూపవల్లిచే యుక్తము గాను, నానాప్రకారదుఃఖరూప ఫలములచే యుక్తముగాను, స్త్రీ పుత్రాది పుష్పములచే యుక్తముగాను, మాతాపిత్రాది పల్లవములచే యుక్తముగాను, బాంధవరూపశాఖా సహితముగాను, సుఖసంబంధ దీర్ఘాశారూప బీజములచే యుక్తముగాను, మృత్యురూప దావాగ్ని సహితముగను నున్నది. ఆ మహాటవిని నాశముచేయునట్టి శమదమాదిరూప వివేకరాజుయొక్క సేనను పరాజయముచేయు కామక్రోధాదిరూప మహామోహరాజు యొక్క సేనచే ఆ మహాటవి యుక్తముగమున్నది. అథవా — కామక్రోధాదిరూప సింహములచే పూర్ణముగాను, దుర్జనపురుషరూప సర్పకంటకములచే యుక్తముగాను, విషయరూపములగు పిశాచములచే యుక్తముగాను, జన్మమరణాది వృశ్చికములచే యుక్తముగానున్నది. ఇటువంటి మాయారూప మహాటవిని శాస్త్రవేత్తలు ధ్యానయోగా ద్యుపాయములచే నాశముచేయుటకు సమర్థులుగా నుందురు. కాని ఆ మాయా మహాటవి ఆ శాస్త్రవేత్తలను స్త్రీపుత్రాదులకధీనముగజేసి దీనతను పొందింపజేయుచున్నది. ఓ దేవతలారా! భద్ర, మంద్ర, మృగ భేదములచే గజములు త్రివిధములు. వాటిలో భద్రగజము శ్రేష్ఠము. బలవంతము. మఱియు నిర్భయము. ఆ భద్రగజములెట్లు మహావనమును నాశము చేయుచున్నవో అట్లే బ్రహ్మవేత్తరూప భద్రహస్తియే మాయా మహాటవిని నాశముచేయుటకు సమర్థమగును. ఐనను అటువంటి బ్రహ్మవేత్త లోకమం దరుదు. ఈ కారణమువలన శాస్త్రవేత్తలు ఆ మాయను "దృఢా" నామముచే కథనము చేయుచున్నారు. ఇపుడామాయకు బహు అంకురత్వ, గుణభిన్నత్వ, సర్వత్ర వ్యాప్యత నిరూపణము గావింపబడుచున్నది. — ఓ దేవతలారా! నానాప్రకార భావిశ రీరములను ప్రాప్తింపజేయునట్టి ఏ మరణకాల సంబంధ వాసనలుకలవో ఆ వాసనా రూపాంకురములచే ఆ మాయారూపమహాటవి యుక్తముగనున్నది. మఱియు సత్వ రజస్తమములను నీ త్రిగుణాత్మకములైన నానాపదార్థములచే వ్యాప్తమైయున్నది. ఎట్లు ప్రసిద్ధమహావనమునందు అనేక మహావృక్షములుకలవో అట్లే ఈ మాయా మహాటవియందును బ్రహ్మవిష్ణు శివులను మహావృక్షములు గలవు. ఆ మహావృక్షములు సర్వత్రవ్యాపకములుగాను, అనేక ప్రకారఫలప్రాప్తిచే సర్వజీవులకు ఆనందప్రాప్తి యొనర్పునట్టివిగాను నున్నవి. మఱియు ఈ మహాటవినుండి బయటకు పోవుటకు సమర్థములైన యే విద్వద్రూప భద్రగజములుగలవో, ఆ భద్రగజములెపుడు కామక్రోధాది

సింహములచే, అధవా మృత్యురూప దావాగ్నిచే భయభీతులై పరుగెత్తిపోవునో అప్పుడవి బ్రహ్మవిష్ణు శివులను మూడు వృక్షములలో నొకవృక్షము నాశ్రయించుచున్నవి. (బ్రహ్మాదుల ఉపాసనయే ఆ వృక్షముల నాశ్రయించుట) ఆ బ్రహ్మాది వృక్షత్రయమును కామక్రోధాది సింహములును మృత్యురూపదావాగ్నియు దుర్జనమనుష్యాది సర్వకంటకములును ప్రవేశములు చేయుటకు సమర్థములు కావు. ఎందుకనగా — పరిచ్ఛేదత్రయ రహితమగు బ్రహ్మాదిదేవతలు స్వరూపమేదికలదో ఆ పరిపూర్ణ స్వరూపమునుచూచి పరిచ్ఛిన్నములైన కామక్రోధాదులు సర్వదా భయపడుచున్నవి.

ఓ దేవతలారా! ఎట్లు ప్రసిద్ధవృక్షములపై లత (తీగ) యుండునో అట్లే బ్రహ్మవృక్షముపై సరస్వతీలతయు, విష్ణు వృక్షముపై లక్ష్మీలతయు, శివ వృక్షముపై భవానీలతయు విరాజమానమైయున్నవి. బ్రహ్మవృక్షము సువర్ణవర్ణము. విష్ణువృక్షము తమాలమువలె శ్యామవర్ణము, శివవృక్షము క్షీరసమానశుక్లవర్ణముగలవి. ఈ బ్రహ్మాది మూడు వృక్షములు తమ్ముగాంచుమనుజుల నేత్రములకును మనస్సునకును ఆనందప్రాప్తి నొనర్చుచున్నవి. బ్రహ్మవృక్షముయొక్క సరస్వతీలత శ్వేతవర్ణముగాను, విష్ణువృక్షముయొక్క లక్ష్మీలత పీతవర్ణముగాను, శివ వృక్షముయొక్క భవానీలత శ్యామవర్ణముగానున్నవి. ఓ దేవతలారా! బ్రహ్మాదివృక్షత్రయమును సరస్వత్యాదిలతాత్రయమును నిర్విశేషరూపముచే సర్వవర్ణరహితములైయున్నవి. మఱియు సర్వవిశ్వరూపమగుటవలన సర్వవర్ణములుగలవియునగును. దంభయుక్తులకు ఫలరహితముగాను, శరణాగత భక్తజనులకు నానాప్రకార ఫలసహితముగ నున్నవి. మఱియు అనాదియగుటవలన బీజరహితముగాను, మంత్రరూప బీజముగలవగుటవలన బీజసహితముగాను. ఆద్యంతరహితముగాను, సర్వప్రపంచమునకు బీజరూపముగాను, నిత్యముగానున్నది. ఆ బ్రహ్మాదివృక్షములు స్వాశ్రితభక్తజనుల సంసారతాపనివృత్తిచేయునట్టివిగాను, నానావాంఛితఫలములను ధారణచేయునట్టివిగానున్నవి. ఆ వృక్షములు మహత్తుకన్న మహత్తుగాను సూక్ష్మముకన్న సూక్ష్మముగానున్నవి. ఈ అవిద్యా మహాటవి జీవులకు మహాదుఃఖప్రాప్తి నొనర్చుచున్నను ఆ బ్రహ్మవేత్తరూప భద్రహస్తికి ఏదుఃఖప్రాప్తియు చేయదు.

ఓ దేవతలారా! లతా సహితములగు బ్రహ్మాదివృక్షములు స్వయంప్రకాశరూపములుగాను ఆనందరూపములుగాను నున్నవి. ఐనను మనుజుల భావనానుసారముగ జంగమరూపములుగాను స్థావరరూపముగానునగుచున్నవి. ధర్మార్థ కామ మోక్షములను నీ చతుర్విధ పురుషార్థప్రాప్తికొఱకు ఆరాధనముచేయువారైన భక్తజనులకు ఆ నాలుగు పురుషార్థములను ప్రాప్తింపజేయుచున్నవి, ఈ కారణమువలన ఆ వృక్షత్రయమును వేదవేత్తలు కల్పవృక్షనామముచే కథనము చేయుచున్నారు. (మఱియు

ఆ సరస్వత్యాది లతలను కల్పలతానామముచే కథనము చేయుచున్నారు) అందు వలన ఓ దేవతలారా! ఈ మాయామహాటవియందు పుట్టినదై బ్రహ్మజ్ఞానరూపశుండా దండముగలదైన బ్రహ్మవేత్తరూప భద్రహస్తియే రాగరూపదృఢమూలముగలదైన ఆ యవిద్యామహాటవిని అవశ్యముగా నాశముచేయునదైయున్నది. మఱియు ఆ భద్ర హస్తి యెంతవరకు తనబ్రహ్మజ్ఞానరూప శుండాదండమును కామక్రోధాది సింహకృత ఉపద్రవముచే దుర్బలముగా నెఱుగునో అంతవరకు అది బ్రహ్మాదివృక్షత్రయము నాశ్రయించి యుండును. వాటిని విడువదు. ఓ దేవతలారా! ఈ బ్రహ్మాది వృక్షత్ర యము సర్వవిశ్వమును వ్యాప్తముగజేసి స్వభావముగ సర్వత్రానుగతమై ప్రతీతమగు చున్నవి. ఈ కారణమువలననే అధిదైవ, అధ్యాత్మ, అధిభూతములను నీ మూడు రూపములచే పుట్టుచున్నవి. జగత్తుయొక్క సృష్టిస్వభావము బ్రహ్మకు, పాలన స్వభా వము విష్ణువునకు, సంహారస్వభావము రుద్రునకు కలదు.

ఓ దేవతలారా! త్రిగుణాత్మిక మాయాసంబంధముచే బ్రహ్మ విష్ణు రుద్రులు క్రమముగ కర్తృ, పాలక, సంహర్తక రూపములను పొందుచున్నారు. బ్రహ్మాదిరూప త్రయధారకుడైన ఆ యాత్మదేవుడు సమష్టిస్థూలోపాధిసంబంధముచే విరాట్ సంజ్ఞను, సమష్టిసూక్ష్మోపాధిసంబంధముచే హిరణ్యగర్భసంజ్ఞను, సమష్టికారణోపాధి సంబంధ ముచే ఈశ్వరసంజ్ఞను పొందుచున్నాడు. ఇపుడు హిరణ్యగర్భునియందు జీవరూపతను, ఈశ్వరరూపతను సిద్ధింపజేయుటకొఱకు వాని అధ్యాత్మ అధిదైవరూపములు వర్ణింప బడుచున్నవి. ఆ హిరణ్యగర్భ భగవంతుడే సమష్టి జాగ్రత్తునందు అధిదైవరూప విరాట్టనబడును. వ్యష్టిస్థూలాభిమానముచే విశ్వసంజ్ఞను పొందును. సమష్టి సూక్ష్మ శరీరమందలి అభిమానముచే హిరణ్యగర్భసంజ్ఞను, విశ్వకారణమగుటవలన ఈశ్వర సంజ్ఞను పొందుచున్నాడు.

ఓ దేవతలారా! అధిదైవమర్యాదయందు హిరణ్యగర్భనామముచే కథనముచేయ బడిన ఆత్మదేవుడే సర్వజగత్తునందు అహంరూపాభిమానమును పొందుచున్నాడు. మఱియు ఏ కారణోపాధిగలవాడైన ఆత్మదేవుడు అధిదైవ ఈశ్వరరూపముగ కథనము చేయబడెనో ఆ యాత్మదేవుడే సకలజగత్తును తన మర్యాదయందు స్థాపనము చేయు చున్నాడు. ఈ కారణమువలన వేదవేత్తలు ఆ యాత్మదేవుని "నియంత, అంతర్యామి" నామములచే కథనము చేయుచున్నారు.

ఓ దేవతలారా! ఎట్లు కారణోపాధిరూప ఈశ్వరుడు అధ్యాత్మ అధిదైవ అధి భూతములను మూడు రూపములచే స్థితుడైయున్నాడో అట్లే కార్యోపాధిరూపహిరణ్య గర్భుడున్ను సర్వత్రవ్యాపకమగుటవలన అధ్యాత్మాది రూపత్రయముచే స్థితుడై

యున్నారు. ఈశ్వరుడు స్వయంజ్యోతి, ఆనందస్వరూపుడు, సర్వత్రవ్యాపకుడైనట్లు హిరణ్యగర్భుడున్ను స్వయంజ్యోత్యాది రూపుడుగానున్నాడు. కనుక హిరణ్యగర్భుడున్ను ఈశ్వరుడేయగును. హిరణ్యగర్భుడు క్రియాశక్తిరూప ప్రాణముగలవారై, జ్ఞానశక్తిరూప బుద్ధిగలవారైయున్నారు, ఈశ్వరుడట్లు ప్రాణబుద్ధులు గలవాడు కాడు. ఐనను హిరణ్యగర్భభగవంతుడు స్వతస్సిద్ధజ్ఞానముచే తన స్వరూపమును సర్వోపాధి రహితనిర్విశేషరూపముగ నెంచుటవలన, హిరణ్యగర్భునియందుకూడ ఈశ్వరత సంభవించుచున్నది. ఇంకను చూడుడు – మాయ ఆత్మను ఆవరణముచేయుచున్నందున అవిద్యయనబడినది. ఆ యవిద్యచే జ్ఞానక్రియలు రెండును యుత్పన్నము కాగా, వాటిచే జగదుత్పత్తియైనది. ఆ మాయారూపావిద్యయే ఈశ్వరుని యుపాధియైనది. ఈ కారణరూప ఈశ్వరోపాధికిని కార్యరూప హిరణ్యగర్భోపాధికిని అభేదమే సిద్ధించుచున్నది. ఈలాగున ఉపాధుల కభేదమగుటచే ఈశ్వర హిరణ్యగర్భులకును అభేదమే సిద్ధించుచున్నది.

దేవతలు — హే భగవన్! ఉక్తరీతిగా హిరణ్యగర్భునకు పరమాత్మతోటి ఏకత సిద్ధించినను, వ్యష్టిజీవులకు పరమాత్మతోటి ఏకత యేలాగున సిద్ధించును? ప్రజాపతి — ఓ దేవతలారా! ఆ హిరణ్యగర్భుని యుపాధిరూప సమిష్టి లింగశరీరమేదిగలదో, ఆ లింగశరీరమునకు తుల్యరూపమైనదియు నానా సంస్కారముల కాశ్రయమగుటవలన చిత్రరూపముగలదియు మాయచే నుత్పన్నమైనదియు నగు అనేక ప్రకారమగు లింగశరీరమేదికలదో, ఆ లింగశరీరము వ్యష్టిజీవుల యుపాధియైయున్నది. మఱియు వటవృక్షమందును వటబీజమందును స్థితమైన జనకతారూప సామాన్యము ఆ యొక్కొక్క వ్యక్తియందు పరిపూర్ణముగ వర్తించునట్లు ఈ యవిద్యారూపమాయయు హిరణ్యగర్భుని సమష్టి సూక్ష్మోపాధియందును జ్ఞాన క్రియాయుక్త వ్యష్టిరూప జీవోపాధులందును పరిపూర్ణముగ వర్తించుచున్నది, ఇట్లు చెప్పుటచే వ్యష్టి సమష్టిరూప సర్వోపాధులకు సర్వశక్తిసంపన్నమైన మాయతోటి తాదాత్మ్యసంబంధము గలదని సిద్ధించుచున్నది. కనుక సర్వోపాధులు సర్వరూపములైయున్నవి.

తాత్పర్యము — కారణ కార్యోపాధులందు మఱియు ఉపహితమైన చైతన్యమందు ఎపుడు భేదము సిద్ధింపలేదో అపుడు వ్యష్టిజీవులందు తదుపాధులందు భేదమేలాగున సిద్ధించును? — దేవతలు – ఓ భగవంతుడా! వ్యష్టిసమష్టుల కభేదమైన పక్షమందు సమష్టియందు వ్యాపకత వ్యష్టియందు పరిచ్ఛిన్నత యెందులకు ప్రతీతమగుచున్నది?

ప్రజాపతి - ఓ దేవతలారా! జాగ్రదాద్యవస్థాత్రయమును పొందిన యేజరాయుజాది చతుర్విధజీవులు గలరో ఆ సర్వజీవులు వాస్తవముగా హిరణ్యగర్భుడగు

ఈశ్వరుని తుల్యులే. జీవులు మహత్పదార్థములకన్నను అత్యంతమహత్తరమైనను పరిచ్ఛిన్న బుద్ధ్యాదుల యోగముచే పరిచ్ఛిన్నరూపముగ ప్రతీతములగుచున్నారు. ఓ దేవతలారా! ఏ సచ్చిదానంద స్వరూపాత్మను నేను పూర్వము కథనము చేసితినో ఆ యాత్మదేవుడే హిరణ్యగర్భరూప విరాట్టును పుట్టించి అగ్న్యాది దేవతలను వాగాదీంద్రియములను జనింపజేయుచున్నాడు. మఱియు ఆకాశాది పంచభూతములను అన్నమయాది పంచకోశములను పుట్టించుచున్నాడు. ఇట్లు సర్వజగత్తును పుట్టించి ఆ యాత్మదేవుడే జీవరూపముగ జగత్తునందు ప్రవేశము చేయుచున్నాడు. అనంతరము దేహాదులందు అహం మమాభిమానరూప కంచుకముచే యుక్తుడై తాను సర్వజ్ఞుడైనను మూఢునివలె స్థితుడాయెను. అనంతరము స్థూలాది మూడు శరీరములందు నానా ప్రకార వ్యవహారములను సాక్షిరూపముగ చూచుచు ఆ వ్యవహారములను తనయందే జరుగుచున్నటుల యెంచుచున్నాడు. వాస్తవముగా జీవేశ్వరుల భేదరహితమగు ఆ యాత్మదేవునియందు జీవేశ్వరాదిభేదములు ప్రతీతమగుటకు మాయయే కారణమై యున్నది. ఆ మాయ చైతన్యమున కథినమై అనాదియై అధిష్ఠానభిన్నమగు సత్తా రహితమై తుచ్ఛరూపమై జీవేశ్వరాదిభేదములను వ్యర్థముగ జూపుచున్నది. ఓ దేవతలారా! దానివలన ఆత్మదేవునియందు కించిన్మాత్రముకూడ భేదసిద్ధికాలేదు. ఈ కారణము వలననే వేదవేత్తలు ఆ యాత్మదేవుని "అద్వితీయ" నామముచే కథనము చేయుచున్నారు.

ఓ దేవతలారా! ఏ యాస్తికవాదిచేతను సత్తయొక్క నాశమంగీకరింపబడలేదు సత్తనాశరహితముగానే నంగీకరింపబడియె మఱియు ఏ నాస్తికవాదులు సత్తను క్షణికమనుచున్నారో, ఆ నాస్తికవాదులు సత్త యొక్క ఆశ్రయ పదార్థమును క్షణికమని యెంచుచున్నారు. ఆ సకల పదార్థములందనుగతమైన సత్తను క్షణికమనరు. కాబట్టి నాశకారణ రహితమైన అనుగతసత్తారూప ఆత్మదేవుని వేదవేత్తలు నిత్యనామముచే కథనము చేయుచున్నారు. మఱియు లోకమందు జడతారూపముచే అశుద్ధమైన ఘటాది పదార్థములు నాశమగును. ఈ యాత్మదేవుడు ఘటాది జడపదార్థములకన్న విలక్షణమై చైతన్యరూపమగుటవలన వేదవేత్తలచే నాతడు శుద్ధనామముచే కథనము చేయబడియె. సర్వదా తన స్వరూపానుభవము చేయుటవలన బుద్ధ నామముచే కథనము చేయబడియె. శుక్తిరజతాది పదార్థములు ఆనందముకన్న భిన్నములు ఆత్మదేవుడా మిథ్యాపదార్థములకన్న విలక్షణుడై ఆనందస్వరూపమగుటవలన వేదవేత్తలు ఆ ఆత్మదేవుని సత్యనామముచే కథనముచేయుచున్నారు. ఓ దేవతలారా! ఏ యే పదార్థము సత్యమగునో ఆయా పదార్థము తనయందు కల్పితమై మిథ్యాపదార్థములచే బంధింపబడదు. (సత్యమైన రజ్జువు మిథ్యాసర్పాదులచే బంధింపబడనట్లు) కనుక ఆ సత్యాత్మను వేదవేత్తలు ముక్తనామముచే కథనము చేయుచున్నారు.

ఓ దేవతలారా! ఉత్పన్నమైన బంధసంబంధకారణము అంజనమనబడును. ఆత్మదేవునకెపుడును బంధనములేదు. కనుక వానికి బంధనివృత్తి సాధనములతో పని లేదు. ఈ కారణమువలన వేదవేత్తలు ఆ నిత్యముక్తాత్మదేవుని నిరంజనమనుచున్నారు. మఱియు ఏ యే పదార్థము కార్యరూపమగునో ఆయాపదార్థము ఘటాదికమువలె పరిచ్ఛిన్నమగును. ఆత్మదేవుఁడో కార్యరూపముకాదు కనుక పరిచ్ఛిన్నుఁడునుకాఁడు. ఈ కారణమువలన వేదవేత్తలు యాత్మదేవుని విభువనుచున్నారు. ఏ యే పదార్థమధిష్ఠానమగునో ఆయాపదార్థము ఆరోపితపదార్థముకన్న ఉత్కృష్టమైనదగును. (రజ్జు శుక్త్యాదికము సర్పరజతాదులకన్న నుత్కృష్టమైనట్లు) ఈ యాత్మదేవుఁడున్ను సకలజగదధిష్ఠానము. కనుక ఉత్కృష్టమగును. అందువలన వేదవేత్తలాతనిని "పర" నామముచే కథనము చేయుచున్నారు. మఱియు బాహ్యమైన ఘటాదిపదార్థములకన్న నేత్రమంతరము. బుద్ధ్యాదిదృశ్యపదార్థములకన్న ద్రష్టయైన ఆత్మ యంతరము. ఈ కారణమువలన వేదవేత్తలచే ఆత్మదేవుఁడు "ప్రత్యక్" నామముచే కథనము చేయబడియె. ఎట్లు నీలపీతాది అనేక వర్ణములుగల గోవులయొక్క దుగ్ధము మధురతారూపముచే నొకేరసము కలిగియున్నదో అట్లే ఆత్మదేవుఁడున్ను సచ్చిదానందరూపముచే ఏకరసమైయున్నాఁడు. ఆ సచ్చిదానందములును పరస్పర భేదరహితములై యున్నవి. ఈ కారణమువలన వేదవేత్తలాత్మదేవుని ఏకరసమనుచున్నారు.

ఓ దేవతలారా! పూర్వోక్త అద్వితీయనామమునుండి ఏకరసనామ పర్యంతముగల సర్వనామములచేతను, దృశ్యపదార్థములను విషయముచేయునట్టి స్ఫురణరూపబోధచేతను, ప్రత్యక్షాది సర్వప్రమాణములచేతను ఆత్మదేవుఁడెఱుఁగబడును. — ఇపుడీ యర్థమే స్పష్టీకరింపబడుచున్నది ఓ దేవతలారా! ప్రమాజ్ఞానమునకు కారణమును సర్వవాదులు ప్రమాణమనుచున్నారు. కొందఱు శాస్త్రవేత్తలు ప్రమాజ్ఞానమును స్ఫూర్తిరూపముగ నెంచుచున్నారు. మఱికొందఱు శాస్త్రజ్ఞులు ఆ స్ఫురణముయొక్క అభివ్యంజితమైన అంతఃకరణవృత్తినే ప్రమాజ్ఞానమని యెంచుచున్నారు. ఈ రెండు ప్రకారములచేతను ఆ ప్రమాణమునకు స్ఫురణముతోటి సంబంధము అవశ్యముగ నైనది. మఱియు సర్వకాలములందును వర్తమానమగు స్ఫురణమే సత్తారూపమై యున్నది. (ఈ విషయము పూర్వమే చెప్పబడినది.) కాబట్టి సర్వబోధలందు సత్తారూపముగ భాసమానమగు ఆ స్ఫురణమే ఆవరణ నివృత్తిచేయునట్టి వృత్తికి విషయమై యున్నది.

ఎందుకనగా — "సత్తామాత్రంసర్వం" అను శ్రుతిచే సత్తామాత్రస్ఫురణముకన్న భిన్నమైన సర్వవస్తువులకు అభావము కథనము చేయబడియె. కనుక తత్స్ఫురణ

భిన్నఘటాది పదార్థములందు యేదైనా జ్ఞానమునకు నియమముచే ప్రమాణత అథవా అప్రమాణత చెప్పవలనుపడదు.

తాత్పర్యము — "అయం ఘటః" అను నీ ప్రకారముగల ఏ ఘటవిషయిక జ్ఞానముగలదో ఆ జ్ఞానము సర్వఘటవ్యక్తులను విషయముచేయదు. ఏదోయొక ఘట విశేషమునే విషయము చేయుచున్నది. అందువలన యా ఘటజ్ఞానమందు అర్థబోధ కత్వము మఱియు అర్థాబోధకత్వము ఈ రెండు ధర్మములును గలవు. అట అర్థ బోధకత్వధర్మమో ప్రమారూపతకు సాధకముగాను, అర్థాబోధకత్వధర్మమో అప్ర మాణరూపతకు సాధకముగానున్నది.

ఆ రెండు ధర్మములు పరస్పర విరోధములగుటవలన అవి ఆ జ్ఞానములందు ప్రమాణాప్రమాణతల నిశ్చయింపనియ్యవు. కాబట్టి ఎట్లు మీమాంసకమతమందు పరస్పర వ్యభిచారులగు ఘటాదివ్యక్తులు ఘటాదిశబ్దములకు వాచ్యార్థములుకాలేవో ఆ ఘటాదివ్యక్తులందనుగతమైన ఘటత్వాదిజాతులు ఆ ఘటాది పదముల వాచ్యార్థ ములై యున్నవో అట్లే సిద్ధాంతమందును పరస్పరవ్యభిచారులగు వ్యక్తులు జ్ఞానమునకు విషయములు కావు. సర్వత్రానుగత సత్తారూప స్ఫురణమే ఆ జ్ఞానమునకు విషయ మగును.

అథవా — ఏ ప్రత్యక్షాది ప్రమాణములు ఏ అర్థవిషయికజ్ఞానమును పుట్టించు చున్నవో ఆ అర్థమందే ఆ ప్రత్యక్షాదులకు ప్రమాణత సకలవాదులచే నంగీకరింప బడియె "ఘటోఽస్తి, పటోఽస్తి" ఇత్యాది సర్వజ్ఞానములందును ఘటపటాద్యుప హితసత్తయే ప్రతీతమగుచున్నది. కనుక సర్వలోకములకు ప్రమాణముచేతను అప్రమాణముచేతను ప్రసిద్ధమైన యెన్ని జ్ఞానములుగలవో ఆ యన్ని జ్ఞానములు సత్తా మాత్రమునే విషయము చేయుచున్నవి. కనుక ఆ సర్వబోధలకు స్ఫురణరూప సత్త యందే ప్రమాణతగలదు. ఈ విషయము వార్తికకారులైన సురేశ్వరాచార్యులచేతను కథనము చేయబడియె

"తతోఽనుభవమేవైకో విషయో జ్ఞానలక్షణః।
అక్షాదీనాం స్వవిషయే యత్రతేషాం ప్రమాణతా॥"

భావార్థము — స్ఫురణరూపసత్తయే అజ్ఞానమునకు ఆశ్రయ విషయమగుట వలన ప్రత్యక్షాది ప్రమాణములకు విషయమైయున్నది. ఆ సత్తయొక్క బోధనచేతనే ప్రత్యక్షాదులకు ప్రమాణత ప్రాప్తించుచున్నది. అనాత్మపదార్థబోధనచే ప్రత్యక్షాదు లకు ప్రమాణత ప్రాప్తించదు. దేవతలు — హే భగవన్! 'ఘటోఽస్తి' యను నీ జ్ఞానమందు ఎట్లు సత్త ప్రతీతమగుచున్నదో, అట్లు ఘటసంబంధ అసత్తయొక్క

అభావమున్ను ప్రతీతమగుచున్నది. కావున అసత్తయొక్క అభావమే విషయ మెందులకు కాకూడదు?

ప్రజాపతి — ఓ దేవతలారా! ఏ జ్ఞానవిశేషము అసత్తాసంబంధనివృత్తిని బోధనచేయుచున్నదో ఆ జ్ఞానమున్ను తుదకు ఆ సద్వస్తువునందే సంబంధము నొందుచున్నది. ఆ సద్వస్తువుగాక ఇంకే యొకపదార్థమున్ను ఆ జ్ఞానమునకు ఆశ్రయమగుటకు శక్యముకాదు.

తాత్పర్యము — సద్రూపాధిష్ఠానములేక భ్రమకాదు. మఱియు ఆ యధిష్ఠానజ్ఞానముచే భ్రమప్రాప్తపదార్థముయొక్క నివృత్తియగుచున్నది. ఇది శాస్త్రవేత్తల సిద్ధాంతము. ఆ సిద్ధాంతము నంగీకరించి ఏదోయొక సద్రూపాధిష్ఠానమందు ఏదోయొక అసత్పదార్థము నారోపించి తన్నిషేధము చేయుటయగును. ఆ యసత్పదార్థనివృత్త్యనంతరము ఆ సద్రూపాధిష్ఠానస్ఫూర్తిని యెవరు నివారణచేయును? అసన్నివృత్త్యనంతరము సద్రూపాధిష్ఠానస్ఫూర్తి అవశ్యముగనే యగును. ఇపుడు సర్వజ్ఞానములకు సద్వస్తువందు పర్యవసానతను స్పష్టీకరించుటకొఱకు సర్వత్రాధారతయొక్క అపేక్ష వర్ణింపబడుచున్నది.

ఓ దేవతలారా! అసత్తును ప్రతిపాదనము చేయునట్టి యే "వంధ్యాపుత్రో నాస్తి" యను వచనముకలదో ఆ వచనమందు మొదట ఈ విచారమును చేయవలయును. "వంధ్యాపుత్రో నాస్తి" యను వచనమందు ఆధారమునకు వాచకమైన యే "కుత్ర" యనుశబ్దము కలదో ఆ కుత్రశబ్దమునకు అపేక్షకలదా? లేదా? అట వాది రెండవ పక్షమంగీకరించిన సంభవింపదు. ఎందుకనగా — ఆ వచనమందు ఆధారవాచక పదమునకు అపేక్ష సర్వులకు స్పష్టముగ ప్రతీతమైనది. ఆ సర్వానుభవసిద్ధార్థమును అంగీకరింపకుండుటయందు వాదియొక్క కేవల హఠముమాత్రమే సిద్ధించును. మఱియు "వంధ్యాపుత్రో నాస్తి" అను నీ వచనమందు ఆధారవాచకమైన కుత్రశబ్దమున కపేక్షకలదను ప్రథమపక్ష మంగీకరించినచో పరిశేషముగ ఆ సత్తయొక్కయే సిద్ధియగును. ఎందుకనగా — 'వంధ్యాపుత్రో నాస్తి' యను నీ వచనమునకు అపేక్షితమైన ఆధారవాచకమగు ఏ కుత్రశబ్దముకలదో ఆ కుత్రశబ్దము లోకమందు అప్రసిద్ధమగుటవలన ఏ యద్భుతార్థము ప్రతీతమగుచున్నదో యా యద్భుతార్థము సత్తారూపమే యైయున్నది. ఆ సత్త సర్వపదార్థములకు తనయందు ఆశ్రయమిచ్చునట్టిదిగానున్నది.

తాత్పర్యము — "భూతలే ఘటోఽస్తి" ఇత్యాది స్థలములందెచ్చట లోకప్రసిద్ధ భూతలాదికము ఘటాదులకు ఆధారరూపముగ ప్రతీతమగుచున్నదో అచ్చట

భూతలాదులకు ఆధారరూపముచే ఆ సత్తయొక్క ప్రతీతియగుచున్నది. మఱియు 'వంధ్యాపుత్రోనాఽస్తి' ఇత్యాది స్థలములందెచ్చట లోకప్రసిద్ధమగు ఏయొక ఆధారము సంభవింపదో అచ్చట సాక్షాత్సత్తయే ఆధారరూపముగ ప్రతీతమగుచున్నది. దాని వలన 'ఘటోఽస్తి పటోఽస్తి' ఈ మొదలగు యెన్నిజ్ఞానములుగలవో ఆ యన్ని జ్ఞానములు సద్వస్తువందే స్థితములై ప్రమాణరూపములగుచున్నవని సిద్ధించుచున్నది. ఆ సద్వస్తువో ఆత్మస్వరూపమే. కనుక ఆ సర్వజ్ఞానములకు ఆత్మయందే ప్రమాణత కలదు.

ఓ దేవతలారా! ఈ దేహము మొదలగు భూతభౌతికద్వైత ప్రపంచమెంతకలదో అది యే సత్తారూపాధిష్ఠానమందు కల్పితమైయున్నదో, ఆ సత్తారూపాధిష్ఠానమే పరమార్థముగ సత్యరూపమై యున్నది. మఱియు ఆ సత్తారూపాధిష్ఠానము సర్వభేద రహితమగుటవలన బ్రహ్మాత్మరూపమై యున్నది. ఓ దేవతలారా! ఏ పురుషుడు సత్తాసామాన్యదృష్టి నంగీకరించియున్నాడో ఆ విద్వత్పురుషునకు ఈ ద్వైతప్రపంచముయొక్క అనుభవము కానేరదు. కాన సర్వాధిష్ఠాన సద్బ్రహ్మము అద్వితీయ రూపముగనే సిద్ధించుచున్నది. దేవతలు హే భగవన్! ఈ ప్రత్యక్ష సిద్ధద్వైత ప్రపంచమునకు విరోధియగుటవలన అద్వైతమునకు సిద్ధి యేలాగుననగును?

ప్రజాపతి — ఓ దేవతలారా! ఏకదేశమందు ఏకకాలమందు వర్తించు పదార్థమునకే పరస్పరవిరోధమగుచున్నది. భిన్నదేశ భిన్నకాలములందు వర్తించు పదార్థములకు విరోధము సంభవింపదు. ఇచ్చట ఈ ప్రసంగమందు అద్వైతప్రతీతి, ద్వైతప్రతీతి, ఈ రెండును ఏకదేశమందు ఏకకాలమందు వర్తింపవు. భిన్న భిన్న దేశకాలములందు వర్తించుచున్నవి. కనుక ఆ రెంటికివి విరోధము సంభవింపదు. ఏ యజ్ఞానులకు అద్వైతానుభవముకాదో ఆ యజ్ఞానులచే చూడబడిన ద్వైతప్రపంచము విద్వత్పురుషుల కనుభూతమైన అద్వితీయాధికరణమం దెప్పటికిని సంబంధించదు. ఈలాగున భిన్న భిన్న దేశకాలములం దుండుటవలన అద్వైత ద్వైతములకు విరోధము సంభవింపదు. కాబట్టి అద్వైతమందు ద్వైతప్రపంచాభావము సిద్ధించుచున్నది. ఓ దేవతలారా! ఒకచో అజ్ఞానులకు ద్వైత ప్రపంచముయొక్క అనుభవమగునవిన నిశ్శంకమౌగాక! ఆ భ్రాంతపురుషుల అనుభవసిద్ధ ద్వైతప్రపంచముచే విద్వాంసుల అనుభవసిద్ధమగు అద్వైతమునకు కించిన్మాత్రము హానిలేదు. ఎందుకనగా ఆ మిథ్యా ద్వైతము అధిష్ఠానవస్తువును స్పర్శింపదు. మఱియు ఆ ద్వైతప్రపంచము అవిచారముచే ప్రతీతమగునుగాని విచారముచే నది సహింపబడదు. కాబట్టి అది మాయామయమైయున్నది. అందువలననే ఆ ద్వైతప్రపంచము అద్వితీయాధిష్ఠానమందు కల్పితమైయున్నది. ఆ కల్పితద్వైతముచే వాస్తవమైన అద్వైతమునకు హాని కానేరదు.

దేవతలు — హే భగవన్, కల్పితమైన ద్వైతప్రపంచముచే అద్వైతమునకు హాని గాదనిన గాకపోవుగాక! అట్లైనను ఆ కల్పితద్వైతసంబంధఅభావముచే అద్వైతమునకు హానియగునుకదా! ప్రజాపతి — ఓ దేవతలారా! ఎట్లు కల్పితమైన ద్వైత ప్రపంచము అద్వైతమునకు హానిచేయదో అట్లే ఆ కల్పితాభావమున్ను అద్వితీయతకు హానిచేయదు. ఎందుకనగా వేదాంతసిద్ధాంతమందు కల్పితవస్తువుయొక్క అభావము అధిష్ఠానరూపమే యగును. (కల్పిత సర్పాభావము రజ్జురూపమేయైనట్లు) కల్పిత ప్రపంచమునకును తదభావమునకును అద్వితీయాత్మయే అధిష్ఠానమైయున్నది. కనుక ప్రపంచమున్ను తదభావమున్ను అద్వితీయాత్మకు హానిచేయవు. ఓ దేవతలారా! శుద్ధాత్మయందు ద్వైత ప్రపంచము పూర్వమెప్పుడునులేదు, ముందును యుండబోదు. ఇప్పుడును లేదు. ఈ కారణమువలన వేదవేత్తలు ఈ యాత్మదేవుని 'అద్వైత' నామముచే కథనము చేయుచున్నారు. దేవతలు హే భగవన్! కల్పితప్రపంచముచే ఆత్మదేవునియందు ద్వైతము గాకపోవుగాక! కాని ప్రపంచకారణమైన మాయచే ద్వైతమగునుగదా! ప్రజాపతి — ఓ దేవతలారా! ఈ యనంతరూపాత్మ సకల ద్వైతప్రపంచరహితముగాను సర్వజగత్సాక్షిగాను జననమరణాదివికారరహితముగాను సూర్యభగవంతునివలె ప్రకాశమానముగానున్నాడు. ఇటువంటి స్వయంప్రకాశమగు ఆత్మదేవునియందు సూర్యునియందంధకారమువలె ఈ తమోరూపావిద్య సంభవింపదు. మఱేమనిన స్వయంజ్యోతిరాత్మయొక్క ప్రభావముచే ఈ యవిద్యారూపమాయ తనంతటతానే నివృత్తమగును. ఇట్లుండగా ఆ స్వయంజ్యోతిరాత్మయందు మాయయొక్క స్థితి మాయాదృష్టిచేతనే గలదు. వాస్తవదృష్టిచే ఆత్మయందు మాయయొక్క స్థితి సంభవింపదు.

ఓ దేవతలారా! ఎట్లు ప్రకాశమానమగు సూర్యునియందు ఘూకాదులచే కల్పితమైన అంధకారరూపతమము ఆ కల్పితతమోబలముచేతనే గలదో, సూర్యతేజముచే ఆ కల్పితతమమునకు సిద్ధికాదో, అట్లే స్వయంజ్యోతిరాత్మయందు అజ్ఞానులచే కల్పితమైన అవిద్యారూపమాయయు తత్కార్యప్రపంచమున్ను మాయచేతనే సిద్ధించునుగాని ఏ యొక ప్రమాణముచేతను సిద్ధింపదు. ఓ దేవతలారా! ఆత్మదేవునియందు ఎట్లు మాయాకార్య ప్రపంచము కల్పితమైయున్నదో అట్లు మాయయు కల్పితమై యున్నది. దానికి ఆత్మదేవునికన్న భిన్నమగు సత్తలేదు. ఇంతవఱకు ద్వైతప్రపంచముయొక్క కల్పితరూపత నిరూపింపబడినది.

ఇపుడు "స్థాణోఽయం చోరః" అను నీ ప్రకారమగు బాధసామానాధికరణ్యముచే సర్వజగత్తునందు పరమాత్మదృష్టియొక్క నిరూపణము గావింపబడుచున్నది. ఓ దేవతలారా! పూర్వము నేను మీకు యేస్వయంజ్యోతిరాత్మదేవుని సచ్చిదానంద

స్వరూపముగ కథనముచేసితినో ఆ పరమాత్మదేవుడే మాయాసహిత విశ్వరూపమై యున్నారు ఇటువంటి సర్వాత్మరూపపరమాత్మదేవుడు ఈ దేహధారి జీవులకు నిత్య ప్రాప్తుడైయున్నను మాయాబలముచే అప్రాప్తునివలె నున్నారు. ఇపుడు సర్వత్రాత్మ దృష్టిచే ఆ పరమాత్మదేవుని ప్రాప్తికి ఉపాయము బోధించుటకొఱకు ప్రపంచము నకును సత్యరూపత ప్రతిపాదింపబడుచున్నది. ఓ దేవతలారా! పూర్వము నేను మీకు యే మాయాసహిత సకల ప్రపంచము కల్పితరూపమని వచించితినో ఆ ప్రపంచము వంధ్యాపుత్రునివలె అత్యంతాసద్రూపము కాదు. ఎందుకనగా - ప్రపంచమును అత్యంతాసత్తనిన ఆ ప్రపంచముయొక్క అసత్తారూపధర్మము ఏ ప్రకారము సిద్ధి యగును? ఆ యసత్తారూప ధర్మము ఏదోయొక ధర్మినే ఆశ్రయించును. ధర్మిలేక ధర్మమునకు స్థితి సంభవింపదు.

దేవతలు - హే భగవన్! ఈ ప్రకారము జగత్తుయొక్క సత్యత నంగీకరించి నను వంధ్యాపుత్ర శశశృంగాదులందు ఆత్మదృష్టి యొనర్చుట సంభవింపదు. కనుక సర్వత్రాత్మదృష్టి యొనర్చుట అత్యంతదుర్ఘటమగునుగదా? ప్రజాపతి - ఓ దేవతలారా! అసత్పదమున కర్థరూపముచే ప్రసిద్ధమైన వస్తువునకు శాస్త్రవేత్తలచే సద్రూపతయే కథనముచేయబడియె ఎట్లు 'అనశ్వ' పదమందలి ఎ 'అన్' పదముగలదో అది అశ్వసంబంధ అభావమును కథనము చేయదు. ఏ భావరూపవస్తువు అశ్వముకన్న భిన్నమై అశ్వసదృశమగునో ఆ భావరూపవస్తువునే 'అన్' పదమెట్లు కథనముచేయు చున్నదో అట్లే నానా ప్రకారకార్యముల చేయుటయందు సమర్థమైన ఏ ప్రసిద్ధ సత్పదార్థములుగలవో వాటినుండి అసమర్థతారూపముచే విలక్షణమైన ఏ సూక్ష్మ పదార్థములు గలవో వాటిని వేదవేత్తలు అసన్నామముచే కథనము చేయుచున్నారు ఆ యాత్మసంబంధ సత్తనంగీకరించినదైన సత్యరూపత సర్వపదార్థములందు సమానమే యైయున్నది. (ఈ విషయము ప్రథమాధ్యాయమందు వచింపబడినది.) కాబట్టి ఆత్మ సత్త నంగీకరించి ఈ సర్వజగత్తునకు సద్రూపమంగీకరించుటయందు కించిన్మాత్రము హానిలేదు. ఓ దేవతలారా! ఈ కార్యసహిత ప్రపంచరూపమాయ స్వసత్తారహితమై యున్నది. ఎట్లు ఒకధనికుడు మఱొకధనికునినుండి భూషణాది పదార్థములను తెచ్చి తనగృహమును శోభితముగ చేయుచున్నాడో అట్లే ప్రపంచసహిత మాయయు అధిష్ఠాన సంబంధ సత్తను అంగీకరించి సద్రూపమైనది. (ఇది యాచితమండన న్యాయము.) దేవతలు - హే భగవన్! కార్యసహితమాయ ఆత్మయొక్క వాస్తవస్వరూపము గానపుడు ఆత్మదేవుని వాస్తవస్వరూపమేది యగును?

ప్రజాపతి - ఓ దేవతలారా! సచ్చిదానంద స్వయంజ్యోతియగు ఆత్మదేవుని స్వరూపమును నేను పూర్వము కథనముచేసితిని. ఆ స్వరూపము నిత్యప్రకాశమగుట

వలన స్వసిద్ధియందు ఏయొక ఇతరపదార్థము యొక్కయు అపేక్షచేయదు. మఱియు ఆ నిత్య ప్రకాశాత్మకన్న భిన్నమగు యెంతజగత్తుగలదో ఆ సకల జగత్తు జడమగుట వలన తనసిద్ధియందు నిత్యమైన ప్రకాశాత్మయొక్క అపేక్షచేయుచున్నది. ఇటువంటి అనిత్య జగత్తునందు నిత్యరూపతయొక్క సంభవములేదు. కనుక జగత్తు నిత్యమను మందబుద్ధుల ఆక్షేపము వ్యర్థమేయగును. ఓ దేవతలారా! చైతన్యాత్మయొక్క బలము చేతనే ఈ జడప్రపంచమునకు సిద్ధి యైనది. చైతన్యాత్మలేకున్న జడప్రపంచమునకు సిద్ధియేకాదు. ఈలాగున ప్రపంచమందనిత్యత స్పష్టముగానే ప్రతీతమగుచున్నది. కావున జగత్తు నిత్యమా? అనిత్యమా? యనుసంశయము మీరెప్పటికిని చేయకూడదు. దేవతలు - హే భగవన్! ఈ జగత్తు యేలాగున ఆత్మచే సిద్ధించినది?

ప్రజాపతి - ఓ దేవతలారా! ఆత్మదేవుడు సాక్షాత్తుగాగాని బుద్ధి వృత్తిద్వారా గాని సకలజగత్తును ప్రకాశము చేయుచున్నారు. బాహ్యఘటపటాది పదార్థములనో చిదాభాసయుక్త బుద్ధిద్వారా ప్రకాశింపజేసి అంతరమైన అజ్ఞానాదులను సాక్షాత్తుగా ప్రకాశింపజేయుచున్నారు. ఆ యాత్మదేవుడు సర్వసంగరహితుడగుటవలన వేదవేత్త లాతనిని 'నిత్యసిద్ధ'నామములచే కథనము చేయుచున్నారు. ఓ దేవతలారా! నేను మీకు యే యాత్మదేవునిగూర్చిన యుపదేశమును చేయుచున్నానో. ఆ యాత్మదేవుని మీరు నిశ్చయము చేయుచున్నారా? లేదా? నాకు చెప్పుడు. హే శిష్య! ప్రజాపతిచే ఇట్లు అడుగబడిన తరువాత ఆ దేవతలు చిదాభాసునే ఆత్మగా నెఱిగి ప్రజాపతితో నిట్లనిరి.

దేవతలు - హే భగవన్! పూర్వోపదేశమందు తాము మాకు లౌకికవ్యవహార ముచే రహితమై బుద్ధ్యోపాధిగలదై అల్పపరిమాణముగలదైన ఆత్మదేవుని కథనము చేసితిరి. మేమద్దానిని యెఱుగుచున్నాము - హే శిష్యా! ఈ ప్రకారమగు దేవతల భాషణమునువిని ప్రజాపతి వారి భ్రాంతినివారణార్థము చిదాభాసునియందు సంభ వించని ధర్మములచే ఆత్మస్వరూపమును కథనము చేయుచున్నాడు.

ప్రజాపతి — ఓ దేవతలారా! పూర్వము నేను మీకు అల్పపరిమాణాత్మ యొక్క ఉపదేశము చేయలేదు. సర్వజగత్తునకు సాక్షిరూపమైన ఆత్మయొక్క ఉప దేశముచేసితిని. ఆ సాక్షిరూపాత్మదేవుడు విషయసంబంధ విశేషతారహితుడై యుష్మ దాది ప్రమాతలతో అధిష్ఠానతారూపముచే తాదాత్మ్యసంబంధముగలవాడైయున్నాడు. సకల సుఖదుఃఖ ధర్మములచే రహితుడైయున్నాడు. ఆ యాత్మదేవునియందు సర్వజ్ఞత క్షణికజ్ఞానరూపమగునట్టిదికాదు. అది త్రికాల వర్తమాన స్వప్రకాశ చైతన్యరూపము చేతనే గలదు. ఓ దేవతలారా! ఇటువంటి ఆత్మయందు ప్రతీతమగు విపరీతరూపతకు

మాయయొక్క కల్పిత సంబంధమే కారణమైయున్నది. కమక పూర్వము చేయబడిన బ్రహ్మరూపాత్మయొక్క స్వరూపవర్ణనము యథార్థమే యైయున్నది. ఆ యాత్మదేవుడు మీ స్వరూపమే యైయున్నాడు.

ఓ దేవతలారా! నా యుపదేశముచే మీరు స్వప్రకాశాద్వితీయ రూపాత్మను గాంచుచున్నారా? లేదా? దేవతలు — హే భగవన్! ఆత్మదేవునియందు స్వప్రకాశత యేరీతిగా సంభవించును? ప్రజాపతి — ఓ దేవతలారా! మాయా స్వరూపమును ప్రకాశము చేయువారైన ఆత్మదేవునియందు మాయ స్థితముకాదు. ఒకచో ఆత్మదేవుని యందు మాయ స్థితమైన పక్షమందు ఆత్మదేవునిచే మాయ ప్రకాశితముకాదు. (చక్షుస్థితమగు అంజనము చక్షువుచే ప్రకాశింపబడనట్లు) మఱియు ఆత్మదేవుడుగాక, ఇంకొక ప్రకాశకుడులేడు. పరిశేషముగ ఆత్మదేవునియందే స్వయంజ్యోతిరూపత సిద్ధించుచున్నది. ఓ దేవతలారా! ఈ ప్రకారముగ ఆత్మదేవునియందు అద్వితీయత స్వప్రకాశితా బోధనకొఱకే శ్రుతియందు చెప్పబడియె ఆ యద్వితీయతాకథనము చేతనే ఆత్మదేవునియందు మాయారహితత్వము, స్వప్రకాశత్వము సిద్ధించుచున్నది.

ఓ దేవతలారా! ఏ ఆత్మజ్ఞానదశయందు ద్వైతప్రపంచము కించిన్మాత్రమును యుండదో ఆయాత్మజ్ఞానదశయందు మీకును భేదరహిత స్వయంజ్యోతిరాత్మయే శేషించి యుండును హే శిష్య! ప్రజాపతిచే దేవతలకు ఈ ప్రకారముగ నుపదేశము చేయబడినపిమ్మట దేవతలు తమ మనస్సునందీ విచారమును గావించుకొనదొడఁగిరి. ఒకచో నీయాత్మదేవుడు అద్వితీయరూపమైనపుడు సంగాదిదోషములచే దుష్టమైన ఈ కార్య ప్రపంచసహిత మాయకు ఆ యాత్మదేవుని స్వప్రకాశస్వరూపమందు ప్రవేశమగును. తత్ప్రవేశముచే ఆత్మదేవుడును సంగవంతుడగును. అపుడాసంగవంతుడైన ఆత్మదేవునియందు స్వప్రకాశత సంభవింపదు. ఈ ప్రకారమగు విచారముచే నా దేవతలు ప్రజాపతినిగూర్చి మఱల యిట్లు ప్రశ్నించుచున్నారు. హే భగవన్! ఈ జడ ప్రపంచము యొక్క తాదాత్మ్య సంబంధరూపసంగముచే యుక్తమై ద్రష్టలైన మనయొక్కదృశ్యభావమును పొందినట్టి మాయారూపోపాధియొక్క సంబంధముచే (ఈశ్వరసంజ్ఞను పొందిన) ఆ యాత్మదేవునియందు అసంగత స్వప్రకాశత సంభవింపవుగదా? ప్రజాపతి - దేవతలారా! మీకు ఆత్మదేవుడు ద్వైతసహితముగ ప్రతీతమగుట మాయయొక్క ప్రభావముచేతనేగాని వాస్తవముగ ఆత్మదేవునియందు ద్వైతములేదు. ఇటువంటి అద్వితీయాత్మయందు ద్వైతమును దర్శించుటయే మూఢతయొక్క చిహ్నము, ఒకచో మీ స్వరూపమందు ఏదోయొక భేదముగాని, సంగము పరప్రకాశత గాని సంభవించిన పక్షమందు అవి ద్రష్టయగు ఆత్మకు దృశ్యప్రపంచముయొక్క తాదాత్మ్యసంబంధముచేతనే గలిగినవగునుగాని వాస్తవముగ మీ స్వరూపమందు

కించిన్మాత్రము భేదముగాని సంగాదులుగాని లేవు మీరు ద్వైత భావరహితులై, శుద్ధాత్ములై స్వప్రకాశస్వరూపులైయున్నారు. అటువంటి మీ స్వరూపమందు సంగము పరప్రకాశత యేలాగున సంభవించును ?

దేవతలు – హే భగవన్ ! ఎట్లు ఘటాది బాహ్యపదార్థములను సంవిద్రూప జ్ఞానమునకు విషయమని మే మెఱుఁగుచున్నామో అట్లే ప్రపంచభావమును పొందిన తమ ఆత్మనున్ను మేము సంవిద్రూపజ్ఞానమునకు విషయరూపముగ నెఱుఁగు చున్నాము కనుక మాయందు స్వప్రకాశత సంభవింపదు హే భగవన్ ! ఈ సకల జగత్తు యెవనికి శరీరమో అటువంటి ఈశ్వరుడున్ను మాకంటె భిన్నుడు కాడు. ఈ కారణమువలన మేము అద్వితీయరూపులుగనున్నాము. మఱియు అద్వితీయరూపుల మగుటవలనే అసంగరూపులుగనున్నాము. ఇట్లు అద్వితీయాసంగరూపులమైయున్న మేము తమ ఆత్మను సంవిద్రూపజ్ఞానమునకు విషయరూపముగ నెఱుగుచున్నాము. ఇవ్విధమున అద్వితీయభావము గలిగినను విషయ విషయీ భావభేదమునకు నివృత్తి కాలేదుగదా ? ప్రజాపతి – ఓ దేవతలారా ! ఎంతకాలమువఱకు అద్వితీయరూపత ప్రతీతముకాలేదో అంతకాలమువఱకు కార్యసహిత మాయయొక్క స్థితిచే ద్వైతప్రతీతి యగుచున్నది. మఱియు ఏ కాలమందు కార్యసహిత మాయను నాశముచేయునట్టి అద్వితీయరూపత్వబోధ పుట్టుచున్నదో ఆ కాలమందే మీ అద్వితీయస్వరూపమందు ఆ సంవిద్రూపజ్ఞానమునకు విషయత సంభవింపదు. దేవతలు – హే భగవన్ ! ఈ యద్వితీయాత్మ సంవిద్రూపజ్ఞానమునకవిషయమను భావముయొక్క దృఢత గావించునట్టి యుక్తిని మేమెఱుఁగము. ఇంతవఱకును మేమాత్మను సంవిద్రూప జ్ఞానముయొక్క విషయరూపముగనే యెఱిగియుంటిమి. స్వప్రకాశరూపముగ నెఱుఁగ లేదు. అందువలన శాస్త్రోపదేశమునకును, మా యనుభవమునకును మహావిరోధము గలదు. ఆ విరోధనివృత్తికై తామే మాకు ప్రమాణమగుదురు. ఏ విషయమును తాము సెలవిచ్చెదరో దానిని మేము నిశ్చయము చేయుదుము.

ప్రజాపతి – ఓ దేవతలారా ! మీరు సకలశాస్త్రములందును అత్యంతకుశలురు. అత్యంతబుద్ధిమంతులు ఇటువంటి మీకే ఆత్మయొక్క విషయతనుగూర్చి ఏ యొక యుక్తియు తోచకున్న ఇంకెవడు ఈ విషయమున యుక్తి చెప్పును ? ఆత్మ సంబంధ విషయతను సిద్ధింపజేయునట్టి యుక్తియేలేదు అందువలన ఆత్మదేవునియందు అద్వితీయరూపతచే స్వప్రకాశరూపత పూర్వము సిద్ధింపజేయబడియె. ఆ స్వప్రకాశరూపతనే మీరు నిశ్చయముచేయుడు. ఆ స్వప్రకాశాత్మను మీరు విషయతారూపముచే నెఱిగిన

పక్షమందు మీయందు అనాత్మత్వప్రాప్తియగును. ఓ దేవతలారా! ఒకచో ఆత్మకును సంవిద్రూప జ్ఞానమునకును పరస్పరము భేదముండిన పక్షమందు ఆ రెంటియొక్క విషయ విషయీ భావమందు మీకేదైన యుక్తిస్ఫురించగలదు. కాని ఆ రెంటికిని భేదములేదు. మఱేమనిన ఆ సంవిద్రూపజ్ఞానము ఆత్మస్వరూపమేయైయున్నది. ఈ కారణమువలన ఆ రెంటియొక్క విషయవిషయీభావమందు మీకే యొక యుక్తియు దొఱకదు. ఈ స్వయంజ్యోతియగు అద్వితీయాత్మదేవునియందు విషయతయొక్క అభావమేగలదు. ఓ దేవతలారా! ఏ ద్వైత ప్రతీతియొక్క ప్రథమక్షణమందు, మఱియు సమాధికాలమందు ఈ యాత్మదేవుడు 'అహమస్మి' ఈ ప్రకారమగు ప్రత్యగ్రూపముచే ప్రతీతమగుచున్నాడో ఆ కాలమందు అద్వితీయాత్మయందు విషయ విషయీ భావరూపభేదము కించిన్మాత్రమున్ను ప్రతీతముకాదు. ఒకచో ఆత్మదేవుని యందు భేదము వాస్తవముగ నుండిన పక్షమందు సమాధికాలమందును ఆ భేదము ప్రతీతము గావలసియుండె. అట్లగుటలేదు.

దేవతలు — ఓ భగవంతుడా! వ్యవహారబలముచే ఆత్మదేవునియందు భేదము సిద్ధించునుగదా? ప్రజాపతి — ఓ దేవతలారా! వ్యవహారమునకు కారణరూపమగు మనోవాక్కులచే తన్మనోవాక్కుల విషయరూప భేదముచే ఆత్మదేవుడు రహితుడుగ నున్నాడు. ఈ కారణమువలన స్వయంజ్యోతియగు ఆత్మదేవుడు ఏ యొక వ్యవహారమునకును విషయము కానేరడు దేవతలు — హే భగవన్! మనోవాక్కులకవిషయమైన యిటువంటి ఆత్మదేవునిగూర్చిన యుపదేశము సంభవింపదుగదా? ప్రజాపతి — ఓ దేవతలారా! అద్వితీయాత్మ మనోవాక్కుల కవిషయమగుటవలననే బ్రహ్మవేత్తయగు గురువు తన శిష్యులకు మౌనరూపముచే ఆత్మోపదేశము చేయుచున్నాడు. సచ్ఛబ్దమున కర్థమైన స్థూలప్రపంచము, మఱియు అసచ్ఛబ్దమున కర్థమైన సూక్ష్మ ప్రపంచము ఈ రెంటియందే మనోవాక్కులకు ప్రవృత్తియగును. ఆత్మదేవుడో స్థూల సూక్ష్మప్రపంచరహితుడు అట్టివానియందు మనోవాక్కులకు ప్రవృత్తి సంభవింపదు. ఓ దేవతలారా! కారణరూపావిద్యస్వభావముగ తుచ్ఛరూపమై జగద్రూపకార్యమును గలుగజేయుచు సత్యరూపముగ ప్రతీతమగుచున్నది. ఆ యవిద్య తాను స్వయముగ సత్తారహితమై ఆత్మనాశ్రయించుటచే సత్తనుబొంది నానాప్రకార కార్యములను చేయుటవలననే నానాప్రకార వ్యవహారమునకు యోగ్యమైనది. ఆ యవిద్యయందు ప్రతిబింబించిన చైతన్యాత్మ 'ఈశ్వర' నామముచే చెప్పబడెను. ఆ యీశ్వరాత్మ యెప్పుడు తనసంకల్పముచే ప్రాణబుద్ధ్యాది రూపమగు యుపాధిగలవాడాయెనో, అపుడు 'జీవ' నామముచే కథనము చేయబడెను.

అట ప్రథమకార్యమగు నేసూక్ష్మసమష్ట్యభిమానియగు హిరణ్యగర్భ జీవుడాయెనో అతడు స్వతస్సిద్ధ జ్ఞానముకలవాడగుటవలన 'ఈశ్వర' నామముచే కథనము చేయబడెను ఆ హిరణ్యగర్భ భగవంతుడే సమష్టి స్థూలోపాధిగలవాడై విరాడ్నామమును పొందెను మఱియు ఎట్లు సమష్టి ఉపాధిత్రయసంబంధముచే ఆత్మ ఈశ్వరాది నామత్రయముచే చెప్పబడెనో అట్లే వ్యష్టిరూపకారణ సూక్ష్మస్థూలోపాధిత్రయ సంబంధముచే ఆత్మదేవుడు ప్రాజ్ఞ తైజస విశ్వ మను నామత్రయముచే చెప్పబడెను. ఇవ్విధమున ఈశ్వర హిరణ్యగర్భాది సకల శబ్దములు ఒకడైన చైతన్యాత్మయందే వర్తించుచున్నవి ఈ ప్రకారముగ సర్వవ్యవహారసిద్ధి చేయునట్టి మూడవస్థలు లేనివాడై మనోవాక్కుల కవిషయమైనట్టి ఆ స్వయంజ్యోతిరాత్మ తురీయనామముచే కథనము చేయబడెను ఓ దేవతలారా! ఆ యాత్మదేవునియందు తురీయవ్యవహారమున్ను అవస్థాత్రయనిరూపిత కల్పితభేదాపేక్షచేతనే యైనది. స్వభావముగ ఆత్మదేవునియందు తురీయవ్యవహారమున్ను సంభవింపదు దేవతలు — హే భగవన్! ఆత్మదేవుడు యేయొక వ్యవహారమునకు విషయముగాని పక్షమందు తాము మాకు ఆత్మోపదేశము ఏలాగున చేయుచున్నారు? ప్రజాపతి — ఓ దేవతలారా మనోవాక్కుల కవిషయమైన ఏ యాత్మదేవుడు కలడో అతనియందు దూరత్వధర్మమువలె ఏదో యొక ధర్మము నారోపణ జేసి నేను మీకు ఆత్మోపదేశము చేయుచున్నాను ధర్మారోపణము చేయక కేవలనిర్గుణాత్మయొక్క ఉపదేశము చేయుటకు నేనుకూడ సమర్థుడను కాను. ఓ దేవతలారా ఏ ఆత్మయొక్క ఉపదేశమును నేను మీకు చేయుచున్నానో ఆ యాత్మను మీరెఱింగితిరా? లేదా'

దేవతలు — హే భగవన్! శిష్యులమైన మమ్ముల ఆత్మస్వరూపము నడిగిన గురువగు తమకు ఆత్మయొక్క స్వరూపమును మేమవశ్యముగ చెప్పవలసినది కాని ఆ యాత్మ దేవునియందు జ్ఞాతత్వాజ్ఞాతత్వ ధర్మములు రెండును సంభవింపవు కనుక ఆ రెండు ధర్మములందు ఏ ధర్మముచే విశిష్టమైన ఆత్మను మేము తమకు కథనము చేయవలయును? హే భగవన్ ఆ యాత్మ దేవుడు జ్ఞానమునకు విషయములయిన విదితపదార్థములకన్నను అవిదితపదార్థములకన్నను అత్యంతవిలక్షణమైయున్నాడు. అటువంటి ఆత్మయొక్క స్వరూపమును మేము ఏ ప్రకారముగ కథనము చేసెదము? ఆ యాత్మదేవుడు జ్ఞాతుడైనను అవిషయమగుటవలన అజ్ఞాతునివలె వర్తనము చేయుచున్నాడు హే శిష్య. ఈ ప్రకారముగ నెపుడు దేవతలు త్వం పదార్థరూపముచే ఆత్మ దేవుని యథార్థస్వరూపము నెఱిగిరో అపుడా ప్రజాపతి దేవతలకు ఆ త్వం పదార్థ ఆత్మయొక్క ఉపదేశమునే తత్పదార్థరూపముచే యొనర్చుచున్నాడు.

శిష్యుడు — హే భగవన్! ఆ ప్రజాపతి దేవతలకు పూర్వము అనేకమార్లు ఉపదేశము చేయుచు వచ్చెను మరల మరల ఆ యాత్మోపదేశమునే చేసిన ప్రజాపతికి పునరుక్తిదోషము కలుగును కదా? శ్రీ గురువు — హే శిష్య అత్మదేవుడు అత్యంత దుర్విజ్ఞేయుడు కనుక బ్రహ్మవేత్తయగు గురువు శిష్యులకు మఱల మఱల ఆ యాత్మ యొక్క యుపదేశము చేయుటవలన శిష్యుల విపరీతభావనాదుర్వాసనారూప ప్రతిబంధ నివృత్తియై అనంతరము వారికి దృఢాత్మజ్ఞానమగుచున్నది కనుక ఆత్మోపదేశము మఱల మఱల చేసినపుడు పునరుక్తి దోషము కాదు ఫలరహితమైన సువిజ్ఞేయవస్తు వును మాటిమాటికి కథనము చేయుట దోషకారకము. హే శిష్య! మఱల మఱల ఆత్మోపదేశము ఎట్లు దుర్వాసనా నివృత్తికి కారణమగునో అట్లే ప్రణవచింతనమున్ను దుర్వాసనానివృత్తికి కారణమని విచారించి ప్రజాపతి దేవతలగూర్చి యిట్లనియె — ప్రజాపతి — ఓ దేవతలారా అకార, ఉకార, మకార, అర్ధ మాత్రలను ఈ నాల్గు పాదములు గల ప్రణవమందు విశ్వ తైజస ప్రాజ్ఞ తురీయములను యధ్యాత్మరూపము లైన నాల్గు పాదములచే అథవా — విరాట్, హిరణ్యగర్భ ఈశ్వర, పరమాత్మలను నీ యధిదైవరూపములగు నాల్గు పాదములచే తాదాత్మ్యభావము నొందినవాడైన ప్రణవ రూపాత్మదేవునియొక్క ధ్యానము నెపుడు మీరు చేయుదురో అపుడే మీకు ఏ యొక దుర్వాసన నుండదు ఈ యాత్మజ్ఞానముచే నెపుడు మీకు దుర్వాసనానాశమగునో అపుడే మీరు బ్రహ్మభావనను పొందుదురు

ఓ దేవతలారా! ఏ యాత్మదేవుని మీరు అహం శబ్దముచే పొందుదురో ఆ త్వం పదార్థరూపాత్మదేవుడే తత్పదార్థబ్రహ్మస్వరూపుడై యున్నాడు. ఆ సత్య బ్రహ్మము త్వం పదార్థ ఆత్మకన్న భిన్నము కాదు త్వం పదార్థ రూపమే యగును. ఈ ప్రకార ముగ తత్త్వం పదార్థములను బ్రహ్మాత్మరూపముగను పరస్పర అభిన్నరూపముగ నెఱు గుడు ఈ విషయమున కించిన్మాత్రమును సంశయము చేయకుడు. ఓ దేవతలారా! ఏ ప్రణవరూప సత్యబ్రహ్మరూపాత్మను నేను మీకు మహావాక్యార్థరూపముచే కథనము చేయుచున్నానో ఆ బ్రహ్మ రూపాత్మను సూక్ష్మబుద్ధిగల పురుషులే తమ ఆత్మరూప ముగ నెఱుగుదురు స్థూలబుద్ధులద్దాని నెఱుగరు. ఓ దేవతలారా! నేను మీకు పూర్వము ఏ సచ్చిదానంద స్వరూపాత్మ నుపదేశించితినో ఆ యాత్మదేవుడు స్వప్రకాశుడైయున్నను ఉపనిష దూపవేదాంతముచేతనే ప్రతిపాద్యుడై యున్నాడు ఈ కారణమువలన వేద వేత్తలా యాత్మదేవుని "ఔపనిషత్" నామముచే కథనము చేయుచున్నారు. మఱియు ఈ ఆనందరూపాత్మదేవుడు స్వప్రకాశరూపుడగుటవలన వేదవేత్తలాతనిని 'సువిఖ్యాత' నామముచే కథనము చేయుచున్నారు. ఈ యాత్మదేవుడు బ్రహ్మజ్ఞానముచే నొకసారి ఆవరణ రహితుడైన పిదప అజ్ఞానావరణమును మఱల పొందడు ఈ కారణమువలన

వేదవేత్తలు ఆత్మదేవుని 'సకృద్విభాత్" నామముచే కథనము చేయుచున్నారు ఆత్మదేవుడు అంతఃకరణ వృత్తిరూప జ్ఞానమందు ప్రతిబింబరూపముచే మఱల మఱల ప్రతీతమగుటవలన వేదవేత్తలాతనికి "సర్వతః పురతోవిభాత్' నామముచే కథనము చేయుచున్నారు ఓ దేవతలారా పూర్వోక్తసర్వగుణములతో యుక్తుడైన ఆత్మదేవుని దేవతలగు మీరు తత్త్వంపదార్థాభేదరూపముగ సాక్షాత్కరించుకొనుడు. హే శిష్య! ప్రజాపతి భగవంతుడు దేవతలకిట్లు ఆత్మోపదేశము చేసి మఱల వారి నిట్లడిగెను

ప్రజాపతి — ఓ దేవతలారా నేను మీకేయాత్మ నుపదేశము చేసితినో ఆ యాత్మదేవుని మీరు సాక్షాత్కరించుకొన్నారా? లేదా? హే శిష్య ఈ ప్రకారముగ ప్రజాపతి అడిగినపుడు ఆ దేవతలు పూర్వమువలె విదితా విదిత పదార్థములకన్న విలక్షణరూపముగ ఆత్మస్వరూపమును కథనము చేసిరి ఆ దేవతల వచనము విని ప్రజాపతి వారి బుద్ధిని పరీక్షించుటకొఱకిట్లు అడుగుచున్నాడు. ఓ దేవతలారా! పూర్వము నేను మీకు కథనము చేసిన యానందస్వరూపాత్మయొక్క అనుభూతి ఏ యాధారమందు స్థితమగుచున్నది? దేవతలు — హే భగవన్! పూర్వము తాము మాకు ఆధారరహితాత్మయొక్క యుపదేశమును చేసితిరి. ఇపుడు ఆధారమెందులకడుగుచున్నారు? (మఱల పరీక్షకొఱకు) ప్రజాపతి — ఓ దేవతలారా! పూర్వము నేను మీకు ఏ స్వయంజ్యోతిరానందస్వరూపాద్వితీయాత్మయొక్క ఉపదేశము చేసితినో ఆ జ్ఞాతుడైన ఆత్మదేవునిచే అధికారి పురుషులకేఫలప్రాప్తియగును?

దేవతలు — హే భగవన్ ఆ జ్ఞానాత్మ తానే ఫలరూపమై యున్నాడు ఆ జ్ఞానాత్మకు మఱొక ఫలమేదియు లేదు. ఎట్లనగా — ఫలావస్థను పొందిన ఆమ్రాది వృక్షములకు వేఱొక ఫలము గాన్పించుట లేదు కదా? (మఱల పరీక్షకొఱకు) ప్రజాపతి — ఓ దేవతలారా! అత్యంతాశ్చర్యరూపమగు మాయకును బ్రహ్మరూపతచే సత్త నొసంగువారు మీరు గనుక దేవతలగు మీరు అత్యంతాశ్చర్యరూపులైయున్నారు దేవతలు — హే భగవన్! లోకమందలి సర్వపదార్థములును మాయకు బ్రహ్మరూపముచే సత్త నొసంగుచున్నవి కనుక సర్వపదార్థములును ఆశ్చర్యరూపములే యగును కేవలము దేవతలు మాత్రమే ఆశ్చర్యస్వరూపులు కారు. ప్రజాపతి — ఓ దేవతలారా! ఘటాది దృశ్యపదార్థములకును బ్రహ్మరూపతచే ఎపుడు మీరు ఆశ్చర్యరూపముగ నెఱుగుచున్నారో, అపుడా ఆశ్చర్యరూపబ్రహ్మమును ఆ ఘటాదిపదార్థములనువలె యిదంతారూపముచేతను మీరెఱుగుచున్నారు ఇట్లు మీ వచనములచే సిద్ధించుచున్నది కనుక ఓంకారరూప ప్రణవముయొక్క అనుసంధానపూర్వకముగ ప్రత్యగాత్మదేవుని మే మెఱుగుచున్నామని ఈ ప్రకారము మీరెందులకు చెప్పరు? దేవతలు — హే

భగవన్ సర్వత్రవ్యాపకుడై ఒకడైన అద్వితీయాత్మదేవుడు యే యింద్రియమునకును విషయముకాడు కనుక ఆ యాత్మదేవుడు జ్ఞాతమనుటకు వీలుపడదు. మఱియు నాతడు అస్తిరూపముచే సర్వత్ర ప్రతీతుడగుటవలన నజ్ఞాతమనుటకును వీలుపడదు. ఇక జ్ఞాతత్వాజ్ఞాతత్వములను నీ రెండు ధర్మములు పరస్పర విరుద్ధములగుటవలన ఒకే అధికరణమందుండవు కనుక ఆత్మదేవుడా యుభయధర్మములు గలవాడనుటకును వీలుపడదు కాన దేవతలమగు మేము ఆ యాత్మదేవుని చెప్పుటకెట్లు సమర్థులమగుదుము? కానేరము అందువలననే బాధ సామానాధికరణ్యముచే సర్వపదార్థములందు బ్రహ్మరూపతను మేము కథనము చేయుచున్నాము. దానివలన ఆత్మదేవుని ప్రత్యగ్రూపతకు హాని కానేరదు.

ప్రజాపతి — ఓ దేవతలారా! మీ కీప్రకారమగు ఆత్మనిశ్చయ మెపుడైనదో అపుడు ఆ యాత్మదేవుడు మాకు సిద్ధించెనని చెప్పుడు దేవతలు — ఓ భగవంతుడా! గురువగు తనయొక్క కృపచే మేమా యానందస్వరూపాద్వితీయాత్మను ప్రత్యగ్రూపముగ నెఱుగుచున్నాము విషయ విషయీభేదముచే నెఱుగము కనుక ఆ యాత్మదేవునియందు విషయతారూపమును పొందింపజేయు ఏ విశేషణములుగలవో వాటిని చెప్పుటయందు మేమెట్లు సమర్థులమగుదుము? ఓ సర్వజనకుడా ప్రజాపతి గురుడా! గురువైన తమకు దేవతలమగు మేము మాటిమాటికి నమస్కరించుచున్నాము ఓ భగవంతుడా! సకల జగదీశ్వరుడవైన నీవు సర్వజ్ఞుడవైనను అజ్ఞాని తుల్యులమగు మమ్ముల మఱల మఱల యడుగుట యేదిగలదో అది మా జ్ఞాపకతను పరీక్షించుటకే యగును ఇంకే కారణమున్ను యట కనుపించదు ఓ భగవంతుడా! నీవు బ్రహ్మోపదేశముచే మమ్ము కృతార్థులజేసితివి కనుక నీవు మా పరీక్ష చేయకుము ఓ భగవంతుడా! సచ్చిదానంద స్వరూపాత్మను ప్రాప్తింపచేయు నీకు పలుమారు వందనములు ఓ భగవంతుడా! శిష్యులమగు మాపై గురువగు నీవు సర్వదా ప్రసన్నుడవగుము నీ ప్రసన్నతచేతనే మాకు దుర్లభమైన ఆత్మదేవుని ప్రాప్తియైనది ప్రజాపతి ఓ దేవతలారా మీరు నాకు మఱల మఱల నమస్కారము చేయుచున్నారు. ప్రార్థించుచున్నారు దానిచే నాకు మీపై బహుళముగ ప్రసన్నత జనించినది. కాన మీరు నన్ను మఱల మఱల ప్రశ్నించుటయందు కించిన్మాత్రమును భయపడవలదు. ఇవ్విషయమున సందేహింపరాదు

దేవతలు - హే భగవన్ సర్వకాలము యొక సిద్ధిరూపుడైన ఏ యాత్మదేవుడుగలడో ఆతనియొక్క వర్ణనాప్రసంగమందు సాధ్యతారూపముచే ఆ సిద్ధాత్మకన్న విలక్షణమైన ఏ అనుజ్ఞాసిద్ధ్యం' ఈ ప్రకారముగల అనుజ్ఞను తాము కథనము చేసితిరో అది మాకు అసంగతముగ ప్రతీతమైనది ఈ కారణమువలన మాకాపూర్వోక్తార్థ

మందు సంశయము కలిగినది ప్రజాపతి - ఓ దేవతలారా! సత్య సిద్ధాత్మదేవుని వర్ణనాప్రసంగమందు నేను మీకు సాధ్యరూపానుజ్ఞను చెప్పలేదు· అద్వైతాత్మరూపానుజ్ఞనే చెప్పితిని ఎందుకనగా - ద్వైత ప్రపంచము యొక్క విస్మరణము కొఱకు ప్రణవార్థభూత అనుజ్ఞారూపాత్మయే అధికారులకు చింతనీయమగును ఈ విషయమునే నేను మీకు కథనము చేసితిని హే శిష్య ఈ ప్రకారమగు వచనము నెపుడు ప్రజాపతి దేవతలగూర్చి పలికెనో అపుడా దేవతలు ప్రజాపతి గురువు యొక్క యుపకారమును తీర్చుటకు యితరమగు ఏ యొక ఉపాయములేదని యెఱిగి పూర్వమువలె నమస్కారములుచేసి తమ యాత్మనే గురువున కర్పణచేయుచు నిట్లనిరి ఓ భగవంతుడా! మాపై ప్రసన్నుడవగుము

గురువు - హే శిష్య ఈ ప్రకారముగ ఆ ప్రజాపతి బ్రహ్మ దేవతలకు బ్రహ్మవిద్యోపదేశము గావించెను· హే శిష్య! ఈ సంసారరూప శూలమునకు మూలమైన యజ్ఞానమును నాశము చేయునట్టి ఈ యాత్మజ్ఞానమును ఈ యష్టాదశాధ్యాయారంభమందు నీవు నన్నడిగితివి దానిని నేను నీకు కథనము చేసితిని· ఇపుడు పూర్వగ్రంథమందు విస్తారముగ కథనము చేయబడిన విషయమునే యిపుడు సంక్షేపముగ వచించెదను వినుము 'అహమజ్ఞః' అను యనుభవమునకు విషయమైన అజ్ఞానరూప మాయను వేదవేత్తలు 'కారణ శరీర' నామముచే కథనము చేయుచున్నారు· ఆ కారణ శరీరరూప మాయచే సూక్ష్మస్థూలశరీరభేదములచే ద్వివిధ ప్రపంచము పుట్టుచున్నది· ఆ దృశ్య ప్రపంచము భూత భౌతికరూపముగాను అధిదైవ, ఆధ్యాత్మ అధిభూత స్వరూపముగానున్నది అట జాగ్రత్ప్రపంచము స్థూలము స్వప్నప్రపంచము సూక్ష్మము కారణరూపమాయ సుషుప్తిరూపము· ఈ మూడు ప్రపంచములను అధికారి పురుషులచే పరిత్యజింపబడ యోగ్యములైనవి ఈ మూడింటి కవతల యే వస్తువు గలదో దానిని వేదవేత్తలు తురీయమని' వచించుచున్నారు ఆ తురీయమున్న ఓత, అనుజ్ఞాత, అనుజ్ఞ అవికల్ప భేదములచే చతుర్విధము

హే శిష్య! అధిదైవరూప సాక్షియగు ఆత్మకు ఈ నాల్గవస్థలుగలవు ఓ తాద్యవస్థాప్రాప్తియందు శరీరత్రయాభిమానము ప్రతిబంధకమైయున్నది· ఆ దేహాభిమాన నివృత్తియగుటచే విద్వాంసుడు సమాధియొక్క యుత్థానకాలమందు బాహ్యాంతర విశ్వమును బ్రహ్మరూపముగ గాంచుచున్నాడు ఆ యుత్థానకాలమందు సర్వవిశ్వమునకు ప్రకాశకమైన ఏ చైతన్యముగలదో దానిని వేదవేత్తలు 'ఓత' మనుచున్నారు మఱియు ధ్యాతృ ధ్యాన ధ్యేయరూప త్రిపుటిచే యుక్తమైన ఏ సవికల్ప సమాధి గలదో దానియందువిద్వాంసుడు సకల విశ్వమును బ్రహ్మరూపముగ జూచుచున్నాడు· ఆ సవికల్ప సమాధి కాలమందు ఏ చైతన్యము విశ్వమునకు సత్తాప్రాప్తి

యొనేర్చుచున్నదో దానిని వేదవేత్తలు 'అనుజ్ఞాత' యనిరి నిర్వికల్పసమాధియందు స్థితుడైన విద్వాంసుడు త్రిపుటీ పరిత్యాగముచే సకల జగత్సత్తను ఆకర్షణము చేయునట్టి ఏ చైతన్యరూపాత్మను అనుభవము చేయుచున్నాడో ఆ చైతన్య రూపాత్మను వేదవేత్తలు అనుజ్ఞ' యనుచున్నారు మఱియు ఏ కాలమందు బ్రహ్మజ్ఞాన రూపాగ్నిచే ఈ సంసార దుఃఖరూపశూలమునకు మూలభూతమైన అజ్ఞానము నాశమొందు చున్నదో మనోవాక్కుల కవిషయమైన ఆనందరూపాద్వితీయాత్మను విద్వాంసుకు అవిషయతారూపముచే గాంచుచు విషయతారూపముచే గాంచడో' ఇతరు నేను ఇతరుడితరుడు' - ఇత్యాది భేదములను చూడరో, భేదాభావమునే చూచునో 'నేను జీవించుచున్నాను నేను మృతినొందుదు' నను నీ భేదములగాంచడో ఆ కాలమందు స్థితమైన చైతన్యరూపాత్మను వేదవేత్తలు 'అవికల్ప నామముచే కథనము చేయు చున్నారు హే శిష్య భేదయుక్తములైన జాగ్రదాది మూడవస్థల పరిత్యజించిన భేద యుక్తమగుటచే దోషరూపమగుటవలన తురీయాత్మ సంబంధ ఓ కాద్యవస్థాత్రయమును వదలిన చతుర్థమైన యవికల్ప స్వరూపమేది శేషించునో అదియే మనోవాక్కుల కవిషయమై ద్వైతప్రపంచరహితమై ఆనందస్వరూపమై శరీరరూపద్వారవతీ పురి యందు స్థితమగునదై సకలాశ్రయ రహితమై మాయారహిత స్వయంజ్యోతిరూపమై సకలప్రాణుల హృదయ కమలమునందు సర్వదా సాక్షిరూపముగ భాసమానమగునదై యున్నది అటువంటి అవికల్పస్వరూపాత్మ దేవుని అధికారి పురుషులు ఘటాది దృశ్యపదార్థములవలె ఇదంతారూపముచే చూడక 'అహమస్మి' ఈ ప్రకారమగు ప్రత్యగ్రూపముచే చూచుచున్నారు ఇదే పరమ ఫల రూప జ్ఞానమునకు స్వరూపమై యున్నది మఱియు ఈ అవికల్పజ్ఞానమే వేదాంత శాస్త్రమునకు ప్రయోజనమగును. (ఇపు డీవిషయమునే స్పష్టీకరించుటకై అవికల్పార్థ జ్ఞానమందు అసంభావనలను దృష్టాంతముచే నివారించుచున్నారు)

హే శిష్య! ఆకాశమందు గంధర్వనగరమెట్లు కల్పితమో ఆత్మయందు ప్రపంచ మున్ను అట్లు కల్పితము మఱియు నిరవయవాకాశ సంబంధముగు కల్పితమైన ఏకదేశమందు ఆకారస్వరూపాజ్ఞానముచే ఎట్లు గంధర్వనగర కల్పన యగుచున్నదో అట్లే నిరవయవాత్మసంబంధమగు కల్పితమైన ఏకదేశమందు ఆత్మ స్వరూపాజ్ఞానముచే మాయాదిప్రపంచకల్పన యగుచున్నది. ఆకాశసంబంధవాస్తవ స్వరూపజ్ఞానముచే గంధర్వనగర లయభావము నొందినట్లు ఆత్మయొక్క వాస్తవస్వరూపజ్ఞానముచే దృశ్యప్రపంచమున్ను లయభావము పొందుచున్నది హే శిష్య! ఆకాశజ్ఞానముచే కేవలగంధర్వనగరనివృత్తిమాత్రమేకాదు. ఆ గంధర్వనగరమునకు కారణమైన ఆకాశాజ్ఞానమునకును నివృత్తి యెట్లగుచున్నదో, అట్లే ఆత్మజ్ఞానముచే కేవల ప్రపంచనివృత్తి

మాత్రమేకాదు ప్రపంచకారణాజ్ఞాన నివృత్తియగుచున్నది. హే శిష్య అపరోక్ష భ్రమ నివృత్తికొఱకు అధిష్ఠానసంబంధ అపరోక్షజ్ఞానమే అపేక్షితమైయున్నది పరోక్ష జ్ఞానముచే అపరోక్షభ్రమ నివృత్తికాదు ఎట్లు పూర్వదిశయందు పశ్చిమదిగ్భ్రమ మైనపుడు అపరోక్షమైన పూర్వాదిజ్ఞానమే ఆ భ్రమను నివృత్తముచేయునుగాని, పూర్వదిక్పరోక్షజ్ఞానముచే భ్రమ నివృత్తికాదో అట్లే ఆత్మదేవుని పరోక్షజ్ఞానముచే అపరోక్షమైన సంసారభ్రమమునకు నివృత్తికాదు. అపరోక్షజ్ఞానముచేతనేనగును ఎట్లు ఒకడైన స్వప్నద్రష్ట నిద్రాదిదోషముచే అనేకప్రకారములుగ ప్రతీతమగుచున్నారో అట్లే ఒకడైన ఆత్మదేవుడు తన స్వరూపాజ్ఞానముచే నానాప్రకారముగ ప్రతీతమగుచున్నాడు.

శిష్యుడు - హే భగవన్! మధ్యాహ్న సూర్యునియందు అంధకారస్థితికానట్లు భాసమానస్వయంజ్యోతిరాత్మయందు అజ్ఞానస్థితి సంభవింపదు. గురువు - హే శిష్య! ఈ మాయ అత్యంతదుర్ఘటమై దుస్తరమై అత్యంతదుఃఖదాయకమై సంసారశూలము నకు జననియైయున్నది ఇటువంటి మాయను శాస్త్రవేత్తలు అఘటిత ఘటనాపటీ యసీ'' నామముచే కథనము చేయుచున్నారు. ఆ మాయ తన స్వభావబలముచేత స్వయంజ్యోతి రాత్మయందు స్థితమైయున్నది. హే శిష్య! ఎట్లు వృశ్చికి తనగర్భముచే నాశము పొందుచున్నదో, అట్లే ఆనందరూపాత్మను విషయము చేయునట్టి మహావాక్య జన్యఅంతఃకరణ వృత్తిజ్ఞానరూప గర్భముచేత ఆ మాయా వృశ్చికియు నాశము పొందు చున్నది. హే శిష్య! ఈ మాయ ఆనందరూపసాక్షియగు ఆత్మకు ఎప్పటికిని భయ పడకున్నను మహావాక్యముచే జనించినదైన అంత కరణవృత్తిస్థితసాక్ష్యాత్మ ప్రతిబింబ మునకు సర్వదా భయపడుచున్నది తాత్పర్యము - ఎట్లు కాష్ఠప్రకాశకమైన అగ్ని కురాడాదుల లోహమందు స్థితమై కాష్ఠములను భేదించుచున్నదో అట్లే ఆత్మదేవు డున్ను సాక్షిరూపమున మాయకు సాధకుడైనను మహావాక్యజన్యఅంతఃకరణవృత్తి యందు స్థితుడై ఆ మాయకు బాధకుడగుచున్నాడు ఈ కారణము వలననే వేదవేత్తలచే అనాదిమాయను నాశము చేయుటకు ఒక మహావాక్యజన్య ఆత్మజ్ఞానమే ఉపాయమని చెప్పబడియె.

హే శిష్య! మనుష్యశరీరమందు ప్రవేశముచేసి అనేకప్రకార పీడను చేయునట్టి ఏ పిశాచికలవో, అది ఏదో ఒక మహామంత్రముచేతనే నివృత్తమగునుగాని ఇంకొక ఉపాయముచే నివృత్తముకాదు. అట్లే జీవులకు జన్మమరణాది అనేక పీడల కలుగ జేయునట్టి మాయాపిశాచియు బ్రహ్మజ్ఞాన రూప మహామంత్రముచేతనే నాశము పొందునుకాని ఇంకొక ఉపాయముచే అది భయపడదు. కాన ముముక్షువులు బ్రహ్మ

వేత్తయగు గురు సమీపమునకుపోయి ఆత్మ జ్ఞానరూపమంత్రమును సంపాదింప వలయును. ఈ జ్ఞానమంత్రమే వేదాంతశాస్త్రమునకు ప్రయోజనమైయున్నది.

ఇంకను శంకరానంద మునీశ్వరుడు స్వశిష్యులగూర్చి బ్రహ్మోపదేశ పరిపూర్ణతానిరూపణము గావించుచున్నారు. ఓ శిష్యులారా! నాల్గు వేదములందు ప్రసిద్ధములైన ఐతరేయాది ఉపనిషద్రూప వేదాంతమేది కలదో, ఆ వేదాంత భాగములో ఉపాసన ప్రతిపాదనము చేయబడిన భాగమును విడిచి ఇతర సకలోపనిషద్రూప వేదాంతార్థరూపమైన బ్రహ్మాత్మజ్ఞానమును నేను మీకు కథనము చేసితిని. ఆ జ్ఞానము సకలదోషరహితమగుటవలనను శుద్ధబ్రహ్మాత్మ విషయక మగుటవలనను సర్వదా దృఢమైయున్నది. ఇటువంటి బ్రహ్మజ్ఞానమునకు పరిపూర్ణతయైన తర్వాత మీరు శ్రవణేచ్ఛాసంబంధ ప్రశ్నచేయుట యుచితముకాదు. ఈ ప్రకారము సర్వ వేదాంతప్రతిపాదితమైన నిర్గుణాత్మజ్ఞానమును గురుముఖమున శ్రవణముచేసి ఆ శిష్యులు కృతకృత్యభావమును పొందిరి తరువాత వారు శ్రీగురువునకు దండవత్ప్రణామముచేసి స్తుతి చేయదొడగిరి ఈ ప్రకారముగ తమ గురుపూజనముచే పరమానందమును పొందినవారైన ఆ శిష్యులు ఆ గురూపదిష్టఆత్మజ్ఞానమును తమ శిష్యులకు ఉపదేశము చేసిరి. ఐతరేయాది ఉపనిషత్తులందు ఏయే బ్రహ్మవిద్య కథనము చేయబడినదో ఆ సంపూర్ణ బ్రహ్మవిద్య ఈ యాత్మపురాణ రూపముగ పరిణామమును పొందినది. కనుక ఈ యాత్మపురాణ గ్రంధము వేదతుల్యముగనున్నది. మఱియు సంసారశూలమునకు మూలకారణమైన మాయారూపాజ్ఞానమునకు నాశకముగనున్నది. కాబట్టి ముముక్షువులకు పరమాదరణీయముగనున్నది.

ఈ యాత్మపురాణమందు పురాణలక్షణమును చూచుడు జగదుత్పత్తిస్థితి లయముల వర్ణనముకలదు ఆకాశాది భూతముల యొక్కయు విరాడాది జాతికుల యొక్కయు వంశవర్ణనముకలదు ఆకాశాదిభూత కార్యములైన ఇంద్రియములయొక్కయు వర్ణనముకలదు. స్వాయంభుమనువుయొక్కయు యితరమనువులయొక్కయు, మను వంశస్థితి ప్రవర్ధనాది రాజులయొక్కయు, వారి వ్యాపారముల యొక్కయు కథనము కలదు వేదరూప మూలప్రమాణరహితముగ కించిన్మాత్రమున్ను అర్థము ప్రతిపాదనము చేయబడలేదు మరేమనిన బ్రహ్మసూత్ర భాష్య భగవద్గీత స్మృత్యాదులందు కథితమైన అర్థమే కథనము చేయబడియున్నది ఈ లాగున వేదార్థమును విస్తారముగ ప్రతిపాదించుటయను పురాణధర్మము ఈ యాత్మపురాణమందు స్పష్టముగనున్నది సంస్కృతాత్మపురాణము దక్షిణదేశమందలి కావేరీ పవిత్రనదీతటమందు నివాసము చేయు శ్రీ శంకరానంద మునీశ్వరునిచే రచింపబడినది. వారి అనుగ్రహముచే శ్రద్ధా

వంతులైన శిష్యుల కొఱకు ఈ అనువాదరూప ఆత్మపురాణము ప్రకటితమైనది. సంసార శూలముచే భయపడువారైన శిష్యుడు ఈ పురాణము యొక్క ఆరంభమందు శ్రీ గురువులనుగూర్చి మూలసహిత సంసారశూలనాశకమైన ఆత్మజ్ఞానమడిగెను. తదనుసారముగ ఈ గ్రంథారంభమునుండి గ్రంథసమాప్తిపర్యంతము ఆత్మజ్ఞానమున్ను. తత్సంబంధ వైరాగ్యాది సాధనములున్ను ఈగ్రంథమందు ప్రతిపాదింపబడినవి.

ఆక్షేపము - సాక్షాదుపనిషద్రూప వేదాంతముచేతనే అధికారి ఆత్మజ్ఞానము సంపాదనచేయును. కనుక సంస్కృతాత్మపురాణమున్ను ఈ అనువాదరూప ఆత్మపురాణమున్ను వ్యర్థములుకదా! సమాధానము — అసంభావనాది దోషయుక్తులగు పురుషులకు సాక్షాద్వేదార్థమందు ప్రవేశము అశక్యము. అసంభావనాదిదోషరహిత పురుషులకే సాక్షాద్వేదార్థమందు ప్రవేశము శక్యమగును. ఈలాగున అసంభావనాది దోషములు వేదార్థనిశ్చయములందు ప్రతిబంధకములైయున్నవి. తన్నివృత్తికొఱకు శ్రీశంకరానంద మునీశ్వరునిచే ఈయాత్మపురాణగ్రంథము రచింపబడియె ఈ గ్రంథమందీసామర్థ్యము కలదు. బహిర్ముఖులై విషయాసక్తిగలవారైన పురుషులును శ్రద్ధాపూర్వకముగ ఈ గ్రంథము నిరంతరము శ్రవణము, కథనముచేసిన పక్షమందు ఆ బహిర్ముఖ పురుషుడున్ను అంతర్ముఖులై విరక్తులై ఆత్మజ్ఞానమును పొందును కనుక ముముక్షువు ఈ గ్రంథము నవశ్యముగ ఆదరింపవలసినది శ్రద్ధావంతులైన శిష్యులకు ఉపదేశము చేయువారైన శ్రీ శంకరానంద గురువు శ్రీ శంకరమహాదేవుని తన ఆత్మరూపముగ చూచుచున్నారు కనుక శ్రీశంకరానందగురువుయొక్క శరీరమందు స్థితులై శ్రీశంకర మహాదేవుడే ఈ యాత్మపురాణమునకు కర్తగానుండెను ఆ శ్రీశంకరుని వాణియందు సరస్వతి నివాసము చేయుచున్నది

ఆ శ్రీశంకరుడే బ్రహ్మ విష్ణురూపుడైయున్నాడు ఆ శ్రీశంకరుడే ఇంద్రాది సకల దేవతారూపుడునునైయున్నాడు. కనుక యే పురుషు డీయాత్మపురాణగ్రంథమును శ్రద్ధాభక్తిపూర్వకముగ బ్రహ్మవేత్తయగు గురు ముఖమున శ్రవణముచేసి మననము గావించునో ఆ పురుషుడు బ్రహ్మాత్మజ్ఞానమును పొందును ఓ శ్రద్ధావంతులారా! యిటువంటి ప్రత్యక్షఫలమునందు సంశయము చేయకుడు.

ఇపుడాత్మపురాణగ్రంథసమాప్తియందు మంగళాచరణముచేయుచు గ్రంథకర్త ఈశావాస్యోపనిషదర్థమును నిరూపణము చేయుచున్నారు. ఈశావాస్యోపనిషత్తుచే ప్రతిపాదితమైన ఏ పరమాత్మదేవుడు గలడో యే పరమాత్మదేవుని రూపమై ఈ స్థావర జంగమ సర్వజగత్తు గలదో అటువంటి ఆత్మదేవుడే ఈ యాత్మపురాణమందు ప్రతి

పాదింపబడియె ఈ ప్రకారముగ సర్వజగత్తును ఈశ్వరరూపముగచూచి వేదవేత్త స్వశిష్యులకు ఈ ప్రకారముగ నుపదేశము చేయుచున్నాడు. ఓ శిష్యులారా! ఈ స్థావరజంగమరూప సర్వజగత్తు అభిన్న నిమిత్తోపాదానకారణరూపుడైన ఈశ్వరునిచే వ్యాప్తముగ నొనర్పబడియె. దృష్టాంతములు – ఎట్లు ఉపాదానకారణమగు మృత్తికచే ఘటశరావాది కార్యములు వ్యాప్తము చేయబడినవో అట్లే ఉపాదానకారణరూప ఈశ్వరునిచేత ఈ సర్వజగత్తు వ్యాప్తము చేయబడియె. మఱియు నెట్లు రాజుచే స్వదృష్టిద్వారా సర్వనగరము వ్యాప్తము చేయబడునో అట్లే నిమిత్తోపాదాన కారణుడగు ఈశ్వరునిచే సర్వజగత్తు వ్యాప్తము చేయబడియె ఎట్లు సుగంధముచే శీతల జలము వ్యాప్తము చేయబడునో అట్లే ఈశ్వరుని సత్తాస్ఫూర్తి వ్యాప్తము చేయబడియె మఱియు ఎట్లు ప్రవృత్తికారణమగు వాసనచే జీవుని మనస్సు వ్యాప్తము చేయబడునో అట్లే అంతర్యామియగు ఈశ్వరునిచే సర్వజగత్తు వ్యాప్తము చేయబడియె ఈ కారణము వలన స్వపరకీయములైన స్త్రీ పుత్రధనాదిపదార్థములెన్నిగలవో ఆ సర్వపదార్థములు పూర్వోక్తరీతిగా ఈశ్వరరూపములే యైయున్నవి.

ఈశ్వరునికన్న భిన్నసత్తగల యేయొక్క పదార్థమున్ను లేదు కనుక సర్వ పదార్థములు ఈశ్వరునియొక్కయే యైయున్నవి. ఏ యొక్క పదార్థము జీవునియొక్కది లేదు. ఎట్లు గంధర్వనగరము ఆకాశరూపమగుటవలన ఆకాశముయొక్కయే యై యున్నదో అట్లే సర్వజగత్తున్ను ఈశ్వరరూపమగుటవలన ఈశ్వరునియొక్కయే యై యున్నది రాజాది మహాపురుషులయొక్క ధనాది పదార్థములందు బుద్ధిమంతుడు ఎట్లు స్వత్వదృష్టినిచేయడో (తనఇచ్ఛాపూర్వకముగ గ్రహించుట అథవా త్యాగము చేయుట స్వత్వదృష్టియనబడును) అట్లే స్వత్వదృష్టిరహితుడైన బుద్ధిమంతుడు స్త్రీ పుత్ర ధనాది పదార్థములను ఈశ్వరరూపముగనెఱిగి, అథవా ఈశ్వరునియొక్కవని యెఱిగి తత్కామన పరిత్యాగము చేయుచున్నారు. అట సర్వజగత్తు ఈశ్వరరూపమను ప్రథమదృష్టియందో సర్వప్రపంచమునకు బాధచేయ పరిశేషమైన నిర్గుణబ్రహ్మము యొక్క జ్ఞానరూపఫలము సిద్ధించుచున్నది మఱియు సర్వజగత్తు ఈశ్వరునియొక్క యను ద్వితీయదృష్టియందో సగుణబ్రహ్మముయొక్క జ్ఞానరూపఫలము సిద్ధించుచున్నది. మిథ్యయైన గంధర్వనగరమందు స్వత్వసంబంధ ఆశ దుఃఖప్రాప్తి చేయుచున్నది. మహారాజునకు స్త్రీ ధనాదిపదార్థములందు స్వత్వ ఆశదుఃఖప్రాప్తి చేయుచున్నది. అట్లే నాదియని యెఱిగిన స్త్రీపుత్రధనాదిపదార్థములందలి ఆశ మనుజులకు దుఃఖప్రాప్తినే చేయుచున్నది కనుక అధికారి పురుషులు సర్వకామన పరిత్యాగము చేసి సర్వమునకు అధిష్ఠానరూపముగ ఈశ్వరుడేకలడని యెంచి ఈశ్వరుని ఆత్మ

రూపముగ చూడవలెను అథవా సర్వాంతర్యామిగ ప్రేరణరూపముగ ఈశ్వరుని ఆరాధనము చేయవలయును.

ఓ శిష్యులారా! చిత్తశుద్ధియొక్క అభావముచే ఒకచో మీకు సగుణబ్రహ్మ జ్ఞానమందు, అథవా నిర్గుణబ్రహ్మజ్ఞానమందు అధికారములేకపోయిన పక్షమందు మీరు స్త్రీ పుత్ర ధనాది సకలపదార్థములు ఈశ్వరునియొక్కయే యైయున్నవి నావి కావు అని ఈ ప్రకారముగ నెఱిగి కర్మఫలరూపలోకమును పరిత్యాగముచేయుడు. తరువాత స్వవర్ణాశ్రమానుసారముగ మీరు శరీరమనోవాక్కులచే నిష్కామకర్మములను చేయుడు. ఈ ప్రకారముగ యెపుడు మీరు నిష్కామకర్మములచేయుదురో అపుడీ జన్మమందుగాని, మరుజన్మమందుగాని మీ అంతఃకరణము శుద్ధమగును అనంతరము మీకు బ్రహ్మజ్ఞానము ప్రాప్తమగును.

ఓ శిష్యులారా స్వర్గలోక బ్రహ్మలోక రూపమగు ఏ అభ్యుదయముకలదో, మఱియు మోక్షరూపమైన నిశ్శ్రేయసముగలదో ఆ అభ్యుదయనిశ్శ్రేయస ప్రాప్తికి మూడుమార్గములు గలవు అగ్నిహోత్రాదియిష్టకర్మలను, వాపీకూపతటాకాది పూర్త కర్మములను చేయువారైన మనుజులకు స్వర్గరూపఅభ్యుదయప్రాప్తిచేయునట్టి పితృ యానమను దక్షిణమార్గము, అహంగ్రహాద్యుపాసన చేయువారైన మనుజులకు బ్రహ్మ లోకరూప అభ్యుదయప్రాప్తి చేయునట్టి దేవయానమను ఉత్తరమార్గము శ్రవణాది సాధనములచే సంపన్నులైన నిష్కామపురుషులకు మోక్షప్రాప్తి చేయునట్టి బ్రహ్మజ్ఞాన మార్గము ప్రాప్తమగుచున్నవి. ఈ మూడు మార్గములను పరిత్యాగముచేసి ఏ పురు షులు కేవలము పాపకర్మములను చేయుదురో ఆ యల్పబుద్ధులు ఈ లోకమందును నరకమందును సర్వదా దుఃఖమునే పొందుదురు

ఇపుడు తృతీయమైన బ్రహ్మజ్ఞానమార్గమునకు శ్రేష్ఠత నిరూపింపబడుచున్నది. ఓ శిష్యులారా! బ్రహ్మలోకమునందును, స్వర్గలోకమునందును స్థితములైన ఆ యజ్ఞాను లగు దేవతలకు వాస్తవముగ కించిన్మాత్రమున్ను సుఖములేదు. ఎందుకనగా మహా పురుషుని తిరస్కారముచేయుట యేదికలదో అది మహాపురుషుల హననమైయున్నది. ఈ విషయము లోకప్రసిద్ధము. మఱియు ఏ పురుషులు సర్వముకన్న మహత్తరుడైన ఆత్మదేవుని యెఱుగరో ఆ యజ్ఞానులు ఆత్మదేవుని తిరస్కారరూపహననము చేయు చున్నందున ఆత్మహంతకులనబడుదురు. ఈ ఆత్మహంతకులకు శ్రుతిచే సంసారదుఃఖ ప్రాప్తి కథనము చేయబడియె.

'అసుర్యానామ తే లోకా అంధేన తమసా వృతాః,
తాంస్తే ప్రేత్యాభిగచ్ఛంతి యేకేచాత్మహనో జనాః."

భావార్థము — ఏ పురుషులు తమ ఆత్మయందే లెస్సుగరమింతురో ఆ పురుషు లకు సురులనిపేరు. ఇటువంటి ఆత్మారాములైన విద్వాంసులకన్న భిన్నులైన అజ్ఞాను లకు అసురులనిపేరు ఆ యసురులకు యోగ్యమైన తామసలోకమునకు నామము 'అసుర్యము' ఆ యసుర్యలోకములు ఆత్మను ఆవరణము చేయునట్టి అజ్ఞానాంధ రూపాంధతమముచే వ్యాప్తమైయున్నవి. అటువంటి అసుర్యలోకములను ఆత్మ హంత కులు పొందుదురు. ఇపుడు యే ఆత్మయొక్క జ్ఞానముచే అసుర్యలోకప్రాప్తికాదో ఆ యాత్మయొక్క స్వరూపవర్ణనము గావింపబడుచున్నది.

ఓ శిష్యులారా! ఆ యసురజనులచే అజ్ఞాతమైన ఈ ఆత్మస్వరూపము అత్యంత ఆశ్చర్యరూపమైయున్నది. ఏలాగుననగా — ఈ యాత్మదేవుడు తాను క్రియారహితుడై నను మనస్సుకన్న అధికవేగము కలవారుగానున్నారు తాత్పర్యము — ఏయే పదార్థ మును ఈ మనస్సు తన సంకల్పముద్వారా పొందునో ఆయా పదార్థమం దీయాత్మ దేవుడు మనస్సు పోవుటకు మునుపే పరిపూర్ణమై యున్నారు మఱియు ఈ యాత్మ దేవుడు నేత్రాదీంద్రియములకు అగమ్యమైనను బ్రహ్మజ్ఞానముచే గమ్యమగుచున్నారు ఈ యాత్మదేవుడు తాను పర్వతమువలె నిశ్చలమైనను శీఘ్రముగ గమనము చేయునట్టి వైన వాయ్వాదులను ఉల్లంఘనముచేసి ముందునకు పోవుచున్నారు. మఱియు నా అంతర్యామియగు ఆత్మదేవునిచే ప్రేరితుడైన ఈ సూత్రాత్మరూపవాయువు సర్వ శరీరములందు అగ్నిహోత్రాది కర్మలుచేయుటకు సమర్థుడగుచున్నాడు. ఆ యగ్ని హోత్ర సంబంధ ఆహుతులు మేఘాదిభావములనుపొంద వాటిచే ననేక కర్మముల ఫలరూపమగు విశ్వము పుట్టుచున్నది. ఏ యాత్మదేవుడు వాస్తవముగ సర్వక్రియా రహితుడైయుండియు సకల క్రియలుగలవాడో, ఏ యాత్మదేవుడు అజ్ఞానులకు అత్యంత దూరమైనను విద్వాంసులకు అత్యంతసమీపమగునో ఆ యాత్మదేవుడు ఈ దృశ్య ప్రపంచముయొక్క అంతర్బాహ్యములందు పరిపూర్ణముగ నున్నారు.

ఓ శిష్యులారా! ఏ వివేకులు ఈ జీవితావస్థయందే బ్రహ్మ మొదలు పిపీలికా పర్యంతమగు సర్వశరీరములను ఆత్మస్వరూపమందు కల్పితరూపములుగ చూచు చున్నారో, మఱియు సర్వశరీరములందు తమ ఆత్మను అనుగతముగ చూచుచున్నారో ఆ వివేకులు కించిన్మాత్రమును దుఃఖమును పొందరు. ఏ విద్వత్పురుషుల దృష్టి యందు ఆత్మజ్ఞాన ప్రభావముచే సర్వభూతకోట్లు ఆత్మభావమును పొందినవో, ఏ విద్వాంసులచే అధిష్ఠానాత్మయొక్క ఏకత్వస్వభావము గురుశాస్త్రోపదేశముచే సాక్షాత్క రింపబడినదో అటువంటి విద్వాంసులకు ఆవరణరూప మోహముగలుగదు. విక్షేప రూప శోక ప్రాప్తియుకాదు.

ఓ శిష్యులారా! ఏ యధికారి పురుషులు స్వయంప్రకాశానంద స్వరూపుడగు ఈశ్వరుని తమ కభిన్నరూపముగ సాక్షాత్కరించుకొనుచున్నారో ఆ పురుషులు సర్వత్రా వ్యాపకమైన ఆత్మను చూచుచున్నారు. శరీరత్రయరహితుడైన నిర్గుణ నిరవయవమగు ఆత్మదేవుని ఈశ్వరరూపముగ నెఱిగినవారైన విద్వాంసులు సోపాధి దృష్టిచే ఆరాధనము చేయుటకు యోగ్యులగుదురు ఈశ్వరరూపులగుదురు. ఆ ఈశ్వరుడు సంకోచరహిత దర్శన స్వభావముగలవాడుగాను, సకల మానసప్రవృత్తి నెఱిగినవాడై సర్వజ్ఞుడుగానున్నాడు. మఱియు అజ్ఞానాది శత్రువుల తిరస్కారము చేయువాడుగాను, కారణరహితుడగుటవలన స్వయంభువ రూపముగాను లోకప్రసిద్ధ సకల కారణములకు కారణరూపుడుగనున్నాడు

ఓ శిష్యులారా యిటువంటి ఆత్మదేవుని సాక్షాత్కారమందు చిత్తశుద్ధిద్వారా యొనర్చు వాసనాసహితకర్మమే ఉపాయమైయున్నది. ఆ కర్మమును వేదవేత్తలు అసంభూతి. అవిద్య, అను నీ రెండు నామములచే కథనము చేయుచున్నారు. మఱియు ఆ యుపాసనను సంభూతి విద్యయను నీరెండు నామములచే కథనము చేయుచున్నారు ఆ రెండును అంతఃకరణశుద్ధిద్వారా ఏకాగ్రతద్వారా ఆత్మజ్ఞానమునకు కారణములై యున్నవి. - ఇపుడు కర్మోపాసనాసముచ్చయ విధానము, కేవలము కర్మముయొక్క నింద చూపబడుచున్నది ఓ శిష్యులారా! యే పురుషులు కేవల కర్మము మాత్రము చేయుదురో వారా కర్మప్రభావముచే స్త్రీ పుత్రధనాది పదార్థములందు పరమాసక్తిని పొందుదురు. స్వర్గాది అనిత్యలోకములనున్ను పొందుదురు. నానాప్రకార రాగ ద్వేషాదులచే యుక్తులగుదురు ఈ ప్రకారము వారు సంసారసుఖమందాసక్తులై మఱల మఱల జన్మమృత్యువుల పొందుదురు ఇపుడు కర్మరహిత కేవల ఉపాసనయొక్క నింద గావింపబడుచున్నది ఓ శిష్యులారా! యే పురుషులు కేవలము ఉపాసనలందే ప్రీతి గలవారగుదురో వారు ఐశ్వర్యరూపమగు ఉపాసనాఫలమందాసక్తులై కర్మిపురుషుల కన్నను అధికమగు తమమును పొందుదురు

ఏలాగుననగా - కర్మవిడచి కేవలము ఉపాసనేచేయు ఉపాసకపురుషులకు రెండు అనర్థహేతువులుకలవు ఒకటి విహితకర్మత్యాగము రెండవది నానావిధ ఐశ్వర్యములందాసక్తి. ఈ రెండుదోషములచే ఆ యుపాసకులు కర్మిపురుషులకన్నను అధికమగు దుఃఖమును పొందుదురు. కాబట్టి అధికారి పురుషులు వేదవిహితకర్మ సహితోపాసన ననుష్ఠానము చేయవలసినది. కేవలము కర్మనుగాని కేవలము ఉపాసననుగాని చేయకూడదు. ఓ శిష్యులారా! ఈ ప్రకారము కర్మోపాసనాయుక్తులైన తత్త్వజ్ఞానార్థులైన అధికారి పురుషులు చిత్తము నేకాగ్రముచేసి "హిరణ్మయేన పాత్రేణ" ఇత్యాది

మంత్రములచే ఆదిత్యభగవంతుని మఱిల మఱిల ప్రార్థన చేయవలసినది. ఆ యాదిత్య భగవంతుడు అధికారిపురుషులకు బ్రహ్మలోకప్రాప్తికొఱకు తన మండలమందు ఛిద్ర రూపమార్గమును చేయువారై యున్నారు. ఏ కర్మోపాసకులు "హిరణ్మయేన పాత్రేణ" అను నీమంత్రముచే సూర్యభగవంతుని ప్రార్థనచేయుదురో, వారికి ఈ ప్రకారమగు శుభబుద్ధి ప్రాప్తమగుచున్నది. ఆదిత్యమండలస్థిత స్వయంజ్యోతి పురుషుడే నా వాస్తవ స్వరూపము, ఈ దేహేంద్రియాది సకలసంఘాతము వాస్తవముగ నా స్వరూపముకాదు ఇది కేవలము ఆకాశాది పంచభూతముల కార్యమైయున్నది మరణానంతరము భస్మాదిరూపముల పరిణామముగ పొందుచున్నది. ఇటువంటి ఈ సంఘాతము ప్రణవపద వాచ్యార్థ రూపమగు ఆత్మనెఱిగిన వారమైన విద్వాంసులమగు మాయొక్క స్వరూపమేలాగుననగును ? కాన ఇది నా స్వరూపము కాదు.

ఓ శిష్యులారా ! ఈ ప్రకారము కర్మోపాసనలచే యుక్తులై సంఘాతమందు వైరాగ్యముగలవారైన అధికారిపురుషులు తమ మనస్సునుగూర్చి యిట్లు వచించు చున్నారు. ఓ మనసా ! పూర్వ మేదేశమందు యేకాలమందు ఏయే పదార్థములను నీవు పొందితివో ఆ యా పదార్థములను నీవు సంకల్ప సహిత కర్మములచేతనే పొంది యుంటివి. సంకల్పసహితకర్మములేకున్న ఏ పదార్థమును నీవు పొందజాలవు. ఈ ప్రకారమగు సంకల్పముయొక్కయు, కర్మముయొక్కయు మాహాత్మ్యమును ఇపు డెందులకు విస్మరించుచున్నావు? ఆ విస్మరణము నీకు యోగ్యముకాదు కనుక వేదవిహితకర్మోపాసనారూప సంకల్ప మాహాత్మ్యమును స్మరణముచేసి నీవు ఉపాసనాసహితకర్మనుగూర్చి సంకల్పమందు తత్పరమగుము. ఓ శిష్యులారా ! ఈ ప్రకారము మనస్సును ప్రార్థనచేయుచు ఆ యధికారి పురుషులెపుడు "హిరణ్మయేన పాత్రేణ" అను నీ వైదికమంత్రముచే, మఱియు లౌకికమంత్రముచే ఆదిత్య భగవంతుని ప్రార్థన చేయుదురో, మఱియు ఎవరు అగ్నిదేవునియొక్కయు ప్రార్థన చేయుదురో అపుడా యధికారి పురుషులు సర్వపాపరహితులై క్రమముగ బ్రహ్మ భావనను పొందుదురు.

ఇపుడు అగ్నిదేవుని ప్రార్థన నిరూపింపబడుచున్నది. అగ్నిదేవా ! నీవు మాకు సకల దుఃఖ రహితమగు ప్రకాశమానమగు దేవయానమార్గముచే బ్రహ్మలోక ప్రాప్తిని గావింపుము. మఱియు పాపము కలుగజేయువారైన కామక్రోధాది శత్రువుల నాశనము చేయుము. అగ్నిదేవతవగు నీవు మా సర్వజీవులయొక్క చిత్తవృత్తాంతము నెఱిగినవాడవు. కనుక మా కామక్రోధాది శత్రువులు నీకు అజ్ఞాతులుకారు. ఈ ప్రకారము మాయాకార్యములైన కామక్రోధాదులను నాశము చేయువాడవై

బ్రహ్మలోకప్రాప్తి యొనర్చువాడవైన అగ్నిదేవతవగు నీయొక్క ఉపకారమును తీర్చుటకు మేము సమర్థులముకాము. కావున అధికారులైన మేము నీకు మాటి మాటికి నమస్కారము చేయుచున్నాము.

ఇపుడు "హిరణ్మయేన పాత్రేణ" అను నీ మంత్రముయొక్క అర్థనిరూపణము గావింపబడుచున్నది.

హే భగవన్! తప్తసువర్ణసమానమై ఆవరణముచేయు పాత్రవంటిదై అత్యంత ప్రకాశమానమైన ఏ తేజోమండలముకలదో ఆ తేజోమండలరూప హిరణ్మయపాత్ర ముచే ఆదిత్యమండలమందు స్థితమగు బ్రహ్మవైన నీయొక్క ఛిద్రరూప ముఖము ఆవృతమైయున్నది. ఓ జగత్పాలకా! సూర్యభగవంతుడా! సత్యపరాయణతా ధర్మము గలవారైన అధికారిజనులగు మాకు దర్శనమిచ్చుటకై ఈ సంసారతాపమునుండి రక్షించుటకై ఛిద్రరూపమగు స్వముఖసంబంధ ఆవరణమును దూరము చేయుమా! ఓ భగవంతుడా! స్మరణమాత్రముచే సర్వానర్థనాశకమైనట్టి వాస్తవమైన నీ స్వరూప మును ఏ ప్రకారముగ అధికారి జనుల(కు)మగు మేము సాక్షాత్కరించుకొందుమో ఆ ప్రకారమును నీవు మాకనుగ్రహింపుమా! ఈ ప్రకారముగ అధికారి జనులు ఆదిత్యభగవంతుని ప్రార్థన చేయుచున్నారు.

ఈ ప్రకారముగ వేదవేత్తలేపరమాత్మదేవుని ప్రాప్తికొఱకు నానాప్రకార విద్యలనుపదేశము చేయుచున్నారో ఆ పరమాత్మదేవుడే ఈ యాత్మపురాణగ్రంథమందు సర్వత్ర ప్రతిపాదనము చేయబడియె. ఆ యాత్మదేవునికన్న భిన్నమగు ఏ యనాత్మ పదార్థమున్ను ఈ గ్రంథమందు ప్రతిపాదింపబడలేదు. కనుక ఏ యధికారి పురుషులు బ్రహ్మవేత్తయగు గురుముఖమున ఈ యాత్మపురాణ గ్రంథమును శ్రవణము చేయు దురో, అథవా పఠనము చేయుదురో, అథవా ముముక్షు జనులకు కథనము చేయుదురో, అథవా నిరంతరము చింతనము చేయుదురో, ఆ యధికారి జనులందఱును ఆ పరమాత్మదేవుని తమ ఆత్మరూపముగ నెఱిగి కార్యసహితాజ్ఞాన నివృత్తి పూర్వక ముగ బ్రహ్మభావప్రాప్తిరూపక మోక్షమును పొందుదురు. కావున మోక్షేచ్ఛగలవారైన పురుషులు శ్రద్ధాభక్తిపూర్వకముగ ఈ యాత్మపురాణ గ్రంథము నవశ్యముగ విచా రము చేయవలయును.

ఇతి శ్రీమదాత్మపురాణే అష్టాదశోఽధ్యాయః
సంపూర్ణః
ఓమ్ తత్ సత్

శ్రీ వేదవ్యాస ముద్రాక్షరశాల, చిత్తూరు – కా. 1000.

ఓమ్

సద్గురు శ్రీ మలయాళస్వాములవారి గ్రంథములు

			రు పై
1.	శ్రీ శుష్కవేదాంత తమోభాస్కరము	....	4–00
2.	స్వబోధ సుధాకరము	....	1–50
3.	ఓంకారము (ప్రణవోపాసన)	....	3–00
4.	ప్రశ్నోత్తరమాణిక్యమాల	....	2–00
5.	బాలయోగిని	..	4–50
6.	బ్రహ్మవిద్య	...	0–75
7	శ్రీ ధర్మసేతువు	....	4–00
8	సాధుదర్శనము	....	0–25
9	ఉపదేశామృతము (ప్రథమ భాగము)	...	1–00
10.	,, (ద్వితీయ భాగము)	....	1–00
11.	,, (తృతీయ భాగము)	...	1–50
12.	,, (చతుర్థ భాగము)	.	1–50
13.	శ్రీ వేంకటేశాది పూజాపంచరత్నమాల	....	0–75
14.	ధ్యానామృతము	...	0–60
15.	సుప్రబోధము	...	0–50
16.	'యథార్థభారతి' చిన్నపొత్తము	....	0–19
17.	లోకోద్ధారకము	..	4–00
18.	ఈశ్వరకృప	....	6–00
19	బ్రహ్మచర్యము	....	1–25
20.	జ్ఞానోదయడైరి	....	1–50
21.	ధర్మోపన్యాసములు (ప్రథమభాగము)	....	3–00
22.	,, (ద్వితీయభాగము)	....	3–00
23.	,, (తృతీయభాగము)	....	3–00
24	,, (చతుర్థభాగము)	....	3–00

వలయువారు:— మేనేజరు — శ్రీ వ్యాసాశ్రమము,
వ్యాసాశ్రమము పోస్టు, యేర్పేడు - మార్గము.
చిత్తూరుజిల్లా. (ఆం. ప్ర.)